
# యుగానికి ఒక్కడు

- వినాయకరావు



నందమూరి
తారకరాముని
60 ఏళ్ల
నట ప్రస్థానం

19110



ఆయన నిరాడంబరుడు, నిగర్వి..
చేతనైనంతవరకూ ఎదుటివారికి
సాయపడాలనే మనస్తత్వం కలిగిన వ్యక్తి.
ఎటువంటి నష్టం ఎదురైనా, నష్టం
సంభవించినా కుంగిపోకుండా, నిరాశ
పడకుండా చిరునవ్వుతో ఎదుర్కోవడం
ఆయనకు అలవాటు. అందుకే
అపజయాలు ఆయన దగ్గరకి రావడానికి
సంకోచిస్తుంటాయి. ఆయనకు సినిమా
అంటే ఎంత ఇష్టమో మాటల్లో చెప్పలేను.
వ్యాపారరీత్యా ఎంత బిజీగా ఉన్నప్పటికీ
సినిమా కోసం, సినిమా వాళ్లకోసం
తగిన సమయం కేటాయిస్తుంటారు.
పలువురు సినీ ప్రముఖులతో
సన్నిహిత పరిచయాలున్నా, ఎన్నో
సినిమాలకు ఆర్థిక అండదండలు
అందించినా, ఆర్థికంగా చితికిన
ఎంతోమంది సినీ కళాకారులకు
సాయపడినా ఏనాడూ ఆయన
ప్రచారం కోరుకోలేదు. తెరవెనుకే
ఉంటూ ఆపదలో ఉన్నవారిని
ఆదుకొంటున్నారు. ఆయన ద్వారా
మేలు పొందని వారి సంఖ్య
చిత్రపరిశ్రమలో స్వల్పమని చెప్పాలి.
'యుగానికి ఒక్కడు' పుస్తకానికి
వెన్నెముక ఆయనే.

**నౌడు వెంకట రమణబాబు**
సీఎండి
గెలాక్సీ ఎంటర్‌టైనర్స్
హైదరాబాద్



# యుగానికి ఒక్కడు

(నందమూరి తారకరాముని 60 ఏళ్ల నట ప్రస్థానం)

రచన :

యు. వినాయకరావు

జయా పబ్లికేషన్స్

ఫ్లాట్ నం. 102, శ్రీశ్రీ శ్రీనివాస నిలయం

7-1-303/D/2

బాలయ్యనగర్, సంజీవరెడ్డి నగర్

హైదరాబాద్- 500038

ఫోన్: 9394736301, 9885179428



# యుగానికి ఒక్కడు

(Yuganiki Okkadu)

ప్రచురణ :
సెప్టెంబర్, 2010

వెల :
రూ. 300/-
$ 30

700.922
C. 10790

© యు. వినాయకరావు

ఫ్లాట్ నం. 102, శ్రీశ్రీ శ్రీనివాస నిలయం
7-1-303/D/2
బాలయ్యనగర్, సంజీవరెడ్డి నగర్
హైదరాబాద్- 500038
ఫోన్: 9985411019
email: vinayakaraou@gmail.com


Acc. No. 19110

డిజైనింగ్ : పి.రామబ్రహ్మం

ఈ పుస్తకం ప్రతులకు :
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని శాఖలు
జయా పబ్లికేషన్స్
హైదరాబాద్- 500038
ఫోన్స్: 9394736301, 9885179428

# ముందుమాట


విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావుగారికి తారక రామారావు అనే పేరు పెట్టాలనే ఆలోచన వారి తల్లితండ్రులకు ఎలా వచ్చిందో తెలీదుగాని- పౌరాణిక చిత్రాల్లో పురాణ పాత్రలకి తారక రామారావు అనే పేరు 'తారక నామం' అయ్యింది. ఆయన తెలుగు బిడ్డగా పుట్టినా, నటుడిగా పౌరాణిక, భిన్న విభిన్న జానపద, చారిత్రాత్మిక, సాంఘిక పాత్రల సూత్రధారిగా భారతదేశంలోనే కాదు యావత్ ప్రపంచంలో కూడా ఆ పాత్రలకి ఆయన న్యాయం చెయ్యగలిగి నట్టు న్యాయం చెయ్యగలిగిన మరొక నటుడు ఇంతవరకు పుట్టలేదు. పుడతారనే ఆశలేదు- పౌరాణిక పాత్రలంటే కేవలం రాముడు, కృష్ణుడు, అర్జునుడు, అభిమన్యుడు లాంటి పాత్రలే వీరోచిత పాత్రలు, హీరోచిత పాత్రలు- కానీ ఒక రావణుడు, ఒక దుర్యోధనుడు, ఒక కర్ణుడు, ఒక భీష్ముడులాంటి పాత్రల్ని కూడా హీరో దాత్తమైన పాత్రలుగా మలిచి, ఆ పాత్రలను కూడా ప్రేక్షకులు ప్రేమించే స్థితికి నటించారంటే చరిత్రలో ఇలాంటి ప్రయోగం చేసినటువంటి మరో మహానటుడు లేడు-



అలాంటి మహానటుడి మరపురాని చిత్రాల గురించి వినాయకరావు చేసిన ప్రయత్నమే ఈ పుస్తకం. సినీ విశ్లేషకులకి, తారక రామారావుగారి అభిమానులకి ఇది ఒక పెదబాలశిక్షగా, వాళ్ళు భద్రపరుచుకునే విధంగా ఉంటుందని భావిస్తున్నాను. ఈ ప్రయత్నం చేసిన వినాయకరావు ఒక జర్నలిస్టుగా, ఒక విశ్లేషకుడిగా నాకు ఎన్నో సంవత్సరాల నుంచి పరిచయం. ఆయన ప్రయత్నాన్ని మనసారా అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

అభినందనలతో

దాసరి నారాయణరావు



# ఆశీస్సులు

స్టార్‌డమ్ అంచులు, అశేష ప్రేక్షక జన హృదయాల లోతులు స్పృశించి ఈ రెంటినడుమ విశ్వవ్యాప్తమైన చరిత్ర సృష్టించుకొన్న మహానటుడు, మహామనిషి ఎన్.టి.ఆర్. ఆయన కథ, జీవనసరళి, వృత్తిపట్ల ఆరాధన, ముందుచూపు.. ఇలా విశిష్ట అంశాలతో ఏ తెలుగు సినిమా కథకూ తీసిపోనిరీతిలో ఆయన జీవితం సాగిపోయింది. మొదటి నుంచి ఆయన విధిని నమ్ముతూ దానికి తన కృషిని జోడించి తారాస్థాయికి చేరారు. అంతేకాదు కాలాన్ని తనతోపాటు నడిపించారాయన. తెలుగు సినిమా తిరిగిన ప్రతి మలుపుకీ ఎన్.టి.ఆర్. ఆద్యుడని చెప్పడానికి సందేహించనక్కర్లేదు.

ఆయనతో నా పరిచయం 1952లో జరిగింది. పబ్లిసిటీ పోస్టర్లను ముద్రించే లితో ప్రెస్ అప్పట్లో నాకు ఉండేది. దక్షిణాది చిత్రాల పబ్లిసిటీనే కాకుండా ఆనాటి మద్రాసులో తయారయ్యే కొన్ని హిందీ చిత్రాల పబ్లిసిటీ మెటీరియల్ కూడా మా ప్రెస్‌లోనే ప్రింటయ్యేది. ఎన్.టి.ఆర్. నిర్మించిన తొలిచిత్రం 'పిచ్చిపుల్లయ్య' చిత్రం పబ్లిసిటీ వర్క్ మా ప్రెస్‌లోనే ప్రింటయింది. సంగీతదర్శకుడు టి.వి.రాజు నాకు స్నేహితుడు. ఆయనే ఒకరోజు రామారావుగారిని పరిచయం చేశారు. ప్రథమ పరిచయంలోనే రామారావుగారు, నేను పరస్పరం ఆకర్షితులమయ్యాం. ఏ శుభ ముహూర్తంలో మేం కలుసుకున్నామో కానీ ఆ ఆత్మీయత, అనుబంధం వారు కీర్తిశేషులయ్యే దాకా మా ఇద్దరి మధ్య కొనసాగింది. రామారావుగారు కానీ, ఆయన సోదరుడు త్రివిక్రమరావుగారు కానీ నేనంటే ప్రత్యేక అభిమానం చూపించేవారు. నా వ్యక్తిత్వం, నిజాయితీ వారిద్దరికీ నచ్చడంతో నేషనల్ ఆర్ట్ థియేటర్స్ సంస్థలో నాకు కూడా వాటా ఇచ్చి భాగస్వామిగా చేర్చుకున్నారు. 'తోడు దొంగలు', 'జయసింహ', 'పాండురంగ మహత్మ్యం',

'గులేబకావళికథ', 'సీతారామకళ్యాణం' చిత్రాల నిర్మాణంలో నేనూ పాలుపంచుకున్నాను. ఆ తర్వాత 1964లో డి.వి.ఎస్. ప్రొడక్షన్స్ సంస్థను నందమూరి సోదరుల సహకారంతో వారి చేతులమీదుగా ప్రారంభించి ఎన్.టి.ఆర్. హీరోగా కొన్ని చిత్రాలు నిర్మించాను. మా సంస్థ నిర్మించిన చిత్రాల్లో మూడింటిలో (మంగమ్మశపథం, తిక్కశంకరయ్య, గండికోట రహస్యం) ఆయన ద్విపాత్రాభినయం చేయడం విశేషంగా చెప్పుకోవాలి. ఆయనతో నేను నిర్మించిన చివరి చిత్రం 'ధనమా? దైవమా?'.

ఇదంతా ఒక ఎత్తయితే రామారావుగారు ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాల్లో, నిధి వసూలు కార్యక్రమాల్లో పాల్గొనడం మరువలేని మధురానుభూతి. ఒక బస్సుని ఏర్పాటు చేసుకుని అంతా వెళ్లేవాళ్లం. ఆ బస్సులో డ్రైవర్ పక్కనున్న సీట్లో రామారావుగారు కూర్చునేవారు. మిగిలిన కళాకారులంతా అదే బస్సులో ప్రయాణించేవారు. ఆరోగ్యరీత్యా బస్సులో ఎక్కువ దూరం ప్రయాణించలేనివారు సైతం రామారావుగారి క్రమశిక్షణ చూసి వారితో కలిసి ప్రయాణించేవారు. మేం వెళ్లిన ప్రతిచోట ఒకే రూమ్‌లో మూడు పడకలు ఉండేలా ఏర్పాట్లు చేయాలని రామారావుగారు ముందే ఆదేశించేవారు. ప్రతి రోజూ రాత్రి కార్యక్రమం పూర్తయిన తర్వాత రామారావుగారు, త్రివిక్రమరావుగారు, నేను గదిలో కూర్చుని జరిగిన కార్యక్రమాన్ని, జరగబోయేవాటి గురించి చర్చించుకుని ప్లాన్ చేసేవాళ్లం.

రామారావుగారు ముందుగా రూపొందించిన బ్లూ ప్రింట్ ప్రకారం వేదికమీద ఎలాంటి మార్పుల్లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు క్రమపద్ధతిలో సాగేవి. సినీ పరిశ్రమకి చెందిన వ్యక్తిగా ఇలా మహామహులందరితో కలిసి ప్రజాసేవా కార్యక్రమాల్లో పాల్గొని కీలకపాత్ర వహించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తాను. ఎంతో నమ్మకంతో అంతటి గురుతరమైన బాధ్యత నా మీద ఉంచిన రామారావు గారిని మరిచిపోలేను.

రామారావుగారు నటన వదిలిపెట్టి రాజకీయాల్లోకి వెళ్లి ముఖ్యమంత్రి అయినప్పటికీ మా స్నేహబంధంలో మార్పు రాలేదు. నా మీద అభిమానంతో ఆయన నన్ను సంప్రదించకుండానే ఎఫ్.డి.సి.ఛైర్మన్‌గా నియమించిన సంగతి మరచిపోలేను. ఆయనతో ఒకరోజు 'మీరు అనుమతిస్తే 1986 జనవరిలో జరగాల్సిన అంతర్జాతీయ ఫిల్మోత్సవ్‌ను హైదరాబాద్‌లో జరపడానికి ఏర్పాట్లు చేస్తాం' అనగానే ఆయన ఎంతో సంతోషించి ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామని మాట ఇచ్చారు. రెండువేల అయిదువందలమందికి పైగా డెలిగేట్లు పాల్గొనడానికి థియేటర్ సదుపాయం కావాలని పేర్కొంటూ ఇంతకుముందు ఢిల్లీ వంటి ప్రదేశాల్లో డెలిగేట్లు ఎదుర్కొన్న ఇబ్బందుల్ని రామారావుగారితో చెప్పగానే ఆయన వెంటనే స్పందించారు. థియేటర్ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన జరగాలంటూ ఆదేశాలిచ్చారు. అలా కేవలం 90 రోజుల్లో లలితకళాతోరణం ఓపెన్ ఆడిటోరియంను నిర్మించడం, నభూతో నభవిష్యత్ అనే రీతిలో ఫిల్మోత్సవ్‌ను నిర్వహించడం.. రామారావుగారి విజన్‌కు, కార్యదీక్షకు గుర్తుగా మిగిలిపోతాయి. ఇలా ఒక అద్భుతమైన ఓపెన్ ఆడిటోరియంను అందించడంతో కళాకారులు, ప్రజలు ఆయనకు ఎంతో రుణపడి ఉంటారని నా వ్యక్తిగత భావన. అలాగే ఫిల్మోత్సవ్ విజయానికి కృషి చేసిన నన్ను, ఇతర మిత్రులను జూబ్లీహాలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో రామారావుగారు మనసారా అభినందించడం మరిచిపోలేని అంశం.

ట్యాంక్‌బండ్ మీద ప్రముఖుల విగ్రహాలను రామారావుగారు ఏర్పాటు చేసినప్పుడు చాలామంది విమర్శించారు. ఇప్పుడు ఆయన దూరదృష్టిని అందరూ ప్రశంసిస్తున్నారు. అలాగే హుస్సేన్‌సాగర్‌లో బుద్ధుడి విగ్రహా ప్రతిష్ట జరిగింది రామారావుగారి వల్లే. ఇలా ఆయన గురించి చెప్పుకుంటూ పోతే ఎంతో ఉంటుంది. ఆ మహానటుడి సినీ జీవిత చరిత్రను సీనియర్ జర్నలిస్ట్ వినాయకరావుగారు గ్రంథస్తం చేయడానికి సంకల్పించడం ముదావహం. చిరకాలంగా నాకు సన్నిహితుడైన వినాయకరావుగారు మంచి జర్నలిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు. వివాదరహితుడిగా పేరొందిన ఆయన ఒక యజ్ఞంలా ఈ పుస్తక రచనకోసం కృషి చేసి, ఆ యజ్ఞఫలాన్ని మనకు పంచుతున్నారు. ఆయనకు మరోసారి అభినందనలు తెలియజేస్తున్నాను.


***- డి.వి.ఎస్.రాజు***

# 'యుగానికి ఒక్కడు'... ఎందుకంటే..!



తెలుగు గడ్డ ముద్దుబిడ్డ నందమూరి తారక రామారావు 60 ఏళ్ల నట ప్రస్థానం గురించి నేను ఒక పుస్తకం రాయాలనుకుంటున్న విషయం కొంత మంది సన్నిహితుల దగ్గర ప్రస్తావించినప్పుడు "తెలుగు సినీ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న ఎన్.టి.ఆర్. గురించి నువ్వు కొత్తగా చెప్పేదేమిటి?" అని ప్రశ్నించారు. నిజమే.. సినీ వినీలాకాశంలో మూడున్నర దశాబ్దాలపాటు దేదీప్యమానంగా ప్రజ్వరిల్లి... ఆంధ్రా రాజకీయ రంగంలో 14 ఏళ్లపాటు సంచలనంగా విరాజిల్లిన రామారావు జీవితం తెలుగువారికి తెరిచిన పుస్తకమే. అయినా అందులోని అంశాలు ఎప్పటికప్పుడు ఆసక్తి కలిగిస్తాయి. ఆలోచనకు చోటిస్తాయి. ఆయన గురించి ఎంత చెప్పుకున్నా, ఎప్పుడు చెప్పుకున్నా మళ్లీ మళ్లీ చెప్పుకోవడానికి ఎప్పుడూ ఏదో ఒక అంశం మిగిలే ఉంటుంది. అందుకే అందరికీ తెలిసిన ఎన్.టి.ఆర్.ను సరికొత్తకోణంలో ఆవిష్కరించాలనే తపనతో ఈ పుస్తక రచనకి శ్రీకారం చుట్టాను. తెలుగు జాతికే కాదు భారతదేశం మొత్తానికే 20వ శతాబ్దపు తీపిగుర్తు ఎన్.టి.ఆర్. అయితే అటువంటి గొప్ప వ్యక్తి నటజీవితాన్ని సమగ్రంగా విశ్లేషించే పుస్తకాలు లేకపోవడం నాకు లోటుగా అనిపించింది. అందుకే రాజకీయాల గురించి ఎక్కువగా ప్రస్థావించకుండా వ్యక్తిగా, చలనచిత్ర ప్రచండ శక్తిగా ఎన్.టి.ఆర్. గొప్పతనాన్ని వెల్లడించే విధంగా ఈ పుస్తకం ఉండాలని నిర్ణయించుకున్నాను. పుస్తకం రాయాలని నిర్ణయం తీసుకున్న తర్వాత సమాచారం కోసం ఎన్నో ఊళ్లు తిరిగాను. ఆసక్తికరమైన సమాచారాన్ని, అరుదైన ఫొటోలను సేకరించాను. రామారావుతో పనిచేసిన నటీనటుల్ని, సినిమాలు తీసిన నిర్మాతలు, దర్శకులను కలిసి మాట్లాడాను. ఎన్.టి.ఆర్. అభిమానులను కూడా కలిశాను. అలాగే 'సితార' వార పత్రికలో పనిచేస్తున్నప్పుడు వృత్తిరీత్యా ఎనిమిది సార్లు ఎన్.టి.ఆర్.ను ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు లభించింది. ఆ యా ఇంటర్వ్యూల్లో ఆయన చెప్పిన ఎన్నో విషయాలను కూడా ఈ పుస్తకంలో పేర్కొన్నాను. అదేవిధంగా 1950-82ల నాటి తెలుగు సినిమా, రూపవాణి, సినిమా, చిత్రసీమ, రంగుల కల, కినిమా, మెరుపు, సినిమారంగం, సినీరమ, విజయచిత్ర, వెండితెర, సితార, జ్యోతిచిత్ర, సినిమా పత్రికలతోపాటు ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రిక దిన, వార పత్రికలు సేకరించాను. ఆ యా పత్రికల్లో వివిధ సందర్భాల్లో ఎన్.టి.ఆర్. చెప్పిన ఎన్నో విషయాలను స్వీకరించాను. ఆ యా పత్రికల

యాజమాన్యానికి, అందులో పనిచేసిన జర్నలిస్ట్‌లకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.



'ఆంధ్రజ్యోతి' దినపత్రిక సినిమా విభాగంలో రోజువారీ నా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే జరిపిన ఈ విషయ సేకరణకు రెండేళ్లు పడితే, లభ్యమైన సమాచారాన్ని అక్షరాల్లో పొదిగి ఈ పుస్తకం రాయడానికి సరిగ్గా ఏడాది పట్టింది.

నిజం చెప్పాలంటే ఎన్.టి.ఆర్. గురించి రాయడానికి అక్షరాలు సరిపోవు. ఆయన నటజీవితాన్ని వర్ధమాన నటీనటులు అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా అటు సూర్యుడు ఇటు పొడిచినా క్రమశిక్షణ పాటించడం ఆయన రక్తంలోనే జీర్ణించుకుపోయింది. అది సినిమా షూటింగ్ కావచ్చు, లేదా కుటుంబంలో జరిగే ఫంక్షన్ కావచ్చు... ఏదైనా అనుకున్న సమయానికి అనుకున్న విధంగా జరగాల్సిందే. కెరీర్ ప్రారంభదశలో రోజూ ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ షూటింగ్‌లో పాల్గొనేవారాయన. మధ్యలో ఒక గంట మాత్రమే భోజన విరామం. వచ్చే ఏడాది వరకూ ఏ రోజు ఎవరికి ఎలా టైమ్ ఇవ్వాలన్నది కూడా ఆయన డైరీలో నోట్ చేసుకునేవారు. అంత సిస్టమాటిక్‌గా ఉండబట్టే అన్ని చిత్రాల్లో నటించినా ఎవరికీ ఏనాడూ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోగలిగారని ఆయన సన్నిహితంగా మెలిగిన వారు చెప్పినమాట. ఈ విషయాలన్నీ ఈ పుస్తకంలో రాశాను. అలాగే ఈ పుస్తకం చదివిన నందమూరి బాలకృష్ణ "నాకు తెలియని ఎన్నో విషయాలు తెలుసుకున్నానని" నాతో చెప్పడం గొప్ప కాంప్లిమెంట్‌గా ఫీలవుతున్నాను. సాధ్యమైనంత వరకూ లోపరహితంగా ఈ రచన చేశాను. తప్పులుంటే అవి నా దృష్టికి తీసుకువస్తే మలి ముద్రణలో సరిదిద్దుకుంటాను. ఎన్.టి.ఆర్. గురించి ఇంతవరకూ వచ్చిన పుస్తకాలకు మిన్నగా, భిన్నంగా ఈ 'యుగానికి ఒక్కడు' పుస్తకం ఉండాలన్న తపనతో రేయింబవళ్లు కృషి చేశాను. నా ప్రయత్నాన్ని...

ఆదరించండి

ఆశీర్వదించండి

- వినాయకరావు

# ఈ అక్షరయజ్ఞంలో ఆయనతోపాటు నేనూ..



నేటి వర్తమానం రేపటికి చరిత్రవుతుంది. ఇది సహజమే. సృష్టిధర్మమే. అయితే ఎక్కడో మారుమూల పల్లెటూరిలో పుట్టిన ఓ సామాన్యుడు స్వయంకృషితో, పట్టుదలతో మాన్యుడిగా, మహనీయుడిగా, మహా నటుడిగా ఎదగడమే కాకుండా ఎందరికో మార్గ దర్శకుడిగా మారడమన్నది అరుదైన విషయమే.

ఇదిలా ఉంటే చరిత్రతోపాటు నడుచుకు పోయేవారు కొందరు. కొంతదూరం నడిచినట్టే నడిచి, ఆపై చరిత్రనే తమ వెంట నడిపించేవారు మరికొందరు. అయితే అలాంటివారు ఎప్పుడో.. ఎక్కడో చాలా అరుదుగా కనిపిస్తారు.. ఓ నందమూరి తారకరామారావులా!

ఎన్.టి.ఆర్. గొప్ప నటుడని ఇప్పుడు ప్రత్యేకించి చెప్ప నవసరం లేదు. అయితే ఆయన ధరించిన కొన్ని పాత్రలు మరొకరు చేయలేరనడం మాత్రం అతిశయోక్తికాదు. తన కెరీర్‌ను ఎన్.టి.ఆర్ మలుచుకున్న విధానం ఆద్యంతం ఆసక్తికరం. అందుకే ఈతరం నటులకు ఎన్.టి.ఆర్ నటజీవితాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫ్రెంచ్‌యోధుడు నెపోలియన్ బోనపార్టీ గురించి జాన్ అబట్ ఓ గొప్ప పుస్తకాన్ని రాశాడు. నెపోలియన్ వ్యక్తిత్వాన్ని వివిధ కోణాల్లో పరిశీలించి రాసిన పుస్తకమది. అలాగే ఎన్.టి.ఆర్ జీవితకథ గురించి గతంలో కొన్ని పుస్తకాలు వచ్చాయి. అయితే జర్నలిస్టు మిత్రుడు వినాయకరావు రాసిన 'యుగానికి ఒక్కడు' చదివిన తర్వాత నాకు జాన్ అబట్ రాసిన ఆ పుస్తకం గుర్తుకు వచ్చింది. ఎన్.టి.ఆర్. ఆదర్శాలను, లక్ష్య లక్షణాలను, పోషించిన వివిధ భూమికల గురించి వినాయకరావు ఎంతో విపులంగా, అందరినీ ఆకట్టుకునే రీతిలో 'యుగానికి ఒక్కడు'లో రాశారు. అందుకే ఈ పుస్తకం నాకు ప్రత్యేకమైనదిగా అనిపించింది. ఒక మహా కళాకారుని 60 ఏళ్ల నటప్రస్థానాన్ని అరుదైన సమాచారంతో, అద్భుతమైన ఫొటోలతో అందించాలన్న తపనతో ఓ పరిశోధకుడిలా మారి వినాయకరావు మూడేళ్లపాటు ఎంతో కృషిచేసి ఇలా పుస్తకరూపం ఇచ్చారు. వ్యక్తులు కాకుండా పెద్ద సంస్థలు చేయాల్సిన పనిని ఎన్.టి.ఆర్. పట్ల అభిమానంతో తను ఒక్కడే చేయడం నాకు ముచ్చటేసింది. అందుకే వినాయకరావు తలపెట్టిన ఈ అక్షర యజ్ఞంలో నేనూ పాలుపంచుకోవాలనిపించి ఆయనతో చేతులు కలిపాను. తెలుగువారి ప్రతిష్టను ఇనుమడింప చేయడమే కాకుండా, వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన మహానుభావుడు ఎన్.టి.ఆర్. ఆయన్ని అభిమానించేవారే కాకుండా ప్రతి తెలుగువాడు వినాయకరావు ప్రయత్నాన్ని అభినందిస్తారని ఆశిస్తూ, ఆయన్ని మరోసారి అభినందిస్తున్నాను.

**- నౌడు వెంకట రమణబాబు**

# ఎందరో మహానుభావులు

'యుగానికి ఒక్కడు' పుస్తకం రాయాలనే ఆలోచన వచ్చిన దగ్గరనుంచి ఈ పుస్తకం ప్రింట్ అయ్యే క్షణం వరకూ నాకు అండగా ఉండి, ఎన్నోవిధాల సాయపడిన పెద్దలు, మిత్రులు ఎంతోమంది. నిరాశ, నిస్పృహ చుట్టిముట్టినప్పుడు వెన్నుతట్టి ముందుకు నడిపించిన నా ఆత్మబంధువుల సహకారాన్ని ఎలా మరచిపోగలను.. వీరందరూ లేకపోతే 'యుగానికి ఒక్కడు' పుస్తకమే లేదు.

నా శ్రేయోభిలాషి, నిర్మాత, మంచి మనిషి బి.అచ్యుతరామరాజు (వైజాగ్), నా గురువు కీ॥శే॥ ఆరిపాక సూరిబాబు (వైజాగ్), ఎన్.టి.ఆర్. అభిమాని బస్వా అప్పారావు (ముక్కోల్లు), రామినేని భాస్కరేంద్ర (మదనపల్లి) ఘంటసాల వీరాభిమాని ఆర్.వి.సుబ్బారావు (మార్టూరు), కొమ్మినేని వెంకటేశ్వర రావు, జర్నలిస్ట్ మిత్రుడు ఆకెళ్ల రాఘవేంద్ర, వి.బాబూరావు (హైదరాబాద్), సాహిత్యాభిమాని సి.శ్రీకాంత్ కుమార్ (హైదరాబాద్), పాత సినిమాలంటే ప్రాణం పెట్టే జర్నలిస్ట్ మిత్రుడు పులగం చిన్నారాయణ (హైదరాబాద్), అద్భుతమైన ఫొటోలు ఇచ్చిన శ్రీమతి నందమూరి లక్ష్మీపార్వతి (హైదరాబాద్), యువచిత్ర అధినేత కె.మురారి (చెన్నై), జి.ఎస్.ఆర్.చౌదరి (గుంటూరు), నాదెళ్ల ప్రత్యగాత్మ (హైదరాబాద్), ఎస్.విశ్వేశ్వరరావు (హైదరాబాద్), అక్షర దోషాలు సరిదిద్దిన మిత్రులు మద్దిపట్ల మణికుమార్ (ఆంధ్రజ్యోతి), ప్రసన్న ప్రదీప్ (సాక్షి), ప్రత్యేక శ్రద్ధతీసుకొని ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దిన పి.రామబ్రహ్మం (హైదరాబాద్), సహకారాన్ని అందించిన 'సితార' మిత్రులు వి.చక్రవర్తి, రవికిషోర్, సీనియర్ జర్నలిస్టులు పి.శరత్‌కుమార్, రాజా, హిరణ్యమూర్తి (వైజాగ్), చల్లా సుబ్బారాయుడు (కనిగిరి), ఎస్.ఎల్.ఎన్.స్వామి (వైజాగ్), కొన్ని అరుదైన ఫొటోలు అందించిన తమ్ముడు శివ... వీరందరికీ నా కృతజ్ఞతలు.

అలాగే 'తెలుగు సినిమా', 'విజయచిత్ర', 'సితార', 'జ్యోతిచిత్ర', 'నవ్య', సినీ మాస, వారపత్రికల్లో ప్రచురితమైన ఎన్.టి.ఆర్. ఆర్టికల్స్‌లో కొంత భాగాన్ని ఈ పుస్తకంలో సందర్భోచితంగా ఉపయోగించుకున్నాను. ఆ యా పత్రికల యాజమాన్యాలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

ఇక ప్రత్యేకంగా పేర్కొనవలసిన వ్యక్తులు నలుగురున్నారు. నేను ఏ పుస్తకం రాసినా దానికి సంబంధించిన గ్రౌండ్‌వర్క్ ప్రిపేర్ చేసి, అనుక్షణం నా వెంట ఉండే నా సన్నిహిత మిత్రులు నవీన్ ప్రసాద్, మోడేకుర్తి సత్యనారాయణ (వైజాగ్), తన పనులన్నీ పక్కనపెట్టి స్పాన్సరర్ల వేటలో నాతో పాల్గొనడమే కాకుండా ఎంతో మోరల్ సపోర్ట్ ఇచ్చిన నా ప్రియమిత్రుడు పి.మురళీకృష్ణంరాజు (హైదరాబాద్), ఇంట్లో పనులు పట్టించుకోకుండా మూడేళ్ల నుంచి ఈ పుస్తక రచనలో నిమగ్నమైపోయినా ఓపికతో భరించి, ఎంతో సహకరించిన నా శ్రీమతి జయలక్ష్మి.... కృతజ్ఞత అనేపదం వారిముందు చిన్నదవుతుందేమో!

అలాగే

'ముందుమాట' రాసిన దర్శకరత్న డా॥దాసరి నారాయణరావు గారికి

ఆశీస్సులు అందజేసిన డి.వి.ఎస్.రాజు గారికి కృతజ్ఞతలు.

- వినాయకరావు

# ప్రత్యేక కృతజ్ఞతలు




తెలుగు సినిమా చరిత్రకు సంబంధించిన ఏ పుస్తకం రాయాలన్నా మొదటగా గుర్తుకు వచ్చే పేరు.. సంజయ్‌కిషోర్. ఆయన సహకారం లేకపోతే, తన దగ్గరున్న అరుదైన ఫొటోలు ఇవ్వకపోతే ఆ పుస్తకాన్ని తీసుకురావడం కష్టం. పాత సినిమాలకు సంబంధించిన ఫొటోలు కొంతమంది దగ్గర ఉన్నప్పటికీ వారి నుంచి ఆ ఫొటోలు సంపాదించడం చాలా కష్టంగా మారింది ఈ రోజుల్లో. డబ్బులిచ్చి కొందామన్నా అలాంటి వ్యక్తులు సహకరించని సందర్భాలు ఎన్నో. అయితే సంజయ్‌కిషోర్ విషయం వేరు. తనకు పరిచయమున్నా, లేకపోయినా అడిగిన వెంటనే పాత ఫొటోలు ఇచ్చి పంపిస్తుంటారు. పాత ఫొటోల సేకరణ అతనికి ఓ హాబీ. అలనాటి అపురూప బ్లాక్ అండ్ వైట్ స్టిల్స్‌ను సేకరించడానికి సంజయ్ ఎంత శ్రమ పడతారో, ఎంత డబ్బు ఖర్చు పెడతారో నాకు తెలుసు. చాలామంది ఆర్టిస్టులు, నిర్మాతల దగ్గర లేని స్టిల్స్ సంజయ్ దగ్గర మాత్రమే దొరుకుతాయి. అందుకే తెలుగు సినిమాకి సంబంధించిన పుస్తకాలు రాసేవాళ్లు ఎక్కడెక్కడి నుంచో సంజయ్ దగ్గరికి వచ్చి స్టిల్స్ తీసుకెళుతుంటారు. ఆయన దగ్గరున్న స్టిల్స్‌కు ఎంత డిమాండ్ ఉందో నాకు తెలుసు. అయితే వ్యాపార ధోరణితో కాకుండా ఒక మంచి పుస్తకానికి తనవంతు సహకారాన్ని అందించాలనే తపనతో అరుదైన స్టిల్స్ అందరికీ ఇస్తుంటారు సంజయ్. నాకు తెలిసి పదిహేనేళ్ల నుంచి సంజయ్ ఇలా ఎంతోమందికి సాయం చేస్తున్నారు. సినిమా మీదున్న అభిమానం ఆయనచేత ఇలా కళాసేవ చేయిస్తోంది. అంతేకాదు సంజయ్ మంచి వక్త, రచయిత, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు కావడమే కాదు కళాహృదయుడు కూడా. భాగ్యనగరంలో ఎన్నో సాంస్కృతిక సంస్థలు ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు కొత్త కాన్సెప్ట్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తూ భాగ్యనగర వాసులకు ఎంతో చేరువయ్యారు సంజయ్.

అతని గురించి ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే.. 'యుగానికి ఒక్కడు' పుస్తకం రచించింది నేనే అయినా, తొలి అడుగు వేయడానికి, ఈ పుస్తకం నేను రాయడానికి ప్రధాన కారకుడు నా మిత్రుడు సంజయ్. ఎన్.టి.ఆర్. సినీ జీవిత చరిత్రను సమగ్రంగా తీసుకురావాల్సిన అవసరం ఎంతయినా ఉందని నా ఆలోచనని బలపర్చడమే కాకుండా, ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే సంజయ్‌కిషోర్ ఇచ్చిన అరుదైన ఫొటోలు ఈ పుస్తకం విలువను ఎంతో పెంచాయి. వయసులో నాకంటే చిన్నవాడైనా సంజయ్ మంచితనానికి, అతని సంస్కారానికి చేతులెత్తి నమస్కరిస్తున్నాను. ఇక్కడ ముఖ్యంగా చెప్పాల్సిన మరో విషయం ఏమిటంటే ఈ పుస్తకానికి ఆర్థిక అండదండలు అందించిన రమణబాబుగారు కూడా సంజయ్‌కిషోర్ ద్వారానే పరిచయం కావడం.

- వినాయకరావు

# ఎన్.టి.ఆర్. అవార్డ్ తెచ్చిన ఇంటర్వ్యూ



నాకు ఊహ తెలిసిన రోజులనుంచి మహా నటుడు నందమూరి తారకరామారావుగారి అభిమానిని. ఆయన సినిమా విడుదలైన మొదటి రోజు ఎలాగైనా టిక్కెట్టు సంపాదించి మార్నింగ్ షో చూసెయ్యడం అప్పట్లో ఒక అలవాటు. రామారావుగారి గురించి, ఆయన సినిమాల గురించి ఎవరైనా చెడ్డగా మాట్లాడితే సహించే వాణ్ణి కాదు. అయితే ఇతర హీరోలంటే దురభిమానం అప్పుడూ లేదు, ఇప్పుడూ లేదు.

గుడివాడలో నేను ఇంటర్ చదువుతున్న రోజుల్లో ఒకసారి కవిరాజు కళామందిరంలో ఒక సభలో పాల్గొనడానికి రామారావుగారు వచ్చారు. ఆయన్ని ప్రత్యక్షంగా చూడటం నాకు అదే ప్రథమం. ఆ సభలో అలవాటు ప్రకారం చేతులు అటు ఇటు తిప్పుతూ, హావభావాలు ప్రదర్శిస్తూ ఎన్.టి.ఆర్. మాట్లాడే మాటల్ని వెనుక వరసలో కూర్చుని మైమరచి విన్నాను. సభ ముగిశాక ఆయన తిరిగి వెళ్లిపోవడానికి సిద్ధమౌతుంటే మరింత దగ్గర నుంచి చూడాలనే ఆత్రుతతో బయటకు వచ్చి నిలబడ్డాను. నాలాగా మరెందరో అభిమానులు ఎన్.టి.ఆర్.ని చూడాలనే ఆశతో గుంపులు గుంపులుగా అక్కడ నిలబడి ఉన్నారు. బయటకు వస్తూనే మా అందర్నీ గమనించి పక్కనే ఉన్న అంబాసిడర్ కారు టాప్ ఎక్కి అభివాదం చేశారు ఎన్.టి.ఆర్. రెండు నిమిషాల తర్వాత ఆయన కూర్చున్న కారు మా కళ్ల ముందు నుంచి కదిలివెళ్లిపోయింది. ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్లముందు అలా కదలాడుతుంటుంది.

ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేయడం, ఉద్యోగాన్వేషణ నిమిత్తం హైదరాబాద్ చేరడం, 'ఈవారం', 'పల్లకి' వారపత్రికల్లో జర్నలిస్ట్‌గా చేరడం, అనంతరం 1986లో 'సితార'లో రిపోర్టర్ కావడం జరిగాయి. నేను సినిమా జర్నలిస్ట్

కావడానికి ముందే రామారావుగారు సినిమాలకు స్వస్తి పలికి రాజకీయాల్లో ప్రవేశించి, ముఖ్యమంత్రి అయ్యారు. నా అభిమాన నటుణ్ణి ఇంటర్వ్యూ చేయలేకపోయానే అనే వెలితి చాలాకాలం అలాగే ఉండిపోయింది. ఆయన రాజకీయాల్లో బిజీగా ఉన్నారు కనుక ఇక సినిమాల జోలికి రారని అందరితోపాటు నేనూ అనుకున్నాను. అయితే కేవలం నా కోసమే అన్నట్లు ఆయన రాజకీయాల్లో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ వీలు చేసుకొని నాలుగు చిత్రాల్లో నటించారు. ఆ సందర్భంగా ఎనిమిది సార్లు ఆ మహానటుణ్ణి ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు దొరికింది. ఎన్.టి.ఆర్.ని దూరం నుంచి చూస్తే చాలు, ఆయన మాటలు వింటే చాలు అనుకొనే నాకు ఎదురుగా కూర్చుని గంటల తరబడి మాట్లాడే అవకాశం లభిస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఎన్.టి.ఆర్.ని 'సితార' పత్రిక కోసం నేను చేసిన ఇంటర్వ్యూల్లో ఇదొకటి. 1992 అక్టోబర్ 15న చేసిన ఈ ఇంటర్వ్యూకే ఇటీవల ఎన్.టి.ఆర్. ట్రస్ట్ నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. ఎప్పుడో 18 ఏళ్ల క్రితం చేసిన ఇంటర్వ్యూకు ఇప్పుడు బహుమతి రావడం, రామారావుగారి 60 ఏళ్ల నట ప్రస్థానం గురించి నేను 'యుగానికి ఒక్కడు' పేరుతో పుస్తకం రాస్తున్న తరుణంలోనే ఈ అవార్డు రావడం.. ఇదంతా పెద్దాయన ఆశీర్వాద ఫలితమేనని భావిస్తున్నాను.

అవార్డ్ తెచ్చిన ఆ ఇంటర్వ్యూని ఇక్కడ ఇస్తున్నాను. చదవండి.. మీరూ ఆశీర్వదించండి..

**మీరు ఇంతకుముందు తీసిన చిత్రాలలో విశ్వామిత్రుడుకానీ, సమ్రాట్ అశోకుడుకానీ భారతీయులందరికి సుపరిచితులే. కానీ శ్రీనాథుడు తెలుగు కవీంద్రుడు. ఆయన జీవిత కథని సినిమాగా మలచడానికి కారణం ఏమన్నా ఉందా? అంటూ తొలి ప్రశ్నను ఆయన ముందుంచాం.**

"మీరన్నది నిజమే. ఈ రెండు కారెక్టర్స్ యూనివర్సల్‌వి. భారతీయులందరూ ఉచ్చరించే



వినాయకరావుకు ఎన్.టి.ఆర్. అవార్డు అందిస్తున్న చంద్రబాబునాయుడుతో సీనియర్ జర్నలిస్టులు వరదాచారి, పొత్తూరి వెంకటేశ్వరరావు



'బ్రహ్మర్షి విశ్వామిత్ర' చిత్రంలో డిస్కోశాంతి, ఎన్.టి.ఆర్, మధుమిత, బాలకృష్ణ

పవిత్రమైన మంత్రం గాయత్రి. అటువంటి మహా విజ్ఞాన మంత్ర ద్రష్ట విశ్వామిత్రుడు. ఈ విషయం చాలామందికి తెలియదు. అందుకే దాని ప్రాముఖ్యతను తెలియజెప్పాలనే భావనతో విశ్వామిత్రుడు సాధించినదేమిటో చిత్రంలో చూపించాం. ఆయన్ని ఒక నెగటివ్ కారెక్టర్‌కిందే చూపడం జరిగింది. కానీ సమాజానికి, ప్రజలకి ఆయన చేసిన సేవ ఏమిటి? మానవాతీతమైన కృషితో మానవ సంక్షేమానికి ఎలా కృషి చేశాడన్నది తెలియచెప్పాలన్న సంకల్పంతో ఆ చిత్రం తీశాం. అలాగే 'సమ్రాట్ అశోక' మన జాతీయ పతాకంమీద ఆశోకుని ధర్మచక్రం ఉంది. ఆ గుర్తుతోనే తెలుస్తుంది... ఆయన ప్రపంచానికి సంబంధించిన వ్యక్తి అని. ఏకైక సమ్రాట్ ఆయనే. అశోకుడి తర్వాత సమ్రాట్ అనిపించుకున్న చక్రవర్తులెవరూ లేరు. అందుకే ఆ సినిమా తీశాం. ఇక శ్రీనాథుడు ప్రాంతీయుడంటే నేనూ ఒప్పుకుంటాను. అందుకే దీన్ని తెలుగులోనే తీస్తున్నాను. మిగతా భాషలలో టచ్ చేయడం లేదు. ఆయన బహుభాషాకోవిదుడయినా తెలుగు, కన్నడం, మలయాళం, పార్శీకం, సంస్కృత భాషలలో ప్రజ్ఞ ఉన్నా తెలుగు కవీంద్రుడుగానే ప్రసిద్ధికెక్కేడు" అని వివరించారు ఎన్.టి.ఆర్.

**శ్రీనాథుని పాత్రను పోషించడానికి మిమ్మల్ని ప్రేరేపించిన అంశాలు ఏమిటి?**

తెలుగు భాషకు శ్రీనాథుడు చేసిన సేవ అమోఘం. మనం వర్ణించలేనటువంటిది. 'అసలు శ్రీనాథ కవిసార్వభౌముడు లేకపోతే తెలుగు భాషకు ఇంత జవసత్వాలు వచ్చి ఉండేవా!' అని నాకు అనిపిస్తుంటుంది. ఆయన భాష, పదగుంభనం, శైలి విధానం ఎవరూ ఊహించలేనటువంటి అతీతమైన వ్యక్తిగా తన కావ్యాలలో రూపుదిద్దుకున్నాడు. అటువంటి మహామేధావి, సాహితీ సంస్కర్త మరెవరూ లేరు. అయితే అంతకంటే సులభమైన భాషలో రాసిన పోతనామాత్యుడు ఉన్నాడు.

కానీ తెలుగు పదగుంభనలో, భాషా పటిష్టతలో, నిర్దుష్టమైన వాక్చాతుర్యంలో శ్రీనాథుని మించిన వారెవరూ లేరు. కాబట్టి మన తెలుగు జాతికి సంస్కృతీ పరమైన సేవ చేసినట్టవుతుందని కళకు ఒక పరమార్థం దక్కుతుందన్న భావనతోనే ఆ పాత్రను పోషించాలనుకున్నాను. ఈనాడు చిత్ర రంగంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఈ చిత్రం ఆర్థికంగా విజయవంతమవుతుందా, లేదా అన్న ప్రశ్న లేనే లేదు.

**'సమ్రాట్ అశోక' చిత్రం అపజయం పొందడానికి మీరనుకుంటున్న కారణాలు ఏమిటి?**

ఆ చిత్రం ఫెయిల్యూర్ అయిందని అంటే నేను ఒప్పుకోను. అయినా అసలు ఎవరామాట అంది? కాకపోతే చిత్రంలో భాష కఠినంగా ఉందని కొంతమంది అన్నారు. ఆ విషయం నేనూ ఒప్పుకుంటాను. అంతేకానీ చిత్రం బాగాలేదని ఎవరూ అనలేదు. ఇటీజ్ నాటే ఫెయిల్యూర్ పిక్చర్. అశోకుని పాత్రపోషణ అద్భుతంగా ఉందనీ, ముఖ్యంగా పరివర్తన కలిగిన సన్నివేశంలో నా నటన కంటతడి పెట్టించిందనీ చాలామంది అన్నారు. అలాగే 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' కూడా తెలుగులో నేను అనుకున్న విధంగా ఆడలేదు. దాని హిందీ వెర్షన్ 'బ్రహ్మర్షి' ఇంకా విడుదల కాలేదు. ఆనాడు కలగని భావవిశేషం ఈ చిత్రం విషయంలో ఈనాడు నాకు కలిగింది. హిందీ చిత్రంలో విశ్వామిత్రుడు తనకథని తనే చెప్పుకుంటాడు శకుంతలతో.. 'తండ్రిగా ఉండి కూడా కూతురు ఇన్ని కష్టాలు పడుతుంటే చూసి సహించాను అని నువ్వు అనుకోవచ్చమ్మా. కానీ నేను సాధకుణ్ణి. ఎంతో సాధించాను. నా మహిమలతో త్రిశంకుడికి అపరస్వర్గాన్ని సృష్టించాను. అదేవిధంగా హరిశ్చంద్రుడి విషయంలో దేవతలను మానవులు అధిగమించవచ్చని నిరూపించాను. అలాగే దుష్ట శిక్షణార్థం రామభద్రుని అవతారం మొదలయినప్పుడు ఆ అవతార సిద్ధికోసం నేను మహత్తరమైన శక్తులను ఆయనకు ప్రసాదించాను. నేను ఏది చేసినా అదంతా విధిలిఖితం. విధికి దాసుడినే తప్ప దానిని అధిగమించలేను. కాబట్టి నువ్వయినా, నేనయినా విధి ప్రేరణ పరిధిలోనే చరించాలి తప్ప దానిని అతిక్రమించలేం' అంటూ కథంతా ఆమెకి నేరేట్ చేస్తాడు. తెలుగులో తీసిన దానికి భిన్నంగా

'సమ్రాట్ అశోక' చిత్రంలో ఎన్.టి.ఆర్., మోహన్‌బాబు





'బ్రహ్మర్షి విశ్వామిత్ర' షూటింగ్‌లో మీనాక్షిశేషాద్రితో ముచ్చటిస్తున్న ఎన్.టి.ఆర్.

ఉంటుంది హిందీ చిత్రం. ఒక దర్శకుడు తన విజ్ఞానాన్నీ, ఊహనీ ఏవిధంగా ప్రస్ఫుటింపచేయగలడో నిరూపించాలన్నది నా ఉద్దేశం. దర్శకత్వానికి ఒక పరిధి లేదు. అది ఇలా ఉండాలని ఎవరూ చెప్పలేదు. తనకు ఇచ్చిన కథను ఏవిధంగా తన ఊహలతో దర్శకుడు రూపొందించగలడో, ప్రజలకు ఆమోదకరంగా తీసి చూపగలడో అనేదే అతని ప్రతిభ. ఈ ఊహ నాకు ఇప్పుడు వచ్చిందికానీ అప్పుడు రాలేదు (నవ్వు...) ఆలోచన వచ్చినప్పుడు దాన్ని నేనెందుకు వదిలిపెడతాను? ప్రయోగాలు చెయ్యడానికి నేనెప్పుడూ ఉవ్విళ్ళూరుతుంటాను. నా ఆలోచనలతోనే నా ప్రయోగాలు ఉంటాయి. రెండు రూపాయల కిలో బియ్యం నా ఆలోచనే. పేదవాళ్ళకు పక్కా ఇళ్ళు కట్టించాలన్నది నా మరో ఆలోచన. అలాగే ఈ ఆలోచన కూడా వచ్చింది. మూడేళ్ళక్రితం ఇది రాలేదు. ఇప్పుడు అదే కరెక్ట్ అనుకున్నాను. తెలుగు వెర్షన్ చూసి కొంతమంది 'రామారావుగారు మాకు 40 నిమిషాలు మించి కనిపించలేదు' అన్నారు. 'శ్రీకృష్ణపాండవీయం', 'దానవీర శూరకర్ణ' చిత్రాలలో దుర్యోధనునిలాగా ఈ పాత్రను కూడా మేము బ్రహ్మాండంగా ఊహించుకున్నాము. అలా లేకపోవడం మాకు అసంతృప్తి కలిగించింది' అన్నారు. దీనికి తరుణోపాయం ఏమిటా అని ఆలోచించినప్పుడు ఇది తట్టింది. వెంటనే దీని గురించి నలుగురికి చెప్పగానే "బావుంది... కొత్తదనంగా ఉంది" అని వాళ్ళు అనగానే ఆ ప్రకారం చేద్దామనుకున్నాం. రీ షూట్ చెయ్యడానికి డబ్బు ఖర్చవుతుందనే భావనతో ఆ థాట్‌కి తిలోదకాలు ఇవ్వకుండా విప్లవోద్దేశ పూరితుడనయిన కళాకారుడిగా, దర్శకుడిగా షూటింగ్‌కి పూనుకున్నాను. ముందు వచ్చిన ఆలోచన నాదే. దానిమీద కూడా ఇప్పుడు వచ్చిన ఆలోచన కూడా నాదే. నా మీద నేనే ప్రయోగం చేస్తున్నాను. రిజల్ట్ ఏమిటన్నది త్వరలో తెలుస్తుంది.

**మీరు చేసిన మార్పులు ఏమిటి?**

పెద్దగా మార్పులు లేవు. ప్రజంటేషన్ భిన్నంగా ఉంటుంది. శకుంతల ఎపిసోడ్ మాత్రం మారుతుంది. తెలుగువారికంటే హిందీ ఆర్టిస్టులయితే భాషలోకానీ,



ఒద్దికలోకానీ, సహజత్వంలోకానీ బాగుంటుందని ముగ్గురు హిందీ ఆర్టిస్టులు... అరుణ్‌గోవిల్ (దుష్యం తుడు), అర్చనా జోగ్లేకర్ (శకుంతల), నిరూపరాయ్ (గౌతమి)లను తీసుకున్నాం. ఆ సినిమాలో చెలికత్తెలను తోడిచ్చి దుష్యంతుడి దగ్గరకు శకుంతలను పంపిస్తాడు విశ్వామిత్రుడు. ఇప్పుడు అలా కాకుండా వృద్ధురాలైన ఒక ఆశ్రమవాసినిచేత పంపించినట్లుగా చూపిస్తున్నాం. గర్భిణిగా ఉన్న కూతుర్ని చిన్నపిల్లల వెంట పంపించడం సమంజసంగా ఉండదని అలా మార్చాం. ఇలాంటి చిన్న చిన్న మార్పులు మరికొన్ని చేశాం. ఒక షెడ్యూల్ అయింది. ఈ నెల 20 నుంచి 30వరకూ జరిగే షెడ్యూల్‌లో శకుంతల, దుష్యంతులపై ఒక పాటను అరకులోయలో తీస్తున్నాం. డిసెంబరులో జరిగే షెడ్యూల్‌తో చిత్రం పూర్తవుతుంది.

**అయితే బాలకృష్ణ ఈ చిత్రంలో హరిశ్చంద్రుడిగా మాత్రమే నటిస్తున్నారా?**

అవును.

**మీరు 'శ్రీనాథ...' సినిమాకి దర్శకత్వం వహించక పోవడానికి కారణం ఏమిటి?**

నేను 'సమ్రాట్ అశోక' తీస్తున్న సమయంలోనే బాపుగారిని ఒక సినిమా తీసిపెట్టమని అడిగాను. అఫ్‌కోర్స్.. అప్పుడు 'లవకుశ' చిత్రం గురించి అడిగా ననుకోండి. ఆయనంటే నాకు పవిత్రమైన గౌరవభావం ఉంది. తన శక్తిసామర్థ్యాలకు లోటు లేకుండా తీయగలరనే నమ్మకమూ ఉంది. నా దగ్గర కొండవీటి వెంకటకవిగారు రాసిన 'లవకుశ' స్క్రిప్ట్ ఉంది. ఆయన రాసిన చివరి స్క్రిప్ట్ అదే. అది బాపుగారికి ఇచ్చి 'దీన్ని చూడండి, మార్పులు చేర్పులు కావాలంటే చేద్దాం' అన్నాను. 'లోకోత్తరంగా మీరు పోషించిన రాముడి పాత్ర తెరపై చూసి నమస్కారం చేశాం సార్. అంత కంటే బాగా తియ్యగలమనే విశ్వాసం లేదు. హిందీ భాషలో తీద్దామంటే ట్రై చెయ్యగలం' అన్నారు బాపు-రమణ ఏకగొంతుతో. అయితే హిందీ భాషలో మాత్రమే తీస్తే గిట్టుబాటు కాదు. భారీ బడ్జెట్ చిత్రమది. తెలుగు, హిందీ, వీలయితే మిగతా భాషలలోకి డబ్ చేసుకునే విధంగా ప్లాన్ చేస్తే తప్ప వీలవదు. అదీగాక బాపుగారు పాత చిత్రాలకంటే గొప్పగా తీయలేమని అంటున్నారు. అప్పుడు ఆ ప్రాజెక్ట్‌ని పక్కనపెట్టి శ్రీనాథుడు గురించి ఆలో చించాం. కీ॥శే॥ నోరి నరసింహశాస్త్రిగారు 'కవిద్వయం', 'శ్రీనాథ కవిసార్వభౌమ' అని రెండు గ్రంథాలు రాశారు. మా దగ్గర నారాయణరెడ్డిగారు రాసిన శ్రీనాథుడు స్క్రిప్ట్ ఉన్నప్పటికీ ఈ రెండు పుస్తకాల హక్కులు కొంటే అవసరమైనప్పుడు వాడుకోవచ్చనే నిర్ణయానికి వచ్చాం. శాస్త్రిగారి అబ్బాయి ఢిల్లీలో ఉంటే వారికి ఉత్తరం రాశాం. సమాధానంగా ఆయనే వచ్చారు. 'ఇలా సినిమా తీద్దామనుకుంటున్నామండి. మీ నాన్నగారు రాసిన నవలల హక్కులు కావాలి' అని అడిగాను. 'మీలాంటివారు తీయడానికి పూనుకుంటే అంతకంటే ఇంకేం కావాలి?' అని హక్కులు రాసి ఇచ్చారు. తర్వాత హక్కులు కొన్నానని బాపుగారికి చెప్పాను. ఆయన ఎంతో సంతోషించి, సీరియస్‌గా వర్క్ చేయడం ప్రారంభించారు. బాపుగారు దర్శకులయితే రచయిత రమణగారే కదా. ఆయన స్క్రిప్ట్ వర్క్ ప్రారంభిం చారు. 'నేను ఏ విధంగానూ జోక్యం చేసుకోను. నాకు శ్రీనాథుడు పాత్ర వెయ్యాలని ఉంది. నా అనుభవంతో.. సామర్థ్యంతో నభూతో నభవిష్యతి అనేవిధంగా చేయాలని ఉంది. ఎందుకంటే చిరస్థాయిగా నిలబడే

పాత్ర ఇది. ఆనాడు నాగయ్యగారికి పోతన మొదలైన పాత్రలు ఎలా ఉన్నాయో అలాగే శ్రీనాథుని పాత్ర కూడా గొప్పది. అన్‌పారలల్ క్యారెక్టర్- ఇన్ ది లిటరరీ హిస్టరి' అని చెప్పాను. నేను చెప్పాననే కాకుండా వారిద్దరూ ఎంతో ఏకాగ్రతతో, స్వంత చిత్రం కూడా వాయిదా వేసుకుని కృషిచేశారు. మహత్తరంగా వచ్చింది సబ్జెక్ట్. అయాం వెరీవెరీ హ్యాపీ. అలా ఈ సబ్జెక్ట్ కుదిరి బాపుగారు దర్శకత్వం వహిస్తున్నారు తప్ప నేను చెయ్యడం మానుకుని ఆయనకు ఆ బాధ్యతలు అప్పగించలేదు.

**కానీ ఆ రెండు చిత్రాలూ ఫెయిల్ అవడంవల్లనే మీరు దర్శకత్వం వహించడంలేదని కొంతమంది భావన. మరి మీరేమంటారు?**

మీరొక విషయం మరిచిపోకూడదు. నేను 'కర్ణ' తీశాను. జూబిలీ ఆడింది. 'శ్రీమద్ పోతులూరి వీరబ్రహ్మం' తీశాం. అదీ జూబిలీ చిత్రం. మరి ఆ రెండూ నేను తీసినవేకదా. వాటీజ్ దిస్? దర్శకుడిగా నేను ఓడిపోయానంటే ఒప్పుకోను. నా జీవితంలో ఓటమి లేదు. రాజకీయాలు, సినిమా, మరే రంగమన్నా తీసుకోండి... నేనే మాస్టర్‌ని. ఐయామ్ కింగ్. మీకు తెలుసు నా పట్టుదల. లేకపోతే విడుదలయిన చిత్రంమీద మళ్లీ 60 లక్షలు ఎవరు పెడతారండి? అదసలే ఫ్లాప్ చిత్రం. మళ్లీ దానిమీద ఇంత డబ్బా? అని అనుకోవచ్చు. కానీ నేను ఓటమిని అంగీకరించను. అప్పటి ఆ ఆలోచన కరెక్టే. ఆనాటికది సరయినదే. తప్పుకాదు. అదే ఇతివృత్తంతో 'సీతారామ కళ్యాణం' తీశాను. అది బాగా ఆడిందిగా. తనమీద తను ప్రయోగం చేసుకోవడం అనేది ఒక ప్రక్రియ. ప్రపంచంలో ఏ నటుడూ చేయని ప్రయోగాలు నేను చేశాను. రాముడు చేసిన ఏ నటుడూ నెగెటివ్ క్యారెక్టర్ రావణాసురుడు చెయ్యలేదు. అలాగే కృష్ణుడు వేసినవాళ్లు దుర్యోధనుడు వెయ్యలేదు. ఒక పౌరాణిక సినిమాలో ఐదువేషాలు ఎవరూ వెయ్యలేదు. ఆ పాత్రలు వెయ్యడమే కాకుండా డైరెక్ట్ చేశాను కూడా. ఇవన్నీ రికార్డేకదా! మనవాళ్ళకి గుర్తుండదు. పైకి చెప్పు కోలేరుకానీ, ఎన్.టి.ఆర్.ని నటనలోకానీ, సినిమా ఫీల్డ్‌లోకానీ మించినవాళ్లు మరెవరూ లేరు. ఇది నేను



అహంకారంతో చెబుతున్న మాటలు కావు. ప్రత్యక్ష సాక్ష్యాలు మీ ఎదురుగా ఉన్నాయి. నేను కమర్షియల్ ఆర్టిస్ట్‌ని కాదు. ఎక్స్‌పెరిమెంటల్ ఆర్టిస్ట్‌ని. అయినా ఎవరి డబ్బుతోనో నేను ప్రయోగాలు చేయను. నా స్వంత డబ్బు పోయినా ఫరవాలేదు. నా రూపాయి పోయినా మనసులో బాధపడతాను. కానీ బయటికి చెప్పుకోను. వేరే నిర్మాత నాకు డబ్బిచ్చి నటింపజేసి నందుకు లాభం పొందాలని చూస్తాడుకానీ నష్టపోవాలని అనుకోడుకదా. నేను కూడా అతనికి ఎలా లాభం చేయాలా అని ఆలోచిస్తాను తప్ప ప్రయోగాలు చెయ్యాలని అనుకోను. 'అత్తగారి సొమ్ము అల్లుడు దానం' చేసినట్లవుతుంది కదా.

ఈ సందర్భంగా గుమ్మడి నటించిన 'పోతన' చిత్రం గురించి చెప్పారు రామారావు. "ఆ సినిమాలో శ్రీనాథుని పాత్రను రంగారావుగారు వేశారు. అంత కంటేముందు నా దగ్గరికి వచ్చారు నిర్మాత... సముద్రాల రాఘవాచార్యగారు పంపించారంటూ. నేను సరే, చేస్తానన్నాను. కానీ నాకు ఆరునెలలు టైం కావాలి. గుండు కొట్టుకునే నటిస్తాను. రెండు నెలల్లో సినిమా పూర్తిచేస్తాను. కానీ ఈ ఆరునెలలూ కవిగారు నా వెంట ఉండాలి. లేకపోతే ఆయన ఇంటికి నేనే వెళతాను.

19110

ఎందుకంటే ఆయన బ్రాహ్మణుడు. నేను బ్రాహ్మణుడిని కాదు. ఆ ఆచారాలు నాకు ఎలా తెలుస్తాయి? ఔపోసన పట్టడం దగ్గరనుంచీ అన్నీ నేర్చుకోవాలి. నామీద నేను బ్రాహ్మణత్వాన్ని రుద్దుకోవాలి" అని చెప్పాను. 'ఆ... అవన్నీ ఎందుకండి? మీకు పిలకవిగ్గు పెట్టిస్తాం' అన్నారు నిర్మాత. 'ఆహా... చాలామంచి సలహా ఇచ్చారు. ఈ కేరెక్టర్ నేను వెయ్యను, మీరు వెళ్లవచ్చు' అని చెప్పాను. అంత నిరంకుశంగా ఉండే వాడిని. అప్పుడు రంగారావుగారు ఆ పాత్ర చేశారు. ఈ సినిమాకి బాపుగారిని దర్శకుడిగా పెట్టుకోవడానికి మరో కారణం కూడా ఉంది. ఆయనలాగా ఈ సినిమా తియ్యగలవారెవరూ లేరు. ఘంటాపథంగా ఈ విషయం చెప్పగలను. నాలుగు డైలాగులు రాసి చెప్పించగానే సరిపోదు. ఆచారాలు కళ్లముందు కదలాడాలి. జంధ్యం ఎలా ఉండాలి, కట్టుబొట్టు ఎలా ఉండాలి అనే చిన్న విషయాలను కూడా ఆయన జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఉదాహరణకు నిన్న మంగళహారతి ఇచ్చే సీన్ ఒకటి తీశారు. ఎవరో జూనియర్ ఆర్టిస్టులను పెట్టి ఆ సీన్ తీయవచ్చు. కానీ సహజత్వం ఉట్టిపడటం కోసం పెద్దింటి ముత్తయిదువలను పిలిపించి తీశారు. ఎంత పవిత్రంగా వారి ఆలోచనలు ఉన్నాయో చూడండి. హేట్సాఫ్ టు బాపు. ఈ సినిమాని ఇలా తీయగల ప్రజ్ఞ ఆయన ఒక్కరికే ఉంది. నా సెలక్షన్ తప్పుకానందుకు గర్విస్తున్నాను. మన తెలుగుజాతి సంస్కృతివికాస విధానానికి నివాళులు పట్టిన ప్రతీకలుగా మేమందరం నిలబడనున్నాం.


**సినిమా ప్రోగ్రెస్ ఏమిటండీ?**

85 శాతం చిత్రం పూర్తయింది. నవంబర్ 2 నుంచి 18 వరకూ జరిగే షెడ్యూల్‌తో పూర్తవుతుంది.

**తర్వాత టాపిక్ మళ్లిస్తూ...**

**మోహన్‌బాబు చిత్రంలో నటించడానికి కారణం ఏమిటి? అని అడిగాం.**

బయట చిత్రం ఒకటి చేస్తానని మీకు ముందే చెప్పాను. నా శ్రీమతి బసవతారకం పేరు మీద ఒక మెడికల్ ట్రస్ట్ ఏర్పాటుచేశాను. 'విశ్వామిత్ర' చిత్రం మీద వచ్చిన డబ్బు దానికి మళ్లించాలని అనుకున్నాను. కానీ ఆ చిత్రం బాగా ఆడలేదు. ప్రారంభించిన ఆ బిల్డింగ్ పాడుబడి అలాగే ఉంది. అందుకే నేను బతికుండగా నా డబ్బుతో పూర్తి చెయ్యాలని నా ఉద్దేశం. నేను అడిగితే చాలామంది డబ్బు ఇస్తారు. కానీ ఆమె నా సహధర్మచారిణి కనుక నా కృషితో ఆమెకొక జ్ఞాపిక ఏర్పాటు చెయ్యాలని ఆ బిల్డింగ్ మొదలుపెట్టాను. అందుకే బయట నిర్మాతలకు ఒక మంచి చిత్రం చేద్దామని నిర్ణయించుకున్నాను. బ్రదర్ మోహన్‌బాబుగారు 'అశోక' చిత్రంలో గెస్ట్‌గా నటించారు. ఒక్క పైసా కూడా పారితోషికం తీసుకోలేదు. అనురాగంతో, ఆప్యాయతతో మాటలలోనే కాదు, చేతలలో కూడా ఒక ఆప్తుడిగా వ్యవహరించారు. కనుక స్నేహానికి మించిన పెన్నిధిలేదు. అటువంటివాడిని నేనూ గౌరవించాలన్న భావనతో ఏదో ఒక ఉపకారం చెయ్యాలని అనుకున్నాను. నేను బయట ఒక చిత్రం చెయ్యాలని అనుకుంటున్నానని చెప్పగానే... 'అన్నగారూ



'శ్రీనాథ కవి సార్వభౌమ' చిత్రంలో ఎన్.టి.ఆర్., సుదర్శన్



'మేజర్ చంద్రకాంత్' చిత్రం షూటింగ్‌లో మోహన్‌బాబు, ఎన్.టి.ఆర్.

వేరే ఎవరికో ఎందుకు? మీతో సినిమా తియ్యాలన్నది నా లైఫ్ యాంబిషన్. నా చిత్రంలో నటించండి' అని అడిగారు. ఓ.కే. అన్నాను. నవంబరు 20 నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నాను.

**అందులో మీ కారెక్టర్ ఏమిటి?**

నీతికోసం, నిజాయితీకోసం, క్రమశిక్షణకోసం దేశభక్తితో మెలిగే దీక్షాపరుడయిన ఒక మిలటరీ ఆఫీసర్‌గా నటిస్తున్నాను.

**మీ గెటప్ స్టిల్స్ చూశాం. చాలా బాగున్నాయి. ఎంత అడిగినా ఆయన ఇవ్వలేదు?**

అవును ఇవ్వరు... బహుశా పాటల రికార్డింగ్ రోజున (ఈనెల 30) ఇస్తారనుకుంటాను. రికార్డింగ్‌కు నన్నూ రమ్మన్నారు. కానీ ఆ సమయానికి నేను అరకు లోయలో ఉంటాను. మనవాడు అడిగాడుకదా.. ఏదో రకంగా వీలుచేసుకుని వెళదామని అనుకున్నాను. కానీ ఆ రోజు వైజాగ్‌నుంచి మద్రాసుకు ఫ్లైట్ లేదట. 'తమ్ముడూ... సారీ, నేను రాలేకపోతున్నాను' అని మోహన్‌బాబుకి చెప్పాను. రికార్డింగ్ ముహూర్తంలో పాల్గొనలేకపోతున్నందుకు నాకూ విచారంగా ఉంది. నవంబరు 20న మా స్టూడియోలోనే షూటింగ్ ప్రారంభ మవుతోంది. నవంబరులో పది రోజులు, డిసెంబరులో 20రోజులు కాల్షీట్లు ఇచ్చాను. నా రికార్డంతా అంతే. 'బెబ్బులిపులి' కానీ, 'పాపారాయుడు' కానీ, 'జస్టిస్ చౌదరి' కానీ 30 రోజులు కాల్షీట్లు ఇచ్చాను. అలాగే ఈ సినిమాకి ఇచ్చాను. 30 రోజులలో షూటింగ్ అయిపో తుందని అనుకుంటున్నాను. జనవరికల్లా నేను ఫ్రీగా ఉంటాను. ఫిబ్రవరి నుంచి మరో రెండు ప్రాజెక్ట్ ప్రారంభించాలి.

**సోషల్ పిక్చర్‌లో మీకు పాటలు ఉంటాయని చాలామంది ఊహిస్తున్నారు?**

పాటల విషయం నాకు అంతగా తెలియదండి. మరి ఎన్ని ఉంటాయో? ఇది రిటైర్డ్ పాత్ర. యంగ్ కాదు. అయితే వారు చెప్పిన ప్రకారం భార్య కాన్సరుతో చనిపోయినప్పుడు ఒక పాట ఉండవచ్చని అనుకుంటు న్నాను. అదొక్కటే పాట. అదీ సెంటిమెంటల్ సాంగ్. ఏదన్నా యంగ్ క్యారెక్టర్ ఉంటే హీరోయిన్ చెంగు పట్టుకుని హుషారుగా గంతులు వెయ్యొచ్చు. (అని కన్నుగీటి నవ్వారు ఎన్.టి.ఆర్.)

**'శ్రీనాథ...' చిత్రంలో ఎన్ని పాటలు ఉంటాయి?**

నాకేమీ పాటలు లేవండి. 35 నుంచి 40దాకా పద్యాలు ఉన్నాయి. ఒక్క పద్యం పాటతో సమానంగా చెప్పుకోవాలి. ఇవికాక అయిదు పాటలు ఉన్నాయి. ■

# అంకితం



గెలాక్సీ ఎంటర్‌టైనర్స్ అధినేత రమణబాబుగారికి నేనన్నా, నా రచనలన్నా ఇష్టం. ఆయనంటే నాకూ ఎంతో గౌరవం, చనువు, అభిమానం, ఆత్మీయత... అన్నీను. మనసున్న మారాజుగా పేరొందిన రమణబాబుకు సినిమా గురించి ఎన్నో కొత్త ఆలోచనలు ఉన్నాయి. అష్టకష్టాలు పడి సినిమాలు తీసినా విడుదలయ్యాక నిర్మాత చేతిలో ఏమీ మిగలడం లేదు. అందుకే అటు నిర్మాతలకు, ఇటు పంపిణీ దారులకు, ప్రదర్శకులకు, ప్రేక్షకులకు ఉభయ తారకంగా నిలిచి మేలు చేకూర్చే ఓ కొత్త విధానానికి రమణబాబు శ్రీకారం చుట్టబోతున్నారు. చిత్ర పరిశ్రమకి ఎంతో ఉపయోగకరంగా నిలిచే ఆ విధానం ఏర్పాట్లలో ఆయన తలమునకలై ఉన్నారు.

ఇదిలా ఉంటే ఎన్.టి.ఆర్. 60 ఏళ్ల నట ప్రస్థానాన్ని అక్షరాల్లో పొదుగుతూ 'యుగానికి ఒక్కడు' పుస్తక రచన నేను ప్రారంభించి అప్పుడే మూడేళ్లు అయింది. ఈ మధ్యకాలంలో ఎందరో ప్రముఖుల్ని కలిశాను. నా ప్రయత్నాన్ని, అరుదైన సమాచారంతో, అద్భుతమైన ఫొటోలతో ఈ పుస్తకాన్ని తీసుకొస్తున్న వైనాన్ని వివరించాను. మంచి ప్రయత్నమని ప్రతి ఒక్కరూ అభినందించారే తప్ప ఆర్థిక పరమైన అభయ హస్తం ఎవరూ ఇవ్వలేదు. అన్ని హంగులతో తయారైన ఈ పుస్తకాన్ని క్వాలిటీ ప్రింటింగ్‌తో, అందంగా ముద్రించి ఎన్.టి.ఆర్. అభిమానులకు ఓ విలువైన కానుకగా అందించాలన్నది నా తపన. ఇప్పటికే విషయ సేకరణకు, ఫొటోలు సంపాదించడానికి ఎంతో డబ్బు ఖర్చుపెట్టిన నేను ఎవరో ఒకరు ముందుకు వచ్చి సాయపడితే తప్ప 'యుగానికి ఒక్కడు' పుస్తకాన్ని బయటకు తీసుకు రాలేను. నా ప్రయత్నాలన్నీ నిష్ఫలం కావడంతో ఇక పుస్తకాన్ని బయటకు తీసుకురాలేమోనన్న సందేహం కలిగింది కూడా. అటువంటి తరుణంలో ఆఖరి ప్రయత్నంగా రమణబాబుగారిని కలిశాను. ఆయన దగ్గర నాకు ఎంతో చనువు ఉన్నప్పటికీ ఏనాడూ నా పరిధి దాటి ప్రవర్తించలేదు. 'యుగానికి ఒక్కడు' పుస్తకాన్ని చూపించి నా ప్రయత్నాన్ని వివరించాను. రమణబాబుగారు ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా 'నేను మీకు అండగా ఉంటాను. ప్రొసీడ్ అవండి' అన్నారు. అంతేకాదు 'ఇంతమంచి పుస్తకాన్ని పాఠకుల ముందుకు తీసుకువెళ్లే అవకాశం నాకు రావడం చాలా ఆనందంగా ఉంది' అని మరో గొప్ప మాట కూడా అన్నారు.

మాట ఇవ్వడమే కాదు.. చివరివరకూ ఆ మాట మీదే నిలబడే గొప్ప గుణం కొంతమంది వ్యక్తులకే ఉంటుంది. అలాంటి వారిలో రమణబాబుగారు ఒకరని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతోనే 'యుగానికి ఒక్కడు' పుస్తకాన్ని నేను అనుకున్న విధంగా మీ ముందుకు తీసుకురాగలిగాను. నా కలలపంట మీ చేతుల్లో ఉండటానికి కారకులైన రమణబాబుగారి రుణం ఏమిచ్చి తీర్చుకోగలను!? అందుకే ఈ పుస్తకాన్ని ఆయనకు అంకితం ఇవ్వడం బాధ్యతగా భావిస్తున్నాను. ఆయనపట్ల నాకున్న కృతజ్ఞతాభావాన్ని చేతల్లో చూపించడానికి ఇంతకుమించి మంచి మార్గం నాకు తోచలేదు.

- వినాయకరావు.

# విషయ సూచిక


| | |
|---|---|
| కథానాయకుని కథ ...... | 29 - 51 |
| విశేషాలు ...... | 54 - 61 |
| స్టూడియోలో తొలిరోజు ...... | 64 - 66 |
| నిబద్ధత కలిగిన నిర్మాత ...... | 69 - 75 |
| జోహారు శిఖిపింఛమౌళి ...... | 78 - 82 |
| ఎన్.టి.ఆర్. - పౌరాణికాలు ...... | 85 - 89 |
| జానపద హీరో ...... | 92 - 94 |
| దుర్యోధనునికి డ్యూయెట్...... | 97 |
| వామహస్త అభయం వెనుక అసలు రహస్యం ...... | 99 |
| పూర్తిస్థాయి వృద్ధ పాత్రలు పోషించిన 'భీష్మ, బడిపంతులు' ...... | 103 - 108 |
| వెండితెరపై విప్లవజ్యోతి ...... | 109 - 114 |
| అయ్యారే.. అభినయ సమ్రాట్ ...... | 117 - 120 |
| ఆరుభాషల్లో రూపుదిద్దుకున్న 'అగ్గిరాముడు' ...... | 123 |
| తెలుగులో తొలి సోషియోఫాంటసీ చిత్రం 'దేవాంతకుడు' ...... | 124 - 128 |
| తొలి సైన్స్‌ఫిక్షన్ చిత్రం 'దొరికితే దొంగలు' ...... | 129 |
| విదేశాల్లో షూటింగ్ జరుపుకున్న తొలిచిత్రం 'సాహసవంతుడు' ...... | 131 - 133 |
| చారిత్రక చిత్రాలకు తలమానికం 'శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర' ...... | 134 - 138 |
| ఎన్.టి.ఆర్. నటజీవితాన్ని మేలి మలుపు తిప్పిన ఆ ఐదు చిత్రాలు ...... | 141 - 150 |
| ఫలించని ప్రయత్నం ...... | 151 |
| ఎన్.టి.ఆర్. చివరి జానపదం 'సింహబలుడు' ...... | 155 - 160 |
| చండశాసనుడు ...... | 161 - 163 |
| విజయానుబంధం ...... | 164 - 170 |
| సహనటులతో ఎన్.టి.ఆర్. ...... | 171 - 178 |
| నందమూరి నాయికలు ...... | 179 - 196 |
| 19 రోజుల్లో పూర్తయిన 'నాదేశం' ...... | 197 - 199 |
| ఎన్.టి.ఆర్. సెంటిమెంట్ ...... | 200 |
| నెహ్రూని ఆశ్చర్యపరచిన ఎన్.టి.ఆర్. ...... | 201 |
| మాదైవం ...... | 204 - 209 |
| 'తాతమ్మకల' కథ ...... | 210 |
| 'ఆటగాడు' ...... | 212 |
| దస్తూరి గుణాల కస్తూరి ...... | 214 |

# విషయ సూచిక



అదృష్ట జాతకుడు ........ 216 - 218
ఎన్.టి.ఆర్.తో ఆ దర్శకులు ........ 219 - 222
ఎన్.టి.ఆర్.తో ఆ హీరోలు ........ 223 - 233
ఎన్.టి.ఆర్. చివరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' ........ 236
విడుదలైన చివరి చిత్రం 'శ్రీనాథ కవిసార్వభౌముడు' ........ 238 - 240
మా (ఆ) ఇద్దరి కథ ........ 243 - 248
మా బావగారు 'ఛాలెంజ్ రాముడు' ........ 249 - 253
'టాక్సీరాముడు, సూపర్‌మేన్' అన్నీ ఆయనే ........ 254 - 256
నా కథానాయకుడు ........ 257 - 259
దటీజ్ ఎన్.టి.ఆర్. ........ 260 - 263
అభిమాన హీరోతో రాఘవేంద్రుడు ........ 264
'రాముడు- భీముడు'తో 'శ్రీకృష్ణ తులాభారం' ........ 266 - 268
'ఎదురులేని మనిషి', 'యుగపురుషుడు' ఆయనే! ........ 269 - 271
ఎన్.టి.ఆర్. గురించి ఆ ఇద్దరూ ........ 272 - 274
ఇది 'ప్రేమ సింహాసనం' ........ 275 - 278
ఆ రామన్నకు నేను హనుమంతుణ్ణి ........ 279 - 286
సరిలేరు నీకెవ్వరూ.. ........ 287 - 298
అన్నదమ్ముల అనుబంధం ........ 299
'మహాపురుషుడు' ........ 301 - 303
రజనీకి ప్రేరణ ఎన్.టి.ఆరే. ........ 304
నేనెందుకు దర్శకుణ్ణి అయ్యాను ........ 307 - 310
పేరు మార్చుకున్న సినిమాలు ........ 311
రిపబ్లిక్ గార్డెన్స్ ప్రత్యేకత ........ 312
రాముడు ఒక్కడే.. టైటిల్స్ ఎన్నో ........ 313
రామారావు సినిమాల్లో అంతర్నాటకాలు ........ 314 - 317
నందమూరి నటవారసులు ........ 319 - 321
మొఘల్- ఎ- ఆజం స్ఫూర్తితో 'అక్బర్ సలీం అనార్కలి' ........ 322
రంగుల చిత్రాల్లో రామారావు ........ 323 - 325
'దేశోద్ధారకులు' ప్రత్యేకత అదే! ........ 327 - 330
దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు దీటుగా ఎన్.టి.ఆర్. నేషనల్ ఫిలిం అవార్డ్ ........ 331
ఎన్.టి.ఆర్. నటించిన చిత్రాలు ........ 332 - 345

# ప్రారంభం

'నువ్వు చరిత్ర ఎందుకు చదువుకుని రాలేదు?' అని క్లాసులో టీచర్ ప్రశ్నిస్తే... 'ఇతరుల చరిత్ర నేను చదవను. నా చరిత్రే ఇతరులు చదవాలి' అని పదేళ్ల వయసు కలిగిన ఫ్రెంచ్ యోధుడు నెపోలియన్ బొనపార్టీ ఆత్మవిశ్వాసంతో సమాధాన మిచ్చాడట. చిత్తశుద్ధి, లక్ష్యసిద్ధి, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నందమూరి తారక రామారావు వ్యక్తిత్వానికి ఈ మాటలు ఎంతో వర్తిస్తాయి. తెలుగు టాకీ పుట్టడానికి ఎనిమిదేళ్ల ముందు ఆయన జన్మించారు. తెలుగు సినిమా వయసు సంతరించుకుంటున్న దశలో పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆయన దాని వ్యాప్తికి విశేషంగా కృషి చేశారు. అంతేకాకుండా ముందు తరాలకు నిరంతర ఆదర్శప్రాయునిగా నిలిచిన 'యుగ పురుషుడు' నందమూరి తారకరాముని విజయగాథ ప్రారంభం.



త్రివిక్రమరావు, తన చిన్ననాటి స్నేహితుడు
నారాయణరావుతో ఎన్.టి.ఆర్.



# కథానాయకుని కథ

**(ఎన్.టి.ఆర్. సినీ జీవిత చిత్రంలో కొన్ని రీళ్లు)**

నాలుగు దశాబ్దాలపాటు తెలుగు చిత్ర పరిశ్రమని మకుటంలేని మహారాజులా పాలించి, పుష్కరకాలం తెలుగునాట రాజకీయరంగాన్ని శాసించిన నందమూరి తారకరామారావు ఎంతో మందికి ఆరాధ్య నటుడు, కోట్లాది మంది ప్రజలకు అభిమాన నాయకుడు. రాజకీయంగా ఎన్.టి.ఆర్. అభిప్రాయాలతో ఏకీభవించనివారు ఉండవచ్చు కానీ ఎక్కడో మారుమూల పల్లెటూరైన నిమ్మకూరులో పుట్టిన ఒక సాధారణ రైతుబిడ్డ మహోన్నతశిఖరాలు అధిరోహించిన వైనాన్ని మాత్రం ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తారు. వ్యక్తిగా మొదలై వ్యవస్థగా ఎదిగిన మహానటుడు ఎన్.టి.ఆర్. జీవిత చిత్రంలోని కొన్ని రీళ్లు...

మే 28, 1923న రుద్రధ్గారి నామ సం॥ వైశాఖమాస శుద్ధ ఏకాదశి సోమవారం సాయంత్రం 4 గంటల 32 నిముషాలకు స్వాతి నక్షత్ర లగ్నంలో లక్ష్మయ్యచౌదరి, వెంకట రామమ్మ దంపతులకు జన్మించారు రామారావు. వెంకట రామమ్మకి ఆరాధ్యదైవం శ్రీకృష్ణుడు. తనకి కొడుకు పుడితే ఆ కృష్ణుడిపేరే పెట్టాలని ఆమె అనుకునేవారు. అయితే ఎన్.టి.ఆర్. పుట్టగానే 'మన ఇంట్లో ఆ తారకరాముడే పుట్టాడు' అని బావ రామయ్య ఆనందంతో అన్నారట. ఆయన మాట కాదనలేక కొడుకుకి తారక రామారావు అని పేరు పెట్టారు రామమ్మ. (అయితే తల్లిగారి కోరికను మన్నించి తన పిల్లలందరికీ 'కృష్ణ' పదం వచ్చేలా పేర్లు పెట్టారు రామారావు). ఈ బాల రాముణ్ని 'తారకం బాబు' అని ముద్దుగా పిలుచుకునేవారు.

రామయ్యగారికి పిల్లలు లేకపోవడంతో ఈ బాల రాముణ్ని ఆయన దత్తత తీసుకున్నారు. ఎక్కడకు వెళ్లినా తన భుజాలమీద తారకంబాబుని ఎక్కించుకుని తీసుకు వెళ్లేవారు. పెదబాలశిక్ష, బాల రామాయణం, భాస్కర


ఎన్.టి.ఆర్., తల్లి వెంకటరామమ్మ, త్రివిక్రమరావు

శతకం వంటివన్నీ ఎన్.టి.ఆర్.కి నేర్పింది రామయ్య గారే. బాలరామాయణం కంఠతా రావడంతో ఊళ్లో ఏ పండుగ జరిగినా, ఉత్సవం నిర్వహిస్తున్నా ఏడేళ్ల తారకంబాబు అక్కడికి వెళ్లి రామకథను శ్రావ్యంగా గానం చేసేవాడు. రామారావుకి పౌరాణిక పాత్రల పట్ల మక్కువ ఏర్పడటానికి, పురాణ పురుషునిగా పేరు తెచ్చుకోవడానికి తొలిబీజం చిన్ననాడే పడింది.

## 1933

నిమ్మకూరులో ఆ రోజులలో బడి లేదు. అందుకే నిడుమోలు గ్రామవాసి నెల్లూరు వెంకట సుబ్బారావు రోజూ ఆ గ్రామం నుంచి అయిదు కిలోమీటర్లు నడిచి వచ్చి నిమ్మకూరులో పిల్లలకి చదువు చెప్పి వెళ్లేవారు. ఆయన దగ్గర ఐదవ తరగతి వరకూ చదువుకున్న రామారావుని తీసుకుని విజయవాడ వచ్చేశారు రామయ్య, చంద్రమ్మ దంపతులు. మున్సిపల్ హైస్కూల్‌లో 6వ తరగతిలో చేర్పించారు.

కాలం సాఫీగా సాగిపోతే కావాల్సిందేముంటుంది. నిమ్మకూరులో నందమూరి లక్ష్మయ్య చౌదరి ఇంటి

పరిస్థితులు వక్రించాయి. అప్పులు చేసి కొన్న పొలాలకు ధరలు పడిపోయాయి. రుణాల బాధ పెరగడంతో పొలాలు అమ్మి, అప్పులు తీర్చాల్సి వచ్చింది. దాంతో లక్ష్మయ్యచౌదరి దంపతులు కూడా రెండో కుమారుడు త్రివిక్రమరావుని తీసుకుని విజయవాడ చేరారు. మిగిలినపొలాలను చూసుకోవడానికి నిమ్మకూరు వెళ్లిపోయారు రామయ్య.

**1940**

**ఎన్**.టి.ఆర్. స్కూల్ ఫైనల్ పాసయ్యారు. చదువులో ఆయన చూపే శ్రద్ధాసక్తులు గమనించిన ఆ తల్లిదండ్రులు ఆయన కోరుకున్నంతవరకు చదివించాల్సిందేనని నిర్ణయించుకున్నారు. ఫలితంగా 'శ్రీరాజా రంగయ్యప్పారావు (ఎస్.ఆర్.ఆర్) కాలేజీలో ఇంటర్‌లో చేరారు రామారావు. ఆ రోజుల్లో ఎన్.టి.ఆర్. ఖాకీ నిక్కరు, చొక్కా ధరించి హెర్క్యులిస్ సైకిల్‌మీద తిరిగేవారు. కాలేజీ వార్షికోత్సవాల్లో భాగంగా విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'రాచమల్లు దౌత్యం' నాటకంలో నాయకురాలు నాగమ్మ పాత్ర పోషించారు ఎన్.టి.ఆర్. అదే ఆయన తొలినాటక ప్రదర్శన.

**1941**

**ఎన్**.టి.ఆర్. మంచి చిత్రకారుడు కూడా. బొమ్మలు బాగా వేసేవారు. ఆనాటి బెజవాడలో జరిగిన ఆంధ్రరాష్ట్ర విద్యార్థి వైజ్ఞానిక్ మహాసభల్లో 'రైతు బంధన' పేరుతో రామారావు గీసిన చిత్రానికి ప్రథమ బహుమతి వచ్చింది. ఇంటర్ రెండో సంవత్సరంలోకి వచ్చారు రామారావు. కాలేజ్ యూనియన్‌కి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఆ ఏడాది వార్షికోత్సవాల్లో 'అనార్కలి' నాటకంలో సలీం పాత్ర పోషించారు. ప్రేక్షకుల మెప్పుతోపాటు కప్పు పొందారు. ఈ ఏడాదిలోనే రెండు నెలలపాటు రామారావు ముంబాయిలో ఉండాల్సి వచ్చింది. దీనివల్ల చదువులో వెనకబడ్డారు.

**1942**

**మే** 21న మేనమామ కుమార్తె బసవతారకంతో వివాహం జరిగింది. 'వివాహంతో విద్య నాశనం' అంటారు. అలాగే ఎన్.టి.ఆర్. ఒకసారి కాదు రెండు సార్లు ఫెయిల్ అయ్యారు. దాంతో పట్టుదల పెరిగి విజయవాడలో చేస్తున్న వ్యాపారాన్ని తమ్మునికి అప్ప



పదహారేళ్ల వయసులో ఎన్.టి.ఆర్.



శ్రీమతి బసవరామ తారకం, ఎన్.టి.ఆర్., కుమార్తె భువనేశ్వరి, కుమారులు బాలకృష్ణ, సాయికృష్ణ

గించి దీక్షగా చదివి పరీక్ష పాసయ్యారు.

**1943**

ఆ తర్వాత బి.ఎ. చదవడానికి గుంటూరులోని ఎ.సి కాలేజీలో చేరారు రామారావు. విజయవాడలో మకాం. ఉదయం ఏడున్నరకల్లా తయారై ఎనిమిదిన్నర రైలుకు బయలుదేరి గుంటూరు చేరేవారు. తిరిగి ఇంటికి వచ్చే సరికి రాత్రి పదిన్నర అయ్యేది. కాలం విలువను, క్రమ శిక్షణని నేర్పింది ఈ చదువు.

**1946**

విజయవాడ వ్యాపార కేంద్రంగా పేరు పొందినట్లే, గుంటూరు కళాకేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఎన్.టి. ఆర్. అభిరుచికి ఎ.సి. కాలేజీ వాతావరణం చక్కగా సరి పోయింది. ఆ తర్వాత కాలంలో సినీనటులైన జగ్గయ్య, కె.వి.ఎస్.శర్మ, వల్లభజోసుల శివరాం ఆ రోజుల్లో ఎన్.టి.ఆర్. క్లాస్‌మేట్స్. వీరందరూ మిత్రులయ్యారు.

ఎన్.టి.ఆర్.లో దాగివున్న కళాకారుడు బయటకు వచ్చిన తరుణమిది. కాలేజీ విద్యార్థులంతా కలిసి 'బలి దానం', 'ఆలీ ది కాబ్లర్', 'మల్లమ్మ ఉసురు' తదితర నాటకాలు ప్రదర్శించేవారు. రవీంద్ర నాథ్ ఠాగూర్ రాసిన త్యాగపూరిత నాటకం 'బలిదానం'లో మహారాజుగా ఎన్.టి.ఆర్. నటించేవారు. అలాగే 'ఆలీ ది కాబ్లర్'లో ఆలీగా జగ్గయ్య, సయ్యద్‌గా రామారావు నటించేవారు.

ఆ రోజుల్లో నవ్యజ్యోతి, నాట్యసమితి పేరుతో రెండు ఔత్సాహిక నాటక సమాజాలు ఉండేవి. ఈ రెంటిలోనూ రామారావు బృందం నాటకాలు ప్రదర్శించేవారు. ముక్కామల కృష్ణమూర్తి వీరికి మార్గ దర్శకులని చెప్పాలి. 'రాణాప్రతాప్' నాటకంలో ముక్కామల ప్రతాప్ పాత్రను, శివరాం శక్తిసింగ్ పాత్రను, దేశ భక్తునిగా జగ్గయ్య, కమాండర్ వేషాన్ని రామారావు పోషించే వారు. కొప్పరపు సుబ్బారావు రాసిన 'చేసినపాపం' నాటకాన్ని విజయవాడలో జరిగిన ఆంధ్రనాటక కళాపరిషత్‌లో ప్రదర్శించారు. రామారావు, జగ్గయ్య, రేడియో ఆర్టిస్ట్ మల్లికాంబ నటించారు. ప్రథమ బహుమతి వచ్చింది.

అలాగే 'నాయకురాలు' నాటకంలో రామారావు నలగామరాజు పాత్రను, మల్లికార్జునరావు (నటి శ్రీరంజని కుమారుడు, 'ప్రమీలార్జునీయం' దర్శకుడు) బాలచంద్రునిగా నటించారు. ఈ నాటకాన్ని చూడటానికి శ్రీరంజని భర్త నాగుమణి వచ్చారు. రామారావు అభినయం, పర్సనాలిటీ ఆయన్ని ఆకట్టుకున్నాయి.

ఆ సమయంలోనే దర్శకుడు సి.పుల్లయ్య 'గొల్ల భామ' చిత్రాన్ని ముగించి 'కీలుగుర్రం' తీయాలనే సంకల్పంతో ఉన్నారు. ఆ చిత్రానికి కొత్త నటీనటులు కావాలని గాలిస్తున్నారాయన. రామారావుని ఆయన దగ్గరికి తీసుకువెళ్లారు నాగుమణి. ఆయన ఫొటో తీసు కుని మద్రాసు వెళ్లగానే కబురుచేస్తామన్నారు పుల్లయ్య.

ఆ రోజుల్లోనే రంగస్థల నటుడు జంధ్యాల గౌరీ నాథశాస్త్రితో రామారావుకి పరిచయం ఏర్పడింది. ఆయ నకు ఎన్.టి.ఆర్. అంటే ఎంతో వాత్సల్యం. ప్రతి రోజూ పొద్దునే వచ్చి, రామారావుని బయటికి తీసుకెళ్లి కాఫీ తాగితేనే ఆయనకి తోచేదికాదు. అప్పట్లో ఆయన

'మహారథి కర్ణ' చిత్రం నిర్మించాలనే ప్రయత్నంలో ఉన్నారు. అందులో రామారావుతో ఒక పాత్ర వేయించాలని రోజూ రిహార్సల్స్ జరిపేవారు.

బి.ఎ.మొదటి సంవత్సరం పూర్తయింది. మొదటి ప్రయత్నంలోనే డిగ్రీ పూర్తి చేయాలనే పట్టుదలతో రామారావు చదువుతున్న తరుణంలో పుల్లయ్యగారి నుంచి పిలుపు వచ్చింది. 'కీలుగుర్రం' చిత్రానికి బదులు 'వింధ్యారాణి' చిత్రాన్ని తీస్తున్నానని, అందులో హీరో పాత్రకు ఎన్.టి.ఆర్.ని ఎంపిక చేశామని ఆయన ఉత్తరం రాశారు. ఆరు నెలలపాటు మద్రాసులో ఉండాలని ఆ ఉత్తరంలో పుల్లయ్య పేర్కొన్నారు. మొదటి సినిమా ఛాన్స్, అందులో హీరో వేషం... మరెవరైనా అయితే ఎగిరి గంతేసేవారేమో. కానీ చదువుమీద మనసు లగ్నం చేసిన రామారావు ఆ ఉత్తరాన్ని పట్టించుకోలేదు. కొన్నిరోజులు ఎదురుచూసి, పుల్లయ్యగారే రామారావుని వెతుక్కుంటూ విజయవాడ వచ్చేశారు. తను రాలేనని చెప్పేశారు రామారావు. ఆయన తండ్రి లక్ష్మయ్య చౌదరిని కలిసి అడిగారు పుల్లయ్య. 'వాడికి ఇష్టమైతే నాకు అభ్యంతరం లేదు' అన్నారు. అయినా రామారావు అంగీకరించలేదు. పుల్లయ్య నిరాశతో మద్రాసు తిరిగి వెళ్లిపోయారు.

ఈలోగా 'మహారథి కర్ణ' తీయాలనుకున్న గౌరీనాథ శాస్త్రి ఆ చిత్రాన్ని ఆపేసి 'గీతాంజలి' తీయడానికి మద్రాసు వెళ్లిపోయారు. అలా ఆదిలోనే రెండు సినిమా అవకాశాలను వదులుకున్నారు రామారావు.

## 1947

ఏప్రిల్ 11తో పరీక్షలు ముగిశాయి. విజయవాడ వచ్చేశారు రామారావు. అప్పటికి రెండు రోజులనుంచి రామారావుకోసం వెతుకుతున్నారు 'మణ్యం' అని అందరూ పిలుచుకునే సుబ్రహ్మణ్యం. రామారావు కనిపించగానే ఆయన్ని వెంటబెట్టుకుని దుర్గాకళా మందిరం దగ్గరికి తీసుకెళ్లారు. అప్పటికి రాత్రి పదకొండు గంటలైంది. దర్శకుడు ఎల్.వి.ప్రసాద్ ఆ సమయంలో 'రైతుబిడ్డ' సినిమా చూస్తున్నారు. ఆయన సారథి సంస్థకోసం 'శ్రీమతి' చిత్రాన్ని రూపొందించాలనే సంకల్పంతో ఉన్నారు. కొత్త నటీనటులను ఎన్నుకునేం దుకు ఆంధ్రా పర్యటనకు వచ్చారు. ఆ విషయం తెలిసి


ఎన్.టి.ఆర్. తొలి మేకప్ స్టిల్

రామారావుని ఆయన దగ్గరకు తీసుకెళ్లారు మణ్యం. రామారావుని చూసి సంతృప్తి చెంది మే నెలలో మేకప్ టెస్ట్ చేస్తామని, మద్రాసు రమ్మని చెప్పారు ప్రసాద్. రానుపోను ప్రయాణపు ఖర్చులు ఇస్తే మద్రాసుకి వస్తానని చెప్పి వచ్చేశారు రామారావు. తర్వాత ప్రసాద్ డబ్బు పంపించడంతో మే 21న మద్రాసు వెళ్లారు రామారావు. శోభనాచల స్టూడియోలో 'ద్రోహి' చిత్రం షూటింగ్ జరుగుతోంది. రామారావుకు మేకప్‌మన్ మంగయ్య మేకప్‌వేసిన తర్వాత స్టిల్స్, కొన్ని సన్ని వేశాలు చిత్రీకరించారు. రిజల్ట్ తర్వాత చెబుతామని చెప్పడంతో ఎన్.టి.ఆర్. విజయవాడ తిరిగి వచ్చేశారు.

కాలేజీ వదిలి పెట్టిన తర్వాత తారకరాముని దృష్టి మళ్లీ నాటకాల మీదకు మళ్లింది. తమ్మునితో ఆలోచించి 'నేషనల్ ఆర్ట్ థియేటర్' అనే సంస్థను నెలకొల్పి నాటకాలు ప్రదర్శించాలని నిర్ణయించారు. దీని నిర్వహణ బాధ్యత త్రివిక్రమరావుదే. నాటకకళలో అనుభవం గడించిన అట్లూరి పుండరీకాక్షయ్య నాటక

ప్రదర్శన కార్యకలాపాలను పర్యవేక్షించేవారు. తన సహాధ్యాయి జగ్గయ్య, డిగ్రీ పూర్తయిన తర్వాత దుగ్గిరాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆయనని సంప్రదించడంతో ఎన్.ఎ.టి.లో సభ్యుడు కావడానికి సంతోషంగా అంగీకరించారు. కె.వి.ఎస్.శర్మ విజయవాడలోనే ఉన్నారు. మిత్రులందరూ మళ్లీ ఒకచోట చేరి నాటకాలను ప్రదర్శించడం ప్రారంభించారు. రామారావు అభిరుచికి, ఆవేశానికి తగ్గ కథాంశాలను ఎన్నుకుని నాటకాలను ప్రదర్శించేవారు.

నాటకాల ప్రదర్శనకు కొన్ని నిబంధనలు ఏర్పాటు చేశారు రామారావు. ఇందులో నటీనటులు ఎవరి ఖర్చులు వారే భరించుకోవాలి. తమకు అప్పగించిన పనులను చేసి తీరాలి. క్రమశిక్షణతో అంతా మెలగాలి. సొంతలాభాలు, ప్రయోజనాలు ఆశించకూడదు. మంచి పనులకు, ప్రజాభ్యుదయానికి ఈ సంస్థ ఉపయోగపడాలి. ఈ నిబంధనలకు సభ్యులందరూ అంగీకరించారు. ఆ రోజుల్లో విజయవాడలోని వెలిదండ్ల గ్రంథాలయం, రామమోహన గ్రంథాలయాల్లో నాటకాలు ప్రదర్శించేవారు. కరెంట్ ఖర్చులకు రూపాయి ఎనభై పైసలు, కరపత్రాలకు రూపాయి ఇరవై పైసలు అయ్యేది. అంటే మూడు రూపాయలు ఉంటే చాలు నాటకం ప్రదర్శించేవారన్నమాట.

నేషనల్ ఆర్ట్ థియేటర్ తొలి ప్రదర్శన 'వేనరాజు విప్లవం'. ఇందులో భృగుమహర్షిగా జగ్గయ్య, వేనరాజుగా రామారావు, దుష్టకర్మగా కె.వి.ఎస్.శర్మ నటించారు.

రాజు వేషం అంటే ఖరీదైన సిల్క్ పంచె కావాలి. కానీ దానిని కొనడానికి సంస్థలో డబ్బులు లేవు. ఏం చేయాలో తోచక చివరికి తల్లిగారి జరీచీరను ఎవరికీ తెలియకుండా రామారావు తీసుకు వచ్చేశారు. తీరా నాటకం ప్రదర్శన రోజున ప్రేక్షకుల్లో ఎదురుగా వెంకట రామమ్మగారు కూర్చొని ఉన్నారు. దాంతో కాళ్లలో ఒకటే వణుకు. ఎలాగో నాటకాన్ని పూర్తిచేసుకుని



స్నేహితులతో ఎన్.టి.ఆర్.



మనదేశం చిత్రంలో నాగయ్య, ఎన్.టి.ఆర్. తదితరులు

ఇంటికి చేరగానే వెంకట రామమ్మగారు పట్టుకున్నారు. కొడుకుని ఏమీ తిట్టలేదు సరి కదా ఆయన నటనని అభినం దించి, ఆ చీర ఉంచేసుకోమని చెప్పారు.

**1948**

నాటక ప్రదర్శనలు జరుగుతున్నా, వ్యక్తిగా తన ధర్మాన్ని మాత్రం మరిచిపోలేదు రామారావు. చిన్న చిన్న ఉద్యో గాలు చేస్తుండేవారు. విజయ వాడలోని సబ్ కోర్టులో కూడా కొన్ని రోజులు పనిచేశారు.

ఆ రోజుల్లోనే మద్రాసు సర్వీస్ కమీషన్ సబ్ రిజిస్ట్రార్ సెలెక్షన్స్ ప్రకటించింది. అప్పటికి 25 ఏళ్లు రావడంతో మరో ఏడాది దాటితే ప్రభుత్వ ఉద్యోగాలు రావేమోనని భయంతో దరఖాస్తు చేశారు రామారావు. దాదాపు 937మంది దరఖాస్తు చేస్తే ఏడుగురు మాత్రమే ఎంపిక య్యారు. వారిలో ఎన్.టి.ఆర్. ఒకరని వేరే చెప్పనక్కర లేదుగా. నెలకు 190 రూపాయల జీతానికి ఆయన గుంటూరులో సబ్ రిజిస్ట్రార్‌గా చేరారు.

సినిమా అవకాశాలను, మద్రాసుని మరిచిపోయి రామారావు హాయిగా ఉద్యోగం చేసుకుంటున్న తరుణంలో ఒకరోజు ఎల్.వి.ప్రసాద్ నుంచి ఉత్తరం వచ్చింది. సారథివారు 'శ్రీమతి' చిత్రాన్ని తీయడం లేదని, నటి కృష్ణవేణి నిర్మిస్తున్న 'మనదేశం' చిత్రానికి పనిచేస్తున్నానని రాశారు. ఆ సినిమాలో హీరో పాత్ర కాకుండా మరో మంచిపాత్ర ఉందని ఆ ఉత్తరంలో పేర్కొన్నారు ప్రసాద్.

ఆ ఉత్తరాన్ని రామారావు పట్టించుకోలేదు. చిన్న వేషం వేయడం ఆయనకి ఇష్టం లేదు. సినీ రంగంలోకి అడుగుపెట్టడం కంటే తన నటనా సామర్థ్యం చూపించ డానికి వీలైన పాత్రతోనే ప్రవేశించడం ముఖ్యమని ఆయన నమ్మేవారు. కొన్ని రోజుల తర్వాత మరో కవరు వచ్చింది ప్రసాద్ నుంచి. అందులో రెండు ఉత్తరాలు ఉన్నాయి. ఒకటి ఎల్.వి.ప్రసాద్, మరొకటి బి.ఎ.సుబ్బా రావు రాసినవి. 'పల్లెటూరి పిల్ల' చిత్రంలో జయంత్ అనే ముఖ్యపాత్రకు రామారావుని ఎన్నుకున్నామనీ, మద్రాసుకు రమ్మనీ సుబ్బారావు రాశారు. ప్రసాద్ చేసిన మేకప్ టెస్ట్, స్టిల్స్ చూసి ఆయన ఈ ఆఫర్ ఇచ్చారు. మంచి అవకాశం వదులుకోవద్దని ప్రసాద్ రాశారు. రామారావు ఆలోచనలో పడ్డారు. అప్పటికి ఉద్యోగంలో చేరి మూడు వారాలే అయింది. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకుని వెళితే ఫలితం ఎలా ఉంటుందోనని సందేహం. ఈ విషయం ఆఫీసులో తెలిసి చాలామంది వెళ్లమని సలహా ఇచ్చారు. తమ్ముడు త్రివిక్రమరావు కూడా ప్రోత్సహించడంతో మద్రాసు పయనమయ్యారు రామారావు.

రామారావుని నటి, నిర్మాత కృష్ణవేణికి పరిచయం చేశారు ప్రసాద్. ఆమె అభినందించి, రెండు వేల రూపాయలు పారితోషికంగా ఇస్తామని చెప్పి, రెండు వందల రూపాయల అడ్వాన్స్ చెక్కు ఇచ్చారు. అలా మొదలైంది ఎన్.టి.ఆర్. సినీ జీవితం. ఆ సమయం లోనే వీరేశలింగం పంతులు వర్ధంతి ఉత్సవాల సందర్భంగా ఎల్.వి.ప్రసాద్ ప్రోత్సాహంతో 'బలత్కార గాన వినోదిని' ప్రహసనాన్ని మద్రాసులో ప్రదర్శించింది


ఎన్.టి.ఆర్. బృందం. దానిని చూసిన సినిమా పెద్దలు ఆయన్ని ప్రశంసించారు.

**1949**

తొలిచిత్రం 'మనదేశం' విడుదలైంది. హీరోగా ఎన్.టి.ఆర్. నటించే రెండు చిత్రాలు 'పల్లెటూరి పిల్ల', 'షావుకారు' ప్రారంభమయ్యాయి. ఈ రెండు చిత్రాల్లో అవకాశాలు రావడానికి పరోక్ష కారకుడు ఎల్.వి.ప్రసాద్.

**1950**

ఎన్.టి.ఆర్. సినీ జైత్రయాత్ర ఈ సంవత్సరంలోనే ప్రారంభమై మూడున్నర దశాబ్దాలపాటు అజేయంగా సాగింది. ఈ ఏడాది ఆయన నటించిన చిత్రాలు నాలుగు విడుదల కావడం, అందులో రెంటిలో ఎ.ఎన్.ఆర్.తో కలిసి నటించడం విశేషంగా పేర్కొనాలి. అలాగే ఆయన తొలి పౌరాణిక చిత్రం 'మాయారంభ' ఈ సంవత్సరంలోనే విడుదలైంది. అదేవిధంగా రెండేళ్లపాటు బయట ఏ చిత్రంలో నటించకుండా విజయా సంస్థకే పరిమితమవుతూ ఒప్పందం కుదుర్చుకున్నారు ఎన్.టి.ఆర్. ఈ ఒప్పందం ప్రకారం మొదటి ఏడాది నెలకు 500 రూపాయల జీతం, సినిమాకు ఐదువేల రూపాయల పారితోషికం. రెండో ఏడాది నెలకు 750 రూపాయలు, సినిమాకి 7,500 రూపాయలు.



మల్లీశ్వరి షూటింగ్‌లో బి.ఎన్.రెడ్డి, భానుమతితో ఎన్.టి.ఆర్.

**1951**

ఈ ఏడాది ఎన్.టి.ఆర్. నటించిన సినిమాలు 'పాతాళభైరవి', 'మల్లీశ్వరి' తెలుగు, తమిళ భాషల్లో విడుదలయ్యాయి. విజయావారి 'పాతాళభైరవి' అత్యద్భుత విజయం సాధించి తెలుగు సినిమా వసూళ్ళ సామర్థ్యాన్ని అనూహ్యంగా పెంచింది. మొదటి బ్యాచ్‌లో అత్యధికంగా 13 ప్రింట్లతో ఈ చిత్రం విడుదలై, తొలిసారిగా 10 కేంద్రాల్లో శతదినోత్సవం, 4 కేంద్రాల్లో రజతోత్సవం జరుపుకొంది. ద్విశతదినోత్సవం జరుపుకొన్న తొలి తెలుగు చిత్రంగా నిలిచింది. భారీ వ్యయంతోనే కాకుండా కళాత్మక, సాంకేతిక విలువల మేళవింపుతో రూపొందిన ఈ చిత్రం తెలుగు సినిమా నిర్మాణసరళిని మార్చివేసింది. హీరో పాత్రలకు సూపర్ నేచురల్ పవర్స్ ఆపాదించి హీరోయిజం చూపించడం ఈ చిత్రంతోనే ఆరంభమైంది. అలాగే భానుమతి, ఎన్.టి.ఆర్.తో బి.ఎన్.రెడ్డి రూపొందించిన 'మల్లీశ్వరి' చిత్రం దేశవిదేశాల్లో కళాప్రియుల ప్రశంసలు అందుకుంది. నేటికీ తెలుగు సినిమా కళాఖండాలలో ఈ చిత్రం అగ్ర తాంబూలం అందుకొంటూనే ఉంది.

**1952**

విజయా సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం గడువు పూర్తయ్యింది. ఈ ఏడాది బయటి సంస్థల్లో కూడా నటించారు ఎన్.టి.ఆర్. ఆయన నటించిన చిత్రాలు ఆరు విడుదలయ్యాయి. ఇందులో రెండు తమిళం, ఒక




హిందీ చిత్రం ఉండటం విశేషం. విజయావారి 'పెళ్లిచేసి చూడు' చిత్రం ఘనవిజయం సాధించి రజతోత్సవం జరుపుకొంది. హాస్య ప్రధానంగా రూపొందే చిత్రాలకు ఈ సినిమా ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. సాంఘిక చిత్రాల హవా మొదలైంది కూడా ఈ చిత్రంతోనే. అంతవరకూ మధ్యవయసున్న సాంఘిక హీరో పాత్రల చుట్టూ పరిభ్రమించిన తెలుగు సినిమా ఈ చిత్ర విజయంతో యుక్తవయస్సు హీరో పాత్రలకు నాంది పలికింది.

అలాగే రాయలసీమలో క్షామ నివారణ నిధికోసం నాటకాల ద్వారా డబ్బుని సేకరించడానికి 24 రోజుల పాటు 40 మంది ఆర్టిస్టులందరినీ తీసుకుని ఆంధ్ర దేశం పర్యటించారు రామారావు. ఒక పక్క నాటక ప్రదర్శన జరుగుతుంటే మరోపక్క జనంలోకి వెళ్లి జోలి పట్టేవారు రామారావు. ఒక సినీనటుడు జనం మధ్యకు వెళ్లి జోలి పట్టి నిధులు వసూలు చేయడం భారతీయ చలనచిత్ర చరిత్రలో అదే ప్రథమం. ఇదే యేడాది సొంత నిర్మాణ సంస్థను నెలకొల్పి 'పిచ్చిపుల్లయ్య' నిర్మాణం ప్రారంభించారు.

## 1953

ఈ ఏడాదిలో ఎన్.టి.ఆర్. నటించిన చిత్రాల సంఖ్య ఆరు. వీటిల్లో 'అమ్మలక్కలు' చిత్రం తెలుగు, తమిళ భాషల్లో రూపుదిద్దుకుంది. 'చండీరాణి' మూడు భాషల్లో తయారైంది. తను చదువుకున్న ఎస్.ఆర్.ఆర్, సి.వి.ఆర్. కాలేజీ సహాయార్థం నిధి సేకరించి ఇచ్చారు. అలాగే గోదావరి వరద బాధితుల సహాయార్థం నిధి వసూలు చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలో కర్నూలులో నిధి వసూలుచేసి, ప్రభుత్వానికి ఇచ్చారు.

## 1954

ఈ ఏడాదిలో ఎన్.టి.ఆర్. నటించిన చిత్రాల సంఖ్యపెరిగి 11కి చేరుకుంది. ఇందులో తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన చిత్రాలు రెండు ఉన్నాయి. ఆయన తొలిసారిగా కృష్ణుని గెటప్‌లో కనిపించిన 'ఇద్దరు పెళ్లాలు' చిత్రం ఈ ఏడాది విడుదలైంది. అలాగే ఎన్.ఎ.టి. బేనరుపై నిర్మించిన 'తోడుదొంగలు'కి రాష్ట్రపతి అవార్డ్ లభించింది. రెండు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ చిత్రం కూడా విజయవంతం కాకపోవడంతో ఎన్.టి.ఆర్. నిరాశ చెందారు.

## 1955


విజయావారి 'మిస్సమ్మ' చిత్ర విజయంతో ఎన్.టి.ఆర్.కి ఈ ఏడాది ప్రారంభమైంది. పూర్తి వినోద భరితమైన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

అలాగే ఎన్.ఎ.టి. వారి తొలి జానపదం 'జయసింహ' విజయవంతమై ఎన్.టి.ఆర్.లో ఉత్సాహాన్ని నింపింది. మాయలు, మంత్రాలు లేకుండా విజయం సాధించిన తొలి జానపద చిత్రంగా 'జయసింహ' చరిత్ర కెక్కింది. ఆ తర్వాత గురజాడ వారి 'కన్యాశుల్కం' సినిమాలో నెగెటివ్ టచ్ కలిగిన గిరీశం పాత్రను అద్భుతంగా పోషించి పేరు తెచ్చుకున్నారు. 'మిస్సమ్మ' తర్వాత ఎ.ఎన్.ఆర్.తో కలిసి నటించిన మరో చిత్రం 'పరివర్తన' కూడా ఈ ఏడాదే విడుదలైంది. ఇందులో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రను ఎన్.టి.ఆర్. అద్భుతంగా పోషించారు.




## 1956

ఈ ఏడాది ఎన్.టి.ఆర్. కెరీర్‌లో చాలా ప్రత్యేక మైనదిగా పేర్కొనాలి. ఆయన కృష్ణునిగా, రామునిగా అంతర్నాటకాలలో కనిపించిన సంవత్సరమిదే. అయితే 'సొంతవూరు' చిత్రంలో ఆయన పోషించిన కృష్ణ పాత్రకు ఇచ్చిన ఆహార్యం ప్రేక్షకులకు రుచించలేదు. 'చరణదాసి' చిత్రంలో తొలిసారిగా ఆయన రాముని గెటప్‌లో కనిపించారు. ఈ చిత్ర నిర్మాత ఎ.శంకరరెడ్డి ఆ తర్వాత ఎన్.టి.ఆర్.తో 'లవకుశ' నిర్మించడానికి ఈ గెటప్ ప్రేరణ అయింది.


'చరణదాసి'లో రామునిగా ఎన్.టి.ఆర్.

## 1957

ఎన్.టి.ఆర్.ని వెండితెర వేలుపుగా చేసిన సంవత్సరమిది. విజయావారి 'మాయాబజార్' చిత్రం అగ్రశ్రేణి తారలతో, భారీ స్థాయిలో సాంకేతిక విలువలతో రూపొంది ఘనవిజయం సాధించింది. నేటికీ తెలుగు సినిమా ప్రతిష్ఠకు మోడల్‌గా నిలిచి నాటి నుంచి నేటి వరకు విశేష ప్రజాదరణ పొందుతోంది. ఈ చిత్రం



'భూకైలాస్' చిత్రంలో
ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్, ఎస్.వి.ఆర్.

ద్వారా తొలిసారి కృష్ణ పాత్ర ధరించిన ఎన్.టి.ఆర్. ఆ తర్వాత పౌరాణిక చిత్రాలకు ప్రపంచంలోనే సాటిలేని మేటిగా చరిత్ర సృష్టించడానికి ఇది శుభారంభమైంది. ఆ రోజుల్లోనే ఎన్.టి.ఆర్. కృష్ణుని గెటప్‌తో ఉన్న ఈ చిత్రం క్యాలండర్లు ఐదు లక్షలు విజయాసంస్థ ప్రెస్ నుండే అధికారికంగా అమ్ముడైనట్లు సంస్థ అధినేతల్లో ఒకరైన నాగిరెడ్డి పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఒక సినిమా నటుని బొమ్మను పత్రికలు, పోస్టర్స్ నుండి పూజామందిరాల స్థాయికి తీసుకెళ్ళిన ఘనత 'మాయా బజార్'కు దక్కుతుంది. ఈ ఏడాదిలోనే మరోసారి కృష్ణుని పాత్రను 'వినాయకచవితి' చిత్రంలో పోషించారు ఎన్.టి.ఆర్. రచయిత సముద్రాల సీనియర్ ఈ సినిమాతో దర్శకుడయ్యారు. అలాగే ఎన్.టి.ఆర్.ని మహోన్నత నటునిగా నిలిపిన 'పాండురంగ మహాత్మ్యం' చిత్రం కూడా ఈ ఏడాదే విడుదలైంది.

### 1958

అటు రామునిగా, ఇటు రావణునిగా.. ఏ పాత్ర ధరించినా తనకుతానే సాటి అని ఎన్.టి.ఆర్. నిరూపించిన సంవత్సరమిది. తమిళంలో రూపొందిన 'సంపూర్ణ రామాయణం' చిత్రాన్ని తెలుగులోకి డబ్ చేశారు. ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్.కు చుండ్రు సూర్య నారాయణ డబ్బింగ్ చెప్పడం విశేషం. అలాగే ఆయన తొలిసారిగా రావణుని పాత్ర పోషించిన 'భూకైలాస్' చిత్రంలో ఎ.ఎన్.ఆర్. నారదునిగా నటించారు.

### 1959

తెలుగులో పూర్తి రంగులతో నిర్మించే 'లవకుశ' చిత్రం ఈ ఏడాదే ప్రారంభమైంది. ఒక తెలుగు నిర్మాత నిర్మిస్తున్న తొలి రంగుల చిత్రమిది. దాంతో ఫిబ్రవరి 5న వాహినీ స్టూడియోలో జరిగిన ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి అక్కినేని నాగేశ్వరరావు,



నాగిరెడ్డి, చక్రపాణి తది తరులు హాజరయ్యారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాలుగేళ్ల అనం తరం కానీ 'లవకుశ' విడుదల కాలేదు. ఎన్.టి.ఆర్., జయశ్రీ (నటి జయచిత్ర తల్లి) జంటగా సగానికి పైగా సన్ని వేశాలను రంగుల్లో చిత్రీక రించి విడుదల చేసిన 'దైవ బలం' సినిమా ఈ ఏడాదే విడుదలైంది. ఈ సినిమాతోనే శోభన్‌బాబు తెరకు పరిచయ మయ్యారు.



**1960**

పురాణ పురుషునిగా ప్రశంసలందుకుంటున్న ఎన్.టి.ఆర్. కలియుగదైవం వెంకటేశ్వరస్వామి పాత్రను పోషించిన 'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం' చిత్రం విడుద లైన సంవత్సరమిది. ఈ సినిమాకోసం వాహినీ స్టూడియోలో కళా దర్శకుడు ఎస్.వి.ఎస్.రామారావు తిరు పతి ఆలయం సెట్ వేశారు. ఇందులో ఏర్పాటు చేసిన శ్రీవారి విగ్రహానికి నిత్య పూజలు జరిగేవి. షూటింగ్ పూర్తయిన కొన్ని నెలలవరకూ ఆ సెట్‌ని అలాగే ఉంచేశారు. ఆంధ్రదేశం నుంచి వచ్చే టూరిస్టులు ఈ సెట్‌ని సందర్శించేవారు.

ఆ రోజుల్లో 'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం' చిత్రం ప్రదర్శించిన థియేటర్లన్నీ ఆలయాలుగా మారిపోయా యనడం అతిశయోక్తికాదు. దేవుని విగ్రహాలు థియే టర్లలో ఏర్పాటు చేయడమనే సంప్రదాయం ఈ సినిమాతోనే ప్రారంభమైంది. తిరుపతి వెళ్లలేని జనం ఈసినిమా ప్రదర్శిస్తున్న థియేటర్లకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుని కర్పూర హారతులు వెలిగించేవారు. కొబ్బరికాయలు కొట్టేవారు. ఆ తర్వాత చెప్పులు లేకుండా థియేటర్లలోకి వెళ్లేవారు. జనం డబ్బులు వేస్తున్న విషయం తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీకి తెలియడంతో వారి ఆదేశానుసారం హుండీలు ఏర్పాటు చేశారు. ఆ హుండీల్లో 46 వేల రూపాయలు



'గుండమ్మకథ'లో ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్.

రాగా మరో నాలుగు వేలు కలిపి దేవస్థానానికి విరాళంగా ఇచ్చారు పుల్లయ్య. యాత్రికుల సౌకర్యార్థం ధర్మసత్రాల నిర్మాణ వ్యయంలో ఈ మొత్తాన్ని కూడా ఉపయోగించాలని ఆయన కోరారు. ఈ ఏడాది ఎన్.టి.ఆర్. పది చిత్రాల్లో నటించగా, జంపన దర్శకత్వంలో తయారైన 'కాడెద్దులు.. ఎకరం నేల' చిత్రం కొన్ని కేంద్రాలలో కేవలం ఒకే ఒక్కరోజు ఆడటం గమనార్హం.

### 1961

ఎన్.టి.ఆర్.ని దర్శకునిగా ఆవిష్కరించిన సంవత్సరమిది. 'సీతారామకళ్యాణం' చిత్రంతో మరోసారి రావణబ్రహ్మ పాత్రను పోషించడమే కాకుండా ఆ చిత్రానికి దర్శకత్వం వహించారు. అయితే టైటిల్స్‌లో పేరు వేసుకోలేదు. ఈ చిత్రం ఘనవిజయం సాధించడమే కాదు అవార్డులూ పొందింది. అలాగే ఎన్.టి.ఆర్. తొలి రీమేక్ చిత్రం 'కలసి ఉంటే కలదు సుఖం' కూడా ఈ ఏడాదే విడుదలైంది.

తమిళంలో శివాజీగణేషన్, బి.సరోజాదేవి నటించిన 'భాగ పిరవివై' చిత్రం దీనికి మూలం.

ఈ సినిమాలో కాలు, చేయి వంకరపోయిన వ్యక్తిగా ఎన్.టి.ఆర్. అద్భుతంగా నటించారు. ఇందులో సావిత్రి నాయికగా అభినయించారు.

### 1962

**100** చిత్రాలను పూర్తి చేసుకోవడమే కాకుండా విభిన్న చిత్రాల్లో నటించి, విజయవంతమైన హీరోగా ఆయనకు పేరు తెచ్చిన సంవత్సరమిది. 'గులేబకావళి కథ', 'భీష్మ', 'దక్షయజ్ఞం', 'గుండమ్మ కథ', 'మహామంత్రి తిమ్మరుసు', 'రక్తసంబంధం', 'ఆత్మబంధువు' వంటి చిత్రాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. అలాగే చేతికి అంది వచ్చిన పెద్దకొడుకు రామకృష్ణ అకాల మరణం పొందారు. లయకారుడైన శివుని పాత్రను పోషించడం వల్లే ఇలా జరిగిందని కొందరు అనడంతో చాలాకాలం ఆ పాత్ర జోలికి మళ్లీ


వెళ్లలేదు ఎన్.టి.ఆర్.

ఈ ఏడాదిలో విడుదలైన 'గుండమ్మకథ' ఎన్.టి.ఆర్. నూరవ చిత్రం. ఈ చిత్రంతో ఎన్.టి.ఆర్. స్థాయితోపాటు పారితోషికం కూడా పెరిగింది. అత్యధిక పారితోషికం తీసుకునే ఏకైక హీరోగా ఎదిగారు.

'గులేబకావళి కథ'కు కూడా ఎన్.టి.ఆరే దర్శకత్వం వహించారు. ఇందులో కూడా పేరు వేసుకోలేదు. ఎన్.టి.ఆర్. దర్శకత్వంలో రూపొందిన ఏకైక జానపద చిత్రమిది.

### 1963

తొలిసారిగా ఈ ఏడాది ఆయన చిత్రాలు రికార్డ్ స్థాయిలో 14 విడుదలయ్యాయి. ఇందులో నాలుగు పౌరాణికాలు ('శ్రీ కృష్ణార్జున యుద్ధం', 'వాల్మీకి', 'లవకుశ', 'నర్తనశాల'). జానపద చిత్రం 'బందిపోటు' ఉండగా మిగిలినవి సాంఘికాలు. తెలుగులో పూర్తి రంగుల చిత్రంగా లలితా శివజ్యోతి వారి 'లవకుశ' విడుదలై నభూతో నభవిష్యత్ అన్న రీతిలో సంచలన విజయం సాధించింది. తొలి విడతలో 26 ప్రింట్లతో విడుదలై 26 కేంద్రాల్లో 150 రోజులు, 14 కేంద్రాల్లో




'రాముడు-భీముడు' చిత్రంలో ఎల్.విజయలక్ష్మి, ఎన్.టి.ఆర్.




రజతోత్సవం జరుపుకోవడమే కాకుండా 470 రోజులు ప్రదర్శింపబడి చరిత్ర సృష్టించింది. పత్రికల్లో కలెక్షన్లు ప్రకటించిన తొలి దక్షిణాది చిత్రంగా చరిత్ర కెక్కింది. 100 రోజులకు 25 లక్షల రూపాయలు, 365 రోజులకు కోటి రూపాయలను నాటి ఇరవై ఐదు పైసలు, రూపాయి టిక్కెట్లపై వసూలు చేసింది. ఆర్టిస్టుగా డిమాండ్ పెరగడంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా పని చేసేవారు రామారావు. అయితే ఎంత డిమాండ్ ఉన్నా వచ్చిన అవకాశాలన్నీ ఒప్పుకొని దర్శక నిర్మాతలను ఇబ్బందిపెట్టలేదు. చైనా దురాక్రమణ సమయంలో దేశానికి అండగా నిలబడి, రక్షణ నిధికోసం ప్రదర్శనలు ఇచ్చారు రామారావు.

### 1964

ఈ ఏడాది 16 చిత్రాల్లో నటించారు ఎన్.టి.ఆర్. ఆయన తొలి ద్విపాత్రాభినయ చిత్రం 'రాముడు-భీముడు' విడుదలైంది. అలాగే ఆయన ద్విపాత్రాభి నయం చేసిన మరో చిత్రం 'అగ్గిపిడుగు' పత్రికల్లో ఓపెనింగ్ కలెక్షన్లకు శ్రీకారం చుట్టింది. భారీ చిత్ర

నిర్మాణ వ్యయం రూ. 5 లక్షలకు పైగా అవుతున్న రోజుల్లో ఈ చిత్రం మొదటివారంలోనే రూ. 5 లక్షలు గ్రాస్ వసూలు చేసింది.


ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి ఎన్.టి.ఆర్. లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తం విజయవాడ అగ్నిబాధితుల సహాయార్థం వినియోగించారు. ఈ ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లోని తొలి 70ఎం.ఎం థియేటర్ నిర్మాణానికి హైదారబాద్‌లో శ్రీకారం చుట్టారు ఎన్.టి.ఆర్.




### 1965

ఈ ఏడాది 12 చిత్రాల్లో నటించారు ఎన్.టి.ఆర్. 'పాండవ వనవాసం'లో భీమునిగా, 'సత్యహరిశ్చంద్ర'లో హరిశ్చంద్రునిగా, 'ప్రమీలార్జునీయం'లో అర్జునునిగా, 'వీరాభిమన్యు'లో కృష్ణునిగా, ఇలా ఒకే ఏడాది విభిన్న పౌరాణిక భూమికలను పోషించి తనకి తానే సాటి అనిపించుకున్నారు.

పోలీసు కుటుంబాల సంక్షేమనిధి కోసం వినోద ప్రదర్శనలు ఇచ్చి, పెద్ద మొత్తం వసూలు చేశారు. అలాగే రక్షణనిధిని భారీ ఎత్తున వసూలు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం అనుమతి పొంది, పరిశ్రమకి





చెందిన 250 మందితో ఆంధ్రదేశం అంతటా పర్యటించారు. గుట్టలు గుట్టలుగా వచ్చిన బంగారు నగలతోపాటు ఎనిమిది లక్షల రూపాయలను హైదరాబాద్‌లో ఆనాటి ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.టి.ఆర్.కు 'నటరత్న' బిరుదును ఆయన ప్రదానం చేశారు.

### 1966

కృష్ణుడిగా, దుర్యోధనునిగా ఆయన నటించిన 'శ్రీకృష్ణపాండవీయం' చిత్రం ఈ ఏడాదే విడుదలై సంచలన విజయం సొంతం చేసుకుంది. ఈ రెండు పాత్రల పోషణలో ఎన్.టి.ఆర్. చూపించిన వైవిధ్యం, ఆయన చేసిన ప్రయోగం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి ద్వితీయ ఉత్తమ చిత్రంగా నంది అవార్డ్ లభించింది.

### 1967

యముని పాత్రలో ఎన్.టి.ఆర్. తొలిసారిగా కనిపించిన 'ఉమ్మడి కుటుంబం' చిత్రం ఈ ఏడాదే విడుదలైంది. ఈ చిత్రంలో 'సతీసావిత్రి' అంతర్నాటకంలో ఆయన పలికిన 'యముండ' అనే డైలాగు చాలామందిని అలరించింది. ఈ చిత్రం చిత్ర పరిశ్రమలో ఒక ఒరవడి సృష్టించింది. 17 కేంద్రాల్లో



బ్రహ్మానందరెడ్డితో
ఎన్.టి.ఆర్, హరికృష్ణ తదితరులు


శతదినోత్సవం జరుపుకుంది. విజయవాడలో అపూర్వ మైన రీతిలో జరిగిన ఈ చిత్ర శతదినోత్సవ సభకు నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి హాజర య్యారు. అభిమానులు ఎంతో వైభవంగా ఎన్.టి.ఆర్.ని పురవీధుల్లో ఊరేగించారు.

**1968**

ఈ ఏడాదిలో ఎన్.టి.ఆర్.కు భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందజేయడంతో ఆయన తన నటజీవితంలో అత్యున్నత దశకు చేరుకున్నట్లయింది. ఎన్.టి.ఆర్.కు పద్మశ్రీ రావడానికి కాసు బ్రహ్మానంద రెడ్డి కారకులని చెప్పాలి. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగానే హైదరాబాద్‌కు చిత్ర పరిశ్రమను మద్రాసు నుంచి తరలించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మానంద చిత్రపురి నిర్మాణం ఈ ప్రయత్నంలో భాగమే. ఎ.ఎన్.ఆర్. అప్పటికే మద్రాసు నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఆయన చిత్రాల షూటింగ్స్ సారథి స్టూడియోలో జరుగుతుండేవి. అప్పుడే ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. మధ్య ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది. వారిరువురి అభిమానుల మధ్య కూడా ద్వేషభావం రగులుకొంది.

ఇలాంటి తరుణంలో అక్కినేనికి పద్మశ్రీ పుర స్కారం ఇవ్వాలని నిర్ణయించారు. ఆయన ఒక్కడికే ఇస్తే గొడవలు మరింత పెరుగుతాయని భావించిన బ్రహ్మానందరెడ్డి, ఎన్.టి.ఆర్. పేరుని కూడా సిఫార్సు చేశారు. ఆ విధంగా అగ్రనటులిద్దరికీ ఒకేసారి పద్మశ్రీలు లభించాయి.

అలాగే హైదరాబాద్‌లో ఎన్.టి.ఆర్. ఎస్టేట్స్ రామకృష్ణ 70 ఎం.ఎం డీలక్స్ థియేటర్‌ను ఈ ఏడాదే బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. దీంతో ఎన్.టి.ఆర్.కు హైదరాబాద్‌తో మరింత అనుబంధం ఏర్పడింది.




## 1969

రామారావు నిర్మించిన 'వరకట్నం' చిత్రానికి ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ బహుమతి లభించింది. ఈ సినిమాకు దర్శకుడు కూడా ఆయనే. రాజకీయాలు, ప్రజా సమస్యలు ప్రధాన నేపధ్యంగా రూపొందిన 'కథానాయకుడు' చిత్రం సూపర్‌హిట్ అయి తర్వాత ఆ తరహా చిత్రాల రూపకల్పనకు ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ తుపాను బాధితుల సహాయార్థం ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో నాటక ప్రదర్శనలు ఇచ్చి ఆరు లక్షల రూపాయలు వసూలు చేశారు.

అలాగే తను చదువుకున్న ఎస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్ కాలేజీలో పెద్ద కుమారుడు రామకృష్ణ సంస్మరణార్థం స్కాలర్‌షిప్‌లు ఏర్పాటు చేశారు.

ఆంధ్రప్రదేశ్ నేషనల్ సేవింగ్స్, అడ్వయిజరీ బోర్డ్ ఉపాధ్యక్షునిగా రామారావు నియమితులయ్యారు.

## 1970

ఎన్.టి.ఆర్. సొంత చిత్రాలు రెండు 'తల్లా.. పెళ్లామా', 'కోడలు దిద్దిన కాపురం' విడుదలయ్యాయి. ఈ రెండు చిత్రాలకూ స్క్రీన్‌ప్లే రచయిత ఆయనే. 'తల్లా.. పెళ్లామా' ఎన్.టి.ఆర్. దర్శకత్వంలో రూపొందగా, ఆయన 200వ చిత్రం 'కోడలు దిద్దిన కాపురం' చిత్రానికి యోగానంద్ దర్శకుడు.

## 1971


యువ కథానాయకులు రంగప్రవేశం చేసి గట్టిపోటి ఇచ్చినా తట్టుకుని నిలబడి ఈ ఏడాది తొమ్మిది చిత్రాల్లో ఎన్.టి.ఆర్. నటించడం విశేషం. కె.వి.రెడ్డి చివరిచిత్రం 'శ్రీకృష్ణసత్య' ఈ ఏడాదే విడుదలైంది. ఎన్.టి.ఆర్. తొలిసారిగా నిర్మించిన పూర్తి రంగుల చిత్రమిది. ఈ చిత్రంలో రామ, రావణ, కృష్ణ పాత్రలను ఆయన పోషించారు.

## 1972

కేవలం మూడు చిత్రాల్లోనే ఈ ఏడాది నటించారు ఎన్.టి.ఆర్. వాటిల్లో ఒకటైన 'బడిపంతులు' చిత్రంతో ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు.

## 1973

ఈ ఏడాది ఎన్.టి.ఆర్. 5 చిత్రాలలో నటించగా,





'దేవుడు చే[illegible]షులు'
చిత్రంలో [illegible] కృష్ణ

వాటిల్లో ప్రత్యేకంగా పేర్కొనదగ్గవి 'దేశోద్ధారకులు', 'దేవుడు చేసిన మనుషులు'. ఈ రెండు చిత్రాలు ఘన విజయం సాధించాయి. కృష్ణ 90వ చిత్రంగా విడుదలైన 'దేవుడు చేసిన మనుషులు' కొత్త రికార్డులు నెల కొల్పింది. అలాగే చాలాకాలం తర్వాత ఎన్.టి.ఆర్., ఎ.ఎన్. ఆర్. మళ్లీ కలుసుకుని 'బంగారుబాబు' సభలో ఒకే వేదికపై ప్రసంగించడం అందరినీ అలరించింది.

### 1974


హిందీ రీమేక్ చిత్రం 'నిప్పులాంటి మనిషి' విజయం, ఆ తర్వాత ఎన్.టి.ఆర్. అనేక హిందీ రీమేక్స్ చేయడానికి స్ఫూర్తి నిచ్చింది. అలాగే ఒకసారి విడుదలైన 'తాతమ్మకల' ప్రదర్శనని ఆపేసి, కొంతభాగం రీషూట్ చేసి ఎన్.టి.ఆర్. విడుదల చేశారు. కుటుంబ నియంత్రణకు వ్యతిరేకంగా ఈ సినిమా రూపొందిందనే విమర్శలు ఉన్నా రైతుల సమస్యలను ఆకట్టుకునే రీతిలో ఆవిష్కరించడంతో ఉత్తమ కథా రచయితగా ఆయనకు నంది అవార్డ్ లభించింది. బాలకృష్ణ నటించిన తొలి చిత్రమిది.

### 1975

సామాజిక ప్రయోజనాత్మక చిత్రం 'తీర్పు'లో ఎన్.టి.ఆర్. అతిథి పాత్రను పోషించారు. ఈ చిత్రానికి ప్రభుత్వం వినోదపు పన్ను రద్దు చేసింది. విదేశాల్లో సైతం ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. ఇదే ఏడాది తన అభిమాని అశ్వనీదత్‌ను 'ఎదురులేని మనిషి' చిత్రంతో నిర్మాతను చేశారు ఎన్.టి.ఆర్. ఆయన నటించిన 'కంచుకోట' చిత్రం రిపీట్ రన్‌లో హైదరాబాద్‌లో రోజూ మూడు ఆటలతో 105రోజులు ప్రదర్శితమైంది. ఈ చిత్రం విజయోత్సవ వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహించారు.

### 1976

. రామకృష్ణా సినీ స్టూడియోస్ హైదరాబాద్‌లో ప్రారంభం. కృష్ణ, దుర్యోధన, కర్ణ పాత్రలను పోషించే 'దానవీరశూరకర్ణ' చిత్రం మొదలైంది. తమిళ సూపర్‌స్టార్ ఎం.జి.రామచంద్రన్ చిత్ర ప్రారంభోత్స




ఎన్.టి.ఆర్.పై క్లాప్‌నిస్తున్న ఎంజీఆర్.

వానికి విచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆస్థాన పండితులు శ్రీపాద కృష్ణమూర్తి, ఎన్.టి.ఆర్.కు 'నటచక్రవర్తి' బిరుదు బహూకరించారు.

**1977**

అద్భుత విజయం సాధించిన 'అడవిరాముడు' చిత్రం ఈ ఏడాదే విడుదలైంది. పూర్తి అవుట్‌డోర్‌లో మదుమలై అడవుల్లో నిర్మితమైన ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్.వేసిన స్టెప్స్ అభిమానులను అలరించాయి. చాలా రోజుల తర్వాత ఒకే ఇతివృత్తంతో 'దానవీరశూరకర్ణ', 'కురుక్షేత్రం' పోటీ చిత్రాలుగా విడుదలవ్వగా వీటిల్లో 'దానవీరశూరకర్ణ' ఘన విజయం సాధించింది. ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్. త్రిపాత్రాభినయం, ముఖ్యంగా దుర్యోధనుని పాత్ర జనాన్ని బాగా ఆకట్టుకున్నాయి.

చాలాకాలం తర్వాత ఎ.ఎన్.ఆర్.తో కలిసి నటించిన 'చాణక్య చంద్రగుప్త' చిత్రం కూడా విడుదలైంది. 'యమగోల' చేసిన కలెక్షన్ల సందడి గురించి ఇక చెప్పనక్కర్లేదు. ఒకే ఏడాదిలో వచ్చిన మూడు హిట్లతో ఎన్.టి.ఆర్. సంచలనం సృష్టించారు.

**1978**

ఈ ఏడాది 11 చిత్రాల్లో నటించి మళ్లీ తన సత్తా చాటుకున్నారు ఎన్.టి.ఆర్. రెండు పౌరాణికాలు, రెండు జానపదాలు, 'అక్బర్ సలీం అనార్కలి' చారిత్రాత్మకం. ఇక మిగిలినవి సాంఘికాలు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదుతో ఎన్.టి.ఆర్.ని గౌరవించింది. అప్పటి కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు పరమాచార్య 'విశ్వవిఖ్యాత నట సార్వభౌమ' బిరుదు ప్రదానం చేశారు.

**1979**

ఎన్.టి.ఆర్. నటించిన ఎనిమిది చిత్రాలు ఈ ఏడాది విడుదలయ్యాయి. ఆయన తొలిసారిగా అయిదు పాత్రలు పోషించి, దర్శకత్వం వహించిన 'శ్రీమద్ విరాటపర్వం' అందులో ఒకటి. ఈ చిత్రం ప్రేక్షకులను నిరాశపరచింది. 'వేటగాడు' చిత్రంతో

తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో ఎన్.టి.ఆర్.



అత్యధిక పారితోషికం తీసుకునే హీరోగా ఎదిగారు.

**1980**

'సర్దార్ పాపారాయుడు' చిత్రం షూటింగ్‌లో చేతికి గాయమైంది. అప్పటికి నాలుగుసార్లు విరిగిన చేతికే మళ్లీ గాయాలు. ఆ కట్టుతోనే ఆయన షూటింగ్‌లో పాల్గొన్నారు.

**1981**

ఈ ఏడాది 9 చిత్రాల్లో నటించారు ఎన్.టి.ఆర్. తన 60వ ఏట ప్రజాసేవకు అంకితమవుతానని ప్రకటించారు.

**1982**

ఎన్.టి.ఆర్. జీవితంలో మలి ప్రస్థానానికి ఆరంభం. మార్చి 29న 'తెలుగుదేశం' పార్టీని ఏర్పాటు చేశారు. ప్రచారానికి వెళ్లేముందు 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన చెవర్లెట్ వ్యాన్‌కి రిపేర్లు చేయించి, 'చైతన్యరథం'లా తీర్చిదిద్దారు. ఖాకీదుస్తులు ధరించి, 40 రోజులపాటు రాష్ట్రమంతా పర్యటించారు. ముఖం నల్లగా మారిపోయినా, గొంతు బొంగురుపోయినా ఆయన లెక్కచేయలేదు.


ఈ ఏడాది ఆయన నటించిన చిత్రాలు ఆరు విడుదలయ్యాయి.

**1983**

పార్టీ స్థాపించిన తొమ్మిది నెలలకే అధికారం. ఇదొక ప్రపంచ రికార్డ్. జనవరి 9న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది ఎన్.టి.ఆర్. నటించిన రెండు చిత్రాలు విడుదలయ్యాయి.

**1984**

ఆగస్టు 16న రాజకీయ సంక్షోభం కారణంగా రామారావుని తొలగించి, నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా పదవీస్వీకారం చేయమని ఆహ్వానించారు అప్పటి గవర్నర్ రామ్‌లాల్. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరగడంతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చింది. సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రిగా మళ్లీ



రాజీవ్‌గాంధీతో
ఎన్.టి.ఆర్, కృష్ణ, జమున

ప్రమాణ స్వీకారం చేశారు ఎన్.టి.ఆర్. బర్తరఫ్ అయిన ఓ ముఖ్యమంత్రి కేవలం నెలరోజుల్లో మళ్ళీ ముఖ్య మంత్రి కావడం ఇదే ప్రప్రథమం.

పార్లమెంట్ ఎన్నికల్లో 42 స్థానాలకు గాను తెలుగుదేశం, దాని మిత్రపక్షాలు 35 స్థానాలు గెలుచు కున్నాయి. 30 సీట్లతో తెలుగుదేశం లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం స్థానం పొందింది. లోక్ సభ చరిత్రలోనే ఒక ప్రాంతీయ పార్టీ ప్రధాన ప్రతిపక్షం అయిన సందర్భం అది ఒక్కటే.

ఈఏడాది ఎన్.టి.ఆర్. నటించిన 'శ్రీమద్విరాట్ వీర బ్రహ్మేంద్రస్వామి చరిత్ర' విడుదలైంది. ఆగస్టు సంక్షోభ సమయానికే కేన్సర్ వ్యాధి కారణంగా ఎన్.టి.ఆర్. సతీమణి బసవతారకం మరణించారు. ఆ మహాఇల్లాలు మరణం ఎన్.టి.ఆర్.కి పెను విషాదం.

**1985**

**మా**ర్చి 9న మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు ఎన్.టి.ఆర్. కేవలం 90 రోజుల్లో పబ్లిక్‌గార్డెన్స్‌లో 'తెలుగు లలితకళాతోరణం' నిర్మాణం జరిగింది.

**1986**

**అ**పూర్వమైన రీతిలో 'ఫిల్మోత్సవ్ 86' నిర్వహణ. ఎన్.టి.ఆర్.కు సర్వత్రా ప్రశంసలు.

**1987**

**రా**జకీయాలలో ఆటు పోట్లు, ప్రతిపక్షాల ఆరోప ణలు, ప్రభుత్వ పనితీరును తప్పుపట్టిన కోర్టు తీర్పులు.

**1988**

**నే**షనల్ ఫ్రంట్ ఆవిర్భావం. ఛైర్మన్‌గా ఎన్.టి.ఆర్. ఎన్నిక. జాతీయ ప్రతిపక్ష ఐక్య సంఘటనకు ప్రాంతీయ పార్టీ అధినేత అయిన ఎన్.టి.ఆర్. ఛైర్మన్ అయి రాష్ట్రానికి ఎంతో గౌరవాన్ని, గుర్తింపును తెచ్చారు.

**1989-90**

**ఏ**డేళ్ల అనంతరం మళ్లీ నటిస్తూ 'బ్రహ్మర్షి విశ్వా మిత్ర' చిత్రాన్ని ప్రారంభించారు ఎన్.టి.ఆర్. ముఖ్య మంత్రిగా ఉండి నటించిన తొలివ్యక్తి ఆయనే. నేషనల్

ఫ్రంట్ నాయకులంతా ఈ చిత్ర ప్రారంభోత్సవానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల్లో ఎన్.టి.ఆర్. ప్రభుత్వ ఓటమి. 71 అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న తెలుగుదేశం తొలిసారిగా ప్రతిపక్షంలో కూర్చొంది.

**1991**

'బ్రహ్మర్షి విశ్వామిత్ర' విడుదల. పరాజయం. తెలుగుతోపాటు హిందీ వెర్షన్ కూడా తీశారు. కానీ సినిమా విడుదల కాలేదు.

**1992**

'సమ్రాట్ అశోక' విడుదలైంది. ఈ చిత్రంలో డాక్టర్ భానుమతి ఓ ముఖ్య పాత్ర పోషించారు. చిత్రం విజయవంతం కాలేదు.

**1993**

ఎన్.టి.ఆర్. నటించిన చివరిచిత్రం 'మేజర్ చంద్రకాంత్' విడుదలై విజయం సాధించింది. ఈ చిత్ర విజయోత్సవసభలోనే లక్ష్మీపార్వతిని పెళ్లి చేసుకుంటున్నట్లు ఎన్.టి.ఆర్. ప్రకటించారు. ఎంతో మక్కువతో బాపు దర్శకత్వంలో నిర్మించిన 'శ్రీనాథ కవిసార్వభౌముడు' చిత్రం విజయవంతం కాలేదు.



'బ్రహ్మర్షి విశ్వామిత్ర'లో ఎన్.టి.ఆర్.

ఈ రెండు చిత్రాలతో నటునిగా ఎన్.టి.ఆర్. కెరీర్ ముగిసింది.



ఎన్.టి.ఆర్. ఉపయోగించిన వెండికంచం, గ్లాసు, కళ్లజోళ్లు

### 1994-95

ముఖ్యమంత్రిగా తప్ప తను తిరిగి శాసన సభలో అడుగుపెట్టనని శపథం చేసిన రామారావు ఈ సారి ఎన్నికలలో 219 స్థానాలలో తన పార్టీని గెలిపించి రికార్డ్ నెల కొల్పారు. 26 స్థానాల్లో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. ప్రధాన ప్రతిపక్షం హోదాని కూడా కోల్పోయింది. డిసెంబర్ 12న మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రిగా ఆయన నాలుగోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జనవరి 8న తెలుగు చిత్ర పరిశ్రమ ఆయన్ని ఘనంగా సత్కరించింది. అన్ని భాషలకు చెందిన ప్రముఖ నటులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎన్.టి.ఆర్.ని ఘనంగా సత్కరించారు. ఆగస్టు నెలలో తలెత్తిన సంక్షోభంతో ఎన్.టి.ఆర్. పదవిని కోల్పోయారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

### 1996

జనవరి 18న ఎన్.టి.ఆర్. మరణంతో రాష్ట్రం శోక సంద్రమే అయింది. జీవితంలో అలుపు, ఓటమి ఎరుగని ఈ మహానేత, అరుదైన నటుడు మృత్యువుపై ఓడిపోయి కనిపించని లోకాలకు వెళ్లిపోయారు. ■




ఎన్.టి.ఆర్. భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఏఎన్ఆర్, కృష్ణ, దాసరి, సినారె, రాజేంద్రప్రసాద్ తదితరులు

# మహోన్నత వ్యక్తిత్వం

పుట్టిన దగ్గరనుంచి తుదిశ్వాస తీసేవరకూ ఎన్.టి.ఆర్.ది అలుపు ఎరుగని పోరాటమే. తను అనుకున్నది సాధించడానికి, అవరోధాలు అధిగమించి లక్ష్యాల్ని చేరడానికి జీవితమంతా ఆయన పోరాటం చేశారు. ఆ లక్షణమే ఆయన్ని అసాధారణ హీరోగా, మహోన్నత వ్యక్తిగా నిలబెట్టింది.

మనిషిలో ఎంతో ఆవేశం... అంతే మొండితనం ఉంది. ఆయన నోటి నుంచి ఒక మాట వస్తే దానికి తిరుగుండేదికాదు. ఆరు నూరైనా నూరు ఆరైనా అది అమలు జరిగి తీరాల్సిందే.


తెలుగువాని ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని చాటి చెప్పిన ఎన్.టి.ఆర్. జీవిత పయనంలో మలుపులు.. మజిలీలు..


'పాతాళభైరవి' చిత్రంలో ఎన్.టి.ఆర్., బాలకృష్ణ (అంజిగాడు)

తమిళచిత్రం 'మర్మవీరన్'లోని ఒకపాటలో ఎన్.టి.ఆర్., ఆర్.నాగేశ్వరరావు, శివాజీ గణేశన్, జెమినీగణేశన్, ఎస్.వి.రంగారావు కనిపిస్తారు. తెలుగులోకి ఈ చిత్రాన్ని 'వేగుచుక్క' పేరుతో అనువదించారు. ఈ సినిమా పబ్లిసిటీలో ఈ ఐదుగురు పేర్లు ముందు రాసి మరియు శ్రీరాం అని హీరో పేరు పేర్కొనడం విశేషం. టి.ఎస్.బాలన్ విలన్‌గా నటించిన ఈచిత్రంలో కరెంట్ కత్తులతో యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించారు. అలా చేయడం అదే ప్రథమం.

'పాతాళభైరవి' చిత్రంలో తనతోపాటు నటించిన హాస్యనటుడు బాలకృష్ణ మద్యానికి బానిసై, షూటింగ్స్‌కు ఆలస్యంగా వస్తుండటంతో అతన్ని తప్పించాలని ఒక నిర్మాత ప్రయత్నిస్తే

## విశేషాలు



ఎన్.టి.ఆర్. వారించారు. దీని వల్ల అతనికి మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని తనే బాలకృష్ణని ఇంటికి పిలిపించి గట్టిగా మందలించారు. ఆ తర్వాత బాలకృష్ణ ఏ షూటింగ్‌కి ఆలస్యంగా వెళ్లలేదు.

విక్రం ప్రొడక్షన్స్‌వారి 'కుటుంబగౌరవం' చిత్రంలో రెండు ఎడ్లుకూడా ప్రముఖ పాత్ర వహించాయి. అంతేకాదు 'అన్నా రామన్నా' అనే పాటకూడా పాడతాయి. ఎద్దులు మాట్లాడటం, పాట పాడటం ఆ రోజుల్లో వింతగా చెప్పుకున్నారు.

తమిళంలో విజయం సాధించి, తెలుగులో 'పెద్దకొడుకు'గా అనువదించిన చిత్రకథ ఆధారంగా 'కోడలు దిద్దినకాపురం' తయారైంది.

తను నటించే సినిమాలలో మారు వేషాలు ధరించాలనే సరదా ఎన్.టి.ఆర్.కి ఉండేది.


పిడుగురాముడులో పద్మనాభం, రా[illegible] ఎన్.టి.[illegible]

అది సాంఘికం, జానపదం, చారిత్రాత్మకం... ఏ సినిమా అయినా సరే కనీసం ఒకటో, రెండో మారు వేషాలు ధరించేవారాయన. సినిమాలో ఒకసారైనా మారువేషం వేసే సన్నివేశాన్ని తయారుచేయండని ఎన్.టి.ఆర్. రచయితలకు ప్రత్యేకంగా చెప్పేవారు. తనని వెండి తెరపై చూడగానే ఈలలు వేసి, కేరింతలు కొట్టే మాస్ ప్రేక్షకులను మరింత అలరించడం కోసం ఆయన ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు. ఎన్.టి.ఆర్. ఎక్కువ మారువేషాలు వేసిన చిత్రం 'వేములవాడ భీమకవి'.

విజయవాడ నగరంలోని దుర్గా కళామందిరం థియేటర్‌కు, ఎన్.టి.ఆర్.కు ఉన్న అనుబంధమే వేరు. ఆయన సినీరంగ ప్రవేశానికి అంకురార్పణ ఈ థియేటర్‌లోనే జరగడమే కాకుండా ఆయన తొలిచిత్రం 'మనదేశం', చివరిచిత్రం 'శ్రీనాథ కవిసార్వభౌముడు' ఇందులోనే విడుదలయ్యాయి. అలాగే ఎన్.టి.ఆర్. నటించిన చిత్రాలలో 63 సినిమాలు దుర్గాకళా మందిరంలోనే విడుదల కాగా, వాటిల్లో 56 చిత్రాలు అర్ధ శతదినోత్సవం, 31 చిత్రాలు శతదినోత్సవం, 9 సినిమాలు రజతోత్సవం జరుపుకోవడం విశేషం. సినీ రాజధాని విజయవాడలో ఒకే థియేటర్‌లో ఒక నటుడు నటించిన ఇన్నిచిత్రాలు విడుదల కావడం, విజయవంత మవడం ప్రపంచ సినిమా చరిత్రలోనే అద్భుతం.

సాంఘిక చిత్రాల కథానాయకునిగా ఎన్.టి.ఆర్.ని నిలబెట్టిన చిత్రం 'పెళ్లిచేసిచూడు' (1952). ఆ స్థానాన్ని ఇంకా పటిష్టం చేసిన 'రక్త సంబంధం (1962), 'గుడిగంటలు' (1964) వంటి కొన్ని చిత్రాలను వదిలేస్తే ఆయన నటించిన సాంఘిక చిత్రాలన్నీ దాదాపుగా సామాజిక అంశాన్ని ఇతి వృత్తాలుగా మలుచుకున్నవే. జానపద చిత్రాల విషయానికి వస్తే తమిళంలో సోదర నటుడు ఎం.జి.ఆర్. అనుసరిస్తున్న పద్ధతిని ఎన్.టి.ఆర్.

అనుసరించి మాస్ ఆడియన్స్‌కి నచ్చే సినిమాలు చేశారు.


'ఎన్.టి.ఆర్. పాతబడిపోయాడు.. ఆయన కెరీర్ ఇక ముగిసినట్లే' అని అందరూ అనుకుంటున్న తరుణంలో 'నిప్పులాంటి మనిషి' (1974) వచ్చి ఘనవిజయం సాధించింది. అక్కడినుంచి ఆయన జైత్రయాత్ర మళ్లీ మొదలయింది. 'అడవిరాముడు' చిత్రంతో సరికొత్త ఎన్.టి.ఆర్. ముందుకువచ్చి, అభిమానులను మరింత అలరించారు.

కథానాయకునిగా ఎన్.టి.ఆర్. పోషించని పాత్ర అంటూ లేదు. అన్నిరకాల పాత్రల్లో నటించి తనకు తానే సాటి అనిపించుకున్నారు. నటునిగా ఎప్పుడూ తనదే పైచేయిగా ఉండాలని ఆయన అనుకునేవారు. ఆ దృష్టితోనే 'మేజర్ చంద్రకాంత్' (1993) చిత్రానికి అంతకుముందు ఏ హీరో తీసుకోనంత అత్యధిక పారితోషికం (కోటి రూపాయలు) తీసుకుని తన స్థాయిని నిలబెట్టుకున్నారు.


1963లో విడుదలైన 'బందిపోటు' చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. అంతవరకూ మంత్రాలు, మాయలతో కూడిన జానపద చిత్రాలే ఎక్కువ. 'బందిపోటు' జానపద చిత్రమే అయినా మానవ సంబంధాలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్మించిన సినిమా.

చక్రపాణిగారు అంటుండేవారు. "రామారావు ఏడ్చిస్తే ప్రేక్షకులు చూడరు. ఆయన చిత్రంలో అవసరమున్నా, లేకపోయినా పనిగట్టుకుని ఎవరితోనైనా పోట్లాడితేనే జనం మెచ్చుకుంటారు" అని. ఈ వాదాన్ని బలపర్చడానికే అన్నట్లు 1960ల చివరి రోజులలో వచ్చిన 'వివాహబంధం' (1964), 'సంగీతలక్ష్మి' (1966), 'డాక్టర్ ఆనంద్' (1966), 'నిర్దోషి' (1967) వంటి చిత్రాలలో ఎన్.టి.ఆర్. పోషించిన సాత్విక పాత్రలను ప్రేక్షకులు తిరస్కరించారు.

ఆయన చిత్రాల ధోరణికి భిన్నంగా ఉండటంతో అభిమానులు చూడలేదు. అభిమానులు కానివాళ్లు కూడా చూడలేదు.



'బందిపోటు' చిత్రంలో కృష్ణకుమారి, ఎన్.టి.ఆర్.


'భలేతమ్ముడు'లో ఎన్.టి.ఆర్.

ఎన్.టి.ఆర్. జీవనశైలి, మాటతీరు ఎవరినైనాసరే 'బ్రదర్' అని పలకరించే తత్వం, గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకోవడం... మరొకరు అనుసరించాలన్నా వీలులేనివి. షూటింగ్ సమయాల్లో గంభీరంగా ఉండే ఆయన దగ్గరికి వెళ్లి సన్నిహితంగా మాట్లాడటానికి చాలామంది భయపడేవారు. ఒక మాట అటు ఇటయితే 'పెద్దాయన'కి ఆగ్రహం వస్తుందేమోనని ఎవరికివారు ఆయనకు దూరంగా ఉండేవారు. దీనివల్ల అతికొద్దిమందే ఆయనకు అత్యంత సన్నిహితులు కాగలిగారు. అయితే ఒకటి, తన మనసుకి నచ్చిన వ్యక్తులతో ఎంతసేపయినా మాట్లాడేవారు ఎన్.టి.ఆర్. నచ్చకపోతే నటిస్తూ మాట్లాడటం ఎరుగనివ్యక్తి ఆయన. శత్రువుకి దూరం, మిత్రునికి సన్నిహితంగా ఉండాలన్న సిద్ధాంతాన్ని ఆయన పాటించేవారు.

అవుట్‌డోర్ షూటింగ్స్‌కి వెళ్లినప్పుడు ప్రతి రోజూ బ్రాహ్మి ముహూర్తంలో అంటే ఉదయం 4.45 గంటలకు తన శ్రీమతి బసవతారకంతో మాట్లాడేవారు ఎన్.టి.ఆర్. ఇంటి సంగతులు, పిల్లల యోగక్షేమాలు తెలుసుకుని సలహాలు, సూచనలు ఇచ్చేవారు.

ఎన్.టి.ఆర్.కి ఒక గొప్ప అలవాటు ఉండేది. ఆయనకు ఎక్కడ సన్మానం జరిగినా, దండలు వేసినా ఇంటికి రాగానే భగవంతుని ఫొటోలకు ఆ దండలు సమర్పించి 'ఈ సన్మానం నాది కాదు.. మీదే' అని భక్తితో నమస్కరించేవారు.

కారు డ్రైవింగ్‌లో చాలా ఫాస్ట్ ఎన్.టి.ఆర్. 'చండశాసనుడు' చిత్రం షూటింగ్ హైదరాబాద్ శివారు గ్రామమైన దేవరయాంజల్‌లో ఎక్కువగా జరిగింది. హైదరాబాద్ నుంచి ఎన్.టి.ఆర్. తనే కారు డ్రైవ్ చేసుకుంటూ లొకేషన్‌కి వెళ్లేవారు. వెనుకసీట్‌లో అసోసియేట్ డైరెక్టర్ వి.వి.రాజు, హరికృష్ణ కూర్చునేవారు. స్పీడ్ బ్రేకర్ వచ్చినప్పుడు ఆయన కారుకి బ్రేక్ వెయ్యకపోగా ఇంకా స్పీడ్‌గా పోనిచ్చేవారు. వెనుక సీట్లో కూర్చున్న వాళ్లు ఎగిరిపడేవారు. వెంటనే ఆయన రియర్‌వ్యూ మిర్రర్‌లోంచి చూస్తూ.. 'ఏం రాజుగారు మేం డ్రైవ్ చేస్తుంటే భయంగా ఉందా?'అని అడిగేవారు. 'ఎందుకు ఉండదు సార్... అయినా స్పీడ్‌బ్రేకర్ వచ్చినప్పుడు బ్రేక్ వెయ్యకపోతే ఎలా సార్' అనేవారు. దానికి ఎన్.టి.ఆర్. నవ్వేసి 'మనమంతేనండి.. లాంగ్ జర్నీ చేశామంటే రెండుమూడు కుక్కలు, నాలుగైదు కోళ్లు అవుట్ మన దెబ్బకి'... అనేవారట.

43 ఏళ్ల క్రితం సంగతి. 'కంచుకోట', 'నిలువు దోపిడి' చిత్రాల నిర్మాణం పూర్తయిన తర్వాత 25 లక్షల రూపాయల భారీ బడ్జెట్‌తో 'కంచుకాగడా' చిత్ర నిర్మాణానికి పూనుకున్నారు ప్రముఖ నిర్మాత యు.విశ్వేశ్వరరావు. ఎన్.టి.ఆర్., కాంతారావు, మరో ముగ్గురు హీరోలు. వీరికి తండ్రిగా నటించడంకోసం ఒక ప్రముఖ నటుడిని సంప్రదించారు కానీ పారితోషికం విషయంలో వీరిద్దరి మధ్య ఒప్పందం కుదరలేదు. ఆ సమయంలోనే ఉత్తరాదిన మహానటుడుగా వెలుగొందుతున్న పృథ్వీరాజ్‌కపూర్ చేత ఈ వేషం వేయిస్తే బాగుంటుందన్న ఆలోచన నిర్మాత విశ్వేశ్వరరావుకి వచ్చింది. అంతవరకూ ఆయన తెలుగు చిత్రంలో నటించలేదు. ఆ అవకాశం, అదృష్టం తనకు దక్కితే

బాగుంటుందనే అభిప్రాయంతో ముంబయి వెళ్లి ఆయన్ని కలిశారు విశ్వేశ్వరరావు. తను అనుకుంటున్న విషయం చెప్పగానే ఎంతో సంతోషించి పారితోషికం లేకుండా ఉచితంగా నటిస్తానని, అయితే డైలాగులు తనే చెబుతానని అందుకు ఏర్పాట్లు చెయ్యమని పృథ్వీరాజ్‌కపూర్ చెప్పారు. తిరుపతి వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని వచ్చిన తర్వాత షూటింగ్‌లో పాల్గొంటానని కూడా తెలిపారు. విశ్వేశ్వరరావు మద్రాసు తిరిగివచ్చిన తర్వాత ఎన్.టి.ఆర్.ని కలిసి ఈ విషయం చెప్పారు. ఆయన కూడా ఎంతో సంతోషించారు.

ఆ తర్వాత ఈ చిత్రం కోసం రెండు పాటలు రికార్డ్ చేశారు. ఎన్.టి.ఆర్., కాంతారావు, అనితతో దేవాలయం సెట్‌లో కొంత షూటింగ్ జరిపారు. రెండో షెడ్యూల్‌కి ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో ఇందులో నటిస్తున్న కథానాయిక జమున గర్భవతి కావడం, ఆమె ప్రసవించే సమయానికి పృథ్వీరాజ్‌కపూర్ మరణించడంతో ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది.



చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించిన తొలిరోజుల్లో ఫొటోలు దిగడమంటే ఎన్.టి.ఆర్.కు ఇష్టంగా ఉండేది. ఎవరైనా కెమెరాతో వచ్చి కొన్ని ఫొటోలు తీసుకుంటాం... అని అడిగితే 'తీసుకో బ్రదర్... నీకెన్ని కావాలంటే అన్ని' అనేవారు. అగ్రహీరోగా ఎదిగిన తర్వాత కూడా ఆ ఇష్టానికి ఆయన దూరం కాలేదు.

కెరీర్ బిగినింగ్‌లో తన నటనకి మరింత సాన పట్టడానికి హిందీ సినిమాలు ఎక్కువగా చూసేవారు రామారావు. ఖాళీగా ఉన్నప్పుడు టేబుల్‌మీద దరువు వేస్తూ హిందీ పాటలు పాడేవారు.

ఎన్.టి.ఆర్. గుంటూరు కాలేజీలో చదువుకునే రోజుల్లో తెనాలి పౌరాణిక నాటకాలకు బాగా ప్రసిద్ధి. సాయంత్రం ఏడుగంటలకల్లా భోజనం చేసి తన మిత్ర బృందంతో సైకిల్ మీద తెనాలి వెళ్లి అక్కడ పౌరాణిక నాటకం చూసి తెల్లారి గుంటూరుకు తిరిగి వచ్చేవారు రామారావు. సైకిల్ తొక్కడమంటే ఆయనకు మహా సరదా.

సినిమాల్లోకి రాకముందు ఘాటైన జరదాకిల్లీ వేసే అలవాటు ఎన్.టి.ఆర్.కి ఉండేది. బెజవాడ రాములు కట్టిన జరదాకిల్లీని ఆయన వేసుకునేవారు. 'మనదేశం' చిత్రం షూటింగ్‌లో ఎన్.టి.ఆర్. అలవాటుని గమనించిన ఎల్.వి.ప్రసాద్ 'కిల్లీ వేసుకోవడం వల్ల పళ్లు ఎర్రగా మారతాయి. ఆర్టిస్ట్‌కి ఆరోగ్యం, అందం కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతయినా ఉంది'' అని చెప్పడంతో ఆ అలవాటు మానేశారు ఎన్.టి.ఆర్.

ఎన్.టి.ఆర్. చిన్నతనం నుంచి కష్టజీవి. ఒళ్లు దాచుకుని ఎరుగరు. 15 ఏళ్ల వయసు వచ్చిన దగ్గరనుంచి వ్యాయామం, యోగాసనాలు వేయడం



ఆయనకు అలవాటు. ఆ తర్వాత పాలు పితికి సైకిల్‌కు పాలబిందెలు కట్టుకుని హోటళ్లకి సరఫరా చేసేవారు. తర్వాతే కాలేజీకి వెళ్లేవారు. చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించిన తర్వాతే దర్శకులను కలుసుకోవడం, నిర్మాతలను కలవడం, సెట్‌లో సీనియర్ ఆర్టిస్టులు నటిస్తున్నప్పుడు గమనించడం చేసేవారు. సాయం సమయాల్లో మెరీనా బీచ్‌కి వెళ్లి డైలాగ్స్ ఎలా చెప్పాలో ప్రాక్టీసు చేసేవారు. ఎప్పుడూ ఏదో ఒకపని కల్పించుకునేవారు రామారావు. ఖాళీగా ఉండటం, విశ్రాంతి తీసుకోవడం ఆయనకి నచ్చని విషయాలు. ఆ నిర్విరామశ్రమ, నిరంతరకృషి ఎన్.టి.ఆర్.ని మహోన్నతమైన వ్యక్తిగా, అద్వితీయ నటునిగా తీర్చిదిద్దాయి.

చిత్ర విజయం సమష్టి కృషి ఫలితం అని ఎన్.టి.ఆర్. నమ్మేవారు. అందుకే తనతో సినిమా తీయడానికి వచ్చే నిర్మాతలను ఆయన అడిగే తొలి ప్రశ్న.. 'మీ టెక్నీషియన్లు ఎవరు'? అని. తనకు నచ్చిన దర్శకుడు, సమ భావనతో మెలిగే సాంకేతిక నిపుణులు ఉన్నారా? అని విచారించేవారు. ఆ తర్వాత కథ గురించి ఆలోచించేవారు.

ఎన్.టి.ఆర్.కు అద్భుతమైన జ్ఞాపకశక్తి. ఒకటికి నాలుగు సార్లు చదివితే చాలు ఎంత పెద్ద డైలాగులైనా ఆయనకి కంఠతా వచ్చేవి.

తొలిచిత్రం 'మనదేశం'లో ఎన్.టి.ఆర్. పారితోషికం రెండువేల రూపాయలు. తర్వాత నటుడుగా డిమాండ్ పెరగడంతోపాటు పారితోషికం కూడా పెరిగింది. అగ్ర కథానాయకునిగా ఎదిగినా 22 ఏళ్ల పాటు ఆయన పారితోషికం వేలల్లోనే ఉండేది. నిర్మాతలకు నిర్మాణవ్యయం తగ్గించడానికి ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. పారితోషికాలు తగ్గించుకున్నారు. శోభన్‌బాబు రంగప్రవేశం చేసిన తర్వాత అంటే 1972 నుంచి సినిమాకు లక్ష రూపాయలు తీసుకోవడం ప్రారంభించారు. ఆయన 'మేజర్ చంద్రకాంత్'కు కోటి రూపాయల పారితోషికం తీసుకుని అత్యధిక పారితోషికం తీసుకున్న హీరోగా రికార్డ్ నెలకొల్పారు.

హీరోలకు సొంత కుర్చీలు, పర్సనల్ అసిస్టెంట్స్ అనే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన వ్యక్తి ఎన్.టి.ఆర్. ఆయనకంటే ముందే సెట్‌లోకి కుర్చీ వచ్చేది. దానిమీద టర్కీ టవల్ వేసేవాడు ఆయన అసిస్టెంట్. ఆ కుర్చీమీద ఎన్.టి.ఆర్. పేరు అందంగా డిజైన్ చేసి ఉండేది. ఆ కుర్చీ సెట్‌లోకి వచ్చిందంటే ఎన్.టి.ఆర్. వస్తున్నారని సంకేతం. వెంటనే సెట్‌లో ఉన్న వాళ్లందరూ ఎలెర్ట్ అయి లేచి నిల్చునేవారు. రామారావు రాగానే నిర్మాతకి, దర్శకుడికి నమస్కరించి, తన పనిలో నిమగ్నమయ్యేవారు.

కుర్చీతోపాటు మంచినీళ్లు తాగేందుకు ఒక కంచు మరచెంబు, గ్లాసు, వెండి కంచం కూడా వచ్చేవి. అలాగే షూటింగ్ స్పాట్‌లో ఉన్న మంచినీళ్లు తాగేవారు కాదాయన. మంచినీళ్ల బిందె కూడా ఇంటినుంచే తెచ్చుకునేవారు. కొన్నాళ్లు ఆ నీళ్లలో అరబాటిల్ తేనె కలుపుకొని



కుటుంబగౌరవంలో ఎన్.టి.ఆర్. రమణమూర్తి

తాగేవారు. రెండు మూడేళ్లు అలా చేసిన తర్వాత డాక్టర్ల సలహాపై తేనె కలుపుకోవడం మానేశారు ఎన్.టి.ఆర్.

ఎన్.టి.ఆర్. పోషించని పౌరాణిక పాత్రలేదు, నారదుని పాత్ర తప్ప. ఆయన ఈ పాత్ర చేయకపోవడానికి చిన్న కారణం ఉంది. 'దీపావళి' (1960) చిత్రం నిర్మిస్తున్న రోజులవి. ఆ సినిమాలో ఎన్.టి.ఆర్. కృష్ణుడు, కాంతారావు నారదుడు. ఆ సినిమాలో సన్నివేశపరంగా నారదుడు కృష్ణుడుగాను, కృష్ణుడు నారదునిగాను మారి నాటకం నడిపిస్తారు. ఆ సమయంలో కాంతారావు నటనచూసి సంతృప్తి చెందిన రామారావు 'తమ్ముడూ నారదుడిగా మీరు అద్భుతంగా నటిస్తున్నారు. మీరు, నేను హీరోలుగా ఒకేరకం పాత్రలు అనేకం పోషించాం. మీరు వేసిన అన్నిరకాల పాత్రలు నేనూ వేశాను. కానీ నారదునిగా మాత్రం నటించను' అంటూ హామీ ఇచ్చారు. తన జీవిత పర్యంతం ఆ మాటకు కట్టుబడి ఉన్నారు ఎన్.టి.ఆర్.

వేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావంతో ప్రతి శనివారం నేలమీద పడుకునేవారు ఎన్.టి.ఆర్. ఆయన తల్లి వెంకటరామమ్మగారు గౌరీ భక్తురాలు. ఆవిడ మరణించి శివసాయుజ్యం పొందడంతో శివుని పట్ల భక్తి ప్రపత్తులతో సోమవారం కూడా ఆయన నేలమీద పడుకునేవారు.

స్నానాదులు ముగించిన తర్వాత ఉదయం అయిదు గంటలకు టీ తాగడం ఎన్.టి.ఆర్.కు అలవాటు. కలకత్తానుంచి ప్రత్యేకంగా తెప్పించిన టీ ఆకులతో తయారుచేసిన ఆ టీ చాలా బాగుండేదని దాని రుచిని ఆస్వాదించినవారు చెబుతారు. తల్లి మరణానంతరం టీ మానేసి, పాలు కానీ, మజ్జిగ కానీ తీసుకునేవారు.


తను నిర్మించిన 'తల్లా పెళ్లామా' చిత్రాన్ని ఎల్.వి. ప్రసాద్ తమిళంలో, హిందీలో పునర్నిర్మిస్తానని ముందుకు వచ్చినప్పుడు ఎన్.టి.ఆర్. మహదానంద భరితులైపోయారు. "నన్ను ఈ పరిశ్రమకు పరిచయం చేసి, నేను ఈ స్థితికి చేరుకో వడానికి కారకులు నా గురుదేవులు ఎల్.వి.ప్రసాద్‌గారు. అఖిల భారత స్థాయిలో పేరుపొందిన నిర్మాత,దర్శకులు తన శిష్యుని దగ్గరకు తను నిర్మించబోయే చిత్రానికి కావల్సిన కథకోసం రావడం ఎవరికైనా ఆనంద దాయకమే. నా జీవితంలో ఆనందో ద్వేగంతో నిండిన మధురక్షణమిది' అని ఆ సందర్భంగా ఆయన చెప్పారు.

ఎన్.టి.ఆర్. సినిమాలకు పాటలు రాయడం 'అడవిరాముడు' చిత్రంతో ప్రారంభించారు వేటూరి. అయితే అంతకంటే ముందు 'దీక్ష' (1974) చిత్రం కోసం ఆయన ఒక పాట రాశారు కానీ అది వెలుగులోకి రాలేదు. ఈ సినిమాలో జమున, తను సత్యభామ- కృష్ణులుగా ఒక అంతర్నాటకాన్ని గేయ రూపంలో పెడితే బాగుంటుందనే ఆలోచన ఎన్.టి.ఆర్.కి కలిగింది. ఈ పాటను రంగులలో తీస్తే మరింత మంచిదని కూడా అనిపించింది. నిర్మాతకు ఇది అదనపు భారమైనా చిత్ర విజయానికి మరింత

దోహదమవుతుందని ఎన్.టి.ఆర్. భావించడంతో ఆ పాట రాయడానికి తనతో చిరకాల పరిచయం కలిగిన వేటూరి సుందరరామ్మూర్తిని పిలిపించారు రామారావు. వేటూరికి అదే తొలి సినిమా పాట. 1974లో భోగి రోజున 501 రూపాయలను అడ్వాన్స్‌గా అందుకున్న వేటూరి సంక్రాంతిరోజున పాటరాసి, రామారావుకి అందించారు. 'నిన్న రాతిరి కలలో సన్న చేసి సరసకు రమ్మని నిన్ను పిలిచిన దెవడే చెలియా.. వేయి పేరుల వాడే... వాడు వేల తీరుల వెలిగే వాడే... పదార్వేల నారుదుల రేడే...' ఈ పాటను పెండ్యాల స్వరపరిచారు. ఘంటసాల, సుశీలతో పాడించాలనుకున్నారు. కానీ అనివార్య పరిస్థితులవల్ల ఆ పాటని రికార్డ్ చేయలేదు. ఆ తర్వాత వేరే సినిమాలో ఆ పాట వాడుకుందామని అనుకున్నారు కానీ అదీ జరగలేదు.

1980ప్రాంతాల్లో హాస్యనటుడు చలం మరో నిర్మాత కె.వి.వి.సత్యనారాయణతో కలిసి ఎన్.టి.ఆర్, దాసరి నారాయణరావు కాంబినేషన్‌లో ఒక సినిమా తీయడానికి ప్లాన్ చేశారు. ఈ కాంబినేషన్‌కి విపరీతమైన క్రేజ్ ఉన్న తరుణమది. ఆర్థికపరమైన ఒడుదుడుకుల్లో ఉన్న చలానికి సాయం చేద్దామనే మంచి మనసుతో ఎన్.టి.ఆర్., దాసరి ఇద్దరూ అంగీకరించారు. సినిమా ప్రయత్నాలు ఏమోకానీ ఈ కాంబినేషన్ కుదిరిందన్న ఆనందంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా తాగడం ప్రారంభించారు చలం. ఈ విషయం ఎన్.టి.ఆర్.కి తెలిసింది. ఇలాంటి విషయాలు ఆయనకు నచ్చవు. 'ఇప్పుడే ఇంతగా తాగుతున్నాడు... రేపు షూటింగ్ మొదలు పెట్టాక తాగి సెట్‌కు వస్తాడేమో' అనుకుని ఈ సినిమా చెయ్యడం లేదని కబురు చేశారు ఎన్.టి.ఆర్.

తనది హరిహరనాథ తత్వమని ఎన్.టి.ఆర్. చెప్పేవారు. అందుకే తన మగ పిల్లలకు జయకృష్ణ, సాయికృష్ణ, హరికృష్ణ, మోహనకృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర కృష్ణ అని పేర్లు పెట్టారు. ఆడ పిల్లలకు లోకేశ్వరి, పురందరేశ్వరి, భువనేశ్వరి, ఉమా మహేశ్వరి.. ఇలా శైవ నామధేయాలు నిర్ణయించారు. ■



ఎన్.టి.ఆర్., చలం, బి.వి.ప్రసాద్

# తొలి అనుభవం


'మనదేశం' చిత్రంతో పరిశ్రమలోకి అడుగుపెట్టారు రామారావు. అందులో బ్రిటీషు ప్రభుత్వానికి మద్దతు పలికే పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాత్ర అది. ఒకరకంగా అది నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్ర. ఆ సినిమాలో ఆయన కనిపించేది కాసేపే అయినా అందరినీ తన నటనతో ఆకట్టుకున్నారు. శోభనాచల స్టూడియోలో 'మనదేశం' చిత్ర నిర్మాణం జరిగింది. ఆ స్టూడియోలో తన తొలిరోజు అనుభవం ఆయన మాటల్లోనే...



'సంకల్పం'లో ఎన్.టి.ఆర్.


# స్టూడియోలో తొలిరోజు...

**సెట్‌మీద నా తొలిరోజు అనుభవాన్ని చెప్పే ముందు ప్రాతిపదికగా నాటక రంగం మీద నా అనుభవాన్ని గురించి నాలుగు ముక్కలు చెబుతా..**



'మనదేశం'లో ఎన్.టి.ఆర్.

నేను కళాశాలలో చదువుతున్న రోజుల్లో మొట్ట మొదటిసారిగా వేషం వేసి నాటక రంగం మీదకు అడుగుపెట్టాను. అది కూడా ఆడవేషం. వేషం వెయ్యాలనే అభిలాష అప్పట్లో నాకు అసలు లేదు. కానీ పరిస్థితులు బలీయమై నేను అలా ఆడవేషం వేయ డానికి కుట్రపన్నాయి. స్నేహితులు కూడా దీనికి తలా ఒక చెయ్యా వేశారు. ఉద్యోగం పురుష లక్షణం అన్నట్లు మగవాడికి మీసం కూడా ఒక లక్షణమేనని అప్పట్లో అనుకుంటుండేవాణ్ణి. ఆ నమ్మకంతోనే చివరికి మీసం కూడా తియ్యకుండానే ఆ ఆడవేషం వేశాను. వేషం వేసుకునేటంతవరకూ ధైర్యంగానే ఉంది కానీ, రంగం మీద అడుగు పెట్టాల్సిన ముహూర్తం దగ్గర పడుతున్న కొద్దీ నాకు కాళ్లూ చేతులూ వణకడం ఆరంభించాయి. ఒళ్లంతా ముచ్చెమటలు పోశాయి. రంగంలోకి ప్రవేశిం చవలసిన సమయం దాటిపోతున్నది కానీ నా అడుగు మాత్రం ముందుకు పడటంలేదు. ఆఖరుకు ఎవరో నన్ను ముందుకు తోశారు. ఆ తోపుతో రంగ స్థలం మీదకు పోయి పడ్డాను. అయిదు నిమిషాల వరకూ నాకు ఏమీ తెలీలేదు. ఆ తరువాత ధైర్యం చిక్క బట్టుకుని నటించడం ప్రారంభించాను. మొత్తం మీద ఆ నాటకంలో నాదే పైచేయి అయ్యింది. బతుకుజీవుడా అనుకుంటూ బయట పడ్డాను. ఆడవేషం వేశానని అనుకోవడానికి నాలో నాకే సిగ్గు వేసింది. అదీ నా నటజీవితానికి నాంది.



'మనదేశం'లో నాగయ్యతో ఎన్.టి.ఆర్.


ఆనాటి ఉదంతాన్ని తలుచుకున్నప్పుడల్లా నాకెంతో సరదాగా వుంటుంది. నాటకాల్లో వేషాలు వేసి సంపాదించాలనే అభిలాష నాకు ఎప్పుడూ వుండేది కాదు. వేషం వెయ్యాలనే సరదా మాత్రమే ఎప్పుడూ వెంటాడుతూ ఉండేది. ఆ సరదాయే చివరికి దురదగా మారి నాచేత ఒక అమెచ్యూర్ థియేటర్ స్థాపింప చేసింది. దాని ద్వారా కొన్ని అభ్యుదయ నాటకాలు, నాటికలు ఆడించడానికి నేను అలవాటు పడిపోయాను. ఈ సంస్థ పతాకచ్ఛాయల మీదే ఆంధ్ర నాటక కళా పరిషత్ బహుమతి కూడా పొందాం.

నాటకరంగం మీదనుంచి నా దృష్టి క్రమేపీ సినిమా రంగం మీదకు మళ్లింది. నేను ప్రథమంగా తెరమీద కనిపించిన చిత్రం 'మనదేశం'. దానికి ఎల్.వి.ప్రసాద్ దర్శకులు. శోభనాచల స్టూడియోలో ఈ సినిమా తయారైంది.

అదివరకే నాటకరంగం మీద కొంత ప్రవేశం ఉండడంచేత ఫిల్మ్ సెట్టుమీద తొలిరోజు నిర్భయంగా నటించాను. కెమెరాలు, మైకులు నాలోని చైతన్య స్రవంతిని ఆపలేకపోయాయి. ఇక్కడ మీకు ఒక విషయం చెప్పాలి. నాటక రంగం మీద నేను ఉత్తేజ కరమైన, ఉద్రేకపూరితమైన పాత్రలను ఎక్కువగా వేస్తుండేవాడిని. అప్పటి నా అనుభవంలో నేను నటన అంటే సహజత్వానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండే వాడిని. అయితే, ఈ సహజత్వం ఒక పెద్ద తమాషాగా పరిణమించింది. దీనికొక ఉదాహరణ ఇస్తాను. 'మన దేశం' చిత్రంలో జైలు దృశ్యం తొలిరోజు షూట్ చేశారు. దానిలో నేను ఇన్‌స్పెక్టర్ వేషం వేసి ఆ పాత్రకు కావలసిన ఆవేశాన్ని, ఉద్రేకాన్ని బాగా చూపెట్టాను. సెట్ మీద నా అభినయం అంతా బాగుందంటే బాగుందన్నారు. మరునాడు ఆ సన్నివేశాల తాలూకు రషెస్

చూశారు. చూస్తే ఇంకేముంది? ఆనాడు నేను చేసిన హంగామాకు బల్లలూ, కిటికీలూ అల్లల్లాడాయి. భావోద్రేకంలో సహజంగా నటించడం వల్లనే అలా జరిగిందని గ్రహించడానికి ఎంతో సమయం పట్టలేదు.

సహజత్వానికి సంబంధించిన మరో సంఘటనను కూడా నేను ఇక్కడ చెప్పకుండా ఉండలేకపోతున్నాను. 'పల్లెటూరి పిల్ల' చిత్రంలో నేను ఎద్దుతో పోరాడవలసి వచ్చింది. కంపెనీ వాళ్లు ఆ సన్నివేశంలో నాకు డూప్‌గా నటించేందుకు వేరే ఒక మనిషిని మాట్లాడారు. అయితే నాకు అది బాగా లేదనిపించింది. మన సన్నివేశాలను మనమే చేసి బాగుందనిపించుకోవాలి. ఎవరో చేస్తే మనకు వచ్చే ఖ్యాతి ఏముంటుంది? ఇది మూఢ అభిప్రాయమే కావచ్చు. అయినా నాకు తోచిందే చేశాను. ఆ సన్నివేశంలో నేనే పాల్గొంటానన్నాను. కంపెనీ అధినేతలు 'సరే కానివ్వండి' అన్నారు. ఎద్దుతో పోరాటంలో చెయ్యి విరిగింది. ఇంకా పెద్ద ప్రమాదం కూడా జరిగేదే? ఎట్లాగో తప్పించుకుని బయటపడ్డాను. అది మొదలుకుని సినిమా నటనకు కావలసిన భావోద్రేకపు డోస్ ఎంత ఉండాలన్నది క్రమేపీ తెలుసుకోగలిగాను.


'పల్లెటూరి పిల్ల' చిత్రంలో ఎన్.టి.ఆర్.


సినిమాల్లో సహజత్వానికి కాకుండా సిసలైన నటనకే చోటివ్వాలన్న సత్యాన్నీ గ్రహించాను. ■

'కుటుంబగౌరవం'లో ఎన్.టి.ఆర్.



# నిర్మాతగా నందమూరి

చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన నాలుగేళ్లకే నటునిగా ప్రత్యేక వ్యక్తిత్వాన్ని, కీర్తిని సంపాదించుకున్న రామారావు 1952లో తెలుగు చిత్ర పరిశ్రమలో నూతన అధ్యాయం ప్రారంభించడానికి సన్నాహాలు ప్రారంభించారు. సోదరుడు త్రివిక్రమరావు ఆయనకు అండగా నిలిచారు. ఎన్.ఎ.టి. పతాకంపై ఈ సోదరులిద్దరూ నిర్మించిన చిత్రాలెన్నో విజయవంతమైనాయి. ఆ తర్వాత తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఎన్.టి.ఆర్. తనయులు ఆయన ఆశయాలు, ఆలోచనలకు అద్దం పట్టే చిత్రాలను నిర్మించారు. ఆ వివరాలు.. విశేషాలు..



నిర్మాతలతో నందమూరి సోదరులు




# నిబద్ధత కలిగిన నిర్మాత

'మనదేశం' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన నందమూరి తారకరామారావు హీరోగా నిలదొక్కుకోవడానికి ఎక్కువకాలం పట్టలేదు. హీరోగా ఆయన నటించిన తొలి చిత్రం 'పల్లెటూరి పిల్ల' అయితే, విడుదలైన చిత్రం మాత్రం 'షావుకారు'. 20 రోజుల తేడాతో విడుదలైన ఈ రెండు చిత్రాలూ ఆయనని హీరోగా నిలబెట్టాయి. ఆ తర్వాత నటించిన 'మాయారంభ' (1950), 'సంసారం' (1950), 'పాతాళభైరవి' (1951), 'మల్లీశ్వరి' (1951), 'పెళ్లిచేసిచూడు' (1952) చిత్రాలు నటునిగా ఆయనకు గుర్తింపు తెచ్చాయి. హీరోగా ఎదగడానికి మరింత తోడ్పడ్డాయి. అటువంటి తరుణంలోనే ఒక చిత్రనిర్మాణ సంస్థను నెలకొల్పి, తెలుగుదనం, కళాత్మక విలువలు కలిగిన చిత్రాలను నిర్మించాలన్న ఆలోచన రామారావుకు వచ్చింది. ఈ ఆలోచనకు మరో కారణం ఉంది. అదేమిటంటే ఆయన దగ్గరబంధువైన దోనేపూడి కృష్ణమూర్తి ఆర్థికంగా దెబ్బతినడంతో ఆయనకు చేయూతనివ్వడం కోసం కూడా చిత్ర నిర్మాణం ప్రారంభించారు ఎన్.టి.ఆర్.

నేషనల్ ఆర్ట్స్ బేనరుపై నిర్మించిన 'పిచ్చిపుల్లయ్య (1953) చిత్రానికి దోనేపూడి కృష్ణమూర్తి పార్టనర్. ఎన్.టి.ఆర్. తమ్ముడు త్రివిక్రమరావు మేనేజింగ్ పార్టనర్. ఎన్.టి.ఆర్. ప్రధానపాత్ర పోషించిన ఈ చిత్రంలో గుమ్మడి విలన్. ఒక ముఖ్యపాత్రలో ఆయన నటించడం అదే ప్రథమం. ఈ చిత్రానికి ఎన్.టి.ఆర్. రూమ్మేట్ తాతినేని ప్రకాశరావు దర్శకుడు. విమర్శకుల ప్రశంసలు పొందిన ఈ చిత్రం ఆర్థికవిజయం సాధించలేదు. సెంటిమెంట్ అనుకున్నారో ఏమో రెండో చిత్ర నిర్మాణానికి ముందు బేనరు పేరుని స్వల్పంగా మార్చారు ఎన్.టి.ఆర్. సినిమా రంగంలోకి అడుగు


పెట్టక ముందు నాటకాలు ప్రదర్శించిన నేషనల్ ఆర్ట్ థియేటర్ (ఎన్.ఎ.టి.) పేరునే చిత్ర నిర్మాణ సంస్థకూ పెట్టారు. డి.వి.ఎస్.రాజుని వ్యాపార భాగస్వామిగా చేర్చుకుని ఈ బేనరుపై నిర్మించిన తొలిచిత్రం 'తోడుదొంగలు' (1954). గ్లామరెస్ హీరోగా రాణిస్తున్న ఎన్.టి.ఆర్. ఈ చిత్రంలో వయసుమళ్లిన అందులోను నెగెటివ్ టచ్ ఉన్న పాత్రను పోషించడం విశేషం. ఆయన చేసిన సాహసాన్ని ఆ రోజుల్లో విమర్శకులు ఎంతో మెచ్చుకున్నారు. ప్రయోజనాత్మకంగా, ప్రయోగాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రం దర్శకునిగా యోగానంద్‌కు రెండోసినిమా. (తొలి చిత్రం 'అమ్మలక్కలు'లో కూడా హీరో ఎన్టీఆరే). మాటల రచయితగా సముద్రాల జూనియర్‌కూ ఇదే తొలిచిత్రం. ఆ రోజుల్లో రామారావు రోజుకి రెండు మూడు షిఫ్టులు వర్క్ చేస్తూ ఎంతో బిజీగా ఉండేవారు. ఆయన ఇంటికి వచ్చి భోజనం చేసేసరికి రాత్రి పదయ్యేది. ఆ సమయంలో కూడా ఎన్.ఎ.టి. ఆఫీసుకు వచ్చి మ్యూజిక్ సిట్టింగ్స్‌లో పాల్గొనేవారు. పడుకునే ముందు టీ తాగడం నందమూరి సోదరులకు అల వాటు. అందుకే మ్యూజిక్ సిట్టింగ్స్ పూర్తయిన తర్వాత ఆ బ్యాచ్ మొత్తం మౌంట్‌రోడ్‌కో, ట్రిప్లికేన్‌కో వెళ్లి టీ తాగి ఇళ్లకు వెళ్లేవారు. రెండు లక్షల రూపాయల వ్యయంతో రూపొందిన 'తోడుదొంగలు' చిత్రానికి 14వేలు నష్టం వచ్చింది. ఉత్తమ చిత్రాలకు జాతీయ బహుమతులు ఇవ్వడం ఆ ఏడాదే ప్రారంభించడంతో ఈ చిత్రానికి రాష్ట్రపతి ప్రశంసాపత్రం లభించింది.


'తోడుదొంగలు' చిత్రంలో ఎన్.టి.ఆర్.

### 'వీరపూజ'కు జయసింహ

ఆ తర్వాత ఎన్.ఎ.టి. సంస్థ నిర్మించిన చిత్రం 'జయసింహ' (1955). అంతకుముందు నిర్మించిన రెండు చిత్రాల పరాజయంతో వ్యాపారానికీ, ఆదర్శానికీ ముడిపెడితే ఇబ్బందులు తప్పవని రామారావుకి అర్థమైంది. 'జనం కోరేది మనం శాయవలె' అనుకున్నారు. అందుకే కళను, వ్యాపారాన్నీ సమ్మిళితం చేసి 'జయసింహ' చిత్రాన్ని నిర్మించారు. వెంకటపార్వతీశం కవులు రాసిన 'వీర పూజ' నవల ఆధారంగా ఈ చిత్రం యోగానంద్ దర్శకత్వంలో రూపుదిద్దుకుని విజయం సాధించింది. నిర్మాతగా రామారావుని నిలబెట్టింది. వహిదా రెహమాన్‌ను హీరోయిన్‌గా ఈ సినిమాతో పరిచయం చేసిన ఘనత ఈ సంస్థదే.


నందమూరి త్రివిక్రమరావు యో...నంద్, రెహమాన్



'జయసింహ' శతదినోత్సవం సందర్భంగా..

ఆ తర్వాత తమిళంలో విజయం సాధించిన 'హరి దాసు' చిత్రానికి స్వల్ప మార్పులు చేసి 'పాండురంగ మహాత్మ్యం' (1957) చిత్రాన్ని నిర్మించారు ఎన్.టి.ఆర్. ఈ సినిమాకి స్క్రీన్‌ప్లే రచయిత ఆయనే. బి.సరోజా దేవి తెలుగులో నటించిన తొలిచిత్రమిదే. ఈ పౌరాణిక చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు కమలాకర కామే శ్వరరావు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వం వహించిన తొలిచిత్రం 'చంద్రహారం' (1954), రెండో చిత్రం 'పెంకిపెళ్లాం' (1956)లలో హీరో ఎన్.టి.ఆరే. ఈ రెండు సినిమాలు విజయవంతం కాకపోయినా ఆయనమీద ఉన్న నమ్మకంతో 'పాండురంగమహాత్మ్యం' చిత్రం దర్శకత్వ బాధ్యతలు అప్పగించారు. దానిని నిలబెట్టుకున్నారు కమలాకర కామేశ్వరరావు. వీరిద్దరూ కలిసి పనిచేసిన వాటిల్లో పౌరాణికాలే ఎక్కువ. పురాణాలు, ఇతిహాసాల గురించి కామేశ్వరరావుకి ఎంతో అవగాహన ఉండటం తో తనకి ఏ సందేహం వచ్చినా ఆయన్ని అడిగి నివృత్తి చేసుకునేవారు ఎన్.టి.ఆర్. ఆయన దృష్టిలో పురాణా లకు సంబంధించి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో సాధికారిత కలిగిన వ్యక్తులు ముగ్గురే ముగ్గురు. కె.వి. రెడ్డి, కమలాకర, ఎన్.టి.ఆర్.

**'సీతారామకళ్యాణం' తల్లిదండ్రులకు అంకితం**

ఆ తర్వాత చిత్ర నిర్మాణానికి నాలుగేళ్లు గ్యాప్ వచ్చింది. హీరోగా ఆయన బిజీగా ఉండటం ఒక కారణమైతే, తగిన కథ దొరకకపోవడం మరోకారణం. అయితే ఈ మధ్య కాలంలో విజయాసంస్థ భాగ స్వామ్యంలో స్వస్తిశ్రీ పతాకంపై 'రేచుక్క- పగటిచుక్క' (1959) చిత్రాన్ని నిర్మించారు. ఇదే చిత్రం 'రాజాసేవై' పేరుతో తమిళంలోనూ విడుదలైంది. ఈ చిత్రమూ విజయం సాధించలేదు.


రామారావు 'చౌదరన్నా' అని ఆప్యాయంగా పిలుచు కునే ధనేకుల బుచ్చి వెంకట కృష్ణచౌదరి సేకరించిన 'సీతారామకళ్యాణం' కథ చదివి కె.వి.రెడ్డి దర్శకత్వంలో తను రామునిగా, ఎస్.వి.రంగారావు రావణునిగా సినిమా తీయాలనే నిర్ణయానికి వచ్చారు ఎన్.టి.ఆర్. ఈ చిత్ర నిర్మాణం కోసం ఏర్పాట్లు జరుగుతున్న

తరుణంలో చౌదరి మరో పుస్తకం సేకరించుకు వచ్చారు. 40 రామాయణ గ్రంథాలను పరిశీలించి, శోధించి రావణుని రసజ్ఞతను ఆవిష్కరించిన ఆ పుస్తకం పేరు 'సీతా పరిభ్రమణ విభ్రమం'. అది చదివిన తర్వాత రావణుని పాత్ర తనే వేస్తానని ఎన్.టి.ఆర్. ప్రకటించారు. కె.వి. రెడ్డి నచ్చచెప్పినా ఆయన వినలేదు. దాంతో కె.వి.రెడ్డి ఈ ప్రాజెక్టు నుంచి తనే తప్పుకున్నారు. ఇక తప్పని పరిస్థితుల్లో తనే దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు రామారావు. ఈ చిత్రాన్ని తల్లిదండ్రులకు అంకితమిచ్చారు.

దర్శకునిగా, తాంత్రిక ఛాయాగ్రాహకునిగా పేరు తెచ్చుకున్న రవికాంత్ నగాయిచ్ 'సీతారామకళ్యాణం' చిత్రంతోనే పరిచయమయ్యారు. అలాగే అంతకు ముందు ఎన్నో చిత్రాలకు సంగీత దర్శకునిగా పనిచేసి, ఆ తర్వాత మరుగున పడిపోయిన గాలిపెంచల నరసింహారావును ఈ చిత్రం తిరిగి తీసుకువచ్చింది. ఆయన స్వరపరిచిన 'సీతారాముల కళ్యాణం చూతము రారండి'' పాట ఇప్పటికీ పెళ్లిళ్లలో వినిపిస్తూనే ఉంటుంది. దురదృష్టవశాత్తు ఆయన ఆఖరి చిత్రం కూడా ఇదే అయింది.

1961లో విడుదలైన 'సీతారామకళ్యాణం' చిత్రం చరిత్ర సృష్టించింది. రామారావు రావణుడు పాత్ర పోషించడం వల్లే ఆ సినిమా అంత విజయం సాధించిందని అన్నవారూ ఉన్నారు. ఆ ఏడాది ఫిలిం ఫ్యాన్స్ అవార్డులలో ఎన్.టి.ఆర్. ఉత్తమనటుడుగా, దర్శకునిగా కూడా అవార్డులు అందుకున్నారు. శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా చూసి ఎన్.టి.ఆర్.ను అభినందించారు. ఇంతకుముందు ఆయన నిర్మించిన చిత్రాలు ఒక్కో మెట్టు ఎక్కిస్తే, 'సీతారామకళ్యాణం' చిత్రం ఒక్కసారే పదిమెట్లు ఎక్కించింది.

ఎన్.ఎ.టి. సంస్థ తదుపరి చిత్రం 'గులేబకావళి కథ' (1962). ఈ సినిమాతోనే డాక్టర్ సి.నారాయణరెడ్డి గీత రచయితగా పరిచయమయ్యారు. ఈ చిత్రానికి కూడా ఎన్.టి.ఆర్. దర్శకుడు. ఈ సినిమా ద్వారా జోసెఫ్- కృష్ణమూర్తి సంగీత దర్శకులుగా పరిచయమయ్యారు. ఈ చిత్రం తర్వాత ఎన్.ఎ.టి. భాగస్వామ్యం నుంచి బయటికి వచ్చి రామారావు ఆశీస్సులతో


'సీతారామకళ్యాణం' చిత్రంలో ఎన్.టి:ఆర్.
'సీతారామకళ్యాణం' చిత్రాన్ని తన తల్లిదండ్రులకు ఎన్.టి.ఆర్ అంకితమిచ్చారు

సొంతంగా చిత్రనిర్మాణం ప్రారంభించారు డి.వి.ఎస్.రాజు.

**ఆ దుర్ఘటనతో బేనరు పేరు మారింది**


రామారావు జ్యేష్టపుత్రుడు రామకృష్ణ 1962 మే 27న, హఠాత్తుగా కన్నుమూశాడు. ఎన్నోరకాల పాత్రలను పోషించడం వల్ల వేదాంతం, విజ్ఞానం, ఆత్మ పరిపక్వత, సత్యశోధన... రామారావులో జీర్ణమై ఉండటంవల్ల ఈ దుర్ఘటన ఆయనను కుంగదీయలేదు కానీ వారి తల్లిదండ్రులకు మాత్రం అదొక శాశ్వతమైన బాధగా గుండెల్లో మిగిలి పోయింది. 'శ్రీక్రిష్ణపాండవీయం' చిత్ర నిర్మాణం ఏర్పాట్లు జరుగుతున్న తరుణమది. తన కుమారుని జ్ఞాపక చిహ్నంగా 'రామకృష్ణ ఎన్.టి.ఎ.కంబైన్స్' అని బేనరు పేరు మార్చి ఆ చిత్రాన్ని నిర్మించారు. తనకు ఏ నమ్మకాలు, భక్తి విశ్వాసాలు ఉన్నాయో వాటిని చిన్న వయసులోనే పాటించిన వ్యక్తి కనుక రామకృష్ణ పేరు తన కుటుంబంలో చిరస్మరణీయంగా ఉండాలని రామారావు సంకల్పించారు. అందుకే హైదరాబాద్‌లో నిర్మించిన థియేటర్లకు, స్టూడియోకి రామకృష్ణ పేరు పెట్టారు.









'శ్రీ క్రిష్ణపాండవీయం' (1966) చిత్రంలో తొలిసారిగా దుర్యోధనుని పాత్రను పోషించి, అనితరసాధ్యమైన తన నటనతో ఆ పాత్ర ఇమేజ్ పెంచారు. ఈ చిత్రం ద్వితీయ ఉత్తమచిత్రంగా ఎన్నికై వెండి నందిని పొందింది. ఈ సినిమా తమిళంలో 'రాజసూయం' పేరుతో విడుదలైంది. ఆ తర్వాత 'ఉమ్మడి కుటుంబం' (1967లో ఈ చిత్రాన్ని ఏవీయం సంస్థ తమిళంలో నిర్మించింది). 'వరకట్నం' (1969), 'తల్లా పెళ్లామా' (1969), (ఈ సినిమాను ప్రసాద్ ప్రొడక్షన్స్ సంస్థ తమిళం, హిందీలో నిర్మించింది). 'కుల గౌరవం' (1972) చిత్రాలను ఇదే బేనరుపై నిర్మించారు. 1967లో రామకృష్ణ- ఎన్.ఎ.టి. పతాకంపై స్వీయ దర్శకత్వంలో 'చాణక్య- చంద్ర గుప్త' చిత్రాన్ని నిర్మించాలని ఆయన




ప్రయత్నించారు. ఆ రెండు పాత్రలను తనే పోషించాలని అనుకున్నారు. కానీ ఆ సినిమా ప్రతిపాదన దశలోనే ఆగిపోయింది.

ఇక ఆపై రామారావు నిర్మించిన చిత్రాలు రకరకాల బేనర్లపై రూపొందాయి. ఎన్.టి.ఆర్. ఎస్టేట్ ప్రొడక్షన్ యూనిట్ బేనరుపై 'కోడలు దిద్దిన కాపురం' (1970) చిత్రాన్ని, ఆర్.కె.బ్రదర్స్ బేనరుపై 'శ్రీకృష్ణ సత్య' (1971) చిత్రాన్ని నిర్మించారు. ఇంతవరకు నిర్మించిన చిత్రాలకు నిర్మాతగా త్రివిక్రమరావు వ్యవహరించారు. ఆ తర్వాత రామకృష్ణా సినీ స్టూడియోస్ బేనరుపై నిర్మించిన 'తాతమ్మకల' (1974), 'వేములవాడ భీమకవి' (1976), 'దానవీరశూరకర్ణ' (1977), 'చాణక్య చంద్రగుప్త' (1977), 'శ్రీరామ పట్టాభిషేకం (1978), 'శ్రీ తిరుపతి వెంకటేశ్వరకళ్యాణం' (1979), 'శ్రీమద్ విరాటపర్వం' (1979), 'రౌడీరాముడు- కొంటె కృష్ణుడు' (1980), 'అగ్గిరవ్వ' (1981), తారకరామా ఫిలిం యూనిట్ బేనరుపై నిర్మించిన 'అక్బర్ సలీం అనార్కలీ' చిత్రాలకు రామారావు నిర్మాతగా వ్యవహరించారు. అనంతరం నిర్మించిన 'డ్రైవర్ రాముడు'






(1979), 'అనురాగ దేవత' (1982), 'సింహం నవ్వింది' (1983), 'చండశాసనుడు' (1983), 'సమ్రాట్ అశోక' (1992) చిత్రాలకు నందమూరి హరికృష్ణ నిర్మాత. బసవతారకం మెడికల్ ట్రస్ట్ పతాకంపై నిర్మించిన 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' చిత్రానికి ఎన్.టి.ఆర్., 'శ్రీనాథ కవిసార్వ భౌముడు' (1993) చిత్రానికి నందమూరి రామకృష్ణ నిర్మాతలు. స్క్రిప్ట్ ముందే తయారు కావడం, షూటింగ్ స్క్రిప్ట్ కూడా తయారు చేసుకున్న తరువాతే సెట్స్‌కు వెళ్లడం వంటి క్రమపద్ధతులను పాటించే వాటిలో ఎన్.టి.ఆర్. చిత్ర నిర్మాణ సంస్థ కూడా ఒకటి. 'శ్రీరామ పట్టాభిషేకం' చిత్రానికి ఏడేళ్ల ముందే స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నారు ఎన్.టి.ఆర్. సీనియర్ సముద్రాల రాసిన చివరి స్క్రిప్ట్ ఇదే. 'పుణ్యదంపతులు', 'ఉత్తర రామాయణం' చిత్రాల స్క్రిప్ట్‌లు సిద్ధం చేసుకున్నారు. కానీ అవి తీయకముందే ఆయన కన్ను మూయాల్సి వచ్చింది.

నిబద్ధత కలిగిన నిర్మాతగా పేరు తెచ్చుకున్న ఎన్.టి.ఆర్. నిర్మించిన చిత్రాలన్నీ ఆణిముత్యాలే. ■



# కృష్ణావతారం

ఏ పాత్రకు తను సరిపోనని ఎన్.టి.ఆర్. మొదట్లో అనుకున్నారో, ఆ శ్రీకృష్ణ పాత్రతోనే తరువాత కాలంలో ఆయన ఒక కొత్త ఒరవడి సృష్టించారు. కృష్ణుడంటే ఆయనేనని నమ్మిన జనం ఎన్.టి.ఆర్. ఫొటోలను ఇళ్లలో పెట్టుకొని పూజలు చేసేవారు.

అంతవరకూ సినిమా కృష్ణుడంటే ఈలపాట రఘురామయ్యే. అయితే 'మాయాబజార్' చిత్రంతో ఎన్.టి.ఆర్.ని ఆయన స్థానంలో నిలబెట్టారు దర్శకుడు కె.వి.రెడ్డి. పాతికేళ్ల వ్యవధిలో 18 చిత్రాల్లో ఆయన కృష్ణుని పాత్ర పోషించారు. ఒకే పాత్రను ప్రపంచంలో ఇన్నిసార్లు పోషించిన నటుడు ఎవరైనా ఉన్నారా అని వెదికితే సమాధానం దొరక్క పోవచ్చు. ఎన్.టి.ఆర్. 'కృష్ణావతారం' విశేషాలు...



'వీరాభిమన్యు' చిత్రంలో ఎన్.టి.ఆర్., కాంతారావు


'ఇద్దరు పెళ్లాలు' లో మొదటిసారి కృష్ణునిగా



# జోహారు శిఖిపింఛమౌళి

ఆయన పేరు నందమూరి తారక రామారావు. అయినా శ్రీ కృష్ణుని పాత్రలకు పెట్టింది పేరుగా నిలిచి వెండితెర వేల్పుగా తెలుగువారి హృదయాల్లో శాశ్వతస్థానం ఏర్పరచుకున్నారు. మూడున్నర దశాబ్దాలకుపైగా ఉన్న తన నటజీవితంలో ఎన్.టి.ఆర్. నటించిన చిత్రాల్లో సాంఘికాల సంఖ్యే అధికమైనప్పటికీ, ఆయనకు అపారమైన పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టినవి మాత్రం పౌరాణిక పాత్రలే. ముఖ్యంగా శ్రీకృష్ణుని పాత్రను అనితరసాధ్యమైన రీతిలో పోషించిన ఎన్.టి.ఆర్. తెలుగు ప్రేక్షకులకు ఆరాధ్యదైవం అయ్యారు. పాతికేళ్లలో 18 చిత్రాల్లో శ్రీకృష్ణుని పాత్రను పూర్తి స్థాయిలో పోషించడమే కాకుండా ఒకే ఆహార్యం, ఒక వయసును ప్రతిబింబిస్తూ నటించడం ఆయనకు మాత్రమే సాధ్యమైంది.



ఆ పరంగా ఆయన ప్రపంచ రికార్డ్ నెలకొల్పారనే చెప్పాలి. ఎన్.టి.ఆర్.కు ముందు, తర్వాత కూడా ఎందరో నటులు శ్రీకృష్ణుని పాత్ర పోషించినప్పటికీ ప్రేక్షకులు వారిలో దైవత్వం చూడలేకపోయారు. ఆ పాత్రలో ఎన్.టి.ఆర్.ను ఆరాధించినట్లుగా, అభిమానించినట్లుగా ఇతరులను ఆదరించలేకపోయారు. ఇప్పటికీ కృష్ణుని గెటప్‌లో ఉన్న ఎన్.టి.ఆర్. బొమ్మకు అగరు వత్తులు వెలిగించి హారతులు ఇచ్చి, పూజలు చేసేవారున్నారనడం అతిశయోక్తి కాదు. అందుకే కారణజన్మునిగా నిలిచారు ఎన్.టి.ఆర్.

ఆయన చిత్రరంగంలో ప్రవేశించే నాటికే పౌరాణిక చిత్రాల ప్రాభవం ముగిసింది. అప్పటివరకూ తెరకుఎక్కిన పౌరాణికాలన్నీ స్టేజి నాటకాల ఫక్కీలోనే ఉండేవి. కాకపోతే సినిమాకు ఉన్న అదనపు హంగుల వల్ల ఆ నాటకాలు సినిమాలుగా మరింత రాణించాయి. ఎన్.టి.ఆర్. తొలిసారిగా పౌరాణిక పాత్ర పోషించిన 'మాయారంభ' చిత్రం కూడా నాటక ఫక్కీలో మలిచిందే. అటువంటి తరుణంలో చిత్ర రంగంలోకి ప్రవేశించిన ఎన్.టి.ఆర్. తన ప్రతిభతో పౌరాణికాలకు పునర్జీవం పోశారు. పురాణ పాత్రలకు ప్రాణ ప్రతిష్ఠ చేసే

నటుడు దొరకడంతో ఎంతోమంది దర్శక నిర్మాతలు మళ్లీ పౌరాణిక చిత్ర నిర్మాణానికి పూనుకున్నారు. ఇది చరిత్ర చెప్పే సత్యం.


### 33 సార్లు కృష్ణునిగా...

సినిమాలలోని అంతర్నాటకాలతో కలిపి మొత్తం 33 సార్లు కృష్ణునిగా నటించారు ఎన్.టి.ఆర్. కృష్ణునిగా అన్నిసార్లు ఆ పాత్ర పోషించడం, ప్రతిసారీ ప్రేక్షకుల్ని రంజింపజేసి మెప్పించడమన్నది అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. అందుకే ఒకే ఒక్క ఎన్.టి.ఆర్. అనిపించుకున్నారు. ఆయన సమకాలికులైన కొందరు నటులకు కృష్ణుని పాత్రను పోషించే అవకాశం వచ్చినా, ప్రతిసారీ వారిని ఎన్.టి.ఆర్.తో పోల్చుకునేవారు ప్రేక్షకులు. అందుకే శ్రీకృష్ణుని పాత్ర పోషించాలనే కోరిక మనసులో ఉన్నా, ధైర్యం చేయలేక 'అమ్మో..'' అనేవారు చాలామంది. ఎన్.టి.ఆర్. స్వయంగా నచ్చజెప్పి కొంతమంది నటులతో ఆ పాత్ర పోషింపజేసే వారు. ఉదాహరణకు చెప్పాలంటే.. 'భీష్మ' చిత్రంలో శ్రీకృష్ణుడు పాత్రను హరనాథ్ పోషించడానికి ఎన్.టి.ఆర్. ప్రోత్సాహమే కారణం.

### 'ఇద్దరు పెళ్లాలు'లో అలా..

తొలిసారిగా ఆయన 'ఇద్దరు పెళ్లాలు' చిత్రంలో కృష్ణుని పాత్రలో కనిపించారు. కళా దర్శకుడు ఎఫ్. నాగూర్ స్వీయ దర్శకత్వంలో నాగూర్ సినీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన సినిమా ఇది. తన నాలుగో చిత్రం 'మాయారంభ'లో తొలిసారిగా పౌరాణిక పాత్ర పోషించినప్పటికీ ఆ తర్వాత దాదాపు ఏడేళ్ల వరకూ ఎన్.టి.ఆర్.తో ఏ నిర్మాత పౌరాణికాలు తీయలేదు. పౌరాణిక పాత్రల ప్రభావం తగ్గి సాంఘిక చిత్రాలకు ప్రాధాన్యం పెరగడమే దీనికి ఒక కారణం కావచ్చు. పౌరాణిక పాత్రలను పోషించే నటులు లేరేమోననే సంశయం కూడా దర్శక నిర్మాతలకు ఉండి ఉండవచ్చు. ఇటువంటి నేపథ్యంలో దర్శక నిర్మాత నాగూర్‌కు ఎన్.టి.ఆర్.తో కృష్ణుని గెటప్ వేయించాలనే కోరిక ఎందుకు కలిగిందో కానీ






ఆయన ఆ పాత్రలో నటించిన ముహూర్తం మాత్రం ఎంతో బలమైనదని, భవిష్యత్తులో కృష్ణుని పాత్రల్లో ఆయన ఒదిగిపోవడానికి ఈ ముహూర్తం ఎంతో కొంత కారణమైందని చెప్పేవారు లేకపోలేదు. అయితే 'ఇద్దరు పెళ్లాలు' చిత్రంలో ఎన్.టి.ఆర్. కృష్ణునిగా కనిపించేది ఒక నిమిషం పాటే. 'మదిలో హాయి కలలే రేపి విరిసే నీరేయి గోపాలా బాలా...' అనే పాటలో ఆయన అలా కనిపిస్తారు. కథానాయిక జమున కలలో వచ్చే దృశ్యమిది. (ఈ చిత్రం వీసీడి మార్కెట్‌లో దొరుకుతోంది) ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్. పాత్ర పేరు మల్లు. జమున పాత్రపేరు కన్నమ్మ. 1954 అక్టోబర్ 6న విడుదలైన 'ఇద్దరు పెళ్లాలు' చిత్రంలో ఇలా వచ్చి అలా వెళ్లిపోయే సన్నివేశం కావడంతో ఎన్.టి.ఆర్. గెటప్ గురించి ఆ రోజుల్లో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అసలు ఈ సినిమాలో ఆయన తొలిసారి కృష్ణునిగా నటించారన్న విషయం కూడా ఇప్పటికీ చాలా మందికి తెలీదు. 'సొంతవూరు' సినిమాలోనే ఆయన తొలిసారిగా కృష్ణునిగా నటించారన్న విషయం బహుళ ప్రచారంలో ఉండడమే దీనికి కారణం.

**'సొంతవూరు' నుంచి 'మాయాబజార్'కు**

ఆపై మరో రెండేళ్లకు 'సొంతవూరు' చిత్రంలో మళ్లీ కృష్ణునిపాత్ర పోషించారు ఎన్.టి.ఆర్. ఇది కూడా అంతర్నాటకంలో వచ్చే దృశ్యమే. అయితే నిడివి కొంచెం ఎక్కువ ఉండటంతో ప్రేక్షకుల దృష్టి ప్రత్యేకంగా ఎన్.టి.ఆర్. గెటప్‌పై పడింది. అది వాళ్లకు నచ్చకపోవడంతో గోలగోల చేశారు. కృష్ణుని పాత్రకు పనికిరారని ప్రచారం చేశారు కూడా.

ఈ విషయం గురించి ఎన్.టి.ఆర్. ఓ సందర్భంలో ఇలా చెప్పారు. 'ఆ చిత్రంలో కృష్ణునికి ఇచ్చిన మేకప్ నా వయసుకు సరిపడలేదు. బాల కృష్ణునికి ఇచ్చే ఆహార్యం అది. అందుకే ప్రేక్షకాదరణ పొందలేదు. కాబట్టే కె.వి.రెడ్డిగారు 'మాయాబజార్'లో కృష్ణుడు పాత్రకు నన్ను ఎన్నుకున్నప్పుడు అంతా విస్తుపోయారు. 'రామారావేమిటి... కృష్ణుడు పాత్రను వేయడం ఏమిటి' అంటూ విమర్శించారు. అయితే



కృష్ణుడి గెటప్‌కోసం ఎన్.టి.ఆర్. వాడిన ఆభరణాలు

రెడ్డిగారు ఆ విమర్శలు పట్టించుకోలేదు. వేషం, దుస్తులు, నగలు వంటి వాటిపై యోచన చేసి పాత్రకు నిర్దుష్టమైన రూపకల్పన చేశారు. ఆయన సూచనలపై కళా దర్శకులు గోఖలే స్కెచెస్ తయారు చేశారు. బార్ట్లే కూడా లైటప్ బాగా చేశారు. 'మాయాబజార్'లో కృష్ణుడు మొత్తం కథకే సూత్రధారి. అందుకే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎన్నో మేకప్ టెస్టులు చేసి, గెటప్‌ను ఫైనల్ చేయాల్సి వచ్చింది". ఈ పాత్ర పోషించేముందు కె.వి.రెడ్డి, ఎన్.టి.ఆర్.తో ఇలా చెప్పారట. 'కృష్ణుని పాత్రకు మీరు సరిపోతారని నాకు ఎందుకో అనిపిస్తోంది. అందుకే అందరూ వద్దంటున్నా ధైర్యం చేస్తున్నాను. కానీ మీరు బాగా సాధన చెయ్యాలి. భుజాలు కొంచెం కిందకు వంగాలి. కళ్లలో కొంటెతనం, నడకలో వయ్యారం కనిపించాలి' అని. ఆ మాటల్ని దృష్టిలో పెట్టుకుని కొన్ని నెలలపాటు శ్రమించి బాగా సన్నబడ్డారు. భుజాలు కొంచెం కిందకు వంగాయి.


అలా ఆ రోజు తెర కృష్ణుడుగా వెలిసిన ఎన్.టి.ఆర్. ఆ తర్వాత కేలండర్ కృష్ణుడై ఆరాధ్య నటుడయ్యారు.

'మాయాబజార్' చిత్రంలో ఎన్.టి.ఆర్.ని కలియుగ కృష్ణునిగా నిలబెట్టిన కె.వి.రెడ్డి, మళ్లా 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రంలో ఆయన చేత కృష్ణుని వేషం వేయించారు. ఈ రెండు పాత్రలు పోషించిన వ్యక్తి ఒకరే అయినా నటనలో ఎంతో తేడా కనిపిస్తుంది. 'మాయాబజార్' కృష్ణునికి మాట, పాట, కదలిక తక్కువ. సున్నితమైన నటన ఎక్కువ. చిరునవ్వుతోనే ఎన్నో అర్థాలు పలికించిన పాత్ర అది. కొత్త సినిమా కృష్ణుడు ఈ చిత్రంతో అవతరించాడు.

'శ్రీ కృష్ణార్జునయుద్ధం' చిత్రంలో కృష్ణుడు కంఠంలోనే కాదు కంటితో కూడా పలికాడు.

### ఆభరణాల మ్యూజియం

తను పోషించిన పౌరాణిక పాత్రలకు సంబంధించిన దుస్తులు, గదలు, ఆభరణాలు, ఇత్యాదుల్ని సేకరించి భద్రపరిచారు ఎన్.టి.ఆర్. ఆయన రెండో సతీమణి లక్ష్మీపార్వతి ఆధీనంలో ఉన్న మ్యూజియంలోని అభరణాలను 'తెలుగు సినిమా వజ్రోత్సవం'లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలుగు చిత్ర పరిశ్రమలోని అగ్ర కథానాయకులు అందరూ ఆ ఆభరణాలను సందర్శించి, ఎన్.టి.ఆర్.తో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకోవడం సినీ ప్రియులను పులకింపజేసిన సంఘటన.



### ఈ ఆభరణాలను సేకరించాలనే ఆసక్తి ఎన్.టి.ఆర్.కు ఎందుకు కలిగింది?

ఆ విషయాన్ని ఆయనే ఓ సందర్భంలో వెల్లడించారు. "1955లో అనుకుంటాను... 'జయసింహ' చిత్రంలోని ఒక సన్నివేశంలో నేను అర్జునుని పాత్రలో కనిపిస్తాను. నా పౌరాణిక పాత్రలకు అది తొలిమెట్టు అని చెప్పాలి. ఎందుకంటే ఆ పాత్ర ధరించిన తర్వాతే పూర్తిస్థాయి పౌరాణిక చిత్రం చేయాలనే కోరిక నాలో కలిగింది. ఆ తర్వాతికాలంలో అది నెరవేరిందనుకోండి. పౌరాణిక పాత్రలు ధరించి కాస్త గుర్తింపు వచ్చాక వాటిపై స్పెషలైజ్ చేయాలనే ఆలోచన కలిగింది. అదే నా పరిశోధనకు నాంది పలికింది. ఆనాటి నుంచి నేటిదాకా ఎంతోమంది కళా దర్శకులు అద్భుతంగా రూపొందించిన ఆభరణాలను, కిరీటాలను భద్రపరుస్తున్నాను. కొన్నింటిని నేనే భావంచెప్పి రూపొందింపచేశాను. ఇవన్నీ నేను సేకరించి జాగ్రత్త చేయకపోయినట్లయితే నాకు కావలసిన పాత్రకు తగిన ఆభరణాలు ఎక్కడ దొరుకుతాయి? ఒకవేళ దొరికినా అవి నా అభిరుచుల మేరకు ఉంటాయనే నమ్మకం ఎక్కడుంది? అందుకే వీటిని పదిలపరిచాను. వీటన్నింటినీ కంటికిరెప్పలా కాపాడుకుంటున్నాను. ఒక్కోసారి వీటిని చూస్తున్నప్పుడు ఒక్కో కిరీటం, ఒక్కోగద నాలోని కళాకారుణ్ణి తట్టి లేపుతుంది. తన్మయుణ్ణి చేస్తుంది. ఖరీదు కట్టలేని ఈ అపురూప ఆభరణాలను చూస్తుంటే ఆనాటి పౌరాణిక వైభవం, ఒక్కసారి కళ్లలో అలా కదలాడుతుంది" అని పేర్కొన్నారు.

### ఎందుకంత వ్యామోహం?

పౌరాణికం పేరు చెప్పగానే ఎన్.టి. ఆర్., ఆయన పేరు చెప్పగానే పౌరాణిక చిత్రాలు వెంటనే గుర్తుకు వస్తాయి. పౌరాణికాలపై తనదైన ముద్రను ప్రతిష్టించుకున్న ఎన్.టి.ఆర్.కు పౌరాణికాలంటే ఎందుకంత వ్యామోహం అనేది ఆసక్తికలిగించే అంశమే. ఆ సందేహాన్ని ఒకసారి ఆయన ముందు ఉంచితే చిరునవ్వుతో ఇలా సమాధానం చెప్పారు.

'ఆ పాత్రల రూపకల్పన కోసం నా జీవితాన్ని వెచ్చించాను. అహోరాత్రులు కృషిచేశాను. నా కృషి, దీక్ష ఊరికే పోలేదని, ఫలించాయని ప్రేక్షకుల అభిమానం చెబుతోంది. పౌరాణికాల్లో రాముడు, కృష్ణుడు, అర్జునుడు, రావణుడు, కీచకుడు, కర్ణుడు, బృహన్నల, దుర్యోధనుడు, భీష్ముడు, భీముడు, వేంకటేశ్వరస్వామి, ఇంద్రజిత్ మొదలైన ఎన్నో పాత్రలు ధరించాను. అయితే సృష్టికి ప్రతిసృష్టి చేసిన వ్యక్తి విశ్వామిత్ర. అలాంటి పాత్ర చేయాలని నా కోరిక. చూద్దాం.. అదెప్పుడు నెరవేరుతుందో!?".


1981లో వెల్లడించిన ఈ కోరికను సరిగ్గా పదేళ్ల అనంతరం 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' చిత్రంతో నెరవేర్చుకున్నారు ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి సినిమాల్లో నటించకూడదనే నియమాన్ని, నిబంధనని పక్కకుపెట్టి అటు రాష్ట్రాధినేతగా కర్తవ్య నిర్వహణ చేస్తూనే, కళాకారునిగా కూడా తన బాధ్యతను 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' చిత్రంతో నిర్వహించి 'దటీజ్ ఎన్.టి.ఆర్.' అనిపించుకున్నారు.




# పురాణ పురుషుడు

భారతీయ పురాణపాత్రల పోషణలో ఎన్.టి.ఆర్. ప్రపంచ చలనచిత్ర పరిశ్రమలోనే అనితర సాధ్యమైన ఓ శైలిని రూపొందించుకున్నారు. ఆయనకు గొప్పపేరు తెచ్చిన వాటిల్లో నాయక పాత్రలకు ఎంత ప్రాధాన్యం ఉందో, ప్రతి నాయక పాత్రలకూ అంతే ఉంది. తనలోని నటుణ్ణి సంతృప్తి పరుచుకోవడానికి ఆయన విభిన్న పౌరాణిక పాత్రలు పోషించారు. పోటీ ప్రపంచంలో అడుగడుగునా తన ప్రత్యేకతను చాటుకోవడానికి, తన స్థానం నిలబెట్టుకోవడానికి ఎన్.టి.ఆర్. తన శరీరాన్ని ప్రయోగశాలగా మార్చారనడం అతిశయోక్తిగాదు.

అన్ని రకాల పాత్రలు అవలీలగా పోషించిన ఎన్.టి.ఆర్. పౌరాణిక నటనా పటిమపై ఓ విశ్లేషణ.



'దక్షయజ్ఞం' చిత్రంలో
శివుని పాత్రలో..



# ఎన్.టి.ఆర్. - పౌరాణికాలు

కొన్ని పాత్రలవల్ల నటులకు పేరు వస్తుంది. అలాగే కొందరు నటులవల్ల వారు పోషించే పాత్రలకు రాణింపు కలుగుతుంది. ఎన్.టి.ఆర్. రెండోకోవలోకి వస్తారు. ఆర్టిస్ట్‌గా ఆయన నడత, ఒరవడి వెనుకతరాల వారికి ఆశ్చర్యం... ముందు తరాలవారికి ఆదర్శం. ఎన్ని వందల పాత్రలు ఆయనలో ఎంతగా ఒదిగి పోయాయో, ఆయన ఆ పాత్రల్లో అంతగా ఇమిడి పోయారు. ఏ ఆహార్యమైనా, ఆయనకు ఇట్టే వర్తిస్తుంది. అంతటి అద్భుతమైన నటుడు మరే భారతీయ భాషలో లేకపోవడం, తెలుగువాడిగా పుట్టడం మన అదృష్టం. అలాగే ఎన్.టి.ఆర్. పేరు వినగానే ఆయన పోషించిన శ్రీకృష్ణ, శ్రీరామ, రావణ, సుయోధన పాత్రలే ముందుగా స్మృతిపథంలో మెదులుతాయి. ఒక నటుని పేరు వినగానే ఆ ప్రాంతానికి చెందిన పురాణ పాత్రల ప్రసక్తి వెంటనే గుర్తుకు రావడం యావత్ ప్రపంచంలో ఎన్.టి.ఆర్. విషయంలోనే ఎక్కువగా కనిపి

స్తుంది. అయినా ఆయనకి తగిన విధంగా గౌరవం లభించలేదని, అవార్డులు ఆ స్థాయిలో రాలేదని బాధపడేవారు ఈ నాటికీ ఉన్నారు. ఈ నటరత్నాన్ని 'భారతరత్న'గా గౌరవించాలనే డిమాండ్ ఈనాటిది కాదు.

అభిమానులకు, ప్రేక్షకులకు ఎన్.టి.ఆర్.ని చూస్తుంటే సాక్షాత్తూ ఆ భగవంతుడే అన్నంత అనుభూతి కలిగేది. అందుకే ఆయన్ని చూడగానే సాష్టాంగ నమస్కారాలు చేసేవారు. తిరుపతి దేవుడు దర్శనం కాకపోయినా పర్వా లేదు కానీ చెన్నై తీసుకువెళ్లి ఎన్.టి.ఆర్.ని చూపించకపోతే గోలగోల చేసేవారట ఆంధ్రా ప్రాంతం నుండి






టూరిస్టు బస్సుల్లో వచ్చే వారంతా. ఏ జన్మలో ఆయన చేసుకున్న పుణ్యమో ఇది.

ముఖ్యంగా పౌరాణికపాత్రలు అనగానే రామారావు పేరే గుర్తుకు వస్తుంది. ఆయా పాత్రలను పోషించడానికే ఆయన పుట్టారేమో అని కూడా అనిపిస్తుంది. మనం ఏనాడూ చూడని రూపాలకు తన నటనతో అద్భుత రూపకల్పన చేసిన దైవాంశ సంభూతుడాయన. ఆయన పోషించిన పౌరాణిక పాత్రలను విశ్లేషిద్దాం...

ఎన్.టి.ఆర్. చిత్ర పరిశ్రమలో ప్రవేశించేనాటికి నాటకఫక్కీలో ఉండే పురాణాల చిత్రనిర్మాణం క్రమంగా తెరమరుగవుతోంది. ఆయన నటించిన తొలి పౌరాణిక పాత్ర 'మాయా రంభ' చిత్రంలో నలకూబరుడు. ఈ సినిమా కూడా నాటకఫక్కీలోనే రూపొందింది. ఇక అప్పటినుంచి పౌరాణిక నాయక పాత్రలకూ, ప్రతి నాయక పాత్రలకు కూడా సరిపోయే ఏకైక నటుడుగా ఎన్.టి.ఆర్. ఎదిగారు. ఆ ఎదుగుదలలో

నటనకు మించిన ఆయన కృషి కనిపిస్తుంది.

కృష్ణుని పాత్రలో నాజూకుగా, ఒద్దికగా ఇమిడిపోయిన రామారావే దుర్యోధనునిగానో, రావణునిగానో జూలు విదిల్చిన సింహంలా కనిపించడం చూసి ఎందరో ఆశ్చర్యపోయారు. అనితరసాధ్యమైన ఆయన అభినయ సామర్థ్యానికి హారతులు పట్టారు. ముఖ్యంగా దుష్ట పాత్రలుగా పరిగణించిన వాటిలోంచి కూడా మంచిని పిండి చూపించడం ఎన్.టి. ఆర్.కి మాత్రమే సాధ్యమైంది. అంతేకాదు ఒకే చిత్రంలో అటు రాముడుగాను, ఇటు రావణాసురుడుగాను, మరోపక్క శ్రీకృష్ణుడుగానూ, దుర్యోధనుడుగానూ నటించారు, విభిన్న ప్రవృత్తులుగల ఆ పాత్రల పోషణలో వైవిధ్యాన్ని ప్రదర్శించి 'అయ్యారే' అనిపించుకున్నారు ఎన్.టి.ఆర్. ఒక నెగటివ్ పాత్రను పాజిటివ్‌గా మలిచి మెప్పించడం మీకే సాధ్యమైంది బ్రదర్' అని సహనటుడు ఎ.ఎన్.ఆర్. ప్రశంస కూడా అందుకున్నారు. 'దాన వీర శూరకర్ణ' చిత్రంలో కుల వ్యవస్థను చీల్చి చెండాడుతూ దుర్యోధనుణ్ణి సుయోధనుడుగా చేసిన తీరు, ఆ పాత్రను ఎన్.టి.ఆర్. పోషించిన వైనం చూసి 'భళా ఎన్.టి.ఆర్. భళా' అని ప్రతి ఒక్కరూ ప్రశంసించారు. ఆ చిత్రంలోని


'శ్రీకృష్ణ విజయం'లో


'భూకైలాస్'లో

దుర్యోధనుని డైలాగ్ ఎంతో పాపులర్ అయింది. 'ఆగాగు.. ఏమంటివి.. ఏమంటివి జాతి నెపమున సూత సుతునకు ఇందు నిలువ అర్హత లేదందువా? ఎంత మాట.. ఎంతమాట..'' అనే ఆ సుదీర్ఘమైన డైలాగు ఎన్నో సెల్‌ఫోన్స్‌లో కాలర్‌ట్యూన్‌గా ఇప్పుడు వినిపిస్తోంది.

సినిమాల్లో ఎలాంటి భాషయినా అర్థవంతంగా భావస్ఫోరకంగా చెప్పడంలో ఎన్.టి.ఆర్., ఎస్.వి.ఆర్. ప్రసిద్ధులు. ముఖ్యంగా రామారావు కిలోల బరువున్నా కిరీటం ధరించి మరీ డైలాగులు చెప్పేవారు. అంత బరువు బ్యాలెన్స్ చేస్తూ భావం చెడకుండా డైలాగులు చెప్పడం ఆయనకే సాధ్యమైంది. అలాగే ఈ సినిమాలో ఒకే ఫ్రేమ్‌లో శ్రీ కృష్ణుడు, కర్ణుడు, దుర్యోధనుడుగా ఎన్.టి.ఆర్ కనిపించి ప్రేక్షకుల్ని పరవశుల్ని చేశారు. అదేవిధంగా 'శ్రీమద్ విరాటపర్వం' చిత్రంలో ఐదు పాత్రలను పోషించి, దర్శకత్వ నిర్మాణ బాధ్యతలు కూడా వహించి ప్రపంచరికార్డ్ నెల కొల్పారు.

'సితార' సినీవార పత్రిక కోసం నేను ఒకసారి ఎన్.టి.ఆర్.ని ఇంటర్వ్యూ చేసినప్పుడు మాటల మధ్య పౌరాణిక పాత్రల ప్రస్తావన వచ్చింది. అప్పుడాయన మాట్లాడుతూ "తనమీద తను ప్రయోగం చేసుకోవడం అనేది ఒక ప్రక్రియ. ప్రపంచంలో ఏ నటుడు చేయని ప్రయోగాలు నేను చేశాను. రాముడు వేషం వేసిన ఏ నటుడూ నెగటివ్ క్యారెక్టర్ రావణాసురుడు వెయ్యలేదు. అలాగే కృష్ణుడు వేషం వేసిన వాళ్లు దుర్యోధనుడుగా చెయ్యలేదు. ఒకే సినిమాలో అయిదు విభిన్నమైన పౌరాణిక పాత్రలు ఎవరూ వెయ్యలేదు. ఆ పాత్రలు వెయ్యడమే కాదు నేను డైరెక్ట్



'సతీసావిత్రి'లో యమునిగా

చేశాను కూడా. ఎన్.టి.ఆర్.ని నటనలో కానీ చిత్ర పరిశ్రమలో కానీ మించినవాళ్లు లేరు. ఇవి నేను అహంకారంతో చెబుతున్న మాటలు కావు. ప్రత్యక్ష సాక్ష్యాలు మీ ఎదురుగా ఉన్నాయి. నేను కమర్షియల్ ఆర్టిస్ట్‌ను కాదు... ఎక్స్‌పెరిమెంటల్ ఆర్టిస్ట్‌ను. అయినా ఎవరి డబ్బుతోనో నేను ప్రయోగాలు చెయ్యలేదు. నా సొంత డబ్బుపోయినా పరవాలేదు. వేరే నిర్మాత నాకు డబ్బు ఇచ్చి నటింపచేసినందుకు లాభం పొందాలని చూస్తారు కానీ నష్టపోవాలని ఎవరూ అనుకోరు. నేను కూడా వారికి ఎలా లాభం చేకూర్చాలని ఆలోచిస్తాను తప్ప ప్రయోగాలు చెయ్యను" అని వివరించారు.

ఏది ఏమైనా తన నటనవల్ల రావణాసురునికి ఎన్.టి.ఆర్. ఆకర్షణ పెంచారు. అర్జునునికి క్రేజ్‌ని, భీముని రేంజ్‌ని పెంపొందించారు. భీష్మునికి పాపులారిటీ పెరిగింది... ఇలా ఆ యా పాత్రలు ఆయన కారణంగానే తమ పరిధిని పెంచుకున్నాయనడం అతిశయోక్తి కాదు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఎప్పుడూ కళకళలాడుతూ వుండాలంటే పౌరాణిక చిత్రాల అవసరం ఎంతైనా వుందని అభిప్రాయపడిన ఎన్.టి.ఆర్. ఒక ఉద్యమ స్థాయిలో పౌరాణిక పాత్రలను పోషించారు. ■



'పాండవ వనవాసం'లో భీముడు

# ఉగ్రూతలూగించిన కత్తివీరుడు

'షావుకారు' సినిమాలో రొమాంటిక్ హీరోగా ఎన్.టి.ఆర్. ప్రదర్శించిన నటన చూసి ఆయన సాంఘిక చిత్రాలకే ఎక్కువగా పనికివస్తారని అనుకున్నవారూ లేకపోలేదు. అయితే ఆ తర్వాత వచ్చిన 'పాతాళభైరవి' చిత్రం ఎన్.టి.ఆర్. ఇమేజ్‌ని ఒక్కసారిగా మార్చేసింది. జానపద హీరోకి ఉండాల్సిన లక్షణాలు ఆయనలో పుష్కలంగా ఉన్నాయని ఆ చిత్ర ఘనవిజయం నిరూపించింది.

మరో విషయమేమిటంటే, తన బేనరుపై నిర్మించిన 'పిచ్చిపుల్లయ్య', 'తోడుదొంగలు' చిత్రాలు ఆర్థికంగా దెబ్బతినడంతో జాపనద కథతో 'జయసింహ' చిత్రాన్ని నిర్మించి విజయం సాధించారు. జానపదాలంటే ఆయనకు మరింత మక్కువ పెరగడానికి ఇదికూడా ఒక కారణం.

ఎన్.టి.ఆర్. జానపద వైభవం కొనసాగిందిలా...



'విజయం మనదే' చిత్రంలో
ఎన్.టి.ఆర్., బి.సరోజాదేవి

# జానపద హీరో




ఎన్.టి.ఆర్‌ని మాస్ ప్రేక్షకులకి మరింత దగ్గర చేసినవి జానపద చిత్రాలే. హీరోగా ఆయన నటించిన తొలిచిత్రం 'పల్లెటూరి పిల్ల' జానపదమే. ఈ సినిమాతో రామారావు అందరి దృష్టిలో పడితే, ఆయన ఆరోచిత్రం 'పాతాళభైరవి'తో పామరజనం హృదయాల్లో సుస్థిరస్థానం ఏర్పరచుకున్నారు. ఈ సినిమా విడుదలయ్యే సమయానికి జానపద సినిమాకు కళ తప్పి, తీసిన నిర్మాతలకు కన్నీరే మిగిలే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. 'పాతాళభైరవి' చిత్రం కూడా సోదిలో లేకుండా పోతుందని భావించిన సినీ పండితుల ఊహలను తలకిందులు చేస్తూ ఈ చిత్రం సంచలన విజయం సొంతం చేసుకుంది.

1951లో ఎన్.టి.ఆర్ నటించిన రెండు చిత్రాలు మాత్రమే విడుదలయ్యాయి. ఒకటి 'పాతాళభైరవి', మరొకటి 'మల్లీశ్వరి'. ఒకటి మాస్, మరొకటి క్లాసు. ఒక సినిమాలో ఆయన సాహసాలు చేసే తోట రాముడు. మరో సినిమాలో ప్రేయసిని తలుచుకుని, ఆమె వియోగంతో కుమిలిపోయే నాగరాజు. ఒకరకంగా ఎన్.టి.ఆర్ కెరీర్‌కు దిశానిర్దేశం చేసింది ఈ సంవత్సరమేనని చెప్పాలి. తోటరాముడు తరహా పాత్రల్లో నటించాలా, నాగరాజు వంటి కళాత్మక పాత్రల్లో కొనసాగాలా అనే ప్రశ్న ఎదురైనప్పుడు వినోదాన్నే ఎంచుకున్నారు రామారావు. ఇక అక్కడ నుంచి దాదాపు 40 ఏళ్లపాటు ఎన్.టి.ఆర్ పోషించిన పాత్రలన్నీ తోటరామునికి కొనసాగింపుగానే భావించాలి.

దుర్మార్గుల అన్యాయాలను ఎదిరించి పేదలకు అండగా నిలిచే స్వభావం కూడా ఆయన పాత్రలకు తోటరాముని వారసత్వంగానే అబ్బింది.

మరో ముఖ్య విశేషమేమిటంటే ఎన్.టి.ఆర్ సినిమాలకు ఆయనే కేంద్ర బిందువు. అది జానపదమైనా, సాంఘికమైనా ఇతర హంగులేవీ పెద్దగా లేకున్నా ఎన్.టి.ఆర్ ఉంటే చాలు అనుకుని జనం ఎగబడి సినిమాలు చూసేవారు. ఆయన కత్తియుద్ధం చేసినా, గుర్రమెక్కి స్వారీ చేసినా విజిల్స్‌తో కేరింతలు కొట్టేవారు. అలా జానపద సినిమాకు ఒక వైభవం సంతరించి పెట్టిన ఘనత ఎన్.టి.ఆర్‌దే. ఆయన నటించిన 'పాతాళభైరవి' విషయాన్నే మళ్లీ పరిశీలిస్తే జానపద చిత్రాల నిర్మాణానికి అదొక వ్యాకరణం లాంటిది. ఆ సినిమా వచ్చి 60 ఏళ్లు కావస్తున్నా అందులోని "నరుడా ఏమి నీ కోరిక..", "సాహసం శాయరా డింభకా" వంటి డైలాగులు ఇప్పటికీ జనం నోళ్లలో నానుతూనే ఉన్నాయి. ఈ నాటికీ ఆ చిత్రం దరిదాపుల్లో నిలువ గలిగిన జానపద చిత్రం ఏదీ రాలేదనడం అతిశయోక్తి కాదు.

ఆ తర్వాత 'చండీరాణి' (1953), 'చంద్రహారం' (1954), 'రేచుక్క' (1954), 'రాజు-పేద' (1954), 'విజయగౌరి' (1955) చిత్రాల్లో జానపద హీరోగానూ విలక్షణమైన నటన ప్రదర్శించారు. అనంతరం సొంత బేనరుపై ఆయన నిర్మించిన 'జయసింహ' (1955) చిత్రం ఘనవిజయం సాధించి ఎన్.టి.ఆర్.కు మరింత పేరు తెచ్చి పెట్టింది. తన కెరీర్‌లో ఆయన 52 జానపద చిత్రాల్లో నటించారు. ఒక రకంగా చెప్పాలంటే ఆయన నటించిన పౌరాణికాలతో పోలిస్తే ఈ సంఖ్య ఎక్కువే. వాటిల్లో


'స్వర్ణమంజరి'లో

ప్రముఖంగా పేర్కొనదగినవి.. 'జగదేకవీరుని కథ', 'కంచుకోట', 'బందిపోటు', 'గోపాలుడు-భూపాలుడు', 'గండికోట రహస్యం', 'చిక్కడు-దొరకడు', 'ఆలీబాబా 40 దొంగలు', 'మంగమ్మ శపథం'.

జానపద బ్రహ్మగా పేరొందిన బి.విఠలాచార్య రంగప్రవేశంతో జానపద చిత్రాలకు సరికొత్త రూపురేఖలు ఏర్పడ్డాయని చెప్పాలి. జానపద కథానాయకుడు పంచె కట్టుకోవడం మానేసి శరీరానికి హత్తుకుపోయే స్కిన్ టైట్ నైలాన్ ప్యాంట్లు ధరించడం మొదలు పెట్టింది విఠలాచార్య హయాంలోనే. ఎన్.టి.ఆర్, విఠలాచార్య కాంబినేషన్‌లో వచ్చిన తొలి సినిమా 'బందిపోటు'. ఈ సినిమా ఘనవిజయం సాధించడంతో వీరిద్దరి కలయికలో 12 జానపద చిత్రాలు వచ్చాయి. మారువేషాలపై తనకు ఉన్న మక్కువని ఈ జానపదచిత్రాలతో తీర్చుకునేవారు రామారావు. ప్రతి సినిమాలో కనీసం రెండన్నా మారు వేషాలు వేసి అభిమానులను అలరించేవారు. తక్కువ రోజుల్లోనే విఠలాచార్య సినిమాని పూర్తిచేసేవారు. కనుక ఆయన్ని దర్శకుడిగా పెట్టుకోమని తన నిర్మాతలకు సూచించేవారు ఎన్.టి.ఆర్.

1978లో వచ్చిన 'సింహబలుడు' ఎన్.టి.ఆర్. నటించిన చివరి జానపద చిత్రం.

■



'రాణీరత్నప్రభ'లో..

# విచిత్రాలు.. విశేషాలు

ఏది చేసినా అది ఎన్.టి.ఆర్.కే చెల్లింది. దుర్యోధనునికి డ్యూయెట్ పెట్టడమే కాదు, దాంతో పండిత పామరుల్ని మెప్పించడం ఆయనకే సాధ్యమైంది. 'చిత్రం భళారే విచిత్రం' అనే ఆ పాట పల్లవితో ఒక సినిమా కూడా రూపుదిద్దుకుంది. అలాగే వామహస్త అభయం కూడా ఆయన ఆచరణలో పెట్టి మెప్పించగలిగారు. ఇలాంటి పాత్రలు, విశేషాల వివరాలు...



'సీతారామకళ్యాణం'లో

## దుర్యోధనునికి డ్యూయెట్

# చిత్రం.. భళారే విచిత్రం!!



తెలుగు సినిమా చరిత్రలో 1977 జనవరి 14కి ఎంతో ప్రాముఖ్యత ఉంది. వెండితెరపై ఓ అపూర్వ సంచలనం ఆవిష్కృతమైన రోజది. 23వేల అడుగుల నిడివితో, నాలుగు గంటల పదినిమిషాల ప్రదర్శన కాలం కలిగిన 'దానవీర శూరకర్ణ' చిత్రం విడుదలైన రోజది. 'అబ్బా.. అంత పెద్ద సినిమా ఎవరు చూస్తారండి?' అని విడుదలకు ముందు కామెంట్స్ చేసినవాళ్లు ప్రేక్షకుల స్పందన చూసి నివ్వెరపోయారు. కర్త, కర్మ, క్రియ అన్నీ తనే అయి, మూడుపాత్రలు పోషించడమే కాకుండా ఎన్.టి.ఆర్. దర్శకత్వం వహించి నిర్మించిన ఈ చిత్రం విడుదలై 33 ఏళ్లు దాటినా నేటికీ సంచలనమే.


మహాభారతంలో ప్రతి నాయకుల్లా కనిపించే దుర్యోధనుడు, కర్ణుడు ఎన్.టి.ఆర్. మాహాత్మ్యంతో హీరోలుగా ఎదిగిపోయారు. వారిద్దరి మైత్రీ బంధాన్ని ప్రధానాంశంగా తీసుకుని దృశ్యకావ్యంగా ఈ చిత్రాన్ని మలిచారు ఎన్.టి.ఆర్.

ముషీరాబాద్‌లోని రెండెకరాల స్థలంలో ఎన్.టి.ఆర్. నిర్మించిన రామకృష్ణా స్టూడియోలో నిర్మాణం జరుపుకున్న తొలి చిత్రమిది. 1976లో ఎన్.టి.ఆర్. ఎనిమిది చిత్రాల్లో హీరోగా నటించారు. ఆ చిత్రాల్లో కొన్నింటిని పూర్తి చేయాల్సిన బాధ్యత

ఒకవైపు, ఈ మహాయజ్ఞాన్ని అనుకున్న ప్రకారం తెరకెక్కించవలసిన బాధ్యత మరోవైపు... అయినా పట్టువదలని ఎన్.టి.ఆర్. వజ్ర సంకల్పానికి ప్రతి రూపం ఈ చిత్రం. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండ టంతో చివర్లో మూడురోజులు వరుసగా 72 గంటల పాటు నిద్రలేకుండా రాత్రింబవళ్లు కష్టపడి సినిమాని పూర్తి చేశారు. ఈ సినిమాలో సాంకేతిక లోపాలు న్నాయి. కానీ ఎన్.టి.ఆర్. అద్భుత అభినయానికి జేజేలు పలికిన జనం ఈ లోపాలను పట్టించు కోకుండా సంచలన విజయాన్ని అందించారు.

'దానవీరశూరకర్ణ' చిత్రంలో బాగా హైలైట్ అయిన పాత్ర దుర్యోధనుడు. 'శ్రీక్రిష్ణపాండవీయం' చిత్రంతో దుర్యోధనుని పాత్రను తొలిసారిగా పోషించి, ప్రేక్షకులను పరవశింపజేసిన ఎన్.టి.ఆర్. ఈ చిత్రంలో ఆ పాత్రలో తన నట విశ్వరూపాన్ని ప్రదర్శించారు. దుర్యోధనునికి డ్యూయెట్ పెట్టడం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ. 'చిత్రం భళారే విచిత్రం' అంటూ డా॥సి.నారాయణరెడ్డి రాసిన ఈ పాట ఎంత హిట్టో చెప్పనక్కరలేదు. ఈ పాట పుట్టుక వెనుక ఆసక్తికరమైన అంశం ఒకటుంది. అదేమిటంటే నారాయణరెడ్డి రాసిన పాటను పెండ్యాల ట్యూన్ చేశారు. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం రిహార్సల్స్‌కు వచ్చారు. ఆ సమయంలో ఎన్.టి.ఆర్. కూడా అక్కడే ఉన్నారు. పాట విన్నాక ఆయన బాలుతో 'దుర్యోధనుని పాత్రకు ఒక ప్రత్యేకమైన డైలాగ్ డెలివరీని ప్రవేశ పెడుతున్నాం. ఈ పాత్ర అంతా ఆ పంథాలోనే ఉంటుంది' అని కొన్ని డైలాగులు వినిపించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాట పాడమని చెప్పగానే బాలు సరే నన్నారు. ఎక్కువసేపు రిహార్సల్స్ చేసి ఆ డైలాగ్ డెలివరీకి అనుగుణంగా బాలు పాడగా, రికార్డ్ చేశారు. రికార్డ్ చేసిన సమయంలో కూడా ఎన్.టి.ఆర్. ఉన్నారు. ఈ పాట రిహార్సల్స్, రికార్డింగ్ పూర్తయ్యేసరికి బాలుకి ఎన్.టి.ఆర్ డైలాగ్ డెలివరీ బాగా అలవాటయింది. ఆ తర్వాత చిత్రాల్లో ఎన్.టి.ఆర్.కు ఎన్నో హిట్ సాంగ్స్ పాడటానికి ఈ ప్రాక్టీసు బాగా ఉపయోగపడింది. ■





'దానవీరశూరకర్ణ'లో

# వామహస్త అభయం వెనుక అసలు రహస్యం

ఎన్నో పురాణ పాత్రలకు ప్రాణం పోసి, సజీవ రూపకల్పన చేసిన మహానటుడు ఎన్.టి.ఆర్. ఆ తరహా పాత్రలను ప్రతిభావంతంగా పోషించగల నేర్పు, ఓర్పు ఆయన సొత్తు. అలాగే పురాణాల విషయంలో, వాటి పాత్రల విషయంలో సామాన్య మానవులకు తెలియని ఎన్నో విషయాలు ఎన్.టి.ఆర్.కు తెలుసు. 'సాంఘిక పాత్రల పోషణ విషయంలో ఎప్పుడన్నా నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరించానేమో కానీ పురాణ పాత్రలను ఎప్పుడూ అలా చేయలేదు' అని ఒక సందర్భంలో ఆయనే స్వయంగా ఒప్పుకున్నారు.

పురాణాల పట్ల ఇంత సాధికారత కలిగిన ఎన్.టి.ఆర్. కొన్ని పురాణ పాత్రల్లో కనిపించి వామహస్తంతో దీవించడం చాలామందికి అసంతృప్తి కలిగించిన అంశం. పైగా ఈ మార్పు 1977 నుంచి ఆయనలో కనిపించింది. 'దాన వీర శూర కర్ణ' చిత్రం వరకూ కుడిచేతితోనే దీవించిన ఎన్.టి.ఆర్. ఆ తర్వాత పోషించిన పౌరాణిక పాత్రలకు ఎడమచేతినే ఎందుకు ఉపయోగించారో ఎవరికీ అంతుబట్టని విషయం. దీనిపై ఎన్నో విమర్శలు వినిపించాయి కూడా.

చాలామంది ఈ విషయం గురించి ఎన్.టి.ఆర్.ని అడిగారు కూడా. బాగా చదువుకున్న వ్యక్తి కావడంతో సమయస్ఫూర్తితో దాని గురించి వివరణ ఇస్తూ "మన హృదయం ఉన్నది ఎడమ వైపు. పూజలలో అర్ధాంగిని ఎడమవైపే కూర్చో బెట్టుకుంటాం. మన శరీరంలోని మాలిన్యాన్ని శుభ్రం చేసేది కూడా ఎడమ చేయే. ఎడమ భాగానికున్న ప్రాశస్త్యం కుడి భాగానికి లేదు. అందుకే ఎడమ

చేతితోనే ఆశీర్వదిస్తున్నాను" అని చెప్పారాయన. ఆయన చెప్పిన కారణం సమంజసంగా ఉందని పించినా ఎన్.టి.ఆర్. వంటి గొప్ప వ్యక్తి అలా చేయడం ఆ రోజులలో చాలామందికి నచ్చలేదు.

రామారావు తను చేస్తున్న పనిని ఆ విధంగా సమర్థించుకున్నా ఈ వామహస్త అభయానికి వెనుక అసలు రహస్యం వేరే ఉంది. అదేమిటంటే షూటింగ్ స్పాట్‌లో జరిగిన ప్రమాదాల కారణంగా ఎన్.టి.


'విరిగిన చేతికి కట్టుకడుతున్న స...

ఆర్. కుడిచేయి నాలుగుసార్లు విరిగిపోయింది. తొలిసారిగా 'పల్లెటూరి పిల్ల' చిత్రం షూటింగ్‌లో ఎద్దుతో ఫైట్ తీస్తుండగా చేయి విరిగింది. ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొని ఇంటికి తిరిగి వెళుతుండగా జరిగిన కారు ప్రమాదంలో మరోసారి చెయ్యి విరిగింది. 'పాతాళభైరవి' చిత్రంలో చెట్టు మీద నుండి దూకడంతో మూడోసారి చెయ్యి విరిగింది. అలా విరిగి నప్పుడల్లా పుత్తూరు మార్కండేయ రాజు దగ్గర కట్టు కట్టించుకునేవారు ఎన్.టి.ఆర్. కుడి చేయి పట్టు సడలడంతో ఎడమచేత్తో అభయాన్ని ప్రదర్శించేవారు. 'దాన వీర శూర కర్ణ' తరువాత మూడేళ్లకు 'సర్దార్ పాపారాయుడు' చిత్రం షూటింగ్‌లో మోటార్ బైక్ మీద నుండి పడటంవల్ల మళ్లీ చెయ్యి విరిగింది. నరాలు ఇంచుమించుగా తుక్కుతుక్కు అయిపోయాయి. దీనివల్ల కుడి చేతి వేళ్లు నిలవలేవు. అందుకే ఈ పరిస్థితిని అధిగమించడం కోసం అభయం అంటే ఎడమ చేతిని చూపించడం మొదలు పెట్టారు ఎన్.టి.ఆర్.


'శ్రీకృష్ణార్జునయుద్ధం'లో

ఏం చేసినా ఆయనకే చెల్లిందని అభిమానులు, ప్రేక్షకులు మురిసిపోతూ చెప్పుకుంటుంటారు. అదీ సంగతి... ■


# అద్భుత రసాభినయం

తను ఏ పాత్ర అంగీకరించినా దానికి పూర్తిగా న్యాయం చేయాలని తపించిన అతికొద్దిమంది నటుల్లో ఎన్.టి.ఆర్. ఒకరు. ఆయన అంతకుముందు పరస్పర విరుద్ధమైన పాత్రలు పోషించినా అవన్నీ యువకునిగా నటించినవే. అయితే తన వయసుకు మించిన చేసిన రెండు చిత్రాలూ (భీష్మ, బడిపంతులు) సంచలన విజయం సాధించాయి. ఆయన కెరీర్‌లో మైలు రాళ్ళుగా నిలిచిపోయిన ఆ రెండు చిత్రాల కబుర్లు...

Acc No 19110
500 044



'భీష్మ' చిత్రంలో







# పూర్తిస్థాయి వృద్ధపాత్రలు పోషించిన భీష్మ, బడిపంతులు

సుదీర్ఘమైన తన నటజీవితంలో వైవిధ్యమైన పాత్రలు ఎన్నో పోషించి తనకు తానే సాటి అనిపించుకున్నారు ఎన్.టి.ఆర్. కథానాయకునిగా రొమాంటిక్ పాత్రలను పోషిస్తూ యువతరం ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న తరుణంలోనే అటు 'భీష్మ' (1962)లోనూ, ఇటు 'బడిపంతులు' (1972)లోను పూర్తిస్థాయి వృద్ధ పాత్రలను పోషించి ప్రేక్షకుల్ని మెప్పించారు. అంతకుముందు 'తోడుదొంగలు', 'వారసత్వం' 'పల్నాటియుద్ధం' చిత్రాల్లోనూ ఎన్.టి.ఆర్. వయసు మళ్లిన పాత్రలు పోషించారు. అయితే 'బ' అక్షరంతో పదేళ్ల తేడాతో విడుదలైన 'భీష్మ', 'బడిపంతులు' చిత్రాలు రెండూ ఘనవిజయం సాధించాయి. ఎన్.టి.ఆర్ తన నటజీవితంలో చేసిన ఎన్నో సాహసవంతమైన ప్రయత్నాల్లో ఆణిముత్యాలుగా మిగిలి ఇప్పటికీ వార్తల్లో నిలిచిన ఆ చిత్రాల విశేషాలు..

## భీష్మ



ఎన్.టి.ఆర్.ని హీరోగా పరిచయం చేసిన దర్శక నిర్మాత బి.ఎ.సుబ్బారావు నిర్మించిన చిత్రమిది. అంతకు ముందు అంటే 1945లో వచ్చిన 'భీష్మ' (జంధ్యాల గౌరీనాథశాస్త్రి టైటిల్ పాత్ర పోషించారు) చిత్రానికి ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేశారు సుబ్బారావు. అందాల నటునిగా పేరు తెచ్చుకున్న రామారావు ముఖానికి మసిబూసి, డీ గ్లామరైజ్డ్ రోల్‌లో 'రాజు-పేద' చిత్రంలో నటింపచేశారు. సుబ్బారావే మళ్లీ 'భీష్మ' చిత్రంలో వృద్ధుని పాత్ర వెయ్యాలని చెప్పినప్పుడు రామారావు ఎలాంటి అడ్డు చెప్పలేదు. కురుపితామహుడైన భీష్ముని పాత్రను పోషించడానికి మక్కువ చూపారు.

ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. తొలి కాంబినేషన్‌లో 'పల్లెటూరిపిల్ల' చిత్రాన్ని నిర్మించిన బి.ఎ.సుబ్బారావు 'భీష్మ' చిత్రంలో కూడా ఈ ఇద్దరినీ కలపాలనుకున్నారు. శ్రీకృష్ణునిగా ఈ చిత్రంలో గెస్ట్ పాత్ర పోషించడానికి అక్కినేని కూడా అంగీకరించారు. అయితే ఆ తర్వాత కథాపరంగా జరిగిన మార్పుల్లో శ్రీకృష్ణ పాత్ర పరిధి పెరిగింది. ఆ పాత్ర కోసం ఎక్కువ కాల్షీట్లు కేటాయించలేని పరిస్థితి అక్కినేనిది. దాంతో శ్రీకృష్ణుని పాత్రకు మరో నటుణ్ణి వెదుక్కోవలసి వచ్చింది. ఆ తర్వాత వర్ధమాన నటుడు శోభన్‌బాబుతో ఆ పాత్ర వేయించాలనుకుని, గెటప్‌వేసి స్టిల్స్ తీశారు. అయితే ఎందువల్లో ఆయన్ని ఆ పాత్రకు వద్దనుకున్నారు. అర్జునుని పాత్రను ఆయనతో, శ్రీకృష్ణుని పాత్రను మరో వర్ధమాన నటుడు హరనాథ్‌తో వేయించారు. అలాగే ఈ సినిమాలో దుర్యోధనుని పాత్రను ధూళిపాళ పోషించారు. ఆయనకు ఇదే తొలి చిత్రం. అంతకుముందు 'చెంచులక్ష్మి' సినిమాలో హాస్యనటుడు రేలంగితో నారదుని పాత్ర వేయించిన బి.ఎ.సుబ్బారావు తిరిగి అదే పాత్రను ఈ సినిమాలో ఆయనతో పోషింపచేశారు.

ఈ సినిమాలో వ్యాసునిగా ఆకుల నరసింహారావు, పరుశురామునిగా నాగభూషణం, శంతనునిగా ప్రభాకరరెడ్డి, కర్ణునిగా గుమ్మడి, శల్యునిగా సి.ఎస్.ఆర్, కాశీరాజుగా కాంతారావు, అంబగా అంజలీదేవి, సత్యవతిగా సుజాత (తొలి పరిచయం) కుంతిగా జి.వరలక్ష్మి నటించారు. అలాగే భీష్ముని చిన్నప్పటి వేషాన్ని బి.ఎ.సుబ్బారావు తనయుడు హరీశ్‌బాబు పోషించారు.

'భీష్మ' చిత్ర నిర్మాణానికి ఏడాదిన్నర పట్టింది. ఆ రోజుల్లో చిత్రం నిడివి 14వేల అడుగులకు మించి ఉండకూడదనే ప్రభుత్వ నిబంధనను పాటిస్తూ ఈ సినిమా తీశారు సుబ్బారావు. దీనివల్ల శోభన్‌బాబుపై చిత్రీకరించిన కొన్ని సన్నివేశాలు, ఒక దండకం ఎడిటింగ్ రూమ్‌లో కత్తెరకు బలయ్యాయి.

1962 ఏప్రిల్ 19న విడుదలైన 'భీష్మ' చిత్రం



ఘనవిజయం సాధించి, ఎన్.టి.ఆర్. కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది.

## బడిపంతులు

జీవితాంతం తోడు- నీడగా కలిసి మెలిసి ఉండాల్సిన దంపతులు తమ బిడ్డల కారణంగా వృద్ధాప్యంలో దూరం కావడం, అమ్మానాన్నలని కొడుకులు పంచుకోవడం, అన్నేళ్ల అన్యోన్యంగా కాపురం చేసిన ఆ జంట విడివిడిగా ఉంటూ పడే మానసిక క్షోభ, మళ్లీ కలవడం కోసం చేసే ప్రయత్నాలు... ఇలా హృదయానికి హత్తుకునే సన్నివేశాలతో రూపుదిద్దుకున్న చిత్రం 'బడిపంతులు'.


నిజంగా ఇది ఈనాటి సమస్య. కొడుకులు, కూతుళ్లు అమెరికాలో ఉండటంతో వాళ్లకోసం తల్లో, తండ్రో ఆరేసి నెలలపాటు అక్కడ ఉండాల్సి వస్తోంది. అయితే భవిష్యత్‌ను ఊహించి 40 ఏళ్ల క్రితమే ఇలాంటి ఇతివృత్తంతో దర్శకుడు పి.చంద్రశేఖర రెడ్డి 'బడిపంతులు' చిత్రాన్ని రూపొందించారు.

తెలుగులో తయారైన 'బడిపంతులు' చిత్రానికి, హిందీలో తీసిన 'బాగ్‌బన్' (అమితాబ్, హేమమాలిని జంట), కన్నడంలో రూపొందిన 'బడిపంతులు' (1956లో వచ్చిన ఈ చిత్రంలో శివాజీగణేషన్, సరోజ జంట), మలయాళంలో రూపుదిద్దుకున్న 'స్కూల్ మాస్టర్' చిత్రాలకీ మూలం ఒక్కటే. మద్గుల్కర్ అనే ఆయన మరాఠిలో రాసిన నవల.

కన్నడంలో రూపొందిన 'బడిపంతులు' చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా టైటిల్ పాత్రను బి.ఆర్.పంతులు పోషించారు. ఇది 19వేల అడుగులు. ఈ చిత్రానికి పుట్టన్న కనగళ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయనకు ఈ కథ బాగా నచ్చడంతో సినిమాలో అనవసర సన్నివేశాలు తొలగించి, తనకు నచ్చిన విధంగా మరికొన్నిటిని జోడించి 'స్కూల్ మాస్టర్' పేరుతో మలయాళంలో ఈ చిత్రాన్ని రూపొందించారు.



...డిపంతులు'లో




'బడిపంతులు' చిత్రంలో [illegible]
ఎన్.టి.ఆర్., [illegible]

**విమానంలో వినిపించిన కథ**

దర్శకుడు పి.చంద్రశేఖరరెడ్డి (పి.సి.రెడ్డి) ఓసారి బెంగుళూరు వెళ్లి విమానంలో చెన్నైకి తిరిగి వస్తున్నారు. ఆయన పక్కసీటే పుట్టన్నది. ఇద్దరికీ అంతకుముందే పరిచయం ఉంది. ఆచార్య ఆత్రేయ దగ్గర తరచూ కలిసేవారు. ఆ పరిచయంతోనే ఆప్యాయంగా చంద్రశేఖరరెడ్డిని పలకరించి, ఏం చేస్తున్నావని అడిగారు పుట్టన్న. పి.సి.రెడ్డి అప్పటికి మూడు చిత్రాలకు దర్శకత్వం వహించారు. మంచి కథతో వస్తే డేట్స్ ఇస్తానని ఎన్.టి.ఆర్. ప్రామిస్ చేశారు. అదే విషయం పుట్టన్నకి చెప్పారు. "నేను ఈ మధ్య మలయాళంలో 'స్కూల్ మాస్టర్' సినిమా తీశాను. పెద్ద హిట్ అయింది. తెలుగులో మీరు ఆ సినిమా తీసుకోవచ్చు. అయితే ఇందులో ప్రధాన పాత్రని గుమ్మడిగారో, రంగారావుగారో వేస్తే లాభంలేదు. ఎన్.టి.ఆర్.ని ఒప్పించగలిగితేనే ఈ కథ పండుతుంది" అన్నారు పుట్టన్న. ఆ కథేమిటో చెప్పమన్నారు పి.సి.రెడ్డి. విమానం చెన్నై చేరుకునేలోగా కథ చెప్పారు. అది వినగానే పి.సి.రెడ్డికి భయమేసింది. ఒక స్కూల్ టీచరు.. అందులో మధ్య వయస్కుడు... పిల్లలు... బాధ్యతలు... కష్టాలు ఇవన్నీ ఆ కథలో ఉన్నాయి. పుట్టన్నగారితో ఈ కథ ఏమిటండీ... ఏదన్నా రొమాంటిక్ లవ్ స్టోరీ చెప్పండి' అని పి.సి.రెడ్డి అన్నప్పటికీ "లేదు లేదు ఇది గొప్ప కథ. రామారావు గారిని కన్విన్స్ చేయండి. మంచి సినిమా అవుతుంది" అని చెప్పి వెళ్లిపోయారు పుట్టన్న.

భయపడుతూనే రామారావు దగ్గరకు వెళ్లారు పి.సి.రెడ్డి. కథ చెప్పబోయే ముందు "సార్... ఇందులో మీది ముసలి వేషం" అని పదాలు కూడబలుక్కుంటూ చెప్పారు పి.సి.రెడ్డి. "ఏం... ముసలి వేషం అయితేనేం? 'భీష్మ'లో చేయలేదా! కథలో దమ్ము ఉండాలి కానీ మాకు చేయడానికి అభ్యంతరం లేదు" అన్నారు ఎన్.టి.ఆర్. గంభీరంగా. "అవుననుకోండి... ఇందులో మీకు కొడుకులుగా కృష్ణంరాజు, రామకృష్ణ నటిస్తారు" అన్నారు. "అయితేనేం బ్రదర్... వారి పాత్రలు వారివి,



ఎన్.టి.ఆర్.కు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు పి.సి.రెడ్డి

"నా పాత్ర నాది" అన్నారు. ఈ సంఘటన సవివరంగా చెప్పి "ఆ మహానుభావుడు ఏ మూడ్‌లో ఉన్నారో... కథ వినగానే ఓకే అనేశారు. ఆయన ఈ సినిమా చేయడానికి అంగీకరించడం నా జీవితంలో టర్నింగ్ పాయింట్" అంటారు పి.సి.రెడ్డి

### తొలిరోజు షూటింగ్‌లో..

వాహినీ స్టూడియోలో ఈ చిత్ర ప్రారంభోత్సవం జరిగింది. ఎన్.టి.ఆర్, అంజలీదేవిపై తొలిషాట్ తీశారు. అతిథులంతా వెళ్లిపోయిన తర్వాత దర్శకుడు పి.సి.రెడ్డిని పిలిచి "ఇందాక తీసిన షాట్ ఎలా ఉంది?" అని అడిగారు రామారావు. 'బాగానే ఉంది సార్' పి.సి. రెడ్డి సమాధానం. "బాగానే ఉంది కాదు, చాలాబాగుంది అనాలి. ఈవేషం మీకోసం ఒప్పుకున్నాను. నాకు పూర్వాపరాలు తెలియవు. మీరు ఎలా చెబితే అలా నటిస్తాను. నేను ఎన్.టి.ఆర్. అనే విషయం మరిచిపోండి. నేను బడిపంతుల్ని అని మాత్రమే అనుకుని పనిచేయించుకోండి. మీకు సంతృప్తి కలిగేవరకు నటించడం నా బాధ్యత. ఏ విషయంలోనూ రాజీ పడకండి" అని అభయం ఇచ్చారు రామారావు. ఆ రోజు ఆయన ఆ మాట అనకుండా ఉంటే 'బడిపంతులు' చిత్రాన్ని అంత బాగా తీసి ఉండేవాణ్ని కాదని అంటూ ఆనాటి సంఘటనని గుర్తుచేసుకున్నారు పి.సి.రెడ్డి.

ప్రారంభం రోజున ఆవేశంతో ఎన్.టి.ఆర్ చెప్పిన మాటలు కావవి. చిత్రం పూర్తయ్యే వరకు ఆ మాటలకు కట్టుబడి దర్శకునికి ఎంతో సహకరించారు. అప్పటికి ఆయన 200 చిత్రాల్లో నటించారు. ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించారు. అయినా దర్శకుడు పి.సి.రెడ్డి చెప్పినమాట జవదాటలేదు. ఈ సినిమాలో ఒక సన్నివేశ చిత్రీకరణ సమయంలో ఎన్.టి.ఆర్. అలవాటు ప్రకారం చెయ్యిని అలా లేపితే దర్శకుడు కట్ చెప్పారు. జరిగిన విషయం చెప్పగానే "ఓ.. ఐయాం సారీ.. ఈ సినిమాలో నేను హీరోని కాదు కదూ... బడిపంతుల్ని" అని నవ్వేసి మరో టేక్ తీయమన్నారు.

### కుట్టిపద్మిని స్థానంలో శ్రీదేవి

ఈ సినిమాలో ఎన్.టి.ఆర్. మనవరాలి పాత్రకు కుట్టి పద్మినిని తీసుకోవాలనే అభిప్రాయం నిర్మాత పేర్రాజుది. ఆమె ద్విపాత్రాభినయం చేసిన 'లేత మనసులు' చిత్రం విజయవిహారం చేస్తున్న రోజులవి. అయితే ఆమె నటనలో అసహజత్వం ఎక్కువగా ఉందని, ఆమె బదులు 'అత్తలు కోడళ్లు' చిత్రంలో చిన్నప్పటి వాణిశ్రీగా నటించిన శ్రీదేవిని తీసుకుందామని పి.సి.రెడ్డి వాదన. చివరకి ఆయన మాటే నెగ్గింది. ఈ సినిమాలో ఎన్.టి.ఆర్. మనవరాలిగా నటించిన శ్రీదేవి మరి కొన్నేళ్లకు ఆయన పక్కన కథానాయికగా నటించడం కొసమెరుపు.

### "మీ నగుమోము నా కనులారా..." పాట కథ

కన్నడ 'బడిపంతులు'లో కానీ, మలయాళ 'స్కూల్ మాస్టర్' చిత్రంలో కానీ లేని ఒక అద్భుతమైన పాట 'బడిపంతులు' చిత్రంలో చోటు చేసుకుంది. "మీ నగుమోము నా కనులరా కడదాకా కననిండు..." అనే ఈ పాట ఆచార్య ఆత్రేయ సృష్టి. భర్తని వదిలిపెట్టి భార్య కొడుకు దగ్గరికి వెళ్లే సందర్భంలో వచ్చే ఈ పాటని ఎంతో హృద్యంగా ఎన్.టి.ఆర్, అంజలీదేవిపై

చిత్రీకరించారు పి.సి.రెడ్డి. ఇంకో అయిదు నిమిషాల్లో విశ్రాంతి వస్తుందనగా వచ్చే ఈ పాటని తీసేద్దామని ఈ చిత్రం పంపిణీదారుడు 'పూర్ణా' కామరాజు ఒత్తిడి చేశారు. ఆ రోజుల్లో పంపిణీ దారులు చెప్పిందే వేదం. అయినా ఆయన్ని కన్విన్స్ చేయడానికి పి.సి.రెడ్డి చూశారు. 'విశ్రాంతి వస్తోందనగా హాల్లో లైట్లు వేస్తారు. షోడాలు అమ్మేవాళ్లు అటు ఇటు తిరుగుతుంటారు. జనం కూడా లేచి వెళుతుంటారు... ఎవరూ చూడని ఈ పాట ఎందుకండీ?'' అని వ్యాపారవేత్తగా కామరాజు వాదన. ఆయన చెప్పింది సమంజసంగానే ఉన్నా ఒక మంచి పాటమీద ఉన్న మమకారంతో ఏం చేయాలో తోచక ఆత్రేయ దగ్గరకి వెళ్లి చెప్పారు పి.సి.రెడ్డి. "వాళ్లేం చెప్పినా నువ్వు ఒప్పుకోవద్దు" అని ఆయన కూడా మద్దతు పలికారు.

ఆ రోజుల్లో ప్రింట్ ఆర్డర్ మీద దర్శకుడు, ఛాయాగ్రాహకుడు సంతకం పెడితేనే ల్యాబ్‌లో ప్రింట్లు తయారయ్యేవి. ఆ పాటని తొలగించకుండానే ప్రింట్లు తయారు చేయమని ప్రింట్ ఆర్డర్‌మీద సైన్ చేశారు పి.సి.రెడ్డి.

ఈ విషయం కామరాజుకి తెలిసింది. ఒక ఆట చూసి పి.సి.రెడ్డికి చెప్పకుండా ఆ పాట తీసేద్దామని అనుకున్నారాయన. అయితే థియేటర్‌లో ఈ పాటకి వచ్చిన స్పందన చూశాక దానిజోలికి పోలేదు. ఇప్పటికీ రేడియోల్లో, టీవీల్లో ఆ పాట ప్రసారమవుతూనే ఉంది.

## 40 రోజుల్లో నిర్మాణం పూర్తి

ఆ రోజుల్లో ఎన్.టి.ఆర్. నెలకు ఎనిమిది సినిమాల్లో నటించేవారు. ఫస్ట్ తారీకు నుండి ఏడో తారీఖు వరకు, మళ్లీ 8 నుండి 15 వరకూ, 16 నుండి 23 వరకూ, 24 నుండి 31 వరకూ... ఇలా కాల్షీట్లు తన స్వహస్తాలతో రాసి నిర్మాతలకు ఇచ్చేవారు. అందులోనూ మళ్లీ ఉదయం ఏడు గంటల నుండి ఒంటి గంటవరకూ ఒక నిర్మాతకు, రెండు గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ మరో నిర్మాతకూ ఆయన పనిచేసేవారు. 'బడిపంతులు' చిత్రానికి ప్రతినెలా ఒకటో తేదీ నుండి ఏడో తేదీవరకూ నాలుగు నెలలపాటు ఎన్.టి.ఆర్ కాల్షీట్లు ఇచ్చారు. ఆయన లేని వర్క్‌ను మరో మూడు రోజులపాటు చేసి మొత్తం 40 రోజుల్లో షూటింగ్ పూర్తిచేశారు పి.సి.రెడ్డి. ఏడు లక్షల రూపాయల వ్యయంతో తయారైన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. ■




బేబీ శ్రీదేవి, అంజలీదేవి

# వెండితెరపై విప్లవజ్యోతి

ప్రతి మనిషికీ కొన్ని కోరికలు, కలలు ఉంటాయి. వాటిని నెరవేర్చుకోవడానికి ప్రతి క్షణం తపిస్తుంటారు. అయినా కొన్ని కలలు అలాగే మిగిలిపోతుంటాయి. ఎన్.టి.ఆర్.కు నెరవేరని కల 'అల్లూరి సీతారామరాజు' నిర్మాణం. అయితేనేం 'సర్దార్ పాపారాయుడు', 'మేజర్ చంద్రకాంత్' చిత్రాల్లో 'విప్లవజ్యోతి'గా వెలిగిపోయారు.



# వెండితెరపై విప్లవజ్యోతి



'మేజర్ చంద్రకాంత్' చిత్రంలో అల్లూరి సీతారామరాజుగా ఎన్.టి.ఆర్.

రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యంలో పట్టపగలే చుక్కలు మొలిపించి, తెలుగు జాతికి ఖండఖండాంతర ఖ్యాతి తెచ్చిన విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు. ఈ మన్నెం వీరుని జీవిత కథను నాటక రూపంలో తీసుకు వచ్చి, ఆయనకు మరింత ప్రజాదరణ కలిగించారు పడాల రామారావు. సీతారామరాజు పాత్ర పోషించాలన్నది తారక రాముని చిరకాల వాంఛ. తెల్లదొరలను గడగడ వణికించిన ఈ స్వాతంత్ర్య సమర యోధునిచరిత్రను సెల్యులాయిడ్



**కావ్యంగా మలచాలని ఎన్.టి.ఆర్. ఎంతో ఉవ్విళ్లూరారు. కానీ, ఆ కోరిక తీరనే లేదు. 'అల్లూరి సీతారామరాజు' చిత్ర నిర్మాణం నెరవేరని కలగానే మిగిలిపోయింది. తను అనుకున్నది సాధించే మనస్తత్వం ఎన్.టి.ఆర్.ది. అయినా ఈ చిత్ర నిర్మాణం విషయంలో మాత్రం ఆయన అనుకున్నది నెరవేరలేదు.**

సీతారామరాజు పాత్ర పోషించాలనే కోరిక రామారావులో చిగురించింది 'అగ్గిరాముడు' (1954) చిత్ర నిర్మాణ సమయంలో. ఆ సినిమాలో నాజర్ తన బృంద సభ్యులు లక్ష్మీనరసయ్య, రామకోటితో కలిసి చెప్పిన 'సీతారామరాజు బుర్రకథ' సన్నివేశం ఉంది. "శ్రీ విలసిల్లెడి తెలుగుదేశమున జననమందినాడా... ఓహో దేవా.. వినరా ఆంధ్రుడు మన్య సోదరుల వీరగాధ నేడు" అంటూ 15 నిమిషాల సేపు సాగే ఆ బుర్రకథలో సీతారామరాజు గెటప్‌లో కనిపిస్తారు ఎన్.టి.ఆర్. కొద్ది నిమిషాల సేపే కనిపించినా ఆ పాత్ర ఆయన్ని ఎంతో ఆకట్టుకుంది. పూర్తిస్థాయిలో ఆ పాత్రను పోషించాలని, 'అల్లూరి సీతారామరాజు' చిత్రాన్ని నిర్మించాలని ఆ క్షణానే ఎన్.టి.ఆర్.కి కలిగింది. అప్పటికి 'పిచ్చి పుల్లయ్య' చిత్రం విడుదలైంది. 'తోడుదొంగలు' సినిమా నిర్మాణంలో ఉంది.

తమ్ముడు త్రివిక్రమరావుతో ఈ చిత్ర నిర్మాణం గురించి చర్చించారు. ఆయన కూడా మద్దతు పలకడంతో 1955లో ఈ సినిమా నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. సముద్రాల రాఘవాచార్య, పింగళి నాగేంద్రరావు వంటి ప్రముఖ రచయితలు తనకు అందుబాటులో ఉన్నప్పటికీ సీతారామరాజు మీద విస్తృతంగా పరిశోధనలు చేసిన పడాల రామారావుకి ఈ చిత్ర రచనాబాధ్యతలు అప్పగించారు రామారావు.

ఆ తర్వాత కళా దర్శకుడు మాధవపెద్ది గోఖలేతో గెటప్ స్కెచ్ తయారు చేయించి, ఆ ప్రకారం మేకప్ చేయించుకుని స్టిల్స్ దిగారు ఎన్.టి.ఆర్. అందరూ బాగుందని చెప్పడంతో 'జయసింహ' చిత్రం తర్వాత ఈ సినిమా తీయాలని నిర్ణయించారు.



### పాట రికార్డింగ్

'జయసింహ' చిత్రం విడుదలయింది, విజయం సాధించింది. ఆ ఉత్సాహంతో 'అల్లూరి సీతారామరాజు' చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ముందుగా అంటే 1957 జనవరి 17న వాహినీ స్టూడియోలో పడాల రామారావు రాసిన పాటను, టి.వి.రాజు సంగీత దర్శకత్వంలో రికార్డ్ చేశారు.

**"హర హర హర మహా**
**ఓంకారనాదాన**
**పొంగరా ఉప్పొంగి**
**ఓ తెలుగు బిడ్డా**
**స్వాతంత్ర్య విప్లవ**
**సమరాంగణాన..."**

అనే ఈ పాటని ఘంటసాల, మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు, ఎం.ఎస్.రామారావు పాడారు. పాట రికార్డింగ్‌కు 12వేలు ఖర్చయింది.

ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో రామారావు త్వరలోనే ఈ చిత్ర నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పి సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడించారు. మాటల్ని సముద్రాల జూనియర్, పడాల రామారావు, ఛాయాగ్రహణాన్ని రెహమాన్, కళను తోట వెంకటేశ్వరరావు నిర్వహిస్తారని చెప్పారు.

ఈ వార్త నందమూరి అభిమానులలో ఆనందాన్ని కలిగించింది. మన్నెం వీరుని పాత్రలో తమ అభిమాన కథానాయకుణ్ణి ఎప్పుడెప్పుడు చూస్తామా అని వారంతా ఆశగా ఎదురు చూడసాగారు. అయితే మళ్లీ ఏవో అవాంతరాలు, అడ్డంకులు. స్క్రిప్ట్‌పై ఏవో అనుమానాలు. దాంతో 'విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు' ప్రాజెక్టును తాత్కాలికంగా పక్కనపెట్టి 'పాండురంగ మహాత్మ్యం' షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సినిమా విడుదలైన తరువాత 'విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు' చిత్ర నిర్మాణం కోసం మళ్లీ సన్నాహాలు ప్రారంభించారు. సీతారామరాజు సమకాలీనుడు, సహచరుడు, అప్పటి పార్లమెంటు సభ్యుడు మల్లుదొర సలహాలు, సూచనలు కూడా తీసుకున్నారు. ఈ కథలో స్త్రీ పాత్రలు ఉండవని, వాస్తవికతను జోడించి సహజత్వానికి దగ్గరగా ఉండటంకోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అప్పట్లో ఎన్.టి.ఆర్. పత్రికలవారికి వెల్లడించారు. ఇది జరిగిన కొన్ని రోజులకు మళ్లీ అవాంతరం ఏర్పడింది. ఈ చిత్రానికి సంబంధించిన పరిశోధనకు మరికొంత సమయం పడుతుందని భావించారు. మళ్లీ ఆ సినిమాని వాయిదా వేసి 'సీతారామ కళ్యాణం' (1961)చిత్రాన్ని ప్రారంభించారు ఎన్.టి.ఆర్.

ఇక అంతే.. అక్కడితో 'విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు' చిత్ర నిర్మాణం దాదాపుగా వాయిదా పడిందనే చెప్పాలి. ఏళ్లు గడిచాయి కానీ ఆయన కల



అలాగే మిగిలిపోయింది. అభిమానులు ఎప్పుడు ప్రశ్నించినా ఎన్.టి.ఆర్. ఎంతో ఉద్వేగంతో సమాధానం ఇచ్చేవారు. ఒక మహాకావ్యంలా దాన్ని నిర్మించడం కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పేవారు. ఈ లోగా ఆ రోజు రికార్డ్ చేసిన పాటను 'పాండు రంగ మహాత్మ్యం' గ్రామ్‌ఫోన్ రికార్డులతో పాటు మార్కెట్‌లోకి విడుదలైంది.

1968లో హైదరాబాద్‌లో 'వరకట్నం', 'విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు' చిత్రాలను ఒకేసారి నిర్మిస్తున్నట్లు ఎన్.టి.ఆర్. ప్రకటించారు. 'వరకట్నం' చిత్రం మొదలై విడుదలైంది కానీ రెండో సినిమా అలాగే ఉండిపోయింది.

అలాగే కొన్నేళ్లు గడిచాయి. ఈలోగా కొన్ని పరిణామాలు సంభవించాయి. శోభన్‌బాబు హీరోగా 'అల్లూరి సీతారామరాజు' చిత్రాన్ని నిర్మించనున్నట్లు నిర్మాత డి.ఎల్.నారాయణ ఉన్నట్టుండి ఓ రోజు ప్రకటించారు. స్క్రిప్ట్ తయారు చేయించారు. కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆయన ఆ సినిమా తీయలేకపోయారు. ఆ తర్వాత హీరో కృష్ణను కలిసి ఆయనకు స్క్రిప్ట్ అందజేశారు. కృష్ణకి ఆ స్క్రిప్ట్ నచ్చడంతో మహారథితో డైలాగులు రాయించి, సినిమా తీస్తున్నట్లు ప్రకటించారు. చాలా మంది ఆయన్ని నిరుత్సాహపరిచారు. అయినా కృష్ణ 'అల్లూరి సీతారామరాజు' చిత్ర నిర్మాణం చేపట్టి, విడుదల చేశారు. ఈ సంఘటన వల్ల ఎన్.టి.ఆర్., కృష్ణ మధ్య దూరం పెరిగింది. ఆ తర్వాత 'దానవీరశూరకర్ణ' చిత్రానికి పోటీయా అన్నట్లుగా సాగిన 'కురుక్షేత్రం' చిత్ర నిర్మాణం కూడా వీరిద్దరిమధ్య దూరాన్ని మరింత పెంచింది. ఆరేళ్లపాటు ఎన్.టి.ఆర్, కృష్ణ మధ్య మాటలే లేవని చెప్పాలి.

సీతారామరాజు పాత్ర పోషించాలని ఎన్.టి.ఆర్. మనసులో బలంగా నాటుకుపోయి ఉండటంతో 'అల్లూరి సీతారామరాజు' చిత్రం విడుదలైన పదేళ్ల తర్వాత మళ్లీ ఆ సినిమా మీద దృష్టి సారించారు. పరుచూరి బ్రదర్స్ అప్పటికి రచయితలుగా మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో ఈ స్క్రిప్ట్ మీద వర్క్ చేయమని చెప్పారు ఎన్.టి.ఆర్. 'మీరు ఆదేశిస్తే తప్పకుండా చేస్తాం. అయితే దానికంటే ముందు ఒక చిన్న రిక్వెస్ట్. కృష్ణ తీసిన 'అల్లూరి సీతారామరాజు' చిత్రాన్ని ఒకసారి చూడండి. ఆ తర్వాత మీరు ఎలా చెబితే అలా చేద్దాం' అన్నారట. ఓకే.. అలాగే చేద్దామని అన్నారు. ఇది జరిగిన కొన్ని రోజులకు వాహిని స్టూడియోలో ఎన్.టి.ఆర్., కృష్ణ ఎదురుపడ్డారు. కృష్ణ ముందుగా వెళ్లి ఆయన్ని పలకరించారు. 'అల్లూరి సీతారామరాజు' చిత్రం చూడాలనుకుంటున్నాను. ఏర్పాటు చేయండి' అనడిగారు ఎన్.టి.ఆర్. కృష్ణ అలాగేనని విజయకృష్ణా థియేటర్‌లో ప్రొజెక్షన్ ఏర్పాటు చేశారు. సినిమా చూశాక కృష్ణను కౌగిలించుకుని 'చాలా బ్రహ్మాండంగా తీశారు బ్రదర్... ఇంతకంటే గొప్పగా ఎవరూ తీయలేరు'' అని అభినందించారు.

ఆ తర్వాత పరుచూరి సోదరులతో ఈ చిత్ర నిర్మాణాన్ని విరమించుకున్నామని చెప్పారట ఎన్.టి.ఆర్. అయితే అల్లూరి సీతారామరాజు పాత్రపై తనకున్న మక్కువ తీర్చుకునేందుకు ఆయన 'సర్దార్ పాపారాయుడు', 'మేజర్ చంద్రకాంత్' వంటి సినిమాల్లో కాసేపు ఆ గెటప్‌లో కనిపించారు. ఈ రోజున 'అల్లూరి సీతారామరాజు' అనగానే ఎన్.టి.ఆర్. రూపమే అందరికీ గుర్తుకువస్తుంది. 'విప్లవజ్యోతి'కి రోల్ మోడల్‌గా ఎన్.టి.ఆర్. నిలిచిపోయారు. ■


# బహు పాత్రాభినయం

పాత్రల పోషణలో భిన్నత్వం, నవ్యత్వం కోసం తపిస్తూ తనకు తానే సాటిగా శిఖరాగ్రస్థాయికి చేరుకున్న వ్యక్తి ఎన్.టి.ఆర్. మరెవరైనా ఇంతకన్నా మెరుగ్గా నటించ గలరా అనే ఛాలెంజ్ విసిరే స్థాయికి చేరు కోవడం ఆయనకు మాత్రమే సాధ్యమైంది. సుదీర్ఘమైన తన నటజీవితంలో ద్విపాత్రాభి నయంతో సరిపెట్టుకోకుండా త్రిపాత్రా భినయం, పంచ పాత్రాభినయం అవలీలగా చేసేవారాయన. వాటి కబుర్లు...



'నర్తనశాల' చిత్రంలో

# అయ్యారే... అభినయ సమ్రాట్!!



'కులగౌరవం'లో ఎన్.టి.ఆర్.

కళకు అవధులు లేనట్లే కళాకారుని కృషికి, కోరికలకు కూడా హద్దులు ఉండవు. ఇంకా ఏదన్నా చేయాలన్న తపన కళాకారుణ్ణి వెంటాడుతూనే ఉంటుంది. అలాగే ఏదో నూతనత్వాన్ని, నూతన ప్రక్రియను సాధించి అభిమానులకు అందించాలనే తపన ఎన్.టి.ఆర్.లో నిరంతరం కనిపించేది. ఆ తపనతోనే అన్నిరకాల పాత్రలలో నటించి తనకు తానే సాటి అనిపించుకున్నారు. అలాగే నటునిగా ఎప్పుడూ తనదే పై చేయిగా ఉండాలని అనుకునేవారు.

'రాముడు-భీముడు' (1964)తో ప్రారంభించి, 'అగ్గిపిడుగు' (1964), 'మంగమ్మ శపథం' (1965), 'గోపాలుడు-భూపాలుడు (1967), నిర్దోషి (1967), తిక్క శంకరయ్య' (1968), 'గండికోట రహస్యం' (1969), 'భలే తమ్ముడు', (1969), 'తాతమ్మకల' (1974), 'రాముని మించిన రాముడు' (1975), 'మనుషులంతా ఒక్కటే' (1976), 'మా ఇద్దరి కథ' (1977), 'సర్కస్‌రాముడు' (1980), 'యుగంధర్', 'సర్దార్ పాపారాయుడు (1980), 'గజదొంగ' (1981), 'విశ్వరూపం' (1981), 'కొండవీటి సింహం' (1981), 'చండశాసనుడు' (1983), 'ప్రేమ సింహాసనం' (1981) తదితర చిత్రాలలో ద్విపాత్రాభినయం చేశారు ఎన్.టి.ఆర్. అయితే ఇవన్నీ ఒక ఎత్తయితే... 'శ్రీక్రిష్ణ పాండవీయం' (1966), 'శ్రీ కృష్ణ సత్య' (1971), 'శ్రీరామ పట్టాభిషేకం' (1978) చిత్రాలలోని పాత్రలు ఒక ఎత్తు. సాధారణంగా ద్విపాత్రాభినయంలోని పాత్రల మధ్య వైవిధ్యం ఉంటుంది. భిన్నత్వం ఉంటుంది. కానీ నాయక ప్రతినాయక పాత్రలను ధరించి మెప్పించడంలో ఒక ప్రత్యేకత ఉంది. శ్రీకృష్ణుని పాత్రతోపాటు దుర్యోధనుని పాత్రను, శ్రీరాముడి పాత్రతోపాటు రావణాసురుని పాత్రను పోషించడం కష్ట సాధ్యమేకాదు కత్తిమీద సాము కూడా. అయితే ప్రపంచ చలనచిత్ర చరిత్రలోనే లేని ఈ ప్రయోగాన్ని రామారావు సమర్థవంతంగా చేసినప్పుడు ప్రేక్షకులందరూ ముక్తకంఠంతో ఆమోదించారు. అభినందనల వర్షం

కురిపించారు. ఆ ప్రోత్సాహబలంతోనే తొలిసారిగా ఆయన 'కులగౌరవం' చిత్రంలో త్రిపాత్రాభినయం చేశారు. తాతగా, తండ్రిగా, మనవడిగా తెలుగునాట ఒక నటుడు నటించడం అదే ప్రథమం. పేకేటి శివరాం దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రానికి ఎన్.టి.ఆర్. దర్శకత్వ పర్యవేక్షణ చేశారు.

'కులగౌరవం' విడుదలకు ముందు ఎన్.టి.ఆర్. ఈ చిత్ర విశేషాలు 'విజయ చిత్ర' మాసపత్రికలో ఇలా వివరించారు. "ఈ మూడూ వైవిధ్యంగల పాత్రలు. మన సంప్రదాయానికి, సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలిచేపాత్రలు. కథకూడా సర్వజనరంజకమైన కుటుంబ గాథ. అందుచేత ఈ కథను మేము ఎన్నుకుని, చిత్ర నిర్మాణం ప్రారంభించాం. అయితే దీనికి మూలాధార మైన కన్నడ చిత్రానికీ, మా చిత్రానికీ ఏమీ సంబంధం లేదు. తెలుగు చిత్రానికి సంబంధించిన కథనం, సన్నివేశాల చిత్రీకరణ వేరుగా ఉంటాయి. ఈ కథనాన్ని నేనే రూపొందించాను. చిత్ర రూపాన్ని పర్యవేక్షించాను. చిత్రంలోని ప్రధానమైన మూడు పాత్రలూ మూడు తరాలకు సంబంధించినవి. తాత రాజేంద్రప్రసాద్‌కు ఆచారం, కులం, సంప్రదాయం అంటే మహాగౌరవం. ఠీవి, దర్పంగల గంభీరమైన వ్యక్తి. విశేషమైన ఆత్మాభిమానం కలిగినవాడు, ఎప్పుడూ పదిమందికి తను సహాయం చెయ్యాలి, వారికి పెట్టాలి అన్న ఉద్దేశాలుగల వ్యక్తి. పంతాలు, పట్టింపు కలిగిన పాత కాలపు మనిషి. కొడుకు రఘు స్వతంత్రమైన ఆధునిక భావాలు కలిగినవాడు. సంపదకంటే గుణ సంపదకే ప్రాముఖ్యం ఇచ్చే యువకుడు. 'మానవసేవే మాధవ సేవ' అని దృఢంగా విశ్వసించే వ్యక్తి. ఆదర్శాలకు, అలవాట్లకు, ఆత్మాభిమానానికి కట్టుబడే వ్యక్తి. చివరికి సనాతన భావాలుగల తండ్రిని, తనదారికే తీసుకు రాగలిగిన కొడుకు. చిత్రంలోని ఈ రెండు పాత్రలూ సంఘర్షణగల పాత్రలు.

మూడో తరంలోని యువకుడు శంకర్ తండ్రి కట్టు బాట్లలో పెరిగినవాడు. ఈ చిత్రకథ సమస్యా పూరితమైందని నేను చెప్పను కానీ సమాజంలోని అంత స్థులను, వేర్పాట్లను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ బద్ధంగా మలచిన కుటుంబకథ".



'కులగౌరవం'లో ఎన్.టి.ఆర్., జయంతి

కలర్ చిత్రాల నిర్మాణం ఊపందుకుంటున్న తరుణంలో కూడా 'కులగౌరవం' చిత్రాన్ని బ్లాక్ అండ్ వైట్‌లో నిర్మించడం విశేషం. ఈ విషయం గురించి ఎన్.టి.ఆర్. వివరణ ఇస్తూ.. 'కలర్ సినిమాలను మారు మూల గ్రామాలలో ఉన్న వేలాదిమంది అభిమానులు చూడలేకపోతున్నారు. చూడాలన్న అభిలాష ఉన్నవారు పట్నాలకు వెళ్లి చూడాల్సి వస్తోంది. ఇది వ్యయ ప్రయాస లతో కూడుకున్నది. అందుకే తెలుగువాడిగా నా బాధ్య తను గుర్తించి, గుడారాల ప్రదర్శనశాలలో చిత్రాలు చూసే మారుమూల గ్రామవాసులకు కూడా ఈ చిత్రాన్ని చూడగల అవకాశాన్ని కల్పించాలని ఈ సినిమాను మేము 'బ్లాక్ అండ్ వైట్‌లోనే నిర్మించాం" అన్నారు.

1972 అక్టోబర్ 18న విడుదలైన 'కులగౌరవం' చిత్రంలో ఎన్.టి.రామారావు, నాగయ్య, పద్మనాభం, రావికొండలరావు, కాశీనాథ్ తాత, జయంతి, ఆరతి, సంధ్యారాణి తదితరులు నటించారు. ఈ చిత్రానికి మాటలు: సముద్రాల జూనియర్; పాటలు: నారాయణ




రెడ్డి,
కొసరాజు; సంగీతం:
టి.జి. లింగప్ప; కళ:
ఎస్.కృష్ణారావు; ఛాయాగ్రహణం:
మార్కస్ బార్ట్లే; నిర్మాత: త్రివిక్రమరావు;
దర్శకత్వం: పేకేటి శివరాం; స్క్రీన్‌ప్లే,
సూపర్‌విజన్: ఎన్.టి.రామారావు.




### 'దానవీరశూరకర్ణ'లో మళ్ళీ త్రిపాత్రాభినయం


ఐదేళ్ల అనంతరం తిరిగి 'దానవీరశూరకర్ణ' చిత్రంలో త్రిపాత్రాభినయం చేశారు ఎన్.టి.ఆర్. శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, కర్ణుడు పాత్రలను తెరమీద, నిర్మాతగా, దర్శకుడుగా మరో రెండు పాత్రలను తెరవెనుక అనితరసాధ్యమైన రీతిలో నిర్వహించారు ఈ అభినయ సమ్రాట్. ఈ మూడు పాత్రలు ఒకే ఫ్రేమ్‌లో కనిపించినప్పుడు వాటిమధ్య వైవిధ్యం కనబరుస్తూ ఎన్.టి.ఆర్. ప్రదర్శించిన అభినయాన్ని చూసి నోరెళ్ల బెట్టడం ప్రేక్షకులవంతయింది.




## పంచ పాత్రాభినయం

"భిన్న విభిన్న పాత్రలు పోషించి ఒక్క చిత్రంలోనే వైవిధ్యమైన రెండు పాత్రలు, మూడు పాత్రలు ధరించి అభిమానుల ప్రోత్సాహబలం పొంది, ఆపై నాలుగు పాత్రలు, ఐదు పాత్రలు కూడా ధరించి, మెప్పించి అభినందనలు, ఆదరణ అందుకోవాలన్న ఆశ, ఆశయం నాకున్నాయి" అనేవారు ఎన్.టి.ఆర్. ఆ కోరికను 'శ్రీమద్ విరాటపర్వం' చిత్రంతో తీర్చుకున్నారాయన. ఈ సినిమాలో శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, కీచకుడు, అర్జునుడు, బృహన్నల పాత్రలను పోషించారు. ■



# రికార్డుల రాముడు

తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్.టి.ఆర్. నెలకొల్పిన రికార్డులు అనితరసాధ్యాలు. తొలి సోషియో ఫాంటసీ, తొలి సైంటిఫిక్ ఫిలిం... అలాగే విదేశాల్లో నిర్మించిన తొలి చిత్రంలోనూ నటించిన ఘనత ఆయనదే. ఆ యా చిత్రాల వివరాలు...

'యుగంధర్'గా ఎన్.టి.ఆర్.



# ఆరు భాషల్లో రూపుదిద్దుకున్న అగ్గిరాముడు

కోయంబత్తూరులో పక్షిరాజా స్టూడియో అని ఉండేది. దానికి అధినేత ఎస్.ఎం. శ్రీరాములు నాయుడు. పక్షిరాజా బేనరుపైనే స్వీయ దర్శకత్వంలో ఆయన చిత్రాలను నిర్మించేవారు. వీరి తొలిచిత్రం 'బీదల పాట్లు' (1950). నాగయ్య హీరోగా నటించిన ఈ చిత్రం విజయవంతం కావడంతో తెలుగులో నిర్మాణం కొనసాగించారు. ఆ తరువాతి చిత్రం 'కాంచన' (1952). రామశర్మ, లలిత, పద్మిని ముఖ్య తారాగణం. ఈ సంస్థ నిర్మించిన మూడోచిత్రం 'ఒక తల్లి పిల్లలు' (1953). ఇందులో కూడా లలిత, పద్మిని నటించారు. అనంతరం తీసిన సినిమా 'అగ్గిరాముడు'. తోటరాముడు పాత్రతో అందరికీ దగ్గరైన ఎన్.టి.ఆర్. తొలిసారిగా 'రాముడు' టైటిల్‌తో నటించిన సినిమా ఇదే. అంతేకాదు 'రాముడు' టైటిల్‌తో తదనంతరకాలంలో మరెన్నో రావడానికి కారణమైన సినిమా కూడా ఇదే.




'అగ్గిరాముడు' చిత్రానికి చాలా ప్రత్యేకతలున్నాయి. అవేమిటంటే.. ఎన్.టి.ఆర్.కు ఇది 20వ చిత్రం. అల్లూరి సీతారామరాజుగా ఆయన తొలిసారిగా తెరపై కనిపించిన చిత్రం ఇదే. ఎన్.టి.ఆర్., భానుమతి కలిసి నటించిన మూడో చిత్రమిది. 'రోప్వే' కారుని తొలిసారిగా ఈ చిత్రంలోనే ఉపయోగించారు. పతాక సన్నివేశాల్లో చిత్రీకరించిన రోప్వే కారు ఛేజింగ్ ఆనాటి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. హొగెనకల్, ఆ పరిసర ప్రాంతాలలో అవుట్‌డోర్ సన్నివేశాలను చిత్రీకరించారు. బుర్రకథ చెప్పడంలో ప్రసిద్ధి పొందిన నాజర్‌దళంపై ఈ చిత్రంలో చిత్రీకరించిన 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథ కూడా ప్రేక్షకులను ఆకట్టుకొంది.

ఆరు భాషల్లో 'అగ్గిరాముడు' తయారవడం విశేషం. మొదట తమిళంలో ఎం.జి.ఆర్. హీరోగా 'మలైక్కల్లన్' చిత్రాన్ని నిర్మించారు. తర్వాత తెలుగులో 'అగ్గిరాముడు' పేరుతో తీశారు. ఆ తర్వాత దిలీప్‌కుమార్ హీరోగా హిందీలో 'ఆజాద్' పేరుతో నిర్మించారు. అనంతరం కన్నడంలో 'బెట్టెద కళ్ల' పేరుతో, మలయాళంలో 'తస్కరవీరన్', సింహళ భాషలో 'శూరసేన' పేరుతో ఇదే కథను తీశారు. ఈ చిత్రాల రచయిత నామక్కల్ కవింజ్ఞార్. ఒకదాని తర్వాత ఒకటిగా తీసిన ఈ చిత్రాలకు శ్రీరాముడు నాయుడే దర్శకుడు. హిందీ చిత్రానికి సి.రామచంద్ర సంగీత దర్శకుడు.

మిగిలిన అన్ని భాషా చిత్రాలకు వరసలు కన్నడ, మలయాళ, సింహళ భాషల్లో వాడారని, ఈ సినిమాలోని ఒక పాట సన్నివేశాన్ని యథాతథంగా మలయాళ చిత్రంలో ఉపయోగించారనీ పెద్దలు వి.ఎ.కె.రంగారావు చెప్పారు.

'అగ్గిరాముడు' చిత్రం అన్ని భాషల్లోనూ విజయం సాధించింది. తెలుగులో 1954 ఆగస్టు 5న విడుదలైన ఈ చిత్రం ఏడు కేంద్రాల్లో శతదినోత్సవం, రెండు కేంద్రాల్లో రజతోత్సవం జరుపుకుంది. ■



## తెలుగులో తొలి సోషియో ఫాంటసీ చిత్రం

# దేవాంతకుడు

సాంఘిక చిత్రాల్లో అభూత కల్పనలు చోటు చేసుకుని రూపొందే చిత్రాలే సోషియో ఫాంటసీస్. ఏ విధమైన తర్కం వీటిలో ఉండదు. కేవలం వినోదాన్ని, థ్రిల్‌ను ప్రేక్షకులకు కలిగించడమే సోషియో ఫాంటసీ చిత్రాల ప్రధాన లక్ష్యం. తెలుగులో రూపొందిన తొలి సోషియో ఫాంటసీ చిత్రం 'దేవాంతకుడు'. ఈ చిత్రం ద్వారా సాంఘిక కథలోకి యముని పాత్రను ప్రవేశ పెట్టిన ఘనత దర్శకుడు సి. పుల్లయ్యదే. 'సతీసావిత్రి', 'లవకుశ' వంటి పౌరాణిక చిత్రాలను రూపొందించి 'పురాణ పుల్లయ్య'గా పేరు తెచ్చుకున్న వ్యక్తి నుండి పౌరాణికాలపై సంధించిన వ్యంగ్యాస్త్రం 'దేవాంతకుడు' రావడం ఆ రోజుల్లో సంచలనమే అయింది. సర్వశక్తి సంపన్నులైన

యముడు, చిత్రగుప్తుడు పాత్రలను కేవలం వినోదానికే పరిమితం చేయడం, భూలోకంలోని కథానాయకుని ముందు ఈ పాత్రలు తేలిపోవడం ప్రేక్షకులకు కొత్తగా అనిపించింది. అందుకే 'దేవాంతకుడు' చిత్రానికి బ్రహ్మరథం పట్టారు.

### బెంగాలీ రచన ఆధారం


వినోదభరితమైన ఇతివృత్తంతో కొత్త తరహా చిత్రాన్ని తీయాలని ఆలోచిస్తూ కథల అన్వేషణలో ఉన్న పుల్లయ్య అనుకోకుండా ఒకరోజు ఓ బెంగాలీ కథ విన్నారు. గౌరీసి రాసిన ఆ కథ పేరు 'జమాలయే జీబంతో మానుష్'. ప్రాణాలతోనే మనిషి యమలోకానికి వెళ్లడం, అక్కడ యమధర్మరాజు, చిత్రగుప్తులను ముప్పు తిప్పలు పెట్టడం, తిరిగి భూలోకానికి రావడం వంటి సంఘటనలు ఈ కథలో ఉన్నాయి. పౌరాణిక చిత్రాలు రాజ్యమేలుతున్న తరుణంలో ఇటువంటి సెటైరికల్ ఫిలిం తీయాలన్న ఆలోచన రావడమే సాహసం. కానీ ప్రయోగాలు చేయడానికి మొదటినుంచి అలవాటు పడిన పుల్లయ్య వెనుకాడకుండా ఈ కథను సినిమా తీసి తన సత్తా చాటుకున్నారు.

### హీరోగా ఎన్.టి.ఆర్.

ఎన్.టి.రామారావు హీరోగా పరిచయమైన తర్వాత మరే హీరో జోలికిపోకుండా ఆయనతోనే చిత్రాలు తీశారు పుల్లయ్య. 'దేవాంతకుడు' చిత్రాన్ని భార్గవీ ఫిలింస్ పతాకంపై ఆయనే నిర్మించారు. సి.హెచ్. సుబ్బారావు మేనేజింగ్ పార్టనర్. ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్ పాత్రపేరు సుందర్. అతడు నాటకాల ప్రియుడు. ప్రగతి భావాలతో బతుకుసాగించే విద్యాధికుడు. అభిమన్యునిలా దూసుకుపోయే మనస్తత్వం కలవాడు. అనిరుద్ధునిలా పగవాని కోటలో పాగా వేయగల సమర్థుడు. ఈ పాత్రను ఎంతో సమర్థంగా ఎన్.టి.ఆర్. పోషించారు.

### యమునిగా ఎస్.వి.ఆర్.

యమలోకపు ఎపిసోడ్ ఈ చిత్రంలో హైలైట్. యమధర్మరాజుగా ఎస్.వి.రంగారావు, చిత్రగుప్తునిగా వంగర నటించారు. సుందర్ యమలోకంలో ప్రవేశించే వరకూ వీరిద్దరూ తమ విధులను హుందాగానే



'దేవాంతకుడు' చిత్రంలో కీలకపాత్ర పోషించిన ఎద్దుతో ఎన్.టి.ఆర్.



'దేవాంతకుడు'లో స్త్రీ వేషధారణలో ఎన్.టి.ఆర్.

నిర్వర్తించేవారు. ఒక జీవుని విలాసం దొరకక అవస్థ పడుతూ అలసిపోయిన ఇద్దరు యమదూతలకు నాయిక మీనాక్షి తండ్రి భద్రయ్య పంపిన రౌడీల వల్ల బాగా తన్నులు తిని చావుబతుకుల్లో ఉన్న సుందర్ కనిపిస్తాడు. సరే, ఎవడో ఒకడు దొరికాడు అనుకుని సుందర్‌ని మోసుకుపోతారు. తనకు ఆయుష్షు ఉన్నప్పటికీ పొరపాటున యమలోకానికి తీసుకువచ్చారని గ్రహించిన సుందర్ ఇక చెలరేగిపోతాడు. సుందర్ ధాటికి తట్టుకోలేక యమధర్మరాజు, చిత్రగుప్తుడు ఆపసోపాలు పడతారు. చివరికి అతణ్ణి భూలోకానికి సాగనంపి ఊపిరి పీల్చుకుంటారు. వినోదభరితంగా తీర్చిదిద్దిన యమధర్మరాజు పాత్రని అద్భుతంగా పోషించారు రంగారావు. అలానే విష్ణువుగా కాంతారావు, నారదునిగా 'ఈలపాట' రఘురామయ్య కనిపించేది కాసేపే అయినా తమ నటనతో ప్రేక్షకులను అలరించారు. ముఖ్యంగా రఘురామయ్య తనే స్వయంగా పాడుకున్న 'శ్రిత జనపాలా శ్రీలోలా.. జరిగేదంతా నీ లీల' పాట, పద్యాలు ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి.


**అశ్వత్థామ సంగీతం**

అనితరసాధ్యమైన ప్రతిభాపాటవాలుండి కూడా రావలసిన గుర్తింపును పొందలేకపోయిన సంగీత దర్శకుల్లో అశ్వత్థామ ఒకరు. 'దేవాంతకుడు' చిత్రానికి ఆయనే సంగీత దర్శకుడు. మధురమైన సంగీతాన్ని అందించారు. ఈ చిత్రంలోని పాటలు, పద్యాలు ఆరుద్ర రాశారు. పద్యాలను ఘంటసాల, మాధవపెద్ది సత్యం పాడగా పాటలను పి.బి.శ్రీనివాస్, లీల, ఎస్.జానకి పాడారు. ఈ సినిమాలోని పాటలలో 'గో..గో.. గో..గో..గో..గోంగూర జె..జె...జె..జై ఆంధ్రా.. గోంగూర.. జై ఆంధ్రా' పాట హైలైట్. పి.బి.శ్రీనివాస్ పాడిన హుషారైన గీతాల్లో మొదటి స్థానంలో ఉండే పాట ఇది. అలానే ఎస్.జానకి గుంటూరు జిల్లా రేపల్లె నుండి వచ్చిన ఆడపడుచు కావడంవల్లనో ఏమో 'ఘాటు ఘాటు ఎర్రమిరపకాయల కమ్మనైన వెల్లుల్లిపాయలు పిసరంగ ఇంగువ పేరిన నెయ్యి..' అని వర్ణిస్తూ పాడుతుంటే నోట్లో లాలాజలం ఊరుతుంది ఎవరికైనా.

**తదుపరి ప్రయత్నంగా 'యమగోల'**

'దేవాంతకుడు' సినిమా విజయవంతం కావడంతో అదే ధోరణిలో మరో సినిమా తీయాలని సంకల్పించి 'యమగోల' అనే టైటిల్‌ని సి.పుల్లయ్య పత్రికల్లో ప్రకటించారు. రచయిత ఆదుర్తి నరసింహమూర్తిని (దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు తమ్ముడు) కూర్చోబెట్టి కొంతవరకు కథ తయారు చేశారు. తర్వాత ఏ కారణాలవల్లో ఆ ప్రయత్నం ముందుకు సాగలేదు. తర్వాత పుల్లయ్య కుమారుడు సి.ఎస్.రావు ఆ కథని

'యమగోల' రజతోత్సవ వేడుకల్లో జయప్రద, నిర్మాత ఎస్.వెంకటరత్నంతో ఎన్.టి.ఆర్.



మరికొంత డెవలప్ చేశారు. ఆ సమయంలోనే ప్రముఖ నిర్మాత డి.ఎన్.రాజు, సి.ఎస్.రావు దర్శకత్వంలో ఓ చిత్రం నిర్మించే ప్రయత్నాల్లో ఉన్నారు. అప్పుడు 'యమగోల' ఫైల్ని ఆయనకు ఇచ్చారు సి.ఎస్.రావు. ప్రముఖ నిర్మాత డి.వి.ఎస్.రాజు ఆఫీసులోనే డి.ఎన్.రాజు ఉండేవారు. చిత్ర నిర్మాణ విషయంలో ఆయన సలహాలు, సూచనలు తీసుకునేవారు. వీళ్లు ముగ్గురూ ఆ కథ చదివారు. ఎవరికీ నచ్చలేదు. దాంతో ఆ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదు. తర్వాత సురేష్ ప్రొడక్షన్స్ అధినేత డి.రామానాయుడు 'యమగోల' టైటిల్ నచ్చి స్క్రిప్ట్ గురించి తెలుసుకొని హక్కులు కొన్నారు. ఆ తర్వాత కథ ఆయనకూ అంతగా నచ్చకపోవడంతో స్క్రిప్ట్ ఫైల్ని పక్కన పడేశారు. చివరికి 17 ఏళ్ల తర్వాత 'యమగోల' చిత్రానికి మోక్షం వచ్చింది. పల్లవీ ప్రొడక్షన్స్ అధినేత, ప్రముఖ ఛాయాగ్రాహకుడు ఎస్.వెంకటరత్నం, రామానాయుడు దగ్గర 'యమగోల' టైటిల్ని కొనుక్కొని సినిమా నిర్మించారు. డి.వి.నరసరాజు కథను డెవలప్ చేసి మాటలు రాశారు. ఆ సమయంలో బాలకృష్ణ అభిమన్యునిగా నటించిన 'దానవీర శూరకర్ణ' చిత్రం విడుదలై విజయవంతం అయింది. బాలకృష్ణ హీరోగా, ఎన్.టి.ఆర్. యమునిగా 'యమగోల' తీయాలని నిర్మాత భావించారు. ఎన్.టి.ఆర్.ని సంప్రతించగా బాలకృష్ణని బయటి నిర్మాతలకు ఇప్పట్లో ఇవ్వదలచుకోలేదని, తనను హీరోగా, సత్యనారాయణను యమునిగా పెట్టుకుని సినిమా తీయాలని సలహా ఇచ్చారు. అలా 'యమగోల' ప్రారంభమైంది.

### అచ్చివచ్చిన 'యమ' ఫార్ములా

తాతినేని రామారావు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'యమగోల' చిత్రం దసరా పర్వదినాన 1977 అక్టోబర్ 21వ తేదీన విడుదలై సంచలన విజయం సొంతం చేసుకుంది. అదే సమయంలో దివిసీమను ఉప్పెన ముంచెత్తినా ఆ వరదల్లోనూ ఈ సినిమా విజయ దుందుభి మోగించడం అరుదైన విశేషం. ఈ చిత్రంలో

యమలోకం వెళ్లిన హీరోచేత అప్పటి రాజకీయాంశాలను వ్యంగ్యంగా ప్రస్తావించడం, ఆ కాలానికి అనుగుణంగా మాటలు, పాటలు చోటు చేసుకోవడం కూడా ఈ చిత్ర విజయానికి ప్రధాన కారణాలుగా చెప్పాలి.

ఆ ఏడాది విడుదలైన ఎన్.టి.ఆర్. చిత్రాలు 'దానవీర శూరకర్ణ', 'అడవిరాముడు' ఘన విజయం సాధించి, కలెక్షన్ల చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టించాయి. 'యమగోల' చిత్రం కూడా ఆ స్థాయి విజయాన్ని సాధించింది. 29 కేంద్రాల్లో శతదినోత్సవం, 6 కేంద్రాల్లో రజతోత్సవం జరుపుకుంది. ఒకే ఏడాదిలో ఒకే హీరో నటించిన మూడు చిత్రాలు 'డబుల్ సెంచరీ'లు కైవసం చేసుకోవడం నిజంగా అరుదైన రికార్డ్. 'యమగోల' విజయంతో యమ లోకం నేపథ్యంగా సినిమాలు తీస్తే తప్పక విజయం సాధిస్తాయనే నమ్మకం నిర్మాతల్లో బలపడింది.

'యమగోల' చిత్రం స్ఫూర్తి తోనే 'యముడికి మొగుడు', 'యమలీల', 'మగరాయుడు', 'యమజాతకుడు', 'యమగోల మళ్లీ మొదలైంది' తదితర చిత్రాలు తయారై విజయం సాధించాయి. అలాగే ఎన్.టి.ఆర్. మనవడు జూనియర్ ఎన్.టి.ఆర్. హీరోగా రూపొందిన 'యమదొంగ' చిత్రం కూడా ప్రేక్షకుల్ని అలరించి ఘనవిజయం పొందింది.

■


యముని గెటప్‌లో జూనియర్ ఎన్.టి.ఆర్.



## తొలి సైన్స్‌ఫిక్షన్ చిత్రం

# దొరికితే దొంగలు

పదిమంది నిర్మాతల్లో తన ప్రత్యేకత చాటుకున్న వ్యక్తి డి.ఎల్.నారాయణ. ఆయన తీసినవన్నీ ప్రయోగాత్మక చిత్రాలే. నలుగురు వద్దని వారించినా కథల మీద, ముఖ్యంగా తన మీద తనకు ఉన్న నమ్మకంతో సినిమాలు నిర్మించి ప్రేక్షకుల్ని మెప్పించారు. 'దేవదాసు', 'కన్యాశుల్కం', 'ఏకవీర'... ఈ తరహా చిత్రాలే. అలాగే అప్పట్లో వస్తున్న చిత్రాలకు భిన్నంగా చందమామ పతాకంపై డి.ఎల్. నిర్మించిన మరో విభిన్న చిత్రం 'దొరికితే దొంగలు'.

45 ఏళ్ల క్రితం తయారైన ఈ సినిమా తెలుగులో తొలి సైన్స్ ఫిక్షన్ చిత్రం కావడం గమనార్హం. ఎన్.టి.ఆర్, జమున జంటగా నటించిన ఈ చిత్రానికి పురాణం సుబ్రహ్మణ్యం దర్శకత్వం వహించారు. ఆయనకు ఇదే తొలిచిత్రం. శాస్త్ర విజ్ఞానాన్ని, అందులోని అద్భుతాలను ఆధారం చేసుకుని ఈ చిత్రకథను కె.వి.ఆర్ ఆచార్య తయారు చేయగా, పినిశెట్టి డైలాగ్స్ రాశారు. మనుషులు మాయం కావడం, జీప్ ఆకాశంలో ప్రయాణించడం, మందు రాసిన చెప్పులను ధరించి గాలిలోకి ఎగరడం... తాంత్రిక ఛాయాగ్రాహకుడు రవికాంత్ నగాయిచ్ ఈ సన్నివేశాలను చిత్రీకరించిన విధానం ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి.

ఈ సినిమాలో సి.ఐ.డి.లుగా ఎన్.టి.ఆర్, జమున నటించారు. పోలీస్ కమిషనర్‌గా గుమ్మడి, శాస్త్రవేత్తగా ధూళిపాళ, విలన్లుగా రాజనాల, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, మార్వాడి గుమస్తాగా రమణారెడ్డి,

శాస్త్రవేత్త కుమార్తెలుగా జమున, జయంతి నటించారు.

ఎస్.రాజేశ్వరరావు స్వరపరిచిన 'ఎవరికి తెలియదులే ఇంతుల సంగతి' పాట ఇప్పటికీ వీనులవిందు చేస్తూ ఉంటుంది.

ఈ చిత్రానికి కథ: కె.వి.ఆర్ ఆచార్య, మాటలు: పినిశెట్టి; పాటలు: సి.నారాయణరెడ్డి, దాశరథి; ఆరుద్ర; సంగీత దర్శకుడు: ఎస్.రాజేశ్వరరావు; ఛాయాగ్రహణం: రవికాంత్ నగాయిచ్; నృత్య దర్శకుడు: వెంపటి సత్యం; కళా దర్శకుడు: డి.యస్.గోడ్‌గాంకర్, కె.అచ్యుతరావు; కూర్పు: ఎన్.ఎస్.ప్రకాష్; నిశ్చల ఛాయాగ్రహణం: ఆర్.ఎన్.నాగరాజరావు; నిర్వహణ: జి.వి.ఎస్.రాజు; సహాయకులు: పసుపులేటి సుబ్బారావు, వాసుదేవరావు; దర్శకుడు: పి.సుబ్రహ్మణ్యం; నిర్మాత: డి.ఎల్. నారాయణ.

(విడుదల: 1965 ఫిబ్రవరి 26)


■



డి.ఎల్.నారాయణ



ఎన్.టి.ఆర్., జమున



## విదేశాలలో షూటింగ్ జరుపుకున్న తొలిచిత్రం

# సాహసవంతుడు

విదేశీగడ్డపై షూటింగ్ జరుపుకున్న తొలి తెలుగు చిత్రం 'సాహసవంతుడు'. తిరుపతి పిక్చర్స్ పతాకంపై రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్., వాణిశ్రీ ముఖ్యజంట. కె.బాపయ్య దర్శకుడు. ఈ చిత్ర నిర్మాత కె.విద్యాసాగర్ యువకుడు, విద్యాధికుడు. ఎం.కాం చదివారు. చిత్ర నిర్మాణం అంటే ఆసక్తి. ఎన్.టి.ఆర్.తో సినిమా తీయాలనే కోరిక ఆయనది. అంతవరకూ విదేశాల్లో ఏ తెలుగు చిత్రం షూటింగ్ జరగలేదు ఆ ఖ్యాతి తనకే దక్కాలని భావించి నేపాల్‌లో 'సాహసవంతుడు' చిత్రం తీయడానికి ముందుకు వచ్చారు. విద్యాసాగర్ ఉత్సాహాన్ని గమనించిన ఎన్.టి.ఆర్. డేట్స్ ఇచ్చి ప్రోత్సహించారు.

### నిజంగా సాహసమే

'సాహసవంతుడు' కథలోని కొన్ని ముఖ్య సన్నివేశాలు నేపాల్‌కి సంబంధించినవి. నేపాల్ దేశస్థుని కుటుంబం ఈ చిత్ర కథలో ముడిపడి ఉంది. అటు కాశ్మీర్ నుండి ఇటు కన్యాకుమారి వరకు దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ సినిమా షూటింగ్స్ జరిగేవి. అయితే నేపాల్ నేపథ్యం కలిగిన కథను నిర్మాత ఎన్నుకోవడం నిజంగా సాహసమే. ఆసక్తి కలిగించే ఆసినిమా విశేషాలు...

ఆ రోజుల్లో ఖాట్మండుకు చెన్నై నుండి డైరెక్ట్ ఫ్లైట్ లేదు. కలకత్తా వెళ్లి, అక్కడ మరో విమానం ఎక్కాలి.

అంటే ఐదు గంటల ప్రయాణం. ఇక టెక్నీషియన్లు ఖాట్మండు చేరాలంటే నాలుగు రోజులు జర్నీ. ఇదంతా దృష్టిలో పెట్టుకుని నిర్మాత విద్యాసాగర్ పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. చెన్నైలో రైల్లో బయలు దేరిన సాంకేతికనిపుణులను కలకత్తాలో రిసీవ్ చేసుకుని తిరిగి వాళ్లని మజాఫర్‌పూర్ వెళ్లే రైలు ఎక్కించేవారు. వాళ్లు అక్కడికి చేరుకున్న తర్వాత వాళ్ళని నేపాల్ సరిహద్దు అయిన బీర్‌గంజ్‌కు చేర్చేవారు. బీర్‌గంజ్‌కు ఇవతల రాక్సాల్ అనే బీహార్ రాష్ట్ర గ్రామం సరిహద్దు. ఈ రెండు సరిహద్దుల్లో లగేజీని తనిఖీ చేసిన తర్వాతే నేపాల్‌లోకి అనుమతి స్తారు. అందుకే చెన్నైనుంచి రైల్లోనూ, విమానం లోనూ వచ్చేవారి ఏర్పాట్లు చూడటం కోసం నిర్మాత విద్యాసాగర్ సోదరుడు మోహనరావు కలకత్తాలో మకాం పెట్టారు. అలాగే మజాఫర్‌పూర్‌లో ఒక ప్రొడక్షన్ మేనేజర్‌ను నియమించారు. ఖాట్మండు చేరిన ఆర్టిస్టులకు, యూనిట్ సభ్యులకు వసతి సౌకర్యాలను నిర్మాత బావమరిది పర్యవేక్షించేవారు. ఇలా మూడంచెల విధానాన్ని పకడ్బందీగా ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా షూటింగ్ జరిగిపోయింది. ఖాట్మండు పరిసర ప్రాంతాల్లో 10 రోజులపాటు కొన్ని కీలక సన్నివేశాలు, ఒక కరాటే ఫైట్, రెండు పాటలు చిత్రీకరించారు.




### సరికొత్త విమానంలో ఎన్.టి.ఆర్.

విదేశాలకు వెళ్లడం ఎన్.టి.ఆర్.కు అదే ప్రథమం. అందుకే 'సాహసవంతుడు' చిత్ర నిర్మాణం ఆయనకు తీయని అనుభూతి మిగిల్చింది. నేపాల్ ప్రభుత్వం కొన్ని కోట్ల రూపాయలు వెచ్చించి బోయింగ్ విమానం కొన్నది. ఆనవాయితీ ప్రకారం నేపాల్‌రాజు పూజ చేసిన తర్వాత జాతికి అంకితం చేస్తారు. ఖాట్మండు విమానాశ్రయంలో షూటింగ్ చేస్తున్న రోజునే ఈ సరికొత్త విమానం కూడా వచ్చింది. ఆ రోజు ఎన్.టి.ఆర్. విమానం ఎక్కే దృశ్యాన్ని చిత్రీకరించాలి. అయితే పూజ జరిగితేకానీ విమానంలోకి ఇతరులను అనుమతించరు. కాలయాపన ఎందుకని విమానాశ్రయ అధికారులు, నేపాల్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి ఆలోచించి 'పరవాలేదు.. మీరు షాట్ తీసుకోండి.. తర్వాత పూజ చేస్తాం' అని అనుమతి ఇవ్వడంతో ఆ సరికొత్త బోయింగ్ విమానంలో ఎన్.టి.ఆర్ ఎక్కి, దిగే షాట్స్ తీశారు బాపయ్య.

### రెండు పాటలు, కొన్ని సన్నివేశాలు

1978 మే 10న నేపాల్‌లో షూటింగ్ మొదలైంది. అక్కడ 'ఇంద్రజాతక' పేరుతో ఒక జాతరను జరుపుతారు. అందులో మగవాళ్లు ముఖాలకు మాస్క్‌లు ధరించి మహిళలతో డాన్స్ చేస్తారు. విలన్ల నుండి తప్పించుకుని హీరోయిన్ వాణిశ్రీ ఈ జాతరలో కలిసిపోవడం, ఆమెను వెంటాడుతున్న కాంతారావు అందులోకి జొరబడి ఆమెను లాక్కెళ్లే సన్నివేశాన్ని అక్కడ చిత్రీకరించారు. దక్షిణ కాళీ ఆలయం సమీపంలో వీటిని తీశారు. ఇందుకోసం 25 మంది నేపాలీ యువతీ యువకులను (వీరంతా డాన్స్‌లో శిక్షణ పొందినవారే) ఎంపికచేసి, సినిమాకు అనుగుణంగా నృత్య దర్శకుడు శ్రీనుమాస్టర్ కొంత ట్రైనింగ్ ఇచ్చారు. అలాగే నేపాల్

ఫైటర్లతో ఎన్.టి.ఆర్. పాల్గొన్న ఒక ఫైట్‌ని చిత్రీకరించారు. శోభ అనే నేపాలీ యువతి కూడా ఈ ఫైట్‌లో పాల్గొంది.

ఖాట్మండులో స్వయంభూనాథ్ ఆలయం చాలా పెద్దది. ఎత్తయిన ప్రదేశంలో ఉన్న ఈ ఆలయం నుండి చూస్తే ఖాట్మాండులోయ పూర్తిగా కనిపిస్తుంది. అక్కడ ఎన్.టి.ఆర్, వాణిశ్రీ పాల్గొన్న సన్నివేశాలను, వేటూరి రాసిన 'సుప్రభాత సుందరి నీవు... ఉదయరాగ మంజరి నేను' అనే పాటను చిత్రీకరించారు. ఈ పాటలోని కొన్ని చరణాలను నయాతపోల ఆలయంలో, పశుపతినాథస్వామి ఆలయంలోనూ చిత్రీకరించారు.

ఖాట్మండుకు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న భక్తపూర్ పట్టణంలో కొన్ని సన్నివేశాలను తీసి, అక్కడికి 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొకరా నగరంలో ఆత్రేయ రాసిన 'ఏయ్ ఝుం ఝుటక్ నువ్వేనా లవ్ లటక్' అనే పాటను చిత్రీకరించారు.

ఈ సినిమాలో నేపాల్ నటి లక్ష్మీశ్రేష్ఠ కూడా ఒక ముఖ్యపాత్ర పోషించింది. ఎన్.టి.ఆర్., వాణిశ్రీ, ఆమె పాల్గొన్న కొన్ని సీన్లు తీశారు. మే 20 వరకూ అక్కడ షూటింగ్ జరిపి, తీయని అనుభూతులతో చెన్నైకి తిరుగు ప్రయాణమైంది యూనిట్.


నేపాల్‌లో ఎక్కడ చూసినా పర్వత శ్రేణులే. మంచుకొండలే. ఛాయాగ్రాహకుడు కన్నప్పని పిలిచి, ఆ పర్వత ప్రాంతాలను రెండు రోల్స్ ఎక్స్‌పోజ్ చేయమని చెప్పారు రామారావు. అలా ఆరోజు చిత్రీకరించిన దృశ్యాల్ని 'శ్రీరామ పట్టాభిషేకం' చిత్రంలో రావణాసురునితో చిత్రీకరించిన సన్నివేశాలకు నేపథ్యంగా వాడుకున్నారు.

### మరిన్ని ప్రత్యేకతలు

భమిడిపాటి రాధాకృష్ణ కథ, మాటలు అందించిన ఈ చిత్రానికి కె.వి.మహదేవన్ సంగీతాన్ని, కన్నప్ప ఛాయాగ్రహణాన్ని అందించారు. ఈస్ట్‌మన్ కలర్‌లో తయారైన ఈ సినిమాకోసం 'టాడేవో' అనే ప్రత్యేకమైన జపనీస్ లెన్స్ తొలిసారిగా వాడారు. అలాగే ఒక విచిత్రమైన మోటార్ బైక్‌ని అధికవ్యయంతో తయారు చేయించి, ఎన్.టి.ఆర్.తో డ్రైవ్ చేయించారు. అంతేకాదు డ్రగ్స్ వాడకాన్ని అరికట్టాలనే సందేశంతో తయారైన తొలిసినిమా ఇదే.

### నిర్మాత అదృష్టం


ఈ చిత్ర నిర్మాణ సమయంలో నిర్మాత విద్యాసాగర్ ఘోర ప్రమాదం నుండి బయటపడ్డారు. ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై పెద్ద లోయలోకి పల్టీలు కొట్టినా ఆయనకేం కాలేదు. అలాగే లక్షన్నర క్యాష్ ఉన్న బ్రీఫ్‌కేసు పోగొట్టుకున్నారు. అయితే వారం రోజుల తర్వాత ఆ బ్రీఫ్‌కేస్ దొరకడంతో ఆయన్ని అంతా అదృష్టవంతుడు అన్నారు. ఖర్చుకి ఏమాత్రం వెనకాడకుండా తను అనుకున్న ప్రకారం చిత్రాన్ని పూర్తిచేసి 1978 అక్టోబర్ 6న చిత్రాన్ని విడుదల చేశారు విద్యాసాగర్. ■



## చారిత్రక చిత్రాలకు తలమానికం...

# శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర

**వేల సంఖ్యలో నిర్మించిన తెలుగు సినిమాల్లో చారిత్రక నేపథ్యంలో తీసినవి పదుల సంఖ్యలో మాత్రమే ఉంటాయి. వాటిలో కూడా తెలుగువారి చరిత్రను తెరకు ఎక్కించిన సినిమాలను వేళ్లమీద లెక్క పెట్టవచ్చు. అటువంటి స్థితిలో అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ తెలుగువారికి గర్వ కారణంగా నిలిచిన చరిత్రను అంతే ఘనమైన రీతిలో వెండితెరపై ఆవిష్కరించిన చిత్రం 'శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర'. ఎన్.టి.ఆర్. స్వీయ దర్శకత్వంలో నటించి, నిర్మించిన ఈ చిత్రానికి ఉన్న ప్రత్యేకతలు ఎన్నో..**



కులమత విభేదాలు, విగ్రహారాధన, జంతు బలులు, మూఢాచారాలకు వ్యతిరేకంగా 400 ఏళ్ల క్రితమే నినదించిన సంస్కర్త, తత్వవేత్త బ్రహ్మంగారు. ప్రపంచ చరిత్రలో బ్రహ్మంగారు, నోస్ట్రడామస్(ఫ్రాన్స్) మాత్రమే కాలం భవిష్యత్తును ఊహించి గ్రంథస్తం చేశారు. అటువంటి బ్రహ్మంగారి చరిత్రను తెర కెక్కిస్తూ గౌతమ బుద్ధుడు, రామానుజాచార్య, ఆదిశంకరాచార్య, వేమన వంటి సంఘసంస్కర్తలు సమాజానికి ఏ సందేశాన్ని ఇచ్చారో ఉప కథల ద్వారా సినిమా ప్రారంభంలో తెలి పారు. ఆ పాత్రలను కూడా ఎన్.టి.ఆర్. అద్వితీయంగా పోషించారు. ఆయా సంస్కర్తలు సమాజాభ్యున్నతికి ఏ స్థాయిలో కృషి చేశారో చెప్పారు. సరిగ్గా ఆ స్థాయి కృషినే చేసిన సంస్కర్త బ్రహ్మంగారని చెబుతూ, ఈ సినిమా ప్రధాన కథ ప్రారంభమవుతుంది. ఏ మాత్రం గ్లామర్, వినోదం లేకుండా కాషాయాంబరాలు ధరించి సందేశాలు చెప్పే ఒక తత్వవేత్త కథతో సినిమా



తనయుడు బాలకృష్ణకి సీన్ వివరిస్తున్న ఎన్.టి.ఆర్.

రూపొందించడమే ఒక సాహసం, అందులో వాస్తవ చరిత్రలో ఉన్న వివాదాంశాలను కూడా ధైర్యంగా చర్చించడం, దానికి ప్రజలను ఒప్పించి విజయం సాధించడం ఒక్క ఎన్.టి.ఆర్.కే చెల్లింది.

ఇతిహాసాలు, చారిత్రక కథాంశాలతో రూపొందించిన చిత్రాల్లో ఒక పాత్రలోని బాల్య, కౌమార్య, యవ్వన, వృద్ధాప్యాలను చూపిన చిత్రాలు తెలుగులో మూడు నాలుగుకు మించి ఉండవు. వాటిలో ఈ చిత్రంతో పాటు అంతకుముందు 'భీష్మ'లోనూ ఎన్.టి.ఆర్. ఈ అరుదైన ఘనతను సాధించారు.

1980లో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. అంతకుముందు ఐదారుగురు బ్రహ్మంగారిపై చిత్రాలు ప్రారంభించినప్పటికీ అనేక అవాంతరాలతో మధ్యలోనే నిర్మాణాన్ని ఆపివేశారు. ఎన్.టి.ఆర్. ఈ చిత్రాన్ని ప్రారంభించినప్పుడు కూడా అనేకరకాల వ్యాఖ్యానాలు వినిపించినా ఆయన ధైర్యంగా ముందుకు వెళ్లారు. 1981లో చిత్ర నిర్మాణాన్ని పూర్తి చేశారు. వేమన వదిన నగ్నదృశ్యం విషయంలో సెన్సార్‌పై మూడేళ్లు న్యాయ పోరాటం చేసి విజయం సాధించారు. అన్ని అవాంతరాలనూ అధిగమించి ఈ చిత్రం 1984 నవంబర్ 29న విడుదలై ఘన విజయం సాధించింది. తెలుగు సినిమా రంగంలో చెరగని చరిత్రలా నిలిచింది.

బ్రహ్మంగారు తన జీవితంలో ఏ యే ప్రాంతాల్లో పర్యటించారో, అక్కడే ఈ చిత్రం షూటింగ్ జరగడం విశేషం. ఎన్.టి.ఆర్ తొలిసారి రాయలసీమ ప్రాంతంలో షూటింగ్ జరిపిన చిత్రం కూడా ఇదే. రాయలసీమలోని కందిమల్లాయపల్లె, అహోబిలం తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరిపారు. ముమ్మిడివరం బాలయోగి మందిరం వద్ద షూటింగ్ జరిపిన ఏకైక చిత్రం కూడా ఇదే. షూటింగ్‌కు ముందు ఎన్.టి.ఆర్. బ్రహ్మంగారి మఠాన్ని సందర్శించారు. అప్పుడే బ్రహ్మంగారు ఉపయోగించిన వస్తువుల నకళ్లను తయారు చేయడానికి ఆయన పాదుకలు పరిశీలించారు. బ్రహ్మంగారి పాదుకలు ఎన్.టి.ఆర్. పాదాల కొలతతోనే ఉండటం




విశేషంగా చెప్పుకున్నారు.

ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్.తోపాటు ఆయన తనయుడు బాలకృష్ణ సిద్దయ్యగా నటించారు. ఈ చిత్రం బాలకృష్ణ నటజీవితంలో అత్యుత్తమమైన నటన ప్రదర్శించిన చిత్రంగా నిలిచింది. కక్కడిగా కైకాల సత్యనారాయణ పాత్ర ప్రశంసలు అందుకుంది. ఋష్యేంద్రమణి, ముక్కామల, దేవిక, కాంచన, రతి, ప్రభ తమ పాత్రల్లో రాణించారు.

కొండవీటి వేంకటకవి రచనా చాతుర్యం, సుసర్ల దక్షిణామూర్తి సంగీత సౌరభం, నందమూరి మోహన కృష్ణ ఛాయాగ్రహణ నైపుణ్యం బంగారానికి తావి అబ్బినట్లుగా వన్నె తెచ్చిన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి అద్భుతమైన అభినయంతో, అనితర సాధ్యమైన దర్శకత్వ ప్రతిభతో ఎన్.టి.ఆర్. ప్రాణం పోశారు. ఆయన సోదరుడు త్రివిక్రమరావు ఈ చిత్రానికి సంగీత పర్యవేక్షణ చేశారు. ఈ చిత్రంలోని పాటలు, కాలజ్ఞాన తత్త్వాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. గాయకుడు రామకృష్ణ కెరీర్‌లో

అత్యుత్తమంగా నిలిచిందీ సినిమా.

### పొడవైన టైటిల్

అప్పటివరకు విడుదలైన అన్ని సినిమాల్లోకి అత్యధిక అక్షరాలున్న టైటిల్‌తో రూపొందిన ఈ సినిమా, తెలుగులో తొలిసారిగా వందకు పైగా ప్రింట్లతో విడుదలైంది. విడుదలైన అన్ని కేంద్రాలలో శతదినోత్సవాన్ని, హైదరాబాద్‌లో త్రిశతదినోత్సవాన్ని జరుపుకుంది. ఎన్.టి.ఆర్. పారితోషికం కాకుండా 15 లక్షలలోపు వ్యయంతో రూపొందిందీ చిత్రం. విడుదలైన తర్వాత ఏడు కోట్లకు పైగా వసూలుచేసి, ప్రాంతీయ చిత్రాల్లో ప్రపంచంలోనే అత్యధిక వసూళ్లు చేసిన సినిమాగా ఇలస్ట్రేటెడ్ వీక్లీ తదితర జాతీయ ఆంగ్ల పత్రికల దృష్టిని సైతం ఆకర్షించే స్థాయిలో సంచలనం సృష్టించింది.

ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల సమయంలో విడుదలైన ఈ చిత్రం అప్పటి ఎన్.టి.ఆర్. జైత్రయాత్రకు టానిక్‌లా పనిచేసింది. పార్లమెంట్‌లో ఒక ప్రాంతీయ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా నిలిచిన ఏకైక చారిత్రక సంఘటనలో తనదైన ప్రభావం చూపించిందీ చిత్రం.




### ఎన్.టి.ఆర్. ఏమన్నారంటే..

ఈ చిత్ర నిర్మాణం గురించి ఎన్.టి.ఆర్. చెప్పిన విశేషాలు ఆయన మాటల్లోనే... "నటుడన్న తర్వాత ఎన్నోరకాల వేషాలు వేయాలి. కొన్ని అవసరాల కోసం, మరికొన్ని మొహమాటంకోసం.. అయినా వాటిల్లో పరమార్థాన్ని సాధించే బ్రహ్మంగారి వంటి పాత్రలు దొరకడం నటుని తపస్సుకు ఫలితం లభించినట్లే. శక్తి సామర్థ్యాలతో ఆ పాత్రకు కనీసం పదిశాతం న్యాయం చేకూర్చగలిగినా జన్మ ధన్యమైనట్లే. నిజానికి ఇంత వరకూ బ్రహ్మంగారి రూపకల్పన ఎక్కడా జరగలేదు. ఊహా చిత్రాలు తప్ప. అలాంటి ఆ మహనీయుని పాత్ర రూపకల్పన మిగిలిన వాటికంటే కష్టతరమైనదిగా భావి స్తున్నాను. ఎందుకంటే సమస్యలతో, మూఢాచారాలతో, సంకుచిత మత తత్వాలతో నిండిపోయిన నాటి సమాజంలో వేమన, వీరబ్రహ్మంగారి లాంటి వాళ్లు పుట్టకుండా ఉంటే సమాజం అధోగతి పాలయ్యేది. మనుషులు మృగ ప్రాయంగా మారేవారు. వేమన, బుద్ధుడు, శంకరుడు, రామానుజాచార్యులు, వీరబ్రహ్మం... కారణజన్ములు. వీళ్ల నుండి నేర్చుకో వలసింది చాలా ఉంది. అందుకే ఈ చిత్రాన్ని ప్రత్యేక ఆశయంతో, సత్ సంకల్పంతో నిర్మిస్తున్నాను.

### రెండేళ్ల పరిశోధన

దాదాపు రెండు సంవత్సరాలు ఈ చిత్రానికి కావాల్సిన గ్రంథ సేకరణ చేశాను. చాలాకాలం క్రితం నుంచే ఆ మహాపురుషుడు చరిత్రను చిత్రంగా తీయాలనే ఆలోచన నాకు ఉంది. అందుకే మహా పురుషుల గ్రంథాలు ఏకాగ్రతతో చదివాను. తెలిసిన వారు చెప్పగా కొన్ని విన్నాను. దాన్నిబట్టి పాత్ర పోషణకు అవసరమైన కట్టు, బొట్టు అవగాహన చేసుకున్నాను.

సంఘాన్ని చూసి బాధపడి, భవిష్యత్‌ను ఊహించిన మహాజ్ఞాని బ్రహ్మంగారు. పీడిత వర్గాలను చూసి వేడి కన్నీటిబొట్లు రాల్చిన సంస్కర్త. ముక్కు మూసుకుని చెట్టుకింద కూర్చుని తాళ పత్రాల మీద కాలజ్ఞానం రాసిన వ్యక్తికాదు. జ్ఞానంతో కూడిన ఆవేశం ఆయనలో మెండుగా ఉండేది. ఇలా ఆ మహాపురుషుని గురించి ఎంత చెప్పినా తరగదు. అందుకే ఆయన ఏ స్థాయికి, ఏ కోవకి చెందిన మహావ్యక్తో చెప్పేందుకు బుద్ధ భగవానుడు, శంకరాచార్యులు, రామానుజాచార్యులు, వేమన మొదలైన చారిత్రక మహాపురుషుల పాత్రలను కూడా చిత్రంలో ప్రవేశపెట్టాం.. ఆ నాలుగు పాత్రలను కూడా నేనే ధరిస్తున్నాను. ఆ పాత్రల పరిచయంతోనే చిత్రం మొదలవుతుంది. బుద్ధ, రామానుజాచార్య, శంకరాచార్య, పాత్రలకన్నా కొంత విపులంగా వేమన పాత్రను తీర్చిదిద్దాం. 14వందల వేమన పద్యాలను మేం సేకరించాం. అందులో అత్యుత్తమ వేదాంతాన్ని, శృంగారాన్ని, నీతిని ప్రభవించే అయిదు పద్యాలను పంచ రత్నాలుగా తీసుకున్నాం.

### మరుపురాని పాత్ర

ఈ చిత్రం ద్వారా చాలా చెప్పదలుచుకున్నాను. ఇదొక పవిత్రమైన ఇతివృత్తం. అంతే పవిత్రంగా నిర్మిస్తున్నాను. నా మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రమే చిత్రీకరణ జరుపుతున్నాను. బ్రహ్మంగారు చెప్పిన అసలైన కాలజ్ఞానం ఏమిటీ అన్నది ఇంతవరకూ లోకానికి తెలీదు. అందుకే అనేక పరిశోధనలు, చర్చల అనంతరం బ్రహ్మంగారు చెప్పిన అసలైన కాలజ్ఞానాన్ని కూడా తెరకు ఎక్కిస్తున్నాం. నా నట జీవితంలో ఇదొక మరుపురాని, మరువలేని పాత్ర. ఆ పాత్ర పోషించడం ఈ జన్మకు నాకు లభించిన అదృష్టం. అందుకే జాగ్రత్తగా రూపొందిస్తున్నాను".

**(మిత్రుడు కొమ్మినేని వెంకటేశ్వరరావుకి కృతజ్ఞతలతో)**

■



## ఆ 'రహస్యం' ఏమిటో!!

తెలుగులో తొలిసారిగా పూర్తి రంగుల చిత్రం (గేవా కలర్) 'లవకుశ'ను నిర్మించిన అల్లారెడ్డి శంకరరెడ్డి ఈస్ట్‌మన్‌కలర్‌లో కూడా తొలి చిత్రాన్ని తనే నిర్మించాలనే కోరిక ఉండేది. అందుకే 'లవకుశ' విడుదలైన 5 నెలలకు అంటే 1963 ఆగస్టు 23న 'రహస్యం' పేరుతో ఒక జానపద చిత్రాన్ని పాటల రికార్డింగ్‌తో ప్రారంభించారు. ఘంటసాల, మాధవపెద్ది సత్యం పాడిన రెండు శ్లోకాలను వాహినీ స్టూడియోలో ఆ రోజు రికార్డ్ చేశారు. ఆ తర్వాత ఆగస్టు 31న ఘంటసాల పాడిన పాటను రికార్డ్ చేశారు.

'లవకుశ'తో తన సంస్థ ప్రతిష్ఠను ఎంతో పెంచిన ఎన్.టి.ఆర్.తోనే తదుపరి చిత్రాన్ని నిర్మించాలనుకున్నారు శంకర్‌రెడ్డి. భానుమతి, బి.సరోజాదేవి, ఎస్.వి.రంగారావు, గుమ్మడి, రమణారెడ్డి, సూర్యకాంతం... ఆనాడు అనుకున్న ముఖ్యతారాగణం.


ఈ చిత్రానికి మొదట ఎంపిక చేసిన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు. అయితే ఎందువల్లో ఈ చిత్ర నిర్మాణం జరగలేదు. మూడేళ్ల అనంతరం తిరిగి చిత్ర నిర్మాణం ప్రారంభించారు శంకర్‌రెడ్డి. సినిమా పేరు మారలేదు కానీ కీలకమైన మార్పులెన్నో చోటుచేసుకున్నాయి. ఎన్.టి.ఆర్.కి బదులు ఏయన్నార్ హీరోగా నియమితులయ్యారు. వేదాంతం రాఘవయ్య దర్శకత్వ బాధ్యతలు స్వీకరించారు. ఇతర తారాగణంలోనూ మార్పులు జరిగాయి. దాదాపు 30 లక్షల రూపాయల వ్యయంతో హైదరాబాద్‌లో నిర్మాణం జరుపుకున్న 'రహస్యం' చిత్రం 1967 డిసెంబర్ 10న విడుదలైంది.

# నటజీవితంలో కొత్తకోణం

మారుతున్న అభిరుచులు, విలువలతోపాటు హీరో పాత్ర స్వభావం, స్వరూపం మారిపోతున్నప్పటికీ తనదైన బాణీలో నటిస్తూ కొన్ని దశాబ్దాలపాటు అగ్రహీరోగా వెలుగొందిన ఘనత ఎన్.టి.ఆర్.ది. ఎన్.టి.ఆర్. నటజీవితంలో కొత్తకోణం 'ఎదురులేని మనిషి' చిత్రంతో మొదలైతే, 'అడవిరాముడు'తో అది విశ్వరూపం దాల్చింది. ఒక కొత్త ఎన్.టి.ఆర్.ని ఆ చిత్రం ఆవిష్కరించింది. ఇక అక్కడి నుంచి ఆయన జైత్రయాత్ర తిరిగి కొనసాగింది. ఎన్.టి.ఆర్. నటజీవితాన్ని మలి మలుపు తిప్పిన చిత్రాల వివరాలు...



'గజదొంగ'లో ఎన్.టి.ఆర్.




మహానటులు రామారావు నట జీవితంలో కొత్తకోణం 1975 నుంచి మొదలయిందని చెప్పాలి. కొత్త హీరోలు ముందుకు వచ్చేస్తున్నారని, ఎన్.టి.ఆర్. వంటి సీనియర్ హీరోలు వెనకబడి పోయారని ప్రచారం మొదలైన తరుణంలో విడుదలైన 'అడవిరాముడు' చిత్రం ఆయన నట జీవితానికి కొత్త ఊపిరిపోసింది. రామారావుని యంగ్ జనరేషన్‌కి దగ్గర చేసింది ఈ సినిమానే. తన అభిమానుల్లో కొత్తతరం వచ్చి చేరడంతో ఎన్.టి.ఆర్. తిరిగి పూర్వ వైభవం పొంది నంబర్‌వన్ హీరోగా కొనసాగారు.

అయితే 'అడవిరాముడు' తర్వాత ఆయన పోషించిన కొన్ని పాత్రలు విమర్శలకు గురయ్యాయి కూడా. 'మనవరాలి వయసున్న హీరోయిన్లతో ఆ డాన్సులు ఏమిటి? ఆ వాటేసుకోవడాలు ఏమిటి?' అని విమర్శించినవారూ


ఉన్నారు. అయితే అభిమానులు మాత్రం అవే కావాలని కోరుకోవడంతో ఆ సినిమాలు సూపర్‌హిట్ అయ్యాయి.

ఎన్.టి.ఆర్. ఇలాంటి పాత్రలు ఎందుకు చేస్తున్నారు? అని వినిపించిన విమర్శలకు సమాధానంగా అన్నట్లు ఎన్.టి.ఆర్. ఓ సందర్భంలో ఇలా వివరణ ఇచ్చారు. "నా అభిమానులంతా నేను ఇలాగే నటించాలని కోరుకుంటున్నారు. నేను కమర్షియల్ ఆర్టిస్ట్‌ని. పొరపాటున ఈ గాలికి అడ్డం తిరిగానంటే కొట్టుకుపోతాను. నిజానికి నాలోని కళాకారుడు నేను వేస్తున్న వేషాలకి ప్రతిక్షణం తిరగబడుతున్నాడు. ఇప్పటికి 280 పాత్రలు పోషించాను. ఇతరులను సంతృప్తి పరచగలిగాను కానీ నన్ను నేను తృప్తి పరుచుకోలేకపోతున్నాను. నేను ప్రేక్షకులను తప్పు పట్టడం లేదు. వారే మా పేమాస్టర్స్. వారు ఎలా అభిమానిస్తారో అలా నటించాల్సి వస్తోంది. దానికి భిన్నంగా వెళితే ఎదురు దెబ్బ తగులుతుంది. అయినా నాలోని కళాకారుణ్ణి తృప్తి పరుచుకోవడానికి నష్టపోయినా సరే కొన్ని పౌరాణికాలు తీశాను" అన్నారు.


1970లలో ఆయన నటజీవితంపై ప్రభావం చూపించి నిత్యనూతనంగా నిలిచిన ఐదు చిత్రాల వివరాలు...

## అడవిరాముడు

కమర్షియల్ సినిమాకు కొత్త అర్థం చెప్పిన చిత్రం 'అడవిరాముడు'. చరిత్రలో కలకాలం నిలిచిపోయే రీతిలో భారీ సూపర్‌హిట్‌గా విజయం సాధించి కమర్షియల్ సినిమాకు ఇప్పటికీ అనుసరిస్తున్న కొత్త గ్రామర్ నేర్పింది ఈ చిత్రం. అంతకుముందు తెలుగు సినిమా అత్యధిక కలెక్షన్లు కోటి రూపాయలు రికార్డు కాగా ఈ చిత్రం ఏకంగా ఏడాదిలోనే రూ. నాలుగు కోట్లు సంపాదించి, అన్ని భాషా చిత్ర రంగాల్లో



'అడవిరాముడు' చిత్రంలో
ఎన్.టి.ఆర్. జయప్రద




చర్చనీయాంశమైంది. అలాగే హీరోగా ఎన్.టి.ఆర్.ను శిఖరాగ్ర స్థానానికి చేర్చిన సినిమా ఇది. అభిమానులు ఆనందం పట్టలేక తెరమీదకు డబ్బులు విసరడం అనే సంస్కృతి ఈ సినిమా నుండే ప్రారంభమైంది. "ఆరేసుకోబోయి పారేసుకున్నాను.." పాటలో ఎన్.టి.ఆర్. స్టెప్స్ చూసి ఆనందం పట్టలేక అభిమానులు తెరమీదకు డబ్బులు విసిరేవారు.

ఎప్పుడూ వారంరోజులు మించి చెన్నై నగరాన్ని విడిచివెళ్లని ఎన్.టి.ఆర్. ఈ సినిమా కోసం ఏకంగా 35రోజులపాటు ముదుమలై అడవులలో ఉండటం ఒక విశేషం. ఈ చిత్రం కోసం ఆయన తీసుకున్న పారితోషికం రెండున్నర లక్షలు. ఎన్.టి.ఆర్., కె.రాఘవేంద్రరావు కాంబినేషన్‌లో రూపొందిన తొలి చిత్రమిదే. వీరితో తొలిసారిగా కలిసిన మరోవ్యక్తి వేటూరి సుందర రామమూర్తి. ఈ సినిమాలో ఆయన రాసిన పాటలన్నీ సూపర్‌హిట్సే. పాటను కోటి రూపాయల మూటగా మార్చిన "ఆరేసుకోబోయి పారేసుకున్నాను.." పాట గురించి ఇక చెప్పనక్కర్లేదు.

'సిరిసిరిమువ్వ' చిత్రంతో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న జయప్రద ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించి, మంచి మార్కులు సంపాదించుకుంది. అలాగే 'అడవిరాముడు' చిత్రంలో నటించే సమయానికి జయసుధ 'జ్యోతి' సినిమా విడుదల కాలేదు. 'జ్యోతి' విడుదలై ఆమెకి హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చింది. ఆ తర్వాత 'అడవిరాముడు' విడుదలైంది. ఆ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించినందుకు ఆమెని విమర్శిస్తూ ఎన్నో ఉత్తరాలు వచ్చాయి.

ఎన్.టి.ఆర్. నటించిన తొలి కలర్ సినిమా స్కోప్ చిత్రం 'అడవిరాముడు'. చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్స్ జపాన్ నుండి దిగుమతి చేసుకున్న సినిమాస్కోప్ లెన్సులతో చిత్రీకరించారు. 'అడవిరాముడు' శతదినోత్సవం విజయవాడలోని అప్సర థియేటర్‌లో జరిగింది. అక్కినేని నాగేశ్వరరావు, దిలీప్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ చిత్రం ద్విశత దినోత్సవం చెన్నైలోని తాజ్ కోరమండల్ హోటల్‌లో జరిగింది. రాజ్‌కపూర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

## వేటగాడు

'బడిపంతులు' (1972)లో ఎన్.టి.ఆర్. మనవరాలిగా నటించిన శ్రీదేవి సరిగ్గా ఏడేళ్ల తర్వాత ఆయన సరసన కథానాయికగా నటించడం 'వేటగాడు' చిత్రం ప్రత్యేకత. 'నిన్నగాక మొన్న మా ఒడిలో కూర్చున్న ఆ చిన్నపిల్ల హీరోయినా?' అని మొదట ఎన్.టి.ఆర్. ఆమెతో నటించడానికి సందేహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో వాణిశ్రీ, జయసుధ, జయప్రద ఆయన సరసన నటిస్తుండేవారు. అయితే శ్రీదేవి కూడా ఆ సమయంలో కొన్ని చిత్రాలలో హీరోయిన్‌గా నటిస్తుండటంతో కొత్త కాంబినేషన్ బాగుంటుందని చిత్ర దర్శకుడు రాఘవేంద్రరావు నచ్చజెప్పడంతో నిర్మాత అర్జునరాజు, ఎన్.టి.ఆర్. అంగీకరించారు. ఈ జంట విషయమై బయట ఎంత దుమారం రేగినా రాఘవేంద్రరావు వెనుకంజ వేయలేదు. సినిమా విడుదలయిన తర్వాత ఎన్.టి.ఆర్, శ్రీదేవి జంటకు ప్రేక్షకులు నీరాజనం పట్టారు.



'వేటగాడు' సినిమాతోనే రోజా మూవీస్ సంస్థ ప్రాణం పోసుకుంది. అర్జునరాజు, శివరామరాజు, కుమార్జీ కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఫార్ములా కథే అయినా దర్శకుడు రాఘవేంద్రరావు జోడించిన కమర్షియల్ తళుకులు చిత్రాన్ని విజయాల బాటలో నడిపించాయి.

సంగీత దర్శకుడు చక్రవర్తి 'వేటగాడు' సినిమాతో కమర్షియల్‌గా శిఖరాగ్రస్థాయికి చేరుకున్నారు. ఆయన స్వరపరిచిన పాటలన్నీ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలోని 'ఆకుచాటు పిందె తడిసే' పాట వాన పాటల్లో అగ్రస్థానం పొందిందనే చెప్పాలి. పాటలను రాఘవేంద్రరావు బాగా తీస్తారనే పేరు ఈ సినిమాతో మరింత బలపడింది.

'వేటగాడు' చిత్రంలో హైలైట్ అయిన పాత్రలు మరో రెండు ఉన్నాయి. అవి సత్యనారాయణ, రావుగోపాలరావు పోషించినవి. తండ్రీకొడుకులుగా వీరిద్దరూ నటించారు. హ్యాట్ దగ్గర నుంచి బూట్ వరకూ ఒకే కలర్‌లో కనిపించే సత్యనారాయణ, యతి ప్రాసలతో గుక్క తిప్పుకోకుండా డైలాగులు చెప్పే రావుగోపాలరావు తమ అభినయంతో అదరగొట్టేశారని చెప్పాలి. ఈ పాత్రలకు జంధ్యాల రాసిన మాటలు మరింత ఊపిరి పోశాయి.


'వేటగాడు' చిత్రంతో ఎన్.టి.ఆర్. ఇమేజ్ రెట్టింపు కావడమే కాకుండా పారితోషికం కూడా పెరిగింది. ఆ సినిమా తర్వాత ఆయన పారితోషికం పది లక్షలకు చేరుకోవడంతో హయ్యెస్ట్ పెయిడ్ హీరోగా రికార్డ్ నెలకొల్పారు.

చెన్నైలోని తాజ్ కోరమాండల్ హోటల్‌లో జరిగిన ఈ చిత్ర శతదినోత్సవానికి ఎం.జి.ఆర్, ఎ.ఎన్.ఆర్. ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇదే సినిమాను హిందీలో జితేంద్ర, పూనమ్‌ధిల్లాన్ జంటగా 'నిషాన్' పేరుతో రీమేక్ చేశారు. రాఘవేంద్రరావు తొలి హిందీ చిత్రమిదే.



'వేటగాడు' చిత్రంలో శ్రీదేవి, ఎన్.టి.ఆర్.

## సర్దార్ పాపారాయుడు (1980)



భారత స్వాతంత్ర్య పోరాటంలో తన సర్వస్వాన్ని త్యాగం చేసిన ఒక సమరయోధుడు, స్వాతంత్ర్యం వచ్చిన 30 సంవత్సరాల తరువాత సమాజంలోకి వచ్చి ఆ స్వాతంత్ర్య ఫలాలు దుర్వినియోగం అవుతుంటే ఎలా స్పందించాడనే ఉత్తేజ పూరితమైన ఊహకు దృశ్యరూపమే 'సర్దార్ పాపారాయుడు'. శ్రీ అన్నపూర్ణ ఇంటర్నేషనల్ పతాకంపై దాసరి నారాయణరావు దర్శకత్వంలో క్రాంతికుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

1980 జులై 1న ప్రారంభమైన ఈ చిత్రంలో స్వాతంత్ర్య సమరంలో సర్వం త్యాగం చేసిన వృద్ధమూర్తిగా, బాధ్యతాయుతమైన పోలీస్ ఆఫీసర్‌గా ఎన్.టి.ఆర్. నటించారు. తండ్రీకొడుకులుగా ఇద్దరు నటులు నటించారా అన్నంత వ్యత్యాసాన్ని ప్రదర్శిస్తూ ఎన్.టి.ఆర్. అభినయించారు. ముఖ్యంగా పాపారాయుడు పాత్రలో వీర, రౌద్ర, అద్భుత రసాలను అనితరసాధ్యంగా ప్రదర్శించారు. సంభాషణోచ్చారణలో కొత్త ఒరవడితో ఉగ్రరూతలూగించడంతో ఈ చిత్రం డైలాగ్స్ ఆడియో కూడా విరివిగా ప్రాచుర్యం పొందింది. మోహన్‌బాబు తెల్లదొర పాత్రలో రక్తికట్టించారు. బాబా పాత్రకు గుమ్మడి ప్రాణం పోశారు. మిగతా నటీనటులంతా తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. దర్శకునిగా, రచయితగా దాసరి నారాయణరావు ఈ చిత్రానికి ప్రాణం పోశారు. చక్రవర్తి సంగీతం, యస్.వెంకటరత్నం ఫొటోగ్రఫీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా శ్రీశ్రీ రచించగా, బెనర్జీ ఆలపించిన బుర్రకథ ఈ చిత్రానికి హైలైట్. ఇదే బుర్రకథలో ఎన్.టి.ఆర్. అల్లూరి సీతారామరాజు పాత్ర ధరించి తర్వాత కాలంలో ఆ గెటప్‌కే మోడల్‌గా నిలిచారు.



'సర్దార్ పాపారాయుడు' శతదినోత్సవంలో శారద, శ్రీదేవి, మోహన్‌బాబు, అల్లు రామలింగయ్య, రావుగోపాలరావు, ఎన్.టి.ఆర్., దాసరి నారాయణరావు, హేమమాలిని తదితరులు


మొదట ఈ కథ చెప్పడానికి వెళ్లేముందు దర్శక నిర్మాతలను వారి శ్రేయోభిలాషులు 'ఈ సమయంలో ముసలి పాత్ర చేయడానికి ఎన్.టి.ఆర్. అంగీకరించరు, చేస్తే హీరోగా ఆయన ఇమేజ్ దెబ్బతింటుంది' అని బెదిరించారు. కానీ కథ విన్న ఎన్.టి.ఆర్. తాను ముసలి పాత్రనే చేస్తానని, కుర్ర పాత్రకు ఎవరినైనా చూడండని చెప్పి ఆశ్చర్యపరిచారు. కానీ దర్శక నిర్మాతలు మీకున్న స్టార్‌డమ్ దృష్ట్యా పాటలు పెట్టడంకోసం కొడుకు పాత్రను కూడా మీరే చేయాలని ఒప్పించారు. ఆ తరువాత ఈ ఫార్ములా ఒక ట్రెండ్ సెట్టర్‌గా మారి ఆ తరంలోని హీరోలందరితోపాటు ఆ తర్వాతితరంలోని హీరోలందరూ కూడా వయసు తేడా ఉన్న డ్యూయల్ రోల్స్ చేశారు. తమ కెరీర్ ల్యాండ్ మార్క్ చిత్రాలుగా చెప్పుకునేంతగా మూడు దశాబ్దాలుగా ఇది సక్సెస్‌ఫుల్ ఫార్ములాగా చలామణి అవుతూనే ఉంది. అలాగే వయసు మళ్ళిన వృద్ధ పాత్రలకు హీరో హోదా కల్పించిన చిత్రం కూడా ఇదే!

ఈ చిత్రంలో అల్లూరి సీతారామరాజు గెటప్ ధరించినప్పుడు "ఆ రోజు ప్రజలకోసం ఆయన పోరాటం చేయబట్టికదా ఈరోజు మనం ఈ గెటప్ ధరిస్తున్నాం.. రేపు మన గురించి కూడా గుర్తుంచుకోవాలంటే, ఇంత కాలం ఆదరించిన ప్రజలకోసం ఏదైనా చేసి తీరాలి" అనే ఆలోచన ఎన్.టి.ఆర్. మదిలో మెదిలి అదే ఆయన రాజకీయ ప్రవేశానికి బీజమై చరిత్ర సృష్టించడం ఈ చిత్రానికి సంబంధించి మరో విశేషం.

1980 అక్టోబర్ 30న విడుదలైన ఈ సినిమా అద్భుత విజయం సాధించి 300 రోజులకు పైగా ప్రదర్శితమైంది. ఈ ప్రభంజనంలో నాటి యువ హీరోలు సైతం తండ్రీ కొడుకులుగా నటించక తప్పనంతగా ఈ చిత్రం పరిశ్రమను ప్రభావితం చేసింది.



## కొండవీటి సింహం



'సర్దార్ పాపారాయుడు' (1980) ఘన విజయం సాధించడంతో హీరోల తండ్రీ కొడుకుల ద్విపాత్రాభినయ ట్రెండ్ ప్రారంభమైంది. ఆ కోవలోనే రూపుదిద్దుకున్న చిత్రం 'కొండవీటి సింహం'. ఈ చిత్రానికి ఎన్.టి.ఆర్. ద్విపాత్రాభినయం, ముఖ్యంగా ఎస్.పి. రంజిత్‌కుమార్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్ర కథను దర్శకుడు రాఘవేంద్రరావు నడిపిన తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. తమిళంలో శివాజీ గణేశన్‌తో రూపొందిన 'తంగ పతక' (బంగారు పతకం) చిత్రం ఛాయలలో రూపొందిన ఈ చిత్రం 'వేటగాడు' కాంబినేషన్ (ఎన్.టి.ఆర్., శ్రీదేవి, రాఘవేంద్రరావు, రోజా మూవీస్)లోనే రూపొందడంతో నిర్మాణ దశ నుంచే అంచనాలు ఆకాశాన్నంటాయి.

ఎన్.టి.ఆర్. తండ్రీ కొడుకులుగా నటించిన ఈ చిత్రంలో ఆయన కొడుకుగా మోహన్‌బాబు, ఎత్తుపళ్ల విలన్‌గా సత్యనారాయణ, హీరోయిన్ తండ్రిగా పాజిటివ్ పాత్రలో రావుగోపాలరావు నటించారు. జయంతి తల్లి పాత్రను పోషించారు. చక్రవర్తి బాణీలకు వేటూరి కలం పలికించిన ఏడు పాటలూ అలరించాయి.

విజయదశమి సందర్భంగా 1981 అక్టోబర్ 7న విడుదలైన ఈ చిత్రం సంక్రాంతికి వందరోజులు పూర్తిచేసుకుంది. ఈ చిత్ర శతదినోత్సవం, 'వయ్యారి భామలు- వగలమారి భర్తలు' చిత్ర ప్రారంభోత్సవం ఒకేరోజున చెన్నైలో జరిగాయి.

ఈ చిత్రం హిందీలో జితేంద్ర హీరోగా 'ఫర్జ్ ఔర్ కానూన్' పేరుతో రూపుదిద్దుకుని అక్కడ కూడా ఘన విజయం సాధించింది.

## బొబ్బిలిపులి

తనకు స్ఫూర్తినిచ్చిన పాత్రల్లో 'బొబ్బిలిపులి' సినిమాలోని మేజర్ చక్రధర్ ఒకటని ఎన్.టి.ఆర్. చెప్పే వారు. 'సర్దార్ పాపారాయుడు' సినిమాలో స్వాతంత్ర్య సమర యోధునిగా, 'కొండవీటి సింహం'లో సిన్సియర్ పోలీస్ ఆఫీసర్గా, 'జస్టిస్ చౌదరి'లో న్యాయమూర్తిగా నటించి మెప్పించిన నందమూరి తారక రామారావు సమాజ ప్రక్షాళన లోనే దేశభక్తిని మిళితం చేసి మేజర్ చక్రధర్గా, వ్యవస్థలోని అక్రమాలపై తిరగబడ్డ 'బొబ్బిలిపులి'గా అనితర సాధ్య మైన నటనని ప్రదర్శించారు. తన నటనాపర్వం చివరి అధ్యాయంలో నటరత్న సమాజానికి నాలుగు స్తంభాలవంటి నాలుగు బాధ్యతాయుత పాత్రల్లో రాణించడం ఆయన రాజకీయ జీవితానికి కూడా ఎంతగానో ఊపు నిచ్చింది.

1981 ఆగస్ట్లో విజయ మాధవీ కంబైన్స్ పతాకంపై ఎన్.టి.ఆర్., దాసరి కాంబినేషన్లో వడ్డే రమేష్ ప్రారంభించిన 'బొబ్బిలిపులి' చిత్రం 1982 ఏప్రిల్ 7 నాటికి విడుదలకు సిద్ధమైంది. అయితే మార్చి 29న ఎన్.టి.ఆర్. తెలుగుదేశం పార్టీని నెల కొల్పారు. దాంతో సెన్సారుకు వెళ్లిన 'బొబ్బిలిపులి' వారి



అభ్యంతరాలకు గురైంది. చట్టంలోని లొసుగులను ఎత్తి చూపే క్రమంలో న్యాయస్థానాల్లో జరుగుతున్న దైనందిన వ్యవహారాలను ప్రశ్నించడంతో సెన్సారువారు అభ్యంతరం చెప్పారు. ఈ చిత్రం విడుదల కోసం ఎన్.టి.ఆర్. అభిమానులు దేశవ్యాప్తంగా ధర్నాలు, నిరాహారదీక్షలు చేపట్టారు. దాంతో పత్రికల్లో పతాక స్థాయికి చేరుకుని దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

చెన్నై, ముంబాయి సెన్సారు సరిహద్దులు దాటి ఢిల్లీకి వెళ్లింది ఈ చిత్రం. నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, ప్రధాని ఇందిరాగాంధీ, కేంద్ర సమాచార మంత్రి వసంతసాథే తదితరులు ఈ చిత్రాన్ని చూసి అభ్యంతరాలు ఏమీ లేవని చెప్పి పచ్చజెండా ఊపడంతో ఎట్టకేలకు ఈచిత్రం 1982 జులై 9న విడుదలైంది.


నటరత్న నటనావైభవానికి వన్నెలద్దుతూ చిత్ర దర్శకుడు దాసరి నారాయణరావు కథ, కథనాన్ని మలిచిన తీరు, సందర్భోచితంగా పిడుగుల్లాంటి సంభాషణలను సంధించిన వైనం నేటికీ ప్రతి ప్రేక్షకుణ్ణి ఆకట్టుకుంటూనే ఉన్నాయి. ఇక పతాక సన్నివేశంలో పదమూడు నిమిషాలపాటు సాగే కోర్టు సన్నివేశం కూడా అందరినీ ఎంతో ఆకట్టుకుంది. ఈ సినిమాలోని సన్నివేశాలు ఎల్.పి.రికార్డులు, క్యాసెట్లరూపంలో మార్కెట్‌లో వెలువడి భారీసంఖ్యలో అమ్ముడయ్యాయి.

'బొబ్బిలిపులి' చిత్రంలో ఎన్.టి.ఆర్.కి ప్రియురాలిగా శ్రీదేవి, భార్యగా జయచిత్ర, సిన్సియర్ పోలీస్ ఆఫీసర్‌గా జగ్గయ్య, విలన్లుగా సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య నటించారు.

దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా 70 ప్రింట్లతో 100కు పైగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. ■




'బొబ్బిలిపులి' చిత్రంలో అల్లు రామలింగయ్య, ఎన్.టి.ఆర్.






## ఎన్.టి.ఆర్, జగ్గయ్యతో 'కృష్ణార్జున'

# ఫలించని ప్రయత్నం



ఎన్. టి.రామారావు, అక్కినేని నాగేశ్వర రావు కాంబినేషన్‌లో రూపు దిద్దుకున్న 'శ్రీ కృష్ణార్జున యుద్ధం' చిత్రం 1963లో విడుదలైంది. అయితే దానికంటే రెండేళ్ల ముందే 'కృష్ణార్జున' పేరుతో ఒక సినిమా ప్రారంభమై కొంతకాలం షూటింగ్ జరిగిన తర్వాత ఆగిపోయిన విషయం చాలా కొద్దిమందికే తెలుసు. ఆ ప్రయత్నం చేసింది దర్శక నిర్మాత కె.బి.తిలక్. 1960 ప్రారంభంలో ఎన్.టి.ఆర్. కృష్ణునిగా, జగ్గయ్య అర్జునునిగా, దేవిక సుభద్రగా 'కృష్ణార్జున' చిత్రాన్ని ప్రారంభించారు తిలక్. అయితే ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్. శ్రీకృష్ణుని గెటప్‌లో షూటింగ్‌లో పాల్గొనలేదు. ఆరుద్ర రచయిత, పెండ్యాల సంగీత దర్శకుడు. రెహమాన్ ఛాయాగ్రాహకుడు. రెండు పాటలను రికార్డ్ చేశారు కూడా. 'బారెడు పిడికెడు బారెడు పిల్ల... బలే మంచి పిల్ల' అనే గీతాన్ని, "నీవూ నేనూ జాబిలి ముగ్గురమూ వున్నాముగా" అనే యుగళ గీతాన్ని రికార్డ్ చేశారు. మొదటి పాట సుభద్రను వర్ణిస్తూ పాడే పాట. దీనిని హాస్యనటుడు రమణారెడ్డిపై


కృష్ణార్జున యుద్ధం చిత్రంలో ఎన్.టి.ఆర్. ఏ.ఎన్.ఆర్.

చిత్రీకరించారు. (ఈ సినిమా ఆగిపోయిన తర్వాత ఈ పాటలోని కొన్ని పదాలను 'అమ్మ కుట్టి అమ్మకుట్టి' పాటలో ('పెళ్లిపుస్తకం', బాపు-రమణ) వాడారు ఆరుద్ర.

ఆలాగే యుగళ గీతాన్ని జగ్గయ్య, దేవికపై చిత్రీకరించారు. దీనికోసం భారీ సెట్‌ను వాహినీ స్టూడియోలో వేశారు. సరిగ్గా అదే తరుణంలో అంటే 1962 జూన్ 7న 'గుండమ్మ కథ' చిత్రం విడుదలైంది. ఆ సినిమా చూసిన తర్వాత అర్జునునిగా అక్కినేనిని ఎంపిక చేస్తే బాగుంటుందనే అభిప్రాయం తిలక్‌కి కలిగింది. అర్జునుడు పాత్రధారి జగ్గయ్యతో ఒకపాట, కొన్ని సన్నివేశాలు చిత్రీకరించినప్పటికీ ఆయన మళ్లీ వాటిని అక్కినేనితో చిత్రీకరించాలనే నిర్ణయానికి వచ్చారు. ముందు జగ్గయ్యకు ఈ విషయం చెప్పి, ఆయన్ని బలరాముని పాత్రకు ఒప్పించారు. తర్వాత అక్కినేని దగ్గరకు వెళ్లి తన మనసులోని మాట చెప్పారు తిలక్. అయితే ఎన్.టి.ఆర్. పక్కన మైథాలజీ చేయడం కష్టమని చెప్పి, తనని వదిలెయ్యమన్నారు అక్కినేని. ఆయనని ఒప్పించడానికి తిలక్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో 'కృష్ణార్జున' చిత్రానికి తొలి బ్రేక్ అక్కడ పడింది. ఆ తర్వాత ఇతర ఇబ్బందులు ఎదురుకావడంతో మొత్తానికే ఈ చిత్ర నిర్మాణాన్ని ఆపేశారు తిలక్. ఆ తర్వాత ఎన్.టి.ఆర్., ఏ.ఎన్.ఆర్. కాంబినేషన్‌లో 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రాన్ని రూపొందించారు కె.వి.రెడ్డి. ఎన్.టి.ఆర్. నటించే చిత్రంలో తను పౌరాణిక పాత్ర పోషించడానికి అక్కినేని మొదట సందేహించినా, తమ సొంతచిత్రం 'దొంగరాముడు'కు కె.వి. దర్శకత్వం వహించారనే గౌరవభావంతో అర్జునునిగా నటించడానికి అంగీకరించారు.

ఈ విషయాలను కె.బి.తిలక్ వివరిస్తూ "నేను 'కృష్ణార్జున' చిత్రాన్ని ఆపేసి, 'ఈడుజోడు' నిర్మాణం మొదలు పెట్టిన తర్వాతే కె.వి.రెడ్డిగారు 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రాన్ని ప్రారంభించారు. అంత పద్ధతి కలిగిన వ్యక్తి ఆయన. మీకు మరో విషయం చెప్పాలి. 'కృష్ణార్జున' చిత్రంలోని కృష్ణ పాత్ర ప్రత్యేకంగా కనిపించాలని ఆభరణాలు, కిరీటం, ఇతర దుస్తులను ఎంతో శ్రద్ధ తీసుకుని తయారుచేయించారు. మా సినిమా ఆగిపోవడంతో సారథివారు ఎన్.టి.ఆర్.తో నిర్మించిన 'ఆత్మబంధువు' చిత్రంలో ఒక అంతర్నాటకం కోసం వాటిని అడిగి తీసుకుని వాడారు. ఆ సినిమా అయిన తర్వాత ఆ కిరీటాన్ని, కాస్ట్యూమ్స్‌ని తన దగ్గరే ఉంచుకున్నారు ఎన్.టి.ఆర్. ఇకపోతే జగ్గయ్య, దేవికపై చిత్రీకరించిన పాట నాకు బాగా నచ్చింది. అందుకే ఆ పాటని నా దర్శకత్వంలో రూపొందిన 'చిట్టితమ్ముడు (1962)లో జగ్గయ్య ఊహాగీతంగా ఉపయోగించాను" అన్నారు.

# కొత్త తరహా జానపద చిత్రం

'ఈ సినిమా కోసం మీరు చాలా ఖర్చుపెట్టారు. అనుకున్న దానికంటే బడ్జెట్ ఎక్కువయింది. అందుకే నా రెమ్యునరేషన్ తగ్గించుకుంటున్నాను' అనే హీరోని ఎక్కడైనా చూస్తామా? ఎన్.టి.ఆర్. విషయంలోనే అలా జరిగింది. భారీ వ్యయంతో రూపుదిద్దుకున్న కొత్త తరహా జానపద చిత్రం 'సింహబలుడు' నిర్మాతలు తనకు పారితోషికం ఇవ్వబోతున్నప్పుడు ఎన్.టి.ఆర్. అన్న మాటలివి. అనడమే కాదు కొంత మొత్తాన్ని వెనక్కి తిరిగి ఇచ్చేశారాయన. 'బెన్‌హర్' చిత్రం తరహాలో రథాలపై హీరో, విలన్ల పోరాటాలతో, భారీ సెట్స్‌తో ప్రేక్షకులకు కన్నుల పండువ చేసిన 'సింహబలుడు' చిత్ర విశేషాలు....


ఎన్.టి.ఆర్

## ఎన్.టి.ఆర్. చివరి జానపదం

# సింహబలుడు



'పాతాళభైరవి' చిత్రంతో జానపద కథానాయకునిగా తెలుగువారికి ఎంతో దగ్గరయ్యారు ఎన్.టి.ఆర్. జానపద చిత్రం పేరు చెబితేనే జనం పారిపోయే సమయమది. ఆ తరహా చిత్రాలు చూసి చూసి ప్రేక్షకులకు మొహం మొత్తిన తరుణంలో తయారైన 'పాతాళభైరవి' చిత్రం విడుదలకు సిద్ధమైనప్పుడు ఈ సినిమా మీద కూడా అందరికీ అపనమ్మకమే. పరాజయం పాలైన జానపద చిత్రాల జాబితాలోకి ఇది కూడా చేరుకుంటుందన్న చాలామంది జోస్యాన్ని తలకిందులు చేస్తూ 'పాతాళభైరవి' చిత్రం ఘనవిజయం సాధించింది. ఆ తర్వాత ఎన్నో జానపద చిత్రాలలో నటించి వాటికి ఒక ఒరవడి ఏర్పరచారు ఎన్.టి.ఆర్.

ఇక 'సింహబలుడు' విషయానికి వస్తే ఎన్.టి.ఆర్. నటించిన చివరి జానపద చిత్రమిది. తెలుగు సినిమా చరిత్రలోనే తొలిసారిగా భారీ వ్యయంతో, సరికొత్త నేపథ్యంలో తయారైన ఈ సినిమా మరికొన్ని జానపద చిత్రాల నిర్మాణానికి స్ఫూర్తినిచ్చింది. 55 సంవత్సరాల వయసులో కూడా రామారావు ఎంతో చలాకీగా నటించి, ఈ చిత్ర విజయానికి దోహదపడ్డారు. ఈ చిత్ర నిర్మాతలు డాక్టర్ డి.వి.ఎన్. రాజు, డి.రంగరాజు అంతకుముందు 'నవతా' కృష్ణంరాజుతో కలిసి 'జమీందారు గారి అమ్మాయి' చిత్రాన్ని నిర్మించారు. సొంతంగా తిరుపతి ప్రొడక్షన్స్


సంస్థను నెలకొల్పి రామారావుతో భారీ ఎత్తున ఒక సరికొత్త జానపద చిత్రాన్ని నిర్మించాలని సంకల్పించారు ఈ సోదరులు.

'సింహబలుడు' చిత్ర నిర్మాణ విశేషాలను నిర్మాతల్లో ఒకరైన డా॥డి.వి.ఎస్.రాజు వివరించారు. ఆ విశేషాలు ఆయన మాటలలోనే..


ఎన్.టి.ఆర్.పై క్లాప్‌నిస్తున్న తారకమ్మ

**రోమన్ తరహా జానపద చిత్రం**

నాకు చిన్నప్పటి నుంచి రాజుల కథలంటే చాలా ఇష్టం. విఠలాచార్య గారి సినిమాలు, జానపద కథలతో రూపొందిన ఆంగ్ల చిత్రాలు ఎక్కువగా చూసేవాడిని. మా తమ్ముడు రంగరాజుకి కూడా సినిమాలంటే ఆసక్తి. హైదరాబాద్‌లో ఒక థియేటర్‌ని లీజుకి తీసుకుని సినిమాలు ప్రదర్శించేవాడు. నేను వృత్తిరీత్యా చెన్నైకి రాగానే తను నాతోపాటు వచ్చేశారు. ఇద్దరం కలిసి రామారావుగారితో సినిమా తీయాలని నిర్ణయించుకున్నాం. ఆయన ఎన్నో జానపద చిత్రాలలో నటించినప్పటికీ వాటికి భిన్నంగా రోమన్ తరహా నేపథ్యంలో ఒక భారీ జానపద సినిమా తీయాలనుకున్నాం. రామారావుని కలిసి ఆ విషయం చెప్పాం. ఫోక్‌లోర్ అనగానే ఆయన కూడా ఉత్సాహం చూపించారు. కానీ విఠలాచార్య మార్క్ సినిమా కాదని చెప్పగానే 'అది సక్సెస్ అయిన ఫార్ములా కదా' అని అన్నారు. కొత్త తరహాలో మనం చేసే సినిమా కూడా హిట్ అవుతుందని మేం వివరించేసరికి రామారావుగారు సరేనన్నారు.


'సింహబలుడు' సెట్‌ముందు చిత్ర యూనిట్ సభ్యులు

ఆ తర్వాత రచయిత విషయం వచ్చేసరికి 'జమీందారుగారి అమ్మాయి' చిత్రానికి నరసరాజు గారు రచయిత. అందుకే ఆయన పేరు రామారావుగారికి సూచించాం. 'నరసరాజుగారు మాకు చాలా సినిమాలకు రాశారు. ఆయన అయినా పరవాలేదు, మహారథి గారు 'బందిపోటు', 'కంచుకోట' చిత్రాలకు రచన చేశారు. వారైనా పరవాలేదు, మీ ఇష్టం' అన్నారు. నరసరాజుగారితో మేం ప్రొసీడ్ అవుతామని చెప్పగానే రామారావు గారు ఒప్పుకున్నారు. ఆ తర్వాత

సరసరాజుగారితో కూర్చుని కథ తయారుచేసి ఎన్.టి.ఆర్.కి వినిపించ గానే ఆయన ఆమోదముద్ర వేశారు.

### దర్శకుడెవరు?

ఈ సినిమాకి దర్శకుడెవరనే విషయం మీద చాలా చర్చ జరిగింది. ఇదో కొత్త తరహా జానపద చిత్రం కనుక యువకుడైన రాఘవేంద్రరావుని దర్శకునిగా పెడదామని మా అభిప్రాయం. కానీ రామారావుగారు మొదట ఒప్పుకోలేదు. అంతవరకూ చిన్న సినిమాలు చేసిన రాఘవేంద్ర రావుకి 'అడవిరాముడు' మాత్రమే పెద్ద హిట్ అనీ, ఇంత భారీ చిత్రాన్ని అతను సమర్థంగా తీయగలడా అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. అందుకే సి.ఎస్.రావు పేరుని సూచించారు. ఆయన వద్దనుకుంటే అప్పట్లో తమిళంలో పెద్ద దర్శకునిగా ఉన్న మాధవన్‌ని పెట్టుకోమని చెప్పారు. మేం ఒప్పుకోలేదు. నరసరాజుగారితో రామారావుగారికి చెప్పించి దర్శకునిగా రాఘవేంద్రరావుని ఒప్పించాం.

రాఘవేంద్రరావుగారు ఆ సమయంలో ఖాళీగా ఉన్నారు. చేతిలో సినిమా ఏమీలేదు. ఆయన్ని కలిసి విషయం చెప్పగానే- రామారావుగారితో జానపదమా అని ఆశ్చర్యపోయారు. కథ విన్న తర్వాత ఛాలెంజ్‌గా తీసుకుని వర్క్ ప్రారంభించారు.

### రాజస్థాన్‌లో షూటింగ్ అనుకున్నాం

ఇది జానపద చిత్రం కనుక కోటలు అవి అవసరం ఉండటంతో రాజస్థాన్‌లో షూటింగ్ చేస్తే బాగుంటుందని నేను, రాఘవేంద్రరావు రాజస్థాన్ వెళ్లి పది రోజుల పాటు అన్నీ తిరిగి లొకేషన్లు



'సింహబలుడు' లో ఎన్.టి.ఆర్., సత్యనారాయణ


ఫైనలైజ్ చేశాం. అప్పట్లో రామారావుగారు నెలకు మూడు సినిమాలు చేసేవారు. పది రోజుల చొప్పున ముగ్గురు నిర్మాతలకు కాల్షీట్లు ఇచ్చేవారు. మూడు నెలల్లో సినిమా పూర్తిచేసేవారు. మాకూ అలాగే ఇచ్చారు. అంటే మూడు సార్లు రాజస్థాన్ వెళ్లి రావాల్సి వస్తుందన్నమాట. ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే అయినా నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకూడదని ముందే అనుకోవడంవల్ల దానికి సిద్ధపడ్డాం. రామారావుగారి దగ్గరకు వెళ్లి ఈ విషయం చెప్పాం. ఎందుకైనా మంచిది. ఒకసారి కర్నాటక కూడా వెళ్లి చూసి రమ్మని సలహా ఇచ్చారాయన. సరే అని బెంగుళూరు, మైసూర్ వెళ్లాం. మైసూరులోని లలితామహల్ ప్యాలెస్ అప్పుడు మైసూర్ మహారాజావారి అధీనంలోనే ఉండేది. ఆ ప్యాలెస్ ముందు విశాలమైన మైదానం ఉంది. సినిమాలో ఎరీనాలో జరిగే సన్నివేశాలే ఎక్కువ కనుక ఆ మైదానంలో సెట్ వేయాలని నిర్ణయించాం.



మైసూర్ మహారాజా దంపతులతో ఎన్.టి.ఆర్., వాణిశ్రీ, రాఘవేంద్రరావు, డి.వి.ఎస్.రాజు, రంగరాజు తదితరులు

## ఎనిమిది లక్షలతో ఎరీనా సెట్

మహారాజావారి దగ్గర అనుమతి తీసుకుని ఎరీనా సెట్ నిర్మాణం ప్రారంభించాం. కళా దర్శకుడు భాస్కరరాజుగారి అద్భుత పనితనానికి ప్రతీక ఈ సెట్టు. 550 అడుగుల పొడవు, 300 అడుగుల వెడల్పు, 40 అడుగుల ఎత్తు కలిగిన ఈ ఎరీనా సెట్ కోసం చెన్నై నుంచి వచ్చిన 250మంది వర్కర్స్ మూడు నెలలపాటు నిర్విరామంగా కృషి చేశారు. 50అడుగుల ఎత్తున్న రాజు విగ్రహాన్ని, 40 అడుగుల గద్ద విగ్రహాలను వేలుస్వామి మోల్డ్ చేశారు. ఈ సెట్ నిర్మాణానికి ఆ రోజుల్లోనే ఎనిమిది లక్షలు ఖర్చయ్యాయి.



ఎనిమిది లక్షల వ్యయంతో తయారైన ఎరీనా సెట్

## భారీ యూనిట్

సినిమా స్కోప్‌లో, కలర్‌లో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి ముఖ్యమైన నటీనటులు కాకుండా 1500 మంది జూనియర్ ఆర్టిస్టులు, 60మంది డ్యాన్సర్లు, 70 మంది ఫైటర్లు పనిచేశారు. అలాగే 20 మంది



'సింహబలుడు' లో మోహన్‌బాబు, ఎన్.టి.ఆర్.

మేకప్‌మెన్, 10మంది సహకార దర్శకులు, 18మంది ప్రొడక్షన్ మేనేజర్లు పనిచేశారు. ప్రతిరోజూ దాదాపు రెండువేల మందికి భోజన ఏర్పాట్లు జరిగేవి.

### విలన్‌గా మోహన్‌బాబు

తండ్రీకొడుకుల మధ్య సంఘర్షణ ఈ చిత్ర కథలో ముఖ్యమైన పాయింట్. తండ్రి మహాబలుడైతే, కొడుకు సింహబలుడు. సినిమాలో తండ్రి పాత్రకు మొదట గుమ్మడిగారిని అనుకున్నాం. విలన్ పాత్రకు సత్యనారాయణను ఎంపిక చేశాం. అయితే షూటింగ్ ప్రారంభించే సమయానికి హార్ట్ ప్రాబ్లంతో గుమ్మడిగారు ఆస్పత్రిలో చేరారు. దాంతో అందరం డీలా పడ్డాం. తండ్రి పాత్రను గుమ్మడి పోషిస్తేనే బాగుంటుందనే అభిప్రాయం నాది. అనవసరంగా రిస్క్ ఎందుకు, ఇంతకుముందు 'జమీందారుగారి అమ్మాయి' చిత్రం షూటింగ్‌లో ఇబ్బంది అనుభవించావు కదా' అని శ్రేయోభిలాషులు వారించారు. ఆ సినిమాని మొదట ఎస్.వి.రంగారావుగారితో ప్రారంభించి, చాలా సన్నివేశాలు చిత్రీకరించాం. అయితే ఆయన హఠాత్తుగా మరణించడంతో గుమ్మడిగారిని పెట్టి రీషూట్ చెయ్యాల్సి వచ్చింది. ఆ అనుభవం దృష్ట్యా ఈసారి రిస్క్ చేయవద్దని పరిశ్రమలోని నా సన్నిహితులు, శ్రేయోభిలాషులు పదేపదే చెప్పడంతో వారి అభిప్రాయానికి తలొగ్గాను. అప్పుడు తండ్రి పాత్రకు సత్యనారాయణగారిని మార్చాం. మరి విలన్? ఆ సమయంలో మోహన్‌బాబు మంచి పాత్రలు పోషిస్తూ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకుంటున్నారు. డైలాగ్ డిక్షన్ కూడా బాగుండటంతో అందరితో ఆలోచించి ఆయన్ని ఎంపికచేశాం. ఎన్.టి.ఆర్.తో ఢీ అంటే ఢీ అనే పాత్రను పోషించే అవకాశం వచ్చినందుకు మోహన్‌బాబు మహదానందపడిపోయారు.

అలాగే హీరోయిన్‌గా ఎవరిని తీసుకోవాలనే విషయం మీద చాలా ఆలోచించాం. 'అడవిరాముడు',

'యమగోల' చిత్రాలలో ఎన్.టి.ఆర్. సరసన జయప్రద నటించింది కానీ మరీ పేలవంగా కనిపించింది. అందుకే అప్పటి టాప్ హీరోయిన్ వాణిశ్రీని ఎంపిక చేశాం. హయ్యెస్ట్ రెమ్యూనరేషన్ ఆమెకి ఇచ్చాం.

**హ్యాట్సాఫ్టు ఎన్.టి.ఆర్.**

ఈ చిత్ర నిర్మాణ సమయంలో ఎన్.టి.ఆర్. అందించిన సహకారాన్ని మరువలేం. 1978 ఏప్రిల్ 21న మేం మైసూర్‌లో షూటింగ్ ప్రారంభించాం. మంచి ఎండలు, పైగా ఔట్‌డోర్. దానికితోడు సహజంగా ఉండాలని మేం ప్రత్యేకంగా ఇనుపదుస్తులు తయారు చేయించాం. అవి వేసుకుంటే బస్తాబియ్యం భుజాన మోస్తున్నట్లే. అయినాసరే రామారావుగారు ఎక్కడా చిరాకు పడలేదు. ఉత్సాహంగా షూటింగ్‌లో పాల్గొనే వారు. ఒక సరికొత్త చిత్రాన్ని ఆయనతో తీయాలన్న మా తపనని గమనించి పూర్తి సహకారాన్ని అందించారు. ఆయన కెరీర్‌లోనే 'సింహబలుడు' చిత్రం అత్యంత భారీవ్యయంతో తయారవడం ఆయనకూ ఆనందం కలిగించింది.



'సింహబలుడు'లో వాణిశ్రీ

**నలుగురు దర్శకులు**


రామారావుగారు మా సినిమాకోసం 30 రోజుల కాల్షీట్లు ఇచ్చారు... నెలకు పదిరోజుల చొప్పున తొలి షెడ్యూల్ లలితామహల్ ప్యాలెస్‌లోనూ, రెండో షెడ్యూల్ బెంగుళూరు ప్యాలెస్‌లోనూ జరిగింది. ఈ రెండు షెడ్యూల్స్ వర్క్ రాఘవేంద్రరావుగారే చేశారు. మూడో షెడ్యూల్‌కి వచ్చేసరికి ఇంత లావిష్‌గా తీస్తున్న సినిమా సకాలానికి పూర్తవుతుందా లేదా అనే అనుమానం కలిగింది. రామారావుగారు ఇచ్చిన డేట్లు అయిపోతే మళ్లీ దొరకడం కష్టమని భావించి 4 యూనిట్లతో ఆ షెడ్యూల్ చేశాం. రామారావుగారు, వాణిశ్రీ పాల్గొనే సన్నివేశాలను రాఘవేంద్రరావు, ఛేజ్‌లను సహాయ దర్శకులు కోదండరామిరెడ్డి, సరిపల్లి చిట్టిబాబు, సత్యనారాయణపై చిత్రీకరించిన ఫ్యామిలీ డ్రామా సన్నివేశాలను కె.ఎస్.ప్రకాశరావుగారు, మరికొన్ని సన్నివేశాలను కె.బాపయ్య చిత్రీకరించారు. ఇదంతా రాఘవేంద్రరావుగారి ప్లానింగ్‌తో, ఆయన ఆధ్వర్యంలో జరిగింది.

**ధర్మేంద్ర, అమితాబ్‌ల ఆసక్తి**

అంతవరకు కనీవినీ ఎరుగనిరీతిలో భారీఎత్తున నిర్మించిన ఎరీనాసెట్‌ను చూడటానికి ఆ చుట్టు పక్కల ప్రాంతాలనుంచి కొన్నివేలమంది తండోపతండాలుగా వస్తుండటంతో అదొక టూరిస్ట్ స్పాట్‌గా మారింది. ఈ సెట్ గురించి దక్షిణాదిలోగల పత్రికలన్నీ ప్రముఖంగా రాశాయి. స్క్రీన్ వంటి పత్రికలు మా సెట్టు గురించి రాయడంతో ఉత్తరాది ఫీల్డ్‌లో కూడా ఆసక్తి ఏర్పడింది. ఆ రోజులలో ఊటీ వెళ్లాలంటే ముంబాయి నుంచి బెంగుళూరుకు వచ్చి, అక్కడి నుంచి కారులో వెళ్లేవారు ఉత్తరాది తారలు. అయితే ధర్మేంద్ర, అమితాబ్ వంటి ప్రముఖ హీరోలు బెంగుళూరు నుండి మైసూరు వచ్చి మా సెట్ చూసి థ్రిల్లయ్యారు. ధర్మేంద్ర నాలుగుసార్లు, అమితాబ్ రెండు సార్లు సెట్‌కి వచ్చారు. ఈ సినిమాని హిందీలో నిర్మిస్తే తాము పూర్తిగా సహకరిస్తామని ఇద్దరూ మాట ఇచ్చారు. హిందీలో తీయాలని మేం కూడా ఉత్సాహం చూపించినా, అక్కడి మార్కెట్ వ్యవహారాలు తెలియవు కనుక రిస్క్ ఎందుకని ఆ తర్వాత మానుకున్నాం.

42 లక్షలతో తయారైన 'సింహబలుడు' చిత్రం 1978 ఆగస్ట్ 11న విడుదలైంది. ■

హైదరాబాద్ నగర శివార్లలో ఉన్న దేవరయాంజాల్ గ్రామంలో 'చండశాసనుడు' చిత్రం షూటింగ్ జరుగుతోంది. చివరిరోజు షూటింగ్ అది. వెంకటయ్య పాత్రధారి రావుగోపాలరావును హరిశ్చంద్రప్రసాద్ (రామారావు) ఎడ్లబండితో తరిమే సన్నివేశమది. పెద్ద పెద్ద మీసాలు, ఖరీదైన పంచెకట్టుతో రామారావు సిద్ధంగా ఉన్నారు. ఆయన నడిపే బండికోసం బలమైన ఒంగోలు గిత్తల్ని గుంటూరు నుండి తెప్పించారు. ఎన్.టి.ఆర్. ఆ బండి ఎక్కి ఒక చేత్తో సింహం తల కలిగిన కర్రను పట్టుకుని మరొక చేత్తో చెర్నాకోలతో గిత్తల్ని అదిలించారు. హుషారుగా ఆ గిత్తలు పరిగెత్తడం ప్రారంభించాయి. ఆ బండి ముందు రావుగోపాలరావు పరిగెడుతున్నాడు. ఇలా మధ్యాహ్నం వరకూ కొన్ని షాట్స్ తీశారు.



# చండశాసనుడు

చివరి షాట్ చిత్రీకరణ మొదలైంది. కెమెరా అల్లంత దూరంలో ఉంది. ఒక వంద అడుగుల దూరం వెళ్లిందో లేదో ఎన్.టి.ఆర్. చేతిలో ఉన్న కర్ర బండి చక్రంలో ఇరుక్కుంది. ఆయన అది గమనించలేదు. దాంతో బండి చక్రం పెద్దశబ్దంతో పక్కనున్న బండ రాయి మీదకు ఎక్కడం, రామారావు ఎగిరివెళ్లి బండి ముందు పడటం, ఓ చక్రం ఆయన మీదనుంచి వెళ్లి పోవడం జరిగాయి. అంతా ఓ మెరుపులా జరిగిపోయిన ఈ సంఘటనతో నివ్వెరపోయిన యూనిట్‌సభ్యులు వెంటనే తేరుకుని ఎన్.టి.ఆర్. దగ్గరికి పరిగెత్తారు. ఇక రావుగోపాలరావు పరిస్థితి చెప్పనలవికాదు. ఆ షాక్‌తో ఆయనకు చెమటలు పట్టేసి 'అన్నగారూ' అంటూ ఏడుస్తూ ఎన్.టి.ఆర్. దగ్గరకు పరిగెత్తారు. కో-డైరెక్టర్ వి.వి.రాజు, హరికృష్ణ ఎన్.టి.ఆర్. చేతులు పట్టుకుని లేపబోయారు. ఆయన విదిలించుకుని లేచి నిలబడి 'ఏం జరిగింది' అనడిగారు. జరిగింది వివరించి 'అన్నగారూ.. తమకేదైనా అయితే ముందు నా గుండె ఆగిపోయేది' అన్నారు రావు గోపాలరావు.


'మనమంత తేలికగా చావం బ్రదర్... భగవంతుడు మనల్ని ఏ లక్ష్యం కోసం పుట్టించాడో అది నెరవేరే వరకూ మనకేం భయం లేదు. మీరేం వర్రీ అవకండి' అని, 'షూటింగ్ కానివ్వండి' అని మళ్లీ బండిఎక్కారు. అందరూ ఆయనవంక ఆశ్చర్యంగా చూశారు. ఆయన


'చండశాసనుడు' వర్కింగ్ స్టిల్

స్థానంలో మరో ఆర్టిస్ట్ ఉంటే నెలరోజుల వరకూ మంచం దిగేవారు కాదు. అంత జరిగినా ఏం జరగనట్లే ఆ తర్వాత కూడా షూటింగ్‌లో పాల్గొన్నారు ఎన్.టి.ఆర్.

సాయంత్రం నాలుగు గంటల వరకూ షాట్స్ అన్నీ తీసేసి రామకృష్ణా స్టూడియోకు షిఫ్ట్ అయ్యారు. అక్కడ "నైనా నందకుమార్.. నైనా నవనీత చోరా.. చెట్టు కొమ్మ దిగరా చిట్టిరాయుడు, కోకలిచ్చిపోరా కొక్కిరాయుడు.." అనే పాట చిత్రీకరణ కోసం ఏర్పాట్లు చేశారు.

హీరోయిన్ రాధ, ఆమె స్నేహితులు స్విమ్మింగ్ పుల్‌లో స్నానం చేస్తుంటే, రాజా (ఎన్.టి.ఆర్.) వాళ్ల చీరలతో చెట్టెక్కడం, వాళ్లు చీరలిమ్మని బతిమాలడం.. ఇదీ పాట సన్నివేశం. ఈ పాట చిత్రీకరణ కోసం స్టూడియోలో స్విమ్మింగ్ పుల్ నిర్మించారు. రాధ తయారై వచ్చేలోపు ఎన్.టి.ఆర్. గెటప్ మార్చుకుని వచ్చారు. ఇంతలో తారకమ్మ కూడా సెట్‌కు వచ్చారు. ఆవిడను చూడగానే 'చూశావా తారకం.. ఎలా ఉంది గెటప్?' అనడిగారు. ఆవిడ ఒక చిరు నవ్వు నవ్వి ఊరుకున్నారు.




రాత్రి పదిగంటల వరకూ

పాట చిత్రీకరణ జరిగింది. తర్వాత షూటింగ్‌కు ప్యాకప్ చెప్పారు ఎన్.టి.ఆర్. అంతా అయిన తర్వాత తన నడుము మీద చెయ్యివేసి నెమ్మదిగా కుర్చీలో కూర్చున్నారు. మధ్యాహ్నం రెండు గంటలనుంచి అప్పటివరకూ ఆ నొప్పిని ఆయన అలాగే ఓర్చుకున్నారు. ఆ మర్నాడు ఎక్స్‌రేతీయించారు. ఏమీ లేదని, చర్మం కాస్త ఉబ్బిందని డాక్టర్ చెప్పడంతో అంతా తేలికగా ఊపిరి పీల్చుకున్నారు.

(మిత్రుడు వి.వి.రాజు గారికి కృతజ్ఞతలు)



'చండశాసనుడు' చిత్రంలో ఎన్.టి.ఆర్., రాధ


## అన్న టైం అంటే టైమే



'చండశాసనుడు' సినిమా కథా చర్చల సమయంలో ఓరోజు రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఎన్.టి.ఆర్ ఇంటికి వెళ్లారట. ఆ సందర్భంలో సినిమాకు సంబంధించిన కథా చర్చలకు గాను రేపు ఉదయం 4 గంటలకు రమ్మని పరుచూరికి చెప్పారట ఎన్.టి.ఆర్. ఆయన వెళ్లిపోయారనే ధైర్యంతో గోపాలకృష్ణ తన పక్క నున్న వ్యక్తితో నేను పడుకునేదే రాత్రి 12 తర్వాత. ఆయనేమో 4 గంటలకు రమ్మంటున్నారు' అనగానే వెనుకనుంచి ఒక చెయ్యి ఆయన భుజంమీద పడింది. అది అన్నగారి చెయ్యి అనే విషయం అర్థమైన పరుచూరి గోపాలకృష్ణ మనసులో 'ఇక ఐపోయాంరా..' అనుకున్నారు. అయితే ఎన్.టి.ఆర్. సౌమ్యంగా 'అలాగయితే 6 గంటలకు కలుద్దాం బ్రదర్' అని లోపలకు వెళ్లిపోయారు. అప్పటికి ఊపిరి పీల్చుకున్న గోపాలకృష్ణకు 'ఒక వేళ ఉదయం 6 గంటలకు లేవ లేకపోతే పరిస్థితి ఏమిటి' అనే సందేహం వచ్చింది.

ఈ విషయంపై తర్జన భర్జనలు పడ్డ ఆయనకు చివరికి ఓ ఐడియా తట్టింది. అదేమిటంటే ఎన్.టి.ఆర్. పక్క ఇంట్లోనే నిద్రపోతే ఒకవేళ నిద్రలేవటం లేటయినా గబుక్కున గోడదూకి వెళ్లవచ్చు అనేది ఆ ఐడియా సారాంశం. ఈ ప్లాన్‌ను ఫైనల్ చేసుకున్న గోపాలకృష్ణ ఎన్టీఆర్ ఇంటి పక్కనే ఉన్న ఓ ఇంట్లో పడుకుని ఉదయ మేలేచి ఎన్.టి.ఆర్. దగ్గరకు వెళ్లారట. అప్పటికే ఎన్.టి.ఆర్. రెడీ అయి కూర్చొనివున్నారు. గోపాల కృష్ణ వెళ్లిన వెంటనే ఆయన గడియారం చూశారట. అప్పటికే అది 6గంటల ఒక నిమిషం చూపిస్తూ గోపాలకృష్ణకు జెల్ల కొట్టింది. ఎలాగోలా ధైర్యం తెచ్చుకున్న గోపాలకృష్ణ 'ఒక్క నిమిషమేనండీ' అనగానే, ఎన్.టి.ఆర్. 'చూడండి బ్రదర్, మా ఇంట్లోంచి ఒక లక్షరూపాయలు దొంగిలించుకుని వెళ్లినా క్షమిస్తాను. కానీ నా సమయంలో నుండి ఒక నిమిషం వృథా చేసినా క్షమించను' అన్నారట గంభీరంగా.





చక్రపాణి, నాగిరెడ్డి

# విజయానుబంధం

విజయా ప్రొడక్షన్స్ సంస్థతో ఎన్.టి.ఆర్.కు ఉన్న అనుబంధం అనిర్వచనీయమైంది. విజయావారి చిత్రాల విజయంతోనే రామారావు పరిశ్రమలో ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకోగలిగారు. అగ్రశ్రేణి కథానాయకునిగా ఎదగగలిగారు. 'నా జీవితాన్ని రూపొందించుకున్నదీ, చిత్ర నిర్మాణంలోని సాంకేతిక విలువలు, వాటి స్థాయి తెలుసుకున్నదీ విజయ నీడలో ఉన్న ఆ రెండు సంవత్సరాల వ్యవధిలోనే' అనే కృతజ్ఞతాస్వరంతో తరచు చెప్పేవారు రామారావు.

1949 నుండి ఆయనకు విజయాసంస్థతో అనుబంధం ఉంది. 'మనదేశం' చిత్రంతో ఎన్.టి.ఆర్. పరిచయమైనా, ఆయన హీరోగా నటించిన తొలిచిత్రం 'పల్లెటూరి పిల్ల'. అయితే





విడుదలైన చిత్రం మాత్రం విజయావారి 'షావుకారు'. 1949 నవంబర్ 5న ఈ చిత్రంతో నిర్మాణ కార్య క్రమాలు ప్రారంభించారు విజయాధినేతలు నాగిరెడ్డి, చక్రపాణి. ఈ చిత్రంలో నటిస్తూనే 'పల్లెటూరి పిల్ల', 'మాయారంభ', 'సంసారం' సినిమాల్లోనే నటించారు రామారావు. ఈ నాలుగు చిత్రాలు 1950లో విడుదలయ్యాయి. అప్పటికి ఎన్.టి.ఆర్. వయసు 27 ఏళ్లు. తెలుగు సినిమా ప్రారంభదశలో వచ్చిన సంఘ సంస్కరణ సినిమాలను వదిలేస్తే, సామాజికాంశం ఉన్న పాత్రలను ఎన్.టి.ఆరే. మొదట పోషించారు. విజయా వారి తొలి చిత్రం 'షావుకారు' విశిష్టమైన సామాజిక ఇతివృత్తం కలిగిన సినిమాగా పేరు తెచ్చుకుంది.

తమ నిర్మాణ దక్షతను, ఉన్న సాంకేతిక సౌకర్యా లను వినియోగించుకుని ఆబాలగోపాలం మెచ్చేలా చిత్ర నిర్మాణం కొనసాగించాలన్న తలంపు 'షావుకారు' చిత్ర నిర్మాణసమయంలో విజయాధినేతలకు కలిగింది. ఆ రోజుల్లో క్రమశిక్షణ కలిగిన చిత్ర నిర్మాణ సంస్థగా, నిర్దుష్టమైన ప్రణాళికలతో సినిమాలు నిర్మిస్తూ విజయ పథాన సాగుతున్న సంస్థగా 'జెమినీ'కి పేరుండేది. దానికి అధిపతి వాసన్. ఆయన పద్ధతిని అనుసరిస్తూ నెల జీతాలకు నటీనటులను, సమర్థులైన సాంకేతిక నిపుణులను ఎన్నిక చేసుకుంది విజయా సంస్థ. ఈ సంస్థ అధినేతల్లో ఒకరైన నాగిరెడ్డి స్టూడియో నిర్వహణ, ఆర్థికపరమైన విషయాలను చూసుకునేవారు. ఇక చిత్ర నిర్మాణ కార్యక్రమాలను చక్రపాణి పర్యవేక్షించేవారు. కథ ఎన్నుకోవడం దగ్గరనుండి సినిమా తొలికాపీ తయారై వచ్చేవరకూ ప్రతిదీ ఆయన కనుసన్నల్లో జరి గేది. గొప్ప కథకుడు, నిబద్ధత కలిగిన నిర్మాత అయిన చక్రపాణి సారథ్యంలో విజయా ప్రొడక్షన్స్ సంస్థ ఎంతో మంది గొప్ప దర్శకులను, నటీనటులను తీర్చిదిద్దింది.

## వరుసగా నాలుగు చిత్రాలు

'షావుకారు' తర్వాత వరుసగా నాలుగు చిత్రాలను తీయాలని నిర్ణయించుకున్న నాగిరెడ్డి, చక్రపాణి ఇందుకోసం నలుగురు దర్శకులను ఎన్నుకున్నారు. వీరిలో ముగ్గురు ప్రముఖులు కాగా మరొకరు కొత్త దర్శకుడు. వారు.. కె.వి.రెడ్డి, బి.ఎన్.రెడ్డి, ఎల్.వి.ప్రసాద్, కమలాకర కామేశ్వరరావు. అలాగే రచన విభాగానికి పింగళి నాగేంద్రరావుని, సంగీత విభాగానికి ఘంటసాలను నెల జీతాలకు ఎన్నుకుని వారితో అగ్రి మెంట్లు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఘంటసాల విజయావారు నిర్మించిన ఆరు చిత్రాలకు 'షావుకారు', 'పాతాళభైరవి' (తెలుగు, తమిళం), 'పెళ్లిచేసి చూడు' (తెలుగు, తమిళం), 'చంద్రహారం' చిత్రాలకు సంగీత



షావుకారు చిత్రంలో జానకి, ఎన్.టి.ఆర్.

దర్శకత్వం వహించారు. ఒప్పందం ప్రకారం కాంట్రాక్ట్ కాలంలో బయట చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించకుండా గాయకునిగా మాత్రమే పరిమితమయ్యారు ఘంటసాల.

ఇక హీరోగా ఎవరిని తీసుకోవాలా అని చర్చ జరిగినప్పుడు ఎన్.టి.ఆర్. పేరుని సూచించారు ఎల్.వి. ప్రసాద్. 'షావుకారు' చిత్ర నిర్మాణ సమయంలో ఎన్.టి.ఆర్. పద్ధతి, ఆయన క్రమశిక్షణను గమనించిన నాగిరెడ్డి, చక్రపాణి కూడా ఇందుకు అభ్యంతరం చెప్పలేదు. వెంటనే ఎన్.టి.ఆర్.ను పిలిపించి తమ చిత్రాలకే పరిమితమవుతూ రెండేళ్లపాటు (1950-52) నటించే విధంగా ఒప్పందపత్రం మీద సంతకం చేయమని అడిగారు. సంతకం చెయ్యడానికి తనకేమీ అభ్యంతరం లేదని, అయితే విజయావారు నిర్మించే నాలుగుచిత్రాల్లో హీరోగా తననే తీసుకోవాలని కోరారు. ఎన్.టి.ఆర్. కోరిక సమంజసంగా అనిపించడంతో నాగిరెడ్డి, చక్రపాణి అభ్యంతరం చెప్పలేదు. అయితే ఈ విషయంలో కె.వి.రెడ్డి నుండి వ్యతిరేకత ఎదురైంది. 'పాతాళభైరవి' చిత్రంలో ఎ.ఎన్.ఆర్.ని హీరోగా తీసుకోవాలని ఆయన ఆలోచన. 'బాలరాజు', 'కీలుగుర్రం' చిత్రాలతో అప్పటికే జానపద హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు అక్కినేని. ఎదుగుతున్న నటునితో జానపద చిత్రం తీస్తే రిస్క్ అవుతుందనీ, అక్కినేనినే హీరోగా తీసుకోవాలనీ కె.వి.రెడ్డి పట్టుబట్టారు. కానీ నాగిరెడ్డి, చక్రపాణి నచ్చచెప్పడంతో ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకోక తప్పలేదు. ఆ విధంగా ఎ.ఎన్.ఆర్. చేయవలసిన 'పాతాళభైరవి' చిత్రం ఎన్.టి.ఆర్.కి దక్కింది.

1950 ఫిబ్రవరి 5న వాహినీ స్టూడియోలో ప్రారంభమైన 'పాతాళభైరవి' చిత్రం


'పాతాళభైరవి' చిత్రంలో ఎన్.టి.ఆర్



'పెళ్లిచేసిచూడు' చిత్రంలో
ఎన్.టి.ఆర్, జి.వరలక్ష్మి తదితరులు

షూటింగ్ 1951 ఫిబ్రవరి 18న పూర్తయింది. 1951 మార్చి 15న విడుదల చేశారు. 30 కేంద్రాల్లో శతదినోత్సవం, 3 కేంద్రాల్లో రజతోత్సవం జరుపుకుంది. బెంగుళూరులో స్వర్ణోత్సవం కూడా చేసుకుంది. 1952 ఆరంభంలో మనదేశంలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం తొలిసారిగా జరిగినప్పుడు విదేశీ చిత్రాలతో పాటు ప్రదర్శించడానికి నాలుగు భారతీయ చిత్రాలు ఎన్నికయ్యాయి. వాటిల్లో దక్షిణ భారతదేశం నుంచి ఎన్నికైన ఏకైక చిత్రం 'పాతాళభైరవి'. మిగిలిన ఆ మూడు చిత్రాలు 'ఆవారా' (హిందీ), 'బాబ్లీ' (బెంగాలీ), 'అమర్‌భూపాలీ' (మరాఠి).


నాలుగు సినిమాల్లో తనకే హీరో వేషం ఇవ్వాలన్న ఎన్.టి.ఆర్. షరతుకు నాగిరెడ్డి, చక్రపాణి, రెండేళ్లపాటు విజయా ప్రొడక్షన్స్‌కే పరిమితం కావాలని, వేరే సినిమాల్లో నటించకూడదన్న నిబంధనకు ఎన్.టి.ఆర్. కట్టుబడ్డారు. అందువల్ల 1951లో 'పాతాళ భైరవి', 'మల్లీశ్వరి' చిత్రాలు, 1952లో 'పెళ్లిచేసిచూడు' చిత్రాలు మాత్రమే విడుదలయ్యాయి. ఇవన్నీ విజయం సాధించాయి. నాలుగో చిత్రం 'చంద్రహారం' కాస్త ఆలస్యంగా 1954లో విడుదలయింది. విజయా సంస్థ వారు ఇచ్చే పారితోషికానికి రెట్టింపు ఇస్తానని హెచ్.యం.రెడ్డి ఆఫర్ ఇచ్చినా, ప్రలోభానికి లొంగక మాటకు కట్టుబడ్డారు ఎన్.టి.ఆర్. విజయావారి ఒప్పందం ప్రకారం మొదటి ఏడాది రామారావుకు నెలకు 500 రూపాయలు, సినిమాకు రూ. ఐదు వేలు చెల్లించారు. రెండో ఏడాది పారితోషికం పెరిగింది. నెలకు 750 రూపాయలు, సినిమాకు రూ. 7,500. పేరు ప్రతిష్ఠలు రావడంతోపాటు పారితోషికం కూడా పెరగడంతో ఎన్.టి.ఆర్.కి తనమీద తనకు నమ్మకం పెరిగింది. విజయా సంస్థలో ప్రవేశించకముందు నాలుగు చిత్రాల్లో



నటించినా చేతిలో డబ్బు లేక భోజనం మానేసిన రోజులూ ఉన్నాయి. ఆశనిరాశలమధ్య కెరీర్‌ను కొనసాగిస్తున్నందున తన కుటుంబాన్ని విజయవాడలో ఉంచారు రామారావు. 'పల్లెటూరి పిల్ల' చిత్ర నిర్మాణ సమయంలో అన్నగారిని చూడాలనిపించడంతో మద్రాసుకు త్రివిక్రమరావు చేరుకున్నారు. ఆ చిత్ర నిర్మాణ సమయంలో చెయ్యి విరిగి పెద్ద బ్యాండేజీతో రామారావు ఎదురుపడేసరికి ఆయన తల్లడిల్లిపోయారు. అప్పటి నుంచి అన్నగారికి అండగా ఉంటూ మద్రాసులోనే ఉండిపోయారు. కష్టాలు, కన్నీళ్లు ఇద్దరూ పంచుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉండవనే ధైర్యం వచ్చిన తర్వాత కుటుంబాన్ని మద్రాసుకు తరలించారు రామారావు.



సి.ఐ.డి. చిత్రంలో జమున, ఎన్.టి.ఆర్., గుమ్మడి






గుండమ్మకథలో ఏ.ఎన్.ఆర్., ఎస్.వి.ఆర్., ఎన్.టి.ఆర్.

### కాంట్రాక్ట్ పూర్తయినా..


1952లో విజయా సంస్థతో కాంట్రాక్ట్ ముగిసినా దాంతో అనుబంధాన్ని కొనసాగించారు రామారావు. ఎప్పుడు డేట్స్ అడిగినా, కథ ఏమిటి? దర్శకుడు ఎవరు అనే విషయాలు అడగకుండా నటించడానికి అంగీక


రించేవారు రామారావు. అన్నీ చూసుకోవడానికి చక్రపాణిగారు ఉన్నారు కదా అని ఆయన నమ్మకం. విజయావారి చిత్రాల విషయంలో ఆయన నమ్మకం ఎప్పుడూ వమ్ముకాలేదు. సాంఘిక చిత్రాల కథానాయకునిగా ఎన్.టి.ఆర్.ను విజయావారి 'పెళ్లిచేసిచూడు' (1952) నిలబెడితే, శ్రీ కృష్ణుని పాత్రలో తెలుగు ప్రజల ఇంటి గోడలమీద ఇలవేలుపుగా, గుండెలమీద తెరవేలుపుగా ప్రతిష్ఠించిన చిత్రం 'మాయాబజార్' (1957). 50 ఏళ్ల అనంతరం ఈ చిత్రాన్ని 2010 సంవత్సరంలో రంగుల్లోకి మార్చి




సత్యహరిశ్చంద్రలో ఎన్.టి.ఆర్, వరలక్ష్మి

విడుదల చేయగా, మళ్లీ ఈ సినిమా అందరినీ అలరించి విజయం సాధించింది. ఇక 'అప్పుచేసి పప్పుకూడు' (1959), 'జగదేకవీరుని కథ (1961), 'గుండమ్మకథ' (1962) చిత్రాల గురించి చెప్పనక్కర్లేదు. అయితే ఆ తర్వాత ఎన్.టి.ఆర్.తో విజయాసంస్థ నిర్మించిన 'సత్యహరిశ్చంద్ర' (1965), 'సి.ఐ.డి' (1965), 'ఉమా చండీగౌరీ శంకరుల కథ' (1968) మాత్రం గత చిత్రాల స్థాయిలో ఆడలేదు.





ఎన్.టి.ఆర్.తో నాగిరెడ్డి తదితరులు

ఎన్.టి.ఆర్. శివునిగా రెండోసారి నటించిన 'ఉమాచండీగౌరీ శంకరుల కథ' విజయా సంస్థలో ఆయనకు చివరి చిత్రం. ఆ తర్వాత ఈ సంస్థ నిర్మించిన 'గంగ-మంగ' (1974), 'శ్రీ రాజేశ్వరి విలాస్ కాఫీక్లబ్' (1976) చిత్రాల్లో ఎన్.టి.ఆర్. నటించలేదు. అప్పటికే ఆయన హీరోగా శిఖరాగ్ర స్థాయికి చేరుకున్నారు. అయినాసరే, తన మాతృసంస్థ తను లేకుండా సినిమాలు తీస్తున్నందుకు ఎంతో బాధపడ్డారు. 'నేను డబ్బులు అడిగానా.. డేట్లు లేవన్నానా' అని డి.వి.నరసరాజు వంటి సన్నిహితుల దగ్గర ఆవేదన వ్యక్తం చేసేవారు.

ఆ తర్వాత విజయాసంస్థ తనతో సినిమాలు తీయకపోయినా నాగిరెడ్డి, చక్రపాణి అంటే ఎంతో గౌరవ భావంతో మెలిగేవారు రామారావు. 1983లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించడంతో ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఒకరోజు ముందుగా నాగిరెడ్డిని చెన్నై నుండి హైదరాబాద్‌కు పిలిపించారు. ప్రమాణ స్వీకారానికి తనతోపాటు కారులో ఎక్కించుకుని వెళ్లారు. అక్కడ నుంచి సెక్రటేరియట్‌కు తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో తన సీటులో కూర్చుని ఎదురుగా ఉన్న నాగిరెడ్డితో 'ఒకప్పుడు మీరు ఇచ్చిన చేయూతవల్లే నేను ఇంతవాణ్ని కాగలిగాను. రాజకీయాల్లో కూడా నేను విజయం సాధించానంటే దానికి కారకులు మీరే. ఈ విజయం మీదే. ఈ రాజ్యం మీదే. నా చేత మంచి పాలనని తెలుగువారికి ఇప్పించండి' అని ఆయన చేతులు జోడించే సరికి నాగిరెడ్డి ఆనందం పట్టలేక ఎన్.టి.ఆర్.ని కౌగలించుకున్నారు. రామారావు చూపిన కృతజ్ఞతాభావం ఆయన్ని ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. ■



'సతీసులోచన' చిత్రంలో ఎస్.వి.ఆర్., ఎన్.టి.ఆర్.











# సహ నటులతో ఎన్.టి.ఆర్.

హీరో పాత్ర ఎలివేట్ అవ్వాలంటే విలన్ పాత్ర కూడా పవర్‌ఫుల్‌గా ఉండాలి. అందుకే సాధారణంగా హీరోతో సమానస్థాయి కలిగిన నటులనే విలన్ పాత్రలకు ఎన్నుకుంటారు. నువ్వా.. నేనా? అనే రీతిలో ఈ రెండు పాత్రలు ఉంటేనే చూసేవారికి రంజుగా ఉంటుంది. అలాగే కథానాయకునికి సపోర్ట్‌గా ఉంటూ చిత్ర కథాగమనంలో విశేష ప్రాధాన్యత కలిగినవి సహాయ పాత్రలు. ఎన్.టి.ఆర్ చిత్రాల్లో విలన్లుగా, కేరెక్టర్ యాక్టర్లుగా నటించి ఆయన విజయాల్లో కొంత భాగానికి కారకులైన కొందరు నటుల వివరాలు...



'సతీసులోచన' లో ఎస్.వి.ఆర్., ఎన్.టి.ఆర్.


### ఎస్.వి.రంగారావు

ఎన్.టి.ఆర్., ఎస్.వి.ఆర్. కెరీర్ దాదాపు ఒకేసారి ప్రారంభమయ్యిందని చెప్పాలి. 'షావుకారు' చిత్రంలో ఎన్.టి.ఆర్. హీరోగా నటిస్తే, సున్నం రంగడుగా ప్రాధాన్యం కలిగిన పాత్ర చేశారు రంగారావు. అంతకుముందు ఎన్.టి.ఆర్. తొలిసారి హీరోగా నటించిన 'పల్లెటూరి పిల్ల' చిత్రంలో చిన్నవేషం వేశారు రంగారావు. ఆ తర్వాత వీరిద్దరూ విజయా సంస్థలో పర్మనెంట్ ఆర్టిస్టులుగా చేరారు. 'పాతాళభైరవి' సినిమా ఎన్.టి.ఆర్‌కు ఎంతపేరు తెచ్చిందో, రంగారావునీ అంతగా ఎలివేట్ చేసింది. ఆపై వీరిద్దరూ కలిసి ఎన్నో చిత్రాల్లో తండ్రీకొడుకులుగా, ప్రత్యర్థులుగా నటించారు. ఒకరితో ఒకరు పోటీపడుతూ ఎన్.టి.ఆర్., ఎస్.వి.ఆర్. నటిస్తుంటే చూసేవారికి రెండుకళ్లు చాలేవి కాదు. ఆంగిక, వాచక, అభినయాలతో అదర గొట్టేసేవారు. పర్సనాలిటీ దృష్ట్యా ఆరోజుల్లో రంగారావు-రామారావు, గుమ్మడి- అక్కినేని కాంబినేషన్‌లో తండ్రీకొడుకుల పాత్రలు ఉండేవి.

'పాతాళభైరవి' చిత్రంలో నటిస్తున్న రోజుల్లో రంగారావు భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంటే.. "ఈ పరిశ్రమలో అగ్రశ్రేణి నటుల్లో మీరొకరని అనిపించుకునే రోజు తప్పక వస్తుంది సోదరా' అని ధైర్యం చెప్పేవారు రామారావు. ఆయన చెప్పినట్లే అచిర కాలంలోనే మంచి నటునిగా పేరు తెచ్చుకుని, అగ్ర హీరోలకు సరిసమాన స్థాయిలో పారితోషికం తీసుకునేలా ఎదిగారు రంగారావు.

ఎస్.వి.ఆర్ నిర్మించిన 'నాదీ ఆడజన్మే' (1965) చిత్రంలో రామారావు హీరోగా నటించారు. అలాగే ఎన్.టి.ఆర్ నిర్మించిన 'జయసింహ' (1955), 'రేచుక్క- పగటిచుక్క' (1959), 'శ్రీకృష్ణ సత్య (1971) తదితర చిత్రాల్లో నటించారు రంగారావు. వీరిద్దరి కలయికలో వచ్చిన చివరిచిత్రం 'దేవుడు చేసిన మనుషులు'. ఇందులోనూ తండ్రీకొడుకులుగా నటించారు.

వరద బాధితులను ఆదుకోవడానికి నిధి సేకరణ కోసం రామారావు జరిపిన పర్యటనల్లో రంగారావు కూడా పాల్గొనేవారు.




'ఒకే కుటుంబం' చిత్రంలో ఒక దృశ్యం

**నాగభూషణం**

అంతవరకూ విలనీయంలో ఉన్న పాత ఒరవడిని పక్కనబెట్టి విలన్ పాత్రలో కూడా కామెడీని, వ్యంగ్యాన్ని ప్రవేశపెట్టి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న నటుడు నాగభూషణం. సంభాషణలు పలికే తీరులోని విరుపు, మెరుపు నచ్చి ఎంతోమంది ఆయనకు అభిమానులయ్యారు. అంతకు ముందు కొన్ని చిత్రాల్లో సాత్విక పాత్రలు పోషించిన నాగభూషణం- ఎన్.టి.ఆర్. నటించిన 'కథానాయకుడు' చిత్రంతో విలన్ పాత్రలకు టర్న్ అయ్యారు. ఆ తర్వాత 'నిలువుదోపిడి', 'విచిత్ర కుటుంబం', 'బడిపంతులు', 'దేశోద్ధారకులు', 'అడవి రాముడు' తదితర చిత్రాల్లో విలన్‌గా నటించారు. నాగభూషణం విలనీలో అరుపులు, కేకలు ఉండవు. డైలాగులు, ఎక్స్‌ప్రెషన్స్‌తోనే ప్రేక్షకుల్ని భయపెట్టే వారాయన.

ఎన్.టి.ఆర్. నిర్మించిన 'ఉమ్మడి కుటుంబం', 'కోడలుదిద్దిన కాపురం' తదితర చిత్రాల్లో పాజిటివ్ పాత్రల్లో నటించిన నాగభూషణం ఆయన హీరోగా 'ఒకే కుటుంబం' సినిమా తీసి విజయం సాధించారు.



'గౌరీమహాత్మ్యం'లో నాగభూషణం, ఎన్.టి.ఆర్



## గుమ్మడి

పాత్ర స్వభావాన్ని ఆకళింపు చేసుకుని తనదైన శైలిలో అభినయించి, ప్రేక్షకుల మెప్పు పొందిన గుమ్మడి వెంకటేశ్వరరావును ఆయన కెరీర్ బిగినింగ్‌లో ఎంతో ఆదుకున్న వ్యక్తి ఎన్.టి.ఆర్. వేషాలు లేక మద్రాసు నుంచి ఇంటికి వెళతానంటే వారించి, ఎన్.ఎ.టి. సంస్థ నిర్మించిన తొలి చిత్రం 'పిచ్చి పుల్లయ్య'లో ప్రధాన పాత్ర ఇచ్చారు రామారావు. ఆ తర్వాత తీసిన 'తోడుదొంగలు' సినిమాలో తనతో సమాన ప్రాధాన్యం కలిగిన పాత్రను గుమ్మడికి ఇచ్చి ప్రోత్సహించారు. ఇక అప్పటినుంచి నటునిగా గుమ్మడి ఎదుగుదల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎన్నో వేషాలు ఆయనకు వచ్చేలా చేశారు రామారావు.

గుంటూరులో ఎన్.టి.ఆర్., గుమ్మడి ఏకకాలంలో చదువుకున్నప్పటికీ వారికి పరిచయం లేకపోవడం నిజంగా విచిత్రమే. గుమ్మడి కంటే రెండేళ్లముందు చిత్ర రంగంలోకి ప్రవేశించారు రామారావు. గుమ్మడి పనిచేసే ప్రొడక్షన్ ఆఫీసుకు ఎదురుగా ఉండే గదిలో ఆయన ఉండేవారు. విజయాసంస్థలో హీరోగా పని చేస్తున్న ఎన్.టి.ఆర్. ఎదుటిగదిలోనే ఉంటున్నారని తెలిసి తనే వెళ్లి పరిచయం చేసుకున్నారు గుమ్మడి. అప్పటి నుండి ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. చెన్నై టి.నగర్ నుంచి మౌంట్‌రోడ్ జంక్షన్ వరకూ వాళ్లిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడిచివెళ్లి బిస్కెట్లు తిని, టీ తాగిన సందర్భాలు ఎన్నో...

చెన్నైలో తన కుటుంబం స్థిరపడేవరకూ తరచు ఎన్.టి.ఆర్.తో కలిసి భోజనం చేసేవారు గుమ్మడి. భవిష్యత్ గురించి ఇద్దరూ చర్చించుకుంటుండేవారు.

'పాతాళభైరవి' చిత్ర విజయంతో 1952 నాటికే స్టార్ ఇమేజ్ సంపాదించుకున్నారు రామారావు. ఒక రోజు ఎప్పటిలాగానే ఆయన ఇంట్లో భోజనం చేస్తూ.. "రామారావుగారూ.. మీ పాపులారిటీని ప్రజల క్షేమం కోసం ఉపయోగిస్తే మంచిది" అని సలహా ఇచ్చారు గుమ్మడి. ఆ సమయంలోనే రాయలసీమలో కనీవినీ ఎరుగని క్షామం విలయతాండవం చేస్తోంది. గుమ్మడి లాగే ప్రఖ్యాత సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు క్షామ నివారణ కోసం నిధి వసూలు చేయమని ఎన్.టి.ఆర్.కు సూచించారు. వారిద్దరి సూచనని వెంటనే ఆచరణలో పెడుతూ క్షామ పీడితులకోసం విరాళాలు వసూలుచేసే కార్యక్రమం రూపొందించారు. ఆయనతో పాటు

గుమ్మడి కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో ఎన్.టి.ఆర్., గుమ్మడి మరింత సన్నిహితులయ్యారు.

ఎన్.టి.ఆర్., గుమ్మడి కలిసి ఎన్నో చిత్రాల్లో నటించినా ఈ కాంబినేషన్ గురించి చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే చిత్రం 'మహామంత్రి తిమ్మరుసు' **(1962)**. వయసులో ఎన్.టి.ఆర్. కంటే చిన్నవాడయినా ఆయనకు తండ్రిగా, అన్నగా, మామగా ఎన్నో సిని మాల్లో నటించారు గుమ్మడి. అలాగే 'రాజమకుటం', 'వీర కంకణం' చిత్రాల్లో ఎన్.టి.ఆర్.ని ఎదుర్కొనే విలన్‌గా దీటైన పాత్రలు పోషించారు గుమ్మడి.

మధ్యలో వచ్చిన మనస్పర్థల కారణంగా రామా రావు, గుమ్మడి నాలుగైదు ఏళ్లపాటు కలిసి ఏ చిత్రంలో నటించకపోయినా ఆ తర్వాత మబ్బులు తొలగిపోయి, మళ్లీ మిత్రులయ్యారు. 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' సినిమాలో వశిష్ఠుడు పాత్రను గుమ్మడితో వేయించారు రామా రావు. తను పోషించిన పాత్రల్లో ఇదొక విశిష్టమైన వేష మని గుమ్మడి చెప్పేవారు.

## జగ్గయ్య

చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించక ముందునుంచీ రామారావు, జగ్గయ్య స్నేహితులు. గుంటూరులోని ఏ.సి.కాలేజీలో సహాధ్యాయులు. 'బలిదానం', 'ఆలీ ది కాబ్లర్', 'మల్లమ్మ ఉసురు' వంటి నాటకాల్లో ఎన్.టి. ఆర్.తో కలిసి నటించేవారు. కాలేజీ చదువు పూర్తయిన తర్వాత ఎన్.టి.ఆర్., ఎన్.ఎ.టి. సంస్థను నెలకొల్పి నాట కాలు ప్రదర్శించడానికి సమాయత్తమైనప్పుడు ఆయన తో చేతులు కలిపి, ఆ నాటక ప్రదర్శనల్లో పాల్గొనేవారు జగ్గయ్య. తామిద్దరిలో ఎన్.టి.ఆర్.కు సినిమా ఛాన్స్ తొలిసారిగా రావడంతో జగ్గయ్య సంతోషించి, మద్రా సుకు వెళ్లమని ప్రోత్సహించారు. ఆకాశవాణిలో న్యూస్‌రీడర్‌గా చేరిన జగ్గయ్య కొంతకాలం తర్వాత తను కూడా చిత్రరంగ ప్రవేశం చేశారు. ఎన్నో సినిమాల్లో వీరిద్దరూ కలిసి నటించారు. తెరపై వీరిద్దరూ పోటీపడి నటిస్తుంటే ప్రేక్షకులు ఎంతో తన్మయు లయ్యేవారు.

క్రమశిక్షణ, సమయపాలన విషయంలో ఎంతో



సంతోషంలో జగ్గయ్య, ఎన్.టి.ఆర్.

కఠినంగా ఉండేవారు రామారావు. ఆయన షూటింగ్ స్పాట్‌లో ఉంటే మిగిలిన ఆర్టిస్టులు, టెక్నీషియన్లు కూడా ముందే వచ్చేవారు. అయితే జగయ్య రెండు గంటలు ఆలస్యంగా వచ్చినా చూసీ చూడనట్లు ఉండేవారు రామారావు. 'వారి సన్నివేశాలు వదిలేసి మిగిలినవి తియ్యండి' అని దర్శకులకు చెప్పేవారు. జగ్గయ్యది అసాధారణ జ్ఞాపక శక్తి. ఎంత పెద్ద డైలాగ్ అయినా ఒకసారి ఇలా చూసుకుంటే చాలు ఆయనకి కంఠతా వచ్చేసేది. అందుకే ఆలస్యంగా వచ్చినా తన సన్నివేశాలన్నీ చకచకా పూర్తి చేసేవారు. హీరో వేషాలు వెయ్యడానికి కొంత మంది, విలన్ పాత్రలు వెయ్యడానికి మరికొంతమంది నటులు ఫిక్స్ అయిన తరుణంలో అటు హీరోగానూ, ఇటు విలన్‌గా నటించి రెండు పాత్రలకు హుందాతనాన్ని తెచ్చారు జగ్గయ్య. 'దేవుడు చేసిన మనుషులు' తదితర చిత్రాల్లో విలన్ పాత్రలను తనదైన బాణీలో పోషించారు జగ్గయ్య.




### రాజనాల

తెలుగు సినిమాల్లో విలన్ పాత్రలకు ఒక ప్రత్యేకత తీసుకువచ్చిన రాజనాల 'వద్దంటే డబ్బు' (1954) చిత్రంలో తొలిసారిగా ఎన్.టి.ఆర్.తో కలిసి నటించారు. ఆ చిత్రంలో ఎన్.టి.ఆర్.కు పిల్లనిచ్చిన మామ గారిగా నటించారు. దాంతో ఆ సెట్‌లో రాజనాలని 'మామాజీ' అని పిలిచేవారు రామారావు. ఆ సినిమా అయిపోయినా పిలుపు మాత్రం మారలేదు. ఎవరికైనా పరిచయం చేసేటప్పుడు 'మా విలన్ మామాజీ' అని పరిచయం చేసేవారు రామారావు. ప్రారంభంలో తండ్రి వేషాలు వేసిన రాజనాలతో 'జయసింహ' (1955) చిత్రంలో విలన్ వేషం వేయించి, ఆ తరహా పాత్రలకు ఆయనే సమర్థుడని నిరూపించారు రామారావు. ముఖ్యంగా విఠలాచార్య జానపద చిత్రాల్లో రామారావు, రాజనాల చేసే కత్తియుద్ధాలు ప్రేక్షకుల్ని ఎంతో ఆకట్టుకునేవి. వీరిద్దరి కాంబినేషన్‌లో ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఎన్.ఎ.టి. సంస్థ నిర్మించిన చిత్రాలన్నింటిలో రాజనాల దాదాపుగా నటించారనే చెప్పాలి. అలాగే 'శ్రీకృష్ణపాండవీయం', 'గులేబకావళి కథ', 'వరకట్నం' తదితర చిత్రాల్లో రాజనాల నటించడానికి ప్రధాన కారకులు రామారావే. ఆ పాత్రలు ఆయన చేత చేయించాలని గట్టిగా రికమండ్ చేశారు. ప్రాభవం తగ్గి, వేషాలు లేక వెనుకబడిన తరుణంలో రాజనాలకు 'దానవీర శూరకర్ణ', 'చాణక్య చంద్రగుప్త' చిత్రాల్లో

వేషాలు ఇచ్చి ఆదుకున్నారు ఎన్.టి.ఆర్. అలాగే ఏదైనా మంచి వేషం ఉంటే అది ఎవరు చేయాలనే ప్రస్తావన వచ్చినప్పుడు 'మామాజీ'ని పిలిచి ఆ వేషం వెయ్యమనండి' అని చెప్పేవారు. ఆ రోజుల్లో ఎన్.టి.ఆర్.కు మారిస్ మైనర్ (ఎం.డి.ఓ 1522) కారుండేది. తీరిక దొరికి నప్పుడల్లా ఆ కారులో రాజనాల ఇంటికి వస్తుండేవారు రామారావు. అప్పుడప్పుడు రాజనాలదంపతుల్ని పిలిచి భోజనం పెట్టేవారు. 'జయసింహ' చిత్రం శతదినోత్సవం విజయవాడలో జరిగినప్పుడు రాజనాలను కూడా తీసుకెళ్లారు రామారావు. అక్కడి నుండి నిమ్మకూరు తీసుకువెళ్లి అతిథి మర్యాదలు చేశారు.




'నిప్పులాంటి మనిషి' లో సత్యనారాయణతో..

### సత్యనారాయణ

ఎన్.టి.ఆర్.తో కలిసి అత్యధిక చిత్రాల్లో నటించిన ఘనత సత్యనారాయణది. వీరిద్దరి కాంబినేషన్‌లో 101 చిత్రాలు వచ్చాయి. వీటిల్లో అధికశాతం ఎన్.టి.ఆర్. హీరోగా, సత్యనారాయణ విలన్‌గా నటించినవే. పవర్‌ఫుల్ విలన్ ఉన్నప్పుడే హీరో పాత్ర మరింత ఎలివేట్ అవుతుంది. అలా రామారావుకు సమ ఉజ్జీగా నటించి, ఆయన ప్రశంసలందుకున్నారు సత్యనారాయణ. 'తిరుపతమ్మ కథ' (1963) చిత్రంతో ప్రారంభమైన వీరిద్దరి చిత్రానుబంధం ఎన్.టి.ఆర్. చివరిచిత్రం 'శ్రీనాథ కవిసార్వభౌముడు' వరకూ కొనసాగింది. ప్రతి ఒక్కరినీ 'మీరు' అని గౌరవంగా సంబోధించే రామారావు సత్యనారాయణని మాత్రం ఏకవచనంతో 'తమ్ముడు' అని ఆప్యాయంగా పిలిచేవారు. 'నిజజీవితంలో తన సహధర్మచారిణిని మినహాయిస్తే రామారావుగారు ఎక్కువకాలం గడిపింది నాతోనే' అని సత్యనారాయణ చెబుతుంటారు. తను నటునిగా ఉన్నత స్థితికి రావడానికి రామారావు కారణమనే కృతజ్ఞతాభావం.. ఆయన మాటల్లో కనిపిస్తుంటుంది. అప్పట్లో వీళ్లిద్దరికీ ఉన్న పోలికలు గమనించి సొంత అన్నదమ్ములేమో అని అనుకున్న వారు లేకపోలేదు. ఈ కారణం వల్లే రామారావు ద్విపాత్రాభినయం చేసిన చిత్రాలు కొన్నింటిలో ఆయనకు డూప్‌గా సత్యనారాయణ నటించారు. 'రాముడు-భీముడు' చిత్రం పతాక సన్నివేశాల్లో ఈ విషయాన్ని స్పష్టంగా గమనించవచ్చు.

ఏ నటుడైనా ఎదిగి పరిశ్రమలో ప్రముఖస్థానం సంపాదించుకోవాలంటే ప్రతిభతోపాటు తగిన ప్రోత్సాహం అవసరం. అటువంటి ప్రోత్సాహమే ఎన్.టి.ఆర్. నుండి సత్యనారాయణకు లభించింది.

ఏ వేషం ఉన్నా దానికి సత్యనారాయణ పేరుని రికమండ్ చేసేవారు రామారావు. 'శ్రీకృష్ణావతారం' చిత్రంలో దుర్యోధనుని పాత్రకు మొదట ఎస్.వి.రంగారావుని అనుకున్నారు. అయితే డేట్స్ సమస్య కారణంగా ఆయన నటించలేకపోతే 'ఆ పాత్ర సత్యనారాయణతో వేయించండి' అని నిర్మాతకు చెప్పి ఆ వేషం



'శ్రీ కృష్ణావతారం' లో ఎన్.టి.ఆర్., సత్యనారాయణ తదితరులు

వచ్చేలా చేశారు. ఇలాంటి సంఘటనలు ఇంకా ఎన్నో..

తను దర్శకుడు కూడా కాబట్టి ఏ నటుడు ఏ తరహా పాత్రలను ఎలా మెప్పించగలడనే విషయం రామారావుకి అవగాహన ఉండేది. అందుకే సత్యనారాయణ విలన్ పాత్రలతో వెలిగిపోతున్న రోజుల్లో ఆయనతో 'ఉమ్మడి కుటుంబం' (1967) చిత్రంలో సాత్విక పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు రామారావు. కరుణరస ప్రధానమైన పాత్రల్లో కూడా రాణించగలనని ఆ చిత్రంతో నిరూపించుకున్న సత్యనారాయణ తదనంతర కాలంలో ఆ తరహాపాత్రలు ఎన్నో పోషించి పేరు తెచ్చుకున్నారు.

సొంత మనిషిలా ఎంతో ప్రేమతో చూసుకునేవారు రామారావు. 'తాయారమ్మ- బంగారయ్య' చిత్ర శత దినోత్సవంలో ఎన్.టి.ఆర్. మాట్లాడుతూ 'సత్యనారాయణని చూసి నేను గర్విస్తున్నాను. ఎందుకంటే హి ఈజ్ మై బోయ్' అన్నారు ప్రేమతో. ఎన్.టి.ఆర్. నటించిన 'దానవీరశూరకర్ణ', కృష్ణ, శోభన్‌బాబు నటించిన 'కురుక్షేత్రం' చిత్రాల షూటింగ్స్ పోటాపోటీగా జరుగుతున్న రోజులవి. ఆ సినిమాలో నటీనటులు ఈ సినిమాలో, ఇందులో తారలు అందులో నటించకుండా ఒక విధమైన కట్టడి ఉన్న రోజుల్లో కూడా రెండు చిత్రాల్లోనూ సత్యనారాయణ నటించగలిగారంటే రామారావు దగ్గర ఆయనకున్న చనువే కారణం. 'నా సక్సెస్‌లో సత్యనారాయణకు కూడా కొంత భాగం ఉంది. ఎందుకంటే నా చిత్రాల్లో అతను విలన్‌గా నాకు సమ ఉజ్జీగా నటించి మెప్పించారు' అని 'కొండవీటి సింహం' ఫంక్షన్లో రామారావు ప్రశంసించారు. సినీరంగంలోనే కాదు రాజకీయాల్లో కూడా రామారావుని అనుసరించి, ఆయన ఆశీస్సులతో ఎన్నికల్లో పోటీచేసి పార్లమెంట్ సభ్యుడయ్యారు సత్యనారాయణ.

■



# నందమూరి నాయికలు

ఎన్.టి.ఆర్. షూటింగ్ స్పాట్‌లో ఉన్నప్పుడు తన పాత్రలు, నటనమీదే దృష్టిని కేంద్రీకరించేవారు తప్ప మిగతా వారితో అనవసర విషయాలు మాట్లాడుతూ సమయాన్ని వృథా చేసేవారు కాదు. ఒకరిని పొగడటం, మరొకరిని తిట్టడం, మాట తూలడం ఎన్.టి.ఆర్.కు అలవాటులేని పనులు. అనవసరపు విషయాలు ఎవరైనా చెబుతుంటే ఆయన అలా వింటూనే ఓ కునుకు తీసేవారు.

ఎన్.టి.ఆర్. సినిమా మనిషైనా ఆయన నోటి నుంచి ఎప్పుడైనా పామర భాష విని ఎరుగమని ఆయనతో నటించిన హీరోయిన్లు చెప్పేవారు. ముఖ్యంగా మహిళల్ని ఆయన గౌరవించే తీరు, వాళ్ళతో మాట్లాడే విధానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేది. తనతో నటించే హీరోయిన్లను ఆయన చాలా గౌరవించేవారు. 'మీరు' అని సంబోధించేవారు. వారి యోగక్షేమాలను విచారించేవారు. ఎంతోమంది హీరోయిన్లు ప్రతిరోజూ ఉదయాన్నే ఎన్.టి.ఆర్. ఇంటికెళ్లి తమకున్న సమస్యలు చెప్పుకుని సాయం పొందుతుండేవారు.

ఎన్.టి.ఆర్. సరసన ఎక్కువ చిత్రాల్లో కథానాయికగా నటించిన ఘనత జమునకు దక్కుతుంది. 31 సినిమాల్లో వీరిద్దరూ జంటగా నటించారు. ఆ తర్వాత స్థానం సావిత్రిది. ఎన్.టి.ఆర్. సరసన ఆమె 26 చిత్రాల్లో నటించారు. అంజలీదేవి కూడా 26 చిత్రాల్లో, కృష్ణకుమారి 25 చిత్రాల్లో నటించారు.

ఈ నందమూరి అందగాడు సరసన నటించిన 47 మంది హీరోయిన్లు, ఆ చిత్రాల వివరాలు ఇప్పుడు పరిశీలిద్దాం.



'రేచుక్క- పగటిచుక్క' లో...

### 'షావుకారు' జానకి

ఎన్.టి.ఆర్. తొలి సినీ కథానాయిక జానకి. 'షావుకారు' సినిమాతో ఆమె నటజీవితం ప్రారంభం కావడంతో ఆ సినిమా పేరే ఆమె ఇంటిపేరుగా స్థిరపడింది. ఆ తర్వాత వీరిద్దరూ చాలా సినిమాల్లో జంటగా నటించినా వాటిల్లో గుర్తుండిపోయే మరోచిత్రం 'కన్యాశుల్కం'. గిరీశంగా ఎన్.టి.ఆర్., బుచ్చెమ్మగా జానకి నటించారు. సినిమాకు అనుగుణంగా నాటకంలో కీలకమైన మార్పులు చేసి- గిరీశం, బుచ్చెమ్మకు పెళ్లిచేయడం 'కన్యాశుల్కం' చిత్రంలో చోటుచేసుకున్న కొత్త అంశం. అలాగే రామారావు నిర్మించిన 'వేములవాడ భీమకవి' చిత్రంలో బాలకృష్ణకు తల్లిగా నటించారు జానకి. ఎన్.టి.ఆర్. సినిమాల పరంగా మిగతా హీరోయిన్లు ఎవరికీ దక్కని అదృష్టం జానకికి మాత్రమే దక్కింది. అదేమిటంటే... ఎన్.ఎ.టి. పతాకంపై రామారావు నిర్మించిన చిత్రాలన్నింటికీ టైటిల్స్ ముందు వచ్చే మోనోగ్రామ్‌లో అలివేలు మంగ పద్మావతీ సహిత శ్రీ వెంకటేశ్వరస్వామికి నిర్మాత త్రివిక్రమరావు పూజచేస్తూ కనిపిస్తారు. ఆ సందర్భంలో అలివేలు మంగ రూపంలో కనిపించేది జానకి కావడం గమనార్హం.

**చిత్రాల వివరాలు:** 1. షావుకారు, 2. వద్దంటే డబ్బు, 3. చెరపకురా చెడేవు, 4. కన్యాశుల్కం, 5. రేచుక్క-పగటిచుక్క, 6. కాడెద్దులు- ఎకరం నేల, 7. పెంపుడు కూతురు, 8. సవతికొడుకు, 9. భాగ్యరేఖ.

## అంజలీదేవి

ఎన్.టి.ఆర్. హీరోగా కమిట్ అయిన తొలిచిత్రం 'పల్లెటూరి పిల్ల'లో అంజలీదేవి కథానాయికగా నటించారు. అప్పటికే ఆమె నటీమణిగా పేరు తెచ్చుకున్నప్పటికీ దర్శకనిర్మాత బి.ఎ.సుబ్బారావు మీదున్న అభిమానంతో ఒక కొత్త హీరో సరసన నటించడానికి అంగీకరించారు. ఈ సినిమా హిట్ కావడంతో వీరిద్దరి కాంబినేషన్‌కు డిమాండ్ ఏర్పడింది. ఎన్.టి.ఆర్. సొంత చిత్రాల్లోనూ ఆమె నటించారు. అంతేకాదు ఎన్.టి.ఆర్. వృద్ధ పాత్రలు పోషించిన రెండు చిత్రాలు (భీష్మ, బడిపంతులు)లో అంజలీదేవి కథానాయిక.

ఆరంభంలో ఎన్.టి.ఆర్. సరసన హీరోయిన్‌గా నటించిన అంజలీదేవి క్యారెక్టర్ రోల్స్ చేయడం ప్రారంభించిన తర్వాత ఆయనకు తల్లిగా కూడా నటించారు.

**చిత్రాల వివరాలు:** 1. పల్లెటూరి పిల్ల, 2. రేచుక్క, 3. సంఘం, 4. జయసింహ, 5. సంతోషం, 6. జయం మనదే, 7. చరణదాసి, 8. పాండురంగమహాత్మ్యం, 9. శోభ, 10. రాజనందిని, 11. బాలనాగమ్మ, 12. రాణి రత్నప్రభ, 13. భట్టి విక్రమార్క, 14. సతీ సులోచన, 15. శాంత, 16. భీష్మ, 17. స్వర్ణమంజరి, 18. లవకుశ, 19. పరువు- ప్రతిష్ఠ, 20. వారసత్వం, 21. నిర్దోషి, 22. శ్రీకృష్ణ తులాభారం, 23. డాక్టర్ ఆనంద్, 24. భలేమాస్టారు, 25. పల్నాటి యుద్ధం. 26. బడిపంతులు




## కృష్ణకుమారి


'వరకట్నం' లో..

ఎన్.టి.ఆర్. ఫేవరేట్ హీరోయిన్‌గా పేరొందిన కృష్ణకుమారి ఆయన సరసన 25 చిత్రాల్లో నటించారు. ఎన్.టి.ఆర్. సరసన నటించిన తొలిచిత్రం 'పిచ్చిపుల్లయ్య', 25వ చిత్రం 'వరకట్నం'. ఈ రెండూ రామారావు సొంత చిత్రాలే కావడం గమనార్హం. కృష్ణకుమారి తొలి చిత్రం 'నవ్వితే నవరత్నాలు' ప్రివ్యూ తిలకించి, ఆమెని అభి నందించడమే కాకుండా తన సినిమాలో అవకాశం కల్పించారు రామారావు. ఎన్.టి.ఆర్., కృష్ణ కుమారి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలన్నీ హిట్లే. అందుకే ఈ కాంబినేషన్ మళ్లీ మళ్లీ రిపీట్ అయింది.

**చిత్రాల వివరాలు:**
1. పిచ్చి పుల్లయ్య, 2. వినాయకచవితి, 3. దేవాంతకుడు, 4. దీపావళి, 5.ఇరుగు-పొరుగు, 6. ఆప్త మిత్రులు, 7. బందిపోటు, 8. లక్షాధికారి, 9. తిరుపతమ్మ కథ, 10. గుడిగంటలు, 11. మర్మయోగి, 12. కలవారి కోడలు, 13. సత్యనారా యణ మహాత్మ్యం, 14. అగ్గిపిడుగు, 15. శభాష్ సూరి, 16. విశాల హృదయాలు, 17. శ్రీకృష్ణ తులాభారం, 18. భువన సుందరికథ, 19. ఉమ్మడి కుటుంబం, 20. స్త్రీజన్మ, 21. పుణ్యావతి, 22. ఆడపడుచు, 23. తిక్క శంకరయ్య, 24. నిండు సంసారం, 25. వరకట్నం.



'చింతామణి' చిత్రంలో జమున, ఎన్.టి.ఆర్.

**జమున**

ఎన్.టి.ఆర్., జమున కాంబినేషన్‌లో వచ్చిన తొలి సినిమా 'ఇద్దరు పెళ్లాలు'. ఈ సినిమాతోనే రామారావు తొలిసారిగా శ్రీకృష్ణ పాత్రలో కనిపించడం గమనార్హం. ఆయన అపరకృష్ణునిగా ఎంత పేరొందారో, జమున కూడా అపర సత్యభామగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఎన్.టి.ఆర్.ని చూస్తే మిగతా హీరోయిన్లు భయపడుతూ దూరంగా ఉండేవారు కానీ జమున మాత్రం ఆయనతో చాలా చనువుగా మెలిగేవారు. ఎన్.టి.ఆర్. పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాతీయ ఫిలిం అవార్డును కూడా ఆమె అందుకున్నారు.

**చిత్రాల వివరాలు:** 1. ఇద్దరుపెళ్లాలు, 2. సంతోషం, 3. చిరంజీవులు, 4. భాగ్యరేఖ, 5. వీరకంకణం, 6. వినాయకచవితి, 7. సతీ అనసూయ, 8. భూకైలాస్, 9.వచ్చిన కోడలు నచ్చింది, 10. గులేబకావళి కథ, 11. రాముడు- భీముడు, 12. మంచి మనిషి, 13. దొరికితే దొంగలు, 14. మంగమ్మ శపథం, 15. చింతామణి, 16. తోడు-నీడ, 17. సి.ఐ.డి, 18. శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ, 19, సంగీత లక్ష్మి, 20. శ్రీకృష్ణ తులాభారం, 21. అడుగుజాడలు, 22. ఏకవీర, 23. శ్రీకృష్ణవిజయం, 24. డబ్బుకులోకం దాసోహం, 25. ధనమా- దైవమా, 26. దీక్ష, 27. సంసారం, 28. ఎవరు దేవుడు, 29. మనుషులంతా ఒక్కటే, 30. సతీసావిత్రి, 31. శ్రీరామ పట్టాభిషేకం.

## సావిత్రి

నటనలో పోటీ పడుతూ హీరోలతో సమఉజ్జీగా నటించే నటి సావిత్రి. అందుకే ఆమెతో నటిస్తున్నప్పుడు ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. వంటి అగ్ర హీరోలు సైతం అలెర్ట్‌గా ఉండేవారు. ఎన్.టి.ఆర్. నటించిన 'పాతాళ భైరవి' సినిమాలో ఓ నృత్య సన్నివేశంలో నటించిన సావిత్రి ఆయన సరసన తొలిసారిగా 'పల్లెటూరు' చిత్రంలో నటించారు. రెండోచిత్రం 'మిస్సమ్మ' తో ఈ జంటకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఎన్నో చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట ప్రేక్షకులకు కన్నుల పంట అయింది. 'విచిత్ర కుటుంబం' సినిమాలో వీరిద్దరూ భార్యా భర్తలుగా నటించారు. ఎన్.టి.ఆర్.- సావిత్రిని 'ఏమే' అని పిలవడం చూసి ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేశారు. సావిత్రి దర్శకత్వంలో 'మాతృదేవత' సినిమాలో నటించారు ఎన్.టి.ఆర్. ఆయన హీరోగా రూపొందిన కొన్ని చిత్రాల్లో సావిత్రి క్యారెక్టర్ రోల్స్ కూడా చేశారు.


'బండరాముడు' లో..

**చిత్రాల వివరాలు:** 1. పల్లెటూరు, 2. మిస్సమ్మ, 3. కన్యాశుల్కం, 4. భలే అమ్మాయిలు, 5. కుటుంబ గౌరవం, 6. కార్తవరాయుని కథ, 7. ఇంటిగుట్టు, 8. అప్పుచేసి పప్పుకూడు, 9. బండరాముడు, 10. శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం, 11. విమల, 12. దీపావళి, 13. కలసి ఉంటే కలదు సుఖం, 14. గుండమ్మకథ, 15. ఆత్మబంధువు, 16. నర్తనశాల, 17. నాదీ ఆడజన్మే, 18. పాండవ వనవాసం, 19. దేవత, 20. నిర్దోషి 21. కంచుకోట, 22. తల్లిప్రేమ, 23. విచిత్రకుటుంబం, 24. మాతృదేవత, 25. నిండు దంపతులు, 26. ఎర్రకోట వీరుడు.

### భానుమతి

'మల్లీశ్వరి' చిత్రంలో తొలిసారిగా కలిసి నటించారు ఎన్.టి.ఆర్., భానుమతి. ఆ సమయంలో తనకన్నా సీనియర్ అని ఆమెకు చాలా గౌరవమిచ్చేవారు. తన మనసులో ఏముందో అదే మాట్లాడే నైజం ఎన్.టి.ఆర్‌ది కావడంతో ఆమె కూడా ఆయన్ని అభిమానించేవారు. 'మిస్సమ్మ' చిత్రంలో వీళ్లిద్దరూ కలిసి కొన్నిరోజులు పనిచేసినా తర్వాత షూటింగ్‌కి చెప్పాపెట్టకుండా మానేసిందన్న కోపంతో భానుమతిని తొలగించి సావిత్రితో ఆ పాత్ర వేయించారు నిర్మాతల్లో ఒకరైన చక్రపాణి.

భానుమతి తొలిసారిగా దర్శకత్వం వహించిన 'చండీరాణి' చిత్రంలో ఎన్.టి.ఆర్. హీరో. ఈ చిత్రం హిందీ, తమిళ వెర్షన్స్‌లోనూ ఆయనే హీరో. అలాగే 'అమ్మాయి పెళ్లి' సినిమాకి కూడా భానుమతి దర్శకత్వం వహించగా అందులోనూ నటించారు. అదే విధంగా ఎన్.టి.ఆర్. దర్శకత్వం వహించిన 'తాతమ్మకల', 'సమ్రాట్ అశోక' చిత్రాల్లో భానుమతి నటించారు.




తను ముఖ్యమంత్రిగా ఉన్న తరుణంలోనే భానుమతికి ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డ్ ప్రదానంచేసి తనే ఆమె చేతికి స్వర్ణకంకణం తొడిగారు ఎన్.టి.ఆర్. అలాగే ఎన్.టి.ఆర్. జాతీయ అవార్డ్ అందుకున్న ఆయన తొలి కథానాయిక భానుమతి కావడం గమనార్హం.

**చిత్రాల వివరాలు:** 1. మల్లీశ్వరి, 2. చండీరాణి, 3. అగ్గిరాముడు, 4. తెనాలి రామకృష్ణ, 5. సారంగధర, 6. చింతామణి, 7. వివాహబంధం, 8. బొబ్బిలియుద్ధం, 9. పల్నాటి యుద్ధం. 10. తోడు-నీడ, 11. పుణ్యవతి, 12.అమ్మాయి పెళ్లి, 13. తాతమ్మకల.


'జగదేకవీరుని కథ'లో...

### బి.సరోజాదేవి


'పాండురంగ మహాత్మ్యం' చిత్రంతో బి.సరోజాదేవిని పరిచయం చేశారు ఎన్.టి.ఆర్. ఆ సినిమాలో తనది వేశ్య పాత్ర అని తెలిసి సరోజాదేవి మొదట అంగీకరించలేదు. అయితే ఆ చిత్ర ప్రాధాన్యాన్ని ఎన్.టి.ఆర్. వివరించిన తర్వాత ఆమె అంగీకరించారు. ఎన్.టి.ఆర్.తో ఆమె రెండో సినిమా 'సీతారామకళ్యాణం'. ఆ తర్వాత ఎన్నో చిత్రాల్లో వీరిద్దరూ కలిసి నటించారు. ఈ జంట పేరు చెప్పగానే మొదటగా గుర్తుకు వచ్చే సినిమా 'జగదేకవీరుని కథ'. ఈ సినిమాలో తన ముద్దు ముద్దు మాటలతో అందరినీ ఆకట్టుకున్నారు సరోజాదేవి.

'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రంలో ఎన్.టి.ఆర్. సోదరిగా సుభద్ర పాత్రను పోషించారు సరోజాదేవి. అప్పటినుంచి ఎన్.టి.ఆర్.ను 'అన్నయ్యా' అని పిలిచే వారు సరోజాదేవి.

ఎన్.టి.ఆర్.తో ఆమె కలిసి నటించిన చివరి చిత్రం 'దానవీరశూరకర్ణ'. ఇందులో చిన్న వేషమైనా కర్ణుని భార్యగానే నటిస్తానని పట్టుబట్టి ఆ పాత్ర పోషించారు సరోజాదేవి.

**చిత్రాల వివరాలు :**

1. పాండురంగ మహాత్మ్యం, 2. సీతారామ కళ్యాణం, 3. ఇంటికిదీపం ఇల్లాలే, 4. జగదేకవీరుని కథ, 5. మంచి-చెడు, 6. దాగుడుమూతలు, 7. ప్రమీలార్జునీయం, 8. శకుంతల, 9. ఉమా చండీ గౌరీ శంకరుల కథ, 10. భాగ్యచక్రం, 11. విజయం మనదే, 12. మాయని మమత, 13. మనుషుల్లో దేవుడు, 14. శ్రీరామాంజనేయ యుద్ధం, 15. దానవీరశూరకర్ణ.




5. గాలిమేడలు, 6. దక్షయజ్ఞం, 7. మహామంత్రి తిమ్మరుసు, 8. రక్తసంబంధం, 9. దేశద్రోహులు, 10. ఆడబ్రతుకు, 11. మంగళ సూత్రం, 12. భామా విజయం, 13. నిండుమనసులు, 14. శ్రీ కృష్ణావతారం, 15. నిలువు దోపిడీ, 16. గండికోట రహస్యం, 17. రాజకోట రహస్యం, 18. చిన్ననాటి స్నేహితులు, 19. శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం, 20. శ్రీకృష్ణ విజయం, 21. శ్రీకృష్ణ సత్య

## దేవిక

ఎన్.టి.ఆర్.తో తొలిసారిగా దేవిక 'రేచుక్క' చిత్రంలో నటించారు. అప్పటికి ఆమె పేరు ప్రమీల. తనపేరు దేవికగా మారిన తర్వాత ఎన్నో చిత్రాల్లో ఆయనతో కలిసి నటించారు. ఇందులో సాంఘికాలు, చారిత్రకాలు, పౌరాణికాలు, జానపదాలు ఉన్నాయి. సెట్‌లో నిశ్శబ్దంగా ఉండటం ఎన్.టి.ఆర్.కు ఇష్టం. దేవిక కూడా కామ్‌గా ఉండే మనిషి కావడంతో ఆమెను అభిమానించేవారు. హీరోయిన్‌గా ఎన్నో సినిమాల్లో నటించిన దేవిక 'నిప్పులాంటి మనిషి' చిత్రంలో ఎన్.టి.ఆర్.కు వదినగా నటించారు. ఆమె కుమార్తె కనక 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' లో సీతగా నటించింది.

చిత్రాల వివరాలు:

1. రేచుక్క, 2. శభాష్ రాముడు, 3. పెండ్లిపిలుపు, 4. టాక్సీరాముడు,

## ఎస్.వరలక్ష్మి

ఎస్.వరలక్ష్మి ఎన్.టి.ఆర్.తో కలిసి 6 చిత్రాల్లో నటించారు. ఆమె క్యారెక్టర్ రోల్స్ చేయడం ప్రారంభించిన తర్వాత రామారావుకి తల్లిగా ఎన్నో చిత్రాల్లో అభినయించారు. అలాగే తాను నిర్మించిన ప్రతి సినిమాలో ఆమెకు ప్రాధాన్యం కలిగిన పాత్రలు ఇచ్చేవారు రామారావు.

చిత్రాల వివరాలు: 1. దీపావళి, 2. శ్రీకృష్ణార్జున యుద్ధం, 3.శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం, 4.మహామంత్రి తిమ్మరుసు, 5. బభ్రువాహన, 6. సత్యహరిశ్చంద్ర.



### జయలలిత

తల్లి సంధ్యతోను, కూతురు జయలలితతోనూ నటించిన ఘనత ఎన్.టి.ఆర్.ది. 'మాయాబజార్', 'తెనాలి రామకృష్ణ' చిత్రాల్లో ఆయన సరసన సంధ్య నటించగా, 'గోపాలుడు-భూపాలుడు' చిత్రం నుండి జయలలిత నటించారు. 'అందమైన జంట'గా ఎన్.టి.ఆర్., జయలలిత పేరొందారు. ఎన్.టి.ఆర్. నిర్మించిన 'శ్రీకృష్ణసత్య' సినిమాలో ఆమె సత్యభామగా నటించారు. సినిమాల్లో జంటగా నటించిన ఎన్.టి.ఆర్., జయలలిత రాజకీయ రంగంలోకి ప్రవేశించి ముఖ్యమంత్రులు కావడం విశేషం.

**చిత్రాల వివరాలు:**

1. గోపాలుడు-భూపాలుడు, 2. చిక్కడు-దొరకడు, 3. తిక్క శంకరయ్య, 4. బాగ్దాద్ గజదొంగ, 5. కథానాయకుడు, 6. గండికోట రహస్యం, 7. కదలడు-వదలడు, 8. ఆలీబాబా 40 దొంగలు, 9. శ్రీకృష్ణ విజయం, 10. శ్రీకృష్ణ సత్య, 11. దేవుడు చేసిన మనుషులు.



తల్లీ కూతుళ్లు సంధ్య, జయలలితతో ఎన్.టి.ఆర్.



## లక్ష్మీరాజ్యం


ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. అన్నదమ్ములుగా నటించిన 'సంసారం' చిత్రంలో కథానాయికగా నటించిన లక్ష్మీరాజ్యం ఆ చిత్ర నిర్మాత సినిమాని పూర్తిచేయలేని పరిస్థితులు ఏర్పడినప్పుడు తన భుజాన వేసుకుని ఆ చిత్రాన్ని పూర్తిచేసి విడుదల చేశారు. ఆ తర్వాత 'దాసి', 'రాజు-పేద' చిత్రాల్లో ఎన్.టి.ఆర్. సరసన నటించారు.

తన భర్త శ్రీధరరావుతో కలిసి రాజ్యం పిక్చర్స్ పేరిట చిత్ర నిర్మాణ సంస్థను నెలకొల్పి 11 చిత్రాలు నిర్మించారు లక్ష్మీరాజ్యం. ఈ సంస్థ తొలిచిత్రం 'దాసి'లోనూ, చివరి చిత్రం 'మగాడు'లోనూ ఎన్.టి.ఆర్. హీరో కావడం గమనార్హం. అలాగే ఎన్.టి.ఆర్. బృహన్నలగా నటించిన 'నర్తనశాల' చిత్రాన్ని కూడా ఆమె నిర్మించారు.

## కె.ఆర్.విజయ

'శ్రీకృష్ణ పాండవీయం' చిత్రంతో కె.ఆర్.విజయను తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు ఎన్.టి.ఆర్. ఆ సినిమాలో రుక్మిణి పాత్రలో ముగ్ధ మనోహరంగా కనిపించి అందరినీ ఆకట్టుకున్నారామె. పురాణపాత్రలు ధరించిన సినీ నటుల్ని దేవుళ్లతో కొలవడం హీరోలలో ఎన్.టి.ఆర్.తో మొదలైతే... హీరోయిన్లలో ఆ ఘనత దక్కించుకున్న నటి కె.ఆర్. విజయ. అంతేకాదు సాయంత్రం అయిదు దాటితే పనిచేయననీ, ఆదివారాలు షూటింగ్స్‌కు రానని ఆ రోజుల్లోనే అగ్ర హీరోలకు షరతులు విధించిన నటి ఆమె.


**చిత్రాల వివరాలు:** 1. శ్రీకృష్ణపాండవీయం, 2. పరమానందయ్య శిష్యులకథ, 3. భలేతమ్ముడు, 4. ఏకవీర, 5. లక్ష్మీ కటాక్షం, 6. ప్రేమసింహాసనం.



'సంసారం' లో..



'శ్రీకృష్ణపాండవీయం' లో..



'రాజమకుటం' లో..


### రాజసులోచన

ఎన్.టి.ఆర్. శ్రీకృష్ణునిగా నటించిన 'సొంతవూరు' చిత్రంలో కథానాయిక రాజసులోచన. ఈ చిత్రం షూటింగ్‌లో జరిగిన ఒక సంఘటన: ఎన్.టి.ఆర్., రాజసులోచన మీద ఒక పాటను చిత్రీకరిస్తున్నారు. ఇందుకోసం చిన్న చిన్న తీగలు చుట్టి వెదురు కర్రలతో సెట్ వేశారు. అందులో ఒక తీగెకు తగిలి రాజసులోచన కాలివేలు తెగింది. పాట చిత్రీకరణలో ఉన్న రాజసులోచనకు ఆ విషయం తెలీలేదు. ఏదో చురుక్కుమని అనిపించిందంతే. షాట్ అయిన తర్వాత ధారాపాతంగా రక్తం. అది చూసి రామారావు కంగారుపడి తన చేతిలో ఉన్న కూల్ డ్రింక్‌ను ఆ గాయం మీద వంపి రక్తం గడ్డ కట్టేటట్లు చేశారు. తర్వాత తనే బ్యాండేజ్ కట్టారు.

అలాగే ప్రకృతి అవాంతరాలు సంభవించిన అనేక సందర్భాల్లో బాధితులకు సాయం అందించేందుకు ఎన్.టి.ఆర్. నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మొదటగా రాజసులోచన నృత్య ప్రదర్శన ఉండేది. అదే సెంటిమెంట్‌తో తను తొలిసారిగా ముఖ్యమంత్రి అయిన తర్వాత నిర్వహించిన 'ఫిల్మోత్సవ్'లో రాజసులోచన సారథ్యంలో స్వాగత నృత్యాన్ని రూపొందించి ప్రదర్శింపచేశారు ఎన్.టి.ఆర్. భానుప్రియ, రమ్యకృష్ణ రాధ... వంటి హీరోయిన్లతో ఐదు నదులను పాత్రలుగా చూపుతూ సి.నారాయణరెడ్డి రాసిన ఈ గీతాన్ని చక్రవర్తి సంగీత దర్శకత్వంలో సుశీల, జానకి పాడారు.

**చిత్రాల వివరాలు:** 1. సొంతవూరు, 2. పెంకిపెళ్లాం, 3. రాజమకుటం, 4. టైగర్‌రాముడు, 5. వాల్మీకి, 6. బభ్రువాహన.





## చంద్రకళ

ఎన్.టి.ఆర్.తో చంద్రకళ నటించిన తొలి సినిమా 'విశాల హృదయాలు'. అందులో ఆయన మరదలుగా చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత 'ఆడ పడుచు' సినిమాలో ఎన్.టి.ఆర్. చెల్లెలుగా నటించారు చంద్రకళ. ఆ సినిమా విడుదలైన కొన్ని రోజులకు చంద్రకళను పిలిపించి తన సొంత చిత్రాలు 'వరకట్నం', 'తల్లాపెళ్లామా' కోసం అగ్రిమెంట్స్ మీద సంతకం చేయించారు ఎన్.టి.ఆర్. 'తల్లా-పెళ్లామా' చిత్రంలో చంద్రకళది హీరోయిన్ వేషం కావడం విశేషం. ఆమె హీరోయిన్‌గా నిలదొక్కు కోవడానికి ఈ చిత్రం ఎంతో ఉపకరించింది. ఎన్.టి.ఆర్ ఇచ్చిన చేయూత తోనే మరికొన్ని సినిమాల్లో ఆమెకు హీరోయిన్‌గా అవకాశాలు వచ్చాయి. 'మాతృదేవత'లో ఎన్.టి.ఆర్.కు కూతురుగా నటించారు చంద్రకళ.

ఆ తర్వాత 'పవిత్ర హృదయాలు' చిత్రంలో కూడా ఎన్.టి.ఆర్. సరసన నటించారు. 'సాహసవంతుడు' సినిమాలో ఎన్.టి.ఆర్.కు మరదలుగా నటించారు.

## రాజశ్రీ

స్కూల్‌లో చదువుకునే రోజుల నుంచీ ఎన్.టి. ఆర్.ని విపరీతంగా అభిమానించే కుసుమ కుమారి (రాజశ్రీ అసలుపేరు)కి 'అగ్గిపిడుగు' చిత్రంతో ఆయన సరసన నటించే అవకాశం వస్తుందని ఊహించ లేదు. ఈ సినిమాలో రామారావు ద్విపాత్రాభినయం చేయగా, ఆయన సరసన కృష్ణకుమారి, రాజశ్రీ నటించారు. అప్పటికే ఎన్.టి.ఆర్. పెద్ద స్టార్. భయంతో, భక్తితో తన అభిమాన కథానాయకుడితో కలిసి నటించేదానినని రాజశ్రీ చెబుతారు. ఎన్.టి.ఆర్.తో ఆమె నటించిన సినిమాల్లో ఆరు జానపదాలు కాగా ఒకటి మాత్రమే సాంఘికం.

చిత్రాల వివరాలు: 1. అగ్గిపిడుగు, 2. పిడుగు రాముడు, 3. అగ్గిబరాటా, 4. గోపాలుడు- భూపాలుడు, 5. అగ్గివీరుడు, 6. లక్ష్మీకటాక్షం, 7. చిట్టి చెల్లెలు, 8.దానవీరశూరకర్ణ.

'తల్లా పెళ్లామా'లో చంద్రకళతో





**వాణిశ్రీ**

ఎన్.టి.ఆర్. నటించిన 'ఉమ్మడి కుటుంబం' చిత్రంలో ఒక హాస్య భరిత అంతర్నాటకంలో సతీసావిత్రిగా వాణిశ్రీ, యమునిగా ఎన్.టి.ఆర్. కనిపిస్తారు. ఈ సినిమాలో ఆమెది హాస్య భూమిక. చిత్రం ఏమిటంటే ఆమె అగ్రనటిగా పేరొందిన తర్వాత 'లవకుశ' చిత్ర నిర్మాత శంకరరెడ్డి నిర్మించిన 'సతీసావిత్రి'లో టైటిల్ పాత్ర పోషించారు. ఈ సినిమాలో కూడా యమునిగా ఎన్.టి.ఆర్. నటించారు.

తన చిత్రాల్లో ఇలా హాస్యభూమికలు, సహాయ పాత్రలు పోషించిన వాణిశ్రీకి తన సరసన హీరోయిన్‌గా నటించే ఛాన్స్ 'నిండు హృదయాలు' చిత్రంతో కల్పించారు ఎన్.టి.ఆర్. ఆ తర్వాత ఎన్నో చిత్రాల్లో వీరిద్దరూ కలిసి నటించారు. ఎన్.టి.ఆర్. అయిదు పాత్రలను పోషించిన 'శ్రీమద్ విరాటపర్వం' వీరి కలయికలో వచ్చిన చివరి చిత్రం.

**చిత్రాల వివరాలు:**

1. నిండు హృదయాలు, 2. కోడలు దిద్దిన కాపురం, 3. జీవిత చక్రం, 4. రైతుబిడ్డ, 5. అదృష్ట జాతకుడు, 6. శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, 7. దేశోద్ధారకులు, 8. మనుషుల్లో దేవుడు, 9. కథానాయకుని కథ, 10. రాముని మించిన రాముడు, 11. మాయా మశ్చీంద్ర, 12. ఎదురులేని మనిషి, 13. ఆరాధన, 14. ఎదురీత, 15. సింహబలుడు, 16. మావారి మంచితనం, 17. సాహస వంతుడు, 18. శ్రీమద్ విరాటపర్వం.


'దానవీరశూరకర్ణ'లో శారదతో..

## శారద

అంతవరకూ హాస్య పాత్రలు, సహాయ పాత్రలు పోషించిన శారద 'జీవితచక్రం' సినిమాలో తొలిసారిగా ఎన్.టి.ఆర్. సరసన నటించారు. ఆ తర్వాత ఎన్.టి.ఆర్. తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేసిన 'సర్దార్ పాపారాయుడు' చిత్రంలో తండ్రి సరసన ఆమె అభినయించారు.


ఇదిలా ఉంటే శారద నటజీవితాన్ని సరికొత్త మలుపు తిప్పిన చిత్రం 'చండశాసనుడు'. హీరోయిన్ వేషాలు తగ్గడంతో క్యారెక్టర్ రోల్స్‌కి మొగ్గు చూపుతున్న తరుణంలో వచ్చిన ఈ చిత్రం ఆమె కెరీర్‌కి సరికొత్త దిశానిర్దేశం చేసింది. హీరోలతో సమానంగా ఉండే పాత్రలు శారదను దృష్టిలో పెట్టుకుని రచయితలు సృష్టించడానికి ఆస్కారం కలిపించింది. అందుకే ఇందుకు కారకులైన ఎన్.టి.ఆర్. అంటే శారదకు ఎంతో అభిమానం, విపరీతమైన గౌరవం.

'దానవీరశూరకర్ణ', 'జస్టిస్‌చౌదరి', 'మేజర్ చంద్రకాంత్' చిత్రాల్లో కూడా నటించిన శారద ఎన్.టి.ఆర్. ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీలో చేరి రాజకీయాలలోనూ తగుదుననిపించుకున్నారు.

## జయసుధ

'అడవిరాముడు', 'ఎదురీత' చిత్రాల్లో సెకండ్ హీరోయిన్‌గా నటించిన జయసుధ తొలిసారిగా ఎన్.టి.ఆర్. సరసన నటించిన చిత్రం 'రామకృష్ణులు'. అలాగే రాజకీయాల్లోకి ఎన్.టి.ఆర్. వెళ్లకముందు నటించిన చివరి చిత్రం 'నాదేశం'లోనూ, ఆయన చివరి సినిమా 'శ్రీనాథ కవిసార్వభౌముడు' లోనూ నటించిన అదృష్టం జయసుధది.

**చిత్రాల వివరాలు:** 1. రామకృష్ణులు, 2. లాయర్ విశ్వనాథ్, 3. కేడీ నెం.1, 4. డ్రైవర్ రాముడు, 5. శ్రీ తిరుపతి వెంకటేశ్వర కళ్యాణం, 6. యుగంధర్, 7. సరదారాముడు, 8. గజదొంగ, 9. విశ్వరూపం, 10. మహాపురుషుడు, 11. అనురాగ దేవత, 12. నాదేశం, 13. శ్రీనాథ కవిసార్వభౌముడు


'విశ్వరూపం'లో జయసుధతో..

**జయప్రద**

సినిమాల్లోకి రాక ముందు నుంచీ ఎన్.టి.ఆర్. అభిమాని అయిన జయప్రద ఆయనతో కలిసి నటించే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతం అంటారు. 'సిరిసిరిమువ్వ' చిత్రం విడుదలైన కొన్ని రోజులకు ఎన్.టి.ఆర్., జయప్రదను పిలిపించి 'చాణక్య చంద్రగుప్త' చిత్రంలో విషకన్య పాత్రను ఇచ్చారు. అయితే ఆ సినిమా కంటే ముందు విడుదలైన 'అడవిరాముడు' చిత్రం ఘన విజయం సాధించడంతో ఎన్.టి.ఆర్.-జయప్రద జంటకు మంచి పేరు వచ్చింది. 'యమగోల' చిత్రం ఈ జంటకు డిమాండ్ పెంచింది.


ఆ తరం హీరోయిన్లలో ఎన్.టి.ఆర్.తో సాంఘిక చిత్రాలతోపాటు జానపద, పౌరాణిక, చారిత్రాత్మక చిత్రాల్లో నటించే అవకాశం దక్కించుకున్న ఏకైక హీరోయిన్ జయప్రద అని చెప్పాలి.



'ఛాలెంజ్ రాముడు'లో జయప్రదతో

అలాగే ఎన్.టి.ఆర్. ఆశయాలకు, ప్రజలకు ఏదో చేయాలన్న తపనకు ఆకర్షితురాలైన జయప్రద 'తెలుగుదేశం' పార్టీలో చేరడం విశేషం.

**చిత్రాల వివరాలు:** 1. అడవిరాముడు, 2. చాణక్య-చంద్రగుప్త, 3. మా ఇద్దరి కథ, 4. యమగోల, 5. మేలుకొలుపు, 6. యుగపురుషుడు, 7. రాజపుత్ర రహస్యం, 8. శ్రీ తిరుపతి వెంకటేశ్వర కళ్యాణం, 9. ఛాలెంజ్ రాముడు, 10. సర్కస్‌రాముడు, 11. సూపర్‌మేన్.



'జస్టిస్ చౌదరి'లో శ్రీదేవితో...

## శ్రీదేవి

మనవరాలిగా నటించిన బాలనటి హీరోయిన్‌గా మారినప్పుడు ఆమెకు జంటగా నటించిన అరుదైన ఘనత పొందిన వ్యక్తి ఎన్.టి.ఆర్. 'మనవరాలి వయసున్న నటితో ప్రేమ సరాగాలు, సయ్యాటలు ఏమిటి'? అని విమర్శించిన వాళ్లే తెరపై ఈ జంటను చూసి ముగ్ధులయ్యారు, కాసుల వర్షం కురిపించారు. ఎన్.టి.ఆర్. నటజీవితాన్ని మలుపు తిప్పిన ఐదు చిత్రాల్లో నాలుగు సినిమాల్లో శ్రీదేవి హీరోయిన్ కావడం విశేషం. ఆ సక్సెస్‌లతోనే ఆమె బాలీవుడ్‌లో ఎంటరై నంబర్‌వన్ నాయికగా హిందీ చిత్రసీమలో మకుటంలేని మహారాణిగా జైత్రయాత్రను సాగించి దశాబ్దకాలంపాటు వెలుగొందింది. ఏ వయసు పాత్ర పోషించినా, అందులోకి ఒదిగిపోయి, హుషారుగా నటించగలగడం నిజంగా ఎన్.టి.ఆర్.కు వరమే. అందుకే ఆయన కారణజన్ములయ్యారు.

**చిత్రాల వివరాలు:** 1. వేటగాడు, 2. ఆటగాడు, 3. రౌడీరాముడు- కొంటెకృష్ణుడు, 4. సర్దార్ పాపారాయుడు, 5. గజదొంగ, 6. సత్యం- శివం, 7. అగ్గిరవ్వ, 8. కొండవీటి సింహం, 9. అనురాగదేవత, 10. జస్టిస్ చౌదరి, 11. బొబ్బిలిపులి, 12. వయ్యారి భామలు- వగలమారి భర్తలు.

## ఇతర కథానాయికలు

1. మంజుల ('వాడేవీడు, పల్లెటూరి చిన్నోడు, మనుషులంతా ఒక్కటే, మగాడు, నేరం నాదికాదు ఆకలిది, చాణక్య చంద్రగుప్త, మా ఇద్దరి కథ) 2. కాంచన ('డాక్టర్ ఆనంద్, కలిసొచ్చిన అదృష్టం, భలేమాస్టారు, అన్నదమ్ముల అనుబంధం') 3. ప్రభ



'చాణక్య చంద్రగుప్త'లో మంజులతో..

('దానవీరశూరకర్ణ, శ్రీమద్విరాటపర్వం, సింహం నవ్వింది, శ్రీమద్‌విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర'), 4. రతి ('ప్రేమ సింహాసనం, తిరుగులేని మనిషి, కలియుగ రాముడు'), 5. జయచిత్ర ('మాదైవం, బొబ్బిలిపులి'), 6. జయంతి ('కులగౌరవం', 'జగదేకవీరుని కథ, కొండవీటి సింహం'), 7. లక్ష్మి ('ఒకే కుటుంబం, బంగారు మనిషి'), 8. విజయనిర్మల ('మారిన మనిషి, పెత్తందార్లు'), 9. లత ('నిప్పులాంటి మనిషి, శృంగార రాముడు'), 10. సుజాత ('సర్కస్ రాముడు, మహా పురుషుడు'), 11. జూనియర్ శ్రీరంజని ('చంద్రహారం, ఉమాసుందరి, గౌరీ మహాత్మ్యం'), 12. మాలతి ('పాతాళభైరవి'), 13. పద్మిని ('అమ్మలక్కలు, విజయగౌరి'), 14.జి.వరలక్ష్మి ('మాయారంభ', 'పెళ్లిచేసి చూడు'), 15. వహిదా రెహమాన్ ('జయసింహ'), 16. సంధ్య ('మాయాబజార్, తెనాలి రామకృష్ణ'), 17. జయశ్రీ ('దైవబలం'), 18. పద్మప్రియ ('మంచికి మరో పేరు'), 19. సంగీత ('శ్రీరామ పట్టాభిషేకం'), 21. రాధా సలూజా, (ట్రైగర్), 22.రాధ ('చండ శాసనుడు'), 23. మీనాక్షి శేషాద్రి ('బ్రహ్మర్షి విశ్వామిత్ర'), 24. కుసుమ ('సంకల్పం'), 25. వాణీ విశ్వనాథ్ ('సమ్రాట్ అశోక'), 26. షీలా ('నేనే మొనగాణ్ణి').

■



ఎన్.టి.ఆర్.తో ఏకైక చిత్రంలో నటించిన కుసుమ (సంకల్పం)



ఎన్.టి.ఆర్.తో దేవీవరప్రసాద్

# 19 రోజుల్లో పూర్తయిన 'నాదేశం'

చివరి నిమిషం వరకూ డిమాండ్ తగ్గని సినీ కెరీర్ ఎన్.టి.ఆర్.ది. ఆయన రాజకీయ రంగప్రవేశం చేయనున్నారనే వార్త ఆర్టిస్ట్‌గా ఆయన క్రేజ్‌ని మరింత పెంచింది. నిర్మాతలు ఆయన కాల్షీట్లకోసం పోటీ పడ్డారు. అందరూ కావలసినవారే. వాళ్లంతా ఆయనతో ఇంతకుముందు సినిమాలు నిర్మించినవారే. ఎవరినీ కాదనలేని పరిస్థితి. అందుకే ఎన్.టి.ఆర్. ఒక ఉపాయం ఆలోచించి, ఒకరోజు తన సన్నిహితుడైన నిర్మాత దేవీవరప్రసాద్‌ని పిలిపించారు. ఆయన వెళ్లేసరికి రామారావు గదిలో మరో ఇద్దరు ఉన్నారు. దేవీవరప్రసాద్‌ని కూర్చోమని చెప్పి, 'నీతో పాటు ఈ ఇద్దరికీ సినిమా చేయాలి. విడివిడిగా కాల్షీట్లు ఇవ్వడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టం కనుక మీ ముగ్గురు కలిసి సినిమా చేసుకోండి' అని చెప్పారు. అలా ఆ ముగ్గురి నిర్మాతల (దేవీవరప్రసాద్, ఎస్.వెంకటరత్నం, కృష్ణంరాజు) కలయికలో ఎన్.టి.ఆర్. చివరి చిత్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టుకుంది. అయితే కృష్ణంరాజుతో నిర్మాణపరమైన విభేదాలు రావడంతో ఆయనకు కొంత డబ్బు ఇచ్చి, మిగిలిన ఇద్దరూ ప్రొసీడ్ అయ్యారు. పల్లవీ దేవీ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ చిత్ర నిర్మాణం ప్రారంభమైంది.

కాల్షీట్లు ఇచ్చేముందు ఎన్.టి.ఆర్. మరోమాట చెప్పారు... 'ఇవాళ ఒకటో తారీఖు. పదో తారీఖుకల్లా కథ తయారుకావాలి. 18 రోజుల్లో షూటింగ్ పూర్తి కావాలి. అలా చేసుకోలేకపోతే నేను మీకు మళ్లీ ఎప్పుడు దొరుకుతానో చెప్పలేను' అన్నారు. దాంతో ఈ నిర్మాతలలో టెన్షన్ మొదలైంది. పది రోజుల్లో కథ తయారవడం అసాధ్యం కనుక ఏదైనా రీమేక్ దొరుకుతుందేమో చూద్దామనుకున్నారు. ఆ సమయంలోనే అమితాబ్ నటించిన 'లావారిస్' చిత్రం విడుదలైంది. వెంటనే రామారావుకి ఆ సినిమా చూపించి ఆయన ఓకే అన్న తర్వాత రీ-మేక్ రైట్స్ తీసుకున్నారు.

1982లో రాజకీయాల్లోకి ప్రవేశించే చివరిక్షణంలో ఎన్.టి.ఆర్. అంగీకరించిన చిత్రం కావడంతో ప్రేక్షకుల్లోనూ ఆసక్తి ఏర్పడింది. ఎన్.టి.ఆర్. నటించే చివరి చిత్రం ఇదేనని, ఇకపై ఆయన నటించరంటూ జరిగిన ప్రచారం సినిమా క్రేజ్‌ని మరింత పెంచింది.

ఎన్.టి.ఆర్. కెరీర్ 'మనదేశం'తో మొదలైంది కనుక అందుకు తగ్గట్టుగా ఉండాలని ఆయన చివరి చిత్రానికి 'నాదేశం' అని పేరు నిర్ణయించారు.

ఈ చిత్రం షూటింగ్ 22జూలై 1982న రామకృష్ణా స్టూడియోలో మొదలయింది. ఎన్.టి.ఆర్.పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు ఆయన రెండో అల్లుడు

దగ్గుబాటి వెంకటేశ్వరరావు క్లాప్ నివ్వగా, హీరోయిన్ జయసుధ కెమెరా స్విచాన్ చేశారు.

అయితే సినిమా షూటింగ్ ప్రారంభం రోజున అనుకోని అవాంతరం వచ్చింది. ఆరోజు రామారావు మేకప్ వేసుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో వాళ్ల పెద్దబ్బాయి జయకృష్ణ వచ్చి 'మీరు ఈ సినిమా చెయ్యడమేమిటి? దీంతో మీకున్న పేరు పోతుంది. 'లావారిస్' ఫ్లాప్ సినిమా. ఈ సమయంలో మీరు ఈ సినిమా చెయ్యడం మాకు ఇష్టంలేదు' అని అభ్యంతరం చెప్పారు. దాంతో రామారావు మేకప్ వేసుకోవడం ఆపేసి ఆలోచనలో పడ్డారు. అవతల షూటింగ్‌కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్న నిర్మాతలు అయోమయంలో పడిపోయారు. మేకప్‌రూమ్‌లో రామారావు, బయట నిర్మాతలు... నరాలు తెగేంత ఉత్కంఠ. ఏమవుతుందోననే ఆందోళన.

ఓ గంటసేపు రామారావు ఏం ఆలోచించుకున్నారో ఏమో 'మేకప్' అన్నారు. ఆయన నోటి నుండి 'ప్యాకప్' అనేమాట వస్తుందేమోనని హడలిపోయిన నిర్మాతలు తేలికగా ఊపిరి పీల్చుకున్నారు.

అలా అనుమానాల మధ్య ప్రారంభమైన ఆ చిత్రం షూటింగ్ ఆ తర్వాత చకచకా సాగిపోయింది. షూటింగ్, డబ్బింగ్‌తో కలిసి 'నాదేశం' చిత్రానికి 25 రోజులు పనిచేశారు రామారావు. రోజుకి లక్ష రూపాయల చొప్పున ఎన్.టి.ఆర్.కు 25 లక్షల రూపాయలు పారితోషికంగా నిర్మాతలు చెల్లించారని అప్పట్లో చెప్పుకునేవారు. ఇది నిజంగా రికార్డే.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం ఎన్.టి.ఆర్. రాత్రింబవళ్లు శ్రమించి ఈ చిత్ర నిర్మాణం పూర్తి కావడానికి ఎంతో సహకరించారు. ఉదయం 4 గంటల నుండి 9 గంటల వరకూ పార్టీ పనులు, 9 గంటల నుండి 6 గంటల వరకూ షూటింగ్. మళ్లీ రాత్రి 11 గంటలవరకూ పార్టీ పనులు చూసుకుంటూ ఎన్.టి.ఆర్. రికార్డ్ స్థాయిలో ఈ చిత్రాన్ని పూర్తిచేశారు.

భాగ్యనగర్ స్టూడియోలో, రామకృష్ణా స్టూడియోలో ఈ సినిమాకోసం భారీ సెట్స్ వేయడమే కాకుండా వేగంగా పూర్తిచేయడం కోసం ముషీరాబాద్‌లోని ఒక టింబర్ డిపోలో కూడా సెట్‌వేసి షూటింగ్ జరిపారు.




### ఐదు రోజుల్లో మూడు పాటలు

ఎన్.టి.ఆర్. వంటి అగ్ర కథానాయకుడు నటించే చిత్రం షూటింగ్ కేవలం 19 రోజులలో పూర్తికావడం కూడా ఒక రికార్డే. అలాగని క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీపడలేదు నిర్మాతలు. ఫిలిం చుట్టెయ్యలేదు. టాకీపార్ట్‌ని హైదరాబాద్‌లో, పాటలను ఊటీలో చిత్రీకరించారు. 5 రోజుల్లో మూడు పాటలను తీయడం

ఒక విశేషం. చిత్రంలోని ఆరు పాటలను వేటూరి రెండు రోజుల్లో రాస్తే, వాటిని అయిదు రోజుల్లో రికార్డ్ చేసి సంగీత దర్శకుడు చక్రవర్తి సంచలనం సృష్టించారు.

ఆ రోజుల్లో ఎన్.టి.ఆర్. ఏ చిత్రానికైనా ఒక రోజులో డబ్బింగ్ పూర్తిచేసేవారు. కానీ 'నాదేశం' రష్ చూసిన తర్వాత కొన్ని ముఖ్యమైన సన్నివేశాలకు డబ్బింగ్ చెప్పడానికి మరో పూట అదనంగా టైమ్ తీసుకున్నారు.

ఈ చిత్ర నిర్మాణ సమయంలో జరిగిన ఒక సంఘటన గురించి రచయితల్లో ఒకరైన పరుచూరి గోపాలకృష్ణ ఇలా వివరించారు. "అన్నగారు 'నాదేశం' షూటింగ్ సమయానికి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఒక రోజు షూటింగ్‌కి నిజామాబాద్ నుండి వచ్చారు. అసలు గొంతు బయటకు రావడమే లేదు. దర్శకుడు బాపయ్యగారు దగ్గరగావెళ్లి 'అన్నగారూ.. గొంతు అసలు వినిపించడంలేదు. ఎనిమిది వందల అడుగుల సీన్ ఇది. రేపు డబ్బింగ్ చెప్పేటప్పుడు ప్రాబ్లం అవుతుంది. షూటింగ్ క్యాన్సిల్ చేద్దాం' అంటే, నవ్వి 'అక్కర్లేదు.. బ్రదర్ డైలాగ్ చదువుతారు, నేను లిప్ మూమెంట్ ఇస్తా' అని నన్ను చూపించారు. నా గుండె ఝల్లుమంది. పాటకు లిప్పు ఇచ్చినట్లు మాటకు లిప్పిస్తానంటున్నారు. బాపయ్యగారు అనుమానంగా చూశారు. 'వారిదీ, మాదీ ఒకే డిక్షన్, నో ప్రాబ్లమ్ బ్రదర్ కానివ్వండి' అని మెల్లగా చెప్పారు. తెల్లవార్లూ నేను చదువుతూనే ఉన్నాను. ఆయన డైలాగ్‌కి లిప్ ఇస్తూ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూనే ఉన్నారు. డబ్బింగ్‌లో కూడా ఎలాంటి ఇబ్బంది ఎదురు కాలేదు".


'నాదేశం'లో ఎన్.టి.ఆర్., జయసుధ

జయసుధ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, జగ్గయ్య, జమున, అల్లు రామలింగయ్య, గిరిబాబు, రాజ్యలక్ష్మి, శివకృష్ణ, రోహిణి, కృష్ణవేణి, పి.ఎల్.నారాయణ తదితరులు నటించారు. సిల్క్‌స్మిత ఒక నృత్య సన్నివేశంలో కనిపిస్తుంది.

**సాంకేతిక నిపుణులు:** మాటలు: పరుచూరి బ్రదర్స్; పాటలు: వేటూరి; సంగీతం: చక్రవర్తి; ఫొటోగ్రఫీ: ఎస్.వెంకటరత్నం; నృత్యాలు: సలీం; ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు; నిర్మాతలు: ఎస్.వెంకటరత్నం, కె.దేవీవరప్రసాద్; దర్శకత్వం: కె.బాపయ్య.

**విడుదల: 1982 అక్టోబర్ 27**



ఎన్.టి.ఆర్.కు మేకప్ వేస్తున్న పీతాంబరం

# ఎన్.టి.ఆర్. సెంటిమెంట్

మద్రాసులో ఆనాటి మేకప్‌కళకు పితామహుడు హరిబాబు. ప్రముఖ నటీనటులంతా హరిబాబుతో మేకప్ చేయించుకోవడానికి ఇంకా పూర్తిగా తెల్లవారకముందే ఆయన ఇంటికెళ్లి క్యూలో నిలబడేవారు. ఆ శాఖకు అంతగౌరవం ఉండేది. ఎన్.టి.ఆర్. ప్రారంభంలో అలా లైన్‌లోనిలబడి మేకప్ చేయించుకునేవారు. హీరోగా ఎదిగిన అనంతరం పర్సనల్ మేకప్ మన్‌ని నియమించుకుని ఇంట్లోనే మేకప్‌రూమ్ ఏర్పాటు చేసుకుని మేకప్‌తో స్టూడియోలకు వెళ్లేవారు రామారావు. ఆయన పర్సనల్ మేకప్‌మన్ పీతాంబరం. (ఈయన తనయుడే దర్శకుడు పి.వాసు) 30ఏళ్ల అనుబంధం, 200 చిత్రాల వృత్తి సంబంధం వీరిద్దరిది.

తన గురువు హరిబాబు దీవెనలతో 'షావుకారు' (1950) చిత్రానికి మేకప్‌మన్‌గా పూర్తి హోదాలో పని చేశారు పీతాంబరం. ఆ సినిమాతో ఎన్.టి.ఆర్., పీతాంబరం మధ్య ప్రారంభమైన వృత్తి సంబంధం 30 ఏళ్ల పాటు ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా కొనసాగింది. అంతేకాదు ఎన్.టి.ఆర్. ఆశీస్సులతో పీతాంబరం నిర్మాతగా మారి 'అన్నదమ్ముల అనుబంధం' (1975) చిత్రాన్ని నిర్మించారు. 'తాతమ్మకల'తో నటునిగా పరిచయమైన బాలకృష్ణ ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్.కు తమ్మునిగా నటించారు. ఎన్.టి.ఆర్‌ని రాముడుగా, కృష్ణునిగా తీర్చిదిద్దడానికి పీతాంబరం రెండు గంటలు కష్టపడితే తన నటనతో, ఆ పురాణ పురుషుల పాత్రలకు సజీవ రూపకల్పన చేశారు ఎన్.టి.ఆర్. తన వయసుకు మూడు రెట్లు వయసుగల భీష్ముని పాత్ర గెటప్ రామారావు సహకారం లేకపోతే అంత బాగా వచ్చేది కాదని పీతాంబరం చెప్పేవారు.

పౌరాణికాలే కాదు. అటు సాంఘికాలు, ఇటు జానపదాలు, చారిత్రక పాత్రలు... ఇలా విభిన్నపాత్రల్లో ఎన్.టి.ఆర్. జీవించారంటే, ఆ విజయాల్లో కొంతభాగం రూపశిల్పిగా పీతాంబరానికి కూడా దక్కుతుంది.

పీతాంబరం తర్వాత ఎన్.టి.ఆర్.కు మేకప్ చేసే అవకాశం దక్కించుకున్న వ్యక్తి కె.వి.శేఖర్. (ఈయన ఆపై బాలకృష్ణకు పర్సనల్ మేకప్‌మన్‌గా కూడా పనిచేశారు)



ఎన్.టి.ఆర్.కు మేకప్ చేస్తున్న కె.వి.శేఖర్

ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకల్లా అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని మేకప్‌కి కూర్చునేవారు రామారావు. హృదయపూర్వకంగా ఆ భగవంతునికి నమస్కరించిన అనంతరం మేకప్ చేయించుకోవడం ఆయన అలవాటు, సెంటిమెంట్ కూడా. 'నాదేశం' చిత్రానికి పని చేస్తున్న రోజుల్లో చివరి రోజు షూటింగ్‌కి తయారవుతూ.. "ప్రజా సేవలోకి వెళుతున్నాం బ్రదర్... మళ్లీ ఇలా మేకప్ వేసుకునే అవకాశం వస్తుందో, రాదో... ఈ జ్ఞాపకం చిరస్థాయిగా ఉండాలి' అని ఫొటోగ్రాఫర్‌ని పిలిచి స్టిల్ తీయించారు. ఆ స్టిల్ ఇదే.

# నెహ్రూని ఆశ్చర్యపరచిన ఎన్.టి.ఆర్.



మన దేశానికి స్వాతంత్ర్యం రాని రోజులవి. తెల్లదొరలు కనిపిస్తే చాలు భారత ప్రజలు భగ్గుమని 'క్విట్ ఇండియా' అంటున్న రోజులవి. వయోభేదంలేకుండా స్వాతంత్ర్య సముపార్జన కోసం భారతీయులు నడుంబిగించి తెల్లదొరలను మనదేశం నుంచి పారద్రోలడానికి గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తోన్న రోజులవి.

ఆ పరిస్థితుల్లో... గుంటూరు పట్టణంలో ఉన్న ఎ.సి.కాలేజీలో ఓ వింత సంఘటన జరిగింది. అదేమంటే... ఆ రోజుల్లో గుంటూరు ఎ.సి.కాలేజీ పాలకవర్గం అంతా యూరోపియన్స్ వారిదే. స్టూడెంట్లు మాత్రం భారతీయులు. పర్యవసానంగా పాలకవర్గానికీ, విద్యార్థులకు మధ్య సంఘర్షణలు జరగడం మొదలయ్యాయి.

ఆకారణంగా... గుంటూరు ఎ.సి.కాలేజి పాలకవర్గమైన యూరోపియన్లకూ, భారతీయులైన విద్యార్థులకూ మధ్య శాంతియుత సమన్వయం కుదర్చడానికి గాంధీజీ అనుచరుడైన జవహర్‌లాల్ నెహ్రూ ఆ కాలేజీకి రావడం తటస్థించింది. ఆ సందర్భంగా ఏర్పాటుచేసిన కళాశాల సభావేదికపై అధ్యాపక బృందం ఆశీనులై ఉన్నారు. నెహ్రూగారి ఉపన్యాసం అద్భుతంగా కొనసాగుతోంది.

ఇసుకవేస్తే రాలనంత విద్యార్థి జనసందోహం! సూది పడితే వినపడేంత నిశ్శబ్దం!

సామరస్యధోరణి ప్రతిబింబించే 'చాచాజీ' భావోద్వేగపూరిత ఉపన్యాసాన్ని అందరూ ఆసక్తిగా వింటున్నారు. సరిగ్గా ఆ సమయంలో నెహ్రూని ఆశ్చర్యపరిచే దృశ్యం ఒకటి ఆయన కళ్లపడింది.

ప్రేక్షకుల మధ్యలోంచి భుజాన కండువాతో, చేతికర్ర ఆసరాతో 'మహాత్మాగాంధీ' చకచకా నడుచుకుంటూ వేదికపైకి రాసాగారు.

ఉపన్యాసధోరణిలో మునిగి ఉన్న నెహ్రూ- గాంధీజీని చూడడంతోటే ఆశ్చర్యపోయి "బాపూజీ! మీరిక్కడికెలా వచ్చారు...? పైకిరండి!" అంటూ ఎదురేగి సాదరంగా గాంధీజీని వైదికపైకి ఆహ్వానం పలికారు.

ప్రేక్షక జనాల్లో గొప్ప అలజడి! ఆ వచ్చింది 'నిజమైన గాంధీజీకాద'ని గుర్తుపట్టిన ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నెహ్రూతో- "క్షమించాలి నెహ్రూజీ.. ఆయన నిజమైన గాంధీ కాదు. మా కాలేజిలోనే చదువుతున్న బి.ఎ.విద్యార్థి అతను. విచిత్రవేషధారణ అంటే అతనికి ఎక్కువ మక్కువ" అని వివరించి చెప్పగా...

నెహ్రూ ఆశ్చర్యపోయి.. ఆహూతులైన సభికుల మధ్య, వేలాది ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య- "మహాత్మాగాంధీజీ వేషంలో వచ్చి నన్ను కూడా సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తిన ఇతనికి సువర్ణపతకాన్ని బహుమానంగా ప్రకటిస్తున్నాను" అని చెప్పి ఆయన ఢిల్లీవెళ్లాక ఆ బంగారు పతకాన్ని పంపారు.

ఇంతకీ ఆ బంగారు పతకాన్ని నెహ్రూద్వారా బహుమతిగా స్వీకరించిన ఆ గాంధీ వేషధారి మరెవరో కాదు... అక్షరాలా ఎన్.టి.రామారావే! ఎన్.టి.ఆర్.తో కలిసి చదువుకున్న ఒకప్పటి ఆయన మిత్రులు సి.వి.సుబ్రహ్మణ్యం ఈ విషయం గురించి ఓ సందర్భంలో "ఈ సంఘటన ఎన్.టి.ఆర్. గుంటూరు ఎ.సి.కాలేజీలో బి.ఎ. చదువుతోన్న రోజుల్లో జరిగింది. ఆ రోజుల్లో రామారావు విచిత్ర వేషాలు ఎక్కువగా వేస్తుండేవారు. 'దారినపోయే దానయ్య' ఆయన వేసే నాటకాల్లో ముఖ్యమైనది" అని చెప్పారు.

■

# తమ్ముళ్లకు తోడుగా... నీడగా...

తెరమీద 'ధీరోదాత్త' పాత్రలు పోషించడమే కాదు, తెలుగు ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు 'హీరోదాత్తం'గా ముందుకు వచ్చి ఆదుకునేవారు ఎన్.టి.ఆర్. కరవు, అనావృష్టి, వరదలు, తుపానులు వంటి ప్రకృతి బీభత్సాలు సంభవించినప్పుడు అంతటి వెండితెర వేలుపు వీధుల్లోకి వచ్చి జోలెపట్టి విరాళాలు సేకరించేవారు. అలా 'ఆర్టిస్టు'నే కాదు 'హార్టిస్టు'ను కూడా అని నిరూపించుకున్నారు ఎన్.టి.ఆర్. ఆ వివరాలు...



నిధి వసూలు కార్యక్రమంలో పాల్గొన్న నటీ నటులతో ఎన్.టి.ఆర్.



# మా దైవం

'భగవద్గీత'లో శ్రీకృష్ణభగవానుడు అంటాడు. అనేక వేలమంది మానవుల్లో ఎవడో ఒక్కడే జ్ఞానసిద్ధికై ప్రయత్నిస్తాడు. అందులో కూడా మళ్లీ ఒక్కడే పరమాత్మను తెలుసుకో గలుగుతాడు' అని. అలాగే వేలాదిమంది కళా కారుల్లో ఎవరో కొద్దిమంది మాత్రమే మానవ సేవ, దేశ సేవ చెయ్యడానికి ఉద్యుక్తులౌతారు. వాళ్లలోకూడా ఏ ఒక్కరో ఇద్దరో మాత్రం తమ కార్యాచరణలో కృతకృత్యులవుతారు. ఎన్.టి. ఆర్.కి మాత్రమే వర్తించే విషయమిది. తనని నిండుమనిషిగా ఆదరించిన తెలుగువారంటే పులకరించిపోయేవారు ఎన్.టి.ఆర్. తను రాజ కీయాల్లో ప్రవేశించడానికి చాలా ముందుగానే ప్రజా హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించు కున్నారాయన. వారికి ఎటువంటి కష్టం వాటిల్లినా తల్లడిల్లేవారు. క్షామం, తుపానుల సందర్భంగా నిధుల సేకరణకు నడుంబిగించిన తొలి తెలుగు సినీనటుడు ఎన్.టి.ఆర్.

### రాయలసీమ క్షామ నివారణ నిధి

రాయలసీమలో ప్రజలు అన్నార్తులై హాహాకారాలు చేస్తున్న తరుణమది. పత్రికల్లో ఈ వార్త చదివి చలించి పోయిన ఎన్.టి.ఆర్. వారిని ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. అప్పటికి నటునిగా ఆయన వయసు ఎనిమిది సినిమాలే. అయితేనేం ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు.

'రాయలసీమ క్షామ నివారణ నిధి'కి నాటకాల ద్వారా డబ్బు సేకరించనున్నట్లు 1952 ఏప్రిల్ 11 నాటి ఆంధ్రప్రభలో ఎన్.టి.ఆర్. ఇచ్చిన ప్రకటన మిగిలిన ఆర్టిస్టుల్లో కూడా కదలిక తెచ్చింది. మేం కూడా మీకు తోడుగా వస్తామని ఎన్.టి.ఆర్.తో చేతులు కలిపారు జి.వరలక్ష్మి, గుమ్మడి, పేకేటి శివరాం, బాలకృష్ణ దర్శ



అగ్నిమాపక బాధితులకు లక్షరూపాయలు విరాళం అందజేసిన ఎన్.టి.ఆర్.కు సినీ ప్రముఖులు సత్కారం

కుడు వి.మధుసూదనరావు భార్య సరోజిని తదితరులు.

అంజలీ పిక్చర్స్ తరపున అంజలీదేవి, రాజ్యం పిక్చర్స్ తరపున లక్ష్మీరాజ్యం రామారావుకు నైతిక మద్దతు ప్రకటించి పర్యటన కోసం ఉచితంగా వ్యాన్లు ఇచ్చారు. దోనేపూడి కృష్ణమూర్తి వ్యాన్ మరొకటి. జి.వరలక్ష్మి తన కారులో బయలు దేరారు.

ఈ పర్యటనలో రెండు నాటకాలను ప్రదర్శించాలని ఈ బృందం నిర్ణయించుకుంది. గోకుల్‌చంద్ రాసిన 'కరవురోజులు', బుచ్చిబాబు రచించిన 'దారినపోయే దానయ్య' నాటికలను ఎన్నుకున్నారు. 'కరవు రోజులు' నాటకంలో రామారావు, వరలక్ష్మి, గుమ్మడి, పుండరీకాక్షయ్య, బేబీ వీణ నటించేవారు. ఆ తర్వాత గాయకుడు ఎం.ఎస్ రామారావు ఆధ్వర్యంలో అర గంటసేపు సంగీత విభావరి జరిగేది. ఆ సమయంలో రామారావు, వరలక్ష్మి ప్రేక్షకులలోకి వెళ్లి జోలె పట్టే




వారు. పేకేటి, బాలకృష్ణ, పుండరీకాక్షయ్య, సరోజిని, కమలాదేవి పాల్గొన్న 'దారినపోయే దానయ్య' నాటిక ప్రదర్శించేవారు. సాయంత్రం ఏడు గంటలకు మొదలయ్యే సాంస్కృతిక ప్రదర్శనలు పది గంటలకు ముగిసేవి.

అలా గూడురులో ప్రారంభించి నెల్లూరు, చీరాల, గుంటూరు, తెనాలి, విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం, భీమవరం, తణుకు, కొవ్వూరు, రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ తదితర ప్రాంతాల్లో దాదాపు 24 రోజులపాటు పర్యటించి లక్ష రూపాయలు వసూలు చేశారు. (60 ఏళ్లనాటి సంగతి ఇది. ఇప్పుడు ఆ మొత్తం కోట్ల రూపాయలతో సమానం) రాయలసీమ క్షామ నివారణకోసం రామకృష్ణ మఠం ద్వారా ఈ డబ్బుని ఖర్చు చేయమని చెప్పి 'ఆంధ్ర ప్రభ' సంపాదకుడు నార్ల



పోలీసు కుటుంబాల సహాయనిధి సేకరణలో
ఎన్.టి.ఆర్.తో పాల్గొన్న సినీ ప్రముఖులు

వెంకటేశ్వరరావుకి అందజేశారు రామారావు. ఈ పర్యటనతో ఆయన రాయలసీమ ప్రజలకు దేవుడై పోయారు.

ఈ సందర్భంగా జరిగిన ఓ సంఘటనని కూడా ఇక్కడ చెప్పాలి. రాయలసీమలోని కరవుబాధితులను ఆదుకోవడం కోసం భిక్షాటన చేసిన సమయంలో ఎన్.టి.ఆర్. విజయావారి కాంట్రాక్ట్‌లోనే ఉన్నారు. 'చంద్రహారం' చిత్రం షూటింగ్ జరుగుతున్న రోజులవి. మధ్యలో కొన్ని రోజులు గ్యాప్ రావడంతో ఆయన ఈ కార్యక్రమం పెట్టుకున్నారు. లక్ష రూపాయలు పోగు చేయడంతో చెన్నైలోని వాణీమహల్‌లో ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి విజయాధినేతల్లో ఒకరైన నాగిరెడ్డి చేతుల మీదుగా ఈ మొత్తాన్ని ప్రభుత్వానికి అందజేయాలని రామారావు ఆలోచన. ఈ విషయం నాగిరెడ్డికి చెప్పి ఆయన అంగీకారం కోసం ఎన్.టి.ఆర్. అడగ్గానే ఆయన తీవ్రస్వరంతో 'ఎవరి అనుమతి తీసుకుని మీరు ప్రదర్శనలివ్వడానికి వెళ్లారు?' అని ప్రశ్నించారు. దాంతో ఎన్.టి.ఆర్.కు కూడా కోపం వచ్చి 'బిచ్చమెత్తుకోవడానికి కూడా అనుమతి అవసరమైన మీ ఉద్యోగం నాకు అవసరం లేదు' అని చెప్పేసి తన రూమ్‌కి వెళ్లిపోయారు. ఈ సంఘటన తర్వాత షూటింగ్‌కు రమ్మని విజయావారు ఎన్.టి.ఆర్.కు కబురు చేయలేదు. ఎల్.వి.ప్రసాద్ వచ్చి నచ్చచెప్పడంతో రామారావు వాహినీ స్టూడియోకు వెళ్లారు. అక్కడ నాగిరెడ్డి ఆయన్ని రిసీవ్ చేసుకున్నారు. ఇక ఎలాంటి అడ్డంకులు లేకుండా 'చంద్రహారం' షూటింగ్ సాగింది.

**జాతీయ రక్షణ నిధికి...**

ఇలా ప్రజాహిత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన రామారావు ఆ తర్వాత చైనా దురాక్రమణ సమయంలో, 1965 నాటి ఇండోపాక్ యుద్ధ సమయంలో జాతీయ రక్షణ నిధికోసం 8 లక్షల రూపాయలు సేకరించి నాటి ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రికి అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజారక్షణ కమిటీ సహాయంతో మే 16,17,18 తేదీల్లో విజయవాడ, హైదరాబాద్, కర్నూలు



నగరాలలో ఎన్.టి.ఆర్. సారథ్యంలో నటీనటులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ఎనిమిది లక్షల రూపాయలు సేకరించి జాతీయ రక్షణనిధికి విరాళంగా ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహణ బాధ్యత వహించిన ఎన్.టి.ఆర్. సదస్సులకు స్వాగతం పలికిన అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగేవి. ఈ సందర్భంగా పాలగుమ్మి పద్మరాజు రాసిన 'అజ్ఞాతవీరులు' నాటికలో ఎస్.వి.రంగారావు, జగ్గయ్య, సావిత్రి, కన్నాంబ పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన 'రక్తతర్పణ' నాటికలో జగ్గయ్య, గుమ్మడి, పద్మనాభం, జమున, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు. ఈ నాటికను జగ్గయ్య రాయడం విశేషం. అలాగే 'దొంగాటకం' నాటికను విశ్వనాథ కవిరాజు రాయగా రేలంగి, పేకేటి, గిరిజ ప్రదర్శించారు. అదే విధంగా 'దేశభక్తి' నాటికలో కాంతారావు, రాజనాల, సత్యనారాయణ, కొమ్మినేని శేషగిరిరావు పాల్గొన్నారు.

ఇవే కాకుండా రాజసులోచన ప్రదర్శించిన నృత్యం, రమణారెడ్డి మ్యాజిక్ ప్రదర్శన, ఘంటసాల, రఘు రామయ్య పాటకచేరి ప్రేక్షకులను అలరించాయి.

చిత్ర పరిశ్రమలోని నటీనటుల ఐక్యతకు అద్దం పడుతూ నాలుగు గంటలసేపు ప్రదర్శించిన ఈ సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో విజయవంత మయ్యాయి. ఈ సందర్భంగా నటీనటులను అభినందించారు ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి.

**రంగస్థలంపై శ్రీకృష్ణ పాత్ర**

ఇవన్నీ ఒక ఎత్తయితే 1969లో తుపాను బీభత్సానికి గురై తెలుగు సోదరులు అల్లాడుతూ ఉంటే వారిని ఆదుకునేందుకు జులై 14 నుండి వారం రోజులపాటు ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు ప్రాంతాల్లో 'భిక్షా యాత్ర'ను నిర్వహించి 6 లక్షల రూపాయలు సేకరించారు రామారావు. రెండు బస్సులు, 14 కార్లలో నటీనట బృందం ప్రయాణించారు. ఎవరు ఏ కార్లో ఎక్కడ కూర్చున్నారో తిరిగి అదేకార్లో అక్కడే కూర్చుని టూర్ అంతా అయ్యాక ఇల్లు చేరాలి. ఎన్.టి.ఆర్. సారథ్యంలో



అక్కినేని, పి.పుల్లయ్య, ఎస్.వి.రంగారావు, నీలం సంజీవరెడ్డి, ఘంటసాల, ఎన్.టి.ఆర్.

అంత క్రమశిక్షణగా మెలిగేవారు తారలంతా.

ఈ 'భిక్షాయాత్ర' సజావుగా సాగడానికి ఎన్.టి.ఆర్. వివిధ కమిటీలు వేశారు. ప్రముఖ నిర్మాతలు ఈ కమిటీలకు సారథ్యం వహించడం విశేషం. మద్రాసు వసూళ్లు, ఏర్పాట్లను యు.విశ్వేశ్వరరావు చూసేవారు. వసూలైన మొత్తాన్ని పర్యవేక్షించే బాధ్యత విఠలాచార్య, భావనారాయణ, ట్రాన్స్‌పోర్టు వ్యవహారాలను పర్వతనేని గంగాధరరావు, భోజన- వసతి విషయాలను తోట సీతారామస్వామి, ఎం.జగన్నాథరావు, పింజల సుబ్బారావు, స్టేజ్ ప్రోగ్రామ్స్ ఇన్‌చార్జిగా పుండరీకాక్షయ్య, వ్యాఖ్యాతగా సి.ఎస్.రావు... వీళ్లందరికి సలహాలు, సూచనలు ఇచ్చే బాధ్యతను డి.వి.ఎస్.రాజు, త్రివిక్రమరావు స్వీకరించేవారు. వీళ్లందరికంటే ఒకరోజు ముందు వెళ్లి ప్రోగ్రామ్‌కి అవసరమైన స్టేజీ, లైటింగ్, మైక్ ఏర్పాట్లు డి.ఎల్.నారాయణ చేసేవారు.

వారంరోజులు జరిగిన ఈ 'భిక్షాయాత్ర'లో జగ్గయ్య, కాంతారావు, ధూళిపాళ, ప్రభాకరరెడ్డి, రేలంగి, చంద్రమోహన్, మిక్కిలినేని, సావిత్రి, దేవిక, ఛాయాదేవి, అనిత, రాజసులోచన, జగ్గారావు, రామచంద్రరావు, పేకేటి తదితరులు పాల్గొన్నారు. ఆర్టిస్టులు, ఇతరులు అంతా కలిపి మొత్తం 180మంది ఎన్.టి.ఆర్. వెంట ఆనాడు నడిచారు.

ఈ 'భిక్షాయాత్ర' జరిగే నాటికి ఎన్.టి.ఆర్. పాపులర్ హీరో మాత్రమే కాదు, పురాణ పాత్రలతో జనం గుండెల్లో గూడుకట్టుకున్న దేవుడూ అయ్యారు. జనంలో ఆయనపట్ల ఉన్న అభిమానం, ఆరాధన ఈ యాత్రలో స్పష్టంగా కనిపించాయి. ఎన్.టి.ఆర్.ని చూడటానికే కాదు ఆయనకు విరాళాలు ఇవ్వడానికి కూడా జనం పోటీ పడ్డారు.

ఘంటసాల పాట కచేరి ఈ కార్యక్రమంలో ఒక ముఖ్యాంశమైతే తొలిసారిగా ఎన్.టి.ఆర్. రంగస్థలంపై కృష్ణునిగా కనిపించి, నటించిన 'శ్రీకృష్ణ తులాభారం'

నాటకం మరో ముఖ్యాంశం. సముద్రాల జూనియర్ ప్రత్యేకంగా రాసిన ఈ నాటకంలో సత్యభామగా సావిత్రి, రుక్మిణిగా దేవిక, నారదునిగా కాంతారావు, వసంతకునిగా రేలంగి నటించారు.

జులై 26న చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి ఆరు లక్షల రూపాయల చెక్కును అందజేశారు ఎన్.టి.ఆర్.

**ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్**

1977లో కృష్ణాజిల్లాలోని దివిసీమ ఉప్పెనవల్ల చరిత్రలో కనీవిని ఎరుగని ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగింది. అప్పుడు మళ్లీ ఎన్.టి.ఆర్. నడుంబిగించారు. ఈసారి అక్కినేని నాగేశ్వరరావు ఆయనతో చేతులు కలిపారు. ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. ఫ్లడ్‌రిలీఫ్ ఫండ్ కమిటీ ఆధ్వర్యంలో భిక్షాటన చేశారు. వినోద కార్యక్రమాలు ప్రదర్శించారు.

1978 డిసెంబర్ 14న తిరుపతిలో ప్రారంభించి కడప, కర్నూలు, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, వైజాగ్‌లో పర్యటించి హైదరాబాద్‌తో ముగించారు. పగలంతా వీధుల్లో తిరుగుతూ జోలెపట్టి భిక్షాటన చేసి అలసిపోయిన తారలు తిరిగి రాత్రిళ్లు వినోద కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఎన్.టి.ఆర్., కాంతారావు, జయప్రద పాల్గొన్న 'శ్రీకృష్ణ తులాభారం', ఎ.ఎన్.ఆర్., జయసుధ పాల్గొన్న సాంఘిక నాటకం ప్రేక్షకుల్ని అలరించేవి. వందకి పైగా కళాకారులు, సాంకేతిక నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 15 లక్షల రూపాయలు వసూలు చేశారు. ఈ పర్యటనతో జనంలో ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. పట్ల అభిమానం రెట్టింపు అయ్యింది.



# 'తాతమ్మకల' కథ



**మహానటుడు ఎన్.టి.రామారావు నిర్మించిన చిత్రాల్లో 'తాతమ్మకల'కున్న ప్రత్యేకతే వేరు. ఈ సినిమా ముగింపును రెండుసార్లు మార్చి, రెండుసార్లు విడుదల చేయడం ఒక విశేషమైతే, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా, కుటుంబ నియంత్రణని వ్యతిరేకించిన ఈ చిత్రానికి 'ఉత్తమ కథ'గా నంది అవార్డు రావడం మరో విశేషం.**

ఈ చిత్రానికి కథారచయిత డి.వి.నరసరాజు. ఇందులో 'తాతమ్మ' పాత్రను ఎవరు పోషించేది ముందే చెబితే ఆ ఆర్టిస్టును దృష్టిలో పెట్టుకుని డైలాగులు రాయవచ్చని కథా చర్చల సమయంలో నరసరాజు అనగానే 'ఆర్టిస్టు వేరే ఎవరున్నారు? ఈ పాత్రకు తగిన ఆర్టిస్టు భానుమతిగారు ఒక్కరే. ఆమెని దృష్టిలో పెట్టుకుని రాయండి, ఆమెతో నేను మాట్లాడుతాను' అన్నారు ఎన్.టి.ఆర్.

ఆ సమయంలో భానుమతి భరణీ బేనరుపై 'అమ్మాయి పెళ్లి' చిత్రం నిర్మించే సన్నాహాల్లో ఉన్నారు. అది కన్నడ చిత్రం రీమేక్. దానికి కూడా నరసరాజే రచయిత. భార్యాభర్తలకు సంబంధించిన కథ అది. ఇద్దరికీ సమానమైన ప్రాధాన్యం ఉంది సినిమాలో. మరి భానుమతి భర్తగా ఎవరు నటించాలి? అప్పట్లో చక్రపాణిగారు 'నీ భర్తగా రామారావు తప్ప ఇంకెవరు చేసినా జనం చూడరు' అని భానుమతితో అంటుండేవారట. భానుమతి కూడా ఆ పాత్రను ఎన్.టి.ఆర్. చేస్తేనే బాగుంటుందని నిర్ణయానికి వచ్చారు. కానీ ఎన్.టి.ఆర్. బిజీ హీరో కావడంతో కాల్షీట్లు దొరుకుతాయో, లేదోనని సందేహిస్తుంటే ఒకసారి అడిగి చూడటంలో తప్పులేదని సలహా ఇచ్చారు నరసరాజు. అప్పుడే 'తాతమ్మకల' ప్రస్తావన వచ్చింది వారిద్దరి మధ్య. 'ఆ చిత్రంలో తాతమ్మ వేషం ఉంది వేస్తారా!' అనడిగారు నరసరాజు. 'రామారావు గారు తాతయ్య వేషం వేస్తే ఆ వేషం వేయడానికి నాకేం అభ్యంతరం లేదు' అని వెంటనే అన్నారు భానుమతి. ఆ




మర్నాడు ఎన్.టి.ఆర్. దగ్గరకి వెళ్ళినప్పుడు ఈ విషయం చెప్పారు నరసరాజు. 'ఆమె అడిగింది న్యాయమే కదా' అని ఒక్క క్షణం ఆలోచించి 'ఆల్‌రైట్, తాతయ్య వేషం సృష్టిద్దాం. అది కూడా నేనే వేస్తాను. కథలో మార్పులు పెద్దగా లేకుండా ఆమె భర్త వైరాగ్యంతో ఎప్పుడో సన్యాసుల్లో చేరారని చెబ్దాం. మధ్యలో ఎక్కడైనా తాతయ్య- తాతమ్మల మధ్య ఫ్లాష్‌బ్యాక్‌లో రెండు సీన్లు పెడతాం' అన్నారు ఎన్.టి.ఆర్. ఈ చిత్రం రీషూట్ చేసినప్పుడు ఎన్.టి.ఆర్., భానుమతి మధ్య మరికొన్ని సన్నివేశాలు జతచేసి చిత్రీకరించారు.

అలా ఆ సినిమాకు ఒక రూపం ఏర్పడింది. తన సినిమా 'అమ్మాయిపెళ్లి'లో వేషం వెయ్యమని భానుమతి ఎన్.టి.ఆర్. ఇంటికి వెళ్లి అడిగిన వెంటనే ఆయన అంగీకరిస్తూ, 'తాతమ్మకల'లో తాతమ్మగా నటించమని ఆమెని అడిగారు. ఉభయుల అంగీకారంతో 'తాతమ్మకల', 'అమ్మాయిపెళ్లి' చిత్రాల షూటింగ్‌కు మార్గం సుగమం అయింది.

భానుమతికి పారితోషికం ఎంత ఇవ్వాలనే విషయంలో మళ్ళీ మీమాంస ఎదురైంది. ఎన్.టి.ఆర్. తీసుకుంటున్న పారితోషికంలో అయిదువేలు తగ్గించి ఇవ్వమని భానుమతి చెప్పడంతో ఆ సమస్య తీరింది. రైతాంగ సమస్యలను చర్చించిన ఈ చిత్రంలో హరికృష్ణ, బాలకృష్ణ కూడా నటించారు. బాలకృష్ణ నటించిన తొలి సినిమా ఇదే. ఇందులో ఎన్.టి.ఆర్. ద్విపాత్రాభినయం చేశారు.

ఈ సినిమా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దుమారం రేపింది. భూసంస్కరణలు, కుటుంబ నియంత్రణలకు వ్యతిరేక ధోరణి కనబడింది, వినబడింది. ఈ సినిమా గురించి అసెంబ్లీలో వాడిగా వేడిగా చర్చ జరిగింది. రెండు నెలలు సినిమా ప్రదర్శనని ప్రభుత్వం నిషేధించింది. ఈ విషయమై ఎన్.టి.ఆర్ వివరణ ఇస్తూ.. "భూ సంస్కరణలు, కుటుంబ నియంత్రణలకు నేను వ్యతిరేకిని కాను. కష్టపడి పని చేయాలని సినిమాలో చెప్పాను. మనదేశంలో అందరూ కష్టపడి పనిచేస్తే భూ సంస్కరణలు, కుటుంబ నియంత్రణలు అనవసరం అని నా అభిప్రాయం" అన్నారు. ■






# ఆటగాడు

సినీతారలు క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొనడమనే సంప్రదాయానికి నాందీ వాక్యం 1953 జనవరి 11న పలికారు. ఆ రోజు చెన్నపురి స్టేడియంలో ఈ క్రికెట్ మ్యాచ్ జరిగింది. బొంబాయి తారలకు దిలీప్‌కుమార్ కెప్టెన్ కాగా జయరాజ్, రాజ్‌కపూర్, ప్రేమనాథ్, ఓంప్రకాష్, ప్రాణ్, ఆగా, రామ్ కమ్లాని, నర్గీస్, నిరూపారాయ్, నిమ్మి, కుల్దీప్‌కౌర్, తదితరులు జట్టు సభ్యులు.

ఇక మద్రాసు జట్టు కెప్టెన్ ఎస్.బాలచందర్. అక్కినేని నాగేశ్వరరావు, ఎస్.వి.రంగారావు, టి.ఆర్.రామచంద్రన్, శ్రీరామ్, శివరావు, శివాజీ గణేశన్, కమల, కృష్ణకుమారి, లలిత, పద్మిని, రాగిణి తదితరులు సభ్యులు.

ఈ క్రికెట్‌మ్యాచ్‌కి వసూలైన మొత్తాన్ని ముంబాయి, చెన్నై సినీ టెక్నీషియన్స్ సంఘాలు సమానంగా పంచుకున్నాయి. చెన్నై సంఘానికి వచ్చిన మొత్తంలో సగం తమిళనాడు సైక్లోన్ రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. తిరిగి 23 ఏళ్ల అనంతరం కానీ ఇలాంటి క్రికెట్ మ్యాచ్ జరగలేదు. ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఆనాటి క్రికెట్ మ్యాచ్ విశేషాలు...

హైదరాబాద్‌లోని డా॥అంబేద్కర్ విద్యాసంస్థల సహాయార్థం 1976 మార్చి 14న లాల్‌బహదూర్ స్టేడియంలో



దిలీప్‌కుమార్‌తో
ఎన్.టి.ఆర్.

ఉత్తరాది, దక్షిణాది తారల క్రికెట్ మ్యాచ్ జరిగింది. దక్షిణాది జట్టుకు కెప్టెన్‌గా ఎన్.టి.ఆర్. వ్యవహరించారు. ఆయన జట్టులో ఎ.ఎన్.ఆర్., శోభన్‌బాబు, కృష్ణంరాజు, రంగనాథ్, నాగభూషణం, చలం, ప్రభాకరరెడ్డి, మురళీ మోహన్, రాజబాబు, అల్లు రామలింగయ్య, సత్యనారాయణ, శ్రీధర్, జమున, జయప్రద, జయచిత్ర, కాంచన, సూర్యకాంతం, ప్రభ, రోజారమణి సభ్యులు. ఉత్తరాది టీమ్‌కి దిలీప్‌కుమార్ కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆయన జట్టులో అమితాబ్ బచ్చన్, సంజీవ్ కుమార్, శశికపూర్, రిషికపూర్, కిరణ్ కుమార్, నవీన్‌నిశ్చల్, ప్రేమ్ చోప్రా, సైరాబాను, ఆశాసచ్‌దేవ్, హెలెన్, షబనా అజ్మీ, నీతూసింగ్, రింకూ జైస్వాల్, విద్యాసిన్హా ఉన్నారు.

ఈ కార్యక్రమానికి ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా ఆనాటి రాష్ట్రమంత్రి పురుషోత్తమరెడ్డి వ్యవహరించారు. ఆ రోజు ఉదయం 10.20 నిముషాలకు రాష్ట్ర గవర్నర్ మోహన్‌లాల్ సుఖాడియా స్టేడియంకి విచ్చేశారు. ముంబాయి టీం మేనేజర్ కరన్‌దివాన్ కెప్టెన్ దిలీప్ కుమార్‌ని గవర్నర్‌కి పరిచయం చేయగా, అక్కినేని నాగేశ్వరరావు దక్షిణాది టీమ్ కెప్టెన్ ఎన్.టి.ఆర్‌.ని పరిచయం చేశారు.

ఆట ప్రారంభించే ముందు రెండు టీములు జీపులలో ప్లేగ్రౌండ్ చుట్టు తిరిగి అభిమానుల అభినందనలు అందుకున్నారు. అనంతరం దక్షిణాది టీమ్ ఆట ప్రారంభించాలని నిర్ణయించడంతో ఎ.ఎన్.ఆర్., కృష్ణంరాజుతో కలిసి బ్యాటింగ్ ప్రారంభించారు. అమితాబ్ బౌలింగ్ చేసి అక్కినేనిని అవుట్ చేశారు. తర్వాత ఎన్.టి.ఆర్. బ్యాటింగ్ ప్రారంభించారు. ముంబాయి టీమ్‌లో బౌలింగ్ చేసినవారిలో నీతూసింగ్, సైరాబాను కూడా ఉన్నారు. సైరాబాను ఒక పరుగు ఇచ్చి 3 వికెట్లు తీసుకోగా, అమితాబ్ మూడు పరుగులకు మూడు వికెట్లు తీసుకున్నారు.

దక్షిణాది టీమ్‌లో హాస్యనటుడు సారథి ఎక్కువ పరుగులు (16) చేశారు. 67 పరుగులకు 16 వికెట్లు నష్టపోగానే ఎన్.టి.ఆర్. తమ ఇన్నింగ్స్ పూర్తయినట్లు ప్రకటించారు.

హాస్య నటులు అల్లు రామలింగయ్య, రాజబాబు గ్రౌండ్ చుట్టూ తిరుగుతూ తమ హాస్యంతో ప్రేక్షకులను ఆహ్లాదపరిచారు.

ఉత్తరాది బ్యాటింగ్‌ను దిలీప్‌కుమార్, అజయ్‌సహాని ప్రారంభించగా, రంగనాథ్ బౌలింగ్ చేశారు. జయబాబు తన బౌలింగ్‌లో 40 పరుగులకు ఆరు వికెట్లు తీసుకున్నారు. అమితాబ్ 29 పరుగులు, దిలీప్‌కుమార్ 40 పరుగులు చేశారు. 16 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేయడంతో ముంబాయి టీమ్ గెలిచినట్లు ప్రకటించారు.

ఈ క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్న తారలందరికీ గవర్నర్ సుఖాడియా మెమొంటోలు అందజేశారు.

పటౌడినవాజ్, గులాం మహమ్మద్ అంపైర్లుగానూ, డా॥సి.నారాయణరెడ్డి, ఆలీ బేగ్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. చివర్లో దిలీప్, అమితాబ్, సంజీవ్‌కుమార్ కూడా కొంతసేపు కామెంటరీ చెప్పి అభిమానులను అలరించారు. ■



# దస్తూరి గుణాల కస్తూరి

'దస్తూరి గుణాల కస్తూరి' అనే మాటను ముళ్లపూడి వెంకటరమణ తరచూ వాడుతుంటారు. దస్తూరిని బట్టి మనిషి క్యారెక్టర్‌ను అంచనా వేసే శాస్త్రం కూడా ఒకటుంది. ఆ విషయం అలా ఉంచితే... ఎన్.టి.ఆర్. చేతిరాత చూడముచ్చటగా ఉండేది. ముత్యాల వరసను పొందికగా పేర్చినట్లు ఉండే ఆయన దస్తూరి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేది. ఆయన చదువుకునే రోజుల్లో మిగతా స్టూడెంట్స్ రామారావుతో పుస్తకాలమీద పేర్లు రాయించుకునేవారు. ఎన్.టి.ఆర్. నిర్మించిన అనేక పౌరాణిక చిత్రాల స్క్రిప్టులను ఆయనే స్వయంగా, ప్రియంగా రాసుకుని బైండ్ చేయించేవారు. రచయిత రాసిన డైలాగులను తిరిగి రాసుకునేవారు. అక్కడక్కడ తనదైన బాణీలో కొన్ని డైలాగులు జోడించేవారు. తీరిక దొరికినప్పుడల్లా ఆ స్క్రిప్టు చదివేవారు. వాటిలోని ప్రతి డైలాగ్ ఆయనకు కంఠతా వచ్చేది. ఎన్.టి.ఆర్. దస్తూరి ఎంత అందంగా ఉండేదో ఇక్కడ ఇచ్చిన ఉత్తరమే నిదర్శనం. 1951లో 'తెలుగుసినిమా' మాసపత్రికలో పాఠకుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చిన సందర్భంలోనిది ఈ ఉత్తరం.

మనవి :— పాఠకమహాశయులు నాపై చూపిన ఆదరాభిమానాలకు హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు .. .. అపేక్షకలవారందరికీ సద్భావం వల్లన సమాధానం యీయడం సాధ్యపడనందుకు విచారిస్తున్నాను. నా వ్యక్తిగత విషయాలలో చాలమంది ఒకే విధమైన ప్రశ్నలు పంపారు. వారికి యీ క్రింద విశదంగా వివరిస్తున్నాను.

నా పూర్తిపేరు : నందమూరి తారక రామారావు :
మేము యిరువురు సోదరులం:
స్వగ్రామం : గుడివాడ తాలూకా, నిమ్మకూరు :
వయస్సు 28 సం॥లు — వివాహమైంది... యిరువురు కుమారులు :
యీ రంగంలో నన్ను ప్రవేశపెట్టినది దర్శకులు శ్రీ ప్రసాద్ గారు :
అడ్రస్ నెం. 15. విజయరాఘవాచారి రోడ్డు;
త్యాగరాయనగరం.. ... మదరాసు. 17.

ముఖ్యంగా నేనీ రంగంలో ప్రవేశించడం కళకోసమా ? ధనంకోసమా ? ... ... అన్న ప్రశ్నలు చాలా వచ్చాయి. యీ కలియుగము వ్యాపారదృష్టిలో కూడిన కళ ... ... యీ విధంగా చూస్తే వ్యాపారదృష్టిగల యీ పరిశ్రమలో లగ్నమైన నటులెవరూ కూడా వ్యాపారయుతమైన దృక్పథం కలిగిన దనే నా భావం. —— కళాసేవ అంటే.. కళను, దేశంకోసం, సంఘపురోభివృద్ధికోసం, అభ్యుదయ ఆశయాలతో స్వార్థరహితంగా ఆచరించే నిష్కామకర్మ గాని వ్యాపారయుతమైన జీవనోపాధి కాదేమో!!! —— కాని వ్యాపారదృష్టిగల యీ రంగంలో ఆదర్శనీయులైన ధన్యజీవులు లేకపోలేదు

కళ, కళకోసమే నని లలిత జీవితమంతా కళాసేవకే అంకితం చేసిన అమరజీవి శ్రీయుత, బళ్లారి రాఘవాచార్యులుగారు. ఘోర దుఃఖంపాలవుతూ. దారిద్ర్యపు కాలకూటంలోనైన నాటి భారతదేశీయులను కళాపూరితమైన నాటకాలతో ఉద్రేకపరుస్తూ. దుఃఖార్తయైన దేశమాత కన్నీరు తుడుస్తూ. కళ, దేశంకోసం: కళ, మానవసేవ కోసమేనని కళాప్రయోజనాన్ని ఆదర్శయుతంగా నిరూపిస్తున్న మహత్తర కళాజీవి శ్రీయుత, పృథ్వీరాజ్ కపూర్ గారు .. ... మొదలైన వారు.

యిక. నా విషయంలో ఆశయమేదైనా నేడు మాత్రం కళాసేవ చేయగల్గుతున్నానని చెప్పగలను —— ముందేమో!!! —



# అదృష్ట జాతకుడు

పాటకు పల్లవి ప్రాణం. తెలుగు సినిమాకి పాటే అసలైన ప్రాణం.

కథ లేకపోయినా కేవలం పాటలతోనే హిట్ అయిన సినిమాలు చాలా కనిపిస్తాయి మనకి. అంతటి ప్రాముఖ్యం కలిగిన పాటల ద్వారా సినిమాల్ని హిట్ చేయడానికి రకరకాల ఆలోచనలు... పలురకాల ప్రయోగాలు...

అటువంటి ప్రయోగాల్లో హిట్ అయిన ప్రయోగాలు ఓ రెండున్నాయి. విడుదలైన పాపులర్ సినిమా పేర్లను కలుపుకుంటూ పాటను తయారు చేయటం ఒక పద్ధతి. అయితే, ఆ పాపులర్ సినిమా పేర్లన్నీ ఒకే హీరోవి కావటం మరో పద్ధతి. ఈ రెండో రకం ప్రయోగం కొంచెం కష్టమైనది. కష్టమైన ఆ ప్రయోగం తిరుగులేని ఇమేజ్ కలిగిన ఎన్.టి.ఆర్. వంటి హీరో ఉంటేనే హిట్ అవుతుంది. నిజం చెప్పాలంటే ఎన్.టి.ఆర్. ఉండబట్టే అటువంటి ప్రయోగం ప్రాణం పోసుకోగలిగింది.

అసలు సినిమా పేర్లతో సినీ గీతాలు రావటమనే ప్రయోగం తెలుగు సినిమాల్లో చాలా పాతది. 1957లో విడుదలైన 'సువర్ణసుందరి'లో 'రండి రండి పాపలు ఇలా రండి...' అనే పాటలో అప్పటికే రిలీజైన 'బాలరాజు', 'గొల్లభామ', 'కీలుగుర్రం' సినిమా పేర్ల ప్రస్తావన ఉంటుంది. 'సువర్ణసుందరి'లోని ఆ పాటకు అభినయించిన అంజలీదేవే ఈ చిత్రాల్లో ప్రధానపాత్రను ధరించడం చెప్పుకోదగ్గ ఓ విశేషం. 'సువర్ణసుందరి'తో సహా ఇవన్నీ జానపద చిత్రాలే కావడం మరో విశేషం.

ఆ తరవాత ఇటువంటి ప్రయోగాలు ఒకటి అరాగా అప్పుడప్పుడు జరుగుతూ వస్తున్నా, విస్తృతంగా జరిగింది మాత్రం దాసరి నారాయణరావు తీసిన 'మనుషులంతా ఒక్కటే' (1976), బాలచందర్ తీసిన 'మరో చరిత్ర' (1978) సినిమాల్లోనే!

'మరోచరిత్ర'లో 'కలిసి వుంటే కలదు సుఖము... కలిసి వచ్చిన అదృష్టము...' అంటూ ఆత్రేయ రాసిన ఆ పాట ఇవాళ వింటున్నా ఫ్రెష్‌గా ఫీలవుతాం. ఇటువంటి ప్రయోగాలకున్న అడ్వాంటేజ్ అది. ఎమ్మెస్ విశ్వనాధన్

స్వరపరచగా బాలు, రమోలా పాడిన ఆ పాటను కమల్ హాసన్, సరిత, మరికొంత మంది ఉప పాత్రధారులు అభినయించారు.

ఈ పాట హిట్ అవటంతో ఆ సినిమాని హిందీలో 'ఏక్ దూజే కే లియే'గా తీసినప్పుడు కూడా ఈ ప్రయోగాన్ని కొనసాగించాల్సి వచ్చింది. 'మేరే జీవన్ సాథీ - ప్యార్ కియే జా' అనే పల్లవితో మొదలయ్యే ఆ పాటని యావద్భారతదేశం ఎంతో సరదాగా పాడుకుంది. (లక్ష్మీకాంత్- ప్యారేలాల్ సంగీతం, ఎస్పీ బాలు- అనూరాధ గానం, కమల్‌హాసన్- రతి అగ్నిహోత్రి అభినయం).

కాస్త ఇబ్బందిగా అనిపించే అంశం. శాంత అని మార్చడానికి కుదిరి ఉండదు). వారిద్దరి వివాహబంధం సీతారామ కళ్యాణం లాంటిదని, ఇంటికి దీపం ఇల్లాలే కనుక కలిసివుంటే కలదు సుఖం అనీ ఆమె అంటుంది. ఎందుకంటే కాలేజీ రోజుల్లో ఆవిడ ఇతగాడినే ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మంగమ్మలా శపథం చేస్తుంది. ఇతగాడేమో పెళ్లికి ముందు ప్రేమించే ప్రసక్తేలేదని భీష్మించుక్కూచుంటాడు. రెండో చరణంలోని 'భీష్మ- కాదా - మంగమ్మ శపథం' అనే మాటలకి గల కథా పరమైన నేపథ్యం ఇదే...!

సినిమాలో ఈ పాటను అభినయిస్తూ చేసే నృత్యం



'మనుషులంతా ఒక్కటే' చిత్రంలో మంజుల, ఎన్.టి.ఆర్.

**ఇక 'మనుషులంతా ఒక్కటే'లోని పాట గురించి...**

ఎన్.టి.ఆర్. నటించిన సినిమాల కొన్ని పేర్లని కలిపి సినిమా కథలో సంబంధం ఉండేలా పేర్చి, ఆ పాటను ఎన్.టి.ఆర్. ఎదురుగా ఆయన్నే హీరోయిన్ ఉద్దేశిస్తూ పాడేట్టుగా రూపొందటం వల్ల ఓ సరికొత్త తమాషా ప్రయోగంగా జనం అభినందించి ఆదరించారు. సినిమాను జనరంజకంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రేక్షకులకు సూటిగా అందే ప్రయోగాలను చేయటంలో దాసరి ముద్ర తిరుగులేనిదని నిరూపించే పాట ఇది.

ఈ సినిమాలో హీరో పేరు రాము. హీరోయిన్ పేరు శాంతి (ఇదొక్కటే పాటలోని సాహిత్యంతో పోలిస్తే

సెమీ క్లాసిక్ గనుక, ట్యూన్ పరంగా సంగీత దర్శకుడు ఎస్.రాజేశ్వరరావు కూడా 'కాపీ'రాగాన్ని అక్కడక్కడ కలుపుకుంటూ వెళ్లారు. ఈ 'కాపీ' రాగంలో ఆయన సంపూర్ణంగా అందించిన 'పిలచిన బిగువటరా' (మల్లీశ్వరి), 'అందాల బొమ్మతో ఆటాడవా' (అమర శిల్పి జక్కన) పాటల ఛాయలు ఈ 'నిన్నే పెళ్లాడుతా' పాటలో కనిపించడానికి గల కారణం అదే...! ('నిన్నే పెళ్లాడుతా' అనగానే ఈతరం వారికి అక్కినేని నాగార్జున నటించిన సినిమా గుర్తుకొస్తుంది. కానీ 1968లో అదే పేరుతో ఓ సాంఘిక చిత్రం విడుదలైంది. ఈ చిత్రానికి బి.విఠలాచార్య దర్శకత్వం

వహించారు. అందులో ఎన్.టి.ఆర్., భారతి హీరో హీరోయిన్లుగా నటించారు).

ఈ పాట తరువాత ఒకే హీరో నటించిన సినిమాల పేర్లను కలుపు కుంటూ వచ్చిన పాటలు లేకపోలేదు. కాకపోతే అవన్నీ ఈ పాటకున్నంత చారిత్రక ప్రాముఖ్యం సంపాదించు కున్నవి కావు. ఆ విధంగా చూసుకున్నా ఎన్.టి.ఆర్ అదృష్టజాతకుడు.




## ఆ పాట ఇదీ

నిన్నే పెళ్ళాడుతా
రాముడు- భీముడు
రాముని మించిన రాముడు
పిడుగు రాముడు
అగ్గిరాముడు
టైగర్ రాముడు
శభాష్ రాముడు ॥నిన్నే॥
శాంత
రాము
వివాహబంధం
సీతారామకళ్యాణం
ఇంటికి దీపం ఇల్లాలే
కలిసివుంటే కలదు సుఖం
నిప్పులాంటి మనిషి
ఎదురులేని మనిషి
ఆత్మబంధువే అగ్గిబరాటా
చిక్కడు - దొరకడు
కదలడు - వదలడు ॥నిన్నే॥
జగదేకవీరుని మంగళసూత్రం
ఈ ఆడబ్రతుకున కంచుకోట
దాసిని చరణదాసిని
భీష్మ కాదా మంగమ్మశపథం
దేశోద్ధారక కథానాయక
దేవాంతక జయసింహ
వీరకంకణం నా సంకల్పం
దాన వీర శూర కర్ణ నిన్నే ॥నిన్నే॥

**చిత్రం** : మనుషులంతా ఒక్కటే (1976)
**రచన** : దాసరి నారాయణరావు
**సంగీతం** : ఎస్.రాజేశ్వరరావు
**గానం** : పి.సుశీల
**నటించినవారు** : ఎన్.టి.రామారావు, మంజుల తదితరులు

- (మ్యూజికాలజిస్ట్ రాజాకు కృతజ్ఞతలు)


# ఎన్.టి.ఆర్.తో ఆ దర్శకులు



తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్.టి.ఆర్. వ్యక్తిత్వం సుదర్శన చక్రంలాంటిదని అభివర్ణిస్తుంటారు ఆచార్య డా॥ సి.నారాయణరెడ్డి. నిజమే.. సుదర్శనచక్రంలో ఎన్ని అంచులు ఉంటాయో అలాగే ఎన్.టి.ఆర్. ప్రతిభకు కూడా అన్ని అంచులే ఉన్నాయి. నటునిగా సినీ ప్రస్థానాన్ని ప్రారంభించి, నిర్మాతగా అడుగులు వేసి, దర్శకుడు కావడమే కాదు కథారచయితగా, ఎడిటర్‌గా, స్క్రీన్‌ప్లే రచయితగా తన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు.

నటునిగా, దర్శకునిగా తనకు ఎంతో అనుభవమున్నా ఇతర దర్శకుల చిత్రాల్లో నటిస్తున్నప్పుడు ఎన్.టి.ఆర్. అదే తన తొలిచిత్రంలా భావించి వినయంగా ఒదిగి ఉండేవారు. దర్శకుడు ఎలా చెబితే అలా నటిస్తూ, వారికి పూర్తి స్వేచ్ఛ నిచ్చేవారు. దర్శకుని మాటే వేదమని, నిర్మాత బాగుంటేనే మిగిలిన అందరికీ ప్రయోజనమనీ, అందుకే వారిద్దరిని గౌరవించాలని ఆయన చెబుతుండేవారు.

తన సినీజీవితంలో 93 మంది దర్శకులతో పనిచేశారు ఎన్.టి.ఆర్. కొంతమంది కొత్త దర్శకులకు కూడా అవకాశం కల్పించారు. మరో విషయమేమిటంటే నందమూరి తారక రామారావుతో ఎక్కువ చిత్రాలకు పనిచేసిన దర్శకుడు ఎన్.టి.ఆరే. 17 చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. ఆ తర్వాతి స్థానం సి.ఎస్.రావు, డి.యోగానంద్‌లది. ఎన్.టి.ఆర్.కి అత్యంత ఆత్మీయులుగా, ఆస్థాన దర్శకులుగా పేరు తెచ్చుకున్న వీరిద్దరూ చెరి 16 చిత్రాలకు దర్శకత్వం వహించారు. కెరీర్‌ను ప్రారంభించిన తొలిరోజుల్లో ఎన్.టి.ఆర్., యోగా



'గులేబకావళి' చిత్రం షూటింగ్‌లో కె.వి.రెడ్డి, త్రివిక్రమరావు తదితరులతో ఎన్.టి.ఆర్.

నంద్ ఒకే గదిలో ఉండేవారు కూడా.

పౌరాణిక బ్రహ్మగా పేరొందిన కమలాకర కామేశ్వర రావు ఎన్.టి.ఆర్. హీరోగా 15 చిత్రాలు రూపొందించారు. వీటిల్లో సింహభాగం పౌరాణిక చిత్రాలే. ఎన్.టి.ఆర్. నటించిన 'చంద్రహారం' చిత్రంతోనే దర్శకునిగా తన కెరీర్ ప్రారంభించారు కామేశ్వరరావు. అనుకున్న కథని అనుకున్న ప్రకారం మెరుపు వేగంతో తెరకు అనువదించి, ఎన్.టి.ఆర్ మెప్పుపొందిన జానపదబ్రహ్మ విఠలాచార్య ఆయనతో 13 చిత్రాలు రూపొందించారు.

అలాగే ఎన్.టి.ఆర్.కు మార్గ దర్శకులు కె.వి.రెడ్డి ఆయనతో 10 చిత్రాలు రూపొందించారు. ఆయన దగ్గర నేర్చుకున్న ఎన్నో అంశాలను ఆ తర్వాతికాలంలో ఆచరణలో పెట్టారు రామారావు. కె.వి.రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రాల్లో కొన్నింటిని మినహాయిస్తే మిగిలినవన్నీ విజయా బేనరుపై రూపొందినవే. ఆ బేనరుకీ, కె.వి.రెడ్డికి అంతటి అవినాభావసంబంధం ఉండేది. కృషి, దీక్ష, ఏకాగ్రత ఆయన కార్యనిర్వహణలో కనిపించేవి. డబ్బు కంటే మాటకు ఎక్కువ విలువ ఇచ్చేవారాయన. అంతటి వ్యక్తి చివరిరోజుల్లో ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. తన కుమారుడిని పై చదువులకు పంపించడానికి డబ్బు లేకపోవడంతో ఒకరోజు బజుల్లారోడ్‌లో ఉన్న ఎన్.ఎ.టి. ఆఫీసుకు వెళ్లారాయన. ఆ సమయంలో ఎన్.టి.ఆర్., ఆయన సోదరుడు త్రివిక్రమరావు ఆఫీసులోనే ఉన్నారు. కె.వి.రెడ్డి రావడం చూసి ఇద్దరూ ఎదురువెళ్లి ఆహ్వానించారు. ముగ్గురు లోపల కూర్చున్న తర్వాత 'మా అబ్బాయిని విదేశాలకు పంపించడానికి 40వేల రూపాయలు అవసరం. ఆ డబ్బు నువ్వు సర్దుతావనే నమ్మకంతో వచ్చాను. అయితే అప్పుగానో.. దానంగానో ఇస్తే నేను తీసుకోను. నన్ను దర్శకుడిగా ఉపయోగించుకో.. ఓ సినిమా ప్లాన్ చెయ్యి. నేను దర్శకత్వం వహిస్తాను' అన్నారాయన ఎన్.టి.ఆర్.తో. ఆయనపట్ల ఉన్న గౌరవభావంతో, ఆప్యాయతతో రామారావు మరో మాట చెప్పకుండా వెంటనే 40వేల రూపాయలకు చెక్కు రాసిచ్చారు. ఆ తర్వాత కె.వి.రెడ్డి దర్శకత్వంలో ఆర్.కె.బ్రదర్స్ పతాకంపై 'శ్రీకృష్ణసత్య' నిర్మించారు ఎన్.టి.ఆర్. ఇందులో శ్రీకృష్ణుడిగా ఎన్.టి.ఆర్., సత్యభామగా జయలలిత నటించారు. కె.వి.రెడ్డి దర్శకత్వం వహించిన చివరి చిత్రం ఇదే. ఆ రోజుల్లో కె.వి. రెడ్డి నాలుగు లక్షల రూపాయలు అడిగినా ఇచ్చేవారు రామారావు. కానీ తను అడిగిన 40 వేల రూపాయల కంటే పైసా ఎక్కువ తీసుకోకుండా ఈ చిత్రానికి




దర్శకత్వం వహించారు కె.వి.రెడ్డి. ఈ చిత్రం వంద రోజులు ప్రదర్శింపబడింది. అయితే రీరికార్డింగ్‌లో లోపాలు ఉన్నాయనే వ్యాఖ్యలు వినబడటంతో మళ్లీ రీరికార్డింగ్ జరిపారు నందమూరి సోదరులు. అలా తనని నటునిగా తీర్చిదిద్దిన కె.వి.రెడ్డి దర్శకత్వంలో 'శ్రీకృష్ణ సత్య' చిత్రాన్ని నిర్మించి గురుదక్షిణ చెల్లించారు. ఎన్.ఎ.టి. సంస్థ నిర్మించిన తొలి రంగుల చిత్రమిదే.


యువతరం దర్శకుల్లో కె.రాఘవేంద్రరావు 12 చిత్రాలను, దాసరి నారాయణరావు ఐదు చిత్రాలను రూపొందించి మలిదశలో సరికొత్త ఎన్.టి.ఆర్‌ను తెరపై ఆవిష్కరించారు.

తనని చిత్రరంగానికి పరిచయం చేసిన ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో 9 చిత్రాల్లో నటించారు రామారావు. తనింతవాడు కావడానికి కారణమైన ఎల్.వి. ప్రసాద్ చేతుల మీదుగానే రామకృష్ణా స్టూడియోస్‌ను ప్రారంభించారాయన. అలాగే తనని హీరోని చేసిన బి.ఎ.సుబ్బారావు దర్శకత్వంలో తొమ్మిది సినిమాల్లో నటించారు ఎన్.టి.ఆర్. చేసిన మేలు మరిచిపోయే అలవాటు ఆయన రక్తంలోనే లేదు. అవకాశాలు తగ్గి అవసానదశలో బి.ఎ. సుబ్బారావు ఇబ్బంది పడుతుంటే అది గ్రహించిన ఎన్.టి.ఆర్. ఎఫ్.డి.సి బోర్డ్‌లో డైరెక్టర్‌గా నియమించి, ఆర్థికంగా ఆదుకున్నారు.

ఇక ఇతర దర్శకుల విషయానికి వస్తే.. వేదాంతం రాఘవయ్య, వి.మధుసూదనరావు, ఎస్.డి.లాల్ దర్శకత్వంలో ఎనిమిదేసి చిత్రాల్లో రామారావు నటించారు. అలాగే కె.హేమాంబధరరావు, తాతినేని ప్రకాశరావుతో చెరి ఆరు చిత్రాలకు, పి.పుల్లయ్య, కె.బాపయ్య దర్శకత్వంలో ఐదు చిత్రాల్లో నటించారాయన.

ఎన్.టి.ఆర్‌ని స్క్రీన్‌మీద బాగా ఫోకస్ చేసిన దర్శకుల్లో బి.ఎన్.రెడ్డి ప్రముఖుడు. ఆయన ఎన్.టి.ఆర్. కాంబినేషన్‌లో నాలుగు చిత్రాలు వచ్చాయి. ఇందులో 'మల్లీశ్వరి' ముఖ్యమైంది.

రామారావు తొలిసారిగా ద్విపాత్రాభినయం చేసిన 'రాముడు-భీముడు' చిత్రంతోపాటు మరో మూడు చిత్రాలకు దర్శకత్వం వహించారు తాపీ చాణక్య. అలాగే రామకృష్ణ, బి.ఎస్.రంగా, కె.బి.నాగభూషణం, రజనీకాంత్, బి.ఆర్.పంతులు, సి.పుల్లయ్య, భీమ్‌సింగ్, త్రిలోక్‌చందర్, తాతినేని రామారావు, బి.ఎ.ప్రసాద్‌తలో మూడు చిత్రాలకు పనిచేశారు. ఆదుర్తి సుబ్బారావు, ప్రత్యగాత్మ, బాపు, కె.ఎస్.ప్రకాశరావు వంటి దర్శకులతో రెండేసి చిత్రాల్లో నటించారు ఎన్.టి.ఆర్.



ప్రమీలార్జునీయం సెట్‌లో సరోజా...
దర్శకుడు మల్లికార్జునరావు...

### హీరోయిన్ల దర్శకత్వం

భానుమతి తొలిసారిగా దర్శకత్వం వహించిన 'చండీరాణి' చిత్రంలో హీరో ఎన్.టి.ఆర్. తెలుగుతో పాటు తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రూపు దిద్దుకోగా, ఆ రెండు భాషల్లోనూ ఆయన నటించారు. ఆ తర్వాత ఎన్.టి.ఆర్., భానుమతి జంటగా నటించిన 'అమ్మాయిపెళ్లి' చిత్రానికి కూడా భానుమతి దర్శకత్వం వహించారు.

మరో హీరోయిన్ సావిత్రి దర్శకత్వం వహించిన 'మాతృదేవత' చిత్రంలో కూడా ఎన్.టి.ఆర్. నటించారు. నిజం చెప్పాలంటే అందులో ఆయనది డమ్మీ పాత్ర. హత్యానేరం తనమీద మోపడంతో కుటుంబానికి దూరమై ఏళ్లతరబడి అజ్ఞాతంలో మగ్గే పిరికివానిపాత్ర. ధీరోదాత్త పాత్రలు పోషిస్తున్న సమయంలో ఇటువంటి పాత్ర చేస్తే తన ఇమేజ్‌కి డామేజ్ జరుగుతుందని తెలిసినా ఆ సినిమాలో నటిస్తే సావిత్రికి ఆర్థికంగా హెల్ప్ అవుతుందనే అభిప్రాయంతో అంగీకరించారు. మిగిలిన హీరోలు ఆ పాత్రను చేయడానికి భయపడి వెనుకంజ వేసిన తరుణంలో ఎన్.టి.ఆర్. ముందుకు వచ్చి సావిత్రికి అండగా నిలిచారు. ఇలాంటి సంఘటనలు ఆయన కెరీర్‌లో ఇంకెన్నో... హాస్యనటుడు పద్మనాభం వచ్చి 'సినిమా తీస్తున్నాను అన్నయ్యా.. మీరు నటించాలి' అనడిగితే, 'తప్పకుండా బ్రదర్' అని డేట్స్ ఇచ్చి ప్రోత్సహించారు.

### సాంకేతిక నిపుణులతో...

సముద్రాల రాఘవాచార్య అంటే గురుభావం ఎన్.టి.ఆర్.కు. పురాణాల గురించి, పాత్రల గురించి ఆయనతో చర్చిస్తుండేవారు. తన సందేహాలను నివృత్తి చేసుకునేవారు. సముద్రాల దర్శకునిగా మారి రెండు చిత్రాలు (వినాయక చవితి, బభ్రువాహన) రూపొందిస్తే అందులో హీరో ఎన్.టి.ఆరే. అలాగే వాహినీ సంస్థలో పనిచేస్తున్నప్పుడు కళా దర్శకుడు ఎ.కె.శేఖర్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన దర్శకునిగా మారి 'శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు కథ' చిత్రాన్ని రూపొందిస్తున్నప్పుడు ఎన్.టి.ఆర్. డేట్స్ ఇచ్చి ప్రోత్సహించారు.

### కొత్త దర్శకులు

ఎన్.టి.ఆర్. పరిచయం చేసిన కొత్తదర్శకుల సంఖ్య కూడా తక్కువేమీకాదు. తన రూమ్మేట్ తాతినేని ప్రకాశరావుని 'పల్లెటూరు', కాలేజ్‌మేట్ మంగళగిరి మల్లికార్జునరావుని 'ప్రమీలార్జునీయం', ఛాయాగ్రాహకుడు బి.ఎన్.రంగాని 'తెనాలి రామకృష్ణ', ఎ.సి.త్రిలోక్‌చందర్‌ని 'నాదీ ఆడజన్మే', నిర్మాత రంగనాథదాసుని 'సంకల్పం' సినిమాలతో పరిచయం చేశారు ఎన్.టి.ఆర్. ■








'కన్యాశుల్కం'లో ఎన్.టి.ఆర్.
( గిరీశం) గెటప్ స్కెచ్






# ఎన్.టి.ఆర్.తో ఆ హీరోలు..

మల్టీస్టారర్ చిత్రాలకు మంచి బాట ఏర్పడింది ఎన్.టి.ఆర్. సినిమాలతోనే. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రమే మల్టీస్టారర్ కావడం గమనార్హం. ఒక కొత్త హీరో, అప్పటికే హీరోగా ఎస్టాబ్లిష్ అయిన ఎ.ఎన్.ఆర్.తో కలసి నటించిన తొలిచిత్రం 'పల్లెటూరి పిల్ల' ప్రేక్షకలోకంలో సంచలనం సృష్టించింది. మల్టీస్టారర్ చిత్రాలు అప్పట్లో ఎక్కువగా రావడానికి, ఇప్పుడు రాకపోవడానికి కారణం ఉంది. పాత్ర పరిధి ఎక్కువ, తక్కువ అని ఆలోచించకుండా మంచి పేరు తెచ్చేది అయితే చాలు అనుకునే హీరోలు ఆరోజుల్లో ఉండటమే అందుక్కారణం. హీరోల మధ్య ఈగోల సమస్యలు లేకపోవడంతో దర్శక నిర్మాతలు ధైర్యంగా ముందుకెళ్లేవారు. రచయితలు వైవిధ్యమైన ఇతివృత్తాలను తయారు చేసేవారు.

తనతో సమానస్థాయి కలిగిన హీరోలతో, వర్ధమాన హీరోలతో ఎన్.టి.ఆర్. నటించారు. వర్ధమాన హీరోలను ఆయన ప్రోత్సహించినట్లుగా మరెవరూ చేయలేదేమో ననిపిస్తుంది కొన్ని సంఘటనలు విన్న తర్వాత. కొత్తతరం వస్తే తనకు పోటీ అవుతుందని ఆయన ఎప్పుడూ భావించలేదు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో ఎన్.టి.ఆర్. ఎప్పుడూ ముందుండేవారు. తను సీనియర్ హీరో అయినప్పటికీ కొత్త వాళ్లతో మనసువిప్పి మాట్లాడటం ఆయన సంస్కారానికి నిదర్శనం.

ఆయనతో నటించిన హీరోల వివరాలు..

## ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్

ఏ రంగంలోనైనా పోటీ ఉన్నప్పుడే ఆ రాణింపు వేరుగా ఉంటుంది. సమఉజ్జీలైన ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. ఒకరితో మరొకరు పోటీపడి చిరస్మరణీయమైన నటనని అందించి తెరస్మరణీయులుగా మిగిలారు. నటనలో మాత్రమే కాదు మరెన్నో విషయాల్లో వీరిద్దరూ ఎందరికో మార్గదర్శకులు. పారితోషికం పెంచవలసిన తరుణంలో ఇద్దరూ కలిసి కూర్చుని చర్చించుకుని నిర్మాతలకు భారం కాకుండా నిర్ణయాలు తీసుకునేవారు. ఈ అగ్రనటులు కలిసి నటించిన చిత్రాల్లో అధికశాతం విజయవంతమైనవే.

తెలుగు చిత్ర పరిశ్రమకు ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. రెండుకళ్లని సంబోధిస్తూ ఆత్మీయంగా ఆదరించారు తెలుగు చిత్ర పరిశ్రమ, ప్రేక్షకులు. ఆ అభినందనకు తగినట్లుగానే ఆదర్శవంతమైన స్నేహానుబంధాన్ని కొనసాగించారిద్దరూ.

ఒకే వృత్తిలో ఉన్నందువల్ల కొన్ని సందర్భాల్లో అభిప్రాయభేదాలు తలెత్తినా అవి తాత్కాలికంగానే ఉండేవి. వీరిద్దరూ కలిసి 14 చిత్రాల్లో నటించి అరుదైన రికార్డ్ నెలకొల్పారు.





నర్తనశాలలో కాంతారావుతో...

## ఎన్.టి.ఆర్.- కాంతారావు

కాంతారావుని తన సొంత తమ్మునిలా ఆదరించి, ఎన్నో అవకాశాలు కల్పించి, చిత్ర పరిశ్రమలో నిలదొక్కుకోవడానికి ఎంతో సహకరించారు ఎన్.టి.ఆర్. ఎన్నో పాత్రలు (ఉదాహరణకు 'లవకుశ' చిత్రంలో లక్ష్మణుని పాత్ర విషయంలో ఎన్.టి.ఆర్. పట్టుబట్టి అది కాంతారావుకు వచ్చేలా చేశారు) కాంతారావుకు రావడానికి కారకుడు ఎన్.టి.ఆరే. వీరిద్దరూ కలిసి దాదాపు 60 చిత్రాల్లో నటించారు. కృష్ణుడు, అర్జునుడు వంటి పౌరాణిక పాత్రలు కూడా ఎన్.టి.ఆర్. ఆశీస్సుల వల్లే పోషించగలిగారు కాంతారావు.

వినయ విధేయతలు, క్రమశిక్షణ, కలుపుగోలుతనం వంటి లక్షణాలు కాంతారావులో ఉండటంతో అవి ఎన్.టి.ఆర్.కు నచ్చి, మరింత ప్రోత్సహించారు. ఎన్.టి.ఆర్. కృష్ణునిగా, కాంతారావు నారదునిగా నటించి పండించిన హాస్యం ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుంటుంది.


## ఎన్.టి.ఆర్- కృష్ణ

విద్యార్థి దశ నుంచి ఎన్.టి. ఆర్. అభిమాని అయిన కృష్ణ తన 18 ఏళ్ల వయసులో ఎన్.టి.ఆర్.ని తొలిసారిగా కలిశారు. అప్పుడాయన 'సీతారామకళ్యాణం' చిత్రం నిర్మిస్తుండటంతో అందులో రాముని వేషం ఇవ్వమని అడిగారు. అయితే కృష్ణకు అప్పుడు 18 ఏళ్లు ఉండటంతో ఆ పాత్ర ఇవ్వలేనని, లక్ష్మణుని వేషానికి శోభన్‌బాబుని ఎంపిక చేయడంతో ఆ వేషం కూడా లేదని చెప్పి, మూడేళ్ల తర్వాత కనిపించమని చెప్పారు ఎన్.టి.ఆర్. ఆయన చెప్పినట్లుగానే మూడేళ్లు ఆగి, ఆ తర్వాత 'తేనె మనసులు' చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు కృష్ణ. ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగా ఒకసారి ఎన్.టి.ఆర్.ని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. 'మంచి అవకాశాలు వస్తాయి.. హీరోగా నిలబడతారు బ్రదర్' అని ఆశీర్వదించారు ఎన్.టి.ఆర్.


'స్త్రీజన్మ' చిత్రంలో ఎన్.టి. ఆర్. తమ్మునిగా నటించారు కృష్ణ. ఆ తర్వాత 'నిలువుదోపిడి', 'విచిత్ర కుటుంబం', 'దేవుడు చేసిన మనుషులు', 'వయ్యారి భామలు- వగలమారి భర్తలు' చిత్రాల్లో కూడా వీరిద్దరూ అన్నదమ్ములుగానే నటించారు. అంతే కాదు ఎన్.టి.ఆర్. హీరోగా భారీ మల్టీస్టారర్ 'దేవుడు చేసిన మనుషులు' చిత్రాన్ని నిర్మించారు కృష్ణ



'నిలువుదోపిడి'లో కృష్ణతో..



[illegible]గాడు' శతదినోత్సవంలో..



'ఆడపడుచు'లో చంద్రకళ, శోభన్‌బాబుతో..

## ఎన్.టి.ఆర్- శోభన్‌బాబు


ఎన్.టి.ఆర్., అమ్మాజీ (నటి జయచిత్ర తల్లి) జంటగా నటించిన 'దైవబలం' (1959) చిత్రంలో చిన్న పాత్ర పోషించారు శోభన్‌బాబు. అదే ఆయనకి తొలి సినిమా. అప్పటినుంచి పెద్దాయన్ని తరుచు కలుస్తుండేవారు. మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయనను ఉత్సాహపరిచేవారు ఎన్.టి.ఆర్. అంతేకాదు తను నిర్మించిన 'సీతారామకళ్యాణం', 'శ్రీక్రిష్ణ పాండవీయం' చిత్రాల్లో అవకాశాలు కల్పించారు. 'శ్రీకృష్ణావతారం' చిత్రంలో నారదుని పాత్ర శోభన్ బాబుకి రావడానికి ఆయనే కారకులు. అలాగే 'భీష్మ', 'ఆడపడుచు', 'పుణ్యవతి', 'నిండు హృదయాలు' చిత్రాల్లో సహ కథానాయకుని పాత్రలు తనకే వచ్చేలా చేసి, తన అభివృద్ధికి ఎన్.టి.ఆర్. ఎంతో తోడ్పడ్డారని శోభన్‌బాబు చెప్పేవారు. ఇక 'వీరాభిమన్యు' చిత్రం విషయం చెప్పనక్కర్లేదు.

ఎన్.టి.ఆర్., శోభన్‌బాబు 23 చిత్రాల్లో కలిసి నటించారు. 'చిన్ననాటి స్నేహితులు' (1971) వీరిద్దరి చివరి చిత్రం. శ్రీరామునిగా శోభన్‌బాబు నటించిన 'సంపూర్ణ రామాయణం' చిత్రాన్ని చెన్నైలోని శోభన్‌బాబు థియేటర్‌లోనే చూసి గుండెకు హత్తుకుని అభినందించారు ఎన్.టి.ఆర్.

## ఎన్.టి.ఆర్.- కృష్ణంరాజు

తొలి సినిమా 'చిలకా గోరింకా' ఇంకా విడుదల కాకుండానే ఆ నోట, ఈనోట కృష్ణంరాజు ప్రతిభ గురించి విన్న ఎన్.టి.ఆర్. ఒకరోజు ఆయన్ని పిలిపించి అభినందించారు. అప్పటినుంచి నటునిగా తన ప్రోగ్రెస్‌ను ఎన్.టి.ఆర్.కు వివరిస్తుండేవారు కృష్ణంరాజు. అంతేకాదు తను నిర్మించిన 'కృష్ణవేణి' చిత్రం శతదినోత్సం హైదరాబాద్‌లో జరుగుతున్నప్పుడు ఎన్.టి.ఆర్.ను ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తే ఆయన సతీసమేతంగా హాజరయ్యారు.

ఎన్.టి.ఆర్ హీరోగా నటించిన 'భలే మాస్టారు', 'బడిపంతులు', 'వాడేవీడు', 'పల్లెటూరి చిన్నోడు', 'మనుషుల్లో దేవుడు' 'మంచికి మరోపేరు', 'సతీసావిత్రి' చిత్రాల్లో నటించారు కృష్ణంరాజు.



## ఎన్.టి.ఆర్.- హరనాథ్

ఎన్.టి.ఆర్. తర్వాత చిత్ర పరిశ్రమలో అందగాడు ఎవరయ్యా అంటే ఆ రోజుల్లో హరనాథ్ పేరు చెప్పేవారు. అంతకు ముందు కొన్ని చిత్రాల్లో నటించిన హరనాథ్‌ను 'సీతారామ కళ్యాణం'లో రామునిగా, 'భీష్మ'లో కృష్ణునిగా నటించే అవకాశాలు కల్పించి ఎన్.టి.ఆర్ ప్రోత్సహించారు. ఎన్.టి.ఆర్. తర్వాత రాముడు, కృష్ణుడు పాత్రలు పోషించే మరో నటుడు దొరికాడని పరిశ్రమ, ప్రేక్షకులు సంతోషించారు కానీ స్వయంకృతాపరాధం వల్ల హరనాథ్ తన కెరీర్‌ను నిలబెట్టుకోలేక పోయారు.

'పాండవ వనవాసం', 'పల్నాటియుద్ధం', 'పుణ్యవతి', 'గుండమ్మకథ', 'చిట్టిచెల్లెలు', 'కలసి ఉంటే కలదు సుఖం', 'నాదీ ఆడజన్మే'... ఇలా ఎన్.టి.ఆర్.తో కలిసి హరనాథ్ నటించిన చిత్రాలన్నీ హిట్లే..



'కలిసి ఉంటే కలదు సుఖం' చిత్రంలో గిరిజ, హరనాథ్‌తో...



**ఎన్.టి.ఆర్- మోహన్‌బాబు**

ఎన్.టి.ఆర్. అంటే మోహన్‌బాబుకు ఎనలేని గౌరవం. ఆయనలోని క్రమశిక్షణను తు.చ. తప్పకుండా పాటించే ఏకైక నటుడు మోహన్‌బాబే. అలాగే ఎన్.టి.ఆర్. తర్వాత డైలాగ్ పలికేది మోహన్‌బాబే అని ప్రేక్షకులు కూడా ఒప్పుకుంటారు. కెరీర్ ప్రారంభంలో డైలాగు ఎలా పలకాలో దాసరి నేర్పిస్తే అందులో పరిణతి ఎలా ఉంటుందో ఎన్.టి.ఆర్‌ను చూసి నేర్చుకున్నానని మోహన్‌బాబు చెబుతుంటారు.

ఎన్.టి.ఆర్.తో మోహన్‌బాబు కలిసి నటించిన సినిమాలన్నీ ఆయనకు పేరు తెచ్చిపెట్టినవే. 'సర్దార్ పాపారాయుడు', 'కొండవీటి సింహం', 'సింహబలుడు', 'ప్రేమసింహాసనం' తదితర చిత్రాలన్నీ మోహన్ బాబుని నటునిగా నిలబెట్టాయి.

తన అన్న ఎన్.టి.ఆర్. ఆశీస్సులతో సొంతంగా చిత్ర నిర్మాణాన్ని ప్రారంభించిన మోహన్‌బాబు ఆయన హీరోగా 'మేజర్ చంద్రకాంత్' సినిమా నిర్మించడం ఆయన జీవితంలో ఓ మధుర ఘట్టం. ఎన్.టి.ఆర్ నటించిన చివరి సాంఘిక చిత్రం ఇదే కావడం గమనార్హం.

అలాగే 1994లో ఎన్.టి.ఆర్ ఆశీస్సులతో రాజ్యసభ సభ్యుడైన మోహన్‌బాబు అన్నగారి బాటలో పయనిస్తూ ప్రశంసలు అందుకున్నారు.

### ఎన్.టి.ఆర్.- చిరంజీవి

ఎన్.టి.ఆర్.తో కలిసి తను ఒకే ఒక్క సినిమా (తిరుగులేని మనిషి)లో నటించినప్పటికీ ఆ చిత్రం షూటింగ్ సమయంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చిరంజీవి చెబుతారు. చిరంజీవి, సురేఖ (అల్లు రామలింగయ్య కుమార్తె) వివాహ నిశ్చితార్థం కూడా ఎన్.టి.ఆర్. సమక్షంలోనే జరిగింది.

ఊహ తెలిసిన తరువాత తను చూసిన ఎన్.టి.ఆర్. సినిమా 'పాతాళభైరవి' అని చిరంజీవి చెబుతారు. ఆయన ఎక్కువ సార్లు చూసిన ఎన్.టి.ఆర్. సినిమాకూడా అదే. 'అందులోని తోట రాముని పాత్ర ఎన్.టి.ఆర్. మనస్తత్వానికి దగ్గరగా ఉండటంవల్ల కాబోలు ఆ సినిమా నన్ను అమితంగా ఆకర్షించింది' అంటారాయన.

ఎన్.టి.ఆర్.ని ఆదర్శంగా తీసుకొని నటనకు స్వస్తి పలికి రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజారాజ్యం పార్టీ నెలకొల్పారు చిరంజీవి.



'తిరుగులేని మనిషి'లో చిరంజీవితో..



## ఎన్.టి.ఆర్- బాలకృష్ణ

తనకు ప్రతి విషయంలోనూ తండ్రే ఆదర్శమని నందమూరి బాలకృష్ణ తరచూ చెబుతుంటారు. తను ఆయనకు ఏకలవ్య శిష్యుడనని ఆయన అంటుంటారు. తొమ్మిదో తరగతి చదువుతూ తొలిసారిగా 'తాతమ్మకల' చిత్రంలో కెమెరా ముందుకు వచ్చిన బాలకృష్ణ ఆ తర్వాత నటించిన చిత్రాల్లో హీరో ఎన్.టి.ఆరే. బాలకృష్ణతో సినిమాలు చెయ్యడానికి నిర్మాతలు ముందుకు వచ్చినా, చదువు పాడవుతుందనే భావనతో ఎన్.టి.ఆర్. అంగీకరించలేదు. ఒకపక్క చదువుకుంటూనే తీరిక దొరికినప్పుడల్లా సొంత చిత్రాల్లో నటించేవారు బాలకృష్ణ. ఎన్.టి.ఆర్. ప్రధాన పాత్ర పోషించిన 'వేములవాడ భీమకవి', 'దానవీరశూరకర్ణ', 'అక్బర్ సలీం అనార్కలి', 'శ్రీమద్విరాటపర్వం', 'శ్రీ తిరుపతి వెంకటేశ్వర కళ్యాణం', 'అనురాగదేవత', 'రౌడీ రాముడు- కొంటె కృష్ణుడు', 'సింహం నవ్వింది', చిత్రాల్లో ఆయనతో కలిసి నటించారు బాలకృష్ణ. ఇవన్నీ సొంత చిత్రాలే. ఆ సమయంలో బాలకృష్ణ బయట నిర్మాతలకు చేసిన సినిమాలు రెండే రెండు. ఒకటి: 'రామ్ రహీం' ఇందులో (హరికృష్ణ మరో హీరో), రెండోది 'అన్నదమ్ముల అనుబంధం' (ఈ సినిమాలో ఎన్.టి.ఆర్.కు



'బ్రహ్మర్షి విశ్వామిత్ర'లో హరిశ్చంద్రుడుగా బాలకృష్ణ, విశ్వామిత్రుడిగా ఎన్.టి.ఆర్.

తమ్ముడిగా నటించారు. 'డిస్కోకింగ్' చిత్రంతో సోలో హీరోగా ఎదిగిన బాలకృష్ణ ఎన్.టి.ఆర్.తో కలిసి నటించిన చివరి చిత్రం 'బ్రహ్మర్షి విశ్వామిత్ర'. తండ్రీ కొడుకులైనప్పటికీ షూటింగ్ స్పాట్‌లో ఉన్నంతసేపు, ఆయన దర్శకుడు, ఈయన నటుడుగానే ప్రవర్తించే వారే తప్ప కొడుకు కదాని ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు కాదు ఎన్.టి.ఆర్. ఒకవ్యక్తి మహానటుడైనప్పుడు అతని కొడుకులోనూ నటనాపరంగా వారసత్వపు ఛాయలను ప్రేక్షకలోకం వెతుక్కోవడం సహజం. తండ్రి శిక్షణలో ఆరితేరిన బాలకృష్ణ పెద్దాయన పేరు నిలబెడు తున్నారు. అందుకే ఆయన్ని చూసి ఎన్.టి.ఆర్. అభిమానులు మురిసిపోతుంటారు. ■


బ్రహ్మర్షి విశ్వామిత్రలో మనవడితో...

## సీనియర్‌తో జూనియర్


నందమూరి వంశంలో మూడోతరం హీరో జూనియర్ ఎన్.టి.ఆర్. పెద్దాయన, బాబాయి తర్వాత మళ్లీ అంత ఊపు కలిగి, అభిమానులను ఉర్రూతలూ గిస్తున్నారు. తన తాతయ్య పుట్టిన నెలలోనే (1983 మే 20) ఈ మనవడు పుట్టడం ఒక వరమైతే, పెద్దాయన పోలికలు కలిగి ఉండటం అదృష్టం.

ఎన్.టి.ఆర్. మూడో కుమారుడు హరికృష్ణ చిన్న కుమారుడైన తారక్ (జూనియర్ ఎన్.టి.ఆర్.) తన ఎనిమిదేళ్ల ప్రాయంలోనే శాస్త్రీయ నృత్యాన్ని నేర్చు కున్నారు. ఆ సమయంలోనే తాతయ్య దర్శకత్వంలో 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' చిత్రంలో భరతునిగా నటించి, పెద్దాయన దీవెనలందుకున్నారు. తన 13వ ఏట బాలనటునిగా రంగప్రవేశం చేసి కొన్ని సీరియల్స్‌లో నటించారు. అలాగే బాల నటీనటులతో గుణశేఖర్ దర్శకత్వంలో ఎం.ఎస్.రెడ్డి నిర్మించిన 'రామాయణం' చిత్రంలో శ్రీరామునిగా నటించారు తారక్.

'నిన్ను చూడాలని' చిత్రంతో హీరోగా పరిచయమైన తారక్ 'స్టూడెంట్ నంబర్.1', 'ఆది', 'సింహాద్రి' చిత్రాల తర్వాత యువతరం హీరోల్లో ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. ■

# చివరి సినిమాలు

ఎన్.టి.ఆర్. హీరోగా కమిట్ అయిన తొలి సినిమా 'పల్లెటూరి పిల్ల'. అయితే దానికంటే ముందు 'షావుకారు' విడుదలైంది. అలాగే ఆయన నటించిన చివరి సినిమా 'మేజర్ చంద్రకాంత్'. విడుదలైన చివరి సినిమా 'శ్రీనాథకవి సార్వభౌముడు'. ఇలా మరే హీరో విషయంలో జరిగి ఉండదేమో! ఎన్.టి.ఆర్. చివరి సినిమాలపై ఓ విశ్లేషణ.



'మేజర్ చంద్రకాంత్' చిత్రంలో



శారద, ఎన్.టి.ఆర్, మోహన్‌బాబు, న

# ఎన్.టి.ఆర్. చివరిచిత్రం 'మేజర్ చంద్రకాంత్'

సంచలనానికి మారుపేరు ఎన్.టి.ఆర్. చలన చిత్ర పరిశ్రమలో మకుటంలేని మహారాజుగా వెలుగొందుతున్న తరుణంలో నటనకి గుడ్‌బై చెప్పి 'రాజకీయాలకే నా జీవితం అంకితం' అని ప్రకటించి సంచలనానికి తెర తీశారు. అలాగే రాజకీయపార్టీని ప్రారంభించిన తొమ్మిదినెలలకాలంలోనే ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి తలపండిన రాజకీయవేత్తలు సైతం ముక్కున వేలువేసుకునేలా చేశారు. ఎవరేమి అన్నా, అనుకున్నా లెక్కచేయకుండా ముఖ్యమంత్రిగా ఉంటూనే మళ్లీ సినిమాలో నటించి సరికొత్త రికార్డ్ నెలకొల్పారు ఎన్.టి.ఆర్. ఇలా ఆయన విశిష్టత గురించి చెప్పడానికి అక్షరాలు చాలవు. తమ అభిమాన కథానాయకుడు మళ్లీ ఓ సాంఘిక చిత్రంలో నటిస్తే చూసి తరించాలనుకున్న అశేష అభిమానుల అభీష్టం మేరకు 'మేజర్ చంద్రకాంత్' చిత్రంలో నటించడానికి ఎన్.టి.ఆర్. అంగీకరించారు. పదేళ్ల అనంతరం అంటే 'నాదేశం' చిత్రం తర్వాత ఆయన నటించే సాంఘిక చిత్రం ఇదే కావడంతో 'మేజర్ చంద్రకాంత్' ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సినిమాకి మోహన్‌బాబు నిర్మాత కావడం, కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించడం... బంగారానికి తావి అబ్బినట్లయింది.



ఎన్.టి.ఆర్., శారద, మోహన్‌బాబుకు సూచనలిస్తున్న రాఘవేంద్రరావు

'మేజర్‌చంద్రకాంత్' చిత్రంలో రిటైర్డ్ మిలటరీ ఆఫీసర్‌గా ఎన్.టి.ఆర్. నటించారు. ఆయన భార్యగా శారద, తనయునిగా మోహన్‌బాబు నటించారు. అమ్రిష్‌పురి విలన్. నగ్మా, రమ్యకృష్ణ కథానాయికలు. 'పరుచూరి బ్రదర్స్'గా ఎన్.టి.ఆర్.తో నామకరణం చేయించుకున్న వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ కలిసి ఎన్.టి.ఆర్., రాఘవేంద్రరావు కలయికలో వచ్చే చిత్రానికి రచన చేయడం అదే మొదలు, అదే తుది కూడా.

'దేహానికి రిటైర్‌మెంట్ ఉంది కానీ దేశభక్తికి లేదు' అని భావించే ఉదాత్తమైన పాత్రను 'మేజర్ చంద్రకాంత్' చిత్రంలో పోషించారు ఎన్.టి.ఆర్. ఈ సినిమాలోని 'పుణ్యభూమి నాదేశం నమోనమామి' పాటలో అల్లూరి సీతారామరాజు, వీర శివాజీ, వీరపాండ్యకట్ట బ్రహ్మన, నేతాజీ గెటప్స్‌లో కనిపించి అభిమానులను అలరించారు.


'మేజర్ చంద్రకాంత్' చిత్రంతో ఎన్.టి.ఆర్. 45 ఏళ్ల నటజీవితం ముగిసింది. ఇదే ఆయన నటించిన చివరి చిత్రం.

పదేళ్ల అనంతరం ఎన్.టి.ఆర్. నటించే సాంఘిక చిత్రం కావడంతో ఆయన కాంబినేషన్‌లో కనీసం ఒక్క సీన్‌లోనైనా నటించాలని తారలంతా ఉవ్విళ్లూరడం తరగని ఎన్.టి.ఆర్. కరిజ్మాకు ఒక నిదర్శనం.

ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్.పై చిత్రీకరించిన "పుణ్యభూమి నాదేశం నమో నమామి.." అంటూ జాలాది రాసిన పాటను సంగీత దర్శకుడు కీరవాణి స్వరపరచగా బాలు అద్భుతంగా పాడి ఆపాటకు శాశ్వతత్వం కల్పించారు.

ఈ చిత్ర నిర్మాణం మోహన్‌బాబు జీవితంలో ఓ మధురఘట్టం అని చెప్పాలి. తన చిత్రంలో తన ఎదుటే, తాను అమితంగా అభిమానించే అన్నగారు ఉండటం... ఆయనకు మరపురాని మధురానుభూతి నిచ్చింది. అలాగే భారీ తారాగణంతో నిర్మాణ పరంగా ఎక్కడా రాజీపడకుండా ఇంత పెద్ద చిత్రాన్ని కేవలం నాలుగు నెలల్లో నిర్మించడం నిర్మాతగా మోహన్‌బాబు సమర్థతకి, పకడ్బందీ ప్లానింగ్‌కు నిలువెత్తు నిదర్శనం.

"అన్నయ్య ఎన్.టి.ఆర్. కెరీర్‌లో చెప్పుకోదగ్గ చిత్రాన్ని నిర్మించే అదృష్టం మా సంస్థకు లభించడం ఆనందంగా ఉంది" అంటారు మోహన్‌బాబు. ■



"మహాభారతాన్ని తెలుగులో చెప్పిన నన్నయ్య, తిక్కన, ఎర్రన తర్వాత మనం సగర్వంగా చెప్పుకునే సరస్వతీ వరప్రసాది శ్రీనాథుడు. 'మరుత్తరాట్ చరిత్ర', 'శాలివాహన సప్తశతి', 'శృంగార నైషధం', 'కాశీఖండం', 'హరవిలాసం', 'పల్నాటి వీర చరిత్ర'... శ్రీనాథుని కావ్యాలు. తెలుగుతనం ఆయన కవితాధనం. తెలుగు జనం ఆయన జీవనవనం. శ్రీనాథుని చాటు పద్యాలు నాటికీ నేటికీ కస్తూరి పరిమళాలు వెద జల్లుతునే ఉన్నాయి. కన్నెపిల్ల

# విడుదలైన చివరి చిత్రం

# శ్రీనాథ కవిసార్వభౌముడు

పరిమళంతో పాటు కరివేపాకు సువాసనపై కూడా సమానంగా, సరదాగా కవిత చెప్పిన కమనీయ పురుషుడు' అంటారు ముళ్లపూడి వెంకటరమణ. బాపు దర్శకత్వంలో రమణ రచించగా ఎన్.టి.ఆర్. నిర్మించిన 'శ్రీనాథ కవి సార్వభౌముడు' విడుదలైన ఆయన చివరి చిత్రం కావడం గమనార్హం. ఆ చిత్ర విశేషాలు...

తెలుగు జాతి కలకాలం పదిలపరుచుకునే మహా కావ్యాలు రచించాడు శ్రీనాథుడు. భాషకు, దేశానికి ఆ మహాకవి చేసిన సేవ అపారం. అందుకు తగిన గౌరవాలు, కనకాభిషేకాలు అందుకున్నారు. తెలుగు భాషకు సంస్కృతం సరసన సరిపీట వేయించిన శ్రీనాథుడు పల్లెపదులు వల్లెవేసుకునే ద్విపద రచనలు చేస్తాడా? చేసినా ఆనాటి ఏలికలు అంగీకరిస్తారా? అనుకునేవారు. కానీ వెరుపెరుగని శ్రీనాథుడు ప్రజల కోసం పలనాటి వీరకథ రచించాడు. తెలుగు వీరుల పౌరుషాన్ని కవితలో పలికించాడు. ఎన్నో ఉత్తమ లక్షణాలు కలిగిన శ్రీనాథుని పాత్రను పోషించాలనే కోరిక ఎన్.టి.ఆర్.కు చిరకాలంగా ఉండేది. 1966లో భారత్ ఫిలిమ్స్ సంస్థ అధినేత జి.రామినీడు దర్శకత్వంలో గుమ్మడి పోతనగా 'భక్త పోతన' చిత్రం

నిర్మిస్తూ అందులో శ్రీనాథుడు పాత్ర పోషించాలని ఎన్.టి.ఆర్.ని అడిగారు. సముద్రాల రాఘవాచార్యులు రికమండేషన్ అది. ఆరు నెలల సమయం తనకు కావాలని, ఆరోజుల్లో కవిగారు తనవెంట ఉండటమో, లేక తనే ఆయనతో ఉండటమో చేస్తానని ఎన్.టి.ఆర్. చెప్పారు. ఔపోసన పట్టడం దగ్గర నుంచి అన్నీ ఈ ఆరునెలల కాలంలో నేర్చుకుని బ్రాహ్మణత్వాన్ని ఆపాదించుకుంటానని ఆయన దర్శక నిర్మాతలకు చెప్పారు. ఆ తరువాత గుండు కొట్టించుకుని నటిస్తానని, రెండు నెలల్లో సినిమా పూర్తి చేద్దామని ఎన్.టి. ఆర్. చెప్పినప్పుడు "ఎందుకండి... మీకో పిలకవిగ్గు పెట్టిస్తాం" అన్నారు వాళ్లు. దాంతో ఎన్.టి.ఆర్. ఉగ్రుడై "ఆహా చాలా మంచి సలహా ఇచ్చారు. ఆ పాత్ర నేను చెయ్యను. మీరు వెళ్ల వచ్చు" అన్నారు. అలా ఆ పాత్రను వదులుకున్నారు ఎన్.టి.ఆర్. అయినా శ్రీనాథుని పాత్ర అప్పటినుంచి ఆయన్ని వెంటాడుతూనే ఉంది.

1983లో స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించాలనుకుని జె.వి.రాఘవులు సంగీత దర్శకత్వంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి రాసిన కొన్ని పాటలను రికార్డ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా అప్పటికి ఆయన ఎంతో బిజీగా ఉన్నప్పటికీ శ్రీనాథుని పాత్ర మీద ఉన్న మమకారంతో తీరిక చేసుకుని ఆ పాటలు రికార్డ్ చేయించారు. అయితే రాజకీయపరమైన ఒత్తిడులు, ముఖ్యమంత్రిగా పదవిలో ఉండగా సినిమాలలో నటించాలంటే కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి రాకపోవడం ఇత్యాది కారణాలవల్ల ఆ చిత్ర నిర్మాణం వాయిదా పడింది. ఏడాది తర్వాత అంటే 1984 డిసెంబరు 29న మరోసారి పాటల రికార్డింగ్ జరిపారు ఎన్.టి.ఆర్. అయితే ఇంతకుముందు జె.వి.రాఘవులు సంగీత దర్శకత్వంలో రికార్డు చేసిన పాటలు తనకు సంతృప్తి కలిగించలేదు. తిరిగి వాటిని పెండ్యాల నాగేశ్వరరావు సంగీత దర్శకత్వంలో రామకృష్ణతో పాడించి రికార్డ్ చేశారు ఎన్.టి.ఆర్. 'శ్రీనాథ కవిసార్వభౌముడు' పేరుతో ఈ చిత్రాన్ని తన దర్శకత్వంలోనే నిర్మించాలని, అందులో శ్రీనాథుని పాత్ర తనే పోషించాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఈ సినిమాకి మాటలు, పాటల రచయిత నారాయణ రెడ్డి. కేంద్ర

రాజేంద్రప్రసాద్‌తో..





బాపు, రమణతో ఎన్.టి.ఆర్.

కథలే చూసే రోజుల్లో ఎంతో వైభవంగా బతికిన శ్రీనాథుడు కష్టాలపాలై చనిపోవడం చూడరు' అన్నారు. అయినా రామారావు వెను కాడలేదు. "అది కాదు బ్రదర్.. కింద నుంచి పైకి వెళ్లి సాధించిన తోటరాముడు ప్రేక్షకులకు ఉత్సాహమిస్తే, పైనుంచి దెబ్బతిని పడిపోయిన వారికథలు హెచ్చరికలు చేస్తాయి కదా. అయినా శ్రీనాథుడు తెలుగువారి సంపద, అమృత భాండం. ఆ సంపదను అన్ని తరగతులకు, ఆ అమృతాన్ని చాలామంది రుచి చూసేలా చెయ్యాలి. శ్రీనాథుని పాత్రను పోషించడం నా జీవితాశయం. మీరన్నట్లు అందరూ చూడక పోయినా పరవాలేదు. నాకు తృప్తికలిగితే చాలు" అని చెప్పి వారిని ఒప్పించారు. అంతేకాదు ఏ విషయంలోను తను జోక్యం చేసుకోనని, చిత్ర నిర్మాణంలో పూర్తి స్వేచ్ఛ ఇస్తానని చెప్పారు. ఒక ఆర్టిస్టుగా సెట్‌లోకి వచ్చి ఎలా నటించమంటే అలా నటించి వెళ్లిపోతానని కూడా చెప్పడం ఆ పాత్రపట్ల ఆయనకున్న ప్రేమని తెలియ బరుస్తుంది. అప్పటివరకు 320 పాత్రలతో మహా నటునిగా కీర్తి గాంచిన ఎన్.టి.ఆర్. ఇలా శ్రీనాథుని పాత్ర కోసం తపించిన తీరు బాపు రమణలను ఆశ్చర్యపరచింది. దాంతో వారు కూడా ఈ చిత్ర నిర్మాణాన్ని ఒక మంచి అవకాశంగా భావించి శక్తివంచన లేకుండా పనిచేశారు.

ప్రభుత్వం నుండి మరో రెండు నెలల్లో అనుమతి లభించవచ్చని, అది రాగానే షూటింగ్‌ను ప్రారంభిస్తామని ఎన్.టి.ఆర్. ఆ సమయంలో పత్రికల వారికి చెప్పారు. అయితే 1985 మార్చి 9న మూడవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయనకు ఆ తర్వాత సినిమాల గురించి ఆలోచించే తీరిక లేదు.

**ఏడేళ్ల అనంతరం**

ఏడేళ్ల అనంతరం ఈ చిత్ర నిర్మాణ కార్యక్రమాలు మళ్లీ ఊపందుకున్నాయి. రాజకీయాల్లో తీరిక లేకుండా ఉన్న తను దర్శకునిగా చిత్రానికి న్యాయం చేయలేనేనే అనుమానంతో ఆ బాధ్యతలు బాపుకి అప్పగించారు ఎన్.టి.ఆర్. ఈ విషయం చెప్పగానే బాపు- రమణ మొదట భయపడ్డారు. 'వద్దుసార్! శ్రీనాథుడు అంటే అందరిలాగే మాకు భక్తి, గౌరవం ఉన్నాయి. కింది స్థాయి నుంచి పైకివెళ్లి రాజకుమార్తెను సాధించే హీరోల

కీ॥శే॥ నోరి నరసింహశాస్త్రి రాసిన 'కవిద్వయం', 'శ్రీనాథకవిసార్వభౌమ' నవలల ఆధారంగా ఈ చిత్రం స్క్రిప్టు తయారు చేశారు రమణ. ఊహించినట్లుగానే ఈ సినిమాని చాలామంది ప్రేక్షకులు చూడలేదు. ఎన్.టి.ఆర్. అభిమానులు, బాపు చిత్రాల కోసం ఆశగా ఎదురుచూసే ప్రేక్షకులు మాత్రమే చూశారు. ఆర్థిక నష్టాలను లెక్కచేయకుండా శ్రీనాథుని పాత్రను పోషించాలనే మక్కువతో ఈ సినిమా నిర్మించిన రామారావు మాత్రం సినిమా తొలికాపీ చూసి మహదానందపడ్డారు. బాపుని కౌగిలించుకుని అభినందనలు తెలిపారు. ఈ చిత్రంలో జయసుధ, గుమ్మడి, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, ఏవీఎస్ తదితరులు నటించారు. ■

# ఇద్దరూ ఇద్దరే

"నేను పరిశ్రమకి వచ్చిన నాలుగేళ్ల తర్వాత ఎన్.టి.ఆర్. సినీరంగ ప్రవేశం చేయడంతో నాకు గట్టిపోటీ మొదలైనట్టనిపించింది. ఆయన్ని పరిశీలనాత్మక దృష్టితో చూడడం ప్రారంభించాను. స్ఫురద్రూపం, ఆజానుబాహు శరీరం, చురుగ్గా చూసేకళ్లు, ఏ కోణం నుంచి చూసినా అందంగా కనిపించే ముఖం, గంభీరమైన గళం... ఇత్యాదులు కలిసిన ఒక కళాత్మక శక్తి ఎన్.టి.ఆర్. ఇన్ని ప్లస్ పాయింట్లు ఉన్న కళాకారుడు నాకు తెలిసి అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏ భాషలోనూ కనిపించలేదు" పదేళ్ల క్రితం ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అక్కినేని నాగేశ్వరరావు మనస్ఫూర్తిగా చెప్పిన మాటలివి.

ఈ ఇద్దరు మహానటుల కలయిక గురించి మరికొన్ని వివరాలు...



'తెనాలి రామకృష్ణ' చిత్రంలో ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్.

# మా (ఆ) ఇద్దరి కథ



డాక్టర్ నందమూరి తారక రామారావు, డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు... ఇద్దరూ ఇద్దరే... తెలుగు సినిమా రంగానికి రెండు కళ్లు. తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోలకు కొరతగా ఉన్న రోజుల్లో ప్రవేశించి తమ ప్రతిభతో అత్యున్నత స్థాయికి చేరుకుని తెలుగుజాతి గర్వించదగిన చిత్రాలను ఇద్దరూ అందించారు. దశాబ్దాల తరబడి తెలుగు చిత్ర పరిశ్రమకి వీళ్లిద్దరూ రథచక్రాలుగా ఉన్నారు. తెలుగు చిత్ర రథాన్ని తెలుగు గడ్డకు తరలించడానికి ఎంతో కృషిచేశారు. తమ సంపాదనని మళ్లీ సినిమా రంగానికే వెచ్చిస్తూ... ఆరు నెలల తేడాతో హైదరాబాద్‌లో స్టూడియోలు నిర్మించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. వారిద్దరి మధ్య పోటీ, పోలిక, వారి జయాపజయాలే తొలి తెలుగు సినిమా చరిత్ర అనడం అతిశయోక్తి కాదు. నాగేశ్వరరావు 'క్రాఫింగు', రామారావు 'వాకింగు' ప్రజా జీవితంలో ఒక భాగమయ్యాయి. పాలేర్లు మొదలు ప్రొఫెసర్ల వరకూ అన్ని వర్గాలపై ఈ నటుల ప్రభావం పడింది. తెలుగు చిత్ర పరిశ్రమకు గుర్తింపు, గౌరవం, హోదా, డబ్బు తెచ్చిపెట్టిన ఘనత వీరిద్దరిదే. నియమబద్ధ జీవితంతో చిత్ర పరిశ్రమకు ఒక ఒరవడి దిద్దారు.

ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్ ఇద్దరూ యుక్త వయసులో స్టేజీ మీద ఆడ వేషాలు వేసినవారే. ముదినేపల్లిలో ఎక్సెల్సియర్ నాటక సమాజంలో నాగేశ్వరరావు 'చంద్రమతి' వేషం వేస్తే, 1940లో కాలేజీలో ఇంటర్ చదివే రోజుల్లో 'రాచమల్లు దౌత్యం' నాటకంలో నాగమ్మ వేషం వేశారు

రామారావు. మీసం తియ్యడానికి నిరాకరించి, అలాగే నటించడంతో ఆ తర్వాత కాలేజీలో అందరూ 'మీసాల నాగమ్మ' అని ఆయన్ని పిలిచేవారు.

1931లో మాట నేర్చిన తెలుగు సినిమా పదేళ్లు పూర్తిచేసుకున్న సమయంలో నాగేశ్వరరావు చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. ఆయన వచ్చిన ఏడేళ్ల అనంతరం రామారావు రంగప్రవేశం చేశారు. మొదటి చిత్రాలు 'ధర్మపత్ని', 'మనదేశం'లో వీరిద్దరూ గుర్తింపు పొందని పాత్రల్లో నటించినా, ఆనాడు వారి జీవితంలో వెలిగించిన ఆ గోరంతదీపం కొండంత వెలుగును ఇవ్వడంతో తదనంతర కాలంలో మహానటులుగా ఎదగ గలిగారు. ఎ.ఎన్.ఆర్. చిత్రపరిశ్రమలో ప్రవేశించిన రోజుల్లో ఆర్టిస్టులమధ్య సంచలనమైన పోటీలేదు. అయితే ఉద్దండులైన నటులుండేవారు. అలాగే ఎన్.టి.ఆర్. హీరోగా ఎంటరైన సమయానికి నాగయ్య, నారాయణరావు, నాగేశ్వరరావు ఎస్టాబ్లిష్డ్ హీరోలు. అయినా సరే... పోటీని తట్టుకుని నిలవటమే కాదు అచిరకాలంలోనే వారందరినీ అధిగమించ గలిగారు ఈ ఇద్దరూ. 'స్టార్‌డమ్' అనేమాట ఈ మహానటుల కాలంలోనే తెలుగునాట ప్రవేశించింది. తమదైన అభినయాన్ని స్టార్‌డమ్‌తో మిళితంచేసి ప్రేక్షకుల జయజయధ్వానాలు అందుకున్నారు. పోటాపోటీగా ప్రజలను రంజింప చేసే చిత్రాల్లో నటించాలన్న తపన వీరిద్దరిలోనూ ఉండేది. క్రమశిక్షణ అనే పదానికి పర్యాయపదంగా నిలిచిన వీరిద్దరు మరెందరికో ఆదర్శంగా నిలిచి, పరిశ్రమకు క్రమశిక్షణ నేర్పించారు.

రెండు దశాబ్దాల పాటు (1950-70) తెలుగు సినిమా స్వర్ణయుగాన్ని చవిచూసింది. ఈ ఇరవై ఏళ్లలో నందమూరి, అక్కినేని తమ అభినయంతో ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించడమే కాకుండా.. తెలుగు సినిమా అభివృద్ధికి ప్రతి సంవత్సరం ఎక్కువ చిత్రాల్లో నటిస్తూ, నవతరం హీరోలకు కూడా అవకాశాలు కల్పించారు. పరిశ్రమను నమ్ముకున్న





పల్లెటూరిపిల్లలో అక్కినేని, అంజలీదేవితో ఎన్.టి.ఆర్

కుటుంబాల మనుగడకు ఎంతగానో తోడ్పడ్డారు. స్వర్ణయుగం తొలి దశాబ్దంలో విడుదలైన చిత్రాల సంఖ్యలో సగభాగం ఈ మహానటులు నటించిన చిత్రాలే ఉండటం గమనార్హం.

**14 చిత్రాల సహచర్యం**

ఈ ఇద్దరికీ దొరికిన గొప్ప అదృష్టం. ప్రేక్షకులకు నయనానందకర అంశం ఏమిటంటే.. వీరిద్దరూ కలిసి 14 చిత్రాలలో నటించడం. ప్రపంచ సినిమా చరిత్రలోనే సమానస్థాయి కలిగిన ఇద్దరు స్టార్స్ ఇన్ని చిత్రాల్లో కలిసి నటించిన దాఖలా లేదు. 'పల్లెటూరి పిల్ల' (1950)తో ప్రారంభించి ఆ తరువాత 'సంసారం' (1950), 'పరివర్తన' (1954), 'మిస్సమ్మ' (1955), 'తెనాలి రామ కృష్ణ' (1956), 'చరణదాసి' (1956), 'మాయాబజార్ (1957), 'భూకైలాస్'(1958), 'రేచుక్క' (1954, అక్కినేని గెస్ట్), 'గుండమ్మకథ' (1962), 'శ్రీ కృష్ణార్జునయుద్ధం' (1963), 'చాణక్య చంద్రగుప్త' (1977), 'రామకృష్ణులు' (1978), 'సత్యం-శివం' (1981) చిత్రాల్లో నటించారు.

ఒకరిని చూసి ఒకరు అసూయపడిన పరిస్థితి ఈ మహానటులకు ఎప్పుడూ కలగలేదు. అభిమానులు కానీ, ప్రేక్షకులు కానీ తమకు ఎప్పుడూ అలాంటి పరిస్థితి కల్పించలేదని చెబుతుండేవారు. ఎందుకంటే ఎన్.టి.ఆర్. ధోరణి వేరు, ఆయన పోషించే పాత్రలు వేరు. అలాగే ఎ.ఎన్.ఆర్. పాత్రలూ విభిన్నమైనవే. వాటివల్ల ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. ప్రేక్షకుల మధ్య విభజన రేఖ ఏర్పడింది.

చదువు సంధ్యలు లేని గ్రామీణులు, వెనుకబడిన ప్రాంతాల్లో నివసించిన వెనకబడిన కులాలకు చెందిన ప్రజలు, ఎప్పుడోతప్ప ఇంటి నాలుగు గోడలు దాటి బయటకు రాలేని మహిళలు, పిల్లలు ఎన్.టి.ఆర్. సినిమాలను అభిమానించేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే మాస్ ప్రేక్షకులను ఆయన, క్లాస్ ప్రేక్షకులను ఈయన అలరించేవారు, ఆనందపరిచేవారు.

ఇద్దరికిద్దరూ ఎవరికివారే సాటిగా నిరూపించుకున్న పాత్రలు ఎన్నో ఉన్నాయి. జానపదాల్లో ఒకరు 'బాల రాజు', మరొకరు 'తోటరాముడు' (పాతాళభైరవి),



ఒకరిది 'మల్లీశ్వరి', మరొకరిది 'విప్రనారాయణ'. ఒకరిది 'మూగమనసులు', ఇంకొకరిది 'రక్తసంబంధం', ఇలా ఎన్నో ఎన్నెన్నో...

**14 ఏళ్ల గ్యాప్**

ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. పరిశ్రమకు రెండు కళ్లని, సూర్యచంద్రులని, రామలక్ష్మణులని పిలిచేవారు. సొంత అన్నదమ్ముల్లాగా ఎంతో అన్యోన్యంగా మెలుగుతున్న వీరిద్దరిని చూసిన ఆ విధికే కన్ను కుట్టిందేమో... ఇద్దరినీ విడదీసింది. 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రం తర్వాత దాదాపు 14 ఏళ్లపాటు ఈ అగ్రనటులిద్దరి మధ్య మాటలే లేవు. 1977లో విడుదలైన 'చాణక్య చంద్రగుప్త' చిత్రంతో ఈ అన్నదమ్ములు మళ్లీ కలిశారు. తన సొంత చిత్రంలో 'బ్రదర్ నాగేశ్వరరావు'కి అతి ముఖ్యపాత్ర ఇచ్చి గౌరవించారు రామారావు. ఈ అగ్రనటులు మళ్లీ కలుసుకోవడంతో ఇరువర్గాల అభిమానుల ఆనందానికి అవధులే లేవు.

ఇక్కడ ఒక విషయం ప్రస్తావించాలి. ఎన్.టి.ఆర్.కు చాణక్యుని పాత్ర పోషించాలనే కోరిక ఉండేది. దీనికోసం కథను, స్క్రిప్ట్‌ని సిద్ధం చేసుకున్నారు కూడా. అయితే అక్కినేని ఆ పాత్రను పోషిస్తాననడంతో ఆ పాత్రను ఆయనకిచ్చి తను చంద్రగుప్తుని పాత్ర పోషించారు. ఈ చిత్ర ప్రారంభోత్సవ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో ఎన్.టి.ఆర్. మాట్లాడుతూ "నా సొంత సినిమాలో బ్రదర్‌కి నాకన్నా మంచి పేరు ప్రతిష్టలు రావాలి. ఈ చిత్రంలో చంద్రగుప్తుని కంటే చాణక్యుని పాత్ర చాలా గొప్పది. ఆ పాత్రకి ఎంతో ఆలోచించి బ్రదర్‌ని కావాలని ఎన్నుకున్నాను. ఇప్పుడు నా బాధ్యత మరింత పెరిగింది. 'దేవదాసు' పాత్ర పోషణ బ్రదర్‌కి స్థిరమైన కీర్తిప్రతిష్ఠలు సంపాదించి పెట్టింది. అదేవిధంగా చాణక్య పాత్రద్వారా బ్రదర్ నాగేశ్వరరావు సాటిలేని కీర్తి సంపాదించాలని కోరుకుంటున్నాను. అందుకు నేను శక్తివంచన లేకుండా


కృషిచేస్తాను. నా సొంత పిక్చర్‌లో తొలిసారిగా నటిస్తున్న బ్రదర్‌కి నాకంటే పేరు ప్రతిష్ఠలు రావాలని కోరుకుంటున్నాను" అన్నారు. ఈ మాట అక్కడే ఉన్న అక్కినేనితో పాటు ప్రతి ఒక్కరినీ కదిలించింది.

'చాణక్య చంద్రగుప్త' చిత్రం షూటింగ్ సమయంలో ఒక సంఘటన: నాగేశ్వరరావు ఉపయోగించే కప్పు, సాసరు ఆయన అసిస్టెంట్ నిర్లక్ష్యంవల్ల పగిలిపోయాయి. అందులోనే ఆయన కాఫీ, పాలు తాగేవారు. ఈ విషయం ఎన్.టి.ఆర్.కు తెలిసి కారేసుకుని వెంటనే బజారుకెళ్లి కొత్తవి కొనుక్కువచ్చారు. ఆ సమయంలో తను ఒక పెద్ద స్టార్‌ననే విషయం ఆయన మరిచిపోయారు. ప్రొడక్షన్ మేనేజర్‌కి చెబితే సరిపోయే ఆ విషయంలో ఎన్.టి.ఆర్. అంతగా రియాక్ట్ అయ్యారంటే తోటివారికి ఆయన ఇచ్చే గౌరవం, మర్యాద అలాంటివి. ఈ విషయాన్ని అక్కినేని స్వయంగా వెల్లడించారు.

ఈ సినిమా తర్వాత తన రెగ్యులర్ ప్రొడ్యూసర్ వి.బి.రాజేంద్రప్రసాద్‌తో కలిసి నాగేశ్వరరావు నిర్మించిన 'రామకృష్ణులు' చిత్రంలో ఎన్.టి.ఆర్.కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఎన్.టి.ఆర్. రెండో అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు నిర్మించిన 'సత్యం-శివం' చిత్రం వీరిద్దరి కలయికలో వచ్చిన చివరి చిత్రం.

**మళ్లీ కలతలు... కలయిక**

రాజకీయాలలోకి ప్రవేశించి పార్టీ పెట్టాలనుకున్నప్పుడు అక్కినేనితో సంప్రతించి, ఆయనని కూడా రాజకీయాల్లోకి ఆహ్వానించారు రామారావు. తన ఆరోగ్య కారణాలవల్ల రాలేనని చెప్పి, తన అభినందనలు తెలిపారు నాగేశ్వరరావు. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎన్.టి.ఆర్. పదవులు ఆఫర్ చేసినా 'మన స్నేహం ముఖ్యమైనది. ఈ పదవులు అవీ ఎందుకు బ్రదర్' అని చెప్పి సున్నితంగా తిరస్కరించారు అక్కినేని. ఇంతటి అనుబంధం కలిగిన వీరిద్దరి మధ్య అన్నపూర్ణ స్టూడియోస్‌కి చెందిన ఏడెకరాల స్థలం



అక్కినేని గెటప్‌కి తుదిమెరుగులు దిద్దుతున్న ఎన్.టి.ఆర్

విషయంలో మళ్లీ మనస్పర్థలు ఏర్పడి, ఏడేళ్లు దూరమయ్యారు. అలా దూరం కావడానికి, తిరిగి తామిద్దరం దగ్గర కావడానికి కూడా రామారావే కారణమని అక్కినేని చెబుతారు. తెలుగు సినిమాకు స్టార్‌డమ్ ఏమిటో నేర్పిన ఈ మహానటులిద్దరూ తమ మధ్య అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ ఏనాడూ బహిరంగంగా ఒకరినొకరు నిందించుకోలేదు.

**ఇద్దరికీ ఒకేసారి పద్మశ్రీ**

ఒక బిరుదు పొందడానికీ, ఒక సత్కారానికి అర్హుల వడానికి ఎంతో కృషి, దీక్ష అవసరం. తెలుగు చిత్ర పరిశ్రమను విస్తృతం చేయాలనే లక్ష్యంతో, ధ్యేయంతో కృషిచేసిన ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్. సేవలను ప్రేక్షకులే కాదు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. అందుకే 1968 జనవరి 26న ఇద్దరినీ ఒకేసారి పద్మశ్రీ బిరుదుతో సత్కరించింది, గౌరవించింది. ఆ గౌరవం తెలుగు సినిమా పరిశ్రమది, ప్రేక్షకులది కూడా.

**రెండు కుటుంబాలలోనూ ఆత్మీయానురాగాలు**

నాగేశ్వరరావు తల్లి పున్నమ్మగారికి ఎన్.టి.ఆర్. అంటే ప్రత్యేక అభిమానం. అందులోను దేవుడు పాత్రలు వేస్తుండటం కూడా ఆ అభిమానానికి మరో కారణం. ఎన్.టి.ఆర్. కూడా 'పెద్దమ్మ' అంటూ ఆమెని గౌరవించేవారు. 'చాణక్య-చంద్రగుప్త' చిత్ర నిర్మాణ సమయంలోనే పున్నమ్మగారు చనిపోవడంతో ఇద్దరూ కలిసి పంజాగుట్ట శ్మశానంలో దహనం చేసి వచ్చారు.

అలాగే ఎన్.టి.ఆర్ తండ్రి లక్ష్మయ్యగారు కూడా 'నా మూడో బిడ్డ' అని నాగేశ్వరరావుని చూపించి మురిసిపోయేవారు. 'చాణక్య-చంద్రగుప్త' చిత్రం షూటింగ్‌లో అక్కినేని ఉన్నన్ని రోజులూ లక్ష్మయ్యగారు అక్కడే ఉండేవారు.

■



'జనతా' కోటేశ్వరరావు, శివాజీగణేషన్, రామోజీరావుతో ఎ.ఎన్.ఆర్., ఎన్.టి.ఆర్.



# మా బావగారు... ఛాలెంజ్‌రాముడు

తాతినేని ప్రకాశరావు

ఎన్.టి.ఆర్., దర్శకుడు తాతినేని ప్రకాశరావుల సినీ జీవితం దాదాపు ఒకేసారి మొదలైందని చెప్పాలి. వీళ్లిద్దరూ ఒకే గదిలో చాలాకాలం కలిసి ఉండటమే కాకుండా విజయా సంస్థలో చేరి తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు. ఎన్.టి.ఆర్. హీరోగా నటించిన ఆరు చిత్రాలకు ప్రకాశరావు దర్శకత్వం వహించారు. రెండు చిత్రాలు నిర్మించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని 'విజయచిత్ర' మాస పత్రికలో ఇలా వివరించారు తాతినేని ప్రకాశరావు.



చలనచిత్ర పరిశ్రమలో కొత్త నటీనటుల అవసరం ఏర్పడుతున్న రోజులవి. ప్రసిద్ధ దర్శక నిర్మాత ప్రసాద్‌గారు విజయవాడ వచ్చారు. అప్పుడు ఆయన కొంతమంది కొత్త నటీనటులను చూడాలనుకున్నారు. ప్రజా నాట్యమండలిలో ఉండే కొందరు నటుల గురించి చెప్పడానికి నేను కూడా ప్రసాద్‌గారిని చూడడానికి వెళ్ళాను. అప్పటికి ప్రసాద్‌గారితో నాకు పరిచయం లేదు. నేను లోపలికి వెళ్లగానే, ఆకర్షణీయంగా, అందంగా ఉన్న ఒక యువకుడు ప్రసాద్‌గారి గదిలోంచి బయటకు రావడం గమనించాను. నేను లోపలికి వెళ్లి మాట్లాడిన తర్వాత ఆయన ఎవరని అడిగాను.. "ఆయన సబ్‌రిజిస్ట్రార్ ఉద్యోగం చేస్తున్నాడు. నాటకాల్లో అనుభవంగల వ్యక్తి. సినిమాల్లోకి చాలా బావుంటాడు. కన్ను, ముక్కూ... అన్నీ తీరుగా వున్నాయి. స్క్రీన్ టెస్ట్ చేద్దామనుకుంటున్నాను" అన్నారు ప్రసాద్‌గారు. ఆ యువకుడే ఎన్.టి.ఆర్.

ప్రసాద్‌గారితో పరిచయమైన తర్వాత, నేను ఆయన దగ్గర 'ద్రోహి' చిత్రానికి అప్రెంటీసుగా చేరాను. ఆ సమయంలోనే ప్రసాద్‌గారు ఎన్.టి.రామారావును టెస్ట్‌కోసం పిలిపించారు. ఆ టెస్ట్ ఫలానా పాత్రకూ, ఫలానా చిత్రానికి అనికాదు. మామూలుగా తీసి చూద్దామని పిలిపించారు. టెస్ట్ తీశారు. టెస్ట్ తర్వాత ఫలితాలు చాలా బాగున్నాయని ప్రసాద్‌గారు చెప్పారు. ముఖ్యంగా ఆయనకు నచ్చినది- నిండైన ఎన్.టి.ఆర్. విగ్రహం, గంభీరమైన


గొంతూ. స్పష్టమైన సంభాషణల ఉచ్చారణ. సందర్భం వస్తే మంచి పాత్రతో పరిచయం చెయ్యాలి' అన్నారు ప్రసాద్‌గారు.

శోభనాచల వారు 'మనదేశం' చిత్రం ప్రారంభిస్తున్నప్పుడు నేను ప్రసాద్‌గారికి అసిస్టెంటునయ్యాను. అందులో ఉన్న ఒక ముఖ్యమైన ఇన్‌స్పెక్టర్ పాత్రను రామారావుకు ఇవ్వాలనుకుంటున్నట్లుగా ప్రసాద్‌గారు చెప్పారు. నిజానికి ఆయనకు ఆ పాత్రద్వారా రామారావును పరిచయం చెయ్యాలన్న ఉద్దేశం లేదు. 'హీరో'గానే పరిచయం చేయాలనుకున్నారు. కానీ, కొంత అనుభవం కలుగుతుంది, సినిమా అంటే బాగా తెలుస్తుంది, దానివల్ల తర్వాత హీరోపాత్ర ధరించడం మరింత సులువవుతుంది అన్న ఉద్దేశంతో ఇన్‌స్పెక్టర్ పాత్రకు రామారావును నిర్ణయించారు.

నాకు రామారావుగారితో పరిచయం అప్పుడే ఆరంభమైంది. ఆ పరిచయం మంచి స్నేహానికి దారి తీసింది. నేను, రామారావు, టి.వి.రాజు, రంగారావు కలిసి ఒకే రూములో ఉండేవాళ్లం. రామారావు తను ధరిస్తున్నది ఇన్‌స్పెక్టర్ పాత్రే అయినా, దానికోసం బాగా కృషిచేశారు. 'సినిమా టెక్నిక్'లో నటించడానికి శ్రమించారు. అయితే, ఆయన రంగస్థల నటుడు కావడంవల్ల మొదట్లో ఆ నటన కొంత నాటకీయంగా కనిపించేది. కనుబొమలు ఎగరెయ్యడం, చేతులు బాగా తిప్పడం, సంభాషణలు ఒత్తి ఒత్తి గట్టిగా చెప్పడం చేసేవారు. ప్రసాద్‌గారు ప్రతిదీ సరిదిద్దారు. 'సినిమా మోతాదు' ఎలా ఉండాలో చేసి చూపించేవారు. రామారావుగారు అన్నీ నేర్పుగా, క్షుణ్ణంగా తెలుసుకునేవారు.

ఆయనకు ఒక పనిమీద ఉండే శ్రద్ధ చాలా గట్టిది. పట్టుదల, దీక్ష అప్పట్నుంచే ఉండేవి. నేను, రంగారావు, టి.వి.రాజు కలిసి రాత్రి రెండోఆట సినిమాలకు వెళ్ళే వాళ్ళం. రామారావు మాతో వచ్చేవారు కాదు. "ఎందుకు బ్రదర్.. నిద్ర దండగ. దానివల్ల ఆరోగ్యం పాడవుతుంది" అనేవారు. మేము ఏ రాత్రో ఇంటి కొచ్చి పడుకునేవాళ్లం. ఆయన చీకటితోనే లేచేవారు. నిష్ఠగా వ్యాయామం చేసేవారు. రోజూ విధిగా వ్యాయామం చేయడం అన్నది నాటి నుంచి నేటివరకు


'పల్లెటూరు'లో ఎన్.టి.ఆర్.




ఉన్న అలవాటు ఆయనకు. ఆ తర్వాత చెంబు తీసుకుని నోటి ముందు బోర్లించుకుని "ఆ" అని గట్టిగా అరుస్తూ ఉండేవారు. మంచి నిద్రలో ఉండేవాళ్లమేమో, మేము లేచి 'ఏమిటది?' అని విసుక్కునే వాళ్లం. 'వాయిస్ కల్చర్ కోసం ఈ సాధన, మీకేంతెలుసు?' అనేవారు ఆయన. గొంతును అదుపులో పెట్టుకోవడం, తమ శ్రుతిలో నడిపించడం నటునికి అవసరం అని, అది సాధించాలి అంటూ ఉండేవారు.

కొంతకాలానికి నేను, ఆయన సన్నిహితులమయ్యాం. నన్ను ఆయన 'బావగారూ'! అని పిలవడం ప్రారంభించారు. నేనూ అలాగే పిలిచేవాణ్ణి.

'మనదేశం' చిత్రం విడుదలైన తర్వాత బావగారికి మంచి పేరు వచ్చింది. అతనికి మంచి భవిష్యత్తు ఉందని అందరూ అన్నారు. ముఖ్యంగా ప్రసాద్ గారికి బావగారి మీద ఎంతో నమ్మకం. 'నిస్సందేహంగా ఇతను మంచి నటునిగా నిలబడగలుగుతాడు. ఎందుచేతనంటే, మనిషి దగ్గర నియమం, నిష్ఠ, పట్టుదల ఉన్నాయి. మంచి అలవాట్లు ఉన్నాయి. కృషి చేయగలనన్న ధీమా ఉంది. వీటికి తోడు మంచి గాత్రం, అనుభవం ఉన్నాయి' అనేవారు ప్రసాద్‌గారు.

విజయావారు 'షావుకారు' చిత్రం ఆరంభిస్తూ బావగారిని పర్మనెంట్ ఆర్టిస్టుగా తీసుకున్నారు. ప్రసాద్‌గారితో పాటు మేమందరం కూడా చేరాం. పని ఉన్నా, లేకపోయినా అందరమూ ఉదయమే స్టూడియోకి వస్తే మళ్లీ రాత్రే ఇళ్లకు వెళ్లేవాళ్లం.

విజయాలో అంతా ఒక స్కూల్‌లా ఉండేది. అందరమూ అన్ని విషయాలూ నేర్చుకుంటూ ఉండేవాళ్లం.

'బావగారి'తో నేను తర్వాత రూము నుంచీ విడిపోయినా, అందరం కలిసి 'రిపబ్లిక్ గార్డెన్స్' అనే బిల్డింగ్‌లో వేరు వేరు రూమ్స్‌లో ఉండేవాళ్లం. అదంతా ఒక చిన్న కాలనీలా ఉండేది. రంగారావుగారు కూడా అక్కడే ఉండేవారు.

'పాతాళభైరవి' టైములో కె.వి.రెడ్డిగారు నాకు 'స్టంట్స్' నిర్వహించే బాధ్యత అప్పజెప్పారు. అందులో బావగారికి, రంగారావుకు ఆ చిత్రం క్లైమాక్స్‌లో జరిగే ఫైట్స్‌కు ఎన్నో రిహార్సల్స్ జరిగాయి. ఎంత 'రిస్కీ షాట్స్' అయినా సరే తానే చేస్తాననేవారు బావగారు. అంత మొండి ధైర్యం ఆయనది. అయితే మరీ రిస్కీగా ఉంటే దర్శకులే వద్దనేవారు. మేము బయట ఎంత 'బావగారూ' అనుకున్నా, స్టంట్స్ రిహార్సల్స్ దగ్గర మాత్రం నా మాట కాదనేవారు కాదు. దర్శకుడో, ఎవరో, ఎవరైనా సరే ఒక అధికారి అంటే... ఆయన



'పిచ్చిపుల్లయ్య' చిత్రంలో ఎన్.టి.ఆర్., కృష్ణకుమారి


ఎవరైనా సరే, ఆయన మాట శిరసావహించడం బావగారిలో ఉన్న ఇంకో గొప్ప గుణం.

పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్స్ అనే కొత్త సంస్థ 'పల్లెటూరు' చిత్రాన్ని ఆరంభిస్తూ నాకు మొదటిసారిగా దర్శకత్వ బాధ్యత అప్పజెప్పింది. ఆ చిత్రంలో కొత్త నటీనటులను ప్రవేశపెట్టాలని నిర్మాతలు ఆలోచించారు. అయితే నేను దానికి అంగీకరించలేదు. ఎందుచేతనంటే, సంస్థ కొత్తది. దర్శకుడిగా నేనూ కొత్తవాడిని. ఇక నటీనటులు కూడా కొత్తవారైతే అంతా కొత్తగానే ఉంటుంది. రామారావుగారు, రంగారావుగారు అప్పటికే తారలుగా పేరు తెచ్చుకున్నారు. కావాలంటే నేను వాళ్లతో మాట్లాడి ఒప్పిస్తాను అని చెప్పారు. బావగారు, రంగారావుతో మాట్లాడాను. వెంటనే బావగారు వెరీగుడ్ అన్నారు. తన సహకారం అన్నివిధాల ఉంటుందన్నారు. సావిత్రి ఆ చిత్రంలోనే మొదటిసారిగా నాయిక పాత్ర ధరించారు.

'పల్లెటూరు' తర్వాత బావగారు తన నాటక సంస్థ పేరిట 'పిచ్చి పుల్లయ్య' అనే చిత్రాన్ని సొంతంగా ఆరంభించారు. ఆ చిత్రానికి దర్శకునిగా నన్నే నియమించారు. చిత్ర నిర్మాణం ప్రారంభించిన దగ్గరనుంచి ఆయనకు శ్రద్ధ మరింత ఎక్కువైంది. ప్రతీ విషయం, దగ్గరుండి చూసుకునేవారు. ప్రతీ పనీ చేయించుకునేవారు. దేనికీ రాజీపడేవారు కాదు. అన్ని శాఖల మంచి చెడులు తెలుసు. ముఖ్యంగా సంగీతమంటే మంచి ఉత్సాహం ఉండేది. అది చూసి ఆయన దక్షతగల నిర్మాత కూడా కాగలరని, మంచి స్థాయిగల చిత్రాలు నిర్మించగలరని అనుకునేవాడిని.

'బావగారు' నిగూఢమైన మనిషి తొందరగా ఎవరికీ అర్థమయ్యే మనిషి కాదు. మనిషి దగ్గర ఉన్న నిదానం, ఓర్పు, పట్టుదల చాలా గట్టివి.

నేను డైరెక్ట్ చేసిన 'పరివర్తన' చిత్రంలో ఒకసారి బావగారు నన్ను అపార్థం చేసుకున్నారు. ఆ విషయం ఆయనగా ఎప్పుడూ నాతో అనకపోయినా నేను తెలుసుకున్నాను. ఎందుచేతనంటే ఆయన ధరిస్తున్న పాత్ర స్వభావంలో కొంత క్రూరత్వం ఉన్నది. అది చూసి ఆయన "నేను విలన్‌లా నటించవలసిందేనా"? అని లోలోపల ఏదో ఫీలవుతున్నట్లుగా నేను గమనించాను. కానీ పాత్ర పరంగా ఆలోచించి చూడాలని నేను చెప్పడంతో ఆయన కొంతవరకు తృప్తి చెందారు. చిత్రం పూర్తయి విడుదలైన తర్వాత పూర్తిగా సంతృప్తి పొందారు.




నేను డైరెక్ట్ చేసిన 'పల్లెటూరు', 'పిచ్చిపుల్లయ్య', 'పరివర్తన', 'జయం మనదే', 'చరణదాసి', 'సంసారం' చిత్రాల్లో బావగారు నటించారు. ఆయన నటన ఎలా ఉన్నదీ, ఆయనకు ఎలాంటి పేరు వచ్చిందీ అన్నది నేను వేరేగా చెప్పనక్కర్లేదు. అది ప్రేక్షకులకు బాగా తెలుసు. అయితే ఒకటుంది- ఎంతగా మేము పరిచయస్తులమైనా, బావగార్లమైనా సెట్ మీదకి వచ్చేసరికి ఆయనకు నేను డైరెక్టర్‌నే. అలాగే ఏదీ డైరెక్ట్‌గా చెప్పడం కూడా ఆయనకు అలవాటు లేదు. తనకు ఏదైనా అనుమానంగా ఉంటే, నా అసిస్టెంట్స్‌ను పిలిచి "బావగారికి ఈ సీను నచ్చిందా? ఏమన్నారు? ఓకే అన్నారా!" అని అడిగేవారు.

ఆ రోజుల్లో ఏడు గంటల కాల్షీట్స్ ఎక్కువగా ఉండేవి. ఉదయం 6.45కల్లా బావగారు రెడీ అయ్యి సెట్‌కు వచ్చేసేవారు. వచ్చి కుర్చీలో కూర్చుని, ఆ రోజు వచ్చే సీన్‌ను చదువుకునేవారు. సంభాషణలు, దృశ్యం, ముందుగా చూసుకోవడం, దాన్ని వంట పట్టించుకోవడం, బాగా కృషిచేసి నటించడం అన్నవి నాటినుంచీ ఉండేవి. ఇవాళ మా బావగారు చాలా గొప్పవారు. పెద్దవారు అయ్యారు. పేరు పెరిగింది, అంతస్తు పెరిగింది. అయితే మా మధ్య ఉండే ఆప్యాయత ఆ నాటిదే. అందులో ఏమీ తేడా లేదు. నేను, ఆయన కలిసి మాట్లాడుకుంటూ ఉంటే, ఆ రోజుల్లో మాట్లాడుకున్నట్టే ఉంటుంది. అదీ విశేషం. ■



అందుబాటులో లేని కారణంగా ముద్దుకృష్ణగారి 'అనార్కలి' నాటకంలో ఆయన వేయాల్సిన సలీం పాత్ర నేను వేశాను. అలా నాకు ఎన్.ఎ.టి. సంస్థతో బంధం ఏర్పడింది. ఆ తర్వాత ఆయన ఫీల్డులోకి వచ్చాక మద్రాసులోని విజయరాఘవాచారి రోడ్‌లోని రిపబ్లిక్ గార్డెన్స్‌లో ఉంటూ రోజూ టి.నగర్ నుండి కోడంబాకంకు సైకిల్‌పై వెళ్లేవారు. అప్పుడాయన విజయా సంస్థలో నెలసరి కాంట్రాక్టులో ఉండేవారు. ఆయనతోపాటు ఎస్.వి. రంగారావు, తాతినేని ప్రకాశరావుగార్లు కూడా సైకిళ్ల మీదే వెళ్లేవారు. నాకు తాతినేని ప్రకాశరావు మంచి స్నేహితుడు కాబట్టి ఎన్.టి.ఆర్.తో కూడా స్నేహం ఏర్పడింది. తాతినేని

# 'టాక్సీరాముడు' 'సూపర్‌మేన్' అన్నీ ఆయనే!


రామారావుగారితో నా పరిచయం 1946-47 ప్రాంతాల్లో జరిగింది. అప్పటికి ఇద్దరం చిత్రరంగంలోకి రాలేదు. బెజవాడలో అప్పట్లో ఆంధ్ర నాటక కళాపరిషత్ వారి నాటక పోటీలు జరిగాయి. మేం 'మా భూమి' నాటకం వెయ్యడానికి వెళ్లాం. 'చేసిన పాపం' అనే ఇంకో నాటకంలో మంచి గెటప్‌తో, మంచి పర్సనాలిటీతో బాగా నటించిన ఒక నటుణ్ణి అక్కడ చూశాం. అతనే ఎన్.టి.ఆర్. అదే ఆయనతో నా తొలి పరిచయం. ఆ రోజుల్లో ఆయన నేషనల్ ఆర్ట్ థియేటర్స్ పేరు మీద పుండరీకాక్షయ్య గారి ఆధ్వర్యంలో నెలకొక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసేవారు. ఒకసారి ఎన్.టి.ఆర్. సినిమాల వల్ల



విక్టరీ మధుసూదనరావు

అప్పుడు 'షావుకారు' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉండేవారు.

నేను దర్శకుణ్ణయ్యాక ఆయనతో నేను తీసిన తొలి చిత్రం 'టాక్సీ రాముడు'. అయితే ఇక్కడ చెప్పుకోవాల్సింది 'రక్తసంబంధం' గురించి.. నిజానికి అంతవరకూ ఎన్.టి.ఆర్. ఎన్నో సాంఘిక చిత్రాలలో నటించినా ఆయనకు పౌరాణిక చిత్రాల్లోని పాత్రలవల్ల వచ్చినంత పేరు, అవార్డులు ఏ సాంఘిక పాత్రతోనూ రానేలేదు. 'రక్తసంబంధం' చిత్రంలోని పాత్రవల్ల ఎంతో మురిసిపోయిన ప్రేక్షకులు ఆయనని ఆ ఏడాది ఆంధ్రపత్రిక వారి పోటీలో ఉత్తమ నటునిగా ఎన్నుకున్నారు. ఆ పాత్రను ఆయన అంత గొప్పగా




పోషించారు కూడా. ముఖ్యంగా క్లయిమాక్స్ సన్నివేశాల చిత్రీకరణ రెండు రోజులపాటు జరిగినా, ఆయన ఏ ఆహారాన్నీ ముట్టుకోలేదు. కేవలం సాత్విక ద్రవ పదార్థాలనే తీసుకుంటూ ఆయన పూర్తిగా పాత్రలో లీనమైపోయారు. సెట్‌లో ఫ్యాన్ కూడా వేయనిచ్చేవారు కాదు. అంత నిమగ్నతే ఆయనని ఉత్తమ నటుణ్ణి చేసింది. అదే చిత్రంలో డెత్ సీన్ తీస్తున్నప్పుడు ఎన్.టి.ఆర్. అసలు లేవనేలేదు. షాట్ పూర్తయిన తర్వాత మేం వెళ్లి తట్టి లేపాల్సి వచ్చింది. శారీరక, మానసిక పరంగా పాత్రలో లీనమవడం అనాలేమో దాన్ని.


అలాగే 'గుడిగంటలు' చిత్రం విషయానికి వస్తే




కోవలం బీచ్ (కేరళ)లో మేం తీసిన 'జన్మ మెత్తితిరా.. **అనుభవించితిరా'** అనే పాట చిత్రీకరణ సమయంలో కూడా ఆయన నటన పరాకాష్టను అందుకొంది. సముద్రంలో ఒడ్డుకు దూరంగా, ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాల మధ్య ఉన్న ఒక పెద్ద బండరాయిని ఎన్నుకున్నాం. ఆ పాటలో చాలా షాట్స్ నిజానికి డూప్‌ని పెట్టి తీసేయ్యవచ్చు. అలా తీస్తాం అని చెప్పినా వినక కెరటాల తాకిడిని తట్టుకొంటూ ఆ పాత్ర పోషించడానికి ఎన్.టి.ఆర్. పూర్తిగా సిద్ధపడటం సాహసం అనాలి.

అదే విధంగా 'ఎదురీత' చిత్రం షూటింగ్ యానాం బజారులో జరిపాం. పేదవాళ్ల గుడిసెలు తొలగించినప్పుడు పేదల తరపున ఎన్.టి.ఆర్. ప్రతిఘటించే సన్నివేశం అది. ఆ సందర్భంగా ఎన్.టి.ఆర్.కు గాయమైంది. రక్తం బాగా రావడంతో ప్రథమ చికిత్స చేయడానికి దగ్గరలో ఉన్న షాపులోంచి టించర్, అయోడిన్, కాటన్ కోసం పంపించాం. కానీ అవి వచ్చేలోపు ఆ గాయం మీద గుప్పెడు మట్టి పోసుకుని పక్కనే ఉన్న షాపులోంచి ఉల్లిపాయ, మిరపకాయలు తెప్పించి కసకసా నమిలి మింగేశారు. ఆ దెబ్బకు ఇదే సరైన మందు అంటూ...

ఎన్.టి.ఆర్.లో ఇంత దీక్ష, కృషి ఉన్నా నేను ఆయనతో తీసిన 'డాక్టర్ ఆనంద్', 'సూపర్‌మేన్'




చిత్రాలు దెబ్బతిన్నాయి. 'డాక్టర్ ఆనంద్' చిత్రానికి ఆయన 50 కాల్షీట్లు ఇచ్చారు. ఆ రోజుల్లో ఎన్.టి.ఆర్. 18 కాల్షీట్లు ఇస్తే, విఠలాచార్యగారు పూర్తిచిత్రాన్ని తీసేసేవారు. అలాంటిది మా చిత్రానికి 50 కాల్షీట్లు ఇచ్చారంటే ఆ పాత్రపట్ల ఆయనకున్న నమ్మకమే కారణం. ఆ కథలో ఆయనది డాక్టర్ పాత్ర. కానీ భార్యకు కేన్సర్ ఉండటంవల్ల కామవాంఛ తీరక ఒక డాన్సర్‌తో సంబంధం పెట్టుకుంటాడు. కామం తీర్చుకోవాలనే కోరిక ఒక పక్క, పాపులర్ డాక్టర్‌గా ఇమేజ్ మరోపక్క ఉన్న ఆయన పాత్రలో ఎంతో సంఘర్షణ ఉంది. అయితే దైవత్వానికి మరోరూపుగా, మంచికి మరోపేరుగా ఆయన్ని ప్రేక్షకులు చూసేవారు. అలాంటి రామారావుకి ఒక డాన్సర్‌తో సంబంధం ఏమిటి అని ప్రేక్షకులు రియాక్ట్ అయ్యారు. దాంతో సినిమా దెబ్బతీసింది. ఇక 'సూపర్‌మేన్' చిత్రాన్ని మేం ఒక రకంగా తీయాలనుకున్నాం. ఆఖరికి అది మరో రకంగా తయారయింది. హైటెక్నిక్ వేల్యూస్‌తో పూర్తి వినోద భరితంగా తీయాలనుకున్నాం. విదేశాలనుండి సాంకేతిక నిపుణుల్ని తెప్పిస్తామన్నారు నిర్మాత. కానీ రామారావుగారు అననే అన్నారు... 'నా సొంత చిత్రంలో ఆంజనేయుణ్ణి లంకకు తీసుకెళ్లలేకపోయాను. అలాంటిది మీరు టెక్నికల్ వేల్యూస్ అంటున్నారు. ఏం తీస్తారో.. ఏం చేస్తారో..' అని. ఆయన అన్నట్లే చివరికి సినిమా అలా తయారైంది. ■


'సూపర్‌మేన్' చిత్రంలో జయప్రద, ఎన్.టి.ఆర్.

**ఎన్.టి.ఆర్. నటించిన 'కలవారి కోడలు' (1964), 'దేవత' (1965), 'ఆడపడుచు' (1967), 'కథా నాయకుడు' (1969), 'అదృష్ట జాతకుడు' (1971) చిత్రాలను రూపొందించిన కె. హేమాంబరధరరావు, ఎన్.టి.ఆర్.తో తన అనుభవాలను ఓ సందర్భంలో ఇలా వివరించారు.**


ఎన్.టి.ఆర్.తో హేమాంబరధరరావు

# నా 'కథానాయకుడు'

**కె. హేమాంబరధరరావు**

కళాకారుడుగా ఎన్.టి.ఆర్. తన నటనను గురించి తప్ప మిగతా వాటి గురించి పట్టించుకోరు. ఆయన ద్విపాత్రాభినయం చేసి, దర్శకత్వం వహించి, నభూతో నభవిష్యత్ అనే విధంగా రూపొందించిన అపూర్వకళాఖండం 'శ్రీక్రిష్ణ పాండవీయం'. ఆ చిత్రం ప్రివ్యూకి నేను వెళ్ళాను. షో అయ్యాక "ఎలా ఉంది బ్రదర్?" అని ఎన్.టి.ఆర్. అడిగారు.

"మీ విశ్వరూపం చూపారు!" అన్నాను నేను. నటునిగా, దర్శకునిగా ఆయన విశ్వరూపం చూపారనేది నా ఉద్దేశం.

"ఎక్కడ బ్రదర్! విశ్వరూపం 'వీరాభిమన్యు'లో పెట్టారు. అందుకే పెట్టలేకపోయాం!" అన్నారు కాస్తంత బాధగా. అంతేగానీ నా కాంప్లిమెంట్ గమనించలేదు. అందులో విశ్వరూపం కూడా వుండి ఉంటే... మరింత బాగా ఉండేదని దర్శకునిగా ఆయన తపన అర్థం చేసుకున్నాను.

**నిండుకుండ తొణకదు!**

"నిండు కుండ తొణకదు, ఓటికుండ ఎగిరెగిరి పడుతుంది" అని పెద్దలు చెబుతుంటారు. కాస్త స్టార్‌డమ్ రాగానే దర్శకుణ్ణి కూడా దర్శకత్వం చేసే స్టార్స్ కొందరు తయారవుతున్నారు. అటువంటిది 'పాతాళ భైరవి' చిత్రంతోనే స్టార్ అయిన రామారావుగారు 'సీతారామకళ్యాణం' చిత్రంతోనే సూపర్ డైరెక్టర్ అనిపించుకున్నారు. దర్శకునిగా తనపేరు వేసుకోలేదు. సినిమా మీడియా గురించి క్షుణ్ణంగా తెలిసినా నటునిగా ఇతర దర్శకుల చిత్రాలలో నటించేప్పుడు, తానొక విద్యార్థిగానే వుండేవారు. క్రమశిక్షణగల నటునిగా దర్శకుడు చెప్పింది చేశారేతప్ప తాను ఏనాడూ 'ఇన్‌సిస్ట్'

చేయడం నా అనుభవంలో ఎన్నడూ చూడలేదు. 'కథానాయకుడు' చిత్రంలో ఎన్.టి.ఆర్. పోషించిన హీరో పాత్రను ప్రత్యేకంగా 'కన్సివ్' చేసుకున్నాను. ఆయనకు ఆ చిత్రంలో డ్యూయెట్ లేదు. ఉంటే బాగుంటుందని వారికి అన్పించిందేమో, చాలా రిక్వెస్ట్ చేస్తున్నట్లుగా "ఏం బ్రదర్! డ్యూయెట్ ఒకటి పెట్టవచ్చు కదా!" అన్నారు.


"లేదు సార్! ఈ పాత్ర డిఫరెంట్! రొటీన్ డ్యూయెట్ ఉండకూడదు!" అన్నాను.

"ఏం డ్రీంలో ఉండవచ్చు కదా! ఏమిటి అభ్యంతరం?" అన్నారు కొద్దిపాటి విసుగుతో.

"వద్దుసార్! క్యారెక్టర్ దెబ్బ తింటుంది!" అన్నాను. ఆయన ఒక్క క్షణం చూసి "ఇట్సాల్‌రైట్ మీ ఇష్టం" అన్నారే తప్ప పాట కావాలని నన్ను ఫోర్స్ చేయలేదు. అటువంటి అమోఘ వ్యక్తి ఆయన.


**నిర్మాత శ్రేయస్సే...**

'కథానాయకుడు' చిత్రం 1969లో విడుదలై ఆ ఏటి మేటి చిత్రాల్లో ఒకటి కావడమే కాకుండా, బంగారు నంది అవార్డు నాకు తెచ్చి పెట్టింది. ఈ సినిమాలో జయలలిత కథానాయికగా నటించారు. ఆమెపై చిత్రీకరించిన "ముత్యాల జల్లు కురిసే.." పాట ఆల్‌టైమ్ హిట్‌గా నిలిచింది.



'కథానాయకుడు' చిత్రంలో ఎన్.టి.ఆర్.

ఈ చిత్ర తమిళ హక్కుల కోసం విజయా వారు, ఏవీఎం వారు నన్ను అడిగారు.




నేను చక్రపాణిగారికి మాట ఇచ్చాను. అయితే అడ్వాన్స్ తీసుకోలేదు. ఎం.జి. రామచంద్రన్ సొంతంగా ఆ చిత్రం నిర్మించడానికి ఎన్.టి. రామారావు గారిని అడిగారు.

ఎన్.టి.రామారావుగారు నాకు కబురు పంపారు. "బ్రదర్! ఎం.జి.ఆర్ గారు మన చిత్రాన్ని తమిళంలో నిర్మించడానికి అడుగుతున్నారు. ఇవ్వవచ్చు కదా!" అన్నారు.

నేను విజయా, ఏవీఎం సంస్థల విషయం చెప్పాను. ఈ రెండుసంస్థలవారూ, ఎం.జి.ఆర్. గారూ ఈ ముగ్గురూ ఎన్.టి. ఆర్. ఆత్మీయులే! ఆయనకు ఏం చెప్పాలో తెలియలేదు. ఒక్క నిమిషం ఆలోచించి "సరే బ్రదర్! ఎవరికివ్వాలో మీరే నిర్ణయించుకోండి" అన్నారు. అంతే తప్ప ఫలానా వారికే ఇవ్వమని ఆయన ఇన్‌సిస్ట్ చేయలేదు. నిర్మాత శ్రేయస్సును ఆయన ఎంతగా కోరతారు అనేది చెప్పడానికే ఈ సంఘటన తెలిపాను. ■





ఎన్.టి.ఆర్.తో దాసరి

# దటీజ్ ఎన్.టి.ఆర్.

ఎన్.టి.ఆర్, దాసరి కాంబినేషన్‌లో వచ్చిన తొలిచిత్రం 'మనుషులంతా ఒక్కటే'. అలాగే ఆ తర్వాత నాలుగేళ్ల అనంతరం వీరి కలయికలో వచ్చిన సినిమా 'సర్కస్ రాముడు'. ఈ రెండు చిత్రాల షూటింగ్స్‌లో జరిగిన సంఘటనలను దాసరి ఇలా వివరించారు.

**దాసరి నారాయణరావు**

ఎన్.టి.రామారావుగారితో నా తొలి చిత్రం 'మనుషులంతా ఒక్కటే'. ఆ చిత్రం షూటింగ్ నెల్లూరు పట్టణానికి అయిదారు కిలో మీటర్ల దూరంలో ఒక కొండమీద ఉన్న దేవాలయంలో చేస్తున్నాం. ఆ రోజు ఎన్.టి.ఆర్.గారు, మరి కొందరు ఫైటర్స్ మీద ఫైట్ దృశ్యాలను చిత్రీకరించాలి. ఆ ఫైట్‌లో రామారావుగారి వంటినిండా బురద పడుతుంది. నేలమీద పడి ఫైట్ చేస్తుండగా వంటి నిండా బురద అవుతుందన్నమాట. సినిమాల్లో హంబర్ అనే పదార్థాన్ని నీళ్లలో

కలిపి బురద తయారు చేస్తారు. సరే! షూటింగ్ సర్వం సన్నద్ధం చేసుకున్నాం. ఉదయం 7 గంటలకల్లా రామారావుగారు మేకప్‌తో వచ్చేశారు. కెమెరామెన్ షాట్ రెడీ అన్నారు. ఇంతలో మేకప్‌మేన్ ఆదుర్దాగా వచ్చి- 'సారీ సార్, బురద ఎఫెక్ట్ ఉంటుందని నాకు తెలియదు. నేను హంబర్ తీసుకురాలేదు' అని చెప్పాడు. ఇప్పుడెలా? అవతల ఎన్.టి.ఆర్.గారు రెడీగా ఉన్నారు. ఆయన్ని వెయిటింగ్‌లో పెట్టాలి. పోనీ టౌన్‌కు పంపించి తెప్పించాలంటే గంటపైనే వేస్ట్ అవుతుంది. ఇంతలో రామారావుగారు 'ఏం బ్రదర్, మేం రెడీగా ఉన్నాం' అని కబురు చేశారు. నేను ఆయన దగ్గరకు వెళ్లి "ఆ.. ఏం లేదు సార్- ఒక్క అయిదు నిమిషాల్లో స్టార్ట్ చేద్దాం" అన్నాను. అలా అన్నానే కానీ ఎలా చేయాలి? అని

ఆలోచిస్తుండగానే అయిదు నిమిషాలు గడిచిపోయాయి. మరలా "ఏం బ్రదర్ ఏమిటి ఆలస్యం" అన్నారు ఎన్.టి.ఆర్. ఇక తప్పదనుకొని మెల్లిగా "ఏం లేదు సార్. బురద ఎఫెక్ట్‌కోసం వాడే హంబర్ తీసుకురాలేదట. పంపించాలి. ఒక అరగంటలో వచ్చేస్తాడు" అని చెప్పాను. ఆయన వెంటనే తనకి కొంచెం దూరంలో ఉన్న మురికి కాలువ వైపు చూసి 'అదిగోండి బ్రదర్ బురద. ఈ ఒరిజినల్ బురద ఉండగా డూప్లికేట్ బురద ఎందుకు? దానికోసం వెయిట్ చేయడం ఎందుకు?' అన్నారు. నేను వెంటనే 'అబ్బే వద్దొద్దు సార్! అది చాలా మురుగు వాసన వస్తుంది' అన్నాను. "ఏం బ్రదర్ బురద మురుగువాసన కాక సెంట్‌వాసన వస్తుందా? ఊ... ఆ బురదతీసి నా షర్ట్‌కు పూయండి' అని మేకప్ సిబ్బం దిని అదేశించారాయన. వాళ్ళు కొంత బురద తీసి ఆయన చొక్కామీద పూశారు.




అయితే అలా పూయటం వలన ఒరిజినల్‌గా కింద పడిన ఎఫెక్ట్ రాలేదు. 'వద్దు ఇలా చేస్తే ఏదో అలికి నట్లుగా ఉంది. మీరు పక్కకుతప్పుకోండి' అని అందరం చూస్తుండగానే ధడేలున ఆ మురికి కాలువలో వెల్లికలా పడ్డారు ఎన్.టి.ఆర్. అప్పటిదాకా ఒక మోస్తరు దుర్గంధాన్ని వెదజల్లిన కాలువ ఆ కదలికతో మరీ దుర్గంధాన్ని కొట్టేసింది. మేమందరం బిత్తరపోయి చూస్తుండగానే అటు ఇటు దొర్లి పైకి లేచి "ఇప్పుడు ఓ.కేనా బ్రదర్, ఎఫెక్ట్ పర్‌ఫెక్ట్‌గా వచ్చిందా?" అని అడుగుతుంటే ఆ మహానుభావునివైపు కళ్ళప్పగించి చూడటం మా వంతైంది.

**'సర్కస్‌రాముడు' షూటింగ్‌లో...**

"నేను ఎన్.టి.ఆర్.గారితో 'సర్కస్ రాముడు' చిత్రాన్ని తీస్తున్న రోజుల్లో జరిగిన మరో సంఘటన చెబుతాను. బెంగుళూరులో ఒక పాట చిత్రీకరణ ముగించుకొని ఆ రాత్రికి బయలుదేరి ముదుమలై వెళ్లి ఇంకోపాటను చిత్రీకరించవలసి ఉంది. అయితే ఆ రోజు రాత్రి బెంగుళూరులో ఒక ఫంక్షన్ ఉంది. నేను



'సర్కస్‌రాముడు'లో
జయప్రద, ఎన్.టి.ఆర్

దర్శకత్వం వహించిన 'శివరంజని' చిత్రం బెంగుళూరు సవిత థియేటర్‌లో 60 వారాలు ఆడింది. ఒక తెలుగు చిత్రం బెంగుళూరులో అన్ని రోజులపాటు ఆడటం గొప్ప విశేషం. ఆ సందర్భంగా గొప్ప ఫంక్షన్ ఏర్పాటు చేశారు. ఆ ఫంక్షన్‌కు కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ గారిని, ఎన్.టి.ఆర్. గారిని, అక్కినేని నాగేశ్వరరావు గారిని ఆహ్వానించారు. ఆ విజయోత్సవం ఘనంగా జరిగింది. ఫంక్షన్ పూర్తయిన వెంటనే డిన్నర్ పూర్తిచేసుకుని బెంగుళూరులో రాత్రి 11గంటలకు కార్లలో ముదుమలైకి బయల్దేరాం. 4 గంటల ప్రయాణం తరవాత తెల్లవారుజామున 3 గంటలకు ముదుమలై ఫారెస్ట్‌కు చేరుకున్నాం. కార్లు దిగిన వెంటనే 'ఏం బ్రదర్ షూటింగ్ ఎన్ని గంటలకు మొదలు పెడదాం' అని అడిగారు ఎన్.టి.ఆర్. రాత్రంతా ప్రయాణం చేసి వచ్చారు కదా! పది గంటలకు రమ్మని చెబ్దామా? అని నేను ఆలోచిస్తుండగా మళ్లీ ఆయనే "ఏం బ్రదర్ ఆరు గంటలకు స్టార్ట్ చేద్దామా?" అన్నారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఆయనకై ఆయనే ఆరు గంటలకు అని చెప్తే నేను ఇంకేం మాట్లాడగలను. 'అలాగే సార్' అని చెప్పి నా రూమ్‌కు వెళ్లిపోయాను. ఒక గంట కునుకు తీసేసరికి తెల్లారి పోయింది. పావుగంటలో నేను రెడీ అయి బయటకు వచ్చేసరికి టైమ్ పది నిమిషాలు తక్కువ ఆరు అయింది. అలా మెట్లు దిగి గెస్ట్‌హౌస్ కారిడార్‌లోకి వచ్చేసరికి ఎదురుగా కుర్చీలో కూర్చుని ఉన్నారు రామారావుగారు. దూరంగా చూస్తే ఊరికినే అలా కూర్చుని ఉన్నారేమో అనుకున్నాను. తీరా దగ్గరకు వెళ్లి చూస్తే.. మేకప్‌తో సిద్ధంగా ఉన్నారాయన. రామారావుగారు రెడీగా కూర్చున్నారన్న విషయం తెలియడంతో ఆవులింతలు

పెడుతూ యూనిట్ మెంబర్స్ లేచి ఆదరాబాదరా అయిదు నిముషాల్లో రెడీ అయిపోయారు. నిజానికి రెండు రోజులు చిత్రీకరించవలసిన పాట ఉదయం ఆరు నుండి సాయంత్రం ఆరుదాకా ఏకబిగిన చేసేయ్యడంతో పూర్తయింది. ఆ రోజు రాత్రే యూనిట్ మొత్తం తిరుగు ప్రయాణమయ్యాం.

**'సర్దార్ పాపారాయుడు' షూటింగ్‌లో ప్రమాదం**

'సర్దార్ పాపారాయుడు' చిత్రం కోసం చెన్నై శివారు ప్రాంతాలలో షూటింగ్ చేస్తుండగా 1980 సెప్టెంబర్ 7న జరిగిన మోటార్‌బైక్ ప్రమాదంలో ఎన్.టి.ఆర్. కుడిచెయ్యి మరోమారు ఫ్రాక్చర్ అయింది. అదే రోజు సాయంత్రం నేను నిర్మించిన 'సుజాత' చిత్రం శత దినోత్సవం చెన్నైలోని న్యూ ఉడ్ ల్యాండ్స్ హోటల్‌లో జరుగుతున్నాయి. నేను నిర్మించిన తొలి చిత్రం 'శివరంజని' శతదినోత్సవ, స్వర్ణోత్సవాలకు ఎన్.టి.ఆర్.ని, ఎ.ఎన్.ఆర్.ని ఆహ్వానించారు. అలాగే ఈ చిత్ర వేడుకలకు కూడా వారిద్దరిని పిలిచాను. అయితే రామారావుగారికి నా షూటింగ్‌లోనే యాక్సిడెంట్ కావడంతో ఆయనని విశ్రాంతి తీసుకోమని నేను చెప్పినా వినకుండా 'సుజాత' చిత్ర వేడుకలకు చేతి కట్టుతోనే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "శతదినోత్సవాలు అనేవి మనం ఉత్సాహంతో ముందుకు సాగడానికి ప్రతీకలు. చిత్రాలు నిర్మిస్తున్నప్పుడు ఎప్పటికప్పుడు ఫలితాలు లభించకపోవచ్చు. అంతమాత్రాన నిరుత్సాహపడ కూడదు. అయితే ఒక చిత్రం విజయవంతమై శత దినోత్సవం జరుపుకుంటున్నప్పుడు ఆ విజయం ఆ చిత్రానికి సంబంధించిన వారిదే కాదు.. మనందరం అంటే పరిశ్రమ అంతా కలిసి సాధించిన విజయంగానే భావించి సంతోషిస్తాం. నా చెయ్యి ఫ్రాక్చర్ అయింది. బ్లడీ హాండ్... ఈ చెయ్యి ఉంటే ఎంత.. పోతే ఎంత? ఈనాటి విజయోత్సవ ఆనందాన్ని మనం తిరిగి పంచుకోలేంకదా" అన్నారు. అదీ ఆయన గొప్పతనం. ■





# అభిమాన హీరోతో రాఘవేంద్రుడు

మూడోతరం దర్శకులలో ఎన్.టి.ఆర్.తో ఎక్కువ చిత్రాలకు (12) పనిచేసిన ఘనత రాఘ వేంద్రరావుదే. వీరిద్దరి కలయికలో వచ్చిన తొలిచిత్రం 'అడవిరాముడు' (1977). ఈ సినిమా రాఘవేంద్రుని కెరీర్‌నే కాదు, తెలుగు చిత్ర పరిశ్రమకి కూడా ఒక మలుపు, భారీ కుదుపు. 'ఫక్తు కమర్షియల్ సినిమా అంటే ఇదే' అనే భావాన్ని అందరికీ కలిగించిన 'అడవిరాముడు' వసూళ్ల చరిత్రలో ఒక కొత్త చరిత్రను లిఖించింది. అంతవరకూ కథాబలం ప్రధానంగా నమ్ముకుని సినిమాలు రూపొందించి దర్శకునిగా ఓ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న రాఘవేంద్రరావు 'అడవి రాముడు' సంచలన విజయంతో తన శైలిని మార్చి భారీ కమర్షియల్ చిత్రాలు తీయడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఇక అక్కడి నుంచి ఎన్.టి.ఆర్. - రాఘవేంద్రరావు కలయికలో వచ్చిన చిత్రాల్లో ఒకటో, అరో తప్పితే మిగలినవన్నీ ఘనవిజయం సాధించినవే. ఈ విజయాలు పలు కమర్షియల్ ఫార్ములాలను తెలుగు చిత్ర పరిశ్రమకి అందించాయి. ఆ వాణిజ్య సూత్రాలను తెలుగు సినిమా ఇప్పటికీ అనుసరిస్తోంది.

నటుడు, నిర్మాత, దర్శకుడు కోవెలమూడి సూర్య ప్రకాశరావు తనయుడు కావడంతో చిన్నతనం నుంచి సినీ రంగానికి సన్నిహితంగా ఉండే అవకాశం రాఘ వేంద్రరావుకి లభించింది. ఆ రంగంలోని ఇంద్రజాలం ఆయణ్ణి ఆకర్షించింది. దాంతో బి.ఎ.పూర్తికాగానే




ఎన్.టి.ఆర్., ఎస్.వి.ఆర్., సావిత్రి వంటి ఉద్దండ నటీనటులు నటిస్తున్న 'పాండవ వనవాసం' చిత్రానికి దర్శకత్వ శాఖలో సహాయకునిగా చేరారు. అప్పటినుంచే ఎన్.టి.ఆర్. అంటే ప్రత్యేక అభిమానం ఏర్పరచుకుని, తను దర్శకుడైతే తన అభిమాన హీరోని విభిన్నంగా చూపించాలని కలలు కనడం ప్రారంభించారు. 12 ఏళ్లపాటు ఆ కలలు చెదరకుండా అలాగే తన మదిలో దాచుకున్న రాఘవేంద్రరావు 'అడవిరాముడు'తో అవకాశం లభించగానే విజృంభించారు. తెలుగునాట ఒక సరికొత్త వాణిజ్య సూత్రాన్ని ఆవిష్కరించిన సినిమాగా 'అడవిరాముడు' సినీ పండితుల ప్రశంసలు అందుకుంది. 'గ్లామర్ హీరో'గా తనకు సరికొత్త ఇమేజ్‌ని తెచ్చిన రాఘవేంద్రరావుని ఎంతో అభినందించారు రామారావు. కథానాయకుని ధీరోదాత్తతను తెరపై అడుగడుగునా ఆవిష్కరించే నైపుణ్యం సాధించిన రాఘవేంద్రరావు తన అభిమాన నటునితో విభిన్న పాత్రలు వేయించి, అభిమానులకు ఆనందం పంచారు.



ఎన్.టి.ఆర్.తో రాఘవేంద్రరావు రూపొందించిన మూడు ద్విపాత్రాభినయ చిత్రాలు (గజదొంగ, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి) ఘన విజయం సాధించాయి. అలాగే ఎన్.టి.ఆర్. నటించిన చివరి సాంఘికం 'మేజర్ చంద్రకాంత్' చిత్రానికి దర్శకత్వం వహించే అరుదైన అవకాశం రాఘవేంద్రరావుకి దక్కింది.

ఇక్కడ మరో అంశాన్ని ప్రస్తావించాలి. తండ్రి కె.ఎస్.ప్రకాశరావు దర్శకత్వంలోను, తనయుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలోనూ నటించి ఎన్.టి.ఆర్ రికార్డ్ నెలకొల్పితే, తండ్రి ఎన్.టి.ఆర్., తనయుడు బాలకృష్ణ కలిసి నటించిన చిత్రం 'రౌడీ రాముడు-కొంటె కృష్ణుడు'కు దర్శకత్వం వహించడం రాఘవేంద్రరావుకు లభించిన అదృష్టం. ■

"చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించే ప్రతి నటునికి, నిర్మాతకి, దర్శకునికి ఆదర్శవంతమైన వ్యక్తి ఎన్.టి.ఆర్. నిత్య కృషీవలు డాయన. మా సంస్థ స్థాపనకు మూలకారకుడు. ఎన్నో విషయాలు ఆయన దగ్గరనుంచి నేర్చుకున్నాను. పెద్దాయనతో నేను నిర్మించిన చిత్రాలు మూడే అయినా ('రాముడు-భీముడు', 'స్త్రీజన్మ', 'శ్రీకృష్ణ తులాభారం') 30 చిత్రాలు నిర్మించిన సంతృప్తి కలిగింది నాకు" అంటారు సురేష్ ప్రొడక్షన్స్ అధినేత డాక్టర్ డి.రామానాయుడు.


ఎన్.టి.ఆర్.తో రామానాయుడు


# 'రాముడు-భీముడు'తో 'శ్రీకృష్ణతులాభారం'

**డాక్టర్ డి. రామానాయుడు**

చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించిన రామానాయుడు నిర్మించిన తొలి చిత్రం 'అనురాగం'. భాగస్వామ్యంతో ఈ చిత్రాన్ని నిర్మించి 50వేలు నష్టపోయారు. డబ్బు పోయినా సినిమా నిర్మాణానికి సంబంధించిన అనేక విషయాలు నేర్చుకోవడానికి ఆ సినిమా అవకాశం కల్పించిందంటారు రామానాయుడు.

'అనురాగం' చిత్రానికి ఆర్థికంగా నష్టం కలగడంతో ఆ నిర్మాతలు వెంటనే చిత్ర నిర్మాణం చేపట్టలేకపోయారు. అయితే చిత్ర నిర్మాణం పట్ల ఉత్సాహంగా ఉన్న రామానాయుడు సొంతంగా సినిమా తీయడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఊళ్లో తన స్నేహితులైన రాజేంద్రప్రసాద్ (తర్వాత మాధవీ కంబైన్స్ పతాకంపై చిత్రాలు నిర్మించారు), సుబ్బారావును భాగస్వాములుగా చేసుకుని తన కుమారుడు పేరిట సురేష్ ప్రొడక్షన్స్ పేరుతో సంస్థను నెలకొల్పి 'రాముడు-భీముడు' చిత్రాన్ని నిర్మించారు.

ఎన్.టి.ఆర్. తొలిసారిగా ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'రాముడు-భీముడు'. డి.వి.నరసరాజు చెప్పిన



'శ్రీకృష్ణతులాభారం' ప్రారంభోత్సవంలో కె.ఎస్.రెడ్డి, రామానాయుడు, త్రివిక్రమరావు, కె.కామేశ్వరరావు, నాగిరెడ్డి, ఎన్.టి.ఆర్, మాస్టర్ వెంకటేశ్, మాస్టర్ సురేశ్, తదితరులు

ఈ చిత్రకథ నచ్చడంతోపాటు రామానాయుడుతో అంతకు ముందు ఉన్న కొద్దిపాటి పరిచయం కారణంగా రామారావు ఈ చిత్రంలో నటించడానికి అంగీకరిం చారు. 1963 నవంబర్ నుండి 1964 అక్టోబర్ వరకు నెలకు ఆరు రోజుల చొప్పున (ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ) కాల్షీట్లు ఇచ్చారు రామారావు. అయితే ఆయన సహకారంతో అనుకున్న సమయాని కంటే 6 నెలల ముందే సినిమాని పూర్తిచేసి విడుదల చేయగలిగారు రామానాయుడు.

వేరే ఏదైనా సినిమా షెడ్యూల్ కాన్సిల్ అయితే రామానాయుడికి ఫోన్‌చేసి షూటింగ్ పెట్టుకుంటారా అని అడిగేవారు రామారావు. ఆ సమయానికి జమున డేట్స్ దొరికితే భీముని గెటప్‌తో, ఎల్.విజయలక్ష్మి డేట్లు దొరికితే రాముని గెటప్‌లో రెడీ అయి షూటింగ్‌కు వచ్చేవారు రామారావు. చకచకా షూటింగ్ ఏర్పాట్లు చేసేవారు రామానాయుడు. అనుకున్న దానికంటే ఎక్కువ రోజులు షూటింగ్ చేసి సినిమాలు పూర్తిచేసిన సందర్భాలు అనేకం కానీ, ఆరు నెలల ముందే సినిమా పూర్తికావడం సినీ చరిత్రలోనే అరుదైన సంఘటన. తన నిర్మాతలకు రామారావు ఎంత సహకరించేవారో చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ.

ఆరు లక్షల రూపాయల వ్యయంతో 'రాముడు-భీముడు' చిత్రం రూపుదిద్దుకోగా, ఇందులో ద్విపాత్రాభినయం చేసినందుకు 40 వేలు పారితోషికంగా తీసుకున్నారు ఎన్.టి.ఆర్. 1964 మే 21న విడుదలైన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది.

ఈ చిత్ర నిర్మాణ సమయంలోనే రెండో సినిమా కోసం ఎన్.టి.ఆర్.కు అడ్వాన్స్ ఇచ్చారు రామానాయుడు. కృష్ణునిగా ఎన్.టి.ఆర్. సుప్రసిద్ధులు కనుక ఆయన హీరోగా కమలాకర కామేశ్వరరావు దర్శకత్వం లో 'శ్రీకృష్ణతులాభారం' చిత్రం తీయాలని ఆయన కోరిక. అయితే అదే సమయంలో 'వీరాభిమన్యు' చిత్రం లోను, 'శ్రీక్రిష్ణపాండవీయం' చిత్రంలోను ఎన్.టి.ఆర్. కృష్ణుని పాత్ర పోషిస్తున్నారు. మూడో సినిమాలో కూడా


కృష్ణుడు పాత్ర పోషిస్తే మోనాటినీ అవుతుందని చెప్పి ఈ లోపు ఒక చిన్న సినిమా ప్లాన్ చేసుకోమని రామానాయుడికి సలహా ఇచ్చారు ఎన్.టి.ఆర్. అప్పుడు కాంతారావు హీరోగా సి.ఎస్.రావు దర్శకత్వంలో 'ప్రతిజ్ఞ పాలన' చిత్రం నిర్మించారు రామానాయుడు. 'రాముడు- భీముడు' చిత్రం స్థాయిలో ఆ సినిమా విజయం సాధించకపోయినా అన్ని ఖర్చులుపోనూ ఆ రోజుల్లోనే లక్ష రూపాయలు లాభం వచ్చింది.



రాముడు-భీముడు హీరోలు
ఎన్.టి.ఆర్. (తెలుగు), దిలీప్‌కుమార్ (హిందీ), ఎం.జి.ఆర్. (తమిళం)

రామానాయుడు నిర్మించిన మూడో సినిమా 'శ్రీకృష్ణతులాభారం' (1966). ఇందులో జమున, అంజలీదేవి, కాంతారావు తదితరులు నటించారు. అయితే ఆశించిన స్థాయిలో ఈ చిత్రం విజయవంతం కాలేదు. లాభమూ రాలేదు, అలాగని నష్టపోలేదు.

అనంతరం ఎన్.టి.ఆర్., అంజలీదేవి, కృష్ణకుమారి కాంబినేషన్‌లో 'స్త్రీ జన్మ' చిత్రం నిర్మించారు రామానాయుడు. ఎన్.టి.ఆర్., కృష్ణ కలిసి నటించిన తొలి చిత్రం ఇదే. కె.ఎస్.ప్రకాశరావు దర్శకత్వంలో తయారైన ఈ చిత్రం కూడా విజయం సాధించలేదు.




ఆ తర్వాత ఎన్.టి.ఆర్. డేట్స్ కుదరని కారణంగా ఆయనతో సినిమాలు తియ్యలేకపోయారు రామానాయుడు.

"జయాపజయాలకు భయపడని మనస్తత్వం ఎన్.టి.ఆర్.ది. మంచి ప్లానింగ్ ఉన్న హీరో. ఆయనకు ఉండే క్రమశిక్షణ గానీ, చిత్ర నిర్మాణం పట్ల తీసుకునే నిర్ణయాలు కానీ చాలా కట్టుదిట్టంగా ఉండేవి. అయనకున్న నిర్మాతలలో యువ నిర్మాతగా ఆదరణ పొందగలిగాను. పోలీస్ వెల్‌ఫేర్ ఫండ్‌కు, ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్‌కు ఆయనతోపాటు నేనూ తిరిగాను. ఎన్.టి.ఆర్. ద్వారా నేను చాలామందికి పరిచయమయ్యాను" అంటూ ఆ రోజులను గుర్తు చేసుకున్నారు డా॥ డి. రామానాయుడు.



# 'ఎదురులేని మనిషి' 'యుగపురుషుడు' ఆయనే!

చలసాని అశ్వనీదత్

తెలుగు చిత్ర పరిశ్రమలో 'మెగా'
హోదాని నిర్మాతల్లో దక్కించు
కున్న ఘనత చలసాని అశ్వనీదత్‌ది. సొంత
నిర్మాణ సంస్థలు కలిగి ఉన్న నట ప్రముఖులు
సైతం తమ వారసులు అశ్వనీదత్ బేనరు
(వైజయంతీ మూవీస్) ద్వారా పరిచయమవడం
ఒక గౌరవంగా భావిస్తారు. నాలుగు తరాల అగ్ర
కథానాయకులు నటించిన బేనర్ తెలుగులో
ప్రస్తుతానికి ఇదొక్కటేనేమో. హీరో ఎవరైనా సరే
భారీతనంతో, భారీ ధనంతో వెండితెరకు నిండు
దనం చేకూర్చి ప్రేక్షకులకు ఆనందాన్ని ఇవ్వడమే
ఏకైకలక్ష్యంగా ముందుకు సాగుతున్న అశ్వనీ
దత్ 19 ఏళ్ల వయసుకే నిర్మాతగా మారారని
తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ

వయసులో భాగస్వామ్యంలో
ఆయన తొలిసారిగా 'ఓ సీత కథ'
చిత్రాన్ని నిర్మించారు.

అశ్వనీదత్ ఎన్.టి.ఆర్. అభిమాని కావడంతో ఆయనతో సినిమా తీయాలనే ప్రయత్నాలు ఈ చిత్ర నిర్మాణ సమయంలోనే ప్రారంభించారు. ఒకరోజు ధైర్యం చేసి తెల్లవారుజామునే ఎన్.టి.ఆర్. ఇంటికి వెళ్లిపోయారు. ఆయన వచ్చిన పని తెలుసుకుని ఎన్.టి. ఆర్. ఆశ్చర్యపోయారు. అంత చిన్నవయసు కుర్రాడు తనతో సినిమా తీయడానికి రావడం ఆశ్చర్యమే కదా. ఒకటి, రెండుసార్లు అతన్ని వారించాలని చూసినా వెనక్కి తగ్గక పోవడంతో అశ్వనీదత్ పట్టుదలకు మెచ్చి సినిమా చేయడానికి అంగీకరించారు రామారావు.

ఈ సంస్థకు పేరు పెట్టడం దగ్గర నుండి అన్నీ ఎన్.టి.ఆర్. చేతుల మీదుగా జరిగాయి. ఎన్.టి.ఆర్.



అశ్వనీదత్, ఎన్.టి.ఆర్., వాణిశ్రీ

కలియుగ కృష్ణుడు కనుక ఆయన అభిమానిగా తను ఏర్పాటు చేసే సంస్థకు కృష్ణుని పేరు ధ్వనించేలా పేరు పెట్టమని ఎన్.టి.ఆర్.ని కోరారు అశ్వనీదత్. కృష్ణుని మెడలో వైజయంతిమాల ఉంటుంది కనుక ఈ సంస్థకు వైజయంతీ మూవీస్ అని పేరుపెట్టారు ఎన్.టి.ఆర్. కృష్ణుని గెటప్‌లో ఆయన పాంచజన్యం పూరించే ఫొటోను తమ సంస్థ లోగోగా నిర్ణయించారు అశ్వనీదత్.

ఈ చిత్ర దర్శకునిగా బాపయ్యని నియమించారు రామారావు. అలాగే అశ్వనీదత్‌కి కొత్త కనుక నిర్మాణ వ్యవహారాలు పర్యవేక్షించే బాధ్యతను ఎం.ఎస్.రెడ్డికి అప్పగించారు.

## స్టెప్స్‌కి శ్రీకారం


ఈ సినిమా తీసేటప్పుడు అశ్వనీదత్ ఒకటే అనుకున్నారు. "మనం తీసేది వినోదాత్మక చిత్రం. ఎన్.టి.ఆర్.ని కొత్తగా చూపించి, ఏ.ఎన్.ఆర్. లా ఆయనతో స్టెప్స్ వేయించాలి" అని. ఆయన ఈ నిర్ణయం తీసుకోవడానికి ఇంకో కారణం కూడా ఉంది. అదేమిటంటే ఆ సమయంలో మెయిన్ లైన్ నుండి లూప్ లైన్‌లోకి వెళ్లినట్లు యంగ్ హీరో పాత్రలు వదిలేసి వరుసగా మధ్య వయస్కుడి పాత్రలు పోషించేవారు ఎన్.టి.ఆర్. 'బడిపంతులు' (1972), 'ధనమా దైవమా' (1973), 'అమ్మాయి పెళ్లి' (1974), 'తాతమ్మకల' (1974), 'సంసారం'(1975) తదితర చిత్రాల్లో ఆయన పోషించినవి వయసు మళ్లిన పాత్రలే. ఈ విషయమై ఆయన అభిమానుల్లో అసంతృప్తి బయలుదేరింది... ఎన్.టి.ఆర్. స్టయిల్ మార్చాలని, పాత హీరోయిన్లని వదిలేసి నవతరం హీరోయిన్లతో నటించాలని, స్టెప్స్ వేయాలని... అభిమానుల అభ్యర్థన ఎన్.టి.ఆర్.కి చేరింది. తనని అభిమానించేవారు కోరితే ఏం చేయడానికైనా ఆయన సిద్ధమే. అందుకే 'ఎదురులేని మనిషి' చిత్రంలో స్టెప్స్ వేయాలని అశ్వనీదత్ కోరినప్పుడు మొదట సంకోచించినా, ఆ తర్వాత అభిమానుల అభిమతం కాదనలేక అంగీకరించారు ఎన్.టి.ఆర్. ఈ సినిమా కోసం ఊటీలో చిత్రీకరించిన 'కసిగా ఉంది.. కసి కసిగా ఉంది' పాటలో వాణిశ్రీతో కలిసి ఆయన వేసిన స్టెప్పులు చూసి అభిమానులు ఆనందపరవశులయ్యారు.

అలాగే ఈ సినిమాలో ఎన్.టి.ఆర్. గెటప్ కూడా విభిన్నంగా ఉండాలని ఆయన కాస్ట్యూమ్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు బాపయ్య, అశ్వనీదత్. హిందీ సినిమాలకు పనిచేస్తుండటంతో దర్శకుడు బాపయ్య ముంబాయిలోని ఫ్యాషన్లు పరిశీలించి, ఆ డిజైన్లతో రమేష్ అనే కాస్ట్యూమర్‌తో డ్రస్సులు కుట్టించారు. వీటిలో ఎన్.టి.ఆర్. కొత్తగా కనిపించారు. చూసిన ప్రేక్షకులే మళ్లీ మళ్లీ చూడటంతో 1975 డిసెంబర్ 12న విడుదలైన 'ఎదురులేని మనిషి' ఘన

విజయం సాధించింది. ఈ సినిమా విజయంతో మళ్లీ యంగ్ హీరో పాత్రలను పోషించడం ప్రారంభించారు రామారావు.

**కరాటే ఫైటర్**

తొలి సినిమా ఘన విజయం సాధించడంతో మూడేళ్లు గ్యాప్ ఇచ్చి ఎన్.టి.ఆర్., బాపయ్య కాంబినేషన్‌లోనే 'యుగపురుషుడు' చిత్రాన్ని నిర్మించారు అశ్వనీదత్. జయప్రద కథానాయిక. హిందీనటి కోమిలా విర్క్‌తో కలిసి ఎన్.టి.ఆర్. పాల్గొన్న నృత్యగీతం 'ఎక్కు ఎక్కు తెల్ల గుర్రం' బాగా పాపులర్ అయింది. అయితే సినిమాలో మద్యం తాగే సన్నివేశాలు, దానికి సంబంధించిన దృశ్యాలపై సెన్సారువారు కన్నెర్ర చేసిన తరుణమది. అందుకే ఈ పాటలోని కొన్నిషాట్లు సెన్సారు వారికి సమర్పించుకోవాల్సి వచ్చింది. చివరకు ఆ పాట పల్లవే మారిపోయింది.



జయప్రదతో 'యుగపురుషుడు' ఆటపాట

'యుగపురుషుడు' సినిమా నుంచి ఎన్.టి.ఆర్. కాస్ట్యూమ్స్‌లో మార్పు వచ్చింది. విజయవాడలో ఫ్యాషన్ దుస్తుల తయారీకి పేరొందిన 'యాక్స్ టైలర్స్' వాలేశ్వరరావుని చెన్నై రప్పించారు. ఎన్.టి.ఆర్. కొలతలు తీసుకుని వాటికి తనదైన శైలిలో సరికొత్త హంగులు అద్ది లేటెస్ట్ డ్రస్‌కి రూపకల్పన చేశారు వాలేశ్వరరావు. పొట్టి చొక్కా, పెద్ద కాలరు, ఛాతి కనిపించేలా పైన మూడు గుండీలు వదిలేసిన షర్ట్. బూట్‌కట్ బెల్ బాటమ్.. ఈ డ్రెస్ వేసుకునేసరికి ఎన్.టి.ఆర్. వయసు ఒక్కసారిగా 30 ఏళ్లు తగ్గిపోయినట్లనిపించింది అందరికి. ఈ చిత్రంలో నటించే సమయానికి ఎన్.టి.ఆర్. వయసు 55 ఏళ్ళు. అయినా ఎంతో చలాకీగా యువ హీరోలతో పోటీపడుతూ సినిమాలో నటించారు. ఇందులో కరాటే ఫైటర్ పాత్ర ఆయనది. కాలుని అంత ఎత్తుకు ఎత్తి యమస్పీడ్‌లో ఎన్.టి.ఆర్. ఫైట్లు చేస్తుంటే ఆశ్చర్యపోవడం ప్రేక్షకులవంతయింది. ఇక జయప్రదతో కలిసి పాల్గొన్న పాటల గురించి చెప్పనక్కరలేదు.

ఏ పాత్ర పోషించినా అందులో ఇట్టే ఒదిగిపోవడం, తను తప్ప మరెవరూ ఆ పాత్ర చేయలేరనిపించుకోవడం ఎన్.టి.ఆర్.కు మాత్రమే సాధ్యమైంది. ■



# ఎన్.టి.ఆర్. గురించి ఆ ఇద్దరూ..!




**శివాజీగణేశన్**

ఒక్క ఒరలో రెండు కత్తులు ఇమడవు అంటారు. కానీ ఒక చిత్రంలో ముగ్గురు హీరోలు ఇమడవచ్చు అని ఋజువు చేశారు సోదరులు ఎన్.టి.రామారావు గారు. ఆయనతో 'భక్త రామదాసు', 'కర్ణ' మొదలైన తెలుగు చిత్రాలలో నటించినా సోదరుని దర్శకత్వంలో నటించింది మాత్రం 'చాణక్య- చంద్రగుప్త' చిత్రంలోనే.

'చాణక్య-చంద్రగుప్త'లో అలెగ్జాండర్ పాత్ర వేయమని ఎన్.టి.ఆర్. అడిగినప్పుడు నేను వెంటనే అంగీకరించడం సోదరుని పట్ల ఉన్న గౌరవభావంతోనే...

కిలోమీటరు పొడుగువున్న డైలాగులు- అన్నీ కష్టమైన డైలాగులతో పాతిక శతాబ్దాలనాటి చారిత్రక పురుషునికి రూపు కట్టాలి. మాతోపాటే నటిస్తూ, ఒకడుగు వెనుకకు వేసి ఆ క్షణంలో డైరెక్టర్‌గా మారి సన్నివేశాన్ని గురించిన వివరణలు ఇస్తున్న రామారావుగారిని చూస్తే నాకు ముచ్చటవేసేది. నటుడు, దర్శకుడు, నిర్మాత అప్పుడప్పుడు సంభాషణల రచయిత. అనేక సందర్భాలలో కెమెరా చూసుకుంటూ విసుగూ విరామం లేకుండా, శ్రమిస్తూవున్న రామారావుగారిని చూస్తే... ఒక వ్యక్తి పెరిగి పెద్దవాడు కావటానికి ఎంత కృషి అవసరమో అర్థమవుతుంది. తెల్లవారు జామున మూడు గంటలకు నిద్రలేచి ఔట్‌డోర్‌లో షూటింగ్‌కు అందరికన్నా





'చాణక్య చంద్రగుప్త' షూటింగ్‌లో శివాజీగణేషన్, అక్కినేని, ఎన్.టి.ఆర్.

ముందే తాను రెడీగా వుండటం చూస్తే, ఇతరులకు ఏదైనా సలహా ఇవ్వబోయేముందు- నీవు ఆచరించి చూపు అన్న తమిళసూక్తి నాకు జ్ఞాపకం వస్తుంది. ఇంతెందుకు ఒక పౌరాణిక చిత్రం, ఒక భారీ చారిత్రక చిత్రం ఒక్క సంవత్సరంలో తీయటానికిగల ఆర్థిక స్తోమతు, అంగబలం, సమర్థత అన్నీ సోదరులు ఎన్.టి.ఆర్.లో వున్నాయి. ఇందులో స్టూడియోలాటి సదుపాయాలు నాకు కల్పించారు అనుకొద్దాం. ఇతర క్వాలిఫికేషన్స్ నాకు ఉన్నాయి అనుకొందాం. ఇన్ని వున్నా నేను 'చాణక్య- చంద్రగుప్త' లాటి చిత్రాన్ని అన్నీ నేనే అయి పూర్తి చేయలేను. అందుకు మరొక రామారావే కావాలి. హేట్సాఫ్ ఆయన తపస్సుకూ, దీక్షకూ, దక్షతకూ..

'చాణక్య చంద్రగుప్త' చిత్రంకోసం హైదరాబాద్‌లో వున్న పది రోజులలో సోదరులు రామారావు, నాగేశ్వరరావు, నేనూ మా పాత్రలలో యుద్ధాలు చేశాం. పోరాడుకున్నాం.. రాజీపడ్డాం. చివరకు ఒక సన్నివేశంలో నేను అలెగ్జాండర్‌గా గ్రీస్ దేశానికి మరలివెళుతూ దేశాన్ని చంద్రగుప్తుని చేతుల్లో పెడుతూ, ఆ చంద్రగుప్తుని చాణక్యుని చేతుల్లో పెడుతూ నాగేశ్వరరావుకు నమస్కారం చేశాను. అలెగ్జాండర్‌గా నేను ఒక అరిస్టోటిల్‌కు మాత్రమే తలవంచి నమస్కారం చేసిన నేను చాణక్యునికి నమస్కరించే సన్నివేశం చిత్రం చివరలో ఉంది. ఆ షాట్ రెండు మూడుసార్లు రీటేక్ అయింది. ప్రతిసారీ చిలిపిగా చూసేవాడు నాగేశ్వరరావు. నేనూ కొంటెగా బ్రదర్ రామారావుతో అంటూ వుండేవాడిని.. అవును సార్! తెలుగులోనే. 'ఏం బ్రదర్.. మళ్లా మళ్లా వీడికే నమస్కారం చేయిస్తున్నారు' అని.

**ఎం.జి.ఆర్.**

రామారావుకు దేహ సౌందర్యం ఉన్నది. శరీరాన్ని ఆయన క్రమ పద్ధతిలో ఉంచుతారు. అందుకనే ఆ శరీరం కథానాయకునికి సరిపోతుంది. క్రూర పాత్రకూ సరిపోతుంది. నిజం చెప్పాలంటే ఆయన ఒక్క హీరో పాత్రధారే కాదు, క్యారెక్టర్ యాక్టర్. ఒక చిత్రంలో ఆయన ముసలివాని పాత్ర ధరించి కళ్లజోడు పెట్టుకుని వస్తూ మాట్లాడుతుంటే.. ఆయనేనని నేను నమ్మలేకపోయాను. సోషల్ హీరో, మహారాజు, వృద్ధుడు ఇలా ఎన్నోరకాల పాత్రలను ఆయన అద్భుతంగా పోషిం

ఎం.జి.ఆర్.తో ఎన్.టి.ఆర్.



చారు. ఆ పాత్రలన్నీ పాత్రలుగానే కనిపిస్తాయి గానీ, ఆయనలా కనిపించవు. అదే నటనాశక్తికి నిదర్శనం. "రాజా-పేద' చిత్రంలో అతి క్లిష్టమైన పాత్రను గొప్ప నైపుణ్యంతో పోషించారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు మొదలైన పౌరాణిక పాత్రలను ధరించడంలో ఆయనకు ఆయనే సాటి. పాత్రను సృష్టించిన రచయితను, తీర్చిదిద్దిన దర్శకుని తృప్తిపరిచినట్లే. ప్రేక్షకులను కూడా తృప్తి పరుస్తారు. శూరత్వం ఉట్టిపడే దృశ్యాన్ని నటిస్తున్నప్పుడు ఆయన్ని చూస్తుంటే భావోద్రేకం కలుగుతుంది. ఆయన అంగాంగాలు, ముఖమూ, నేత్రాలు, కంఠమూ అన్నీ సమపాళ్ళలో నటిస్తాయి. శూరత్వాన్ని చూపిస్తాయి. ఈ విధమైన ఆంగిక ముఖాభినయాలు తక్కిన వారిలో అంతగా చూడలేము. ఆయన నటించే విధానం, పద్ధతి వేరుగా వుంటాయి. ఆయన ఎవర్నీ అనుసరించరు, అనుసరించలేదు. ఆయన బాణీని అనుసరించేవారే ఉంటారు గాని.

ఆయన కార్యశూరుడు. తలపెట్టిన పని జరగవలసిందే. షూటింగ్ సమయంలో ఆయనకు ఆ ధ్యాస తప్పితే, ఇతర వ్యాపకం ఉండదు. అనవసరంగా మాట్లాడుతూ కూర్చోకపోవడం, సెట్‌లో వుంటే షూటింగ్ చకచకా జరుగుతుందని కొందరు నిర్మాతలు, దర్శకులు అనడం నేను విన్నాను. ఆయనవల్ల షూటింగ్ కేన్సిల్ అయ్యిందనో, ఆయనకోసం నిరీక్షిస్తున్నామనో ఎవరూ ఎప్పుడూ అనుకోలేదు. తక్కిన నటీనటులకు ఆయన ఎంతో సహకారం చూపుతారు.

ఎప్పుడూ బిజీగా వుండే వ్యక్తి ఆయన. టైమ్ ప్రకారం జరిగే జీవితం ఆయనది. నటజీవితం లోనూ, నిజ జీవితంలోనూ ఆయనకు ఒకలాంటి చిత్తశుద్ధే ఉన్నది. ఒక్కలాంటి కార్యదీక్షే ఉన్నది. అదే ఆయన చిత్రాలు చూస్తున్నప్పుడు మనకు కలిగే భావం.

ఇలా రామారావుగారి గురించి చెప్పాలంటే ఇంకా ఎన్నో విషయాలున్నాయి. ఆయన్ని చూసి తక్కినవాళ్ళు నేర్చుకోవలసిన విషయాలూ ఎన్నో ఉన్నాయి. చిత్రాల్లో కథానాయకుడై తక్కిన పాత్రలను నడిపించినట్టే అవసరం కలిగినప్పుడు నాయకుడై తక్కినవారిని తన మార్గానికి తిప్పుకుని నడిపించగల శక్తి ఉన్న ధీమంతుడు.

■



# ఇది ప్రేమసింహాసనం...'

ఎన్.టి.ఆర్‌తో 'సాహసవంతుడు' చిత్రాన్ని నిర్మించిన యువ నిర్మాత విద్యాసాగర్ ఆయనతోనే మరో సినిమా తీశారు. రామారావు ద్విపాత్రాభినయం చేసిన ఆ చిత్రం పేరు 'ప్రేమసింహాసనం'. ఈ సినిమాలో కె.ఆర్. విజయ, మంజుభార్గవి, రతి అగ్నిహోత్రి హీరోయిన్లుగా నటించారు. 'బుర్రిపాలెం బుల్లోడు' చిత్రంతో దర్శకుడుగా పరిచయమైన బీరం మస్తాన్‌రావు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఎన్.టి.ఆర్ నటించిన 'ఎదురులేనిమనిషి', 'సాహసవంతుడు' చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేశారు. 'ప్రేమసింహాసనం' చిత్ర విశేషాలు బీరం మస్తాన్‌రావు మాటల్లోనే...

## పాటతో ప్రారంభం

ఆ రోజుల్లో భూతాలరాజు అనే ఆయన సినిమాలకి ముహూర్తాలు పెట్టేవారు. మా సినిమాకు ఆయన తెల్లారి మూడు గంటలకు ముహూర్తం నిర్ణయించారు. వాహినీ స్టూడియోలో వేసిన సెట్‌లో పాటతో షూటింగ్ ప్రారంభించాం. 'జేజమ్మ చెప్పింది జాతి పిల్లాడొస్తున్నాడని...' అనే పల్లవిగల పాటను ఎన్.టి.ఆర్, జయమాలినిపై చిత్రీకరించాం.

డాన్స్ అసిస్టెంట్స్ మూమెంట్స్ చేసి చూపించడం రామారావుగారికి ఇష్టం ఉండేదికాదు. నృత్య దర్శకుడే ఆ పని చేయాలి. అందుకే డాన్స్‌మాస్టర్ శ్రీను చేసి చూపిస్తే ఆయన చేసేవారు.

రామారావుగారిది భారీకాయం కావడంతో ఈ మూమెంట్స్ చేసేసరికి వళ్లంతా చెమటలు పట్టేవి. అయినా సరే రెస్ట్ తీసుకునేవారు కాదు, రిలాక్స్ అయ్యేవారు కాదు. ఒక్కక్షణం కూడా కూర్చోకుండా సాయంత్రం వరకూ అలాగే చేశారు. టేక్ ఓకే కాగానే తర్వాతి షాట్ కోసం రిహార్సల్స్‌లో పాల్గొనడం ఆయనకేమీ ఇబ్బందిగా అనిపించలేదు కానీ జయమాలిని వళ్లు మాత్రం హూనమైంది.



బీరం మస్తాన్‌రావు

సాయంత్రం ఆరు గంటలకు రామారావుగారు నన్ను పిలిచారు. "బ్రదర్.. ఈ నైట్ మనం కంటిన్యూ చేస్తే సాంగ్ అయిపోతుందా?" అని అడిగారు. 'అయిపోతుంది సార్.. మీరు ఓకే అంటే చేసేద్దాం' అన్నాను. 'ఇట్సాల్‌రైట్.. కంటిన్యూ చేద్దాం' అన్నారు. తెల్లారి మూడు గంటలకు ప్రారంభమైన పాట చిత్రీకరణ ఆ

మర్నాడు తెల్లారి మూడు గంటలకు పూర్తయింది. అలా ఆ వయసులో 24 గంటలసేపు ఏక ధాటిగా షూటింగ్‌లో పాల్గొన్న మొండిమనిషి ఆయన.

**మరిచిపోలేని సంఘటన**

ఒకరోజు సినిమాలో చాలా కీలకమైన సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నాను. ఆర్టిస్ట్‌గానే కాదు వ్యక్తిగా కూడా రామారావుగారిని బాగా ఎలివేట్ చేసిన సన్నివేశం అది. నా జీవితంలో మరిచిపోలేని సంఘటన అది. ఆ చిత్ర కథలో జమీందారి వంశానికి చెందిన ఎన్.టి.ఆర్ తన మేనకోడల్ని పెళ్లిచేసుకోవాలి. కానీ అనుకోని పరిస్థితుల్లో ఒక దేవదాసిని పెళ్లి చేసుకోవాల్సివస్తుంది. ఆ దేవదాసి పిల్లాడిని కని, మళ్లీ మేనకోడల్ని పెళ్లి చేసుకోమని చెప్పి చనిపోతుంది. ఆ మేనకోడలు ఆ పిల్లాడిని చేరదీస్తుందికానీ విలన్ల కుట్రవల్ల ఆ పిల్లాడు ఆ ఇంటికి దూరమవుతాడు. ఈ సినిమాలో రామారావుగారు ద్విపాత్రాభినయం చేశారు.. జమీందారుగా, దేవదాసి తనయునిగా. కె.ఆర్.విజయ భార్యగా, మంజుభార్గవి దేవదాసిగా నటించారు. జమీందారు తనయునిగా మోహన్‌బాబు నటించారు.

ఆ రోజు సెట్‌లో చిత్రంలోని ముఖ్యతారాగణమంతా పాల్గొనగా కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నాం. మరణించిన జమీందారుకి తద్దినం పెట్టే సన్నివేశమది. తల్లి పాత్రధారి కె.ఆర్.విజయ ఎన్.టి.ఆర్‌తో 'మీ నాన్నకు తద్దినం పెట్టు' అంటుంది. రామారావుగారు ఏదో చెప్పబోతుండగా "నేను చెబుతున్నాను... వెళ్లి కూర్చో" అని ఆదేశిస్తుంది కె.ఆర్.విజయ. రామారావు గారు వెళ్లి పీటల మీద కూర్చుంటారు. ఇంతలో మోహన్‌బాబు వాదనకి దిగుతారు... "అతనెవరు.. పీటల మీద కూర్చొని మా నాన్నకి తద్దినం పెట్టడానికి?" అని. "అతను మీ నాన్న రక్తం పంచుకుని పుట్టిన కొడుకు, అతనిలో మీనాన్న రక్తం ప్రవహిస్తోంది. అతనే మీ నాన్నకు తద్దినం పెట్టాలి' అంటుంది కె.ఆర్.విజయ. 'వాళ్ల అమ్మ ఎవరు?' అనడుగుతారు మోహన్‌బాబు. పక్కనున్న పాత్రలు 'దేవదాసి' అని చెబుతాయి. 'ఒక దేవదాసి కొడుకు... వీడు మానాన్నకే పుట్టాడని నమ్మకం ఏమిటి?' అని ప్రశ్నిస్తారు మోహన్‌బాబు. వెంటనే 'నువ్వు మీ నాన్నకే పుట్టావన్న నమ్మకం ఏమిటి?' అని కె.ఆర్.విజయ కొడుకుని ప్రశ్నించేసరికి అందరూ షాక్ అవుతారు. ఇదీ ఆ సన్నివేశం. దీని గురించి అందరికీ వివరించాను కానీ రిహార్సల్స్ చేయలేదు. 'బ్రదర్...




చిత్రం పాటల రికార్డింగ్‌లో ఎస్.వరలక్ష్మి, కె.ఆర్.విజయ, విద్యాసాగర్, బీరం మస్తాన్‌రావుతో ఎన్.టి.ఆర్..

మంచి మూడ్‌లో ఉన్నాం. డైరెక్ట్ టేక్ చేద్దాం' అన్నారు రామారావుగారు. నేను ఓకే అన్నాను. కె.ఆర్.విజయ ఆ డైలాగ్ చెప్పగానే రామారావుగారు పీటల మీదనుంచి లేచి 'అమ్మా... నాకోసం నీ శీలాన్ని శంకించుకుంటావా' అని ఆమె దగ్గరికి వెళ్లి ఏడుస్తారు, కె.ఆర్.విజయ కూడా ఏడుస్తుంది. సెట్‌లో ఉన్నవారంతా కంటతడిపెట్టారు. నేను 'కట్' చెప్పి మౌనంగా ఊరుకున్నాను. రామారావుగారు కళ్లు తుడుచుకుంటూ ఇవతలికి వచ్చి 'ఏం బ్రదర్.. వాటీజ్ ది నెక్స్ట్ షాట్?' అనడిగారు.

'లేదు సార్.. ఇదే వన్‌మోర్' అన్నాను. 'వన్‌మోరా... ఏమయింది?' అన్నారు. రామారావుగారి నటనకి సెట్‌లో అందరూ క్లాప్స్ కొట్టారు. నిజంగానే అద్భుతంగానే నటించారు. కానీ ఆ సీన్‌ని నేను కన్విన్స్ చేసుకున్న విధానం వేరు. అందుకే వన్‌మోర్ అన్నాను. రామారావుగారికి ఏమీ అర్థంగాక మళ్లీ రెట్టించి అడిగారు... 'అదికాదు సార్.. తల్లి అంతమాట అనగానే పరిగెత్తుకుని ఆమె దగ్గరికి వెళ్లి ఏడవడానికి మీరేం కొత్త హీరో కాదు... మీరు ఎంతో హుందాగా నటిస్తే తప్ప ఈ సీన్ రామారావుగారు చేసినట్లుగా ఉండదు. అసలు పీటల మీదనుంచి లేవడానికి కూడా టైమ్ తీసుకోవాలి. స్లోగా లేచి అక్కడినుంచి తల్లినే చూస్తూ భారంగా అడుగులు వేస్తూ రావాలి. లోపలినుంచి షివరింగ్ రావాలి. చేతులు వణకాలి. కళ్లలో నీళ్లు సుళ్లు తిరగాలి కానీ ఒక్క చుక్క కూడా బయటకు రాకూడదు. అలా నడుస్తూ వెళ్లి ఆమె చెయ్యి పట్టుకుని నోటమాట వచ్చీ రానట్టుగా డైలాగ్ చెప్పాలి. ఆ డైలాగ్ వినిపించకపోయినా పరవాలేదు. డబ్బింగ్‌లో చూసుకుందాం. ఆ మాటకు తల్లి పాత్ర ఏడుస్తుంది' అని వివరించాను. నేను అలా చెప్పగానే రామారావుగారికి కోపం వచ్చింది. 'ఇంతకీ ఫైనల్‌గా ఏమంటారు?' అన్నారు చాలా సీరియస్‌గా.

'మీరు ఇందాక చేసిన యాక్టింగ్ నాకు అక్కర్లేదు. నేను చెప్పినట్లు చెయ్యండి చాలు" అన్నాను నేను వెనక్కు తగ్గకుండా.

'ఓకే బ్రదర్... మమ్మల్ని పట్టుకుని మీ యాక్టింగ్ అక్కర్లేదు అనే డైరెక్టర్‌ని ఇప్పుడే చూస్తున్నాం. మీకు అక్కర్లేదు అంటే మేమెందుకు చేస్తాం... ఆఫ్టరాల్ నేను ఆర్టిస్ట్‌ని.. మీరు డైరెక్టర్ కదా' అని వ్యంగ్యంగా అన్నారు.



[illegible]నికి హాజరైన కృష్ణతో ఎన్.టి.ఆర్

ఛాయాగ్రాహకుడు పి.ఎస్.ప్రకాష్‌తో 'రావయ్యా ప్రకాష్.. వన్‌మోర్ చేద్దాం... ట్రాలీ ఫస్ట్ పొజిషన్‌కు వెళ్లు. మేం వస్తున్నాం. ఎవ్వరిబడీ రెడీ' అని సీరియస్‌గా వెళ్లి పీటల మీద కూర్చున్నారు రామారావుగారు. సెట్‌లో ఉన్నవాళ్లంతా నా వంక జాలిగా చూస్తున్నారు. 'ఈ షాట్ చేసేసి ఎన్.టి.ఆర్ వెళ్లిపోతారు... ఇక వీడిపని ఇంతే' అనే భావం అందరిలో కనిపించింది.

నేను అవన్నీ పట్టించుకోలేదు. స్టార్ట్ చెప్పాను. కె.ఆర్.విజయ డైలాగ్ చెప్పారు. రామారావుగారు మెల్లిగా లేచారు. అప్పటికి ఆయనకి కోపం తగ్గడంతో నేను చెప్పిన విషయం అర్థమై ఆ సీన్ గొప్పతనం తెలిసినట్లుంది. అంతే పూర్తిగా దానిలో ఇన్‌వాల్వ్

అయిపోయారు. కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. శరీరం వణుకుతోంది. భారంగా అడుగులు వేస్తూ తల్లి దగ్గరికి వెళ్లి ఆమె చెయ్యి పట్టుకున్నారు. నోట మాట రావడంలేదు.. అస్పష్టంగానే డైలాగ్ చెప్పారు.


వెంటనే నేను కట్ చెప్పాను. అంతవరకూ ఉగ్గ పెట్టుకున్న దుఃఖాన్ని ఇక అణుచుకోలేక... "వా...వా...' అంటూ ఏడ్చేశారు రామారావుగారు. సెట్‌లో అంతా క్లాప్స్. కాసేపయ్యాక రిలాక్స్ అయ్యి కళ్లు తుడుచుకుని 'రా బ్రదర్.. రా' అని నన్ను దగ్గరికి పిలిచి గట్టిగా ఆలింగనం చేసుకుని 'యస్.. ఐయాం ఆఫ్టరాల్ ఆర్టిస్ట్‌ని. యు ఆర్ డైరెక్టర్' అని అభినందించారు. ఇప్పటికీ ఆ సీన్ తలుచుకుంటే నాకు ఏడుపు వస్తుంది. మహానటుడు, గొప్ప దర్శకుడు అయినప్పటికీ నాలాంటి వర్ధమాన దర్శకుడు చెప్పిన మాటవిని మళ్లీ ఆ షాట్‌లో పాల్గొనడం ఆయన గొప్పతనం. 'తీసింది చాలు.. వన్‌మోర్ అక్కర్లేదు' అని ఆయన అంటే నేను చెయ్యగలిగిందేమీలేదు. దర్శకుని మాటని గౌరవించే సంస్కారమున్న గొప్పవ్యక్తి ఆయన.

**'అడవిరాముడు'ని మించే స్థాయిలో తీయాలనుకున్నాం**

మా సినిమా క్లైమాక్స్‌ని 'అడవిరాముడు' చిత్రాన్ని మించే స్థాయిలో తీయాలనుకుని కేరళ అడవుల్లో ప్లాన్ చేశాను. నిర్మాతకి భారం కాకుండా ఆహారం నిమిత్తం మాత్రమే 50 రూపాయలు ఇచ్చేలా వంద ఏనుగుల్ని మాట్లాడాను. కె.ఆర్.విజయ భర్త వేలాయుధంతో మాట్లాడి ఒక చిన్న విమానాన్ని ముంబాయి నుండి వచ్చే ఏర్పాటు చేశాను. విడిభాగాలు తీసుకువచ్చి ఇక్కడ బిగించుకునే సౌకర్యం ఉన్న విమానం అది. పెట్రోలు ఖర్చులు మీరు పెట్టుకుంటే చాలు అని కె.ఆర్.విజయ చెప్పారు. కేరళలోని నీలంబూరు సరస్సులో భారీగా ఈ క్లయిమాక్స్ తీయాలని ప్లాన్ చేశాను. మొదట ఊటీ వెళ్లి అక్కడ పాట తీసి అక్కడ నుండి నీలంబూర్ వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేశాం.

ఇక రేపు అవుట్‌డోర్‌కి బయలుదేరి వెళతామనగా ఈ అంతకుమందు రోజు జరిగిన సంఘటన మా సినిమా జాతకాన్ని మార్చేసింది. ఆరోజు 'సర్దార్ పాపా రాయుడు' చిత్రం షూటింగ్‌లో జరిగిన మోటార్‌బైక్ ప్రమాదంలో రామారావుగారి కుడిచెయ్యి విరిగింది. అంతకుముందు మూడుసార్లు విరిగిన చేతికి మళ్లీ ప్రమాదం. ఆ మర్నాడు రామారావుగారిని కలవడానికి వెళ్లాం. 'సారీ... బ్రదర్ ఇవ్వాళ మనం వెళ్లడంలేదు' అన్నారాయన. రెండు నెలలు రెస్ట్ తీసుకుంటేకానీ మీ చెయ్యి స్వాధీనంలోకి రాదని డాక్టర్లు తేల్చి చెప్పారట. షూటింగ్‌కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్న మా గుండెల్లో రాయిపడింది. అయినా చేసేదేముంది. అన్నీ కాన్సిల్ చేశాం. ఆయన చెయ్యి స్వాధీనంలోకి వచ్చాక షూటింగ్ పూర్తిచేసి విడుదల చేశాం.

సంక్రాంతి కానుకగా 1981లో వచ్చిన 'ప్రేమ సింహాసనం' రిలీజు కూడా అస్తవ్యస్తంగా జరిగింది. కొన్ని ఏరియాల్లో మూడు రోజులు ఆలస్యంగా విడుదలయింది. ■



# ఆ రామన్నకు నేను హనుమంతుణ్ణి



జగ్గారావు

వందలాది చిత్రాల్లో విలన్‌గా నటించిన జగ్గారావుకి ఎన్.టి.ఆర్. అంటే ప్రత్యేక అభిమానం. ఆ రాముణ్ణి హనుమంతుడు ఎలా భక్తి ప్రపత్తులతో కొలిచేవాడో, అలాగే ఈ తారకరామునికి నమ్మినబంటు జగ్గారావు. ఆయన ఎక్కడికి వెళ్లినా జగ్గారావు ఎస్కార్ట్‌గా వెంట ఉండాల్సిందే. నటునిగా తనని ఎంతో ఎంకరేజ్ చేసిన రామారావుకి నివాళులు అర్పిస్తూ ఆయనతో తన అనుభవాలు ఇలా వివరించారు.

రామారావుగారితో నేను నటించిన తొలిచిత్రం 'భీష్మ' (1962). అందులో ఆయన టైటిల్ పాత్ర పోషించారు. ధూళిపాళగారు దుర్యోధనునిగా నటించారు. బి.ఎ.సుబ్బారావు గారితో నాకు అంతకుముందు ఉన్న పరిచయం కారణంగా దుశ్శాసనుని పాత్ర ఇచ్చారు. ఆ చిత్ర నిర్మాణ సమయంలోనే రామారావుగారికి సన్నిహితుణ్ణి కాగలిగాను. ఆ రోజుల్లో ఆయన మేకప్ రూమ్‌లోకి వెళ్లడానికి అందరూ భయపడేవారు. 'జగ్గారావు మంచి మనిషి. నమ్మదగిన వ్యక్తి' అనే అభిప్రాయం ఎన్.టి.ఆర్.కి కలగడంతో నాతో చాలా చనువుగా ఉండేవారు. ఆయన మేకప్ రూమ్‌లోకి నేను వెళ్లేవాణ్ణి.

రామారావుగారు ఏ సినిమా చేస్తున్నా, 'జగ్గారావు



'శ్రీరామ పట్టాభిషేకం'లో ఎన్.టి.ఆర్.




వరద బాధితుల సహాయార్థం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో ఎన్.టి.ఆర్.తో పాటు పాల్గొన్న ముక్కామల, పద్మనాభం, ఘంటసాల, బాలకృష్ణ, జగ్గారావు తదితరులు

భాయ్ ఎక్కడ'? అని అడిగేవారు. నాకు వేషం ఉందో లేదో ఆరా తీసేవారు. ఆయన నాతో తరచూ చెబుతుండేవారు. "జగ్గారావు భాయ్ నిర్మాత బాగుండాలంటే మనమందరం సహకరించాలి. ఆయన బాగుంటే మనమందరం బాగుంటాం" అని. ఆ శ్రీరాముణ్ణి ఆంజనేయుడు ఎంతగా ప్రేమించేవాడో నేనూ అన్నగారంటే అంతేగౌరవంతో, అభిమానంతో ఉండేవాణ్ణి. ఆయన ఎప్పుడు ఎక్కడకు వెళ్లినా నేను వెంట ఉండాల్సిందే.

### 'లక్ష్మీకటాక్షం'లో ఆ సంఘటన

పింజల సుబ్బారావుగారు నిర్మించిన 'లక్ష్మీకటాక్షం' (1970) చిత్రం షూటింగ్‌లో జరిగిన ఒక సంఘటనని మీకు చెప్పాలి. రామారావుగారు హీరో, రాజశ్రీ హీరోయిన్. నేను ఆమె మేనమామ పాత్ర పోషించాను. విలన్‌పాత్ర. రామారావుగారు రాజశ్రీ, బొప్పాయితోటలో డాన్స్ చేస్తూ పాట పాడుతుంటారు. అదిచూసి సహించలేని నేను కత్తితో ఆయన మీదకు దాడి చేస్తాను. దీనికోసం కేరళ టైపు బారు కత్తి నా చేతికి ఇచ్చారు. కత్తి దూయగానే బొప్పాయి చెట్టు తెగి పడిపోవాలి కనుక దానికి బాగా పదును పెట్టారు. అప్పటికి సాయంత్రం అయిదున్నర కావడంతో షూటింగ్ త్వరగా ముగించుకుని ఇంటికి వెళ్లే మూడ్‌లో ఉన్నారు అన్నగారు. తప్పనిసరి అయితేే తప్ప ఆరు తర్వాత ఆయన పనిచేసేవారు కాదు. షాట్ తీయడానికి ఏర్పాట్లు పూర్తికావడంతో దర్శకుడు విఠలాచార్యగారు వచ్చి చెప్పడంతో 'ఓ.కే ఇట్సాల్‌రైట్' అని కెమెరా ముందుకు వచ్చారు రామారావుగారు. నా గుండెల్లో రాయి పడింది. కత్తి ఫైట్ అంటున్నారు. పైగా పదునైన కత్తి ఇచ్చారు. రిహార్సల్స్ చేయలేదు. డైరెక్ట్ టేక్ అంటున్నారు అని. ఆ షాట్‌లో నేను ఆయనమీదకి కత్తితో దాడి చేయగానే తను తప్పించుకుని ఆ కత్తి కిందనుంచి ఇవతలకి వస్తారు. అప్పుడు కత్తి దెబ్బకి బొప్పాయి చెట్టు తెగి కిందపడుతుంది. ఇదీ షాట్. అయితే రామారావుగారు వెళ్లిపోవాలనే మూడ్‌లో ఉండటం, రిహార్సల్స్ చేయకపోవడంవల్ల కత్తి పొరపాటున వెళ్లి ఆయన చెయ్యిని బలంగా తాకింది. ఠంగుమని శబ్దం రావడంతో జరిగినదేమిటో అర్థమయి నా గుండె ఆగినట్లయింది. తలకు తగలాల్సిన ప్రమాదకరమైన దెబ్బను రామారావుగారు చేతితో అడ్డుకోగా ఆ పదునుకు చెయ్యి తెగింది. రక్తం కారుతున్న ఆ చేతిని గట్టిగా అలాగే పట్టుకుని ఇవతలకి వచ్చారు రామారావుగారు. సెట్‌లో ఒకటే కలకలం. అందరిలోనూ ఆందోళన. పింజల సుబ్బారావుగారు కారుకోసం పరిగెత్తారు. మేకప్ రూమ్‌లో టించరు ఉంటుంది కనుక నేను అటు పరిగెత్తాను. రామారావుగారు చెయ్యి అదిమి పెట్టడం వల్ల రక్తం




ఆగింది. టించరు వేయడానికి ఆ చెయ్యి తీయగానే రక్తం మళ్లీ కారుతోంది. రామారావు గారు వేసుకున్న బట్టలనిండా రక్తమే. ఇంత జరిగినా ఆయన నన్ను ఒక్కమాట అనలేదు. ఆయనతోపాటు నేను కూడా కారు ఎక్కబోతుంటే.. 'వద్దు బ్రదర్.. ఆ గెటప్‌లో ఎందుకు..'' అని వారించారు.

రామారావుగారికి షూటింగ్‌లో గాయమైందనే వార్త పరిశ్రమలో పాకేసరికి పదికార్లు వేసుకొని ఆయన సన్నిహితులు, నిర్మాతలు హడావిడిగా షూటింగ్ స్పాట్‌కు చేరుకున్నారు. ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పది కుట్లు పడ్డాయి. నేను షూటింగ్ స్పాట్‌లోనే ఉండిపోయాను. గెటప్ తీసేసి డల్‌గా అలా కుర్చీలో కూర్చున్నాను. కాసేపటికి విఠలాచార్యగారు ఫోన్ చేశారు. "జగ్గారావ్.. ఇంటికి వెళ్లిపో.. రేపు షూటింగ్ ఉంది. కారు పంపిస్తాను'' అని.

"సార్.. అన్నగారికి ఎలా ఉంది?'' ఆత్రంగా అడిగాను. "కొంచెం ఫీవర్‌గా ఉంది. ఇంటికి వెళ్లిపోయారు'' అని చెప్పారాయన. నేను ఇంటికి వెళ్లానే కానీ, ఆ రాత్రి నిద్ర పట్టలేదు. రామారావుగారే పదే పదే గుర్తుకు వస్తున్నారు. ఇక ఉండబట్టలేక పొద్దునే అయిదు గంటలకు ఆయన ఇంటికి వెళ్లాను. అప్పటికే ఆయన స్నానం చేసేసి రెడీ అయి కుర్చీలో కూర్చుని ఉన్నారు. ఆయన కాళ్ల దగ్గర కూర్చొని ఏడవటం మొదలు పెట్టాను. నన్ను కాసేపు అలాగే ఏడవనిచ్చి.. 'జగ్గారావు భాయ్.. మనం చాలా అదృష్టవంతులం. ఆ కత్తి దెబ్బకి కన్నో, ముక్కో పోలేదు. అవి పోయి ఉంటే కృష్ణుడు, రాముడు, దుర్యోధనుడు పాత్రలు ఏమయ్యేవి? అన్యాయమైపోయేవాణ్ణి కదా!'' అని ఓదార్చారు.

ఆ తర్వాత టీ ఆఫర్ చేశారు. ఆయన ఇంట్లో టీ చాలా బాగుంటుంది. కలకత్తా నుండి ప్రత్యేకంగా టీ ఆకులు తెప్పించి తయారు చేసేవారు.

## 'ఏకవీర'లో మళ్లీ కత్తిఫైట్

రామారావుగారితో కత్తిఫైట్ అంటే ఫైటర్లను పెట్టే వారు కాదు. ఆర్టిస్టులనే తీసుకునేవారు. రామారావు గారు నన్ను ప్రిఫర్ చేసేవారు. "ఏరా... ఒళ్లు బలిసిందా?'' అని ఇలాంటి డైలాగులు రామారావుగారిని ఉద్దేశించి అనాలంటే నన్నే పిలిచేవారు. రామారావు గారిని 'ఏరా' అని పిలిచానని బయట చెప్పుకునే అవకాశం ఇవ్వకూడదని ఆయన ఇతరుల్ని ఎంకరేజ్ చేసేవారు కారు. 'భీష్మ' చిత్రంలోని ఒక సన్నివేశంలో ఎన్.టి.ఆర్.కి ఎద్దు కృష్ణయ్య అనే అతను డూప్‌గా నటించారు. రామారావు ధరించిన చెప్పుల్నే అతను షాట్‌లో ధరించాడు. అది చూసి రామారావుగారు వేరే చెప్పుల జత కుట్టించేవరకూ షూటింగ్‌కు రాలేదు. అంత రాజసం ఒలకబోసేవారాయన.

'లక్ష్మీకటాక్షం' షూటింగ్‌లో ఆ సంఘటన జరిగిన 20 రోజులకో ఏమో డి.ఎల్.నారాయణగారు 'ఏకవీర' చిత్రం మొదలుపెట్టారు. అందులో కూడా కత్తిఫైట్ ఉంది. రామారావుగారి కాంబినేషన్‌లో వచ్చే కత్తిఫైట్ కనుక ఎవర్ని తీసుకోవాలా అని రామారావుగారినే అడిగారు. "ఏమలా అడుగుతున్నారు.. జగ్గారావు భాయ్‌ని తీసుకోండి'' అన్నారు. ఈ విషయం డి.ఎల్ గారు నా దగ్గరకు వచ్చి చెప్పేసరికి ఆయన మంచి మనసుకి నా నోట మాటరాలేదు.

## ఆయన పద్ధతి అది

రామారావుగారు టవల్స్, ఇతర కాస్ట్యూమ్స్ ఇంటికి తీసుకువెళ్లేవారని చెప్పుకునేవారు. "ఇది ఎన్.టి.ఆర్. ధరించిందిరా... అందుకే నేనూ వాడుతున్నాను'' అని



చెప్పుకునే అవకాశం ఎవరికీ ఇచ్చేవారు కాదాయన. పౌరాణిక చిత్రాలలో నటించేటప్పుడు తను స్వయంగా డిజైన్ చేయించిన కత్తులు, బాణాలు, పిల్లనగ్రోవి, కిరీటాలు, ఇతర ఆభరణాలను నిర్మాతల అనుమతితో అడిగి తీసుకుని తన ఇంట్లో భద్రపరిచేవారు. అందుకు ఇష్టపడిన నిర్మాతలకే ఆయన సినిమాలు చేసేవారు. ముందు ఒప్పుకొని ఆ తర్వాత ఎవరైనా విమర్శలు చేస్తే సహించేవారు కారు. ఆయన పద్ధతి అంతే. కిరీటం ఇలా ఉండాలి, ఆభరణాలు ఈ రీతిలో ఉండాలని ఆయన దగ్గర కూర్చుని డిజైన్ చేయించుకునేవారు.

ఎవరైనా పౌరాణిక పాత్ర పోషించాలనుకోండి, ఎన్.టి.ఆర్. దగ్గరికి వెళ్లాల్సిందే. స్వతహాగా చిత్రకారుడు కావడంతో ఆయన గెటప్ స్కెచ్ గీసి ఇచ్చేవారు. దానిని బట్టి మేకప్ చేసేవారు. పౌరాణిక చిత్రాల నిర్మాణ సమయంలో మేకప్‌కు ముందు మొదటిబొట్టు రామారావు పెట్టాల్సిందే. మహానుభావుడండి.. పరిశ్రమకి ఇంత మంచిపేరు రావడానికి కారణం ఆయనే. క్రమశిక్షణకి ఎంతోవిలువ ఇచ్చేవారు.

**భోళాశంకరుడు**

రామారావుగారు భోళాశంకరుడు. ఆయనకి ఆగ్రహం వచ్చినా, అనుగ్రహం కలిగినా తట్టుకోవడం కష్టంగా ఉండేది. కోపంతో ఒకటి రెండు తిట్లు తిట్టినా, కాసేపటికి మళ్లీ దగ్గరికి పిలిచేవారు.

'ఏకవీర' షూటింగ్‌లో జరిగిన ఒక సంఘటనని చెబుతాను. ఒకరోజు రామారావుగారు ఉన్నట్టుండి "జగ్గారావ్ భాయ్... ఇప్పుడు స్వీట్లు తిందామా?" అన్నారు. నాకు చెబితే నిర్మాతకు ఆ విషయం చేరవేసి ఏర్పాట్లు చేస్తానని ఆయనకు తెలుసు. అందుకే "అలాగే అన్నగారు" అని నిర్మాత డి.ఎల్.నారాయణని పక్కకు పిలిచి ఈ విషయం చెప్పాను. అప్పుడు సాయంత్రం నాలుగు గంటలు అవుతోంది. అడయార్‌లోని సత్యా స్టూడియోలో షూటింగ్ జరుగుతోంది. ఊరుకి కొంచెం దూరం. అయినా సరే వెంటనే డి.ఎల్ గారు కారేసుకునివెళ్లి ఓ గంటలో నేతితో చేసిన స్వీట్లు తీసుకువచ్చారు. సత్యా స్టూడియో ఎం.జి.ఆర్. గారిది. ఆయన మేకప్ రూమ్ రామారావుగారికి మాత్రమే ఇచ్చేవారు. ఆ మేకప్ రూమ్‌లో స్వీట్స్ పెట్టించాను.

షూటింగ్ పూర్తికాగానే ఇద్దరం మేకప్‌రూమ్‌కి వెళ్లాం. నేను ఎనిమిది స్వీట్లు అతికష్టం మీద తినగలిగాను. ఆయన మాత్రం అవలీలగా 14 స్వీట్లు తినేశారు.



అన్ని స్వీట్లు తిన్నాననే కానీ కాసేపటికి కడుపులో తిప్పడం మొదలైంది. ఇప్పుడే వస్తానని చెప్పి బయటకు వచ్చి వాంతి చేసుకున్నాను.

ప్రతి రోజూ ఉదయం రామారావుగారి ఇంటికివెళ్లి ఆయన్ని కలిసేవాడిని. అయిదున్నరకల్లా తయారై బయట కుర్చీలో కూర్చునేవారు. ఎవరైనా ముఖ్యమైన వ్యక్తులు వస్తే లోపలకు తీసుకెళ్లి మాట్లాడేవారు. నన్ను చూడగానే 'ఏం జగ్గారావ్ భాయ్ ఎలా ఉన్నారు?' అని చిరునవ్వుతో ప్రశ్నించారు.

ఎనిమిది స్వీట్లు తినేసరికి నా పనయిపోయింది మరి, అన్ని స్వీట్లు తిన్న ఈయనకి ఏం కాలేదా అనిపించింది. అలాంటి ఉక్కు శరీరం ఆయనది. ఏం తిన్నా, ఎలా తిన్నా హరాయించుకునే శక్తి ఆయనకి ఉండేది. ఇంతలావున్నా పచ్చిమిరపకాయల్ని (అవి పెద్ద కారం ఉండేవి కావు) ఓ 20 తినేసేవారు. వాము పెట్టిన మిరపకాయ బజ్జీలు పాతిక తినేసేవారు. ఒక్కోసారి షూటింగ్‌లో ఉన్నట్లుండి "ఇవాళ పకోడి తిందాం" అనేవారు. ప్రొడక్షన్ వాళ్లకి చెబితే అరగంటలో సిద్ధం చేసేవారు. అల్లం, ఉల్లిపాయ, పచ్చి మిరపకాయలు ఒకే రేంజ్‌లో కలిపి తయారుచేసిన పకోడి ఒక కిలో అవలీలగా తినేవారు. ఏమీ అయ్యేదికాదు ఆయనకి. పకోడి అయినా కోడి అయినా తినడం విషయంలో ఏమాత్రం రాజీపడేవారు కారు.

'అడవిరాముడు' చిత్రం షూటింగ్ ముదుమలై ఫారెస్ట్‌లో జరిగింది. రామారావుగారికి పర్మనెంట్ బిల్డింగ్‌లో బస ఏర్పాటు చేశారు. కొంచెం దూరంలో ఏర్పాటు చేసిన టెంటులో నేను ఉండేవాణ్ణి. మాకు దగ్గరలోనే పులుల బోన్లు ఉండేవి. ఈ చిత్ర నిర్మాతలలో ఒకరైన సత్యనారాయణగారు చాలా సరదా అయిన వ్యక్తి. ఒకరోజు షూటింగ్ అయిన తర్వాత ఫారెస్ట్ అధికారుల అనుమతి తీసుకుని అడవిలో వేటకు వెళ్లి కణుజులు కొట్టుకు వచ్చారు. దాని మాంసం అందరికీ వడ్డించారు. ఫైట్ మాస్టర్ మాధవన్ ఆ రోజుల్లో టాప్. ఆయన ఈ చిత్రానికి పనిచేశారు. కణుజు ఎముకలతో సూప్ పెట్టించారు. రామారావు గారికి కూడా ఆ సూప్ ఇచ్చారు.

ఆ మర్నాడు రాత్రి రామారావుగారు నాకు కబురు చేశారు. నేను వెళ్లగానే తన భోజనం క్యారేజ్ చూపిస్తూ "నాకు కడుపులో అదోలా ఉంది. భోజనం చెయ్యను. ఆ క్యారేజ్ తీసుకెళ్లు. కణుజు సూప్ పంపించాడు మాధవన్. నాన్సెన్స్.. అదికూడా గేదే కదా... అందుకే తినబుద్ధి కావడం లేదు" అన్నారు.

సరేనని చెప్పి ఆ క్యారేజీ తీసుకు వచ్చారు. దాన్ని విప్పాను. ఒక గిన్నె నిండా మీగడ, మరో గిన్నెలో సూప్, మూడోగిన్నెలో కణుజుమాంసం, రెండు కోళ్లు ఉన్నాయి. కణుజు మాంసం నేను కూడా ముట్టుకోకుండా, ఆ రెండు కోళ్లు, మీగడ తినేశాను. దాంతో నా పని అయి

పోయినట్లనిపించింది. ఆయన రోజా కోళ్ళు, మీగడ అంతలా ఎలా తినేవారో అనిపించింది.

### 'ఎదురీత' షూటింగ్‌లో

వి.మధుసూదనరావుగారు దర్శకత్వం వహించిన 'ఎదురీత' చిత్రం షూటింగ్ యానాంలో జరిగింది. ఛీఫ్ సెక్రటరీగా పనిచేసిన రాజుగారికి కొబ్బరితోటలో గెస్ట్ హౌస్ ఉండేది. అందులో రామారావుగారికి విడిది ఏర్పాటు చేశారు.

రామారావుగారు, వాణిశ్రీపై ఆ తోటలోనే ఒక పాట చిత్రీకరించారు. పనసకాయలు దిగుబడికి వచ్చిన సమయమది. చెట్లు పెద్దఎత్తులో ఉండేవి కావు. పిల్లలు ఎవరన్నా కోస్తారేమోనని ఈత చెట్టు మట్టలను తిరగేసి పనస కాయల చెట్టు చుట్టూ కట్టేవారు. ఈత ముళ్ళు సూదుల్లా చాలా పదునుగా ఉండేవి. ఒకరోజు పనస చెట్టు కింద నిలబడి పాటలో నటిస్తూ రామారావు గారు చెయ్యి ఇలా పైకి అనేసరికి ఆ ముళ్ళు గుచ్చుకున్నాయి. చెయ్యి అలాగే పట్టుకుని ముళ్ళు బయటకి లాగేశారు రామారావు గారు. రక్తం ధారగా కారుతోంది. చెయ్యి అలా అదిమి పట్టుకునే అటుఇటు చూశారాయన. దగ్గర్లో పచ్చిమిరప కాయల చెట్టు కనిపించగానే రెండు మిరపకాయలు కోసుకుని నోట్లో వేసుకుని కసకసా నమిలేశారు. 'అదేమిటన్నా' అని నేను అడిగేసరికి 'ఆ నొప్పి తెలియకుండా ఉండటానికి' అన్నారు. అలా ఉండేవి ఆయన పద్ధతులు.

### దారాలు కనిపించాయి

'దానవీరశూరకర్ణ' చిత్రాన్ని మొదలుపెట్టి ఎక్కడా ఆపకుండా ఏకబిగిన షూటింగ్ చేస్తున్నారు. పోటీగా 'కురుక్షేత్రం' తయారవుతుండటంతో సీరియస్‌గా ఆ చిత్ర నిర్మాణంలో నిమగ్నమయ్యారు రామారావుగారు. వరుసపెట్టి సన్నివేశాలు తీస్తున్నారు. ఎలా వస్తుందో రషెస్ కూడా చూడటంలేదు. ఆయన మూడు పాత్రలు చేస్తున్నారు. ఉండబట్టలేక ఒకరోజు అడిగేశాను, "అన్నగారు మీరు పోషిస్తున్న పాత్రలు సింక్ అవుతున్నాయో లేదో చూడటం లేదు" అని. "మనమీద మనకి నమ్మకం లేకపోతే ఎలా బ్రదర్.. డోంట్‌వర్రీ సినిమా బాగా వస్తోంది" అన్నారు. అంత కాన్ఫిడెన్స్ ఆయనకి.

ఈ సినిమాలో ద్రౌపది వస్త్రాపహరణం సన్నివేశం కోసం రామారావుగారు స్వయంగా మార్కెట్‌కి వెళ్లి ఒకే రంగు చీరలు దొరకక పోవడంతో రకరకాల రంగులున్న చీరలు కొని తెచ్చారు. ఈ సన్నివేశంలో నేను ద్రౌపది చీర లాగుతున్నప్పుడు దారాలు కనిపించాయి. షూటింగ్ సమయంలో ఆ విషయాన్ని మేమెవరం గమనించలేదు. తొలికాపీ వచ్చిన తర్వాత చూసుకుంటే ఆ విషయం తెలిసింది. ఆ సమయంలో రీషూట్ చేయాలనే ఆలోచన వచ్చినా వ్యవధి సరిపోకపోవడంతో వదిలేశారు. సినిమాలో దారాలు కనిపించడమే లోపం.



'ఎదురీత' చిత్రంలో ఎన్.టి.ఆర్., వాణిశ్రీ


ఈ చిత్రం షూటింగ్ సమయంలోనే మరో సంఘటన. ఒకరోజు షూటింగ్‌కు ప్యాకప్ చెప్పారు. శకుని పాత్రధారి ధూళిపాళగారు మేకప్ తీయడానికి సిద్ధమవుతున్నారు. ఇంతలో మేకప్ తీయవద్దని, ఇంకో షాట్ తీయాలని కబురు వచ్చింది. 'అబ్బా.. మళ్లీనా..'' అని అలసటతో విసుగ్గా అన్నారు ధూళిపాళగారు. నిజమే మరి.. ఏమాత్రం విశ్రాంతి తీసుకోకుండా అందరం పనిచేస్తూనే ఉన్నాం. రామారావుగారు ఈ మాట విన్నారు. "ఏం ధూళిపాళగారు... అంత అలసిపోయారా.. అయితే ఇది చూడండి" అని కంకణాలు పెట్టే తన చేతిని చూపించారు. అక్కడ చర్మం కమిలిపోయి, తోలు లేచిపోయింది. సినిమాలోని మూడు గెటప్స్ కోసం తరుచు కంకణాలు, ఇతర ఆభరణాలు తీసి పెడుతుండటం వల్ల చర్మం అలా కమిలి పోయింది. అయినా ఆ బాధని అలా ఓర్చుకుని నటించిన మొండిమనిషి ఎన్.టి.ఆర్.

ఆ కిరీటాలు, ఆభరణాలు తీసిపెడుతున్నప్పుడు గీసుకుపోయేవి. ఆ కాలంలో పురాణ పురుషులు వీటిని ఎలా భరించేవారో అని నేను లోలోపల విసుక్కునే వాడిని. కానీ రామారావు గారిలో ఆ విసుగుదల ఎక్కడా ఎప్పుడూ కనిపించలేదు.

రామకృష్ణా స్టూడియోలో ఉన్న గదులలోనే మా అందరికి వసతి ఏర్పాటు చేశారు. రామారావుగారి అనుమతి లేకుండా ఎవరం బయటకి వెళ్లడానికి వీల్లేదు. మద్యపానం నిషిద్ధం. అయితే ముక్కామలగారికి రోజా కొంచెం తీర్థం పుచ్చుకోవడం అలవాటు. "సార్ నాకు చిన్న అలవాటు ఉంది.. మీరు అనుమతించాలి" అని ఇన్‌డైరెక్ట్‌గా రామారావుగారిని అడిగారాయన. 'ఇట్సాల్ రైట్... జాగ్రత్త, మరీ ఎక్కువ పుచ్చుకోకండి' అని ఆయనకు మాత్రమే అనుమతి ఇచ్చేవారు.

ఎన్.టి.ఆర్.కి మందు అలవాటు లేదు. మొదట్లో గొంతు బాగా రావడం కోసం తెల్లారి చుట్ట కాల్చేవారు. ఆ తర్వాత కొంతకాలం సిగరెట్లు తాగేవారు. ఆపై అదీ మానేశారు. ఆ రోజుల్లో 555 సిగరెట్లు టిన్నులలో వచ్చేవి. ఒక్క టిన్నులో

'దానవీరశూరకర్ణ'లో ఎన్.టి.ఆర్.



60 సిగరెట్లు ఉండేవి. మార్కెట్‌లో ఎక్కువగా దొరికేవి కావు. రామారావు గారికోసం తెచ్చి స్టాక్ ఉంచేవాళ్లు.

### రాముని గెటప్ కోసం

'అడవిరాముడు' చిత్రంలో 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు...' పాటలో కాసేపు రాముని గెటప్‌లో కనిపిస్తారు ఎన్.టి.ఆర్. ఈ పాత్ర కోసం కాషాయ వస్త్రాలు తెప్పించారు. రూమ్‌లో ఉన్న మంచం తీసేశారు. కొత్త చాప తెప్పించారు. దానిమీదే పడుకునేవారు. ఇదేమి టన్నా అని అడిగితే "మనం రాముని వేషం వేస్తున్నాం బ్రదర్. నిష్ఠగా ఉండాలి కదా' అని చెప్పారు. ఆ యా పాత్రలు పోషిస్తున్నప్పుడు ఆయన అంత పవిత్రంగా ఉండేవారు కనుకే ఆ భగవంతుణ్ణి ఆయనలో చూసుకునేవారు జనం.


రామారావుగారి గదిలో రకరకాల పళ్లు ఉండేవి. అయితే బాడీని కంట్రోల్‌లో ఉంచుకోవడం కోసం అవి యూనిట్‌లో అందరికీ పంచేవారు.

### క్రమశిక్షణకు మరో పేరు

మొదట్లో అవుట్‌డోర్ షూటింగ్స్‌లో పాల్గొనడానికి ఆసక్తి చూపించేవారు కాదు ఎన్.టి.ఆర్. తర్వాత తన పద్ధతిని కొంతవరకు మార్చుకున్నారు. షూటింగ్ ఉందంటే అది అడవైనా, ఉన్న ఊరైనా కాల్షీటు సమయానికి పావుగంట ముందే స్పాట్‌లో ఉండేవారు. ఆయన వచ్చేసరికి అంతా ఎలర్టయి ఉండేవారు. ఆర్టిస్టులు కూడా సరిగ్గా సమయానికి వచ్చేసేవారు. ఒక్క జగ్గయ్యగారికి మాత్రమే మినహాయింపు ఉండేది. షూటింగ్‌కి రోజూ రెండు గంటలు లేట్‌గా వచ్చేవారు జగ్గయ్య. చూసీ చూడనట్లు ఉండేవారు రామారావుగారు. 'వారి సీన్లు ఆపి, మిగిలినవి తీయండి' అనేవారు. తను ఎంత లేట్‌గా వచ్చినా ఆ లేట్‌ని కవర్ చేసేవారు జగ్గయ్యగారు. అద్భుతమైన జ్ఞాపకశక్తి ఆయనది. ఎంత పెద్ద డైలాగ్ అయినా ఒక్కసారి చూసుకుని వెంటనే షాట్‌లో టకటకా చెప్పేసేవారాయన. ■



లవకుశ చిత్రంలో ఎన్.టి.ఆర్.



'కథానాయకుడు' చిత్రంలో ఎన్.టి.ఆర్., చలపతిరావు తదితరులు

# సరిలేరు నీకెవ్వరూ...

చలపతిరావు

'కథానాయకుడు' (1969) చిత్రంలో తొలిసారిగా నటించిన చలపతిరావును ఎన్.టి.ఆర్. ఎంతో ప్రోత్సహించేవారు. తన ప్రతి సినిమాలోనూ వేషం ఇప్పించేవారు. అంతేకాదు తను 'దానవీరశూరకర్ణ' చిత్రంలో మూడు వేషాలు వేస్తే, చలపతిరావుతో అయిదు వేషాలు వేయించారు. రాముడు, రావణుడు పాత్రలను తను 'శ్రీరామ పట్టాభిషేకం'లో ధరిస్తే, ఇంద్రజిత్తు, ధన్వంతరి పాత్రలను చలపతిరావుకు ఇచ్చారు. అలా ఎన్.టి.ఆర్. అభిమానానికి పాత్రుడైన చలపతిరావు ఆయన ఆంతరంగికుల్లో ఒకరిగా నిలిచారు. ఎన్.టి.ఆర్.తో తనకున్న అనుబంధాన్ని, వ్యక్తిగా ఆయన గొప్పతనాన్ని చలపతిరావు వివరించారు. ఆయన మాటల్లోనే..

నా దృష్టిలో రామారావుగారు ఒక డిక్షనరీ. ఏ పాత్రకు సంబంధించిన రిఫరెన్స్ కావాలన్నా ఆయన దగ్గర దొరికేది. ఆయనది క్రియేటివ్ బ్రెయిన్. నిరంతరం కొత్తదనం కోసం తపించేవారు. మహామహులైన కవులు సముద్రాల సీనియర్, జూనియర్, కొండవీటి వెంకట కవి... తదితరులతో పురాణాల గురించి, కథల గురించి చర్చలు జరుపుతూ తన అవగాహన పెంచుకునేవారు.

### ఆయన పద్ధతి ఇదీ

పొద్దున్నే రెండున్నర గంటలకు లేవడం రామారావు గారికి అలవాటు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయన ఈ క్రమం తప్పేవారు కాదు. వ్యాయామం, ప్రాణాయామం చేసి మూడున్నరకల్లా స్నానాదులు పూర్తి చేసుకుని ఆఫీసుగదిలో కూర్చునేవారు. ఆ తర్వాత గంటన్నర

సేపు కొత్త సినిమాల కథలు, స్క్రిప్ట్ గురించి ఆలోచించేవారు. అయిదు గంటలకల్లా భోజనం చేసి మేకప్‌కి వెళ్లేవారు. ఒకరోజు ఆయన్ని అడిగేశాను. “అదేమిటన్నయ్యా... మీరు అయిదు గంటలకే భోజనం చేస్తున్నారు?’ అని. దానికి ఆయన చెప్పిన సమాధానం ఎంతో సమంజసంగానూ, ఇతరుల్ని ఆలోచింపచేసే విధంగానూ ఉందనిపించింది. ‘మన నిర్మాతకు ఒక్క నిమిషం కూడా వేస్ట్ అవకూడదు. షూటింగ్ స్పాట్‌కి వెళ్లిన తర్వాత నేను టిఫిన్ చేసి వస్తాననీ, భోజనం చేసి వస్తాననీ చెప్పి ఓ గంట తర్వాత తిరిగి వస్తామనుకో. గడిచిపోయిన కాలం తిరిగిరాదు కదా! షూటింగ్ మొదలు పెట్టిన తర్వాత నిర్మాతకు ప్రతిక్షణం విలువైనదే. అందుకే నావల్ల ఎవరికీ ఇబ్బంది కలగకూడదని ఆ విషయంలో జాగ్రత్తగా ఉంటాను’ అని. ‘మరి సూర్యోదయానికి ముందే మేకప్ ఎందుకు వేసుకుంటారు?’ అని మరోసారి అడిగాను. “ఆ సమయానికే మేకప్ వేసుకోవాలి. ముఖం చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. అంతే కాకుండా షూటింగ్ ఎన్ని గంటలకు మొదలు పెడతారో తెలీదు. మనం మేకప్ వేసుకుని కాస్ట్యూమ్స్‌తో రెడీగా ఉంటే మన పనులు చేసుకోవచ్చు. వారు ఎప్పుడు పిలిస్తే అప్పుడు షూటింగ్‌కు వెళ్లవచ్చు. ఎవరికీ ఇబ్బంది కలుగదు. టైం వేస్ట్ కాదు” అని చెప్పారు అన్నగారు.

రామారావుగారి జీవితం గడియారమంత కరెక్ట్‌గా నడిచేది. కెరీర్ ప్రారంభించిన తొలిరోజుల్లో రోజుకి రెండు, మూడు షిఫ్ట్‌లు పనిచేసిన సందర్భాలు ఎన్నో. ఉదయం ఏడు గంటలయ్యేసరికి స్టూడియోలో ఉండేవారు. అక్కడినుంచి రాత్రివరకూ షూటింగ్స్‌లో పాల్గొనేవారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత వ్యక్తిగతమైన పనులు చూసుకుని పదకొండున్నరకి నిద్రపోయేవారు. 1970 వరకూ ఇదే పద్ధతి కొనసాగింది. ఆ తర్వాత రెండు షిఫ్టులు చేయడం తగ్గించి, సాయంత్రం ఆరు గంటల తర్వాత షూటింగ్‌లో పాల్గొనేవారు కాదు.

తను ఎంత బిజీగా ఉన్నా, కాల్షీటు టైమ్‌కి ఒక్క నిమిషం ఆలస్యంగా ఎన్.టి.ఆర్. రావడం ఏ నిర్మాత



'దానవీరశూరకర్ణ' చిత్రంలో..

ఎరుగడు. గడియారమంత కచ్చితమైన రామారావుగారి నిర్ణీతమైన కార్యక్రమాలను చూసి, ఆయన రాకతో ఎందరో తమ వాచీలను సరిచేసుకున్న సందర్భాలు నాకు తెలుసు. యూనిట్ సభ్యులు కానీ, నిర్మాత కానీ స్టూడియోకి చేరకముందే ఆయన అక్కడికి వెళ్లి వారి కోసం నిరీక్షిస్తూ కూర్చున్న సంగతులు నేనెరుగుదును.

ఇక రామారావుగారు నిర్మించిన సినిమాల షూటింగ్స్ ఉదయం ఏడు గంటలకే మొదలయ్యేవి. సాయంత్రం 6 గంటలకు ప్యాకప్ చెప్పేవారు. ఎంతో వర్క్ జరిగేది. అత్యవసరమైతే తప్ప నైట్ షూటింగ్‌లు చేసేవారు కాదాయన. ఆర్టిస్టులు ఎప్పుడూ ఫ్రెష్‌గా ఉండాలనేవారు. వాడిపోయిన ముఖాలతో, అలసిన శరీరాలతో నటించడానికి అంగీకరించేవారు కాదు. ఈ విషయంలో కూడా తన గురువు కె.వి.రెడ్డిగారి పద్ధతిని ఫాలో అయ్యేవారు. సెట్‌లోకి రాగానే కె.వి.రెడ్డిగారు ఆర్టిస్టుల ముఖాలను పరిశీలనగా చూసేవారు. ఎవరన్నా డల్‌గా కనిపిస్తే, "ఏమప్పా... ముఖం డల్‌గా ఉంది?" అని అడిగేవారు. 'రాత్రి ఒంటిగంట వరకూ షూటింగ్ జరిగిందండి' అని ఆ ఆర్టిస్ట్ చెప్పగానే మరోమాట లేకుండా 'ప్యాకప్' అని షూటింగ్ కాన్సిల్ చేసేవారు. ఆర్టిస్టుల ముఖాలు ఎప్పుడూ పువ్వుల్లా ఫ్రెష్‌గా ఉండా లని, అప్పుడే ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ పలుకుతాయని ఆయన చెప్పేవారు. తమకంటే అందంగా ఉన్నవారినే తెరపై చూడటానికే ప్రేక్షకులు వస్తారని కె.వి.రెడ్డిగారు అనేవారు. అందుకే "ఇవాల్టికి రెస్ట్ తీసుకుని రేపు ఫ్రెష్‌గా రా... షూటింగ్ చేద్దాం" అని చెప్పేవారు. ఆ రోజుల్లో కె.వి.రెడ్డిగారు క్లోజప్ షాట్స్ తీసేముందు ఆర్టిస్టుల ముఖాలు ఫ్రెష్‌గా ఉన్నాయా లేదా అని పరి శీలనగా చూసేవారు. ఆయన పద్ధతులే ఎన్.టి.ఆర్.కి అలవాటయ్యాయి. భోజనం చేసి రాత్రి ఏడున్నర, ఎని మిది గంటలకల్లా ఆయన పడుకునేవారు. మళ్లీ తెల్లారి రెండున్నరకు లేచేవారు. దీంతో మనిషి ఎప్పుడూ చూసినా ఫ్రెష్‌గా ఉండేవారు.

### దటీజ్ ఎన్.టి.ఆర్.

పురాణపాత్రలంటే అందరికీ గౌరవమే. అయితే కొన్ని పురాణ పాత్రలు తప్పులు చేసినా వాటిని వేలెత్తి చూపే ధైర్యం ఎవరూ చేయలేకపోయారు. పురాణాలను

'రాముడు-భీముడు' చిత్రంలో..




ఔపోసన పట్టడంవల్ల, ఉద్దండ పండితులతో జరిపిన గోష్టులలో తెలుసుకున్న విషయాలవల్ల రామారావుగారు తన సినిమాల్లో ఆ తప్పుల్ని వేలెత్తి చూపించారు. 'దానవీరశూరకర్ణ' చిత్రంలో శకునితో చెప్పిస్తారు... "పేరుకి ధర్మరాజే కానీ వట్టి జూదరి, వ్యసన పరుడు" అని. అలా చెప్పగలిగిన ధైర్యం ఎన్.టి.ఆర్.కు మాత్రమే ఉంది. అలాగే మరోచోట దుర్యోధనునితో అనిపిస్తారు... "పాండవులు ఐదుగురు, మేం నూరుగురం... ఈ సువిశాల సామ్రాజ్యాన్ని మేమందరం పంచుకుంటే ఎవరికి ఎంత వస్తుంది? అసలు అలా ముక్కలు ముక్కలుగా విడగొట్టి పంచుకోవడం శ్రేయస్కరమా?" అని. ఈ నాటి రాజకీయ పరిస్థితులను రామారావు గారు ఏనాడో ఊహించి అలా డైలాగులు రాయించారు.

మనకు రాముడు ఎలా ఉంటాడో, కృష్ణుని రూపమేమిటో తెలీదు. రామారావుగారు ఆ యా పాత్రలను పోషించి వాటికి రూపం ఏర్పరిచారు. రాముడు, కృష్ణుడు ఇలాగే ఉండేవారేమోననిపించారు. 'రామాయణం', 'మహాభారత్' హిందీ సీరియల్స్ నిర్మించే ముందు ఆ దర్శక నిర్మాతలు రామారావుగారి దగ్గరకి వచ్చి ఆ విగ్గులు, ఆభరణాలు చూసి డిజైన్లు తయారు చేసుకుని వాటిని ఫాలో అయ్యారు. దీనివల్ల ఆ సీరియల్స్‌కు అందంవచ్చి ఎంతో ప్రజాదరణ పొందాయి. ఎక్కడెక్కడివారో పురాణాలకు సంబంధించి ఏ అనుమానం వచ్చినా రామారావుగారిని కలిసి సందేహ నివృత్తి చేసుకునేవారు.



## పెద్ద దిక్కు

అలాగే పరిశ్రమలో ఎవరికి ఏ ఇబ్బంది కలిగినా వచ్చి రామారావుగారికి చెప్పుకునేవారు. ఆ విషయం ఆయన చెవిన వేస్తే తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం వారికి. వారు చెప్పింది వినడమే కాకుండా అప్పటికప్పుడు ఆ సమస్యని పరిష్కరించేవారు రామారావుగారు. ఒకరికొకరికి పడక భార్యాభర్తలు విడిపోవాల్సిన పరిస్థితులు వచ్చినప్పుడు ఆయనకి ఈ విషయం తెలిసి ఇద్దరినీ మందలించి వారి కాపురాన్ని సరిదిద్దేవారు. ఇక హీరోయిన్లు తమ వ్యక్తిగత సమస్యలను పెద్దాయనకి చెప్పుకుని సాయం పొందేవారు. ఆ రోజుల్లో ఒక హీరోయిన్ డేట్లు ఆమె బావ చూసేవాడు.



అనాటి ముఖ్యమంత్రి సంజీవరెడ్డితో ఎన్.టి.ఆర్, డి.వి.ఎస్.రాజు, రాజసులోచన, చంద్రకళ, సూర్యకాంతం, శాంతకుమారి, సావిత్రి, జమున

నగదు వ్యవహారాలను కూడా ఆయనే పర్యవేక్షిస్తుండటంతో ఆమె ఆస్తినంతా తన పేరుకి మార్చుకున్నారు. ఈ విషయం ఆ హీరోయిన్‌కి తెలిసి లబో దిబోమంటూ రామారావుగారికి చెప్పుకుని కళ్లనీళ్లు పెట్టుకుంది. తను రోడ్డుమీద ఉన్నానంటూ ఆమె చెప్ప డంతో రామారావుగారు ఆ హీరోయిన్ బావని పిలిచి గట్టిగా మందలించి ఆస్తిని తిరిగి ఆమెకి రాసిచ్చేలా చేశారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో స్వయంగా చూసిన నాకు తెలుసు. ఎంతమంది హీరోయిన్ల సంసారాలు నిలబెట్టారో నేను చూశాను.

**అన్నగారు పిసినారా?**

రామారావుగారు ఎవ్వరికీ రూపాయి ఇవ్వడు, వట్టి పిసినారి అనే ప్రచారం ఆ రోజుల్లో జరిగేది. అది నిజమేనని నమ్మి ఇప్పటివాళ్లుకూడా అలాగే అనుకుం టున్నారు. అది చాలా చాలా వంకరమాట. దుర్బుద్ధితో చేసే ప్రచారం. ఆయన గుప్తదాత. శ్రీమతి తారకమ్మ గారితో కలిసి ఎందరికో ఎన్నోసార్లు ఉపకారాలు చేశారు. ఎవరైనా ఆర్టిస్ట్ ఆయన దగ్గరికి వెళ్లి 'అన్న గారూ... నేను ఇల్లు కట్టుకుంటున్నాను" అని చెబితే చాలు ఆయన ఎంతో ఆనందించేవారు. 'వెల్‌డన్ బ్రదర్.. మా దగ్గర రెండు సినిమాలు చేస్తున్నారు. వాటి పారితోషికం తీసుకోండి' అని రెండు సినిమాల డబ్బు ఒకేసారి ఇచ్చేవారు. ఎవరన్నా ఇల్లు కట్టుకుంటున్నా రన్నా, కారు కొంటున్నారన్నా తెలిస్తే ఎంతో సంబర పడిపోయేవారు, వారిని అభినందించేవారు.

చిన్న చిన్న ఆర్టిస్టులు పడే ఇబ్బందులు ఆయనకి బాగా తెలుసు. అందుకే వారిని జాగ్రత్తగా చూసుకునే వారు. ఎన్.టి.ఆర్.ని నమ్మి పొయ్యిమీద ఎసరు పెట్టి వేషాలకు వెళ్లవచ్చు అనుకునేవాళ్లు చిన్న ఆర్టిస్టులు. షూటింగ్ పూర్తి కాగానే డబ్బు చేతిలో పడుతుంది కనుక వచ్చేటప్పుడు బియ్యం కొనుక్కుని రావచ్చనే ధీమా వారిలో కనిపించేది. రేపురా, ఎల్లుండి రా అని తిప్పించిన నిర్మాతలను చూశాను కానీ ఎన్.టి.ఆర్.లా అంత కచ్చితంగా పే చేసే నిర్మాతని చూడలేదు.

హైదరాబాద్‌లో జరిగే రామారావుగారి షూటింగ్స్‌లో పాల్గొనడానికి చెన్నైనుంచి వచ్చేవాళ్లం. తిరిగి సాయం త్రం రైలుకి వెళ్లిపోతున్నామంటే ఓచర్, డబ్బు రెడీగా ఉండేది. మేనేజర్లకి ఇస్తే డబ్బు సరిగ్గా అందదేమోనని

స్వయంగా ఆయనే ఇచ్చేవారు. "జాగ్రత్తగా ఇంటికి తీసుకెళ్లండి బ్రదర్... ఖర్చు పెట్టవద్దు" అనేవారు.

బయట నిర్మాతలకంటే అన్నగారు తక్కువ పారితోషికం ఇచ్చేవారని మరో ప్రచారం ఉంది. ఇదీ నిజం కాదు. అయితే ఒక విషయం చెప్పాలి. ఒక ఆర్టిస్టును బుక్ చేసేముందు "మీకెంత ఇమ్మంటారు?" అని అడిగేవారాయన. 'మీ ఇష్టం' అని ఆ ఆర్టిస్ట్ చెబితే ఇక అంతే సంగతులు. (ఎందుకంటే బయటి విషయాలు ఆయనకి తెలియవు. ఎవరెంత తీసుకుంటున్నది పట్టించుకునేవారు కాదు) ఆ ఆర్టిస్ట్ అలా అనగానే తనకు తోచిన మొత్తం చెల్లించేవారు. అలా కాకుండా "బయట పదివేలు తీసుకుంటున్నాను అన్నగారు" అని చెబితే "ఇట్సాల్‌రైట్ (ఇది ఆయన ఊతపదం) అని అంత డబ్బు ఇచ్చేవారు. ఆయన దగ్గర నోరు తెరవక తక్కువ డబ్బు తీసుకున్నవాళ్లు బయటకి వచ్చి చెడు ప్రచారం చేసేవారు.


పరిశ్రమలో ఆయణ్ణి ఒక పెద్ద దిక్కులా భావించి ఎవరికి ఏ కష్టం వచ్చినా చెప్పుకునేవారు. ఎంతమందికి ఆయన ధన సహాయం చేశారో నాకు తెలుసు. చదువుకోవడానికి డబ్బు ఇచ్చి ప్రోత్సహించింది నాకు తెలుసు. ఇందుకు కె.వి.రెడ్డిగారి విషయమే మంచి ఉదాహరణ.

విజయా సంస్థకు ఎన్నోహిట్లు ఇచ్చిన గొప్ప దర్శకుడు కె.వి.రెడ్డి. అయితే ఒక ఫ్లాప్ సినిమా తీశారని ఆయన దగ్గరున్న కారు కూడా తీసేసుకున్నారు. వాళ్ల అబ్బాయి ఫారిన్‌కి వెళ్లి చదువుకోవడానికి డబ్బు లేకపోతే రామారావుగారికి ఈ విషయం తెలిసి సాయం చేశారు.

మరో విషయం ఏమిటంటే అన్నగారికి కృతజ్ఞతా భావం ఎక్కువ. చేసిన మేలు మరిచిపోయేవారు కాదు. ఎవరి ఇంట్లో మంచినీళ్లు తాగినా జీవితాంతం ఆ విషయం మరచిపోయేవారు కాదు. 'వారి ఇంట్లో మంచినీరు తాగాను. ద్రోహం చేయకూడదు' అనుకున్న మహానుభావుడాయన. తనని హీరోగా పరిచయం చేసిన దర్శకుడు బి.ఎ.సుబ్బారావుగారు, ఎన్నో హిట్ చిత్రాలకు మాటలు రాసిన సముద్రాల జూనియర్‌ల అవసాన దశలో ఇబ్బందులు పడుతుంటే తను ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రభుత్వ పదవులు కట్టబెట్టి ఆదుకున్నారు.



సముద్రాల జూనియర్, పద్మనాభం, సముద్రాల సీనియర్ తదితరులతో ఎన్.టి.ఆర్.



చలపతిరావు గృహప్రవేశానికి ఎన్.టి.ఆర్. హాజరైన సందర్భంగా..

అదేవిధంగా చదువుకున్నవాళ్లంటే ఎంతో గౌరవం అన్నగారికి. షూటింగ్ స్పాట్‌లో ఫోర్త్ అసిస్టెంట్ డైరెక్టర్ గ్రాడ్యుయేట్ అని తెలిస్తే "రండి గురువుగారు... డైలాగులు చెప్పండి" అని గౌరవించేవారు. అందరూ బాగా చదువుకుని జ్ఞానంతో మెలగాలని రామారావు గారు అంటుండేవారు.

నేను మద్రాసులో ఇల్లు కట్టుకున్నాను. అప్పటికే అన్నగారు ముఖ్యమంత్రి అయ్యారు. ఓ సందర్భంలో ఆయన మద్రాసు వచ్చినప్పుడు నేను ఈ విషయం చెప్పాను. ఆయన ఎంతో సంబరపడి గృహ ప్రవేశానికి ముహూర్తం పెట్టడమే కాకుండా దగ్గరుండి ఆ కార్యక్రమం జరిపించారు. అన్నగారికి గోధుమరవ్వ ఉప్మా, మీగడ అంటే ఇష్టం. ఆ రోజు అవి వడ్డించగానే కడుపునిండా తిన్నారు. కనిపించిన వాళ్లందరికీ 'చలపాయ్ చిన్న ఇల్లు కట్టుకున్నాడు' అని చెప్పేవారు.

చిన్నా, పెద్ద అనే తేడాలేకుండా అందరినీ సమానంగా గౌరవించేవారు ఎన్.టి.ఆర్. ఎవరు తన దగ్గరకు వచ్చినా లేచి నిల్చుని రెండు చేతులు జోడించి నమస్కరించేవారు. అంత గొప్ప సంస్కారం ఎవరిలోనూ చూడలేదు. మనం రెండు చేతులు జోడించి నమస్కరిస్తే రిసీవ్ చేసుకునే సంస్కారం ఇవాళ చాలామందిలో లేదు.

## టవల్స్ తీసుకెళ్తారా?

రామారావుగారు టవల్స్ తీసుకెళ్లేవారు అనే ప్రచారం ఉంది. ఒకసారి ఆయన్ని అడిగాను. ఎప్పుడూ పక్కనే ఉండేవాణ్ణి కనుక ఎలాంటి సందేహం వచ్చినా వెంటనే ఆయన్ని అడిగేసేవాణ్ణి. 'అన్నయ్యా.. టవల్స్ తీసుకెళుతున్నారని మనమీద ప్రచారం జరుగుతోంది. ఈ టవల్స్ మనకు అవసరమా'? అని.

ఆయన నా వంక సీరియస్‌గా చూసి "నాన్సెన్స్... మేం టవల్స్ తీసుకెళ్లడమేమిటి?" అన్నారు. తర్వాత నిదానంగా.. "మనకు అన్నం పెడుతుంది మేకప్పే... ఆ మేకప్ మహాలక్ష్మి కూడా. షూటింగ్ అయిన తర్వాత మేకప్‌ని టవల్‌తో తుడిచేస్తాం. ఆ తర్వాత ఆ టవల్‌ని జాగ్రత్త చేయకపోతే చెప్పులు తుడవడానికో, టేబుల్ క్లీన్ చేయడానికో వాడతారు తప్ప పవిత్రంగా ఉంచరు. మనం మేకప్ తుడుచుకున్న టవల్‌ని మన కళ్లముందే అలా చేస్తుంటే బాధగా ఉంటుంది. అందుకే ఆ టవల్‌ని

ఇంటికి తీసుకెళ్లి శుభ్రంగా ఉతికించి పవిత్రంగా ఉంచుతాం. అంతేకానీ ఈ టవల్స్ ఏం చేసుకుంటాం?" అని వివరించారు అన్నగారు.

ఆయన సెట్‌లోకి రాగానే కుర్చీవేసి దానిమీద టవల్ వేసేవారు ప్రొడక్షన్ స్టాఫ్. అలా షూటింగ్ జరిగినన్నాళ్లు టవల్స్ మార్చి వేసేవాళ్లు. "ఇది రామారావు వాడిన టవల్" అని చెప్పుకుని స్నానానికి వేరెవరో ఉపయోగించడం ఆయనకి ఇష్టంలేక ఆ టవల్ కూడా ఇంటికి తీసుకెళ్లేవారు, అంతే... ఆయన గెటప్‌లో ఉన్నప్పుడు ఏ జర్నలిస్టయినా సెట్‌కి వచ్చి స్టిల్ తీసుకుంటామంటే అంగీకరించేవారు కాదు. 'ఈ పవిత్రమైన గెటప్ నిర్మాత గారిది. ఆయన్ని అడిగి తీసుకోండి.. నాకేం అభ్యంతరంలేదు' అనేవారు. అలా గెటప్ లీక్ కాకుండా జాగ్రత్త పడేవారు. నిర్మాత అభిప్రాయానికి విలువనిస్తూ ఆయన అనుమతితో స్టిల్స్‌కి ఫోజులిచ్చేవారు.


**ఆ చెత్త చదవకండి**

కష్టపడందే ఎవరూ పైకిరారు. ప్రారంభం నుంచి కష్టపడే మనస్తత్వం అన్నగారిది. సినిమానే శ్వాసగా, ధ్యాసగా ఆయన ఎదిగారు. ఆ రోజుల్లో ఆయనకి రాజకీయాలంటే ఆసక్తి లేదు. పేపరు చదివేవారు కాదు. 'రాజకీయాలు మనకు అవసరమా.. పేపరు చదివితే పొలిటిక్స్ వంటబడతాయా బ్రదర్' అనేవారు. ఆ రోజుల్లో 'కాగడా'లో సినిమా తారల గురించి నీలి వార్తలు రాసేవారు. (ఎన్.టి.ఆర్., కృష్ణకుమారి పెళ్లి చేసుకోబోతున్నారని అందులో రాయడంతో రామారావుగారి అభిమానులు ఆ పత్రికను తగలబెట్టారు) ఆ గాసిప్స్ ఆసక్తికరంగా ఉండటంతో పెద్దాయనకి తెలియకుండా 'కాగడా' చదివేవాళ్లం. ఎప్పుడైనా ఆయన కంటబడితే "ఆ చెత్తంతా చదవడం అవసరమా?' అని మమ్మల్ని తిట్టేవారు. 'పురాణాలు చదవండి, జ్ఞానం వస్తుంది' అనేవారు.

**ఆయన తేజస్సు అలాంటిది**

రామారావుగారిని చాటున చాలామంది తిట్టేవాళ్ళు. పాదనమస్కారాలు చేయించుకుంటున్నాడని విమర్శించేవారు. అసలు ఆయన కాళ్లకు మనమెందుకు మొక్కాలని వాదించేవారు. అలాంటి వాళ్లే ఆయన ఎదురు పడగానే అమాంతం కాళ్లమీద పడేవారు. అంత తేజస్సు, ఏదో తెలియని శక్తి ఉంది ఆయన ముఖంలో.





అభిమానులకు అభివాదం చేస్తున్న ఎన్.టి.ఆర్.

'శ్రీ వేంకటేశ్వరమహాత్మ్యం' విడుదలైన తర్వాత ఆ తిరుమలేశుడే ఎన్.టి.ఆర్. రూపంలో పుట్టాడనే అభిప్రాయం ప్రేక్షకుల్లో ఏర్పడిపోయింది. దాంతో చెన్నై బజుల్లారోడ్‌లో ఉన్న ఆయన ఇంటికి ప్రతిరోజూ నాలుగు బస్సుల జనం వచ్చేవారు. ఎన్.టి.ఆర్. ఇంట్లోంచి బయటకి రాగానే ఒక్కసారిగా కాళ్లమీద పడేవారు. హారతులు ఇచ్చేవారు కొందరైతే, కొబ్బరి కాయలు కొట్టేవారు మరికొందరు. రామారావుగారిని చూడటంతో తిరుపతి యాత్ర పూర్తయిందనే ఆనందంతో ఇళ్లకు వెళ్లేవారు. నిజంగా ఆయన కారణజన్ముడే.

**నిర్మాతలను అలా ఆదుకునేవారు**

రామారావుగారితో సినిమాలు తీసి నష్టపోయిన నిర్మాతల సంఖ్య వేళ్లమీద ఉంటుంది. ఆర్థికంగా దెబ్బతిన్న నిర్మాతలను కూడా ఏదో విధంగా ఆదుకునేవారాయన. ఒకసారి ఓ నిర్మాత రామారావు దగ్గరకు వచ్చారు. ఆయన గతంలో ఎన్.టి.ఆర్.తో మంచి సినిమాలు తీశారు. ప్రస్తుతం పరిస్థితి బాగోలేదు. తన కూతురి పెళ్లి చేయాలనుకుంటున్నానని, సాయం చేయమని ఆయన్ని కలిశారు నిర్మాత. వెంటనే అన్నగారు తనతో సినిమా తీయాలని ఎదురు చూస్తున్న మరో నిర్మాతని పిలిచి, 'వీరికి డేట్స్ ఇచ్చాం. మీకు ఆ డేట్స్ కావాలంటే డబ్బు చెల్లించి తీసుకోండి' అని చెప్పేవారు. అప్పుడు ఆ నిర్మాత ఆనందంగా మొదటి నిర్మాతకు డబ్బు చెల్లించి డేట్స్ తీసుకున్నారు. ఎన్.టి.ఆర్. అండదండలతో ఆ నిర్మాత తన కూతురి పెళ్లి చేయగలిగాడు. ఇలాంటి సంఘటనలు ఎన్నో. రామారావుగారి పేరు చెప్పుకుని లాభపడినవారెందరో.

ప్రారంభంలో రోజుకు రెండు మూడు షిఫ్టులు పనిచేసినా ఆర్టిస్ట్‌గా బిజీ అయిన తర్వాత నైట్ షూటింగ్‌లు మానేశారు. మరీ అత్యవసరమైతే తప్ప రాత్రిళ్లు పనిచేసేవారు కాదు. విరామం లేకుండా గంటల తరబడి పని చేసిన రోజులున్నాయి. నిల్చుని నిల్చుని కాళ్లు వాచిపోయేవి ఒక్కోసారి.. కిరీటం బరువును మోస్తూ అలాగే ఉండేవారు. చర్మం కమిలిపోయినా ఆయన భరించేవారు తప్ప బాధని వ్యక్తం చేసేవారు కారు. అంత మొండి మనిషి ఆయన.

ఒకసారి షూటింగ్ చేస్తుండగా జర్వం వచ్చిందా

యనకి. ముట్టుకుంటే ఒళ్లు కాలిపోతోంది. ఆస్పత్రికి వెళదాం అన్నగారు అన్నాను. 'వద్దు మనం వెళ్లిపోతే వీళ్ల షూటింగ్ దెబ్బతింటుంది. ఇరవైవేల రూపాయలు నష్టం. ఎవరు భరిస్తారు దాన్ని. కాసేపు మనమే కష్ట పడదాం" అని నన్ను వారించారు. అలా జ్వరంతోనే షూటింగ్ పూర్తిచేశారు.


**'దీక్ష' షూటింగ్‌లో..**

అన్నగారు నిజంగా మొండి మనిషే. షూటింగ్‌లో దెబ్బ తగిలినప్పుడు కూడా ఆయన మొండిగానే ప్రవర్తించేవారు. 'దీక్ష' (1974) చిత్రం షూటింగ్‌లో జరిగిన సంఘటనని వివరిస్తాను. ఓ సన్నివేశంలో హీరో నేలమీదున్న నాపరాయిని జరిపినప్పుడు దానికింద ఉన్న పాము బయటకి వచ్చి కాటేస్తుంది. ఈ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నప్పుడు ఆ పాముకి నోరు కుట్టలేదు. ఆ విషయం ఎవరికీ తెలీదు. షాట్‌లో రామారావుగారు నాపరాయి జరపగానే పాము బయటకు వచ్చి నిజంగానే కాటేసింది. చేతి నుంచి రక్తం రావడంతో అందరికీ అనుమానం వచ్చి పాములవాణ్ణి అడగడంతో నోరు కుట్టలేదని భయపడుతూ చెప్పాడు. దాంతో మా అందరి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఆ విషం ఒళ్లంతా వ్యాపించక ముందే ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్లాలనే నిర్ణయానికి వచ్చి రామారావుగారికి చెప్పాం. అయితే షూటింగ్ ఆపడానికి ఆయన ఒప్పుకోలేదు. రక్తాన్ని తుడిచేసి ఆ చేతిని అలాగే గట్టిగా పట్టుకుని కూర్చొని, తర్వాతి షాట్‌కోసం ఏర్పాట్లు చెయ్యమని చెప్పారు. మా అందరికీ ఒకటే భయం. ఏం జరుగుతుందోనని ఆందోళన.

అయితే అన్నగారిలో ఎలాంటి ఏ టెన్షను లేదు. ఆరుగంటల వరకు షూటింగ్ చేసి ప్యాకప్ అయిన తర్వాత ఇంటికి వెళ్లిపోయారు. చేతిని శుభ్రంగా కడి గారు. అప్పుడన్నా ఆస్పత్రికి వెళదామన్నా ఒప్పుకోలేదు. ఏడున్నర, ఎనిమిది గంటలకు భోజనం చేసి పడుకు న్నారు. ఆ తర్వాత పిడుగులు పడినా ఆయన లేవరు.


అయితే ఆ రాత్రి మాలో ఎవరికీ నిద్రలు లేవు. అన్న

ఎన్.టి.ఆర్.తో కె.సి.శేఖర్‌బాబు, మిద్దే జగన్నాథరావు, మిద్దే రామకృష్ణారావు



గారింట్లోనే కూర్చుని జాగరణ చేశాం. ఎందుకయినా మంచిదని విషానికి విరుగుడు ఇంజక్షన్లు సిద్ధం చేశాం.

రెండున్నరకు ఆయన లేచారు. ఇంట్లో కనిపించిన మమ్మల్ని చూడగానే ఆశ్చర్యపోయి "ఏమిటి మీరంతా ఇక్కడే ఉన్నారు?" అనడిగారు. "మీకు పాము... అదీ" అని నసిగే సరికి "అది మమ్మల్ని ఏం చేయదు... మీరు వెళ్లండి" అన్నారు. అంత కాన్ఫిడెన్స్ ఆయనకి.




సాధారణంగా పాము కరవగానే ఆ షాక్‌కి హార్ట్ ఫెయిల్ అయి చాలామంది చనిపోతుంటారు. కానీ రామారావుగారు మొండిమనిషి. ఆ మొండితనమే ఆయన్ని కాపాడింది.

**పాత్రలో అంతగా ఒదిగిపోయేవారు**

ఒక పాత్ర చేస్తున్నప్పుడు అందులో పూర్తిగా ఇన్‌వాల్వ్ అయ్యేవారు. విషాద సన్నివేశం చేస్తున్నప్పుడు పొద్దున్నుంచి అదే మూడ్‌లో ఉండేవారు. ఇలాంటప్పుడు ఎవరన్నా వచ్చి జోక్ చేస్తే ఆ మూడ్ పోతుంది కనుక మనకు తెలియకుండానే ఆయన తన చుట్టూ ఓ గీత గీసుకునేవారు. ఆ గీత దాటి ఎవరూ ముందుకు రాకుండా ఆయన చూసుకునేవారు. సీరియస్ వేషం అయితే పొద్దునుంచి అందరినీ తిడుతుండేవారు.

మేం ఆయన్ని ఎప్పుడూ అంటిపెట్టుకుని ఉండేవాళ్లం. కనుక ఆయన మూడ్స్ తెలిసేవి. ఇక షూటింగ్ లేని సమయాల్లో అందరితో బాగా ఉండేవారు.

**వారి ఖర్మ... మనమేం చేశాం?**

రామారావుగారి దగ్గరకి నిర్మాతలు, సాంకేతిక నిపుణులు, ఆర్టిస్టులు, పంపిణీదారులు వచ్చేవారు. అందరితో ఆప్యాయంగా మాట్లాడేవారు. 'ఈ సినిమా మీరు చేస్తున్నారు. ఆ సినిమా మీరు చేద్దురుగాని" అనేవారు. నిర్మాతను పిలిచి "మీరెవరినైనా అనుకుంటున్నారా.. అనుకోకపోతే ఇతనికి అవకాశం ఇవ్వండి" అనేవారు. అయితే తన అభిప్రాయాలను ఎవరిమీదా రుద్దేవారు కాదు.

తనని విమర్శించేవారిని ఆయన పట్టించుకునేవారు కాదు. 'వారి ఖర్మ... మనం ఏం చేశామని వారు అలా తిడుతున్నారు?' అనేవారు. అలాగే ఇంకొకరి గురించి చెడుగా మాట్లాడటం, చాడీలు చెప్పడం ఆయనకు నచ్చదు. అలాంటి వాటిని ప్రోత్సహించేవారు కారు. ఆయన ఆవేశపరుడే.. ఎవరిమీద కోపం వచ్చినా క్షణాల్లోనే అది కరిగిపోయేది.


నేను ఆయనకి విధేయుడిగా ఉండేవాడిని. ఆర్టిస్ట్‌గా ఉంటూనే వ్యక్తిగత పనులు పర్యవేక్షించేవాడిని. ప్రొడక్షన్ వ్యవహారాలు చక్కబెట్టేవాడిని. "చలపాయ్... మనం పొద్దున్నే ఏడు గంటలకు షాట్ తీస్తున్నాం" అనేవారు. నేను అన్ని ఏర్పాట్లు చేసేవాడిని. నాతోపాటు హరికృష్ణ ఉండేవాడు. బాలకృష్ణ కూడా మాతోపాటు తిరిగేవాడు. పెద్దాయనకి నేనంటే ఎంత నమ్మకమంటే క్యాష్ వ్యవహారాలు కూడా నాకు అప్పగించేవారు.

## హీరోయిన్‌తో పెళ్లా?

హీరోయిన్లందరితో ఆయన సన్నిహితంగా ఉండే వారు. ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేవారు. ఎప్పుడు ఎవరితో మాట్లాడింది మరొకరికి తెలియ నిచ్చేవారు కాదు. కృష్ణకుమారితో ప్రేమ వ్యవహారం నడిచిందని, అది పెళ్లి వరకూ వెళ్లిందని ఆ రోజుల్లో అనుకునేవారు. కానీ నిజం ఆ భగవంతుడికే తెలియాలి. ఎన్.టి.ఆర్.లోని గొప్పతనం ఏమిటంటే.. వ్యక్తిగత బలహీనతలు (ఒకవేళ ఉండి ఉంటే) ఎప్పుడూ ఆయన దైనందిన వృత్తి ధర్మానికి అడ్డురాకుండా చూసుకునేవారు. విశృంఖలత్వాన్ని, క్రమశిక్షణారాహిత్యాన్ని ఎప్పుడూ దరిచేరనిచ్చేవారు కారు.

## మూడు రకాల పెన్నులు

సినిమాల స్క్రిప్ట్‌ను తనే సొంతంగా రాసుకోవడం ఎన్.టి.ఆర్.కి అలవాటు. రచయిత రాసిన డైలాగులను తిరిగి రాసుకునేవారు. అక్కడక్కడ తనదైన బాణిలో కొన్ని డైలాగులు జోడించేవారు. ఇందుకోసం మూడు రకాల ఇంకు పెన్నులను ఆయన ఉపయోగించేవారు. డైలాగులు ఒకరకం ఇంకుతో, కెమెరా యాంగిల్స్ మరో రకం ఇంకుతో, యాక్షన్ ఇంకో ఇంకుతో రాసేవారు. ■



బాలకృష్ణ చలపతిరావు హరికృష్ణ



# అన్నదమ్ముల అనుబంధం

ఆ రామలక్ష్మణులు ఎలా ఉండేవారో జనం ఎరుగరు కానీ ఎంతో అన్యోన్యంగా మెలిగిన నందమూరి సోదరులు రామారావు, త్రివిక్రమరావును చూసి మాత్రం సినీజనం మురిసిపోయేవారు. ఆ రామలక్ష్మణులు వీరేనని నమ్మేవారు. తమ్ముడంటే రామారావుకి ప్రాణం. అన్నయ్య అంటే అంతులేని అభిమానం త్రివిక్రమరావుకి. ఆలోచన ఒకరిది, ఆచరణ మరొకరిది అన్నట్లుగా మెలిగేవారు. ఎన్.టి.ఆర్. బి.ఎ చదివారు. త్రివిక్రమరావుకి మాత్రం చదువబ్బలేదు. చదువుని అశ్రద్ధ చెయ్యవద్దని, బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని తమ్ముడికి తరచు చెబుతుండేవారు. అయినాసరే చదువు తప్ప మిగిలిన అన్ని విషయాల్లో ముందుండే వారు త్రివిక్రమరావు. అన్నగారికి సినిమాలో ఛాన్స్ వచ్చినప్పుడు వెళ్లాలా వద్దా అనే మీమాంసలో ఉన్నప్పుడు వెళ్లమని ప్రోత్సహించారు త్రివిక్రమరావు. అంతేకాదు పరిశ్రమకి వచ్చిన తొలి రోజుల్లో అన్న ఎన్.టి.ఆర్. వేషాల వేటలో నిరుత్సాహం చెందిన తరుణంలో ఆయనకు ఎంతో నైతిక బలాన్నిచ్చింది త్రివిక్రమరావే. అన్నయ్య మద్రాసులో పడరాని పాట్లు పడుతుంటే తాను నీడ పట్టున కడుపులో చల్ల కదలకుండా కూర్చోవడం సబబు కాదనుకున్నారు. మద్రాసులో అన్నయ్య దగ్గరికి వెళ్లిపోయి ఆయన కష్టాల్లో పాలుపంచుకోవడమే కాకుండా, ఆయనకు కొండంత అండగా నిలిచిన తమ్ముడు త్రివిక్రమరావు. అందుకే 'నా తమ్ముడు బంగారం' అని చెప్పి మురిసిపోయేవారు ఎన్.టి.ఆర్. ఆయనలాంటి అన్న లభించడం తన అదృష్టమనేవారు త్రివిక్రమరావు.

సంపాదనలేని త్రివిక్రమరావుకి పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకురాని తరుణంలో ఆస్తిలో తన వంతువాటాని కూడా తమ్ముడికి రాసిచ్చిన ఎన్.టి.ఆర్. ఔన్నత్యాన్ని అప్పట్లో చుట్టుపక్కలవారు ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. అంతేకాదు తను సంపాదనా

పరుడైన తర్వాత తన కుటుంబానికి ఎంత ఖర్చు పెట్టేవారో తమ్ముని కుటుంబానికి కూడా అంతే ఖర్చు పెట్టేవారు ఎన్.టి.ఆర్. తనకి ఎంత ఆస్తి కొంటే తమ్ముడికీ అంత కొనాల్సిందే. విజయాసంస్థ ఒప్పందపత్రంపై సంతకం చేసేముందు తమ్మునితో కలిసి ఆలోచించారు రామారావు. 'ఈ సంస్థ నిర్మించే నాలుగు చిత్రాలకు కాకలు తీరిన దర్శకులు నలుగురిని ఎన్నుకున్నారు. ఈ నలుగురి చేతుల్లో ఆ నాలుగు చిత్రాల్లో నటించి నేను 'స్టార్' కాలేకపోతే ఇంక నాకు అదృష్టమే లేదను కోవచ్చు'.. రామారావు ఆలోచనని త్రివిక్రమరావు బలపరిచి, ఒప్పందం చేసుకోమని చెప్పారు.

త్రివిక్రమరావు సంగీత ప్రియుడు, స్నేహపాత్రుడు. అబద్ధాలు చెప్పేవారన్నా, మోసగించి బతికేద్దామనుకునే వ్యక్తులన్నా ఆయనకు నచ్చదు. ఒక మాట అంటే దాన్ని నిలబెట్టుకోవాలనే తాపత్రయం ఎన్.టి.ఆర్.లోనే కాదు ఆయన తమ్మునిలోనూ కనిపించేది.

నాటకాల ప్రదర్శనకోసం తను ఏర్పాటు చేసిన నేషనల్ ఆర్ట్ థియేటర్స్ సంస్థకు సారథ్యం వహించిన త్రివిక్రమరావు చిత్ర పరిశ్రమలోకి వచ్చిన తర్వాత ఆ సంస్థ పతాకంపై నిర్మించిన చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారు. నాటక సంస్థగా ఉన్న నాటి ఆశయాలనే పాటిస్తూ ఆ యా దర్శకులతో, అభిరుచులతో 'పిచ్చి పుల్లయ్య', 'తోడుదొంగలు' చిత్రాలు నిర్మించి చేతులు కాల్చుకున్నారు ఈ అన్నదమ్ములు. అనంతరం పి.పుల్లయ్య, సి.పుల్లయ్య, కె.వి.రెడ్డి వంటి పెద్దల సలహా మేరకు కమర్షియల్ విలువలు జతచేసి సందేశాత్మక చిత్రాలు నిర్మించి విజయం సాధించారు. ఎన్.ఎ.టి. పతాకంపై నందమూరి సోదరులు నిర్మించిన చిత్రాల్లో టైటిల్స్‌కు ముందు వీరిద్దరూ తమ తల్లిదండ్రులను పూజించే సన్నివేశం ప్రేక్షకులను ఎంతో అలరించేది.

ఆ రోజులలో త్రివిక్రమరావు ఒక కథను ఓకే చేశారంటే.. ఇక ఎలాంటి సందేహాలు లేకుండా చిత్ర నిర్మాణం చేపట్టవచ్చు అనే నమ్మకం దర్శక నిర్మాతల్లో ఉండేది. ఆయన జడ్జిమెంట్ అలాంటిది. అందుకే ఎన్.ఎ.టి. పతాకంపై నందమూరి సోదరులిద్దరూ నిర్మించిన చిత్రాల్లో అధికశాతం విజయవంతమయ్యేవి.

త్రివిక్రమరావు భార్య జయలక్ష్మీదేవి. వారికి ఇద్దరు పిల్లలు. కళ్యాణచక్రవర్తి, హరీన్‌చక్రవర్తి. ఇద్దరూ నటులే. వీళ్లలో హరీన్ చక్రవర్తి అకాలమరణం పొందగా, కొన్ని చిత్రాల్లో నటించిన తర్వాత సినీరంగం నుండి వైదొలిగి వ్యాపారం చేసుకుంటున్నారు కళ్యాణచక్రవర్తి.

ఎన్.టి.ఆర్. జన్మించిన రెండేళ్ల అనంతరం త్రివిక్రమరావు పుట్టారు. ఎన్.టి.ఆర్. 73వ ఏట 1996లో కన్నుమూస్తే, త్రివిక్రమరావు తన 73వ ఏట 1998 సెప్టెంబర్ 13న చెన్నైలో గుండెపోటుతో మరణించి ఆ రకంగా కూడా అన్నని అనుసరించారు. ■



త్రివిక్రమరావు, ఎం.జి.ఆర్, ఎన్.టి.ఆర్.

# 'మహాపురుషుడు'



తండ్రీ కొడుకుల దర్శకత్వంలో నటించే అవకాశం హీరోలకు చాలా అరుదుగా లభిస్తుంటుంది. ఈ విషయంలో ఎన్.టి.ఆర్. చాలా అదృష్టవంతులేనని చెప్పాలి. సి.పుల్లయ్య దర్శకత్వంలోనూ, ఆయన తనయుడు సి.ఎస్.రావు దర్శకత్వంలోనూ నటించారు. అలాగే విఠలాచార్య దర్శకత్వంలోనే కాకుండా ఆయన తనయుడు బి.వి.శ్రీనివాస్ దర్శకత్వంలోనూ నటించారు.



కె.ఎస్. ప్రకాశరావు

తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలోనూ, ఆయన తనయుడు టి.ఎల్.వి.ప్రసాద్ నిర్దేశకత్వంలోనూ ఎన్.టి.ఆర్. అభినయించారు.


అదేవిధంగా కోవెలమూడి ప్రకాశరావు దర్శకత్వంలో నటించడంతోపాటు ఆయన తనయుడు రాఘవేంద్రరావుతోనూ పనిచేశారు. రామారావులోని నటుడిని ఈ తండ్రీకొడుకులు వివిధ కోణాల్లో ఆవిష్కరించారు. ఎన్.టి.ఆర్. నటించిన 'స్త్రీ జన్మ', 'విచిత్ర కుటుంబం' చిత్రాలకు ప్రకాశరావు దర్శకత్వం వహించారు. ఇవి రెండూ కుటుంబకథా చిత్రాలే కావడం గమనార్హం. ఎన్.టి.ఆర్. గొప్పతనాన్ని, నటునిగా ఆయన ప్రదర్శించిన వైవిధ్యాన్ని ప్రశంసిస్తూ కె.ఎస్.ప్రకాశరావు గతంలో చెప్పిన విశేషాలు..

“సినిమా ఫీల్డులో రామారావుగారంటే ఇష్టంలేని వారుండరు. అజాత శత్రువు ఆయన. దానికి కారణం ఆయన మనస్తత్వం. 'ఏవండీ', 'మీరు', 'వారు' అంటూ ఎవరిని గురించైనా సరే ఇంటా బయటా మర్యాదగా మాట్లాడే వారు. దీక్ష, క్రమశిక్షణ అనేవి ఎవరినైనా పైకి తీసుకువస్తాయి. అందుకు ప్రతీకగా రామారావుగారు నిలుస్తారు. వాటితోనే ఆయన హిమాలయాలంత ఎత్తుకు ఎదిగారు. ఒక్క ఉర్దూమాట తెలియకపోయినా హైదరాబాద్‌లో ఆర్నెల్లలో ఆ భాష నేర్చుకుని ఏకంగా ఉపన్యాసమివ్వడం ఆయనకే సాధ్యమైంది. తను వేసే వేషాలకు తగ్గట్టుగా తన శరీరాన్ని ఎప్పుడూ అదుపులో పెట్టుకునేవారు. అందుకు ఎన్నో నియమాలు పాటించే వారాయన. తెల్లవారుఝామున మూడు గంటలకో, నాలుగు గంటలకో లేచి ఎక్సర్‌సైజ్ చేసి మేకప్ చైర్‌లో కూర్చునేవారు. ఈ క్రమశిక్షణను మరొకరిలో చూడలేం. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ప్రతిభ అనేది స్వయంసిద్ధంగా అందరికీ ఉంటుంది. కానీ దానికి సాధన అనేది అవసరం అని చెప్పడానికే.

ఆయన సినిమా పరిశ్రమలోకి వచ్చిన దగ్గర్నుంచి రాజకీయాల్లో కాలు పెట్టేవరకు నాకు చాలా సన్నిహితంగా తెలుసు. ఆయన నటించిన వందలాది సినిమాల్లో కొన్ని మాత్రమే విజయాన్ని సాధించలేక పోయాయంటే తప్పు ఆయనది కాదు. నటునిగా ఆయనెప్పుడూ ఫెయిల్ కాలేదు.

నేను 'స్త్రీ జన్మ' చిత్రంలో రామారావు గారితో కలిసి తొలిసారిగా పనిచేశాను. ఆయనకి అప్పటికే డైరెక్షన్ అంటే ఏమిటో క్షుణ్ణంగా తెలుసు. ఎంతోమంది డైరెక్టర్ల వద్ద పనిచేసి ఎవరి ధోరణికి తగ్గట్టు చేస్తుండే వారు. ఒకరోజు 'స్త్రీజన్మ' చిత్రంలో పశ్చాత్తాపం సీన్ తీస్తున్నాం. ఆయన నటనకు సెట్‌లో అందరూ కంట తడి పెట్టారు. ఒక షాట్‌లో నేను డైరెక్టర్‌గా ఉండి 'కట్' చెప్పడానికి వ్యవధి కావాల్సి వచ్చింది. వెంటనే ఆ సీన్‌ను చిత్రీకరించిన పద్ధతికి ఆయన నన్ను శ్లాఘించారు.

ఆ మరుసటి రోజున ఇంకో సీన్ చేస్తున్నాను. వెనుక తీసిన ఆ పశ్చాత్తాపం సీన్‌కు లీడ్ సీన్‌ను తీస్తున్నా. అందులో తన సోదరిని 'కులట' అనవలసి ఉంది! 'సిస్టర్‌ని కులట అనడం బాగాలేదండి, ఆలోచించండి'!




అన్నారు రామారావుగారు. దాదాపు ఆమాట అనకుండా తప్పించుకోవాలని చూశారు. నేను అంతకుముందు రోజు తీసిన పశ్చాత్తాప సీన్‌ను గుర్తుచేసి 'ఇక్కడ అంత మాట అనకపోతే ఆ పశ్చాత్తాపానికి అవసరం ఏర్పడదు' అని వివరించాను. 'నిజమేనండి' అని ఒప్పుకున్నారు. కానీ మహానటుడు కదా 'కులట' అనే మాట వత్తివత్తి తనలో తాను అనుకుంటున్నట్టుగా మార్చారు. అటువంటి వీలుందని అంతవరకు నేను ఆలోచించలేదు.

ఇంకొకసారి 'విచిత్ర కుటుంబం' చిత్రంలో సావిత్రి గారితో నటిస్తున్నప్పుడు తాను మారువేషంలో ఒక రౌడీగా ప్రవేశించి ఆమెను కిడ్నాప్ చేయాలి. ఆమె ఆయన భార్య. చాలా మొరటుగా ఆయన నటిస్తు

న్నాడు. రామారావుగారిని సావిత్రి గారు ఏమీ అనలేక తడబడుతుంటే రామారావు గారే ఏమనాలో నేర్పారు! 'నీ జిమ్మదియ్య' లాంటి తిట్లన్నమాట. ఆవిధంగా తన తోపాటు తన సహ నటీనటులు కూడా బాగా చేస్తేనే దృశ్యాలు పండుతాయి అని ఆయన దృఢ విశ్వాసం.

ఇలా చెప్పుకుంటూ పోతే నాకే కాదు, ప్రతి వారికి ఎన్నో ఇలాంటి సంఘటనలు గుర్తుకు వస్తాయి. చిత్ర సీమలో ఆయన అడుగుపెట్టిన దగ్గర్నుంచి చిత్రం తరువాత చిత్రంతో తన ప్రతిభను ఇంప్రూవ్ చేసుకుంటూ ఏ నటుడూ తనకు సమానస్థాయిలో లేనంత పైకి ఎదిగారాయన.



నాయకుని వేషాలు ధరించడం చాలా సులభం. ప్రతినాయకుని వేషాల్లో ఉన్న కష్టం ఎక్కువ. అది కూడా ఆయనే రుజువు చేశారు. కృష్ణుడు, కర్ణుడు, రాముడు, రావణాసురుడు... ఎందులో బాగా నటించారో చెప్పడం ప్రేక్షకులకే కాదు, పండితులకు కూడా కష్టమే. నేను 'విచిత్ర కుటుంబం' తీస్తున్న రోజుల్లోనే రాజకీయాల్లోకి దిగాలన్న అభిలాష వారికి కలిగింది. దానికి కారణం చాలా మహోన్నతమైనది. రాజకీయాల్లో రాణించాలంటే లంచగొండి తనంలో రాణించాలి. అవినీతి ధ్యేయంగా పెట్టుకోవాలి. ఇలాంటి వాటిని సహించలేని రామారావు రాజకీయాల్లోకి దూకడం అవసరమనిపించింది. వరదలొచ్చి, కరవు కాటకాలొచ్చి దేశం నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు ఇక్కడ చిత్రసీమలో తానింత తీరికలేకుండా ఉన్నా, తానే కాకుండా ఒక ట్రూప్‌ని తయారుచేసి కొన్ని వారాల పాటు జోలెపట్టి డబ్బు వసూలు చేసి దేశ రక్షణనిధికి అందించారు. అత్యధిక పారితోషికం తీసుకుంటున్నా దాన్ని వదులుకుని రాజకీయ రంగ ప్రవేశం చేశారు. పేదల అభ్యున్నతికి కంకణం కట్టుకుని ఆయన ఏం చేసిందీ మనకందరికీ తెలుసు. రామారావుగారు ఇంకా కొన్ని రోజులు జీవించి ఉంటే రాజకీయాల్లో కూడా కుళ్ళు కడిగి ఉండేవారు.



'విచిత్రకుటుంబం'లో ఎన్.టి.ఆర్., సావిత్రి

# రజనీకి ప్రేరణ ఎన్.టి.ఆరే.


తమిళ చిత్ర రంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ 1970లలో కొన్ని తెలుగు చిత్రాల్లో నటించారు. ఎన్.టి.ఆర్.తో కలిసి నటించిన 'టైగర్' (1979) వాటిల్లో ఒకటి. పెద్దాయనతో రజనీ నటించిన ఏకైకచిత్రం ఇదే.



చిత్ర రంగంలోకి ప్రవేశించకముందు రజనీకాంత్ బెంగుళూరులో బస్ కండక్టర్‌గా పనిచేసిన సంగతి జగద్విదితమే. ఆయన ఎన్.టి.ఆర్. అభిమాని. 'మాయాబజార్', 'పాండవవనవాసం' చిత్రాల్ని ఎన్నిసార్లు చూశానో లెక్కలేదని చెబుతుంటారు. ఆ సినిమాలు చూసి అభిమానాన్ని మరింత పెంచుకున్నానని చెబుతారు. మరోవిషయం ఏమిటంటే రజనీకాంత్ నటుడవడానికి ప్రేరణ కలిగించింది కూడా ఎన్.టి.ఆరే. అదెలాగంటే.. ఆయన కండక్టర్‌గా పనిచేసే రోజుల్లో ఒకసారి స్టాఫ్ అంతా కలిసి ఒక పౌరాణిక నాటకం ప్రదర్శించారు. అందులో దుర్యోధనుని పాత్ర రజనీది. ఇందుకోసం 'శ్రీకృష్ణపాండవీయం' చిత్రం చూసి అందులో ఎన్.టి.ఆర్. ఎలా నటించారో తను అలాగే చేయడానికి ప్రయత్నించారు. నాటక ప్రదర్శన విజయవంతమైంది. అందరూ రజనీని అభినందించి సినిమాల్లో ప్రయత్నించమని సలహా ఇచ్చారు. అలా చెన్నై వెళ్లి ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో చేరి నటుడయ్యారు రజనీకాంత్.

**ఎన్.టి.ఆర్. సలహా**

నటునిగా రజనీకాంత్ బిజీ అయిన సమయంలో ఒకసారి మెదడులోని నరాలకు తీవ్రమైన ఒత్తిడి కలిగింది. దీనివల్ల మనిషి అన్‌బాలెన్స్ అయి చీటికి మాటికీ తగాదాలకు దిగేవారు. అయితే అటువంటి పరిస్థితుల్లో కూడా ఎన్.టి.ఆర్. అంటే భయభక్తులతో మెలిగేవారు. రజనీకాంత్ మానసిక స్థితిని గమనించిన ఎన్.టి.ఆర్. ఒకసారి అతణ్ణి పిలిచి 'చూడు బ్రదర్.. తెల్లవారు ఝామున 3.30 నుండి 4 గంటల మధ్య కాలాన్ని బ్రహ్మకాలం అంటారు. ఆ సమయంలో నువ్వు ప్రాణాయామం చేస్తే పూర్తిగా కోలుకుంటావు' అని సలహా ఇచ్చారు. కొంతకాలం ఆయన చెప్పినట్లే చేయడంతో రజనీకాంత్ ఆరోగ్యం బాగుపడింది. ఈ సంఘటన తర్వాత ఎన్.టి.ఆర్. అంటే గౌరవం పెరిగింది. 1993 డిసెంబర్ 15న హైదరాబాద్‌లో జరిగిన 'కుంతీపుత్రుడు' (మోహన్ బాబు హీరో, దాసరి దర్శకత్వం) చిత్రం ఆడియో ఫంక్షన్‌లో ఎన్.టి.ఆర్. సమక్షంలో రజనీకాంత్ ఈ విషయాలు చెప్పి తన అభిమానాన్ని వెల్లడించారు.



# దర్శకునిగా ఎన్.టి.ఆర్.

'భూకైలాస్' (1958) చిత్ర నిర్మాణ కాలంలో అందులో ఎన్.టి.ఆర్. పోషించిన రావణుని పాత్ర ప్రభావం ఆయనపై ఎంతో ఉంది. ఓ రిసెర్చ్ స్కాలర్‌లా ఆ పాత్ర చరిత్రను మథించి... 1960లో సొంతంగా 'సీతారామకళ్యాణం' చిత్రాన్ని నిర్మించారు. తను చేపట్టిన ప్రతి కార్యక్రమంలోనూ కొత్తదనం ఉండేలా చూసుకునే రామారావు ఈ చిత్రానికి తొలిసారిగా దర్శకత్వం వహించారు. అయితే దర్శకత్వ బాధ్యతను, కీర్తిని ఒకే వ్యక్తి పంచుకోవడం భావ్యం కాదనుకొని విశాల దృక్పథంతో ఆలోచించారు. యూనిట్ పేరు టైటిల్స్‌లో వేసి ప్రపంచ చలన చిత్ర చరిత్రలోనే ఒక కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

దర్శకునిగా కూడా ఎన్.టి.ఆర్.కు అపజయం లేదు. స్వీయ దర్శకత్వంలోనే ఎక్కువ చిత్రాల్లో నటించారాయన. ఆ వివరాలు...



'శ్రీ తిరుపతి వెంకటేశ్వర కళ్యాణం'లో జయసుధతో...

# నేనెందుకు దర్శకుణ్ణి అయ్యాను?




ఎన్.టి. రామారావు

తను నమ్మిన నటన, తనని అగ్రస్థాయికి పెంచిన నిర్మాతలే ముఖ్యమని ఎన్.టి.ఆర్. భావించేవారు. అలాగే కె.వి.రెడ్డి, బి.ఎన్.రెడ్డి, ఎల్.వి.ప్రసాద్ వంటి అగ్రశ్రేణి దర్శకుల స్ఫూర్తితో దర్శకుణ్ణయ్యానని చెప్పేవారు. స్వీయ దర్శకత్వంలో 17 చిత్రాల్లో నటించి ఆ రకంగా కూడా రికార్డ్స్ నెలకొల్పారు రామారావు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రాల్లో అధిక శాతం ఘన విజయం సాధించాయి.

నటునిగా నిర్విరామంగా పనిచేస్తూ కూడా దర్శకత్వం చేపట్టాలనే కోరిక ఎన్.టి.ఆర్.కు ఎందుకో కలిగింది. 40 ఏళ్ల క్రితం 'తెలుగు సినిమా' మాస పత్రికలో దీనికి సంబంధించి వివరణ ఇచ్చారు.

కొన్నేళ్ళ క్రితం... ఓ సంధ్యవేళ... ఆలోచనలు ఎక్కడికో పరుగులు తీశాయి. నా చిన్ననాటి జ్ఞాపకాలు, అనుభవాలు స్ఫురణకు వచ్చాయి. నా ఊరు గుర్తుకు వచ్చింది. ఒకనాటి సామాన్యుణ్ణి ఈనాడు ఇంతటి పెద్ద నటుణ్ణి ఎలా అయ్యాను? అంటూ గతాన్ని నెమరు వేసుకుంటుంటే.....

ప్రప్రథమంగా నా తల్లిదండ్రులు నా ఊహల్లోకి వచ్చారు. నా మంచి, చెడ్డలు గమనించి, నాలోని తప్పొప్పులను సరిదిద్ది నా ఈ జీవితానికి పూలబాటలు వేసిన ఆ మహనీయులకు నేను ఏం చేశాను? ఆ ప్రశ్న నా మనసును ఒక్కసారిగా మేల్కొలిపింది. వారి రుణం



'వేములవాడ భీమకవి' చిత్రం షూటింగ్‌లో ...

ఎలాతీర్చుకోవాలి? అన్న ఆలోచన నా మనసులో చోటు చేసుకుంది. అప్పటికే 150 పాత్రల్లో నటించాను. పరిశ్రమకు వచ్చి పదిహేనేళ్ల అయింది. అయితే నేను నటించిన ప్రతి చిత్రమూ నా సృష్టి కాదు. ఒక నిర్మాత, ఒక దర్శకుడు, ఎందరో సాంకేతిక నిపుణులు, కళాకారులు సమష్టిగా తయారు చేసిన ఒక చిత్రాన్ని అది ఎంత ప్రజాదరణ పొందినా 'నాది' అని చెప్పుకోలేను. అందువల్లనే దర్శకత్వానికి ఉపక్రమించాను. ఏచిత్రానికైనా సృష్టికర్త దర్శకుడే కదా!

దర్శకునిగా నా మనోభావాలను, నా సృజనాత్మక శక్తిని అందులో ప్రతిఫలింపచేసి, తెనుగుదేశంలో నిర్వివాదంగా పెద్దా, చిన్నా అంతా మెచ్చే చిత్రాన్ని రూపొందించాలని, నా తల్లిదండ్రుల పాదాల చెంత తనయుని చిన్న కానుకగా సమర్పించాలని నిశ్చయించుకున్నాను.

ఆ నిర్ణయం ఫలితమే 'సీతారామకళ్యాణం'. ఆ చిత్రంలో ఆపాదమస్తకమూ రమణీయతను కమనీయంగా నూరిపోయాలని అహోరాత్రులు కృషి చేశాను. బొత్తిగా విరామం దొరకని స్థితిలో కూడా, ప్రాచీన గ్రంథాలనెన్నింటినో పరిశీలనచేసి రామాయణ కావ్యంలో పాత్రలను, తత్వాలను మరికొంత నిశితంగా మరింత ఓర్పుతో అర్థంచేసుకున్నాను. చిత్రాన్ని చూసిన వారంతా ప్రశంసించారు. "ఈ చిత్రం తెలుగు సినిమా చరిత్రలో మైలురాయి" అంటూ ప్రజలు, ప్రభుత్వం కురిపించిన ప్రశంసల వర్షం నా పాలిటి పూలజల్లుగా పరిణమించింది. తొలుత అనుకున్న ప్రకారం ఆ చిత్రాన్ని నా తల్లిదండ్రులకు అంకితం ఇచ్చి నా కనీసపు ధర్మాన్ని నెరవేర్చుకున్నాను.


నటునిగా ఎన్నో బరువులు, బాధ్యతలున్నా వాటన్నింటిని చక్కదిద్దుకుంటూ, మరోవైపు దర్శకుడుగా కూడా నా జీవిత యాత్ర సాగించాలని నిశ్చయించాను. నటునిగా ఒక విధమైన ఆనందం ఉంటే దర్శకునిగా మరో విధమైన హృదయ స్పందన, అనుభవైక వేద్యమైన మాధుర్యం ఉన్నాయి. నటునిగా నేను నా అభిమానుల అభీష్టం ప్రకారం రకరకాల పాత్రలకు యోగ్యమైన నిర్వచనాన్ని, అందమైన భాష్యాన్ని చెబుతుంటాను. అలాగే దర్శకునిగా నా తోటి కళాకారుల వద్దనుంచి నా మనసుకు నచ్చిన నటన ఆ యా పాత్రలు కోరే అభినయం రాబట్టుకుంటున్నాను. ఒకే రంగంలో ఉంటూ అదే నీడపట్టున శ్రమిస్తూ రెండు రకాల వ్యాపకాలను నాకు సంతోషకరంగా, నా అభిమా

నులకు ఆనందకరంగా నిర్వహించగలుగుతున్నానంటే అంతకన్నా నేను ఏం కోరుకుంటాను?

దర్శకత్వ విభాగంలో నాకు గురువు ఎవరు?... ఇదే ప్రశ్న చాలామంది మిత్రులు అడిగారు. నిజం చెప్పాలంటే నాకు గురువు అంటూ ఎవరూ లేరు. ఏ ఒక్కరి పద్ధతీ నేను అనుసరించను. నాదంటూ సొంతమైన ఒక పద్ధతిని రూపొందించుకున్నాను. అదే అనుసరిస్తున్నాను. కానీ ఒక్కటి మాత్రం నిజం. నేను దర్శకుణ్ణి కావటానికి పరోక్షంగా ప్రోత్సహించినవారు శ్రీయుతులు బి.యన్.రెడ్డి, కె.వి.రెడ్డిగార్లు. గంటల తరబడి వారితో గడపటం, సెట్టు మీద వారి ఏకాగ్రత, దీక్ష గమనించాక నాలో కొత్త ఉత్సాహం జనించింది. వారిరువురు నాకు నచ్చిన పెద్దలు, నా దృష్టిలో పూజ్యులు.

నటునిగా నా మీద ఎన్ని బాధ్యతలు ఉన్నాయో, దర్శకునిగా కూడా అంతకుమించినన్ని బాధ్యతలు వున్నాయి. 'సినిమా' అన్నది ఎంతో విలువైన సాధనం. దేశంలో నిరక్షరాస్యత వికటాట్టహాసం చేస్తున్న ఈ రోజుల్లో సినిమాల ద్వారా సామాన్య ప్రజానీకం తెలుసుకోగలిగేవి, తెలుసుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. అందువల్లనే నేను ఎన్నుకొనే ప్రతీ కథకూ ఏదో ఒక పరమార్థం ఉండాలని నా భావన. నా చిత్రం ద్వారా ప్రతి ప్రేక్షకుడు తనకు, తన చుట్టూ ఉన్న ప్రపంచానికి ప్రయోజనకరమైన ఒక ప్రాపంచిక నీతిని తెలుసుకోవాలని నా సంకల్పం. ఉత్తమ చిత్రాలు ఈ నాటి భారతావనికి పెట్టని కోటలు. మానవునిలో నీతిని పెంపొందింప చేయడానికి ఇవి ఉత్తమ సాధనాలు. అందువల్లనే మన చిత్రాల్లో దేశ భక్తి, జాతీయభావం నిండి ఉండాలి. మన జాతి, మన దేశం ఎంత గొప్పదో, మన సంస్కృతి ఎంత చైతన్యవంతమైనదో తెలియజెప్పే చిత్రాలు మనకు కావాలి.

ఇంతవరకూ ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించాను. నా చిత్రాలన్నీ నాకు పరిపూర్ణమైన సంతృప్తినిచ్చాయి. వాటిల్లో ఏది ఎక్కువ ఏది తక్కువ అనే భావానికి అవకాశాలు లేవు. నా చిత్రాలన్నీ నా బిడ్డల వంటివి. ఒక తండ్రి దృష్టిలో బిడ్డలందరూ సమానమే. ఒక బిడ్డ తక్కువ సంపాదించినా, మరొకరు ఎక్కువ



మద్విరాటపర్వం షూటింగ్‌లో మాదా, పుష్పలత, వాణిశ్రీతో ఎన్.టి.ఆర్.


సంపాదించినా, ఆత్మీయత, అనురాగాల విషయంలో ఆ భేదభావం ఉండరాదు. అలాగే నా చిత్రాల్లో కొన్ని తక్కువ డబ్బును తెచ్చి పెట్టవచ్చు, మరికొన్ని కనక వర్షం కురిపించి ఉండవచ్చు. నాకు ఆ తారతమ్యం లేదు. అన్నీ నా దృష్టిలో ఒకటే.

భవిష్యత్తుకు సంబంధించిన ప్రణాళికలు ఎన్నో సిద్ధంగా ఉన్నాయి. నా అభిమానుల అభిమానం ఉన్నంతకాలం, సృష్టి అనుమతించినంత కాలం చిత్రాల్లో నటిస్తూనే ఉంటాను. ఉత్తమ నటునికి విరమణ అంటూ ఉండదు. నటన అనేది కేవలం ఒక వ్యాపకం కాదు, ఇదొక విధమైన తపస్సు.

దర్శకత్వానికి సంబంధించినంతవరకు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి. 'అల్లూరి సీతారామరాజు', 'చాణక్య శపథం', 'శ్రీరామ పట్టాభిషేకం'. నేను స్వయంగా స్క్రిప్టులు రాశాను. వాటిని గురించి ప్రతి రోజూ, ప్రతి క్షణమూ ఆలోచిస్తూ అవకాశం దొరికినప్పుడల్లా వాటికి సరికొత్త అందచందాలను సంతరింపచేస్తూనే ఉన్నాను. ప్రామాణిక గ్రంథాలను తిరగవేయడం, ఆ పాత్రల పరిధులను విశాలం చేయడం, నా నిత్యకృత్యం. ఉదాత్తం, ఉత్తమం అయిన పాత్రలను సర్వజన సమ్మతంగా తీర్చిదిద్ది ఆ చిత్రాలను కళాత్మకంగా, ప్రయోజనకరంగా రూపొందింప చేయడమే నా ఆశయం. ■

## దర్శకునిగా వారే ప్రేరణ...

నా జీవితంలో మొదటి మలుపు తీసుకు వచ్చిన దర్శకులు కె.వి.రెడ్డి గారు, బి.ఎన్.రెడ్డిగారు, ఎల్.వి. ప్రసాద్‌గారు. ఈ రోజువరకూ అంత కన్నా గొప్ప



కె.వి.రెడ్డి



బి.ఎన్.రెడ్డి



ఎల్.వి.ప్రసాద్



దర్శకులు తెలుగులో లేరు. వీరి దర్శకత్వంలో నేను రెండేళ్లలో (విజయా సంస్థలో ఒప్పందం సమయం) పైకి రాలేకపోతే మద్రాసునీ, చలన చిత్ర రంగాన్నీ శాశ్వతంగా వదిలి వెళ్లిపోవాలని అనుకున్నాను. వారి దర్శకత్వంలో హీరోగా ఎంతో క్రమశిక్షణతో కృషి చేయడానికి అదే సరైన సమయమనీ, నాకు అదొక పరీక్ష అని భావించుకున్నాను. ఈ రోజున నేను దర్శకుడవడానికి కూడా నామీద వారి ప్రభావమే కారణం.

నేను అప్పుడప్పుడు 'కథేమిటి' అని అడిగేవాణ్ణి. కె.వి.రెడ్డిగారు, బి.ఎన్.రెడ్డిగారు వెంటనే నవ్వేశారు. "రామారావ్ స్క్రిప్ట్ తీసుకుని చదవాలిగానీ కథ అడుగుతావేమిటి" అనేవారు. చివరికి షాట్ ఏమిటని అడిగినా సరే ఆ రోజుల్లో హాస్యాస్పదంగా ఉండేది. ఎందుకంటే స్క్రిప్ట్ రెడీగా ఉండేది. చదువుకుని సిద్ధపడేవాణ్ని. ఈ రోజుకి కూడా వారి పద్ధతులే నాకు ఇన్‌స్పిరేషన్. నాకే కాదు.. తెలుగు చిత్ర పరిశ్రమకే వారు గురుతుల్యులు. వారి అడుగు జాడలలోనే నడుస్తున్నాను. నా చిత్రంలో ఆర్టిస్టులకు కథ చెప్పను. స్క్రిప్ట్ చేతికిచ్చి చదువుకోమంటాను. సెట్స్‌మీదకు వచ్చిన తర్వాత ఇతర విషయాల గురించి ఆలోచనకానీ జరిగితే సహించను. ఎంత ముఖ్యమైన విషయాలైనా సెట్ బయటే. సెట్ మీదకు వెళ్ళాక కేవలం నటన గురించి, పాత్ర స్వభావం గురించి మాత్రమే ఆలోచించాలి. ■



'మర్మయోగి' చిత్రంలో ఎన్.టి.ఆర్., మీనాకుమారి, కృష్ణకుమారి

# పేరు మార్చుకున్న సినిమాలు

ఎన్.టి.ఆర్. నటించిన కొన్ని చిత్రాలకు మొదట నిర్ణయించిన టైటిల్స్ కారణాంతరాల వల్ల ఆ తర్వాత మారాయి. వాటి వివరాలు..

| సంఖ్య | మొదట అనుకున్నపేరు | తర్వాతి పేరు |
|---|---|---|
| 1. | చిదంబర రహస్యం | బండరాముడు |
| 2. | శశిరేఖాపరిణయం | మాయాబజార్ |
| 3. | భీష్మ ప్రతిజ్ఞ | భీష్మ |
| 4. | పెద్దింటిపిల్ల | శభాష్ సూరి |
| 5. | కపటయోగి | మర్మయోగి |
| 6. | భీమసేన | పాండవవనవాసం |
| 7. | దాసీపిల్ల | సంతానం |
| 8. | ఇంద్రజిత్తు | సతీసులోచన |
| 9. | ప్రేమించి పెళ్లిచేసుకో | విశాల హృదయాలు |
| 10. | సందేహం | ఇద్దరుపెళ్లాలు |
| 11. | మమకారం | వారసత్వం |
| 12. | ఇదే దారి | సంతోషం |
| 13. | నల్లపిల్ల | నాదీ ఆడజన్మే |
| 14. | 1972 | దొరికితే దొంగలు |
| 15. | పల్నాటి వీరకథ | పల్నాటియుద్ధం |
| 16. | రాణీప్రమీల | ప్రమీలార్జునీయం |
| 17. | కొడుకులు..కోడళ్లు | ఉమ్మడికుటుంబం |
| 18. | యువకుల్లారా.. లేవండి | విశ్వరూపం |


# రిపబ్లిక్ గార్డెన్స్ ప్రత్యేకత



చెన్నై టి.నగర్‌లోని విజయరాఘవాచారి రోడ్‌లోని రిపబ్లిక్ గార్డెన్స్ అనే పేరుగల ఇంటికి చాలా చరిత్ర ఉంది. ప్రస్తుతం ఆంధ్రా క్లబ్ ఉన్న ప్రదేశంలో ఒకప్పుడు ఉన్న ఆ ఇంట్లో మొత్తం పన్నెండు పోర్షన్లు ఉండేవి. కిందభాగంలో ఆరు, పై భాగంలో ఆరు గదుల చొప్పున ఉండేవి. ఈ ఇంటి యజమాని పేరు జయరాం చెట్టి. చెన్నై వచ్చిన తొలిరోజుల్లో అంటే విజయాసంస్థ కాంట్రాక్టులో ఉన్న కాలంలో (1950) ఎన్.టి.ఆర్. ఈ ఇంట్లోనే ఉండేవారు. యోగానంద్, తాతినేని ప్రకాశరావు, టి.వి.రాజు తదితరులు ఆయనతో పాటు ఉండేవారు. ఎస్.వి.రంగారావు, ఆచార్య ఆత్రేయ వేర్వేరు పోర్షన్లలో ఉండేవారు. యోగానంద్, తాతినేని ప్రకాశరావు, అట్లూరి పుండరీకాక్షయ్యతో కలిసి రామారావు పాండీ బజారుకు నడిచి వెళుతుంటే ఆయన అందమైన విగ్రహాన్ని చూసి ఈయనెవరో సినిమా హీరోలా ఉన్నాడే... అనుకునేవారట జనం.

నటునిగా తన సంపాదన మెరుగుపడిన తర్వాత అక్కడనుంచి వేరేచోటుకి మకాం మార్చారు ఎన్.టి.ఆర్.

ఇంకో విషయం ఏమిటంటే ఆ రోజులలో ఈ ఇంట్లో అద్దెకు చేరని సినిమావాళ్లు లేరంటే అతిశయోక్తికాదు. 'చంద్రవంక' తదితర చిత్రాల్లో నటించిన కాంచన ఈ ఇంట్లోనే ఉండి, నిర్మాత అయింది. జూ॥ శ్రీరంజని కూడా 'రిపబ్లిక్ గార్డెన్స్'లోనే ఉండేవారు. ఆమె అక్క సీనియర్ శ్రీరంజని తనయుడు దర్శకుడు మల్లికార్జునరావు కూడా చాలా కాలం ఆ ఇంట్లోనే ఉన్నారు. నిర్మాత అట్లూరి పుండరీకాక్షయ్య 'రిపబ్లిక్ గార్డెన్స్'లోనే ఉండి నిర్మాత అయ్యారు. హీరోయిన్ జయశ్రీ (నటి జయచిత్ర తల్లి) ఈ ఇంట్లో చేరిన తర్వాతే ప్రముఖ నటి అయింది. ఇంకా అనేక మంది చిన్నా పెద్దా నటీనటులు ఈ ఇంట్లో ఉన్నవారే. ముఖ్యంగా ఎన్.టి.ఆర్. రిపబ్లిక్ గార్డెన్స్‌లో ఉండి స్టార్ హీరో అయ్యారనే ప్రచారం బాగా జరగడంతో ఎంతో మంది వర్ధమాన తారలకు ఆ ఇల్లు సెంటిమెంట్ ప్లేస్ అయింది. అలా ఎంతో మంది సినీ ప్రముఖుల్ని చిత్ర పరిశ్రమకి అందించిన రిపబ్లిక్ గార్డెన్స్ ప్రస్తుతం 'ఆంధ్రాక్లబ్'గా మారి తెలుగువారికి సేవలందిస్తోంది. ■



# రాముడు ఒక్కడే... టైటిల్స్ ఎన్నో!

ఒక హీరో పేరుతో సినిమా టైటిల్స్ రావడమన్నది ఎన్.టి.ఆర్. తోనే మొదలైంది. ఈ నందమూరి తారకరాముడు నటించే సినిమాల టైటిల్స్ చివర 'రాముడు' అనే పదం చేర్చడం 1954లో విడుదలైన 'అగ్గిరాముడు' సినిమాతో ప్రారంభమైంది. ఈ సినిమాలో ఎన్.టి.ఆర్. పాత్రపేరు అగ్గిరాముడు. ఎక్కడ అన్యాయం జరిగినా వెళ్లి ప్రతిఘటించడం అతనికి అలవాటు. అగ్గిరాముడు పేరు వింటేనే ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. రాబిన్‌హుడ్ తరహా పాత్ర ఇది. అందుకే సినిమా టైటిల్ కూడా పవర్‌ఫుల్‌గా ఉండాలని ఆలోచించి ఏమో 'అగ్గిరాముడు' అనే టైటిల్ నిర్ణయించారు దర్శక నిర్మాత ఎస్.ఎం.శ్రీరాములునాయుడు. ఆయన ఆలోచన ఎలా ఉన్నా ఈ సినిమా టైటిల్స్ పరంగా ఒక కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారని చెప్పాలి. 'రాముడు' పేరుతో మరెన్నో చిత్రాలు రావడానికి 'అగ్గిరాముడు' చిత్రం ప్రేరణ అయింది. ఆ తర్వాత ఎన్.టి.ఆర్. హీరోగా 'శభాష్‌రాముడు' (1959, సి.ఎస్.రావు దర్శకుడు), 'బండరాముడు' (1959, పి.పుల్లయ్య దర్శకుడు), 'టాక్సీ రాముడు' (1961, వి.మధుసూదనరావు దర్శకుడు), 'టైగర్ రాముడు' (1962, సి.ఎస్.రావు దర్శకుడు), 'పిడుగురాముడు' (1966, బి.విఠలాచార్య దర్శకుడు), 'రాముని మించిన రాముడు (1975, ఎం.ఎస్.గోపీనాథ్ దర్శకుడు), 'అడవిరాముడు', (1977, కె.రాఘవేంద్రరావు దర్శకుడు), 'డ్రైవర్ రాముడు' (1979, కె.రాఘవేంద్రరావు దర్శకుడు), 'శృంగారరాముడు', (1979, కె.శంకర్ దర్శకుడు), 'ఛాలెంజ్ రాముడు' (1980, టి.ఎల్.వి.ప్రసాద్ దర్శకుడు), 'సర్కస్‌రాముడు' (1980, దాసరి నారాయణరావు దర్శకుడు), 'రౌడీరాముడు- కొంటెకృష్ణుడు' (1980, కె.రాఘవేంద్రరావు దర్శకుడు), 'సరదారాముడు' (1980, కె.వాసు దర్శకుడు), 'కలియుగ రాముడు' (1982, కె.బాపయ్య దర్శకుడు). 'రాముడు' టైటిల్‌తో వచ్చిన ఎన్.టి.ఆర్. చిత్రాల్లో అధిక శాతం హిట్టయినవే. అందుకే ఆ సెంటిమెంట్‌ను మిగిలిన దర్శక నిర్మాతలు ఫాలో అయ్యారు. ■



# రామారావు సినిమాల్లో అంతర్నాటకాలు

పాత సినిమాల్లో ఒక సంప్రదాయం ఉండేది. అదేమిటంటే అది సాంఘిక, జానపద కథాంశాలతో రూపొందిన చిత్రమైనా అంతర్నాటకంగా ఒక పౌరాణిక కథను ప్రవేశ పెట్టేవారు. బహుశా పౌరాణికాల ప్రభావం ఆ రోజుల్లో ఎక్కువగా ఉండటం దీనికి కారణం కావచ్చు. ప్రారంభంలో అందరి హీరోల చిత్రాలలో చోటు చేసుకున్న ఈ అంతర్నాటకాలు ఆ తర్వాతి కాలంలో ఎన్.టి.ఆర్. చిత్రాల్లో ఎక్కువగా కనిపించాయి. పురాణపురుషునిగా ఆయనకున్న ఇమేజ్‌ని ఈ రకంగా ఉపయోగించాలన్న అభిప్రాయంతోనో ఏమో ఎన్.టి.ఆర్ సాంఘికాల్లో పౌరాణిక అంతర్నాటకాలను చేర్చేవారు దర్శక నిర్మాతలు. ఇటువంటివి రామారావుకి కూడా ఇష్టం కావడంతో ఆయన అభ్యంతరం చెప్పేవారు కాదు. ఆయన సినిమాల్లోని కొన్ని అంతర్నాటకాలు...

**అగ్గిరాముడు**

ఈ చిత్రంలో అల్లూరి సీతారామరాజు బుర్రకథ ఉంది. 'శ్రీ విలసిల్లెడి తెలుగుదేశమున జననమంది నాడ... ఓహో.. దేవా.. ధీశాలుడు, తెలుగు యోధుడు సీతారామరాజే' అంటూ సాగే ఈ బుర్రకథని ఆత్రేయ రాశారు. నాజర్, లక్ష్మీ నరసయ్య, రామకోటి నటిస్తూ పాడారు. ఈ బుర్రకథలో అల్లూరి సీతారామరాజుగా కనిపిస్తారు ఎన్.టి.ఆర్.

**జయసింహ**

ఎన్.ఎ.టి. సంస్థ నిర్మించిన ఈ తొలి జానపద చిత్రంలో సుభద్రార్జునుల ప్రణయం అంతర్నాటకంగా ఉంది. అర్జునునిగా ఎన్.టి.ఆర్., సుభద్రగా అంజలీదేవి నటించారు. "ఈనాటి ఈ హాయి... కలకాదోయి నిజమోయి.." అనే పాట ఈ సందర్భంగా వినిపిస్తుంది, కనిపిస్తుంది. ఈ పాత్ర పోషించిన తర్వాతే పూర్తిస్థాయి పౌరాణిక పాత్ర పోషించాలనే కోరిక ఎన్.టి.ఆర్.కు కలిగింది.

**చరణదాసి**

ఈ సినిమాలో 'సీత అగ్నిప్రవేశం' నాటకం ఉంది. ఇందులో రామునిగా ఎన్.టి.ఆర్., సీతగా అంజలీదేవి నటించారు. 'దుష్టుడు చూసె నిన్ను గడు దోషపు చూడ్కులచే దదంక సంభ్రష్టపునైతి విట్టినను రాజ కుమారిక వంశ శీలతన...' అంటూ సముద్రాల రాసిన పద్యాలను ఘంటసాల, పి.సుశీల ఆలపించారు. రాముడు, సీత పాత్రలలో వీరిద్దరిని చూసి తన్మయులైన నిర్మాత శంకరరెడ్డి ఆ తర్వాత ఎన్.టి.ఆర్., అంజలీదేవితో 'లవకుశ' చిత్రాన్ని నిర్మించారు.

**రాముడు- భీముడు**

ఎన్.టి.ఆర్ తొలిసారిగా ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'రాముడు-భీముడు'. ఇందులో భీముడు నాటకాల ప్రియుడు. 'ద్రౌపది వస్త్రాపహరణం' నాటకంలో భీమునిగా నటిస్తూ 'కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులు అనేకుల్ చూచుచుండ' అని పద్యాన్ని పాడతారు. ఈ పద్యాన్ని మాధవపెద్ది పాడగా,



చిత్రంలో రాజబాబు, రాజనాలతో..

ఎన్.టి.ఆర్. అభినయించారు. ఈ సినిమా విడుదలైన ఆరు నెలల అనంతరం ఎన్.టి.ఆర్. భీమసేనుడిగా నటించిన 'పాండవవనవాసం' చిత్రం విడుదలవడం గమనార్హం.


'మను [illegible]పుడు' చిత్రంలో వాణిశ్రీతో..

### ఉమ్మడి కుటుంబం

ఈ చిత్రంలో ఒకటి కాదు రెండు అంతర్నాటకాలు ఉన్నాయి. ఒకటి సతీసావిత్రి, మరొకటి లంకాదహనం. సతీసావిత్రి నాటకంలో ఎన్.టి.ఆర్. యమునిగా, రాజబాబు సత్యవంతునిగా, వాణిశ్రీ సావిత్రిగా నటించారు. 'క్షీరాబ్దిపై తేలు శ్రీహరి పానుపు ఒరిగిన ఒక పక్కకు ఒరుగుగాక...' అనే పాటను సముద్రాల జూనియర్ రాయగా, ఘంటసాల, తిలకం పాడారు. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. ఈ సినిమా విడుదలైన 11 ఏళ్ల అనంతరం ఎన్.టి.ఆర్., కృష్ణంరాజు, వాణిశ్రీలతో 'సతీసావిత్రి' రూపొందింది. 'లవకుశ' శంకరరెడ్డి ఈ చిత్ర నిర్మాత.

ఇక హాస్యాన్ని జోడించి రూపొందించిన 'లంకాదహనం' నాటకంలో రావణుడిగా ఎన్.టి.ఆర్., సీతగా వాణిశ్రీ, ఆంజనేయుడిగా రాజబాబు నటించారు. "ఇంతిరో నన్నేలుకో... లంకేశుడనని తెలుసుకో" అంటూ కొసరాజు రాసిన పాటను ఘంటసాల, మాధవపెద్ది, తిలకం పాడారు.

### శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ

ప్రవరాఖ్యుని పాత్రను ఎన్.టి.ఆర్. తన నటజీవితంలో రెండుసార్లు పోషించారు. ఆ రెండూ అంతర్నాటకాలు కావడం విశేషం. ఆర్ట్ డైరెక్టర్ ఏ.కె.శేఖర్ దర్శకత్వం వహించిన 'శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు కథ' చిత్రంలో తొలిసారిగా ఆయన ఆ పాత్ర పోషించారు. జమున వరూధుని. ఈ సినిమాలో ఎన్.టి.ఆర్.కు బాలమురళి ప్లేబ్యాక్ (రెండు పాటలు) అందించడం విశేషం. పింగళి రచించిన 'హే దైవమా... పాదలేపం కరిగిపోయే తిరిగిపోయే దారి తెలియ' అనే పాటను ఎస్.జానకితో కలిసి బాలమురళి పాడారు.

### దేవాంతకుడు

ఎన్.టి.ఆర్., కృష్ణకుమారి జంటగా నటించిన ఈ చిత్రంలో 'ఉషాపరిణయం' అంతర్నాటకం ఉంది. ఇందులో అనిరుద్ధుడుగా ఎన్.టి.ఆర్, ఉషగా కృష్ణకుమారి నటించారు. 'కలగంటినమ్మా... కలికీ.. చిత్రలేఖా.. కలగంటినమ్మా' అనే ఈ సందర్భంగా వచ్చేపాటను పి.బి.శ్రీనివాస్, జానకి పాడారు.

**చిట్టిచెల్లెలు**

'ఆహాహా.. ఈ వనము చూడ చూడ మనోహరము' అంటూ ఘంటసాల, పిఠాపురం, మాధవపెద్ది, తిలకం పాడిన పాట 'శ్రీరామవనవాసం' అంతర్నాటకంలో కనిపిస్తుంది, వినిపిస్తుంది. ఇందులో ఎన్.టి.ఆర్., సురభి బాల సరస్వతి, పద్మనాభం పాల్గొన్నారు.

**మాయని మమత**

ఎన్.టి.ఆర్., బి.సరోజాదేవి జంటగా నటించిన ఈ చిత్రంలో 'స్వప్న వాసవదత్త' అంతర్నాటకం ఉంది. సినిమాలో ఈ అంతర్నాటకం కనిపిస్తుంది కానీ, నిడివి కారణంగానో ఏమో ఈ చిత్రం వీసీడీల్లో ఇది చోటుచేసుకోలేదు. 'అనగనగా ఒక మహరాజు... అతనిపేరు ఉదయనుడు' అంటూ డా॥సి.నారాయణరెడ్డి రాసిన గీతాన్ని సుశీల, ఘంటసాల పాడారు.

**మనుషుల్లో దేవుడు**

ఎన్.టి.ఆర్. మరోసారి ప్రవరాఖ్యుడు పాత్రను పోషించిన చిత్రమిది. ఈ సినిమాలో వచ్చే అంతర్నాటకంలో వరూధునిగా వాణిశ్రీ నటించారు. బ్లాక్ అండ్ వైట్‌లో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో అంతర్నాటకాన్ని మాత్రం రంగుల్లో చిత్రీకరించడం విశేషం. 'ఆహో... హిమవన్నగము భారతావనికే తలమానికము' అనే గీతాన్ని నారాయణ రెడ్డి రాయగా, సుశీల, ఘంటసాల పాడారు. ఈ అంతర్నాటకంలో నేపథ్యంలో వినిపించే స్వరం నిర్మాత అట్లూరి పుండరీకాక్షయ్యది.




'సంగీతలక్ష్మి' చిత్రంలో జమునతో

**సంగీతలక్ష్మి**

ఈ చిత్రంలో గయోపాఖ్యానం అంతర్నాటకం ఉంది. సత్యభామ పాత్ర పోషణలో తనకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పరచుకున్న జమున ఇందులో కృష్ణుని గా నటించడం విశేషం. అర్జునునిగా ఎన్.టి.ఆర్., గయునిగా రమణారెడ్డి నటించారు.


ఇవికాక 'తిక్కశంకరయ్య'లో కూడా అంతర్నాటకం ఉంటుంది. అందులోనూ ఎన్.టి.ఆర్. రావణాసురునిగా నటించారు. 'రైతుబిడ్డ' (వీధి భాగవతం), 'సంసారం' (శాకుంతల) తదితర చిత్రాల్లో అంతర్నాటక సన్నివేశాలు ఉన్నాయి. 'భలే మాస్టారు'లో కాలేజీలో అంతర్నాటకం ఉంటుంది. అది షేక్స్‌పియర్ డ్రామా. 'చండశాసనుడు'లో దుర్యోధన ఏకపాత్రాభినయం ఉంది. పౌరాణిక పాత్రలు ఎన్.టి.ఆర్.కు కొట్టిన పిండి కావడంతో ఇవన్నీ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ■



తనయులు జయశంకరకృష్ణ, రామకృష్ణ, హరికృష్ణ, సాయికృష్ణ, జయకృష్ణ, మోహనకృష్ణ, బాలకృష్ణతో ఎన్.టి.ఆర్.

# నందమూరి నటవారసులు





తను మాత్రమే కాకుండా తన వారసులూ తెలుగు చిత్ర పరిశ్రమకు సేవ చేయాలనే తలంపు ఎన్.టి.ఆర్.ది. అందుకే వారి బిడ్డల్లో ముగ్గురి భవిష్యత్తును పరిశ్రమకు అంకితం చేశారు. "నా బిడ్డలు కేవలం నా ఆస్తికి మాత్రమే వారసులుగా కాక నటనా పరంగా కూడా వారసులుగా నిలవాలని నా కోరిక" అనేవారాయన.

యాభై ఏళ్ల వయసులో కూడా రోజుకు 20 గంటలు పనిచేసిన ఘనత ఎన్.టి.ఆర్.ది. "నాకు ఏడుగురు కొడుకులు ఉన్నారు. వారి జీవితాలకు నా జీవితం మార్గదర్శకంగా ఉండాలి. క్రమశిక్షణతో నా పిల్లలు తమ కర్తవ్యాన్ని తెలుసుకొని జీవించడం కోసమే నేను ఇంత శ్రమ తీసుకుంటున్నాను. ఆస్తిపోయినా నా వెంట ఏడుగురు ఉన్నారన్న ధైర్యం నాకుంది. అర్థబలం కాదు.. అంగబలం కావాలి మనిషి' అని కూడా చెప్పేవారు ఎన్.టి.ఆర్.

ఆయన ఆశించినట్లుగానే ఆయన బిడ్డలందరూ క్రమశిక్షణ తో మెలుగుతూ పెరిగి పెద్దవారై తండ్రికి తగిన తనయులుగా పేరు తెచ్చుకున్నారు. వీళ్లలో నందమూరి హరికృష్ణ, నందమూరి బాలకృష్ణ ఆయన నటవారసులుగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి తండ్రిపేరు నిలబెట్టారు. నందమూరి మోహనకృష్ణ సాంకేతిక రంగంలోకి అడుగుపెట్టి అద్భుత మైన ఛాయాగ్రాహకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఇక తండ్రి క్రమశిక్షణకు వారసుడైన నందమూరి రామకృష్ణ నిర్మాణ

**రంగంలోకి ప్రవేశించి స్టూడియో నిర్వహణ బాధ్యతలు, నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మిగిలిన తనయులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు.**

**నందమూరి వంశానికి వన్నెతెచ్చి 'పెద్దాయన' ప్రతిష్టను ఇనుమడింపచేస్తున్న నట వారసుల వివరాలు...**



## నందమూరి హరికృష్ణ

హరికృష్ణ తొలిసారిగా నటించిన చిత్రం 'శ్రీకృష్ణావతారం' (1967). ఇందులో ఆయన బాలకృష్ణుడిగా నటించారు. హరికృష్ణ నిమ్మకూరులో తాతగారి దగ్గర పెరిగారు. మనవడంటే తాత లక్ష్మయ్య చౌదరిగారికి ఎంతో ఇష్టం. హరికృష్ణను హీరోగా పరిచయం చేయాలనే కోరిక ఆయనకు ఉండేది. దీనికి సంబంధించి 1968లో కొంత ప్రయత్నం జరిగింది కూడా. తమ ఆస్థాన రచయిత డి.వి.నరసరాజును పిలిపించి 'తమ్ముడు పెళ్లి- మామ భరతం' పేరుతో సినిమా తీయడానికి స్క్రిప్ట్ రాయించారు. 'మాయాబజార్' సినిమా కథని సోషలైజ్ చేసి, రామారావు ఘటోత్కచుడుగా, హరికృష్ణ అభిమన్యుడిగా నటించే విధంగా స్క్రిప్ట్ తయారు చేశారు నరసరాజు.

ఆ కథ ఏమిటంటే... ఈ సినిమాలో ఎన్.టి.ఆర్.ది ద్విపాత్రాభినయం. తండ్రీకొడుకుల పాత్రలు. రెండో కొడుకు అభిమన్యుడి పాత్ర పుట్టిన తర్వాత తండ్రి చనిపోతాడు. అంటే రామారావు, హరికృష్ణ సవతి సోదరులన్నమాట. అయితే ఒకరి గురించి ఒకరికి తెలీదు. ఎన్.టి.ఆర్. (పాత్రపేరు కొంగర మల్లయ్య) అడవిలో, హరికృష్ణ సిటీలో పెరుగుతుంటారు. 'మాయాబజారు'లోని బలరాముడు, రేవతి పాత్రలను ఈ సినిమాలో మేనమామ, మేనత్త పాత్రలుగా మార్చారు. రేలంగి, సూర్యకాంతంలను ఈ పాత్రలకు అనుకున్నారు.

మేనల్లుడి ఆస్తిని కాజెయ్యడమే కాకుండా తమ కూతుర్ని ప్రేమిస్తున్నాడని అతణ్ని, తల్లిని ఇంట్లోంచి తరిమేస్తారు మేనమామ, మేనత్త. సవతి సోదరులు కలుసుకోవడం, కొంగర మల్లయ్య మామ భరతం పట్టి తమ్ముడి పెళ్లి చేయడం మిగిలిన కథ.

'మాయాబజార్'లో ఉన్న ముఖ్య సన్నివేశాలు ఏవీ వదిలిపెట్టకుండా ఎన్.టి.ఆర్., నరసరాజు కలిసి స్క్రీన్‌ప్లే తయారు చేశారు. డైలాగులు కూడా రాశారు నరసరాజు. అయితే ఎందువల్లో ఈ సినిమా సెట్స్ వరకూ రాలేదు. ఎనిమిదేళ్ల అనంతరం 1976లో సంక్రాంతి సందర్భంగా ఇచ్చిన పత్రికాప్రకటనల్లో ఈచిత్రం వివరాలున్నాయి. ఈలోపు 'తల్లాపెళ్లామా', 'రామ్-రహీమ్' చిత్రాల్లో నటించారు. 'దానవీరశూరకర్ణ' చిత్రంలో అర్జునుడిగా నటించారాయన. ఆ చిత్రం తర్వాత నిర్మాణరంగం మీదకి దృష్టి మరల్చారు. 'డ్రైవర్‌రాముడు', 'అనురాగదేవత' చిత్రాలకు నిర్మాత ఆయనే. తండ్రి కనుసన్నల్లో మెలుగుతూ రామకృష్ణా స్టూడియో నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. అలాగే ఎన్.టి.ఆర్. రాజకీయాల్లోకి ప్రవేశించి, రాష్ట్ర పర్యటన ప్రారంభించినప్పుడు ఆయన ప్రయాణించే చైతన్య రథాన్ని కొన్నివేల కిలోమీటర్లు నడిపిన సారథి హరికృష్ణ.

ఆయన తనయులు కళ్యాణ్‌రామ్, జూనియర్ ఎన్.టి.ఆర్. తాతగారి ప్రతిష్టను పెంచుతూ, తండ్రికి తగ్గ తనయులుగా పేరు తెచ్చుకుంటూ చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్నారు.

## నందమూరి బాలకృష్ణ



'తాతమ్మకల' చిత్రంతో నటుడిగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు బాలకృష్ణ. తొలిరోజు షూటింగ్‌లో మేకప్ వేసుకుని కెమెరాముందుకు వెళ్లబోతూ తండ్రి పాదాలకు నమస్కరించారట బాలకృష్ణ.

'మా ఆశీర్వాదాలెప్పుడూ ఉంటాయ్.. నటుడిగా మీరు చేయాల్సిన కృషిచేయాలి. మీ నియమబద్ధ కృషిమీదే మీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. మే గాడ్ బ్లెస్ యూ' అన్నారట ఎన్.టి.ఆర్.

ఆనాడు తండ్రి చెప్పిన మాటను బాలకృష్ణ ఇప్పటికీ



మరిచిపోలేదు. క్రమశిక్షణతో, నియమబద్ధ జీవితం గడుపుతూ ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

'యాదోంకి బారాత్' చిత్రం ఆధారంగా 1975లో తయారైన 'అన్నదమ్ముల అనుబంధం' సినిమాలో ఎన్.టి.ఆర్.కు చిన్న తమ్ముడిగా నటించారు బాలకృష్ణ. ఇలా లేతవయసులోనే 'వేములవాడ భీమకవి', 'దానవీరశూరకర్ణ', 'అక్బర్ సలీం అనార్కలి', 'శ్రీమద్ విరాటపర్వం', 'రౌడీరాముడు- కొంటె కృష్ణుడు', 'శ్రీ తిరుపతి వెంకటేశ్వర కళ్యాణం', 'అనురాగదేవత', 'సింహం నవ్వింది' తదితర చిత్రాల్లో తండ్రితోపాటు కలిసి నటించిన బాలకృష్ణ హిందీలో విజయవంతమైన 'డిస్కోడాన్సర్' సినిమా ఆధారంగా తెలుగులో తయారైన 'డిస్కోకింగ్' (1984) సినిమాలో సోలో హీరోగా ప్రేక్షకులముందుకు వచ్చారు. ఆ ఏడాదే విడుదలైన 'మంగమ్మగారి మనవడు' చిత్రం ఘన విజయం సాధించడంతో అప్పటినుంచి స్టార్‌గా ఆయన ఎదుగుదల ప్రారంభమైంది.

ఎన్.టి.ఆర్.కు ఏకలవ్య శిష్యుడనని చెప్పుకునే బాలకృష్ణ ప్రతి విషయంలోనూ తండ్రిని ఆదర్శంగా తీసుకుంటారు. పెద్దాయన నేర్పిన క్రమశిక్షణ, వారసత్వంగా లభించిన నటన, అలవాట్లు బాలకృష్ణని ఒక మంచి నటునిగా తీర్చిదిద్దాయి.

ఎన్.టి.ఆర్. తర్వాత మళ్లీ అంతటి ఎమోషన్‌ని ప్రదర్శించే హీరోగా బాలకృష్ణకు పేరుంది. అటు పౌరాణికాలైనా, ఇటు సాంఘిక ఇతివృత్తాలైనా... జానపదాలైనా సమర్థంగా నిర్వహించగల సత్తా తనకుందని ఆయన ఎన్నోసార్లు నిరూపించారు.

### జూనియర్ ఎన్.టి.ఆర్.



నందమూరి నటవారసులు మూడోతరంలో ముగ్గురున్నారు. వీరిలో అందరికంటే చిన్నవాడైన జూనియర్ ఎన్.టి.ఆర్. పేరులోనే కాకుండా పోలికల్లోనూ తాతగారిని అనుక్షణం గుర్తు చేస్తుంటారు. 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' చిత్రంలో తాతగారితో కలిసి నటించిన ఎన్.టి.ఆర్. అందరూ బాలలే నటించిన 'రామాయణం' చిత్రంలో రాముడిగా నటించి అందరి దృష్టిని ఆకట్టుకున్నారు.

'నిన్ను చూడాలని' చిత్రంతో హీరోగా పరిచయమైన ఎన్.టి.ఆర్. తన నాలుగో చిత్రం 'ఆది'లో నటవిశ్వరూపం చూపించి బాక్సాఫీసు ఉలిక్కిపడేలా చేశారు. హీరోగా అతని ఎనర్జీ ఏ స్థాయిలో ఉందో తేల్చి చెప్పిన సినిమా ఇది. 'అల్లరి రాముడు', 'నాగ' చిత్రాల తర్వాత వచ్చిన 'సింహాద్రి' చిత్రం ఎన్.టి.ఆర్. నట జీవితంలో ఒక మైలురాయిగా నిలిచింది.

ఇంతవరకూ 17 చిత్రాల్లో నటించిన ఎన్.టి.ఆర్. యువతరం క్రేజీ కథానాయకుల్లో ఒకరు.


### కళ్యాణ్‌రామ్



నందమూరి హరికృష్ణకు రెండుకళ్లు... కళ్యాణ్‌రామ్, ఎన్.టి.ఆర్. చేతికి అంది వచ్చిన ఈ ఇద్దరు కొడుకుల్నీ, ఆర్టిస్టులుగా వారు సాధిస్తున్న ప్రగతిని చూసి పుత్రోత్సాహం పొందుతున్నారు హరికృష్ణ.

నందమూరి నటవారసుడిగా పరిచయమైన కళ్యాణ్‌రామ్ 'అతనొక్కడే' చిత్రంతో తన సత్తా ప్రదర్శించారు. వైవిధ్యమైన పాత్రలను ఎన్నుకుంటూ ఆర్టిస్ట్‌గా ముందడుగు వేస్తున్నారు. అంతేకాదు తాతగారి పేరిట చిత్ర నిర్మాణ సంస్థను నెలకొల్పి విభిన్న చిత్రాలు నిర్మిస్తున్నారు కళ్యాణ్‌రామ్.

### తారకరత్న



తను సాంకేతిక రంగంలో ప్రవేశించినప్పటికీ తన తనయుడు తారకరత్నను నటుడిగానే పరిచయం చేశారు మోహనకృష్ణ. 'ఒకటో నెంబర్ కుర్రాడు' చిత్రంతో హీరోగా పరిచయమైన తారకరత్న మంచి వక్త కూడా. అన్నిరకాల పాత్రలు చేస్తూ తాతగారిలా పేరు తెచ్చుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ■

## 'మొఘల్ ఎ ఆజం' స్ఫూర్తితో

# అక్బర్ సలీం అనార్కలి



అక్బర్ పాత్రలో ఎన్.టి.ఆర్.

ఎన్.టి.ఆర్. అభిమానించిన నటుల్లో పృథ్వీరాజ్ కపూర్ ఒకరు. చిత్ర పరిశ్రమలో తొలి అడుగులు వేస్తున్న తరుణంలో ఆయన హిందీ సినిమాలు ఎక్కువగా చూసేవారు. ముఖ్యంగా పృథ్వీరాజ్‌కపూర్, దిలీప్‌కుమార్ నటించిన చిత్రాలు విడుదలైతే చాలు ఎన్.టి.ఆర్. వెళ్లి చూడాల్సిందే. ఈ ఇద్దరు మహానటులు నటించిన 'మొఘల్ ఎ ఆజం' చిత్రంలో పృథ్వీరాజ్‌కపూర్ అక్బర్ పాదుషా పాత్ర ధరించారు. క్రియా పదాలు ముందు చేర్చి ఒక కొత్త తరహాలో డైలాగులు చెప్పారాయన. ఆ విధానం ఎన్.టి.ఆర్.కు బాగా నచ్చింది. అందుకే 'అక్బర్ సలీం అనార్కలి' చిత్రాన్ని నిర్మిస్తూ అందులో అక్బర్ పాత్ర ధరించి పృథ్వీరాజ్‌కపూర్‌ని అనుకరిస్తూ డైలాగులు చెప్పారు. సంభాషణల రచయిత డా॥సి.నారాయణరెడ్డిని ఆ ధోరణిలో డైలాగులు రాయ మన్నారు. (నారాయణరెడ్డి రచన చేసిన సినిమాలు రెండేరెండు. ఒకటి 'ఏకవీర', మరొకటి 'అక్బర్ సలీం అనార్కలి'. రెండు చిత్రాల్లోనూ హీరో ఎన్.టి.ఆర్. కావడం విశేషం.) "ఎందుకు యుద్ధం.. ఇది కుటుంబ కలహం.. తేల్చుకుందాం.. మనిద్దరం" ఈ ధోరణిలో ఉంటాయి సినిమాలో డైలాగులు. ఈ చిత్రంలో ఓ సందర్భంలో అనార్కలి పాత్రధారిణి దీప అంటుంది... "ప్రభూ... మీరేం మాట్లాడుతున్నారో నాకర్థం కావడం లేదు" అని. అలాగే సినిమా విడుదలయ్యాక ప్రేక్షకులూ ఇదేమాట అన్నారు. ఎన్.టి.ఆర్. శైలిలో కాకుండా వేరే ధోరణిలో డైలాగులు ఉండటంతో వాళ్ళు జీర్ణించుకోలేకపోయారు. మరో విషయమేమిటంటే.. ఈ సినిమా విడుదలకుముందు రామకృష్ణా స్టూడియోలో ప్రివ్యూ వేశారు. కొంతమంది ముఖ్యులు సినిమా చూశారు. ప్రదర్శన ముగిసిన అనంతరం డైలాగ్స్‌లో క్లారిటీ లోపించిన విషయాన్ని ఎన్.టి.ఆర్.కు చెప్పారు నారాయణరెడ్డి. ఆయన గంభీరంగా 'ఇట్స్ ఓ.కే' అని ఒప్పుకొన్నారు.

తారకరామా ఫిలిం యూనిట్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో ఎన్.టి.ఆర్. నిర్మించిన ఈ చిత్రంలో సలీంగా బాలకృష్ణ, తాన్‌సేన్‌గా గుమ్మడి, జోధాబాయిగా జమున, దిల్‌రుబాగా మాధవి నటించారు. చలపతి రావు, శ్రీధర్ ఇతర ముఖ్య తారాగణం. ఎన్.టి.ఆర్.కు దర్శకునిగా ఏడో సినిమా. బాలకృష్ణకు ఆరో చిత్రం.


ఉత్తరాదికి చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు సి.రామచంద్ర ఈ సినిమాకి అద్భుతమైన బాణీలు అందించారు. 'భలేతమ్ముడు' చిత్రంలో ఎన్.టి.ఆర్.కు అన్ని పాటలు పాడిన ఉత్తరాది గాయకుడు మహమ్మద్ రఫీ ఈ చిత్రంలో బాలకృష్ణకి పాడటం విశేషం.

1978 మార్చి 15న విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయింది. ■


తెలుగులో రూపుదిద్దుకున్న తొలి పూర్తి రంగుల చిత్రం 'లవకుశ'లో నటించిన ఘనత ఎన్.టి.ఆర్‌దే. అయితే అంతకంటే ముందు 1952లో విజయా సంస్థ 'పెళ్లిచేసిచూడు' చిత్రాన్ని తెలుగులో, తమిళంలో 'కల్యాణం పణ్ణిపార్' పేరుతో నిర్మించింది. రెండు చిత్రాల్లో ముఖ్యజంట ఎన్.టి.ఆర్., జి.వరలక్ష్మి. తెలుగులో లేదు కానీ తమిళ వెర్షన్‌లో మాత్రం కొన్ని దృశ్యాలను గేవా కలర్‌లో చిత్రీకరించారు. ఆ సన్నివేశాలు తమిళ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. వర్ణ దృశ్యాల చిత్రీకరణపై ఒక అవగాహన ఏర్పడటం కోసం ఛాయాగ్రాహకుడు మార్కస్ బార్ట్లేను ప్రత్యేకంగా విదేశాలకు పంపించారు విజయాధినేతలు.




# రంగుల చిత్రాల్లో రామారావు



ఇదిలా ఉంటే 1955లో దక్షిణ భారతదేశపు తొలి సంపూర్ణ వర్ణచిత్రం 'ఆలీబాబావుమ్ నరుపత్త తిరుడార్గళం' విడుదలైంది. సేలంలోని మోడరన్ థియేటర్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రంలో ఎం.జి.రామచంద్రన్, భానుమతి నటించారు. ఇదే 'ఆలీబాబా 40 దొంగలు' పేరుతో తెలుగులోనూ విడుదలైంది. ఈ చిత్రం సాధించిన విజయం తెలుగు నిర్మాతలను కూడా ఆకర్షించింది. తెలుగులో కూడా సంపూర్ణ వర్ణచిత్రం తీయాలనే తలంపు కొందరికి కలిగినా వర్కవుట్ కాదేమోననే భయంతో వారు వెనుకంజవేశారు. ఎందుకంటే



'లవకుశ' చిత్రంలో ఒక దృశ్యం

ప్రస్తుతం తెలుగుసినిమా మార్కెట్‌లో సింహ భాగాన్ని ఆక్రమించిన నైజాం ఏరియా ఆ రోజులలో చాలా బలహీనంగా ఉండేది. బ్లాక్ అండ్ వైట్ చిత్రాల కలెక్షన్లు ఆ ప్రాంతంలో అంతంతమాత్రంగానే ఉండేవి. ఖర్చుపెట్టి కలర్ చిత్రాలు నిర్మిస్తే నష్టాల్ని భరించాల్సి వస్తుందనే భయం నిర్మాతల్లో ఉండేది. అందుకే నిర్మాతలు డూఫేకలర్ (బ్లాక్ అండ్ వైట్ ఫిలింతో సన్నివేశాలను చిత్రీకరించి, ప్రాసెస్ అయిన ఫిలిం మీద చేతితో రంగుల అద్దకం చేసే పద్ధతి)లో పాటలనో, సన్ని వేశాలనో చిత్రీకరించి, దాంతోనే సంతృప్తి చెందేవారు.

**1955**లో వచ్చిన ఎన్.ఎ.టి.వారి 'జయసింహ' చిత్రంలోని "ఈనాటి ఈ హాయి కలకాదోయి నిజయోయి.." పాటను ఈ పద్ధతిలోనే చిత్రీకరించారు. రంగులలో కనిపించిన రామారావుని చూసి తన్మయులైన ప్రేక్షకులు ఆ పాటకోసమే 'జయసింహ' చిత్రాన్ని మళ్లీ మళ్లీ చూశారు.

తెలుగులో తొలి పూర్తి రంగుల చిత్రం 'లవకుశ' నిర్మాణం **1959** ఫిబ్రవరి **5**న ప్రారంభమైంది. కానీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా సుదీర్ఘకాలం షూటింగ్ జరిగి అయిదేళ్ల తర్వాత ఈ చిత్రం విడుదలైంది. అయితే ఈ లోపే అంటే **1959**లోనే పొన్నలూరి సోదరులు 'దైవబలం' చిత్రంలోని సగానికిపైగా సన్ని వేశాలను రంగుల్లో తీసి విడుదల చేశారు. ఈ సినిమాలో ఎన్.టి.ఆర్., జయశ్రీ (నటి జయచిత్ర తల్లి) ముఖ్యజంట. అలాగే ఎన్.టి.ఆర్. నటించిన

'అప్పుచేసి పప్పుకూడు' చిత్రంలో ఇ.వి.సరోజ పాల్గొన్న నృత్య సన్నివేశాన్ని రంగులలో తీశారు. అయితే అటు 'దైవబలం'లో కానీ, ఇటు 'అప్పుచేసి పప్పుకూడు'లో కానీ ఇవాళ అందుబాటులో ఉన్న వి.సి.డి.ల్లో ఆ దృశ్యాలను రంగులలో చూడలేం. అవి నలుపు, తెలుపుల్లోనే కనపడతాయి.

తెలుగులో పార్ట్లీ కలర్ చిత్రాలు అడపాదడపా తయారవుతుండడంతో ఎన్.టి.ఆర్ నిర్మాతలు కూడా ఆ దిశగా అడుగులు వేశారు. ఎన్.టి.ఆర్., కృష్ణకుమారి నటించిన 'బందిపోటు' (విఠలాచార్య దర్శకుడు) చిత్రంలోని క్లయిమాక్స్ సన్నివేశాలను రంగుల్లో చిత్రీకరించారు. 1965లో వచ్చిన 'వీరాభిమన్యు' చిత్రంలోని పతాక సన్నివేశాలనూ కలర్‌లో తీశారు. 1969లో విడుదలైన 'కథానాయకుడు' చిత్రం క్లయిమాక్స్‌లో వచ్చే "ఇంతేనయా.. తెలుసుకోవయా.." పాటను కూడా రంగుల్లో చిత్రీకరించారు.

1970 నాటికి వర్ణ చిత్రాల నిర్మాణం పుంజుకున్నప్పటికీ పార్ట్లీ కలర్ సినిమాల వెల్లువ కూడా కొనసాగింది. ఎన్.టి.ఆర్. చిత్రాల విషయాన్ని పరిశీలిస్తే... "తల్లా- పెళ్లామా' సినిమాలో ఆయన జ్యోతిలక్ష్మితో పాడిన "నువ్వు నవ్వుతున్నావు.. నేను నవ్వుతున్నాను" అనే పాటను రంగుల్లోనే తీశారు.


1971లో వచ్చిన కె.వి.రెడ్డి చివరి చిత్రం 'శ్రీకృష్ణ సత్య' పూర్తి రంగుల్లో రూపుదిద్దుకుంది. ఎన్.టి.ఆర్. భారీ వ్యయంతో తొలిసారిగా నిర్మించిన రంగుల చిత్రమిది. ఆ ఏడాదిలో ఎన్.టి.ఆర్. నటించిన పార్ట్లీ కలర్ చిత్రాలు మూడు విడుదలయ్యాయి. 'శ్రీకృష్ణ విజయం' చిత్రంలో హేమమాలిని పాల్గొన్న 'జోహారు శిఖిపించమౌళి..'' పాటను రంగుల్లో తీశారు. అలాగే 'అదృష్ట జాతకుడు' చిత్రంలోని క్లయిమాక్స్ సన్నివేశాలను కూడా కలర్‌లో చిత్రీకరించారు. ఎన్.టి.ఆర్.-చంద్రకళ జంటగా నటించిన 'పవిత్ర హృదయాలు' చిత్రంలో కూడా పార్ట్లీ కలర్ దృశ్యాలున్నాయి.

(సాహితీ మిత్రుడు వి.బాబూరావుకు కృతజ్ఞతలతో) ■



'తల్లా-పెళ్లామా' ఎన్.టి.ఆర్., జ్యోతిలక్ష్మి

# ఎన్.టి.ఆర్. నాకు మార్గదర్శకుడు



ఉషా పిక్చర్స్

ఎన్.టి.ఆర్., జయలలిత జంటగా 'కథానాయకుడు' చిత్రాన్ని నిర్మించిన కొడాలి గోపాలకృష్ణ అల్లుడు బాలకృష్ణారావు. వారి అమ్మాయి ఉషారాణిని వివాహం చేసుకున్న అనంతరం ఉషా పిక్చర్స్ పంపిణీ సంస్థను నెలకొల్పారు. 'కథానాయకుడు' చిత్రంతో జిల్లావారీ పంపిణీ విధానానికి శ్రీకారం చుట్టారు. మహానటుడు ఎన్.టి.ఆర్. నటించిన చిత్రంతో వ్యాపారాన్ని ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తారు బాలకృష్ణారావు. పెద్దాయనతో తనకున్న అనుబంధాన్ని ఇలా వివరించారాయన. "మా మామగారు ఎన్.టి.ఆర్. తో సన్నిహితంగా మెలిగేవారు. ఆయనతోపాటు చాలా సందర్భాల్లో ఎన్.టి.ఆర్.ని కలిశాను. చిత్ర పరిశ్రమలోకి యువత రావాలని, క్రమశిక్షణతో మెలగాలని ఆయన పదేపదే చెబుతుండేవారు. 'కథానాయకుడు'తో ప్రారంభించి 'వేటగాడు', 'కేడి నెం.1', 'గజదొంగ', 'కొండవీటి సింహం', 'జస్టిస్ చౌదరి', సర్దార్ పాపారాయుడు', 'బ్రహ్మంగారి చరిత్ర', 'నాదేశం' వంటి అనేక ఎన్.టి.ఆర్. చిత్రాలను పంపిణీ చేశాను. రామారావుగారు నటించిన దాదాపు 50 చిత్రాల వరల్డ్ నెగిటివ్ రైట్స్ నా దగ్గర ఉన్నాయి. ఎన్.టి.ఆర్. సమయపాలన, క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం. సినిమా నిర్మాణ రంగంలోని ప్రతిశాఖపై అవగాహన కలిగిన వ్యక్తి ఆయన. ఎటువంటి వ్యక్తి, నటుడు తెలుగు చిత్ర పరిశ్రమలో మరొకరు ఇకముందు రారని చెప్పగలను. తెలుగువారి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఎన్.టి.ఆర్. నాకు మార్గదర్శి. ప్రతి తెలుగువాడి గుండెల్లో కొలువై ఉన్న మహనీయుడాయన."





'దేశోద్ధారకులు'లో ఎన్.టి.ఆర్.

## 'దేశోద్ధారకులు'

# ప్రత్యేకత అదే!

యు.విశ్వేశ్వరరావు



తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్.టి.ఆర్.ను 'పెద్దాయన' అనే గౌరవభావంతో పిలుచుకునేవారు. ఆయనకంటే వయసులో పెద్దవారు చాలామంది ఉన్నప్పటికీ ఆ పిలుపు మాత్రం ఆయనకే వర్తించేది. చిన్నవారికీ, పెద్దవారికీ 'పెద్దాయన' అంటే ఎన్.టి.ఆరే. అలాగే ఆత్మీయులంతా 'అన్నగారూ' అని పిలుచుకునేవారు.

చాలామందికి ఎన్.టి.ఆర్. అన్నగారైనా విశ్వశాంతి అధినేత యు.విశ్వేశ్వరరావుకు మాత్రం ఆయన బావగారు. మేనమామ కుమారుడు. అంతేకాదు తన కన్యారత్నాన్ని నందమూరి మోహనకృష్ణకు ఇచ్చి పెళ్లిచేసి ఎన్.టి.ఆర్.తో వియ్యమొందారు విశ్వేశ్వరరావు.

ఎన్.టి.ఆర్. నటించిన 'కన్యాశుల్కం' చిత్రంతో దర్శకుడు పి.పుల్లయ్య దగ్గర సహాయకుడిగా చేరిన విశ్వేశ్వరరావు ఆపై 'జయభేరి', 'శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం' చిత్రాలకు కూడా పనిచేశారు. చిత్ర

పరిశ్రమలో గడించిన అనుభవంతో నిర్మాణ రంగంలోకి ప్రవేశించి 1959 ఏప్రిల్ 9న సొంతంగా సినిమాలను తీయడం ప్రారంభించారు విశ్వేశ్వరరావు. ఆయన రాజకీయ గురువు జయప్రకాష్ నారాయణ ఆశీస్సులు పొంది, ఆయన నామకరణం చేసిన 'విశ్వశాంతి' పతాకంపై మొదట అనువాద చిత్ర నిర్మాణం చేపట్టారు. వివిధ భాషలనుంచి పది సినిమాలను తెలుగులోకి అనువదించారు విశ్వేశ్వర రావు. ఎన్.టి.ఆర్.తో విభిన్న సినిమాలు నిర్మించడమే కాకుండా తను దర్శకుడిగా మారి అభిరుచితో, అభ్యుదయ భావాలతో 'తీర్పు', 'మార్పు', 'నగ్నసత్యం', 'కీర్తి కాంత కనకం', 'పెళ్లిళ్ల చదరంగం' (విడుదల కావాల్సి ఉంది) చిత్రాలను నిర్మించారు విశ్వేశ్వరరావు. ప్రస్తుతం చిత్ర నిర్మాణానికి దూరంగా ఉండి, ఇతర వ్యాపకాలతో బిజీగా ఉంటున్న ఆయన్ని చెన్నైలో కలిసినప్పుడు ఎన్.టి.ఆర్. గురించి, ఆయనతో తనకున్న అనుబంధం గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు చెప్పారు.






### తొలి స్ట్రెయిట్ చిత్రం 'కంచుకోట'

రామారావుతో ఒక అద్భుత జానపద చిత్రం తీయాలనే కోరికతో ఆగస్టు 1966లో 'కంచుకోట' చిత్రం తీశారు విశ్వేశ్వరరావు. ఆ చిత్రానికి కథకుడు ఆయనే. ఆ కథ ఎన్.టి.ఆర్.కు కూడా బాగా నచ్చింది. మహారథి సంభాషణలు రాశారు. సి.ఎస్.రావు దర్శకుడు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఎన్.టి.ఆర్.తో ఆయన నిర్మించిన నాలుగు చిత్రా లకూ ('కంచుకోట', 'నిలువుదోపిడీ', 'పెత్తందార్లు', 'దేశోద్ధారకులు') ఒకే యూనిట్ పనిచేయడం. దర్శకుడు, ఇతర సాంకేతిక నిపుణులే కాదు నటీ నటుల విషయంలో కూడా పెద్ద మార్పులు చేయ కుండా ఆయా సినిమాలు నిర్మించారు విశ్వేశ్వరరావు.

ఈ చిత్ర నిర్మాణానికి ఆ రోజుల్లోనే ఏడు లక్షల రూపాయలు ఖర్చయ్యాయి. నిర్మాణపరంగా ఎక్కడా రాజీపడేవారు కాదు విశ్వేశ్వరరావు. అలాగే తను నిర్మించిన ప్రతి సినిమాలోనూ ఒక పాట రాయడం ఆయనకు అలవాటు. ఆయన రాసిన పాటలన్నీ


ప్రజాదరణ పొందాయి. తన సినిమాల్లో నటించిన ఆర్టిస్టులందరూ ఎంతో ఆప్యాయంగా ఉండేవారనీ, అలాంటి వాతావరణం ఇప్పుడు కరువైందని విన్నానని అన్నారాయన. 'మా హీరోయిన్లు సావిత్రి, దేవిక నన్ను 'పెద్దబ్బాయ్' అని పిలిచేవారు. ఏదన్నా సినిమాలో వేషం లేదని చెబితే ఎంతో బాధ పడేవారు. నేను తీసిన 'నిలువుదోపిడీ' చిత్రంలో కాంతారావుకు వేషం లేదు. ఆ విషయం "నాకు వేషం లేకుండా సినిమా తీస్తారా.. చిన్న వేషమైనా ఇవ్వాల్సిందే" అని మొండి పట్టు పట్టారు. ఆ సినిమాలో బుర్రకథ సన్నివేశం ఒకటుంది. ఒక మంత్రిగారు వచ్చి ఆ బుర్రకథను తిలకించే షాట్‌లో మంత్రిగా నటించారు కాంతారావు. ఇలా వచ్చి అలా వెళ్లిపోయే సీన్ అది. మా మధ్య అంత అనుబంధం, ఆప్యాయత ఉండేవి' అని వివరించారు విశ్వేశ్వరరావు.


ఏరియా బిజినెస్ 'కంచుకోట' సినిమాతోనే ప్రారంభమైందనే ఆసక్తికరమైన సమాచారాన్ని కూడా విశ్వేశ్వరరావు చెప్పారు. 'గుంటూరులో మెడికల్ రిప్రెజెంటేటివ్ ఒకతను ఉండేవారు. నా దగ్గరికి వచ్చి మేం కూడా విశ్వశాంతి పిక్చర్స్ పేరుతో పంపిణీ సంస్థను ప్రారంభిస్తున్నాం. మీ 'కంచుకోట' సినిమా ఇవ్వాలి' అని అడగటంతో నేను సరేనన్నాను. అలా విశ్వశాంతి పిక్చర్స్‌తో గుంటూరులో ఏరియా వ్యాపారం ప్రారంభమైంది' అన్నారాయన.

ఎన్.టి.ఆర్. తొలి సాంఘిక రంగుల చిత్రం 'దేశోద్ధారకులు'.

తెలుగులో తొలి పూర్తి రంగుల చిత్రం 'లవకుశ'లో నటించిన ఘనత ఎన్.టి.ఆర్.ది. అలాగే సాంఘికాల్లో ఆయన నటించిన తొలి రంగుల చిత్రం 'దేశోద్ధారకులు'. ఆ రోజుల్లో తెలుగు నిర్మాతలకు కలర్ ఫిలిం దొరికేది కాదు. పేరున్న సంస్థలు, ల్యాబ్‌లకు మాత్రమే కోటా లభించేది. రామారావుతో కలర్ సినిమా తీయాలని కోరిక విశ్వేశ్వరరావుది. అందుకు ఎల్.వి.ప్రసాద్‌ని కలిసి అడిగితే ఆయన కలర్ ఫిలిం ఇప్పించారు. ఈ సినిమా తీయడానికి 35 లక్షలు ఖర్చు అయింది. అంత బడ్జెట్ అయిందని నాగిరెడ్డిగారు మందలించారు కూడా. సినిమా విడుదలైన తర్వాత రిజల్ట్ మీకే తెలుస్తుంది అని చెప్పారు విశ్వేశ్వరరావు.

ఎన్.టి.ఆర్. తన మేనమామ కొడుకు కావడం వల్ల తన సినిమాలకు ఆయన హీరో కాలేదని, నిర్మాతగా మారుతున్న సమయంలో తన బావగారిని దృష్టిలో ఉంచుకుని ఆయా చిత్రాల్లో పాత్రలు రూపొందించానని ఆయన స్పష్టం చేశారు.






రామారావుతో సినిమా తీయడం నిర్మాతగా ఎస్టాబ్లిష్ కావాలనుకునే ఏ వ్యక్తికయినా ప్రాథమిక అవసరమని ఆయన చెప్పారు. 'నా కథలకు తగిన కథానాయకుడాయన. 'కంచుకోట'లో కానీ ఇతర చిత్రాల్లో కానీ ఆయన వేసిన పాత్రలు ఎవరు వేసినా పనికిరారు. అయినా మా బావగారితో తీయకుండా వేరే వారితో సినిమాలు తీయడం మా బంధుత్వంలో కూడా బాగుండదు కదా'' అన్నారు.

రామారావులా క్రమశిక్షణ కలిగిన వ్యక్తిని ఎక్కడా చూడలేదని విశ్వేశ్వరరావు చెప్పారు. "ఉదయం ఏడు గంటలకు కాల్షీట్ అంటే 6-45 నిముషాలకల్లా మేకప్‌తో సెట్‌కి వచ్చేవారు. తన క్రమశిక్షణతో నిర్మాతలను భయపెట్టేవారాయన. 'విశ్వేశ్వరరావ్... వేరీజ్ యువర్ ఆర్టిస్ట్?' అని ప్రశ్నించేవారు. రామారావుగారితో సినిమా తీయడం నిర్మాతకు ఒకరకంగా ఎంతో మేలు. ఆయనే దగ్గరుండి అన్నీ చూసుకునేవారు. ఒక ప్రొడక్షన్ మేనేజర్‌లా పనిచేసేవారు'' అని వివరించారాయన.




'విజయవాడలో జరిగిన 'కంచుకోట' శతదినోత్సవానికి హాజరైన దేవిక, రామారావు, సావిత్రి, విశ్వేశ్వరరావు, సత్యనారాయణతో శేఖర్‌బాబు, త్రివిక్రమరావు

## దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు దీటుగా

# ఎన్.టి.ఆర్. నేషనల్ ఫిలిం అవార్డ్

'రాయలవంటి రాజు లేడు, అప్పాజీ వంటి మంత్రీ లేడు' అన్నట్లుగా ఎన్.టి.ఆర్.లా తెలుగు చిత్రపరిశ్రమని దశాబ్దాల తరబడి శాసించగలిగే వ్యక్తి, తెలుగువాడి పౌరుషాన్ని నలుదిక్కులా చాటి రాజకీయాలను మలుపు తిప్పగలిగే శక్తి.. ఇప్పట్లో మళ్లీ రావడం అసాధ్యమే. ఆయన మరణించి 14 ఏళ్లు కావస్తున్నా అనునిత్యం తలచుకోని రోజు లేదు. ఇంటింటి ఆత్మబంధువులా ప్రతిఒక్కరి గుండెల్లో మిగిలిపోయారాయన. ఆయన నటన, నడవడిక, క్రమశిక్షణ, పట్టుదల, దీక్ష, మొండితనం గురించి ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుని మురిసిపోతుంటారు అభిమానజనం. ధరిత్రి ఉన్నంతకాలం చరిత్ర ఆయన్ని గుర్తుంచుకుంటూనే ఉంటుంది. ప్రజల హృదయాల్లో శాశ్వత స్మరణీయునిగా, యుగపురుషునిగా, శక పురుషునిగా నిలిచిన ఎన్.టి.ఆర్. పేరిట ఒక జాతీయ ఫిలిం అవార్డ్‌ను 1996లో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు విశేష సేవలు అందించిన చిత్ర ప్రముఖులను ప్రతిఏటా ఈ అవార్డ్‌తో సత్కరిస్తున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్‌కు దీటుగా ఏర్పాటయిన ఎన్.టి.ఆర్. నేషనల్ ఫిలిం అవార్డ్‌కు ఎంపికయిన వ్యక్తికి ఐదు లక్షల రూపాయల నగదు, జ్ఞాపికను అందజేస్తున్నారు.





తొలిసారిగా ఈ అవార్డ్‌ను ఎన్.టి.ఆర్. సన్నిహిత మిత్రుడు, సహచర నటుడు డా॥అక్కినేని నాగేశ్వరరావు అందుకున్నారు. ఆ తర్వాత దిలీప్‌కుమార్ (1997), శివాజీగణేశన్ (1998), లతామంగేష్కర్ (1999), డా॥భానుమతీ రామకృష్ణ (2000), హృషికేశ్ ముఖర్జీ (2001), డా॥రాజ్‌కుమార్ (2002) అందుకున్నారు.


ఆ తర్వాత ఆరేళ్లవరకూ ఈ అవార్డ్ ఊసే లేదు. అవార్డ్ విషయంలో ప్రతిష్టంభన ఏర్పడటానికి ప్రభుత్వం మారడం కూడా ఒక కారణం. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సహజంగానే ఎన్.టి.ఆర్. జాతీయ ఫిలిం అవార్డ్ మీద దృష్టి సారించలేదు. దీనిపై ఎన్నో విమర్శలు చెలరేగాయి. అయినా ప్రభుత్వం చలించ లేదు. ఎట్టకేలకు ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఆనాటి ముఖ్యమంత్రి డా॥వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఈ అవార్డ్ విషయంలో అకారణంగా నాలుగేళ్లపాటు ఏర్పడిన ప్రతిష్టంభనని తొలగిస్తూ.. నాలుగేళ్ల అవార్డులను ఒకేసారి ఇస్తున్నట్లు అక్టోబర్ 20, 2008న ప్రకటించారు. హీరో కృష్ణ (2003), సంగీత దర్శకుడు ఇళయరాజా (2004), కన్నడ చిత్రరంగ రెబల్‌స్టార్, రాజకీయవేత్త అంబరీష్ (2005), వహిదా రెహమాన్ (2006) ఈ అవార్డులు అందుకున్నారు. 2007కి డా॥దాసరి నారాయణరావు, 2008 సంవత్సరానికి జమున ఎన్.టి.ఆర్. జాతీయ ఫిలిం అవార్డులు పొందారు. ■




# ఎన్.టి.ఆర్. నటించిన చిత్రాలు

| నెం. | చిత్రంపేరు | విడుదల తేది | నిర్మాత | దర్శకత్వం | హీరోయిన్ |
|---|---|---|---|---|---|
| 1. | మనదేశం | 24-11-1949 | మీర్జాపురం రాజా | ప్రసాద్ | - |
| 2. | షావుకారు | 07-04-1950 | నాగిరెడ్డి, చక్రపాణి | ఎల్.వి.ప్రసాద్ | జానకి |
| 3. | పల్లెటూరిపిల్ల | 27-04-1950 | బి.ఎ.సుబ్బారావు | బి.ఎ.సుబ్బారావు | అంజలి |
| 4. | మాయారంభ (తమిళ్) | 15-09-1950 | నందలాల్ బటేలియా | టి.పి.సుందరం | జి.వరలక్ష్మి |
| 5. | మాయారంభ | 22-09-1950 | నందలాల్ బటేలియా | టి.పి.సుందరం | జి.వరలక్ష్మి |
| 6. | సంసారం | 29-12-1950 | కె.వి.కృష్ణ, రంగనాథదాసు | ఎల్.వి.ప్రసాద్ | లక్ష్మీరాజ్యం |
| 7. | పాతాళభైరవి | 15-03-1951 | నాగిరెడ్డి, చక్రపాణి | కె.వి.రెడ్డి | మాలతి |
| 8. | పాతాళభైరవి(తమిళ్) | 17-05-1951 | నాగిరెడ్డి, చక్రపాణి | కె.వి.రెడ్డి | మాలతి |
| 9. | మల్లీశ్వరి | 20-12-1951 | బి.ఎన్.రెడ్డి | బి.ఎన్.రెడ్డి | భానుమతి |
| 10. | పెళ్లిచేసిచూడు | 29-02-1952 | నాగిరెడ్డి, చక్రపాణి | ఎల్.వి.ప్రసాద్ | జి.వరలక్ష్మి |





| | | | | | |
|---|---|---|---|---|---|
| 11. | పల్లెటూరు | 19-10-1952 | పి.శివరామయ్య | తాతినేని ప్రకాశరావు | సావిత్రి |
| 12. | దాసి | 26-11-1952 | పి.లక్ష్మీరాజ్యం | సి.వి.రంగనాథదాస్ | లక్ష్మీరాజ్యం |
| 13. | కళ్యాణం పణ్ణిపార్ | 15-08-1952 | నాగిరెడ్డి, చక్రపాణి | ప్రసాద్ | జి.వరలక్ష్మి |
| 14. | వెలైక్కారి మగల్ | 1952 | పి.లక్ష్మీరాజ్యం | సి.వి.రంగనాథదాస్ | లక్ష్మీరాజ్యం |
| 15. | పాతాళభైరవి(హిందీ) | 1952 | ఎస్.ఎస్.వాసన్ | కె.వి.రెడ్డి | మాలతి |
| 16. | అమ్మలక్కలు | 12-03-1953 | లీనా చెట్టియార్ | డి.యోగానంద్ | పద్మిని |
| 17. | అమ్మలక్కలు(తమిళ్) | 12-03-1953 | లీనా చెట్టియార్ | డి.యోగానంద్ | పద్మిని |
| 18. | పిచ్చిపుల్లయ్య | 17-07-1953 | ఎన్.త్రివిక్రమరావు | తాతినేని ప్రకాశరావు | కృష్ణకుమారి |
| 19. | చండీరాణి | 28-08-1953 | భానుమతి | భానుమతీ రామకృష్ణ | భానుమతి |
| 20. | చండీరాణి(తమిళ్) | 28-08-1953 | భానుమతి | భానుమతీ రామకృష్ణ | భానుమతి |
| 21. | చండీరాణి(హిందీ) | 28-08-1953 | భానుమతి | భానుమతీ రామకృష్ణ | భానుమతి |
| 22. | చంద్రహారం | 06-01-1954 | నాగిరెడ్డి, చక్రపాణి | కమలాకర కామేశ్వరరావు | శ్రీరంజని |
| 23. | చంద్రహార్ (తమిళ్) | 06-01-1954 | నాగిరెడ్డి, చక్రపాణి | కమలాకర కామేశ్వరరావు | శ్రీరంజని |
| 24. | వద్దంటే డబ్బు | 19-02-1954 | హెచ్.ఎం.రెడ్డి | వై.ఆర్.స్వామి | జానకి |
| 25. | తోడుదొంగలు | 15-04-1954 | ఎన్.త్రివిక్రమరావు | డి.యోగానంద్ | హేమలత |
| 26. | రాజు-పేద | 25-06-1954 | బి.ఎ.సుబ్బారావు | బి.ఎ.సుబ్బారావు | లక్ష్మీరాజ్యం |
| 27. | సంఘం | 10-07-1954 | ఎ.వి.మెయ్యప్పన్ | ఎం.వి.రామన్ | అంజలి |
| 28. | సంఘం(తమిళ్) | 10-07-1954 | ఎ.వి.మెయ్యప్పన్ | ఎం.వి.రామన్ | అంజలి |
| 29. | అగ్గిరాముడు | 05-08-1954 | యస్.యం.శ్రీరాములునాయుడు | -శ్రీరాములునాయుడు | భానుమతి |
| 30. | పరివర్తన | 01-09-1954 | - | తాతినేని ప్రకాశరావు | సావిత్రి |
| 31. | ఇద్దరు పెళ్లాలు | 06-10-1954 | నాగూర్ | నాగూర్ | జమున |
| 32. | మిస్సమ్మ | 12-01-1955 | నాగిరెడ్డి, చక్రపాణి | ఎల్.వి.ప్రసాద్ | సావిత్రి |
| 33. | రేచుక్క | 25-03-1955 | ఘంటసాల కృష్ణమూర్తి | పి.పుల్లయ్య | అంజలి |
| 34. | విజయగౌరి | 30-06-1955 | లీనా చెట్టియార్ | డి.యోగానంద్ | పద్మిని |








| | | | | | |
|---|---|---|---|---|---|
| 35. | చెరపకురా చెడేవు | 06-07-1955 | భాస్కరరావు | భాస్కరరావు | జానకి |
| 36. | జయసింహ | 21-10-1955 | త్రివిక్రమరావు | డి.యోగానంద్ | అంజలి, వహిదా |
| 37. | కన్యాశుల్కం | 26-08-1955 | డి.ఎల్.నారాయణ | పి.పుల్లయ్య | జానకి |
| 38. | సంతోషం | 24-12-1955 | సోమసుందరం | సి.పి.దీక్షిత్ | అంజలి, జమున |
| 39. | తెనాలి రామకృష్ణ | 12-01-1956 | బి.ఎస్.రంగా | బి.ఎస్.రంగా | భానుమతి, సంధ్య |
| 40. | తెనాలి రామన్ (తమిళ్) | 03-02-1956 | బి.ఎస్.రంగా | బి.ఎస్.రంగా | భానుమతి, సంధ్య |
| 41. | చింతామణి | 11-04-1956 | రామకృష్ణ | రామకృష్ణ | భానుమతి, జమున |
| 42. | జయంమనదే | 04-05-1956 | సుందర్‌లాల్ నహతా | తాతినేని ప్రకాశరావు | అంజలి |
| 43. | సొంతవూరు | 23-05-1956 | జి.సదాశివుడు | ఇ.ఎస్.ఎన్.మూర్తి | రాజసులోచన |
| 44. | చిరంజీవులు | 25-06-1956 | డి.యల్.నారాయణ | వేదాంతం రాఘవయ్య | జమున |
| 45. | ఉమాసుందరి | 20-07-1956 | యం.సోమసుందరం | పి.పుల్లయ్య | శ్రీరంజని |
| 46. | మర్మవీరన్(తమిళ్) | 03-08-1956 | వి.గోవిందరాజన్ | టి.ఆర్.రఘునాథ్ | - |
| 47. | గౌరీమహత్యం | 05-10-1956 | - | డి.యోగానంద్ | శ్రీరంజని |
| 48. | పెంకిపెళ్ళాం | 06-12-1956 | ఎస్.భావనారాయణ | కె.కామేశ్వరరావు | రాజసులోచన |
| 49. | మరుమగళ్ (తమిళ్) | 06-12-1956 | - | - | - |
| 50. | చరణదాసి | 20-12-1956 | ఎ.శంకరరెడ్డి | తాతినేని ప్రకాశరావు | అంజలి |
| 51. | నయా ఆద్మీ | 24-12-1956 | - | - | - |
| 52. | భాగ్యరేఖ | 20-02-1957 | వసంతకుమార్‌రెడ్డి | బి.యన్.రెడ్డి | జమున |
| 53. | మాయాబజార్ | 27-03-1957 | నాగిరెడ్డి, చక్రపాణి | కె.వి.రెడ్డి | సంధ్య |
| 54. | మాయాబజార్(తమిళ్) | 12-04-1957 | నాగిరెడ్డి, చక్రపాణి | కె.వి.రెడ్డి | సంధ్య |
| 55. | వీరకంకణం | 16-05-1957 | సుందరం | జి.ఆర్.రావు | కృష్ణకుమారి |
| 56. | సంకల్పం | 19-05-1957 | రంగనాథ దాస్ | రంగనాథదాస్ | కుసుమ |
| 57. | వినాయకచవితి | 22-08-1957 | కె.గోపాలరావు | సముద్రాల రాఘవాచార్య | జమున, కృష్ణకుమారి |








| | | | | | |
|---|---|---|---|---|---|
| 58. | భలే అమ్మాయిలు | 06-09-1957 | పి.యల్.నరసు | వేదాంతం రాఘవయ్య | సావిత్రి |
| 59. | సతీ అనసూయ (గెస్ట్) | 27-10-1957 | సుందర్‌లాల్ నహతా | కె.బి.నాగభూషణం | జమున |
| 60. | సారంగధర | 01-11-1957 | నామదేవరెడ్డియార్ | వి.ఎస్.రాఘవన్ | రాజసులోచన |
| 61. | కుటుంబగౌరవం | 07-11-1957 | బి.ఎస్.రంగా | బి.ఎస్.రంగా | సావిత్రి |
| 62. | పాండురంగ మహాత్మ్యం | 28-11-1957 | త్రివిక్రమరావు | కె.కామేశ్వరరావు | అంజలి, బి.సరోజ |
| 63. | అన్నాతమ్ముడు | 15-02-1958 | కె.బి.నాగభూషణం | సి.ఎస్.రావు | - |
| 64. | భూకైలాస్ | 20-03-1958 | ఎ.వి.మెయ్యప్పన్ | కె.శంకర్ | జమున |
| 65. | సంపూర్ణ రామాయణం(తమిళ్) | 14-04-1958 | ఎమ్.ఎ.వేణు | కె.సోము | పద్మిని |
| 66. | శోభ | 01-05-1958 | వసంతకుమార్‌రెడ్డి | కె.కామేశ్వరరావు | అంజలి |
| 67. | రాజనందిని | 04-07-1958 | ఎమ్.జగన్నాథరావు | వేదాంతం రాఘవయ్య | అంజలి |
| 68. | మంచిమనసుకు మంచిరోజులు | 15-08-1958 | సుందర్‌లాల్ నహతా | సి.ఎస్.రావు | గిరిజ |
| 69. | కార్తవరాయని కథ | 18-10-1958 | రామన్న | రామన్న | సావిత్రి |
| 70. | ఇంటిగుట్టు | 07-11-1958 | ఆకెళ్ళ శాస్త్రి | వేదాంతం రాఘవయ్య | సావిత్రి |
| 71. | అప్పుచేసి పప్పుకూడు | 14-01-1959 | నాగిరెడ్డి, చక్రపాణి | ప్రసాద్ | సావిత్రి |
| 72. | రేచుక్క పగటిచుక్క | 14-05-1959 | ఎన్.త్రివిక్రమరావు | కమలాకర కామేశ్వరరావు | జానకి |
| 73. | శభాష్‌రాముడు | 04-09-1959 | సుందర్‌లాల్ నహతా | సి.యస్.రావు | దేవిక |
| 74. | దైవబలం | 17-09-1959 | పొన్నలూరి బ్రదర్స్ | వసంతకుమార్‌రెడ్డి | జయశ్రీ |
| 75. | రాజసెవై (తమిళ్) | 02-10-1959 | - | కమలాకర కామేశ్వరరావు | జానకి |
| 76. | బాలనాగమ్మ | 09-10-1959 | ఎస్.ఎస్.రాజు, సి.ఎస్.రాజు | వేదాంతం రాఘవయ్య | అంజలి |
| 77. | వచ్చినకోడలు నచ్చింది | 16-10-1959 | - | డి.యోగానంద్ | జమున |
| 78. | బండరాముడు | 06-11-1959 | డి.బి.నారాయణ | పి.పుల్లయ్య | సావిత్రి |
| 79. | శ్రీవేంకటేశ్వరమహాత్మ్యం | 09-01-1960 | పి.వెంకటేశ్వర్లు | పి.పుల్లయ్య | సావిత్రి, వరలక్ష్మి |
| 80. | రాజమకుటం | 24-02-1960 | బి.యన్.రెడ్డి | బి.యన్.రెడ్డి | రాజసులోచన |









| | | | | | |
|---|---|---|---|---|---|
| 81. | రాజమకుటం(తమిళ్) | 24-02-1960 | బి.యన్.రెడ్డి | బి.యన్.రెడ్డి | రాజసులోచన |
| 82. | రాణి రత్నప్రభ | 27-05-1960 | బి.ఎ.సుబ్బారావు | బి.ఎ.సుబ్బారావు | అంజలి |
| 83. | దేవాంతకుడు | 07-07-1960 | సి.పుల్లయ్య | సి.పుల్లయ్య | కృష్ణకుమారి |
| 84. | విమల | 11-08-1960 | ఎస్.ఎం.ఎస్.నాయుడు | ఎస్.ఎం.ఎస్.నాయుడు | సావిత్రి |
| 85. | దీపావళి | 22-09-1960 | కె.గోపాలరావు | ఎస్.రజనీకాంత్ | సావిత్రి |
| 86. | భట్టి విక్రమార్క | 28-09-1960 | పి.వి.వి.ఎస్.మూర్తి | జంపన | అంజలి |
| 87. | కాడెద్దులు ఎకరం నేల | 06-10-1960 | పొన్నలూరి బ్రదర్స్ | జంపన | జానకి |
| 88. | భక్త రఘునాథ్ (గెస్ట్) | 04-11-1960 | జ.సదాశివుడు | సముద్రాల | - |
| 89. | సీతారామకళ్యాణం | 06-01-1961 | ఎన్.త్రివిక్రమరావు | ఎన్.టి.రామారావు | బి.సరోజాదేవి |
| 90. | ఇంటికి దీపం ఇల్లాలే | 26-01-1961 | టి.ఆర్.రామన్న | వి.ఆర్.రెడ్డి | బి.సరోజాదేవి |
| 91. | సతీసులోచన (ఇంద్రజిత్) | 05-05-1961 | ఎస్.రజనీకాంత్ | ఎస్.రజనీకాంత్ | అంజలి |
| 92. | పెండ్లిపిలుపు | 05-05-1961 | డి.బి.నారాయణ | ఆమంచర్ల శేషగిరిరావు | దేవిక |
| 93. | శాంత | 14-07-1961 | యం.ఆర్.జయరాం | యం.అప్పారావు | అంజలి |
| 94. | జగదేకవీరుని కథ | 09-08-1961 | కె.వి.రెడ్డి | కె.వి.రెడ్డి | బి.సరోజాదేవి |
| 95. | కలిసివుంటే కలదుసుఖం | 08-09-1961 | రామకృష్ణప్రసాద్ | తాపీ చాణక్య | సావిత్రి |
| 96. | టాక్సీ రాముడు | 18-10-1961 | కె.ఎ.ఎస్.రాజు | వి.మధుసూదనరావు | దేవిక |
| 97. | గులేబకావళికథ | 05-01-1962 | ఎన్.త్రివిక్రమరావు | ఎన్.టి.రామారావు | జమున, నాగరత్న |
| 98. | గాలిమేడలు | 09-02-1962 | బి.ఆర్.పంతులు | బి.ఆర్.పంతులు | దేవిక |
| 99. | టైగర్‌రాముడు | 08-03-1962 | శ్రీరాములు, పంతం | సి.యస్.రావు | రాజసులోచన |
| 100. | భీష్మ | 19-04-1962 | బి.ఎ.సుబ్బారావు | బి.ఎ.సుబ్బారావు | - |
| 101. | దక్షయజ్ఞం | 10-05-1962 | కె.బి.నాగభూషణం | కె.బి.నాగభూషణం | దేవిక |
| 102. | గుండమ్మకథ | 07-06-1962 | నాగిరెడ్డి, చక్రపాణి | కె.కామేశ్వరరావు | సావిత్రి |
| 103. | మహామంత్రి తిమ్మరుసు | 26-07-1962 | ఎస్.రామబ్రహ్మం | కె.కామేశ్వరరావు | దేవిక, ఎస్.వరలక్ష్మి |







| | | | | | |
|---|---|---|---|---|---|
| 104. | స్వర్ణమంజరి | 10-08-1962 | ఆదినారాయణరావు | వేదాంతం | అంజలి |
| 105. | రక్తసంబంధం | 01-11-1962 | సుందర్‌లాల్‌నహతా | వి.మధుసూదనరావు | దేవిక |
| 106. | ఆత్మబంధువు | 14-12-1962 | రామకృష్ణప్రసాద్ | రామకృష్ణ | సావిత్రి |
| 107. | శ్రీ కృష్ణార్జునయుద్ధం | 09-01-1963 | కె.వి.రెడ్డి | కె.వి.రెడ్డి | ఎస్.వరలక్ష్మి |
| 108. | ఇరుగు పొరుగు | 11-01-1963 | సి.విజయసారథి | ఐ.యన్.మూర్తి | కృష్ణకుమారి |
| 109. | పెంపుడు కూతురు | 06-02-1963 | బి.ఆర్.పంతులు | బి.ఆర్.పంతులు | జానకి |
| 110. | వాల్మీకి | 09-02-1963 | హబీబుల్లా | సి.యస్.రావు | రాజసులోచన |
| 111. | సవతికొడుకు | 22-02-1963 | నవీనా, చిత్ర | వై.రంగారావు | జానకి |
| 112. | లవకుశ | 29-03-1963 | ఎ.శంకర్‌రెడ్డి | సి.పుల్లయ్య, సి.ఎస్.రావు | అంజలీదేవి |
| 113. | లవకుశ(తమిళ్) | 1963 | ఎ.శంకర్‌రెడ్డి | సి.పుల్లయ్య, సి.ఎస్.రావు | అంజలీదేవి |
| 114. | పరువు ప్రతిష్ఠ | 09-05-1963 | జూపూడి వెంకటేశ్వరరావు | యం.అప్పారావు | అంజలి, గిరిజ |
| 115. | ఆప్తమిత్రులు | 29-05-1963 | నాగభూషణం | కె.నాగభూషణం | కృష్ణకుమారి |
| 116. | బందిపోటు | 15-08-1963 | సుందర్‌లాల్‌నహతా, డూండీ | బి.విఠలాచార్య | కృష్ణకుమారి |
| 117. | లక్షాధికారి | 27-09-1963 | డి.వెంకటపతిరెడ్డి | వి.మధుసూదనరావు | కృష్ణకుమారి |
| 118. | తిరుపతమ్మకథ | 04-10-1963 | దోనేపూడి కృష్ణమూర్తి | బి.యస్.నారాయణ | కృష్ణకుమారి |
| 119. | నర్తనశాల | 11-10-1963 | శ్రీధరరావు, రాజ్యం | కె.కామేశ్వరరావు | సావిత్రి |
| 120. | మంచి చెడు | 07-11-1963 | రామన్న | రామన్న | బి.సరోజాదేవి |
| 121. | కర్ణన్ (తమిళ్) | 14-01-1964 | బి.ఆర్.పంతులు | బి.ఆర్.పంతులు | - |
| 122. | గుడిగంటలు | 14-01-1964 | సుందర్‌లాల్‌నహతా, డూండీ | వి.మధుసూదనరావు | కృష్ణకుమారి |
| 123. | మర్మయోగి | 22-02-1964 | ఎస్.కె.హబిబుల్లా | బి.ఎ.సుబ్బారావు | కృష్ణకుమారి |
| 124. | కలవారికోడలు | 14-03-1964 | కె.హేమాంబధరరావు | కె.హేమాంబధరరావు | కృష్ణకుమారి |
| 125. | దేశద్రోహులు | 07-05-1964 | బోళ్ల సుబ్బారావు | బోళ్ల సుబ్బారావు | దేవిక |
| 126. | రాముడు భీముడు | 21-05-1964 | డి.రామానాయుడు | చాణక్య | జమున, ఎల్.విజయలక్ష్మి |








| | | | | | |
|---|---|---|---|---|---|
| 127. | సత్యనారాయణ మహాత్యం | 27-06-1964 | పి.సత్యనారాయణ | రజనీకాంత్ | కృష్ణకుమారి |
| 128. | అగ్గిపిడుగు | 31-07-1964 | బి.విఠలాచార్య | బి.విఠలాచార్య | కృష్ణకుమారి, రాజశ్రీ |
| 129. | దాగుడు మూతలు | 21-08-1964 | డి.బి.నారాయణ | ఆదుర్తి సుబ్బారావు | బి.సరోజాదేవి |
| 130. | శభాష్ సూరి | 19-09-1964 | టి.ఆర్.చక్రవర్తి | ఐ.యన్.మూర్తి | కృష్ణకుమారి |
| 131. | బభ్రువాహన | 22-10-1964 | సి.జగన్మోహనరావు | సముద్రాల సీనియర్ | ఎస్.వరలక్ష్మి |
| 132. | వివాహబంధం | 23-10-1964 | రామకృష్ణ | రామకృష్ణ | భానుమతి |
| 133. | మంచిమనిషి | 11-11-1964 | కె.సుబ్బరాజు | కె.ప్రత్యగాత్మ | జమున |
| 134. | వారసత్వం | 19-11-1964 | యం.రంగా, శాస్త్రి | చాణక్య | అంజలి |
| 135. | బొబ్బిలియుద్ధం | 04-12-1964 | సీతారామ్ | సీతారామ్ | భానుమతి |
| 136. | భక్తరామదాసు (గెస్ట్) | 23-12-1964 | నాగయ్య | వి.నాగయ్య | - |
| 137. | నాదీ ఆడజన్మే | 07-01-1965 | ఎస్.వి.రంగారావు | ఎ.సి.త్రిలోకచందర్ | సావిత్రి |
| 138. | పాండవ వనవాసం | 14-01-1965 | ఎ.ఎస్.ఆర్.ఆంజనేయులు | కె.కామేశ్వరరావు | సావిత్రి |
| 139. | దొరికితే దొంగలు | 26-02-1965 | డి.ఎల్.నారాయణ | పి.సుబ్రహ్మణ్యం | జమున |
| 140 | మంగమ్మ శపథం | 06-03-1965 | డి.వి.యస్.రాజు | బి.విఠలాచార్య | జమున, ఎల్.విజయలక్ష్మి |
| 141. | సత్య హరిశ్చంద్ర | 22-04-1965 | కె.వి.రెడ్డి | కె.వి.రెడ్డి | ఎస్.వరలక్ష్మి |
| 142. | తోడు నీడ | 12-05-1965 | ఎన్.ఎన్.భట్, వి.రామిరెడ్డి | ఆదుర్తి సుబ్బారావు | జమున, భానుమతి |
| 143. | ప్రమీలార్జునీయం | 11-06-1965 | అదిబాబు, నాగుమణి | యం.మల్లికార్జునరావు | బి.సరోజాదేవి |
| 144. | దేవత | 24-07-1965 | బి.పురుషోత్తం | కె.హేమాంబధరరావు | సావిత్రి |
| 145. | వీరాభిమన్యు | 12-08-1965 | సుందర్‌లాల్‌నహతా, డూండీ | వి.మధుసూదనరావు | - |
| 146. | విశాల హృదయాలు | 09-09-1965 | డి.కృష్ణమూర్తి | బి.యస్.నారాయణ | కృష్ణకుమారి |
| 147. | సి.ఐ.డి. | 23-09-1965 | నాగిరెడ్డి, చక్రపాణి | చాణక్య | జమున |
| 148. | ఆడబ్రతుకు | 12-11-1965 | యస్.యస్.వాసన్ | వేదాంతం రాఘవయ్య | దేవిక |
| 149. | శ్రీకృష్ణపాండవీయం | 13-01-1966 | త్రివిక్రమరావు | ఎన్.టి.రామారావు | కె.ఆర్.విజయ |









| | | | | | |
|---|---|---|---|---|---|
| 149. | రాజసూయం (తమిళ్) | 14-01-1966 | త్రివిక్రమరావు | ఎన్.టి.రామారావు | కె.ఆర్.విజయ |
| 150. | పల్నాటియుద్ధం | 18-02-1966 | వై.లక్ష్మయ్యచౌదరి | జి.రామినీడు | భానుమతి, అంజలి |
| 151. | శకుంతల | 03-03-1966 | శ్రీధరరావు, రాజ్యం | కె.కామేశ్వరరావు | బి.సరోజాదేవి |
| 152. | పరమానందయ్య శిష్యుల కథ | 07-04-1966 | తోట సుబ్బారావు | సి.పుల్లయ్య | కె.ఆర్.విజయ |
| 153. | శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు కథ | 06-05-1966 | డి.ఎల్.ఎన్.చౌదరి | ఎ.కె.శేఖర్ | జమున |
| 154. | మంగళసూత్రం | 19-05-1966 | ఎ.కె.వేలన్ | ఎ.కె.వేలన్ | దేవిక |
| 155. | అగ్గిబరాట | 02-06-1966 | బి.విఠలాచార్య | బి.విఠలాచార్య | రాజశ్రీ |
| 156. | సంగీతలక్ష్మి | 07-07-1966 | పి.నరసింగరావు | గిడుతూరి సూర్యం | జమున |
| 157. | శ్రీకృష్ణతులాభారం | 25-08-1966 | డి.రామానాయుడు | కె.కామేశ్వరరావు | జమున, అంజలి |
| 158. | పిడుగురాముడు | 10-09-1966 | డి.వి.ఎస్.రాజు | బి.విఠలాచార్య | రాజశ్రీ, ఎల్.వి |
| 159. | అడుగుజాడలు | 29-09-1966 | ఎం.సాంబశివరావు, జి.వందనం | చాణక్య | జమున |
| 160. | డాక్టర్ ఆనంద్ | 14-10-1966 | డి.వి.రెడ్డి | వి.మధుసూదనరావు | కాంచన, అంజలి |
| 161. | గోపాలుడు-భూపాలుడు | 13-01-1967 | వై.వి.రావు | జి.విశ్వనాథం | జయలలిత, రాజశ్రీ |
| 162. | నిర్దోషి | 02-03-1967 | ఎస్.రామబ్రహ్మం | వి.దాదామిరాసీ | సావిత్రి, అంజలి |
| 163. | కంచుకోట | 22-03-1967 | యు.విశ్వేశ్వరరావు | సి.యస్.రావు | సావిత్రి, దేవిక |
| 164. | భువనసుందరికథ | 07-04-1967 | తోట సుబ్బారావు | సి.పుల్లయ్య | కృష్ణకుమారి |
| 165. | ఉమ్మడి కుటుంబం | 20-04-1967 | త్రివిక్రమరావు | డి.యోగానంద్ | కృష్ణకుమారి |
| 166. | భామావిజయం | 29-06-1967 | సోమశేఖర్, రాధాకృష్ణ | సి.పుల్లయ్య | దేవిక |
| 167. | నిండుమనసులు | 10-08-1967 | ఎం.జగన్నాథరావు | ఎస్.డి.లాల్ | దేవిక |
| 168. | స్త్రీ జన్మ | 31-08-1967 | డి.రామానాయుడు | కె.యస్.ప్రకాశరావు | కృష్ణకుమారి |
| 169. | శ్రీకృష్ణావతారం | 12-10-1967 | ఎ.పుండరీకాక్షయ్య | కె.కామేశ్వరరావు | దేవిక, కాంచన |
| 170. | పుణ్యవతి | 03-11-1967 | వాసూమీనన్ | దాదామిరాసీ | కృష్ణకుమారి |
| 171. | ఆడపడుచు | 30-11-1967 | కె.హేమాంబధరరావు | కె.హేమాంబధరరావు | కృష్ణకుమారి |









| | | | | | |
|---|---|---|---|---|---|
| 172. | చిక్కడు దొరకడు | 21-12-1967 | పోట్లూరి వెంకటనారాయణ | బి.విఠలాచార్య | జయలలిత |
| 173. | భక్తరామదాసు(తమిళ్) | - | నాగయ్య | వి.నాగయ్య | - |
| 174. | ఉమాచండీగౌరీశంకరుల కథ | 11-01-1968 | కె.వి.రెడ్డి | కె.వి.రెడ్డి | బి.సరోజాదేవి |
| 175. | నిలువుదోపిడి | 25-01-1968 | యు.విశ్వేశ్వరరావు | సి.ఎస్.రావు | దేవిక |
| 176. | తల్లిప్రేమ | 08-03-1968 | యం.అజయ్ | శ్రీకాంత్ | సావిత్రి |
| 177. | తిక్కశంకరయ్య | 29-03-1968 | డి.వి.యస్.రాజు | డి.యోగానంద్ | కృష్ణకుమారి, జయలలిత |
| 178. | రాము | 04-05-1968 | మురుగన్, కుమరన్, శరవణన్ | ఎ.సి.త్రిలోకచందర్ | జమున |
| 179. | కలిసొచ్చిన అదృష్టం | 10-08-1968 | యం.జగన్నాథరావు | కె.విశ్వనాథ్ | కాంచన |
| 180. | నిన్నేపెళ్లాడుతా | 30-08-1968 | బి.వి.శ్రీనివాస్ | బి.వి.శ్రీనివాస్ | భారతి |
| 181. | భాగ్యచక్రం | 13-09-1968 | పి.యస్.రెడ్డి | కె.వి.రెడ్డి | బి.సరోజాదేవి |
| 182. | నేనే మొనగాణ్ణి | 04-10-1968 | ఎస్.డి.లాల్ | ఎస్.డి.లాల్ | షీలా |
| 183. | బాగ్దాద్ గజదొంగ | 24-10-1968 | యోగానంద్ | డి.యోగానంద్ | జయలలిత |
| 184. | నిండుసంసారం | 05-12-1968 | పి.గంగాధరరావు | సి.ఎస్.రావు | కృష్ణకుమారి |
| 185. | వరకట్నం | 09-01-1969 | త్రివిక్రమరావు | ఎన్.టి.రామారావు | కృష్ణకుమారి |
| 186. | కథానాయకుడు | 27-02-1969 | కె.గోపాలకృష్ణ | కె.హేమాంబధరరావు | జయలలిత |
| 187. | భలేమాస్టారు | 27-03-1969 | సి.ఎస్.రాజు | ఎస్.డి.లాల్ | కాంచన |
| 188. | గండికోట రహస్యం | 01-05-1969 | డి.వి.ఎస్.రాజు | బి.విఠలాచార్య | జయలలిత, దేవిక |
| 189. | విచిత్ర కుటుంబం | 28-05-1969 | వి.కె.పి.సుంకవల్లి | కె.ఎస్.ప్రకాశరావు | సావిత్రి |
| 190. | కదలడు వదలడు | 09-07-1969 | కె.సీతారామస్వామి | బి.విఠలాచార్య | జయలలిత |
| 191. | నిండుహృదయాలు | 15-08-1969 | యం.జగన్నాథరావు | కె.విశ్వనాథ్ | వాణిశ్రీ |
| 192. | భలేతమ్ముడు | 18-09-1969 | ఎ.పుండరీకాక్షయ్య | బి.ఎ.సుబ్బారావు | కె.ఆర్.విజయ |
| 193. | అగ్గివీరుడు | 15-10-1969 | బి.వి.శ్రీనివాస్ | బి.వి.శ్రీనివాస్ | రాజశ్రీ |
| 194. | మాతృదేవత | 07-11-1969 | ఎ.పూర్ణచంద్రరావు | సావిత్రి | సావిత్రి |





| | | | | | |
|---|---|---|---|---|---|
| 195. | ఏకవీర | 04-12-1969 | డి.యల్.నారాయణ | సి.యస్.రావు | కె.ఆర్.విజయ, జమున |
| 196. | తల్లాపెళ్లామా | 08-01-1970 | త్రివిక్రమరావు | ఎన్.టి.రామారావు | చంద్రకళ |
| 197. | లక్ష్మీకటాక్షం | 12-03-1970 | పింజల సుబ్బారావు | బి.విఠలాచార్య | కె.ఆర్.విజయ, రాజశ్రీ |
| 198. | ఆలీబాబా 40 దొంగలు | 04-04-1970 | ఎన్.రామబ్రహ్మం | బి.విఠలాచార్య | జయలలిత |
| 199. | పెత్తందార్లు | 30-04-1970 | యు.విశ్వేశ్వరరావు | సి.యస్.రావు | విజయనిర్మల |
| 200. | విజయం మనదే | 15-07-1970 | ఎన్.సాంబశివరావు | బి.విఠలాచార్య | బి.సరోజాదేవి |
| 201. | చిట్టిచెల్లెలు | 29-07-1970 | మురుగన్, కుమరన్, శరవణన్ | యం.కృష్ణన్ | రాజశ్రీ |
| 202. | మాయని మమత | 13-08-1970 | బి.బాపయ్యపంతులు | కె.కామేశ్వరరావు | బి.సరోజాదేవి |
| 203. | మారిన మనిషి | 24-09-1970 | ఎస్.ఎస్.నహతా | సి.యస్.రావు | విజయనిర్మల |
| 204. | కోడలుదిద్దిన కాపురం | 21-10-1970 | త్రివిక్రమరావు | డి.యోగానంద్ | వాణిశ్రీ |
| 205. | ఒకే కుటుంబం | 25-12-1970 | సి.హెచ్.రాఘవరావు | ఎ.భీమ్‌సింగ్ | లక్ష్మి |
| 206. | శ్రీకృష్ణ విజయం | 11-01-1971 | యం.యస్.రెడ్డి | కె.కామేశ్వరరావు | జయలలిత, జమున |
| 207. | నిండు దంపతులు | 04-02-1971 | యం.జగన్నాథరావు | కె.విశ్వనాథ్ | సావిత్రి |
| 208. | రాజకోట రహస్యం | 12-03-1971 | యం.కె.గంగరాజు | బి.విఠలాచార్య | దేవిక |
| 209. | జీవితచక్రం | 30-04-1971 | పి.గంగాధరరావు | సి.యస్.రావు | వాణిశ్రీ, శారద |
| 210. | రైతుబిడ్డ | 19-05-1971 | కోట వెంకట్రామయ్య | బి.ఎ.సుబ్బారావు | వాణిశ్రీ |
| 211. | అదృష్ట జాతకుడు | 06-08-1971 | కె.హేమాంబధరరావు | కె.హేమాంబధరరావు | వాణిశ్రీ |
| 212. | చిన్ననాటి స్నేహితులు | 06-10-1971 | డి.వి.ఎస్.రాజు | కె.విశ్వనాథ్ | దేవిక |
| 213. | పవిత్ర హృదయాలు | 24-11-1971 | సి.యస్.రాజు | ఎ.సి.త్రిలోకచందర్ | చంద్రకళ |
| 214. | శ్రీ కృష్ణ సత్య | 24-12-1971 | త్రివిక్రమరావు | కె.వి.రెడ్డి | జయలలిత, దేవిక |
| 215. | తిరుడాదే తిరుడన్(తమిళ్) | 1971 | - | - | సావిత్రి |
| 216. | శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం | 18-05-1972 | డి.ఎన్.రాజు | సి.ఎస్.రావు | వాణిశ్రీ, దేవిక |
| 217. | కులగౌరవం | 18-10-1972 | త్రివిక్రమరావు | పేకేటి శివరావు | జయంతి, ఆరతి |





| | | | | | |
|---|---|---|---|---|---|
| 218. | బడిపంతులు | 23-11-1972 | పి.పేర్రాజు | పి.చంద్రశేఖరరెడ్డి | అంజలి |
| 219. | డబ్బుకులోకం దాసోహం | 12-01-1973 | ఎమ్.జగన్నాథరావు | డి.యోగానంద్ | జమున |
| 220. | దేశోద్ధారకులు | 29-03-1973 | యు.విశ్వేశ్వరరావు | సి.ఎస్.రావు | వాణిశ్రీ |
| 221. | ధనమా దైవమా | 24-05-1973 | డి.వి.ఎస్.రాజు | సి.ఎస్.రావు | జమున |
| 222. | దేవుడు చేసిన మనుషులు | 09-08-1973 | జి.హనుమంతరావు | వి.రామచంద్రరావు | జయలలిత |
| 223. | వాడేవీడు | 18-10-1973 | యన్.రామబ్రహ్మం | డి.యోగానంద్ | మంజుల |
| 224. | ఎర్రకోట వీరుడు | 14-12-1973 | గోపాలకృష్ణ | పార్థసారథి | సావిత్రి, బి.సరోజ |
| 225. | పల్లెటూరి చిన్నోడు | 09-01-1974 | బి.విఠలాచార్య | బి.విఠలాచార్య | మంజుల |
| 226. | అమ్మాయి పెళ్లి | 07-03-1974 | భానుమతి రామకృష్ణ | భానుమతి | భానుమతి |
| 227. | మనుషుల్లో దేవుడు | 05-04-1974 | ఎ.పుండరీకాక్షయ్య | బి.వి.ప్రసాద్ | వాణిశ్రీ, బి.సరోజ |
| 228. | తాతమ్మకల | 30-08-1974 | యన్.టి.రామారావు | యన్.టి.రామారావు | భానుమతి, కాంచన |
| 229. | నిప్పులాంటి మనిషి | 25-10-1974 | వై.వి.రావు | ఎస్.డి.లాల్ | లత |
| 230. | దీక్ష | 11-12-1974 | కోగంటి కుటుంబరావు | కె.ప్రత్యగాత్మ | జమున |
| 231. | శ్రీరామాంజనేయ యుద్ధం | 10-01-1975 | పి.వి.నారాయణరావు | బాపు | బి.సరోజాదేవి |
| 232. | కథానాయకుని కథ | 21-02-1975 | కె.డి.వి.ప్రసాద్ | డి.యోగానంద్ | వాణిశ్రీ |
| 233. | మాయా మశ్చీంద్ర | 09-05-1975 | పింజల సుబ్బారావు | బాబూ భాయి మిస్త్రీ | వాణిశ్రీ |
| 234. | సంసారం | 28-05-1975 | తాతినేని ప్రకాశరావు | తాతినేని ప్రకాశరావు | జమున |
| 235. | రాముని మించిన రాముడు | 12-06-1975 | యం.యస్.గోపీనాథ్ | యం.యస్.గోపీనాథ్ | వాణిశ్రీ, శ్రీవిద్య |
| 236. | అన్నదమ్ముల అనుబంధం | 04-07-1975 | ఎమ్.పీతాంబరం | ఎస్.డి.లాల్ | కాంచన |
| 237. | తీర్పు | 01-10-1975 | యు.విశ్వేశ్వరరావు | యు.విశ్వేశ్వరరావు | - |
| 238. | ఎదురులేని మనిషి | 12-12-1975 | సి.అశ్వనీదత్ | బాపయ్య | వాణిశ్రీ |
| 239. | వేములవాడ భీమకవి | 08-01-1976 | ఎన్.టి.రామారావు | డి.యోగానంద్ | విజయలలిత |
| 240. | ఆరాధన | 12-03-1976 | ఎ.పుండరీకాక్షయ్య | బి.వి.ప్రసాద్ | వాణిశ్రీ |




| | | | | | |
|---|---|---|---|---|---|
| 241. | మనుషులంతా ఒక్కటే | 07-04-1976 | డి.వెంకటేశ్వరరావు | దాసరి నారాయణరావు | మంజుల, జమున |
| 242. | మగాడు | 19-05-1976 | లక్ష్మీరాజ్యం. శ్రీధరరావు | ఎస్.డి.లాల్ | మంజుల |
| 243. | నేరం నాదికాదు ఆకలిది | 22-07-1976 | వై.వి.రావు | ఎస్.డి.లాల్ | మంజుల |
| 244. | బంగారు మనిషి | 25-08-1976 | పి.పేర్రాజు | ఎ.భీమ్‌సింగ్ | లక్ష్మి |
| 245. | మాదైవం | 17-09-1976 | మణియన్, లక్ష్మణన్ | ఎస్.ఎస్.బాలన్ | జయచిత్ర |
| 246. | మంచికి మరోపేరు | 09-12-1976 | యమ్.మనోహర్ | సి.యస్.రావు | పద్మప్రియ |
| 247. | దాన వీర శూర కర్ణ | 14-01-1977 | ఎన్.టి.రామారావు | ఎన్.టి.రామారావు | బి.సరోజాదేవి, ప్రభ |
| 248. | అడవిరాముడు | 28-04-1977 | సత్యనారాయణ, సూర్యనారాయణ | కె.రాఘవేంద్రరావు | జయప్రద |
| 249. | ఎదురీత | 22-07-1977 | ఎస్.రామచంద్రరావు | వి.మధుసూధనరావు | వాణిశ్రీ |
| 250. | చాణక్య చంద్రగుప్త | 25-08-1977 | ఎన్.టి.రామారావు | ఎన్.టి.రామారావు | మంజుల, జయప్రద |
| 251. | మా ఇద్దరి కథ | 23-09-1977 | కె.రంజిత్‌కుమార్ | నందమూరి రమేష్ | మంజుల, జయప్రద |
| 252. | యమగోల | 21-10-1977 | ఎస్.వెంకటరత్నం | తాతినేని రామారావు | జయప్రద |
| 253. | సతీ సావిత్రి | 04-01-1978 | ఎ.శంకరరెడ్డి | బి.ఎ.సుబ్బారావు | జమున |
| 254. | మేలుకొలుపు | 13-01-1978 | ఎ.పుండరీకాక్షయ్య | బి.వి.ప్రసాద్ | జయప్రద |
| 255. | అక్బర్ సలీం అనార్కలి | 15-03-1978 | ఎన్.టి.రామారావు | ఎన్.టి.రామారావు | జమున |
| 256. | రామకృష్ణులు | 08-06-1978 | వి.బి.రాజేంద్రప్రసాద్ | వి.బి.రాజేంద్రప్రసాద్ | జయసుధ |
| 257. | యుగపురుషుడు | 14-07-1978 | సి.అశ్వనీదత్ | కె.బాపయ్య | జయప్రద |
| 258. | రాజపుత్ర రహస్యం | 28-07-1978 | వై.లక్ష్మయ్యచౌదరి | ఎస్.డి.లాల్ | జయప్రద |
| 259. | సింహబలుడు | 11-08-1978 | డి.రంగరాజు | కె.రాఘవేంద్రరావు | వాణిశ్రీ |
| 260. | శ్రీరామ పట్టాభిషేకం | 07-09-1978 | ఎన్.టి.రామారావు | ఎన్.టి.రామారావు | సంగీత, జమున |
| 261. | సాహసవంతుడు | 06-10-1978 | కె.విద్యాసాగర్ | కె.బాపయ్య | వాణిశ్రీ |
| 262. | లాయర్ విశ్వనాథ్ | 17-11-1978 | వై.వి.రావు | ఎస్.డి.లాల్ | జయసుధ |
| 263. | కేడి నెం.1 | 15-12-1978 | కె.దేవీవరప్రసాద్ | కె.రాఘవేంద్రరావు | జయసుధ |






| | | | | | |
|---|---|---|---|---|---|
| 264. | డ్రైవర్‌రాముడు | 02-02-1979 | నందమూరి హరికృష్ణ | కె.రాఘవేంద్రరావు | జయసుధ |
| 265. | మావారి మంచితనం | 09-03-1979 | ఎ.పుండరీకాక్షయ్య | బి.ఎ.సుబ్బారావు | వాణిశ్రీ |
| 266. | శ్రీమద్విరాట్ పర్వం | 28-05-1979 | ఎన్.టి.రామారావు | ఎన్.టి.రామారావు | వాణిశ్రీ, ప్రభ |
| 267. | వేటగాడు | 05-07-1979 | యం.అర్జునరాజు | కె.రాఘవేంద్రరావు | శ్రీదేవి |
| 268. | టైగర్ | 05-09-1979 | పి.నారాయణరావు | నందమూరి రమేష్ | రాధా సలూజ |
| 269. | శ్రీ తిరుపతి వెంకటేశ్వర కళ్యాణం | 28-09-1979 | ఎన్.టి.రామారావు | ఎన్.టి.రామారావు | జయప్రద, జయసుధ |
| 270. | శృంగార రాముడు | 22-11-1979 | సత్య తాయ్ | కె.శంకర్ | లత |
| 271. | యుగంధర్ | 30-11-1979 | పి.విద్యాసాగర్ | కె.యస్.ఆర్.దాస్ | జయసుధ |
| 272. | ఛాలెంజ్ రాముడు | 12-01-1980 | టి.ప్రకాశరావు | టి.ఎల్.వి.ప్రసాద్ | జయప్రద |
| 273. | సర్కస్‌రాముడు | 01-03-1980 | కొవై చెళియన్ | దాసరి నారాయణరావు | జయప్రద, సుజాత |
| 274. | ఆటగాడు | 24-04-1980 | జి.రాజేంద్రప్రసాద్ | తాతినేని రామారావు | శ్రీదేవి |
| 275. | సూపర్‌మేన్ | 10-07-1980 | ఆర్.గోపాల్ | వి.మధుసూధనరావు | జయప్రద |
| 276. | రౌడి రాముడు కొంటె కృష్ణుడు | 15-08-1980 | ఎన్.టి.రామారావు | కె.రాఘవేంద్రరావు | శ్రీదేవి |
| 277. | సర్దార్ పాపారాయుడు | 30-10-1980 | క్రాంతికుమార్ | దాసరి నారాయణరావు | శ్రీదేవి, శారద |
| 278. | సరదా రాముడు | 14-11-1980 | ఎస్.రియాజ్ బాషా | కె.వాసు | జయసుధ |
| 279. | ప్రేమ సింహాసనం | 14-01-1981 | కె.విద్యాసాగర్ | బీరం మస్తాన్‌రావు | రతి, మంజుభార్గవి |
| 280. | గజదొంగ | 30-01-1981 | చలసాని గోపి | కె.రాఘవేంద్రరావు | శ్రీదేవి, జయసుధ |
| 281. | ఎవరు దేవుడు | 04-03-1981 | - | ఎ.భీమ్‌సింగ్ | జమున |
| 282. | తిరుగులేని మనిషి | 03-04-1981 | కె.దేవీవరప్రసాద్ | కె.రాఘవేంద్రరావు | రతి |
| 283. | సత్యం శివం | 28-05-1981 | డి.వెంకటేశ్వరరావు | కె.రాఘవేంద్రరావు | శ్రీదేవి |
| 284. | విశ్వరూపం | 25-07-1981 | కె.భానుప్రసాద్ | దాసరి నారాయణరావు | జయసుధ, అంబిక |
| 285. | అగ్గిరవ్వ | 14-08-1981 | ఎన్.టి.రామారావు | కె.బాపయ్య | శ్రీదేవి |
| 286. | కొండవీటి సింహం | 07-10-1981 | యం.అర్జునరాజు | కె.రాఘవేంద్రరావు | శ్రీదేవి |






| | | | | | |
|---|---|---|---|---|---|
| 287. | మహాపురుషుడు | 21-11-1981 | వి.మహేష్ | లక్ష్మీదీపక్ | జయసుధ |
| 288. | అనురాగదేవత | 09-01-1982 | నందమూరి హరికృష్ణ | తాతినేని రామారావు | శ్రీదేవి, జయసుధ |
| 289. | కలియుగ రాముడు | 13-03-1982 | డి.శ్రీరంగరాజు | కె.బాపయ్య | రతి |
| 290. | జస్టిస్ చౌదరి | 28-05-1982 | టి.త్రివిక్రమరావు | కె.రాఘవేంద్రరావు | శ్రీదేవి, శారద |
| 291. | బొబ్బిలిపులి | 09-07-1982 | వడ్డే రమేష్ | దాసరి నారాయణరావు | శ్రీదేవి, జయచిత్ర |
| 292. | వయ్యారి భామలు వగలమారి భర్తలు | 20-08-1982 | ఆర్.వి.గురుపాదం | కట్టా సుబ్బారావు | శ్రీదేవి |
| 293. | నాదేశం | 27-10-1982 | ఎస్.వెంకటరత్నం | కె.బాపయ్య | జయసుధ |
| 294. | సింహం నవ్వింది | 03-03-1983 | నందమూరి హరికృష్ణ | డి.యోగానంద్ | ప్రభ |
| 295. | చండశాసనుడు | 28-05-1983 | నందమూరి హరికృష్ణ | ఎన్.టి.రామారావు | రాధ |
| 296. | శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర | 29-11-1984 | నందమూరి హరికృష్ణ | ఎన్.టి.రామారావు | ప్రభ, కాంచన |
| 297. | బ్రహ్మర్షి విశ్వామిత్ర | 19-04-1991 | ఎన్.టి.రామారావు | ఎన్.టి.రామారావు | మీనాక్షిశేషాద్రి |
| 298. | సమ్రాట్ అశోక | 28-05-1992 | నందమూరి హరికృష్ణ | ఎన్.టి.రామారావు | వాణీవిశ్వనాథ్ |
| 299. | మేజర్ చంద్రకాంత్ | 23-04-1993 | మోహన్‌బాబు | కె.రాఘవేంద్రరావు | శారద |
| 300. | శ్రీనాథ కవిసార్వభౌముడు | 21-10-1993 | నందమూరి రామకృష్ణ | బాపు | జయసుధ |
| 301. | బ్రహ్మర్షి (హిందీ) | - | ఎన్.టి.రామారావు | ఎన్.టి.రామారావు | మీనాక్షిశేషాద్రి |



నందమూరి తారక రామారావు పేరు తలచుకోగానే అశేష ప్రేక్షక హృదయాల్లో ఆనందమూరి ఉప్పొంగిపోతుంది. ఆయన జన్మదినం సినీ పంచాంగంలో పర్వదినంగా గణనకెక్కింది. పురాణ పాత్రల పోషణలో అద్వితీయ నటుడుగా, తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ఆదర్శప్రాయుడిగా నిలిచిన ఎన్.టి.ఆర్. 60 ఏళ్ల నట ప్రస్థానానికి అక్షర రూపం ఇస్తూ నా ప్రియ మిత్రుడు వినాయకరావు చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

- పి.మురళీకృష్ణంరాజు

MEDHA
Entertainment
...with you always.



పురాణపాత్రల అద్వితీయ సృష్టిలో, మహెూదాత్త నటనలో
అనన్యుడు అనిపించుకున్న కారణ జన్ముడు, ఆరాధ్య రాముడు
ఎన్టీఆర్. ఆయన సినీ జీవిత చరిత్రను అక్షరబద్ధం చేసిన
సీనియర్ పాత్రికేయుడు వినాయకరావుకి అభినందనలు
తెలుపుతూ ఆయన ప్రయత్నం విజయవంతం కావాలని
ఆకాంక్షిస్తున్నాం...

ADITYA
MUSIC

ఆదిత్య మ్యూజిక్ అంటే అద్భుతమైన క్వాలిటి.
అందుకే యిరవై ఏళ్ళుగా ఆడియో రంగంలో అగ్రస్థానం.

ADITYA MUSIC (INDIA) PVT. LTD. Regd. Off: 3-5-1091/7, Venkateshwara Colony, Narayanaguda, Hyderabad-500029, A.P., INDIA.
Ph: 040-24752002, 24750080. Fax: 040-24752073 e-mail: info@adityamusicindia.com

moserbaer

hello happiness!

# హోంవీడియో రంగంలో చరిత్ర సృష్టిస్తున్న మోసర్‌బేర్


- హోం వీడియో రంగంలో భారతదేశంలో అగ్రస్థానంలో ఉన్న సంస్థ
- ఇంగ్లీష్, హిందీతోబాటు అన్ని ప్రాంతీయభాషల్లోనూ లభ్యం
- మూడు సినిమాలున్న అత్యున్నత ప్రమాణాలతో తయారైన సూపర్ డి.వి.డి.కేవలం రూ.32/- లకే.
- ఉచిత హోం డెలివరీ
- సదా సేవలో సన్నద్ధమై ఉండే టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, న్యూరిలీజెస్ గురించి ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్ సమాచారంతో వెబ్‌సైట్
- సినిమాలతో బాటు సీరియల్స్, ఆధ్యాత్మికత, యోగా, ప్రసిద్ధ కళాకారుల కచేరీలు, కార్యక్రమాలు, విద్య, విజ్ఞానం, క్రీడలు, యానిమేషన్, కార్టూన్ లకు చెందిన ఎన్నో టైటిల్స్
- డిస్క్‌లో ఏ తయారీ లోపం ఉన్నా ఉచిత రిప్లేస్‌మెంట్ కలిగించే సర్టిఫైడ్ క్వాలిటీ

## తెలుగులో అందుబాటులో ఉన్న వి.సి.డి.లు, డి.వి.డి.లు




అక్కినేని


## గుర్తుకొస్తున్నాయి






అక్కినేని ఆరున్నర దశాబ్దాల సినీ జీవన సర్వస్వం - స్వంత మాటల్లో!
సినీ ప్రముఖులందరి అభిప్రాయాలు - వారి మాటల్లో!
నటసమ్రాట్ నుండి అందరూ...
పంచుకోదగిన అనుభవాలు - అందుకోదగిన ఆలోచనలు - అనుసరించదగిన ఆదర్శాలు!
ఎప్పటికీ చెంతనుంచుకోదగిన అరుదైన, అపురూపమైన
సినీ సన్నివేశాల, గీతాంశాల సమ్మేళనం.... వాటి రూపకల్పన వెనుక గల ఆసక్తికర వాస్తవాలతో!

25

☆ BUY THE ORIGINAL COPY ☆ KILL PIRACY ☆


గలగలా ప్రవహించే గోదావరిని పలకరించినా
చిరచిరా పరుగులిడే కృష్ణమ్మని ప్రశ్నించినా
ఉత్తుంగ తరంగ తుంగభద్రని కదిలించినా
అవి చెప్పేది ఒక్కటే..
ఈ ప్రపంచం మొత్తం మీద ఎన్.టి.ఆర్.ని మించిన కళాకారుడు లేడు.. లేడు.. లేడు.. అని
గొప్ప నటన, గొ ప్ప జీవితం... రెండూ ఉదాత్తంగా జతకూడి ఒక వ్యక్తిలో ఒదిగి ఉండటం
ఒక్క ఎన్.టి.ఆర్. విషయంలోనే జరిగింది. ఎన్.టి.ఆర్. చిత్రాలు చూసి ఆనందించ
తగినవి. ఆయన జీవితం చదివి అనుసరించ దగ్గది. ఆ మహానటుని సినీ జీవిత కథను
అశేష అభిమానులకు అందిస్తున్న వినాయకరావుని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాం.
Volga
VIDEO'S
ఓల్గా ప్రసాద్, ఓల్గా బాబ్జీ



పెళ్ళి పట్టు చీరలకు
ప్రత్యేక మందిరం!
కళామందిర్
Andhra Pradesh • Karnataka
నటసార్వభౌముడు డా॥ ఎన్టీఆర్ సినీ జీవిత చరిత్రను
అక్షరబద్ధం చేసిన సీనియర్ పాత్రికేయులు శ్రీ వినాయకరావు గారికి
సినీస్టార్
కళామందిర్
MADHURA ENTERTAINMENT
హృదయపూర్వక అభినందనలు.



కళ మనిషి చేతిలో కనబడని ఆయుధం. అయితే కృషి, దీక్ష పట్టుదల ఆ ఆయుధానికి పదునులాంటివి. ఆ కృషి, దీక్ష, పట్టుదలకు ప్రత్యక్ష రూపం పద్మశ్రీ నందమూరి తారకరామారావుగారు. కృషితో ఆయన నటుడయ్యారు. దీక్షతో సాధన చేశారు. పట్టుదలతో ప్రగతి సాధించి తెలుగు చిత్ర పరిశ్రమకే ఆదర్శవ్యక్తిగా నిలిచారు. నా ఆరాధ్యదైవం రామారావుగారి 60ఏళ్ల నట ప్రస్థానాన్ని పుస్తక రూపంలో తెస్తున్న సీనియర్ జర్నలిస్ట్ వినాయకరావుగారికి అభినందనలు. ఆయన రాస్తున్న 'యుగానికి ఒక్కడు' పుస్తకం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆశిస్తున్నాను.

- వెలగపూడి రామకృష్ణబాబు

విశాఖపట్నం





కళ ప్రజా జీవితాలను ఎలా తీర్చిదిద్దుతుందో నిరూపించిన కళామూర్తి నందమూరి తారక రామారావు. అలాగే నటన ఒక ఎత్తు, నడత ఒక ఎత్తూ అని నిరూపించిన ఆదర్శకళాకారుడు ఆయన. దేశంలో ఏమూల ఏ హృదయం దెబ్బతిన్నా బాధపడిన పసి హృదయం రామారావుగారిది. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో ఆయన పోషించని పాత్ర లేదు. విభిన్న పాత్రలద్వారా భిన్నభిన్నమైన సత్యాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఉత్తమనటుడాయన.

ఆపదలకు అక్కరకు వచ్చిన చుట్టమని నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, ఆంధ్ర తిలకమని అన్నాదొరై వంటి రాజకీయ శ్రేష్ఠులు ప్రశంసించారు. తెలుగు ప్రజల అనుంగుబిడ్డగా, ఆరాధ్యదైవంగా పూజించే మూడక్షరాల శక్తి, మహోన్నత వ్యక్తి ఎన్.టి.ఆర్. తన మనసునే ఒక కళామందిరంగా మలుచుకున్న రామారావు గురించి సీనియర్ జర్నలిస్ట్ వినాయకరావు రాస్తున్న 'యుగానికి ఒక్కడు' పుస్తకం రామారావుగారి గురించి ఈ తరంవారికి తెలియని ఎన్నో విషయాలు చెప్పే గొప్ప పుస్తకం. ఆల్ ది బెస్ట్ వినాయకరావుగారు.

- సుధీష్ రాంబొట్ల
హైదరాబాద్





కృష్ణా జిల్లా నిమ్మకూరు లో పుట్టి నిజాయితీగల సబ్‌రిజిష్టార్‌గా ఉద్యోగం లో ఇమడలేక
నటుడిగా ఎదగాలనే తపనతో చెన్నై చేరి విశ్వవిఖ్యాత నటసార్వభౌమునిగా
ఎదిగి ప్రజలకు రామరాజ్యాన్ని అందించాలనే తపనతో తెలుగు దేశాధి
నేతగా అవతరించి ప్రజలమన్ననలు చూరగొని .
ప్రపంచ దేశాలలో తెలుగు తేజాన్ని ప్రకాశింపజేసిన తెలుగు తల్లి ముద్దు బిడ్డ
**" నందమూరి తారక రామారావు "** .
మీతో చిత్రాన్ని నిర్మించాలనే కోరిక మీ ఆశీస్సులతో మీ వారసుడు
**నందమూరి బాలకృష్ణ తో " శ్రీరామరాజ్యం"**
నిర్మించే అవకాశం కలిగినందుకు సదా నమస్సుమాంజలులు .
మీ చలనచిత్ర సమగ్ర సమాచారాన్ని పుస్తక రూపంలో అందించటానికి
అహర్నిశలు కృషి చేసిన "శ్రీ వినాయక రావు" కు అభినందనలు .

మీ
సాయిబాబు



శ్రీ సాయిబాబా మూవీస్








అకుంఠితమైన దీక్షాదక్షతలు,
అచంచలమైన ఆత్మవిశ్వాసం,
నిర్విరామ కృషి, అంతరాన్వేషణం,
నిశ్చలమైన మనోస్థయిర్యం,
కఠోరమైన క్రమశిక్షణ... ఇవన్నీ
విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, నటరత్న,
డాక్టర్ నందమూరి తారకరామారావుగారికి
పర్యాయపదాలై ఆయన్ని మహోన్నతమైన
వ్యక్తిగా తీర్చిదిద్దాయి. నటునిగా
అనితరసాధ్యమైన విజయాలను సాధించిన
రామారావుగారి సినీ జీవిత చరిత్రను
అక్షరబద్ధంగా చేస్తున్న జర్నలిస్ట్ మిత్రుడు
వినాయకరావుగారికి శుభాభివందనలు.
ఆయన ప్రయత్నం చరిత్రలో చిరస్థాయిగా
నిలిచిపోవాలని ఆశిస్తున్నాను.

**- అంబిక కృష్ణ**
ఏలూరు



19/10

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**నా ప్రియమైన సోదర సోదరీమణులారా!**

వ్యక్తికైనా, వ్యవస్థకైనా, ప్రభుత్వానికైనా... సమస్యలు ఎదురుకావడం, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకుపోవడం ఒక నిరంతర ప్రక్రియ. అయితే ముందుకు పోవడం అన్నది పేదలను ఆదుకుని అక్కున చేర్చుకునేదిగా ఉండాలి. ఇలాంటి లక్ష్యంతోనే ప్రపంచంలో ఎక్కడాలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. ఆ పథకాలన్నీ ప్రజా సంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని సమానంగా దృష్టిలో పెట్టుకుని రూపొందించినవి. తద్వారా నగరాలనే కాకుండా గ్రామాలనూ అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యసాధనకు మీ సహాయ సహకారాలను కొనసాగిస్తారని ఆశిస్తూ...

మీ
**కె. రోశయ్య**
*ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి*

**రాజీవ్ ఆరోగ్యశ్రీ**
- 942 వ్యాధులకు వర్తింపు
- పేదలకు నాణ్యమైన వైద్యం లక్ష్యం
- ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మందికి వైద్య పరీక్షలు
- 5 లక్షల మందికి శస్త్ర చికిత్సలు



**జలయజ్ఞం**
- కోటి తొమ్మిది వేల ఎకరాలకు సాగునీరు, 22.26 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం
- మొత్తం 86 ప్రాజెక్టుల నిర్మాణం లక్ష్యం
- ఇప్పటివరకు 12 ప్రాజెక్టులు పూర్తి, 19 ప్రాజెక్టులు పాక్షికంగా పూర్తి


**కిలో రెండు రూపాయల బియ్యం**
- 2 కోట్ల కుటుంబాలకు లబ్ది
- నెలకు 3.92 లక్షల టన్నుల బియ్యం పంపిణీ
- ఏటా రూ.5,400 కోట్ల సబ్సిడీ

**ఇందిరమ్మ ఇళ్ళు**
- పేదల కొరకు మొత్తం 81,29,277 ఇళ్ళ నిర్మాణం లక్ష్యం
- ఇప్పటికి 27,61,251 ఇళ్ళ నిర్మాణం పూర్తి
- నిర్మాణంలో 17,44,501 ఇళ్ళు
- కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని వరద బాధితులకు లక్ష పక్కా ఇళ్ళ నిర్మాణం లక్ష్యం

**వై.ఎస్.ఆర్. అభయహస్తం**
- 60 ఏళ్ళు నిండిన మహిళలకు ఆసరా
- ప్రస్తుతం 3.36 లక్షల మంది స్వయం సహాయక బృందాల మహిళలకు ప్రతి నెలా రూ.500 నుండి రూ.2200ల వరకు పింఛను

**పావలా వడ్డీ**
- రాష్ట్రంలోని ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 9.34 లక్షల మహిళా సంఘాలు
- 95 లక్షల మంది మహిళలకు లబ్ది
- మహిళా సంఘాల వద్ద రూ.3500 కోట్ల మూలధనం





జారీచేసినవారు : సమాచార, పౌరసంబంధాల శాఖ

